
రామాయణం

# సుందరకాండము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంథాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.


Website: www.freegurukul.org | Mobile App: Free Gurukul | email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul | Help Line / WhatsApp: 904 202 0123



" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఓం శ్రీరామాయ నమః

# సుందరకాండము

## తత్త్వదీపికా వ్యాఖ్యతో

వ్యాఖ్యానము

శ్రీ.ఉ.వే. శ్రీమాన్

## శ్రీభాష్యం అప్పలాచార్యస్వామివారు

ప్రచురణ

**జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్**

సీతానగరం - 522 501

గుంటూరుజిల్లా - ఆంధ్రప్రదేశ్

# విషయసూచికా


| | |
|---|---|
| మంగళాశాసనము | 339 |
| నివేదనము | 341 |
| తత్త్వదీపికవ్యాఖ్యా | 344 |
| శ్రీరామాయణావతరణం | 360 |
| శ్రీమద్రామాయణప్రారంభము | 365 |
| శ్రీరామాయణము - తత్త్వనిరూపణము | 389 |
| హనుమద్దర్శనము | 396 |
| సుందరకాండ సౌందర్యము | 407 |
| సుందరకాండము - తత్త్వదీపిక | 417 |

శ్రీ లక్ష్మీహయవదన పరబ్రహ్మణే నమః

# మంగళాశాసనము

శ్రీ రాముడు దేవుడే. శ్రీరామాయణము వేదమే. ఆ దేవుడు దశ రథుని యింట నవతరించెను. ఆ వేదము వాల్మీకినోట నవతరించెను. కాని రాముడు తన నడతలో దేవత్వమును మరుగుపరచెను. ఈ రామాయణ మా గుట్టును బయట పడనీయక భద్రపరచెను. ఈ గుట్టు రావణ వధ వరకే! రాముడెంత దాచనెంచినను అది దాగలేదు. బ్రహ్మరుద్రేంద్రాదులే దానిని బయటపెట్టిరి. దానిని మనకు తెలిపినవారే మనకు గురువులు. అట్టి గురువు మనకు హనుమానుడే. ఆ పాత్ర ప్రాముఖ్యమును చూపునది సుందరకాండ యొక్కటియే. యుద్ధకాండ దాని కొకింత తోడైనది. అన్ని కాండలకును అందలి కథాప్రాధాన్యమును బట్టి పేరు ప్రసిద్ధమయ్యెను. కాని సుందరకాండ కా పేరు విలక్షణమైనది. కొందరు పెద్దలు రామసౌందర్యమంతయు నున్నది యున్నట్లుగ పేర్కొనుటచే దాని కా పేరు వచ్చినదందురు. కాని కథాసౌందర్యమే యీ పేరునకు మూలకారణమని తత్త్వవేత్తలందురు. దాని కా సౌందర్య మెట్లు వచ్చిన దనగ, మన హనుమంతుని మూలముననే నట!

అది ఎట్లనగ, భగవంతుడు తన భక్తుని రక్షించునది భక్తి రూపజ్ఞాన ముఖముననే. ఆ జ్ఞాన మొసంగువారాచార్యులు. అతని కొఱకై శ్రీరాముడు వెదుకుచుండగ నాతని కాడబోయిన తీర్థ మెదురయ్యెను. ఆ తీర్థము తీర్థంకరుడగు మన తిరువడియే. అయనయందాచార్య లక్షణములుట్టి పడుచుండెను. ఆచార్యుడు సాంగ చతుర్వేద పారీణుడును, విష్ణుభక్తుడును, మత్సరదూరుడును, మంత్రవేత్తయును, మంత్రభక్తుడును, మంత్రప్రదుడును, గురుభక్తియుక్తుడును, పురాణజ్ఞుడును కావలయునట. అవి యన్నియు నీతని కున్నట్లు మన శ్రీ రాముడే ప్రశంసించి యోగ్యతాపత్రము నొసంగెను.

సీతామాత సముద్రావృతమగు లంకలో రావణ, కుంభకర్ణ, ఇంద్రజిత్తు ప్రభృతులపాల నలో కురూపులగు రాక్షసస్త్రీల మధ్య వారి తర్జన భర్జనలకు లోనై దుఃఖించుచు నిరంతర రామనామానుసంధానముతో శ్రీరాముని ధ్యానించుచుండగ శ్రీరాముని పంపున నీయాచార్యుడు సముద్రమును దాటి, సీతామాతను ఊరడించి శ్రీరామచంద్రునితో చేర్పించిన ఘటకుడు. దీనివలననే మన కాచార్యులే సంసారసాగరసంతారకులని నమ్మకము. సంసారమొక యింకని సాగరము. శరీర మొక లంకాదేవి. మనస్సొక రావణుడు. పది యింద్రియములు పది తలలు. సర్వానర్థకందమగు, అహంకారమే ఇంద్రజిత్తు. ఎంత అనుభవించినను తీరని తృష్ణయే కుంభకర్ణుడు. విషయ వ్యాపృత సకలేన్ద్రియ వ్యాపారములే చుట్టువారియుండు కరాళ రాక్షస స్త్రీలు. ఇట్టి సందర్భమున నిరంతర రామనామానుసంధానపూర్వక జ్ఞానమే ఆచార్య ప్రాప్తికి సాధనము. ఇట్టి కథా సందర్భగర్భితమగు నీకాండ మెంతయో సుందరమైనది. కావుననే దానికా పేరు సార్థకమైనది.

దీనియందనేక బీజాక్షరవిన్యాసములున్నవనియు అందుచేతనే యీ కాండము ఉపదేశగమ్యమై శబ్దశక్తి చేతను, అందులకు శతాధికముగ నర్థశక్తి చేతను, ఐహిక పారలౌకిక సకల ఫలప్రదమని పెద్దలందురు. దీని కెన్నియో ప్రత్యక్ష నిదర్శనములు కలవు. దీనిని లోకమున కెఱింగించి ఈ సంసారసాగరమునుండి యుద్ధరించు మహనీయులు ప్రజానీకసుకృత విశేషము చేతనే లభింతురు. వారి కా ప్రబోధపాటవమును భగవానుడే ప్రసాదింపవలెను. అట్టి మహనీయులు అరుదుగనుందురు, అట్టివారిలో నొక మహనీయులీగ్రంథకర్తలు. "ఆళ్ వన్దార్" శ్రీ రామానుజుల విద్యాభ్యాసావస్థయందే కటాక్షించి లోకోద్ధారకులగుదురని యాశీర్వదించిరట. అట్టి భగవద్భాగవత కృపాపాత్రు లీ మహనీయులనుటకు సందేహము లేదు. వీరి ప్రబోధము, పండిత, పామర, సాధారణ, సులలిత సరస మధుర రసధుని యనుట సకల జన విదితమే. దాని కరుగునందు రిట్టి శ్రీ సూక్తి చేతనే. వీరి కీ విరామ దశలో నిరంతర భక్తి సిద్ధాన్త ప్రబోధమునకు తగు ఆయురారోగ్య సౌభాగ్యములను, శతోధిక ప్రవచన పాటవమును ప్రసాదించి, సకల జన సముద్ధరణమును గావింపుమని ప్రతి ప్రత్యూష పవిత్ర సమయమునను నేను వినయముగ శ్రీ సీతారాములను పరిపరివిధముల ప్రార్థించుచుందును.

ఇట్లు,
శ్రేయోభిలాషి
గోపాలాచార్య

## లోకాభిరాముడు



# నివేదనము

శ్రీమద్రామాయణము, శ్రీరామనామము, శ్రీరామచరితము. మానవుని మానవత్వమును స్థిరముగ నిలిపెడి అలంబనములు. భగవద్గీత, విష్ణుసహస్రనామము, శ్రీమద్రామాయణము అను నీమూడును సనాతనధర్మ ప్రతిపాదకములై భారతీయసంస్కృతిని -- మానవతను అనాదిగ అవిచ్ఛిన్నముగ ప్రవహింపచేయుచున్న మహాగ్రంథములు. వేదవిహితమగుధర్మమును, జ్ఞానమును, వాచ్యవ్యంగార్థములతో అవిష్కరించుటకై శ్రీమద్రామాయణమును వాల్మీకి కావ్యముగ సంతరించెను. దీనికి మంత్రమువలె శబ్దశక్తిగలదు. పారాయణమాత్రము చేతనే అంతఃకరణమును పరిశుద్ధమొనర్చును. అర్థము నెరింగిరసానుభూతికల్గినవారు తన్మయులై అనందాతర్నిమగ్నమానసులై యుందురు. ఇక, ధ్వన్యర్థ ప్రతిపాదితమైన ఔపనిషదతత్త్వ మెరిగినవారు స్వస్వరూపము నెరింగి భగవత్సాయుజ్యమునంద నర్హులగుదురు. ఇట్లు బహుళార్థకమగు శ్రీమద్రామాయణమును నిత్యము అధ్యయనముచేసి జీవితమును సఫలమొనర్చుకొనినవారెందరో కలరు.

అచార్య కటాక్షము చేతను, జన్మాంతర సుకృత పరిపాకము చేతను నాకుగూడ శ్రీరామాయణమునందు మనసులగ్నమైనది. పారాయణ చేసికొని తెలిసినంతలో అనందించెడి నన్ను పదిమంది ముందు మాటాడేవానినిగా చేసినారు కొందరు మిత్రులు. విని యానందించి గ్రంథరూపమున రావలెనని ప్రోత్సహించినారు కాకినాడ, కొవ్వూరు పౌరులు. వారికి నేనెంతో ఋణపడియున్నాను. మొదట ముద్రణమున భారమంతయు వహించి గ్రంథమును వెలికి తెచ్చినారు. మా ప్రాణమిత్రులు శ్రీ అకెళ్ళ వేంకటేశశర్మగారు. ప్రథమ ముద్రణము ప్రతులు పూర్తికాగానే ద్వితీయ ముద్రణమునకు ప్రోత్సహించి పాటుపడినవారు శ్రీమాన్ మంగళగిరి వేంకట జగన్నాథస్వామిగారు. కాని శ్రమయంతయు శ్రీ బాదం సుబ్రహ్మణ్యంగారు, శ్రీ మద్దుల సుబ్రహ్మణ్యంగారిదే. వారే మరల మూడవ ముద్రణమునకు సిద్ధముచేసిరి. నేను ఏమియుచేయక గ్రామాంతరమునమున్నను వారే సర్వ బాధ్యతలను వహించినారు. నేను వారికేవిధముగ కృతజ్ఞత తెలుపగలవాడనుకాను. అందును శ్రీ మద్దుల సుబ్రహ్మణ్యంగారు పడిన శ్రమవలననే ఈ పుస్తకము మరల ప్రకటింపబడినది. వారికి నేనెల్లకాలము ఋణపడియున్నాను.

ఈ కార్యమున తోడ్పడినవారికి శ్రీ సీతారామచంద్ర ప్రభువు దీర్ఘాయురారోగ్యాభ్యుదయములను ప్రసాదించుగాక యని ప్రార్థించుచున్నాను.

సహృదయులు పఠించి, అనందించి నా జన్మమును పవిత్ర మొనరింతురు గాకయని ప్రార్థించుచున్నాను.

గ్రంథమును గూర్చి ఒక్కమనవి. సుందరకాండమును గూర్చి పారాయణము సంక్షేప రామాయణము, శ్రీరామావతారము, సీతాకళ్యాణము, సీతారామయోః సుఖజీవనము, నాగపాశ విమోచనము, అదిత్య హృదయము, రావణవధ, బ్రహ్మకృత రామస్తుతి, పట్టాభిషేకము అను వానితో కలిపిచేసినపుడు సంపూర్ణ రామాయణము పారాయణచేసిన ఫలము లభించునని

ప్రాచీన సంప్రదాయము నెరింగిన పెద్దలు చెప్పుదురు. ఈ సర్గలు ప్రత్యేకముగ కూడ పారాయణ చేయుటకు తగినవి, అవి ఉత్తమములగు ఫలముల నొసంగజాలినవి.

సుందరకాండము పరమ రహస్యమైన మంత్రము. దానిని పారాయణచేయుట సర్వారిష్ట నివారణము, సర్వాభీష్టప్రదము. దానిని రోజుకు ఒక సర్గ చొప్పున గాని లేదా యథాశక్తిగా గాని చేయవచ్చును. కాని అన్నింటికంటే సప్త సర్గ పారాయణము సద్యః ఫలప్రదము. రోజుకు 2 సర్గల చొప్పున 68 రోజులు 7 ఆవృత్తులు సుందరకాండ పారాయణమున ప్రతి ఆవృత్తి పూర్తి అయినపుడు పట్టాభిషేక సర్గ చదువవలెను. అట్లుగాక విడిగా చదువునపుడు ముందుగా సంక్షేప రామాయణము, శ్రీరామ జననము, సీతాకల్యాణము చదివి సుందరకాండ పారాయణము చేయవలెను. అది పూర్తి అయిన పిదప యుద్ధకాండలోని నాగపాశబంధ విమోచనము, ఆదిత్య హృదయము, రావణవధ, శ్రీరామస్తవము, పట్టాభిషేకము చదువవలెను. అందుకై ఇందు ఆ సర్గలన్నియు చేర్చబడినవి. 16 రోజులలో సుందరకాండ పూర్తిచేయు విధానము కూడ శ్రేష్ఠమైనది.

**రాఘవో విజయం దద్యాన్మమ సీతాపతిః ప్రభుః**

| రా | ఘ | వో | వి | జ | యం | ద | ద్యా | న్మ | మ | సీ | తా | ప | తిః | ప్ర | భుః | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 4 | 4 | 4 | 8 | 1 | 8 | 1 | 7 | 7 | 7 | 6 | 1 | 6 | 2 | 4 | = 68. |

మొదటి రోజున-రెండు సర్గలు, రెండవరోజున నాల్గు సర్గలు - అను ఈ విధముగా 16 రోజులు విభజించుకొని పూర్తిచేసికొనవలెను.

సుందరకాండము పూర్తిచేసినపుడు తప్పక పట్టాభిషేక సర్గ చదివిముగించవలెను.

ఆధ్యాత్మికమగు వివరణము చేయుచు ప్రతిసర్గలోని కథను విడి విడిగా తెలియచేసితిని. దానిలోని అంతరార్థములను తత్త్వదీపిక అను పేరుతో వివరించితిని సుందరకాండమున ఎన్నియో రహస్యార్థము లిమిడియున్నవి. నా బుద్ధికి తోచిన వానిని ఇందు సంగ్రహించితిని. సహృదయులగు పాఠకులు వానిని చూచి సహృదయతతో స్వీకరింతురుగాక.

ఆధ్యాత్మికముగ నన్నొక వ్యక్తిగ మలచిన మా ఆచార్యులు శ్రీమాన్ తెలికిచెర్ల కందాళ గోపాలాచార్యస్వామివారి మంగళాశాసనము నాకొక అంగరక్షయై లభించినది. వారి అనుగ్రహము చేతనే వెల్వడిన ఈ గ్రంథమును శ్రీ సీతాలక్ష్మణ హనుమత్సమేత శ్రీరామచంద్ర ప్రభువు సన్నిధిని వారి ద్వారా సమర్పించుకొనుచు నా జన్మమును రామకథా ప్రవచనముతో రంజింపచేసిన స్వామికి ప్రాంజలి బంధముగ నమోవాకము లర్పించుచున్నాను.

ఇట్లు

భక్త విధేయుడు

**శ్రీ భాష్యం అప్పలాచార్యులు**

హరిః ఓమ్

ఓమ్ శ్రీరామాయ నమః

# సుందరకాండము

## తత్త్వదీపికా వ్యాఖ్య

ఆపదా మపహర్తారం దాతారం సర్వసంపదాం

లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్

మనోజవం మారుతతుల్యవేగం

జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్

వాతాత్మజం వానరయూథముఖ్యం

శ్రీరామదూతం శిరసా నమామి.

## శ్రీ రామాయణ పరిచయము

"వేద వేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే

వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షా ద్రామాయణాత్మనా"

"వేద ప్రతిపాద్యుడగు పరమపురుషుడు దశరథపుత్రుడై శ్రీరాముడుగా ఆవిర్భవింపగా, వేదము ప్రాచేతసుడగు వాల్మీకివలన రామాయణరూపమున ఆవిర్భవించినది."

"వేదైశ్చ సర్వై రహ మేవ వేద్యః"

"భగవానుడే వేదములన్నిటిచేతను ప్రతిపాదింపబడువాడని తెలియుచున్నది."

వేదములు సర్వాధికారికములు కాకపోవుటచే వేద ప్రతిపాద్యుడగు పరమ పురుషుడు అందరికి అందుబాటులో లేడని పరమదయాళుడగు పరమపురుషుడు సర్వసులభుడై సుశీలుడై ఈ కన్నులతోనే చూచి తెలిసికొని చేరుటకు వీలుగా దశరథుని కుమారుడై జన్మలేనివాడు జన్మించినాడు. అప్పుడు ఆ వేదవేద్యుని ప్రతిపాదించువేదము వాల్మీకినుండి శ్రీరామాయణముగా బయల్వెడలినది.

వేదము రెండుభాగములు.

(1) పూర్వభాగము -- ధర్మమును ప్రతిపాదించును.

(2) ఉత్తరభాగము -- సర్వజగత్కారణము, సర్వజగద్రక్షకము, సర్వాంతర్యామియునగు పరమాత్మను - - శ్రీమన్నారాయణుని ప్రతిపాదించును.

ఈ లోకములో, పై లోకములలో, పరమపదమున శాశ్వతముగ పరమాత్మతో చేరియుండి సుఖమును పొందుటకు సాధనము ధర్మము. వేద ప్రతిపాదితమగు అభ్యుదయ నిశ్శ్రేయస సాధనము ధర్మము. ఈ లోకములో -- పై స్వర్గాదిలోకములలో సుఖించుట అభ్యుదయము. పరమాత్మతో చేరి మరి జన్మను పొందకుండ ఆనందస్వరూపుడగు పరమాత్మతో ఆనందము ననుభవించుచు శాశ్వతముగ నుండుట నిశ్శ్రేయసము. ఈ రెండింటికి సాధనము ధర్మము. మానవుడు "దుఃఖమును పొందకూడదు -- సుఖమును పొందవలెను" అని ఎల్లప్పుడు కాంక్షించుచుండును. ఆ సుఖమునకు సాధనమేదో తాను తన బుద్ధితో నిర్ణయింపజాలడని, వేదము మనకు సుఖసాధనము తెలియునట్లు చేయుచున్నది. మనము మనబుద్ధితో "నాకు సుఖమున కిది సాధనము" అని నిశ్చయించుకొనలేము. తాత్కాలికముగ అది సుఖమును కల్గించునట్లు కన్పించినను చివరకు దుఃఖమును కల్గించున దగును.

ప్రత్యక్షముచేకాని అనుమానముచేకాని ఎరుంగుటకు శక్యముకాని విషయమును తెలియజేయునది కావున "వేదయతి ఇతి వేదః" అను వ్యుత్పత్త్యర్థమున వేదమునకు "వేదము" అని పేరు కల్గెను.

అట్టి సుఖము (1) ఐహలౌకికము (2) పారలౌకికము (3) శాశ్వతము అని మూడు విధములు. అందువలన ఈ లోకములో జీవించి యున్నంత కాలము, పైలోకములను పొంది ఆ లోకములలో ఉన్నంత కాలము అనుభవించు సుఖమునకై ధర్మమును ఆచరింపవలెను. శాశ్వతముగ శరీరమును విడచి పరమాత్మతో చేరి యుండు సుఖమును పొందుటకై బ్రహ్మజ్ఞానము

నార్జింపవలెను. వేదములలో పూర్వభాగము ధర్మమును, ఉత్తరభాగమయిన ఉపనిషత్తులు బ్రహ్మను ప్రతిపాదించును. "ధర్మము" నాచరింపవలెను. "బ్రహ్మము" నెరింగి ఉపాసింపవలెను. ఈ రెండును వేదముచే ప్రతిపాదింపబడునని ఆ రెండును శ్రీ రాముడై జనించినవి. శ్రీ రాముడు నరుడుగా అవతరించి పూర్వ భాగములో ప్రతిపాదింపబడిన ధర్మముల నాచరించి "రామోవి-గ్రహవాన్ ధర్మః" అని ప్రసిద్ధినందినాడు. తాను సాక్షాత్తు పరబ్రహ్మమై ఇతరులచే ఉపాసింపబడినాడు. ఇట్లు ధర్మబ్రహ్మములు రెండును ఒకే వేదమున ప్రతిపాదింపబడగా తాను బాహ్యముగ ధర్మస్వరూపుడై అంతరముగ బ్రహ్మస్వరూపుడై శ్రీరాముడు అవతరించినాడు. బాహ్యముగ నడువడి -- అంతరముగ జ్ఞానము నరున కావశ్యకములు. సర్వజగత్కారణమైన తత్త్వము నెరింగి ఆ జ్ఞానముతో ఆ "పరము"ను ఆరాధించుచు బాహ్యమైన ధర్మముల నాచరించిననాడు మానవుడు సిద్ధినొందును. వేదములలో పూర్వభాగము భగవానుని ఆరాధించు విధానమును తెల్పును. ఉత్తరభాగము ఆరాధింపబడువాని స్వరూపమును నిరూపించును. శ్రీరామాయణము వేదమే యగుటచే బాహ్యార్థమున భగవదారాధనరూపమగు ధర్మమును ఎట్లు ఆచరింపవలెనో నిరూపించును. ఆంతరముగ ఉపనిషత్ప్రతిపాదితమగు ఆరాధ్యుని స్వరూపమును, బ్రహ్మజ్ఞానమును ప్రతిపాదించును, ఈ విధముగ వేదము ప్రతిపాదించు ధర్మ బ్రహ్మస్వరూపములనే శ్రీరామాయణము ప్రతిపాదించుటచేతనే వాల్మీకి తన శిష్యులగు "కుశలవులకు" "వేదోపబృంహణార్థాయ తా వగ్రాహయత ప్రభుః" వేదము చెప్పి దానిలోని అర్థములు స్పష్టముగ అవగాహన మగుటకు ఉపబృంహణముగ శ్రీరామాయణమును నేర్పెను.

మానవజీవితము దుర్లభము, బహుజన్మ సంచిత సుకృత పరిపాకముచే మానవజన్మ లభించును. దానిని వ్యర్థము చేసికొనకుండ సిద్ధిని పొంది పొందవలసిన పరమధామమును పొందవలెను. దానికి బాహ్య జీవితమున ధర్మాచరణమును, ఆంతరజీవితమున సత్యమగు బ్రహ్మజ్ఞానమును కలిగియుండవలెను. ఈ రెండును ఉన్న రోజున వాడు మానవుడు.

జ్ఞానము కన్నువంటిది. ధర్మము కాలువంటిది. ఇవి లేకున్న గ్రుడ్డి-కుంటి యగును. సత్యము, ధర్మము అనునవి నాణెమునకు రెండు ప్రక్కలువంటివి. నాణెమునకు ఒక వంక విలువ తెలుపు "ఒక రూపాయి" అను అక్షరములుండును. ఒకవంక బొమ్మయుండును. బొమ్మ మారుచుండును. విలువ మాత్రము మారదు. అట్లే సత్యము మారనిది. ధర్మము వారి ఆశ్రమమునుబట్టి,

వయస్సునుబట్టి, అవస్థనుబట్టి మారుచుండును. (1) చైతన్యముగల జీవులు (2) అచేతనమగు ప్రకృతి (3) పరమాత్మ అనునవి మూడుతత్త్వములు. చేత నాచేతనములతో కూడిన పరమాత్మ అంతట మార్పులేకుండ ఉండును. దీనినే సత్యమందురు. దీని నెరింగి బాహ్యముగ ధర్మము నాచరింపవలెను. ధర్మము నాచరింపనిదే మనస్సున అంటియున్న రాగద్వేషములనెడి మాలిన్యములు వద లవు. అవి వదలిన నాడుకాని జ్ఞానమావిర్భవింపదు. జ్ఞానము కలిగిననాడు ఆ జ్ఞానముతో ఆచరించిన ధర్మము సిద్ధిని ప్రసాదించును. అందుచే మానవ జీవితములో బాహ్యముగ ధర్మము -- ఆంతరముగ జ్ఞానము ఆవశ్యకములు. వీనినే శ్రీమద్రామాయణము ప్రతిపాదించును.

బాహ్యజీవితములో ఆచరించిన ధర్మమే మానవునికి చేతికఱ్ఱ వలె శరీర మును విడచి ప్రయాణముచేయునప్పుడు సాయపడునదని చమత్కారముగా కాళిదాసు సూచించినాడు.

ధర్మము=ధరింపబడునది -- ధరించునది అని యర్థము. "ధర్మో రక్షతి రక్షితః", మనచే ధరింపబడినచో మనను ధరించునది ధర్మము.

అభిజ్ఞానశాకుంతలమను నాటకములో దీనినే చమత్కారముగా సూచిం చినాడు కాళిదాసు మహాకవి. కంచుకి అంతఃపురంలో సంచరించు ఉద్యోగి. ఆతడుద్యోగములో ప్రవేశించినపుడు అవసరమున్నను లేకపోయినను చేతిలో కఱ్ఱ పట్టుకొనవలెను. అట్లు వేత్రదండమును ధరించి అవసరమున్న వాడెంత శ్రద్ధగా పట్టుకొని తిరుగునో అంత శ్రద్ధతో పట్టుకొని తిరిగి బాగా వృద్ధుడైన పిమ్మట తనలో ఇట్లు భావించుకొనుచున్నాడు--

"ఆచార ఇత్యవహితేన మయా గృహీతా

యా వేత్రయష్టి రవరోధగృహేషు రాజ్ఞః"

పెద్దల ఆచారమని నేను అంతఃపురములలో తిరుగునపుడవసరము లేకపోయినను అవసరమున్నవాడు పట్టుకొనినట్లే ఈ వేత్రదండమును ఎంతో అవధానముతో పట్టుకొనినాను.

"కాలే గతే బహుతిథే మమ సైవ జాతా

ప్రస్థానవిక్లబగతే రవలంబనార్థా"

చాలకాలము గడచినపిమ్మట ఇపుడు నడకలో తొట్రుపాటు కల్గుచున్న నాకు ఆ దండమే ఊతగా నిలిచి కాపాడుచున్నది అని.

ఈ వేత్రదండము వంటిదే ధర్మము. ధర్మము, చేయుచున్నపుడు ఫలము నొసంగలేదేయని వదలకుండ శ్రద్ధతో ఆచరించినచో ఒకనాడు మన మీ శరీరమును వదలి ప్రస్థానమొనర్చినపుడు మనగతిలో వైక్లబ్యమేర్పడిననాడు అదియే మనను రక్షించును. చేతికఱ్ఱవలె మనము దానిని ధరించిన అది మనను ధరించును.

అందుచే ధర్మము నెరింగిన ప్రయోజనము లేదు. ఆచరింపవలెను అట్టి ధర్మము నాచరించిన కాని జ్ఞానము కలుగదు. జ్ఞానము కలిగి ధర్మము నాచరించిన ఆ ధర్మము మనను ఆనందధామము నొందించి శాశ్వతశాంతి నొసంగును.

ధర్మము రెండు విధములు -- (1) సామాన్యధర్మము (2) విశేష ధర్మము.

(1) సామాన్య ధర్మము :- సమాజములో తనతోటివాడు ఆనందించునట్లు తాను ఆనందించునట్లు ప్రవర్తించుట లౌకికధర్మము, తండ్రియెడ తల్లియెడ, సోదరులయెడ, భార్యయెడ, మిత్రులయెడ, శత్రువులయెడ ప్రవర్తింపవలసిన విధము లౌకికధర్మము. స్వర్గాదిలోకములలో సుఖముగా నుండుటకై చేయువలసిన తపోయజ్ఞదానాదులు వైదికధర్మములు. ఈ రెండును సామాన్య ధర్మములు.

(2) విశేష ధర్మము :- అజ్ఞానముచే ప్రకృతిలో పడి సంసారియై జన్మ మృత్యువులను పొందుచున్నపుడు వానినుండి విడివడి శాశ్వతమైన ఆనందమును పొందుటకు ఎరుంగవలసిన జ్ఞానము విశేషధర్మము. (1) తా నెవడు? (2) తనచే పొందబడవలసినదేది? (3) దానిని పొందుటకుపాయమేమి? (4) అట్లు పొందుటకు ఆటంకమేమి? (5) పొందిన ఫలమేమి? అని ఐదు విషయముల నెరింగి తదనుగుణముగ ప్రవర్తించుట విశేషధర్మము. బాహ్యముగ సామాన్యధర్మములను ఆంతరముగ విశేషధర్మమలను నిరూపించుటయే వేదము యొక్కయు శ్రీమద్రామాయణము యొక్కయు ముఖ్యోద్దేశ్యము. శ్రీరామచంద్రుడు సామాన్యధర్మములను తానాచరించి, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, సీతా హనుమదాదుల నడువడిచే విశేషధర్మమును నిరూపింపచేసెను. వేదములలో పూర్వభాగము సామాన్య

ధర్మములను, ఉత్తరభాగము అనగా ఉపనిషత్తులు విశేషధర్మమును నిరూపించును. అట్లే శ్రీమద్రామాయణమున వాచ్యార్థము సామాన్యధర్మమును వ్యంగ్యార్థము విశేషధర్మమును నిరూపించును. శ్రీమద్రామాయణము వేదమువలె ధర్మస్వరూపమును, జ్ఞానమును ప్రతిపాదించును. కాని రామాయణము కావ్యము అగుటచే పైకి తెలియు అర్థముకాక అంతరముగ ధ్వనిరూపమున వేరొక అర్థముండును. వాల్మీకి మహర్షి నోటినుండి ఆవిర్భవించిన వేదమే రామాయణ మగుటచే వేదమునందువలె ఇందును ధర్మస్వరూపము, బ్రహ్మస్వరూపము నిరూపింపబడినవి. అందుచేతనే దీనిని వేదమునకు ఉపబృంహణము అనిరి. వేదములోని సూక్ష్మములగు అర్థములను విశదముగ తెలియజేయునది ఉపబృంహణము.

(1) వేదము "సత్యంవద ధర్మంచర" అని రాజువలె శాసించిచెప్పును.

(2) పురాణములు మిత్రునివలె ఏదో ఒక కథను ప్రపంచించి దాని ద్వారా "యిది చేయవలసినది -- ఇది చేయకూడనిది" అని తెలియ చేయును. అట్టివి భారతాదులు.

(3) కావ్యము ప్రేమించిన ప్రియురాలివలె మధురముగ మాటలాడుచు తన్మయత కలిగించి "యిది చేయవలెను -- ఇది చేయకూడదు" అని ఉపదేశింపకయే పురుషుడు తనంతతాను ఆనందముతో మంచిమార్గమున ప్రవర్తించునటుల చేయును.

శ్రీమద్రామాయణము కావ్యమగుటచే శబ్దములోను, అర్థములోను గల మాధుర్యముచే తన్మయత్వమును కలిగించి సన్మార్గమున ప్రవర్తింపజేయును. ఇందు వాచ్యార్థము ధర్మమును, వ్యంగ్యార్థము బ్రహ్మమును ప్రతిపాదించును. శ్రీరాముడు బాహ్యముగ నరుడు. ఆంతరముగ పరబ్రహ్మము. రామాయణము బాహ్యముగ రామకథాప్రధానము. ఆంతరముగ ఆత్మకథానిరూపకము. అందుచే శ్రీరామాయణమును అధ్యయనముచేయుట మానవత్వమును సంపూర్ణము చేసికొనుట. మానవజీవితము ధర్మజ్ఞానసమన్వయముతో, ధర్మార్థకామ సమన్వయముతో, త్యాగభోగ సమన్వయముతో, దైవ పౌరుషసమన్వయముతో సాగిననాడు మానవత్వము పరిపూర్ణమగును. ధర్మార్థకామములలో అర్థ కామములకే ప్రాధాన్యమిచ్చి, త్యాగభోగములలో భోగమునకే ప్రాధాన్యమిచ్చి, దైవ పౌరుషములలో పౌరుషమునకే ప్రాధాన్యమిచ్చి మానవుడు జీవించిననాడు ఆ జీవితము మానవముకాక, దానవము అగును. మానవత్వమును స్థిరముచేయుటకై పరమపురుషుడగు నారాయణుడు నరుడై రాముడుగా అవతరించెను,

"రమంతే యోగినః అస్మిన్ ఇతి రామః" యోగులు ఎవనియందు ఆనందించుచుందురో అతడు రాముడు. "రమయతి ఇతి రామః" ఆనందిం పజేయువాడు రాముడు (అనగా) ఆనందస్వరూపుడు, ఆనందము నిచ్చువాడు, ఆనందముకలవాడు అగు పరమాత్మయే రాముడు. ఈతడు మానవుడుగా సర్వప్రాణులయొక్క మనస్సులకు, నేత్రములకు ఆనందము కలిగించువాడై వారి వలన తా నానందించువాడగుటచే రాముడాయెను.

మానవజీవితము బాహ్యము, ఆంతరము అని రెండువిధములు. బాహ్య జీవితమున ధర్మమును ఆచరించుచు, ఆంతరముగ జ్ఞానము కలిగియుండవ లెను. శ్రీమద్రామాయణము ఈ రెండింటిని బాహ్యార్థముచే అంతరార్థముచే ఆందించుచు కావ్యమయినది. అట్టి కావ్యమును ఋషి అయిన వాల్మీకి నారదునినుండి ఉపదేశముపొంది, బ్రహ్మ అనుగ్రహముచే సాక్షాత్కరించుకొని రచించెను. ఇందు వేద ప్రతిపాదితములగు ధర్మ, బ్రహ్మములు నిరూపింపబడక కేవలకథామాత్రమే ప్రధానమైనచో దానికి అతీంద్రియములగు పదార్థములను దర్శింపజాలిన ఋషులు చతుర్ముఖుడు ప్రవర్తకులై ఉండిఉండరు. బ్రహ్మ ప్రేరేపించి, నారదుడుపదేశించి, వాల్మీకిచే రచింపబడునటులచేసిన యీ కావ్యము, బాహ్యముగ ధర్మప్రతిపాదక మయినను ఆంతరముగ ఉపనిషదర్థ ప్రతిపాదకము కాక తప్పదు.

ఈ విషయమును వాల్మీకినిగూర్చి ప్రార్థనగ వెలసిన రెండు శ్లోకములు సూచించుచున్నవి.

1. "కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరం

ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్."

"వాల్మీకి అను కోకిల కవిత్వమనెడి కొమ్మను ఎక్కి "రామ రామ" అని మధురముగ మధురాక్షరముగ కూయుచున్నది. ఆ వాల్మీకి కోకిలకు నేను నమస్కరించుచున్నాను."

2. "వాల్మీకేర్మునిసింహస్య కవితావనచారిణః

శృణ్వన్ రామకథానాదం కో న యాతి పరాం గతిమ్?"

"కవిత్వమనెడి వనములో వాల్మీకిముని యనెడి సింహము సంచరించు చున్నది. ఆ సింహము రామకథను గర్జించుచున్నది. ఆ నాదమును వినిన

వాడెవడు పరగతిని పొందడు?"

ఈ రెండు శ్లోకములలో వాల్మీకిని కోకిలతోను, సింహముతోను పోల్చిరి. కోకిల స్వరము మాధుర్యమునకును, సింహస్వరము గాంభీర్యమునకును ప్రసిద్ధి నందినవి.

మొదటి శ్లోకములో వాల్మీకి--కోకిల. మామూలు కోకిల మధురముగ కూయును. కాని వాల్మీకి కోకిల మధురముగ, మధురాక్షరముగ కూడ కూసినది. ఇది కవిగ వాల్మీకియొక్క అతిశయమును నిరూపించును. కావ్యమునందు శబ్దములలో మాధుర్యము, అర్థములో మాధుర్యము, రసములో అక్షరత్వము ఉండవలెను. ఈ మూడును కవికోకిల స్వరములో కలవు. రామాయణము కావ్యము అగుటచే శబ్దములు గాన ప్రధానములై చెవికి మధురములై యుండును. అర్థము హృదయమునకు ఇంపై మధురముగ నుండును. దాని యందలి అంతరార్థము అక్షరమై అనగా, నాశములేనిదై యుండును. క్షరమనగా మార్పునందునది. అక్షరమనగా మార్పునందనిది. అది ఆత్మతత్త్వము. ఇట్లు కావ్యముగ రామాయణము మధురము-మధురము-అక్షరము.

రెండవశ్లోకములో వాల్మీకి-ముని. ఆతడు సంచరించునది కవితావనము. అందు ఆ సింహము రామకథను గర్జించును. దానిని వినినవారు పరగతి నందుదురు. అనగా పరమపదము నొందుదు రని అర్థము. అట్లు పరమపదము నొందుటకు రామకథలోని నాదమును అనగా ధ్వన్యర్థమగు ఆత్మతత్త్వమును ఎఱుంగవలెను.

ఇట్లు వాల్మీకి కవిగా బాహ్యార్థమును, మునిగా అంతరార్థమును ప్రతిపాదించెనని తెలియుచున్నది. కావ్యగానమున మాధుర్యమును, ఆత్మతత్త్వమును ప్రతిపాదించుటలో గాంభీర్యము రామాయణమున కలవని తెలియుచున్నది. వాల్మీకి, కోకిలయై రామకథను మధురముగ పలికెను, ముని సింహమై ఉపనిషదర్థములను గర్జించెను. మొదటి స్వరము చెవికిని మనసునకును తరుగని హాయిని ప్రసాదించును. రెండవది--శాశ్వతమగు స్థానమును చేర్చును. ఇట్లు ఈ శ్లోకములలో బాహ్యార్థమున రామకథయు, అంతరార్థమున ఆత్మకథయు కలవని తెలియుచున్నవి.

(1) శ్రీ రామచంద్రుడు, బాహ్యముగ మానవుడై యుండి అంతరముగ భగవానుడు.

(2) శ్రీ రామనామము బాహ్యముగ దశరథపుత్రుని పేరు. అంతరముగ

జగత్కారణమగు పరమాత్మ పేరు.

(3) శ్రీ రామాయణము బాహ్యముగ రామకథ. ఆంతరముగ ఆత్మకథ. రామాయణము బాహ్యముగ కావ్యము. ఆంతరముగ ఉపనిషత్తు.

ఇట్లు సౌలభ్యపరత్వములు శ్రీరామచంద్రుడై, శ్రీరామనామమై, శ్రీరామాయణమై ఒకచో చేరియున్నవి.

రామాయణ మను నామము చాల విశిష్టమైనది.

(1) రామునియొక్క చరితము రామాయణము. "రామస్య అయనమ్ -- రామాయణమ్". రాముని పొందించునది రామాయణము. "రామః అయ్యతే అనేన ఇతి రామాయణమ్." ఇది రామునిచరిత్రమే అయినను దీనిని చదివినవారిని, రాముని పొందించునట. రామునివలె ధర్మశీలురై చివరకు బ్రహ్మసాయుజ్యము నందుదు రని భావము.

(2) ఇందు సీతాదేవి చరిత్రము ప్రధానముగా నుండుటచే ఇది రామాయణము.

"కావ్యం రామాయణం కృత్స్నం సీతాయాశ్చరితం మహత్" రామాయణ మంతయు సీతాదేవి చరిత్రమే అని వాల్మీకి పేర్కొనెను. "రామాయాః అయనమ్ - రామాయణమ్" రామా అనగా స్త్రీ అనగా సీత. ఆమె యొక్క చరిత్రము రామాయణము.

(3) రాముడు అయనముగా కలవారి చరిత్రము.

(4) రామునికి అయనమయినవారిచరిత్రము=రామాయణము.

రామాయణమున అన్ని పాత్రలును రామునే ఆశ్రయముగా చేసికొని సాగినవి. రాముడు మధ్యలో నున్నచో చిన్నకాకి మొదలు రావణునివరకు, శబరి మొదలు అగస్త్యునివరకు అందరకు రామునితో సాక్షాత్ సంబంధము ఇందు కన్పించును. రాముడు వారిపై ఆధారపడి నిలిచినట్లుండును. అందుచే ఈ చరిత్రమున రాముడు ఇతరులందఱిలో, ఇతరు లందఱును రామునిలో, పరస్పరము చేరినట్లుందురు. అందుచే రాముడు, అయనముగా అనగా ఆధారముగా కలవారి చరిత్రము రామాయణము. రామునికి అయనము అనగా ఆధారము అయినవారి చరిత్రము రామాయణము. ఇట్లు నారాయణశబ్దము

వలె రామాయణశబ్దము రెండు అర్థములను ప్రతిపాదించును.

(5) ఆత్మ చరిత్రము.

(6) మనో విజయము (పౌలస్త్యవధము) -- రామాయణము.

". . . . . . . . సీతాయా శ్చరితం మహత్ ।

పౌలస్త్య వధ మిత్యేవ చకార చరితవ్రతః ॥" బాల. 4-7.

"సీతాచరిత్రము", "పౌలస్త్యవధము" అని వాల్మీకి అనుటలో కూడ రహస్యార్థము ఇమిడియున్నది. సీత ఆత్మస్వరూపమును నిరూపించుటకై అవతరించిన జగన్మాత. ఆమె శ్రీరామునితో ఎన్నడును ఎడబాటులేక కలసియుండు దేవి. కాని లోకులకు ఆత్మ స్వరూపమును, ఆ ఆత్మ పరమాత్మలకు గల సంబంధమును, పరమాత్మతో ఆత్మ ఎడబాటునొంది బంధము నొందుటకు గల కారణమును, మరల పరమాత్మతో చేరుటకు ప్రవర్తింపవలసిన తీరును నిరూపించుటకై సీతమ్మ రామాయణమున నడచినది. అందుచే సీతాచరిత్రము అనగా ఆత్మచరిత్రము రామాయణము అనునర్థము స్ఫురించును. సీతను బంధించినవాడు కామమోహితుడగు రావణుడు. ఆత్మను బంధించునది కామమోహితమగు మనస్సు. ఆ మనస్సును జయించిన నాడే ఆత్మ పరమాత్మతో చేరును. ఈ పౌలస్త్యవధయే మనో విజయము-- రామాయణము.

ఇట్లు రామాయణము,

బాహ్యముగ (1) రామకథ, (2) సీతకథ, (3) రావణవధ.

ఆంతరముగ (1) బ్రహ్మకథ, (2) ఆత్మకథ (3) మనోవధ.

ఇట్లు రెండర్థములతో సాగిన రామాయణమును అధ్యయనము చేయునపుడు :-

బాహ్యముగ (1) కావ్యగత సౌందర్యమును, (2) కథాగత సౌందర్యమును, (3) పాత్ర నిరూపణమును, (4) వర్ణనలలోని వైశిష్ట్యమును భావింపవలెను.

ఆంతరముగ (1) ఆత్మ స్వరూపమును, (2) పరమాత్మ స్వరూపమును, (3) ఆ పరమాత్మను చేరుటకు ఉపాయమును, (4) చేరకుండ అడ్డెడి విరోధులను, (5) వారిని జయించి చేరుటచే కలిగెడి ఫలమును ఎఱుంగవలెను.

రామాయణము లౌకికముగ ఒక మహాకావ్యము. ఆధ్యాత్మికముగ ఉప

నిషత్తు. అంతేకాక ఇది ధర్మశాస్త్రము. నీతిశాస్త్రము. మహామంత్రము. కవులకు కావ్యరచన కిదియే ఆధారము. ఇందు మానవజీవితమునకు ఆవశ్యకములగునవి అన్నియు కలవు. దీని అర్థమును తెలియక కేవలశబ్దమునే చదివినవారికికూడ బుద్ధిని శుద్ధినొనర్చి కోరిన ఫలములనిచ్చును. మంత్రములకు అర్థము తెలియనక్కరలేదు. శబ్దమాత్రమును శ్రద్ధతో ఉచ్చరించినచో ఫలమునిచ్చును. అందుచే ఇది వేదమంత్రములతో సమానమైనది. మంత్రములలో కెల్ల శ్రేష్ఠమైనది గాయత్రీమంత్రము. దానికి విశ్వామిత్రుడు ఋషి. సూర్యమండలాంతర్వర్తియైన నారాయణుడు దేవత. ఆ గాయత్రీమంత్రము బుద్ధివృత్తులను సమ్యక్ ప్రేరణచేయుటకు జగత్కారణుడైన పరమేశ్వరుని గూర్చిన ధ్యానరూపము. దీనిని జపించి బుద్ధివృత్తులను లెస్సగా ప్రవర్తింపచేసికొనుట ఆవశ్యకము. కాని అందఱకును అది సాధ్యము కాదేమో యని కరుణామయుడగు వాల్మీకి యీ రామాయణమున ఆ గాయత్రీ మంత్రమును నిక్షేపించెను. రామాయణమున కూడ ప్రధానఋషి విశ్వామిత్రుడు. సూర్యవంశ సంజాతుడు శ్రీరాముడు దేవత. గాయత్రీ మంత్రమునందలి ఇరువది నాలుగు అక్షరములను, రామాయణమున ఇరువది నాలుగువేల శ్లోకములలో ప్రతివేయికి ఒక్కొక్క అక్షరము చొప్పున వాల్మీకి ఉంచెను. ఈ రామాయణమును చదువుటచే గాయత్రీమంత్రము జపించిన ఫలము కలుగును.

శ్రీవైష్ణవసంప్రదాయమున ద్వయమను మంత్రము ప్రధానమయినది. ఆ ద్వయమంత్రము యొక్క వివరణమే శ్రీమద్రామాయణము. కర్మము, జ్ఞానము, భక్తి ఉపాయములు కావనియు భగవత్ ప్రాప్తికి భగవానుడే ఉపాయమనియు విశ్వసించి ఉండుట -- ఉపనిషత్ సిద్ధాంతము. దానినే ద్వయమంత్రము ప్రతిపాదించును. ఆ విషయమునే బాలకాండలో దేవతలు దశరథుని యజ్ఞసదస్సులో శ్రీ మహావిష్ణువును శరణు పొందుటమొదలు యుద్ధకాండలో విభీషణుని శరణాగతి వరకు శ్రీ మద్రామాయణము నిరూపించుచున్నది.

మానవునికి ఆవశ్యకములగు పుత్రధర్మము, మిత్రధర్మము, భ్రాతృధర్మము, భర్తృధర్మము, శిష్యధర్మము, శత్రుధర్మము మున్నగు ధర్మముల న్నిటిని శ్రీరామచంద్రుడు ఇందు నిరూపించెను. స్త్రీలకు ఆవశ్యకములగు ధర్మములను సీతనిరూపించెను. శ్రీరామచంద్రుడు భరతునకు కుశలప్రశ్నపూర్వకముగా రాజనీతి నంతను ఉపదేశించెను. ఇట్లు రామాయణమంతయు ఒక ధర్మశాస్త్రమై సాగినది. అరణ్య, కిష్కింధ కాండలలో కవితా ప్రస్తావ

నకు ఆవశ్యకములైన వర్ణనలు, అలంకారములు బహువిచిత్రముగ కూర్పబడినవి. ఇక పాత్రపోషణమున, రసపోషణమున, శబ్దవిన్యాసమున సంభాషణౌచిత్య మున శ్రీమద్రామాయణముతో పోల్చదగు గ్రంథమే లేదు.

మానవుని జీవితమే రామాయణము. జీవితమును ఒడుదుడుకులు లేకుండ సాగించుటకు ఆవశ్యకములైన మూలసూత్రములు ఇందు ప్రతిపాదిం పబడినవి. మానవుడు జీవించుటకు విషయానుభవము, ధనము ఆవశ్యకములే కాని వానిభోగమునే ప్రధానముగా భావించి, జీవించుచో మానవునికి పశువు కంటె భేదముండదు. ఆహారము, భయము, నిద్ర, మైథునము పశువులకును మనుష్యులకును సమానములే. బుద్ధి, వాక్కు అనునవి మనుజునకు ఒక్కనికే లభించిన వరములు. వానిచే తెలిసికొనదగుదానిని తెలిసికొని, నాచే అను భవింపబడునది అంతయును పరమాత్మదే. వానికి చెందనిది, వానియందు ఆధారపడనిది ఏ ఒక్కటియును లేదు-- అని గ్రహించి నాది అనుకొనుదా నిని వానిదిగా తెలిసికొని వదలి వాని ప్రీతి కొరకై వానికి చెందినవాడుగా మాత్రము అనుభవించుచుండుట త్యాగము. ఇట్టి త్యాగములేక తానే తనకొఱకే అనుభవించుచున్నానని తగులువడియుండుట పాశవికత. అందుచే కేవల భోగ మును వదలి త్యాగముతో అనుభవింపవలెనని "తేన త్యక్తేన భుంజీథాః" అని ఈశావాస్యోపనిషత్తు చెప్పుచున్నది. ఈ విషయమునే రామచరితము నిరూపించుచున్నది. రామకథ త్యాగముతో ప్రారంభమై త్యాగముతో అంతమై నది. అన్నిటికంటె విడచుటకు కష్టమైనవి ఐశ్వర్యము, ప్రియురాలు. రాముడు మొదట రాజ్యమును వదలినాడు. చివరకు ప్రేమించిన భార్యనే వదలినాడు. మధ్యలో భోగములు అనుభవించినాడు. త్యాగముతో కలసిన భోగమునే మాన వుడు అనుభవింపవలెను కాని కేవలభోగము మానవునకు తగదని రాముడు ఉపదేశించినాడు.

మానవుని జీవితములో ధర్మము, అర్థము, కామము అనునవి మూడును సాధింపదగిన పురుషార్థములు. అందు ధర్మము ప్రధానము. కాని దానికంటె అర్థకామములు ఇష్టములై యుండును. ధర్మముతో సంబంధములేని అర్థకామ ములు ఇష్టములై యుండును. ధర్మముతో సంబంధములేని అర్థకామములు అనర్థహేతువులు. అందుచే ధర్మబద్ధముగ అర్థమును, కామమును ఉపయో గించుకొనవలెనని శ్రీరాముడు తననడువడిచే నిరూపించెను. శ్రీరామునకు పట్టాభిషేకము చేసెదనని దశరథుడు సభలో ప్రకటించెను. రామునితో చెప్పెను.

కాని కైకేయి ఆ విషయమెఱింగి వెనుక తన కిచ్చెదననిన రెండువరములను ఇమ్మని కోరెను. దశరథుడు ధర్మమునకు కట్టుబడి సత్యమునుమీరలేక యూరకుండెను. రాముడు రాజ్యమునువదలి అరణ్యమునకు ఏగెదనని అంగీకరించెను. కాని లక్ష్మణుడుమాత్రము రామునియందుభక్తిచే తీవ్రముగా తండ్రిని విమర్శించెను. తండ్రిని బంధించి, రాజ్యమును స్వాధీనము చేసికొనుమని చెప్పెను. అప్పుడు శ్రీరాముడు తండ్రి పలికిన "సత్యవాక్యమును పాలించుట" పుత్రధర్మమనియు, రాజు, తండ్రి, గురువు, వృద్ధుడు అయిన దశరథునిమాట వినుటయే కర్తవ్య మనియు చెప్పెను. అప్పుడు అర్థకామములకంటె ధర్మమే గొప్పదని నిరూపించుచు ఇట్లు అనెను.

ధర్మార్థకామాః ఖలు తాత! లోకే
సమీక్షితా ధర్మ ఫలోదయేషు
ధర్మే యతస్స్యాత్ తదుపక్రమేత
యేత్రసర్వేస్స్యురసన్ని విష్టాః. అయోధ్య. 21-56

ధర్మార్థకామములు మూడును ధర్మబద్ధముగ ఆచరించిననాడు ధర్మఫలమునే ఒసంగును. అట్లు ధర్మఫలమును ఒసంగనివి కేవలార్థ కామఫలమునే ఒసంగును. అట్లు ధర్మఫలమును ఒసంగని కేవలార్థ కామములు ఆర్జింపరాదు. ధర్మము ఎటువైపు ఉన్న, దానినే ఆచరింపవలెను. ధర్మమునే ఆచరించుచున్నవాడు ఆ ధర్మమే అర్థమును, కామమునుకూడ సమకూర్చును. ఎట్లన "భార్యేవ వశ్యా అభిమతాసుపుత్రా" (అయో.21-56) ధర్మబద్ధముగ వివాహమాడిన భార్య ధర్మమును ఆచరించుటలో తోడుపడి ధర్మమును సమకూర్చును. వానికి అనుకూలయై, ప్రియురాలై కామమును తీర్చును. యోగ్యుడగు పుత్రుని కని అర్థమును ఆర్జింపచేయును. అట్లే ధర్మమును ఒక్కదానినే ఆచరించినను అర్థకామములు తమంతతామే నెరవేరును. అట్లుకాక అర్థమునకే ఆశపడి ధర్మమును వీడినచో "ద్వేష్యో భవ త్యర్థపరోహి లోకే" (అయో.21-57) లోకముయొక్క ద్వేషమునకు గురియగును. ధర్మమును వీడి కామమును అనుభవించినచో "కామాత్మతా ఖల్వపి న ప్రశస్తా" (అయో.21-57) లోకము యొక్క నిందనుపొందును. అందుచే ధర్మబద్ధము కాని అర్థము లోకులద్వేషమును, ధర్మబద్ధముకాని కామము లోకుల దూషణమును కొని తెచ్చును. అందుచే మనము ధర్మమునే ఆశ్రయించి రాజ్యమును వీడి వనమునకు ఏగుదుమని లక్ష్మణుని శ్రీరాముడు అంగీక

రింపచేసెను. చూడుడు. ధర్మమునకు విరుద్ధముగ భరతునకు రాజ్యము కావలెనని కోరిన కైక లోకులందఱిచే శత్రువుగ భావింపబడి పగకు గురి ఆయెను. అట్లే ధర్మవిరుద్ధమగు కామమును అనుభవింపవలెనని ప్రయత్నించిన రావణుడు లోకులందఱినిందను పొందెను. ధర్మబద్ధుడై రాజ్యము వీడిన రాముడు మరల రాజ్యమునుపొంది భార్యతో హాయిగా ఉండెను. కావున అర్థకామములను మాత్రమే సేవింపరాదు. ధర్మబద్ధము లగునపుడే వానిని ఆదరింపవలెనని శ్రీరాముడు తన నడువడిచే నిరూపించెను.

ఇక పురుషప్రయత్నమే ఫలము నిచ్చునా? లేక దైవ సహాయము ఉండవలెనా? అను విషయమును రామాయణము నిర్ణించును. పురుష ప్రయత్నము ఎంతయున్నను దైవము అనుకూలింపనినాడు ఫలము సిద్ధింపదు. కాని కొందరు కేవలము దైవమే ఫలప్రదమనియు భావించుచుందురు. కాని శ్రీరామచంద్రుడు తన నడువడిలో ఈ రెంటికి సమన్వయము ఆవశ్యకమని ప్రదర్శించెను. అరణ్యమునకు వెళ్ళుమనిన తరువాత లక్ష్మణుడు దశరథుని, కైకేయిని దూషించుచుండును. అపుడు శ్రీరాముడు "ఇది యంతయు దైవము చేసినదికాని కైక చేసినది కాదు. నిన్నటివరకు తనపుత్రునికంటె నన్నెక్కువగా ప్రేమించినది. ఈరోజు ఇట్లు మారినది. ఇదియే దైవము."

"అసంకల్పిత మేవేహ యదకస్మాత్ ప్రవర్తతే
నివర్త్యారంభ మారబ్ధం నను దైవస్య కర్మతత్."

అయో.22-24

"అనుకొనిన పని ఆగిపోయి, అనుకొనని విధముగ హఠాత్తుగా జరుగుటయే దైవము యొక్కపని." ఇది కైకది కాదు-- అని లక్ష్మణునికి బోధించెను. కాని లక్ష్మణుడు.

"విక్లబో వీర్యహీనో యః సదైవ మనువర్తతే
వీరస్సంభావితాత్మానో న దైవం పర్యుపాసతే"

(అయో. 23-16)

"ప్రభావిత మహం దైవం పౌరుషేణ నివర్తయే."

(అయో. 23-20)

"చేతకానివాడు పిరికివాడు దైవమును అనుసరించియుండును. కాని వీరులమైన మనము కాదు. నేను ఆ దైవమును పరాక్రమముతో నివర్తింపచే

యుదును" అని ఆవేశపడును. అపుడు శ్రీరాముడు, "నాయనా! దైవము కనబడునదికాదు. దాని ఫలితముమాత్రమే కనపడును. లాభము, నష్టము, జయము, అపజయము మున్నగు ఫలములచే దానివెనుక దైవము కారణముగా నున్నదని తెలియుచుండును. అట్లు పట్టుబడని, కనబడని దైవముతో నీవేమి యుద్ధము చేయుదువు? విరమింపుము. దైవమును అనుసరించుటయే మేలు" అని చెప్పెను.

ఒక కార్యము సిద్ధించుటకు దైవ పౌరుషములు రెండునూ అనుకూలింపవలెను కాని, కేవలపౌరుషము చాలదు. దశరథుడు శ్రీరాముని పట్టాభిషేకమునకు ప్రజల అనుమతి పొందెను. మంత్రుల అంగీకారము సంపాదించెను. వసిష్ఠుని సమ్మతిని పొందెను. పురుష ప్రయత్నము లోపములేదు. కాని పట్టాభిషేకము కాలేదు. కారణము దైవమే! అట్లే భరతునకు పట్టాభిషేకముచేయుటకై కోరెను. శ్రీరాముడు అంగీకరించి రాజ్యమును విడచి అడవులకేగెను. దశరథుడు ఎటులనో సమ్మతించెను. కాని పట్టాభిషేకము కాలేదు. కారణము దైవమే! దీనిచే జీవితమున పౌరుషముమాత్రమే కార్యకారి కాదనియు దైవ పౌరుష సమన్వయము ఆవశ్యక మనియు తెలియుచున్నది.

ఇట్లు శ్రీమద్రామాయణము మానవజీవితమున త్యాగ, భోగ సమన్వయమును, ధర్మార్థ కామ సమన్వయమును, దైవపౌరుష సమన్వయమును ఆవశ్యకములని నిరూపించినది.

| రావణుడు | రాముడు |
|---|---|
| (1) ధర్మమును వదలి అర్థమును ఆర్జించి కామములు అనుభవించినవాడు. | (1) అర్థమును, కామమును తృణప్రాయముగ భావించి ధర్మమునకే కనబడినవాడు. |
| (2) విషయభోగములు అనుభవించుచు "నేను", "నాది" అను అహంకారమమకారములతో భోగమయ జీవితమును గడిపినవాడు. | (2) అహంకార మమకారములను విడచి త్యాగముతో భోగము ననుభవించినవాడు. |
| (3) పౌరుషమే ప్రధానమని దైవమును ఎదిరించినవాడు. | (3) దైవమును నమ్మి పౌరుషమును ఉపయోగించినవాడు. |

రావణుని ప్రవృత్తి : రాజసము, అసురము.

రాముని ప్రవృత్తి : సాత్వికము, దైవము.

అసుర ప్రవృత్తి నశించి దైవ ప్రవృత్తి వృద్ధినొందుట మానవత్వము. అట్టి మానవత్వమును పెంపొందించుటయే శ్రీరామాయణము యొక్క ప్రదాన ప్రయోజనము.

ఈ విధముగ రామాయణము మానవజీవితము సుఖశాంతులతో సాగునట్లు ఉపదేశమునిచ్చు మహాగ్రంథము.

"ఇదం పవిత్రం పాపఘ్నం పుణ్యం వేదైశ్చ సమ్మితం"

(బాల 1-98)

అని వాల్మీకి దీని మహత్త్వమును వివరించెను.

ఈ శ్రీరామాయణము :-

(1) పవిత్రము - అంతఃకరణమున అంటినవియును జ్ఞానము కలుగకుండ అడ్డెడివియునగు దోషములను తొలగించును.

(2) పాపఘ్నము -- భగవత్ప్రాప్తికి ప్రతిబంధకములుగా నుండు పాపములను నశింపచేయును.

(3) పుణ్యము - సుఖమునకు సాధనమై యుండును.

(4) అందుచే ఇది వేదములతో సమానమయినది.

మానవజాతి మనవలె ననిన శ్రీమద్రామాయణమును అధ్యయనము చేయుట ఆవశ్యకము.

* * * * * * * *

# శ్రీ రా మా య ణా వ త ర ణ ము

వాల్మీకి ఋక్షుడను పేరుతో భృగువంశమున జన్మించినవాడయ్యు అసురమగు ప్రవృత్తితో రాజస తామసమగు చిత్తముతో ఉండెడివాడు. పరహింసయే జీవనముగా కలిగి, కుటుంబభరణమే పురుషార్థముగా బ్రతికెడివాడు. అట్టి వానికి సప్త మహర్షుల అనుగ్రహముచే రామనామము లభించినది. దానిని చాల సంవత్సరములు జపించెను. చివరకు శరీరస్ఫురణమే పోయెను. ఆతనిపై పుట్ట పెట్టినది. కొంతకాలము తరువాత వరుణదేవుని అనుగ్రహముచే వర్షముపడి పుట్ట కరిగి ఆతడు బయల్వెడలెను. అప్పుడు ఆతడు (వల్మీకము=పుట్టనుండి బయల్వెడలినవాడు) వాల్మీకి అని పిలువబడెను. ప్రచేతనుడు అనగా వరుణుడు. వరుణుని అనుగ్రహమువలన బయల్పడినాడు కనుక, ప్రాచేతనుడు. తరువాత తపశ్శాలియై ఆశ్రమమున శిష్యులతో నివసించుచుండెను. కుశలవులు కూడ ఆతని ఆశ్రమమున నుండిరి. ఒకరోజు మధ్యాహ్న సమయమున స్నానమునకై వాల్మీకి భరద్వాజుడను శిష్యునితో తమసానది కేగెను. ఆ నదిని చూచి శిష్యునితో,

"అకర్దమ మిదం తీర్థం భరద్వాజ నిశామయ
రమణీయం ప్రసన్నాంబు సన్మనుష్యమనో యథా."

(బాల. 2-5)

"భరద్వాజా! ఈ జలమును చూడుము. బురద లేదు. మనోహరమైయున్నది. అడుగున ఉన్న వస్తువు కూడ కన్పడునట్లు నీరు నిర్మలమైయున్నది. ఇది మంచివాని మనసువలె నున్నది చూడుము" అనెను.

ఈ శ్లోకములో వాల్మీకి తీర్థమును ప్రశంసించుటలో ఆతని మనస్స్థితి వ్యక్తమగుచున్నది. మంచివాని మనసును నదీజలమునకు దృష్టాంతముగా చెప్పినాడు. మంచివాని మనసులో కూడ బురదలేకుండ ఉండును. బురద యనగా రజోగుణము. అది తొలగి స్వచ్ఛమై యుండుటయే కాదు. ప్రసన్నమై యుండును. అనగా సత్త్వగుణము వృద్ధిపొంది ప్రకాశమై యుండును. తరువాత ఆనందమును అనుభవించుటకు ఇతరులకు ఆనందమును కలిగించుటకు తగిన స్థితి కలిగి రమణీయమగును. ఇట్టి సన్మనుష్యుని మనస్సు అకర్దమతా రమణీయతా ప్రసన్నతలు కల నీటితో పోల్చతగినది.

సన్మనుష్యు డనగా ఎవరు? మంచివాడు, కాని ఉపనిషత్తు,

"అస్తి బ్రహ్మేతి చే ద్వేద సంత మేనం తతో విదుః"

"ఎవడు బ్రహ్మ మున్నదని ఎఱుంగునో వాడు "సన్‌మనుష్యుడు" అని చెప్పినది. అంతటను వ్యాపించినది, అంతయు తానైనది, ఒకటి యున్నదని ఎఱిగినవాడు "ఉన్నవాడు." అది లేదనినవాడు "లేనివాడు". (ఉన్నవాడు అనగా "సన్" అని అర్థము.) అంతటను వ్యాపించిన తత్త్వము ఒకటి యున్నది. ఈ కన్పడున దంతయు దాని శరీరమే అని ఎఱింగినవాడు "సన్మ నుష్యుడు." అట్టివాని మనసును ఈ నదిలోని జలములకు ఉపమానముగా చెప్పుటచే వాల్మీకి ఆ స్థితిలోనున్నాడని గ్రహింపవీలగుచున్నది. రామాయ ణము వాల్మీకి నుండి రాబోవుచున్నది. దానికి తగిన మనస్స్థితి కలవాడని సూచించుటకే ఆ నదీజలములను వర్ణించుట, కాని కేవల సౌందర్యవర్ణనకై కాదు.

అట్టిస్థితిలో ఉన్న వాల్మీకి ఆ వనమును తిలకించుచు కొంచెము దూర మేగెను. అచట నొక చెట్టుపై రెండు క్రౌంచ పక్షులజంట క్రీడించుచుండెను. అందు కామ పరవశమైయున్న మగ పక్షిని బోయ కొట్టెను. పక్షి నేలప డెను. విలవిల తన్నుకొనుచు, మెడ ప్రక్కకు పడవైచి, కాళ్లుచాచి రెక్కలు పరచుకొని రక్తము కారుచు మగపక్షి పడియుండెను. ఆడుపక్షి దానిచుట్టును తిరుగుచు, తాకుచు విలపించుచుండెను. ఆ సన్నివేశమును చూచిన వాల్మీకి హృదయము శోకముతో నిండెను. ఆ శోకము లోపల ఆగక వెలికివచ్చెను.

"మా నిషాద ! ప్రతిష్ఠాం త్వ మగమః శాశ్వతీః సమాః
యత్ క్రౌంచమిథునాదేక మవధీః కామమోహితమ్"

(బాల.2-15)

ప్రతిపదార్థము, బాహ్యార్థము :-

నిషాధ=ఓ బోయవాడా, యత్=ఎందువలన, క్రౌంచమిథునాత్= క్రౌంచ పక్షులజంటనుండి, కామమోహితం=కామపరవశమైయున్న, ఏకం=ఒక మగప క్షిని, అవధీః=చంపితివో, అందువలన, త్వం=నీవు, శాశ్వతీఃసమాః=చాల సంవ త్సరములు, ప్రతిష్ఠాం=నిలుకడను, మాగమః=పొందకుందువుగాక.

తాత్పర్యము :-

"ఓ బోయవాడా! నీవు కామపరవశమైయున్న క్రౌంచ పక్షుల జంట నుండి మగపక్షిని చంపి విడగొట్టితివి. కావున నీవు చాల సంవత్సరములు మనకుందువుగాక." - అని శపించెను.

వాల్మీకికి కోపము వచ్చి తిట్టిన ఈ వాక్యము మరల పరిశీలింప తగిన దాయెను. దానిని మరల వాల్మీకి చదువుకొనెను. శిష్యులకు చెప్పెను. అది నాల్గుపాదములు కల్గి ఒక్కొక్క పాదమునకు ఎనిమిది అక్షరములు కలిగియుం డెను. వీణపై పలికించుటకు, లయకు తగియుండెను. దానినే వారు మరల మరల కీర్తించుటచే వాల్మీకినుండి శోకముచే వచ్చిన ఆ మాటలే "శ్లోకము" అయెను. శ్లోకము అనగా మరల మరల కీర్తింపతగినది -- అని యర్థము.

వాల్మీకియంతటి ఋషికి, జితేంద్రియునకు శోకక్రోధములు కలుగునా? కలిగినను అట్లు కోపముతో వచ్చుతిట్టు మరల మరల కీర్తింవతగినది అగునా? క్షుద్రమగు పక్షి చనిపోయినందుకు వాల్మీకి శోకార్తుడై బోయను అంతతిట్టు తిట్టునా? అను విషయములు ఆలోచింపతగినవి. వాల్మీకిమహర్షి బ్రహ్మజ్ఞా నసంపన్నుడనియు, ఆ బ్రహ్మమే విశ్వమున కంతయు ఆత్మయై, విశ్వము ఆతనికి శరీరమునై ఉండుట ఎఱింగినవాడు అనియు ఎఱుంగవలెను. ఇట్టివాడని తమసానదీ తీర్థమును వర్ణించునప్పుడు మనకు సూచించెను. అట్టివాడగుటచేతనే విశ్వమునంతను పరమాత్మ శరీరముగా ప్రేమించినాడు. అందేభాగమునందు వేదన కలిగినను తన శరీరమునందే వేదన కలిగినట్లు భావించెడి ఉదారుడు. అందుచే పక్షికి కల్గిన వేదన ఆతని హృదయమున మెదలెను. అది పక్షి దికాదు. వాల్మీకిదికాదు. సాధారణీకరణమును పొందిన ఒక భావము. ఆ భావమే రసమై "నేననుభవించుచున్నాను -- ఈ భావము నాది" అను భావన తొలగి బ్రహ్మానందమువంటి అనుభూతి కలుగును. ఇదే నాటకములను చూచునపుడు సామాజికులకు కలిగెడి అనుభూతి. ఇట్టి అనుభూతి యోగులు కవులు కూడ పొందుదురు. ఆ అనుభూతి హృదయము నిండగా, నీరు కుండనిండగా పైకి పొరలినట్లు మాటల రూపమున బైటకువచ్చును. అదియే కవిత్వము. వాల్మీకినుండి వచ్చినది అట్టికావ్యము. ఆతని శోకము తన కొఱ కుకాదు, లోకము కొఱకు. అందుచే అది శోకము+లోకము=శ్లోకమాయెను. ఇది మరల మరల కీర్తించుటకు తగినది. మామూలు శోకమయినచో కీర్తిం పతగినదికాదు. వాల్మీకినుండి వచ్చిన మొట్టమొదటి శ్లోకము ఒక తిట్టు

అగునా? కాదు. ఆనాడు అవతరించి లోకరక్షణ యొనర్చి రావణవధ నొనర్చిన రామునకు మంగళాశాసనము. ఇపుడాశ్లోకము యొక్క అర్థము చూదుడు.

అంతరార్థము :-

"మానిషాద=శ్రీనివాసా! యత్=ఎందువలన, క్రౌంచమిథునాత్=వక్ర గమనముకల రాక్షస ద్వంద్వమునుండి, కామమోహితం=కామపరవశుడైన; ఏకం=ఒకనిని అనగా రావణుని; అవధీః=చంపితివో, అందువలన, త్వం=నీవు, శాశ్వతీస్సమాః=చాలా సంవత్సరములు, ప్రతిష్ఠాం=నిలుకడను, అగమః=పొందితివి.

తాత్పర్యము :

శ్రీనివాసా! వక్రగతిగల రాక్షసద్వంద్వమునుండి కామమోహితుడైన ఒక నిని (రావణుని) చంపి విడగొట్టితివి. అందువలన నీవు చాల సంవత్సరములు నిలుకడను పొందితివి.

ఇది ఋషివాక్కగుటచే రెండు అర్థములు కలిగి శ్లోకముగ సాగినది. ఇందు బాహ్యార్థము బోయవానిని శపించుట. అంతరార్థము రామునికి మంగళము పలుకుట. కొద్దిగ ఆలోచించినచో కామమోహితమగు మనస్సును జయించి, దానిచే వశపరచు కొనబడిన ఆత్మను తన వశము చేసికొనిన పరమాత్మకు, మంగళాశాసనము చేయుట కూడ ఇందు కాన్పించును.

క్రౌంచము ఒక పక్షి. "క్రుంచ్ కౌటిల్యే అల్పీభావయోః" అను ధాతువునుండి క్రౌంచశబ్దము వచ్చినది. క్రౌంచము వక్రముగా నడచునది. చిన్నది. రావణుడు కూడ వక్రగమనము కలవాడు. అల్పుడు. అందుచే క్రౌంచమనగా రావణుడు. అట్టి రావణుని చంపిన రామునకు మంగళము. మనస్సుకూడ క్రౌంచమే! అదియు వక్రగమనము కలది, అల్పమైనది. అదియు కామమోహితమే, దానిని జయించుటకు పరమాత్మ అనుగ్రహమే కావలెను.

"మా"=శ్రీకి 'నిషాద'=నివాసస్థానమయినవాడు "లక్ష్మీపతి". నారాయణుడు. ఆతడే శ్రీరాముడు. శ్రీరాముడు రావణుని జయించినాడు. పరమాత్మయే మనమనస్సును జయించునట్లు అనుగ్రహించువాడు. ఇట్లు ఒక్క శ్లోకములో బాహ్యముగ బోయకథ- అంతరముగ రామకథ- దానిలోపల ఆత్మ కథ- సాగుటచే ఈ శ్లోకము చాల ముఖ్యమైనది. ఇది వాల్మీకి నోటినుండి ఆవిర్భవించిన మొదటి శ్లోకము. ఇదియే రామాయణమునకు మూలభూతము. దీనిని మరల మరల వల్లెవేయుచు శిష్యులతో వాల్మీకి ఆశ్రమమున నుండగా

బ్రహ్మ వాల్మీకియెదుట సాక్షాత్కరించెను. వాల్మీకి అర్ఘ్యపాద్యముల నిచ్చి ఆసనముపై కూర్చుండచేసి తాను కూర్చుండెను. అపుడు బ్రహ్మ వాల్మీకితో--

"మచ్ఛందా దేవ తే వాణీ ప్రవృత్తేయం సరస్వతీ" (బాల.2-31)

"రామస్య చరితం సర్వం కురు త్వం ఋషిసత్తమ
రహస్యం చ ప్రకాశం చ యద్వృత్తం తస్యధీమతః" (బాల.2-33)

"తచ్చా ప్యవిదితం సర్వం విదితం తే భవిష్యతి". (బాల.2-34)

"నా సంకల్పమువలననే నీ కీశ్లోకము వచ్చినది. ఈ విధముగనే రామాయణ మంతను రచింపుము. రహస్యముగ ప్రకాశముగ జరిగిన రామకథ అంతయు నా అనుగ్రహము వలన నీకు కరతలామలకముగ కన్పించును" అని ఆదేశించెను. అంతేకాక --

"న తే వా గనృతా కావ్యే కాచి దత్ర భవిష్యతి" (బాల.2-35)

"ఈ కావ్యములో ఏ ఒక్కటియు అసత్యము కాదు"

"యావత్ స్థాస్యంతి గిరయః సరిత శ్చ మహీతలే....
తావ ద్రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి." (బాల.2-36)

"కొండలు ఎంతకాలము నిలచియుండునో, నదులు ఎంతకాలము ప్రవహించునో అంతకాలము రామాయణకథ లోకములో ప్రచారమున నుండునని" వరమిచ్చి బ్రహ్మ వెడలిపోయెను. ఇట్లు చతుర్ముఖ బ్రహ్మయొక్క వరముచే లభించిన దివ్యదృష్టిగల వాల్మీకి నోటినుండి ఆవిర్భవించిన రామాయణము కేవలకథామాత్రమే కాక వేదార్థ ప్రతిపాదకము అగుటలో సంశయము లేదు. అందుచేతనే ఇది --

"ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతకనాశనమ్"

"ఒక్కొక్క అక్షరము మహాపాతకములను నశింపజేయుజాలినది" అని పెద్దలు ప్రశంసించిరి. ఇట్లు శ్రీమద్రామాయణమును రచించుటకు వాల్మీకి మహర్షి సిద్ధము కాగా నారద మహర్షి వారి వద్దకు వచ్చెను. ఆ నారదుని ప్రశ్నించి రామకథ నెఱింగి వాల్మీకి రామాయణ రచనమునకు ఉపక్రమించెను.

## శ్రీమద్రామాయణ ప్రారంభము

"తపస్స్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాంవరం
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్మునిపుంగవమ్" (బాల.1-1)

"తపస్వియగు వాల్మీకి తపస్స్వాధ్యాయనిరతుడు, వాగ్వేత్తలలో శ్రేష్ఠుడు, మునిపుంగవుడు అయిన నారదుని ప్రశ్నించెను."

రామకథను వాల్మీకి అంతకుముందే ఎరుగును. అరణ్యములో శ్రీరాముడు వాల్మీకి ఆశ్రమమునకు వచ్చెను. రాముని కాలమున రాముని ఎఱుంగనివారు ఎవ్వరునులేరు.

"రామో రామో రామ ఇతి ప్రజానా మభవన్ కథాః"
(యుద్ధ. 131-97)

"ప్రజలందరును 'రాముడు రాముడు రాముడ'ని రాముని వార్తలనే చెప్పుకొను చుండెడివారు."

వాల్మీకికి బ్రహ్మవరమువలన రామకథనంతను చూడకలిగిన శక్తి కల్గినది. అట్టిచో నారదుని అడిగి తెలిసికొను అవసరము లేదు. కాని వాల్మీకి అడిగెను. నారదుడు ఉపదేశించెను. దానిననుసరించియే రామాయణ రచన సాగెను. దీనిచే ఒక రహస్యము తెలియుచున్నది. వాల్మీకి ప్రశ్నించినది, నారదుడు ఉపదేశించినది కేవల రామకథ కాదు. అది బ్రహ్మ విద్య. సాక్షాత్ పరబ్రహ్మయే నరుడుగా రాముడను పేరుతో దిగివచ్చినది. అందుకే "బ్రహ్మ" అను రెండక్షరములలోని అడుగుననున్న రెండక్షరములు "ర-మ" అనునవి రామనామమైనవి. ఈనాడు నరుడుగా కన్పట్టు రాముడే పరబ్రహ్మము. ఆతని నెఱుంగుటకు గురూపదేశము కావలెను. తనకు తెలిసినను గురువు వలన ఉపదేశము పొందిననాడే బ్రహ్మ విద్య ఫలించును.

"ఆచార్యాద్ధైవ విదితా విద్యా సాధిష్ఠం ప్రాపత్
ఆచార్యవాన్ పురుషోవేద"

ఆచార్యుడు బ్రహ్మ విద్యోపదేశమునకు ఆవశ్యక మని ఉపనిషత్తు తెలుపుచున్నది. అందుచే ఇచట వాల్మీకి రామకథను, బ్రహ్మ విద్యను కలిపి నారదుని వలన ఉపదేశము పొందవలెనని ప్రశ్నించుచున్నాడు. ఈ ప్రశ్న బ్రహ్మ విషయమని "పరిపప్రచ్ఛ" అను క్రియ తెలుపుచున్నది. ఆత్మ జ్ఞానమును గూర్చి

శిష్యులు గురువుల నడిగెడి ప్రశ్నకు 'పరిప్రశ్నము' అని పేరు. బాహ్యముగ నరునిగూర్చి ప్రశ్నించుచు ఆంతరముగ బ్రహ్మనుగూర్చి ప్రశ్నించినాడు.

ఈ శ్లోకములో గురుశిష్యులకు ఉండవలసిన లక్షణములను వివరించు చున్నాడు. గురువు- నారదుడు, శిష్యుడు-వాల్మీకి.

(1) నరుడనగా జీవుడు. 'ర'=నశించునది 'న'=కానిది 'నర'=ఆత్మ. నరు నకు చెందినది నారము అనగా అజ్ఞానము. దానిని "ద"=ఖండించువాడు నారదుడు. అనగా జీవుని చేరియుండు అజ్ఞానమును ఛేదించువాడు=గురువు.

(2) నరు డనగా పరమాత్మ. విష్ణుసహస్రనామమున "నరః" అనునది భగవానునికి నామము.

(3) నరు డనగా పరమపదమును పొందించువాడు. నరునకు సంబం ధించినది నారము. అనగా జ్ఞానము. దానిని "ద"=ఇచ్చు వాడు నారదుడు. అనగా భగవత్ జ్ఞానము ప్రసాదించువాడు.

ఇట్లు అజ్ఞానమును ఛేదించి జ్ఞానము నిచ్చువాడు నారదుడు, అట్టి నారదుడే ఆచార్యుడు.

ఆచార్యునకు మూడు లక్షణములు ఉండవలయును.

1) తపస్స్వాధ్యాయనిరతుడగుట :-

తపస్సు=చాంద్రాయణము మున్నగు వ్రతములు. దానిచే శరీరేంద్రియ మనస్సులను కృశింపచేసి వేదాధ్యయనముచే ధర్మ బ్రహ్మ స్వరూపముల నెరిం గినవాడు కావలెను.

తపస్సు=భోగ సంకోచము. భోగములను తగ్గించుకొని వేదాధ్యయనము చేయువాడు కావలెను.

తపస్సు=బ్రహ్మజిజ్ఞాస. వేదాధ్యయనముచేసి బ్రహ్మజిజ్ఞాస చేయువాడు కావలెను.

తపస్సు=యోగము. యోగమును, స్వాధ్యాయమును అలవర్చుకొనిన వాడు కావలెను.

2) వాగ్విదాంవరుడగుట :-

శబ్ద స్వరూపమును ఎఱింగినవారిలో శ్రేష్ఠుడు కావలెను. వేదాధ్యయ నము చేసి దాని అర్థము నెఱింగి దానిని ఇతరులకు అందింప గలిగినవాడు కావలెను.

3) మునిపుంగవుడగుట :-

సంతతము భగద్విషయమునే మననము చేయువాడు కావలెను.

ఇట్లు ఆచార్యునకు ---

(1) తపస్స్వాధ్యాయనిరతి, (2) వాగ్విదాంవరత్వము, (3) మునిపుంగవత్వము ఉండవలెను.

ఈ మూడు లక్షణములచే ---

(1) శ్రవణము (2) మననము (3) ధ్యానము అను మూడు లక్షణములు కూడ సూచింపబడవచ్చును. లేదా (1) పాండిత్యము (2) బాల్యము (3) మౌనము అను బ్రహ్మవేత్త కుండెడి మూడు లక్షణములు సూచింపబడవచ్చును.

ఇట్లు ఈ నారదుడను పదము గురువును సూచించునదిగా ఎఱుంగవలెను.

నారదుడు (1) నారాయణపరాయణుడై, (2) త్రిలోకసంచారియై, (3) కలహశీలుడై ఉండునని మనకు ప్రసిద్ధి.

గురువుకూడ --

(1) నారాయణపరాయణుడే (2) ప్రకృతి బంధమునువీడి పైలోకముల కేగి మరల భగవదాజ్ఞచే సంసారుల నుద్ధరించుటకు ఈ లోకమునకు దిగవచ్చెడి త్రిలోకసంచారియే (3) ధర్మాధర్మములకు, జ్ఞానాజ్ఞానములకు కలహమును కల్పించి ధర్మమునకు జ్ఞానమునకు విజయము కలిగించెడి కలహశీలుడే!

కావున నారదుని గురువుగా భావింపవలెను.

వాల్మీకి శిష్యుడు కదా! ఆతనికి ఉండవలసిన లక్షణము ఒక్కటియే! అది తపస్వి యగుట. తపస్సనగా ఆలోచన. బ్రహ్మ విషయిక మయిన ఆలోచన కావలెను. తపస్వి యనగా దీనుడు. తాను పొందవలసిన జ్ఞానమును పొందలేదని దైన్యము పొందినవాడే శిష్యుడుగా నుండవలెను.

ఇట్లు ఈ శ్లోకములో శిష్యాచార్య సంబంధము నిరూపింపబడినది. దాని ద్వారా అవతరించిన రామాయణకథ బ్రహ్మవిద్యయే యని నిరూపింపబడినది.

వాల్మీకి నారదుని ఒక నరునిగూర్చి ప్రశ్నించెను.

"కో న్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్
ధర్మజ్ఞ శ్చ కృతజ్ఞ శ్చ సత్యవాక్యో దృఢవ్రతః" (బాల.1-2)
"చారిత్రేణ చ కో యుక్తః సర్వభూతేషు కో హితః
విద్వాన్ కః క స్సమర్థశ్చ క శ్చైక ప్రియదర్శనః"
(బాల.1-3)

"ఆత్మవాన్ కో జితక్రోధో ద్యుతిమాన్ కోఽనసూయకః
కస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే." (బాల.1-4)

"ఈ కాలములో ఈ దేశమున (1) గుణవంతుడు, (2) వీర్యవంతుడు, (3) ధర్మజ్ఞుడు, (4) కృతజ్ఞుడు, (5) సత్యవాక్యుడు, (6) దృఢవ్రతుడు, (7) చారిత్రవంతుడు, (8) సర్వభూతహితుడు, (9) విద్వాంసుడు, (10) సమర్థుడు, (11) ఏకప్రియదర్శనుడు, (12) ఆత్మవంతుడు, (13) జితక్రోధుడు, (14) ద్యుతిమంతుడు, (15) అనసూయుడు, (16) దేవతలకు భయమ్ము గొల్పు కోపముగల నరుడు ఎవడు? అట్టి వానిని ఎఱుంగవలెనని కోరిక కల్గియున్నాను సమర్థుడవు కనుక ఇటువంటి నరుని తెలియజేయ ప్రార్థించుచున్నాను" అని వాల్మీకి పదునారు గుణములను పేర్కొని అట్టి గుణములుగల నరుడు ఈ కాలములో ఈ దేశములో ఎవడు? అని ప్రశ్నించెను.

ఈ పదనారుగుణములు రామునకు పదునారు కళలు. వానితో కూడిన రాముడు-రామచంద్రుడు. అందుకే మనవారు రాముని రామచంద్రుడని కీర్తించుచుందురు. ఇందు వాల్మీకి నరునిగూర్చి ప్రశ్నించెను. కాని, అందులో పరబ్రహ్మమునుగూర్చి కూడ ప్రశ్న యిమిడియున్నది. పరబ్రహ్మమే ఆయా కాలములలో ఈ లోకమున అవతరించి సులభుడై మన విరోధులను తొలగించి తమ్ము చేర్చుకొనుచుండును. అట్టి పరబ్రహ్మమే, నేడు రావణుడు నరునిచేత గాని చావడని నరుడుగా అవతరించెను. అందుచే బాహ్యముగా నరుడై ఆంతరముగ బ్రహ్మమై యుండు రామునిగూర్చి ప్రశ్నించు ప్రశ్నలో బాహ్యముగ నరుడుగా ఉండవలసిన లక్షణములు, ఆంతరముగ బ్రహ్మలక్షణములను చేర్చియుంచెను. అందుచే ఈ పదునారులక్షణములు కలదియే పరబ్రహ్మము. అందుచే బాహ్యముగ ఈ ప్రశ్న రామకథా విషయముగ, ఆంతరముగ-బ్రహ్మ విషయముగ నుండెనని ఎఱుంగవలెను.

రావణుడు ఎవ్వరిచేతను చావు లేకుండ వరము కోరుకొని, నర వానరు

లను మాత్రము ఉపేక్షించెను. అందుచే వానిని సంహరించుటకు శ్రీరాముడు నరుడుగా నుండెను. రామాయణమునందంతటను రాముడు నరుడుగనే కన్పట్టును. యజ్ఞభూమిలో దేవతలయెదుట సాక్షాత్కరించినపుడు--

*"ఏతస్మిన్ అంతరే విష్ణు రుపయాతో మహాద్యుతిః*

*శంఖచక్రగదాపాణిః పీతవాసా జగత్పతిః"* (బాల.15-16)

శ్రీరామజననమునకు ముందు విష్ణువే రాముడుగా అవతరింప నున్నాడని సూచించును. మరల యుద్ధానంతరము, రావణవధ అయిన తరువాత దేవతలు రాముని స్తుతించుచు "నీవు నారాయణుడవే" అని పేర్కొనిరి. రామావతారము మొదలు రావణవధ యగునంతవరకు రాముడు నరుడుగనే కన్పట్టును. దివ్యత్వము లోన అణగియుండును. అందుచే ఏ లక్షణములున్నచో నరుడు నరుడగునో ఆ లక్షణములను ఇందు ప్రశ్నించును. అంతరముగ బ్రహ్మమే యగుటచేతను, ఇతరులందరు రాముని బ్రహ్మముగనే ఉపాసించుటచేతను, పరమాత్మ లక్షణములను ఆంతరార్థమున ప్రశ్నించును. ఇట్లు ఈ ప్రశ్నలలో రాముని నరునిగను, బ్రహ్మముగను ఎఱుంగవలెనని సూచించుటకు ఈ ప్రశ్న సమాధానములు రెండర్థములతో సాగెను. రామాయణమంతయు వాచ్యముగ రామకథను ప్రతిపాదించుచు, వ్యంగ్యముగ బ్రహ్మకథను నిరూపించునట్లే ఈ ప్రశ్నలు కూడ వాచ్యముగ నరుని గూర్చి, వ్యంగ్యముగ బ్రహ్మమునుగూర్చి సాగును. దానిని వివరముగ తెలిసికొందము.

**1. గుణవాన్ కః :-**

బాహ్యార్థము :-

గుణవంతుడు ఎవడని ప్రశ్నించెను.

ఏ గుణమున్న నరుడు నరు డనిపించుకొనునో అట్టిదియే గుణము. ఏ గుణమున్న ప్రజలు ఎక్కువగా కొనియాడుచుందురో ఆ గుణమే గుణమని చెప్పబడినది. అదియే సౌశీల్యము. ఆ సౌశీల్యము కలవాడు శ్రీరాముడు. ఇది మానవునకు ప్రధానముగ ఉండవలసిన గుణము. శ్రీరాముడు సుశీలుడు.

*"మహతః మందైస్సహ నీరంధ్రేణ సంశ్లేషః సౌశీల్యమ్"*

"జాతిచేతను, ఐశ్వర్యముచేతను, విద్యచేతను గొప్పయయినవాడు, వానిలో తక్కువయినవానితో అరమరిక లేక కలసియుండుట సౌశీల్యము." ఇది శ్రీరామునిలో కాన నగును.

శ్రీరాముడు జాతిచే సూర్యవంశమునకు చెందిన క్షత్రియుడు. ఐశ్వర్య ముచే చక్రవర్తి కుమారుడు. విద్యచే వసిష్ఠాదుల శిష్యుడైన విద్యాధికుడు.

అట్టి శ్రీరామునకు అంతరంగమిత్రులు ముగ్గురు.

(1) పల్లెవాడు - గుహుడు.

(2) వానరుడు - సుగ్రీవుడు.

(3) రాక్షసుడు - విభీషణుడు.

వీరు ముగ్గురును జాతిచేకాని ఐశ్వర్యముచేకాని విద్యచేకాని రామునకు సమానులుకారు. కాని రాముడు తనతో సమానముగ భావించి ప్రేమించెను.

(1) గుహుని "ఆత్మ సమఃసఖా" (అయో.50-32) అనును. తనకు దీటైన స్నేహితుడు గుహుడట. ఆతడు ఎదురుగా వచ్చినప్పుడు "పద్భ్యా మభిగమా చ్చైవ స్నేహసందర్శనేవ చ" (అయో.50-40) నడిచి వచ్చి ఇంతప్రేమ చూపించితివే! ఆతిథ్య మిచ్చినట్లే! ఇంకేమి చేయవలెను?" అని శ్రీరాముడు ఎంతో సంతోషించును. గుహునితో ఇంతటి మైత్రికి గుహుని యోగ్యత కాదు. శ్రీరాముని సౌశీల్యమే కారణము.

(2) సుగ్రీవునితో కోరి మైత్రి చేసికొనినాడు శ్రీరాముడు. సుగ్రీవుడు వానరుడు. భార్య, రాజ్యము కూడ పోయియున్నాడు. ఆతనితో మైత్రి చేసికొని ఆతని సుఖమే తన సుఖము-- ఆతని దుఃఖమే తన దుఃఖము అనునట్లు ప్రవర్తించినాడు. సుగ్రీవునకు వాలిపై కోపము ఉండుటచే, తాను కూడ కోప ముకల్గి ఆతనిని చంపెను. చనిపోయి పడి ఉన్న వాలిని చూడగనే సుగ్రీవునకు కోపముతగ్గి ప్రేమ కలిగెను. ఏడ్చుచు రాజ్యము తనకు వద్దని విలపించెను. శ్రీరాముడు అట్టి సుగ్రీవుని చూచి "సంజాతభాష్పః పరవీరహంతా" (కిష్కిం.24-24) కన్నుల నీరునిండినవాడు ఆయెను. రాముని మైత్రి ఇట్టిది.

సుగ్రీవుని కోపమే తనకోపము. సుగ్రీవుని ప్రేమయే తన ప్రేమ. అంతే కాదు.

మరొకసన్నివేశమును చూదుదు. లంకలో వానరసైన్యముతో శ్రీరాముడు ప్రవేశించిన తరువాత పట్టణము వెలుపలవున్న కొండపై నెక్కి లంకను చూచుచుండును. సుగ్రీవుడుకూడ ఆ ప్రక్కనే యుండును. ఎదురుగా రావణుడు కన్పడెను. సుగ్రీవుడు చూచి ఆవేశము ఆపుకొనలేక ఎగరి రావణునిపైపడి, రావణునికొట్టి, గీరి, కొరికి, తాను దెబ్బలుతిని వలిగి

తిరిగి రామునివద్దకు వచ్చెను. అప్పుడు శ్రీరాముడు - "త్వయి కించిత్ సమాపన్నే కిం కార్యం సీతయా మమ" (యుద్ధ. 41-4)

"సుగ్రీవా! నీవేమైన అయియున్నచో నాకి సీతతో ఏమి ప్రయోజనము?" అనును. తనకు ఇల్లాలై తనవెంట అడవికి వచ్చి తన కష్టసుఖములలో భాగస్వామిని అయిన సీతకంటె సుగ్రీవుడు ఎక్కువ అనినట్లు రాముడు భావించెను. ఇచట రాముడు పలికిన ఆ మాటలో సుగ్రీవునిపై గల వాత్సల్యమును చూడుడు. "సుగ్రీవా! నీవు చనిపోయియున్నచో నాకు సీతతో ఏమిపని?" అని నోటితో "చనిపోవుట" అన్న మాటకూడ అనలేక "నీ వేమైన అయినచో" అనును. అశ్లీలమగు మాట కూడ సుగ్రీవుని విషయముననోటితో రాముడు పలుకలేదు. ఇట్టిమైత్రి ఒక వానరునియందు కలిగియుండుట శ్రీరాముని సౌశీల్యము.

(3) తన శత్రువునియొక్క సోదరుడై శత్రుపక్షమునుండి వచ్చిన విభీషణుని రాక్షసుడని శంకింపక తనవారందరు వలదనుచున్నను 'మిత్రభావేన సంప్రాప్తం న త్య జేయం కథంచన' (యుద్ధ.18-3) "మిత్రభావముతో వచ్చినవానిని వదలలేను" అని విభీషణునికి ఆశ్రయ మిచ్చిన పరమోదారుడు శ్రీరాముడు. ఇట్లు విభీషణుని చేరదీయుటకు రాముని సౌశీల్యమే కారణము. ఇట్లే శబరిని, జటాయువును ప్రేమించిన శ్రీరాముడు సుశీలుడు. దీనిచే రాముడు గుణవంతుడని తెలియుచున్నది.

అంతరార్థము :- పరమాత్మనుగూర్చి-గుణవాన్ కః :-

గుణవంతుడెవడు? ఈ యర్థమునకు గుణమనగా సౌశీల్యమే అని గ్రహింపవలెను. గొప్పవారు తక్కువ వారితో చేరియుండుట సౌశీల్యము. పరమాత్మ సర్వజగత్తునకు కారణమైనవాడు. ప్రకృతి సంబంధము లేనివాడు. ఆ ప్రకృతిని నామరూపములుగల జగత్తుగ పరిణమింపజేసెడివాడు. అట్టివాడై తనచే సృజింపబడిన ప్రతిపదార్థములో ఎంత నీచమైనను దానిలో తాను చేరియుండును.

"అనేనజీవే నాత్మనానుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి".

"నామరూపములు కలదానినిగ ప్రకృతిని మార్చి అందు జీవులలో చేరియుండి ప్రవేశించును." అని ఉపనిషత్తున చెప్పబడుచున్నది. ఇదియే సౌశీల్యము. ఈ ప్రశ్నచే సర్వజగదంతర్యామి ఎవరు? అని ప్రశ్నించునట్లు అగును.

2. వీర్యవాన్ కః :-

బాహ్యార్థము :-

వీర్యము కలవాడు ఎవడు?

మనమునకు దిగులుకల్గించు శత్రుసైన్యము ఎదురుగా నున్నను తానే మియు కలత చెందక దానిలో ప్రవేశించి దానిని పలుముఖములుగ చిమ్మి వేయగల శక్తి వీర్యము. ఇచట వీర్యము కలవాడు రాముడే అని ఖర, దూషణాదివధలో మనకు స్పష్టమగును. రాముడు ఒక్కడును ఒకవైపు, పదునాలుగువేలమంది సైన్యము ఒక వైపు.

"నాఽదదానం శరాన్ ఘోరాన ముంచంతం శిలీముఖా"
(అరణ్య. 25-38)

బాణములు సంధించుటగాని విడచుటగాని గుర్తించుటకు వీలుకాకుండ ఒక్కడు అందఱకు అన్నిరూపములై యుద్ధము చేసెను. మారీచ సుబాహువధ, రావణవధ మున్నగు వానిలో రామునివీర్యము స్పష్టమే! అందుచే వీర్యవంతుడు రాముడు.

ఆంతరార్థము :-- పరమాత్మనుగూర్చి -- వీర్యవాన్ కః ?

పరమాత్మకూడ వీర్యవంతుడే. జీవులకు జ్ఞానమును సంకోచింపచేసి వికారమును కలిగించునది ప్రకృతి. అట్టి ప్రకృతిలో పరమాత్మ కూడ జీవునితో పాటు ప్రవేశించియుండును. అట్లు ప్రవేశించియుండియు తానేమియు వికారమును చెందక వానిని వివిధముగ విచిత్రముగ వికారము నొందించు వాడు కనుక పరమాత్మ వీర్యముకలవాడు. దీనిచే సర్వజీవులలో తానుప్రవేశించి అంతర్యామియై యున్నను, వికార రహితుడై యుండువాడు ఎవడు? అని ప్రశ్నింపబడినది.

3. ధర్మజ్ఞః :-

బాహ్యార్థము :-

ధర్మము నెఱింగినవాడు ఎవడు?

శ్రీరాముడు సర్వధర్మములను ఎరిగినవాడు. శిష్యుడుగా, పుత్రుడుగా, భర్తగా, ఆశ్రితరక్షకుడుగా, మిత్రుడుగా, శత్రువుగా అన్ని విధముల అన్ని ధర్మములు ఎరిగి ఆచరించెడివాడు. వైదికములగు యజ్ఞములను ఆచరించినవాడు. యజ్ఞములో జన్మించి యజ్ఞమును కాపాడి యజ్ఞభూమిలో దొరికిన సీతమ్మను

వివాహమాడి యజ్ఞవిరోధులగు రాక్షసులను సంహరించి ఋషులను కాపాడి వైదిక ధర్మమును లోకములో ప్రతిష్ఠించినవాడు.

"రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా
రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా" (బాల.1-13,14)

తన ధర్మమును తన వారి ధర్మమును జీవులందఱియొక్క ధర్మమును కాపాడినవాడు శ్రీరాముడు.

అంతరార్థము :-- పరమాత్మని గూర్చి - ధర్మజ్ఞః :-

రక్షణమే పరమాత్మ ధర్మము.

పరమాత్మకూడ ధర్మజ్ఞుడే! జగత్తు యొక్క సృష్టిస్థితిలయములు రక్షణము- అవి ఎవని యధీనములో యున్నవో అది పరబ్రహ్మము.

"యతో వా ఇమాని భూతాని జాయంతే
యేన జాతాని జీవంతి యత్ప్రియంత్యభి సంవిశంతి
తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి"

అని చెప్పబడిన సృష్టి స్థితిలయములు మూడును రక్షణమే! ఆ రక్షణమే పరమాత్మ యొక్క ధర్మము. దానిని ఎఱింగినవాడు, అనగా జగద్రక్షణమున అడ్డులేని సంకల్పము కలవాడు ఎవడు? అని పరమాత్మ గూర్చి ప్రశ్నించెను.

4. కృతజ్ఞః :-

బాహ్యార్థము :-

ఒకరు చేసినమేలు మరువని వాడెవడు?

చేసిన ఉపకారమును మరువక ఎల్లప్పుడును జ్ఞాపకము ఉంచుకొనువాడు కృతజ్ఞుడు. శ్రీరాముడు కృతజ్ఞతలో పరాకాష్ఠ నందినట్లు ప్రజలు దశరథునితో రాముని గుణములను వర్ణించుచు చెప్పిరి.

"కథంచి దుపకారేణ కృతే నైకేన తుష్యతి
న స్మర త్యపకారాణాం శత మప్యాత్మవత్తయా" (అయో.1-11)

"శ్రీరాముడు ఎవరైన ఒక్క ఉపకారము ఎటులో కష్టపడి చేసిన ఆ ఉపకారముతో సంతోషించి ఆ ఉపకారమును ఎల్లప్పుడు కొనియాడుచు ఆనందించుచుండెడివాడు. ఒకరుచేసిన ఉపకారమును స్మరించుటయే కాదు. వంద అపకారములను చేసినను, వాటిని తలంపడు." జ్ఞాపకముండి తలంపకపోవుట

కాదు. మరచిపోవును.

అంతరార్థము :- పరమాత్మను గూర్చి -- కృతజ్ఞః :-

పరమాత్మయు కృతజ్ఞుడే !

"కృతం జానాతీతి కృతజ్ఞః" చేసిన దానిని ఎఱుంగువాడు. కృత మనగా జీవులు చేసెడి కర్మ. ఆ కర్మనెఱింగి దాని కనుగుణమగు ఫలమును జీవులకు కల్పించుచుండును. తాము చేసిన కర్మను తాము మరచినను, సర్వేశ్వరుడు మరువడు. జీవులందఱియొక్క అన్ని విధముల కర్మల నెఱింగి, ఆ కర్మానుగుణములగు శరీరముల నొసంగి, ఆ శరీరములో జీవులతో పాటు తానుకూడ ప్రవేశించి, నియమించుచు రక్షించును. ఈ పరమాత్మ లక్షణము లవే "గుణవా, వీర్యవాన్, ధర్మజ్ఞః, కృతజ్ఞః" అను నాలుగు ప్రశ్నలలో సూచించెను.

5. సత్యవాక్యః :-

బాహ్యార్థము :

సత్యమయిన వాక్యము కలవాడు.

ఆడినమాట ఎన్నడును సత్యమేకాని అనృత మాడి ఎఱుగడు. కైకేయి తండ్రిగారి కోరికగా పట్టాభిషేకమును మాని అరణ్యముల కేగవలెనని చెప్పెను. దానిని విని, రాముడు అట్లేయని అంగీకరించెను. అంగీకరించి "అమ్మా! తండ్రిగారు స్వయముగ నాతో ఈ మాట ఎందులకు చెప్పలేదు?" అని శ్రీరాముడు ప్రశ్నించెను. అప్పుడు కైక దశరథుడు స్వయముగ చెప్పలేదని, రాముడు మాట తప్పునేమోయని శంకించెను. అప్పుడు శ్రీరాముడు --

"రామో ద్వి ర్నాభిభాషతే" (అయో. 18-30)

"రాముడు రెండుమాటలు మాటాడడు" అనెను.

"విద్ధి మాం ఋషిభిః తుల్యం కేవలం ధర్మ మాస్థితం" (అయో.19-20)

"కేవలధర్మమునే అనుసరించెడి ఋషులతో సమానునిగా నన్నెఱుంగుము" అని చెప్పి ఆడినమాటకు కట్టుబడి నిలచెను. తల్లి కౌసల్య వలదని వారించినను, లక్ష్మణుడు ప్రార్థించినను, సత్యమును వీడలేక వనగమనమునకే నిర్ణయించెను. అరణ్యమున కేగి భరతుడు రాజ్యమును స్వీకరించుమని ప్రార్థించెను. ప్రజలు, మంత్రులు, తల్లులు కూడ భరతుని కోరికకు తమ

సమ్మతిని తెలియపర్చిరి. జాబాలి నాస్తిక వాదముతో రాముని మరలింప చూచెను. వసిష్ఠుడు గురువుగా ఆదేశింపచూచెను. కాని శ్రీరాముడుమాత్రము తానాడిన మాటకు కట్టుబడి వనవాసమునకే నిశ్చయించి యుండెను. ఇది రాముని సత్య వాక్యమునకు పరమోదాహరణము.

అంతరార్థము :- పరమాత్మనుగూర్చి - సత్యవాక్యః.

పరమాత్మకూడ సత్యవాక్యుడే !

సత్యమను శబ్దమే పరమాత్మను తెలియచేయునది..... "సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ" అని ఉపనిషత్తు చెప్పుచున్నది. సత్యమనునది పరమాత్మ యొక్క స్వరూపమును తెలియచేయునది. ఛాందోగ్యోపనిషత్తునందు, "సత్యమ్" అని పరమాత్మకు పేరగుటకు కారణమును ఇట్లు వివరించిరి. "సత్+తి+యమ్=సత్యమ్." 'సత్' అనగా ఆత్మ. ఎల్లప్పుడును మారక ఉండునది. 'తి' అనగా మారునది -- ప్రకృతి. ఈ రెంటిని కలిపి నియమించువాడు 'యమ్'. 'సత్యమ్' అనగా జీవుని ప్రకృతిని కలిపి నియమించువాడు. ఆతడే పరమాత్మ. అందుచే 'సత్యమ్' అనునది వాచకముగా కలవాడు. సత్యవాక్యుడు-- పరమాత్మ.

6. దృఢవ్రతః :-

బాహ్యార్థము :-

తాను పట్టిన వ్రతమును దృఢముగ పాలించువాడు.

"నీ వాడనని అనిన వానికి అభయ మిచ్చుట నా వ్రతము" అని రాముడు విభీషణ శరణాగతిలో చెప్పెను.

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే;
అభయం సర్వభూతేభ్యో దదా మ్యేత ద్వ్రతం మమ."

(యుద్ధ.18-33)

"ఒక్కసారి ఇతరోపాయములను విడచి నీవాడనని యాచించినవారు ఎవ్వరైనను సరే - అభయ మొసంగుట నా వ్రతము" అని శరణాగతులకు అభయ మొసంగుట తనవ్రతముగా పేర్కొనెను. వ్రతము చెడినచో ఎట్లు ఆ వ్రతము పట్టినవారికి పాపమో అట్లే శరణాగతునికి అభయ మొసంగనిచో తనకే పాపమని రామునిభావన. అందుచే తనవారు తనను విడిచిపోయినను, తనవారందరు నశించినను, తన కనేకములగు అనర్థములు వచ్చినను, తన

ప్రాణమే పోయినను, శరణాగతులను వదలని దార్ఢ్యము కలవాడు రాముడు. అందుచే సుగ్రీవజాంబవదాదులు ఎందరు వలదనినను విభీషణుని తనవానినిగ చేసికొనెను. అట్లే దండకారణ్యమున ఋషులందరు యజ్ఞవిఘ్నకరులగు రాక్షసులను చంపి తమను కాపాడ వలసినదిగా ప్రార్థింపగ అట్లే యని మాటనిచ్చెను. సీతమ్మ రాక్షసులతో మన కేమి విరోధము? విరోధములేనిదే పగబట్టి హింసించుట తగదు-- అని నివారింపచూచెను. అపుడు రాముడు--

"అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే! సలక్ష్మణాం
న తు ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణే భ్యో విశేషతః"
(అర. 10-19)

"ప్రాణమువైనను వదలెదను లేదా ఆవశ్యకమయినచో లక్ష్మణునితో కూడ నిన్నైనను వదలెదను. కాని మాటనిచ్చి అందులో ముఖ్యముగ బ్రాహ్మణులకు చేసేదనని-- తిరుగలేను" అని పల్కెను. తన్నాశ్రయించినవారిని రక్షించుటలో రాముని వ్రతము ఇట్టిది.

ఆంతరార్థము :-- పరమాత్మను గూర్చి -- దృఢవ్రతః.

పరమాత్మ కూడ దృఢవ్రతుడే !

తన్నాశ్రయించినవారికి సంసార బంధమును ఛేదించి స్వస్వరూపమును కలిగించి అభయమును అనగా మోక్షమును ప్రసాదించుటలో పరమాత్మ దృఢ వ్రతము కలవాడు. ప్రళయకాలమున అచేతన పదార్థముతో సమానముగా ఉన్న జీవునికి ఇంద్రియములతో, మనస్సుతో, బుద్ధితో కూడిన శరీరము నిచ్చి, ఆ శరీరమును ఎట్లు వినియోగించుకొని పరమాత్మను చేరవలెనో తెలుపుటకు వేదములను శాస్త్రములను ప్రసాదించి, వానిని వినియోగించుకొనలేక చెడిపోవు వారిని ఉద్ధరించుటకు తానే నానా రూపములతో అవతరించి, మహాపురుషుల నవతరింపచేసి, ఎంతో పట్టుదలతో తరింపచేయ ప్రయత్నించును. కావున జీవులను తరింపచేయుటకు పరమాత్మ దృఢవ్రతుడు.

7. చారిత్రేణ చ కో యుక్తః ?

బాహ్యార్థము :-

మంచినడువడి కలవాడు ఎవడు?

జ్ఞానము కంటె నడువడి ఆవశ్యకము. నడువడిచేతనే పురుషుని యొక్క స్వభావము తెలియును. నడువడిలేనివానిని చూచి లోకము భయపడును.

అంత ఆవశ్యకము కనుకనే శ్రీరాముడు నడువడిని విడువక ఆదరించెను.

చిత్రకూటమునకు భరతునితో కలసి వెళ్లిన జాబాలి నాస్తిక వాదమును ఉపన్యసించును. తండ్రిమాటను పాలించుటకై అడవిలో నుండుట తగదని చెప్పుచు తండ్రి ఎవరు? తల్లి ఎవరు? ఇచట మనము చేసిన పనులచేతను, పెట్టిన శ్రాద్ధములచేతను తల్లిదండ్రులకు సంతుష్టి కలుగుట కేవలకల్పన. అందుచే నీవు రాజ్యమును హాయిగా పాలించుమని చెప్పెను. దానిని విని శ్రీరాముడు చారిత్రము యొక్క ఆవశ్యకతను వివరించెను.

"కులీన మకులీనం వా శుచిం వా యది వాశుచిం
చారిత్ర మేవ వ్యాఖ్యాతి వీరం పురుషమానినం"

(అయో.109-4)

**"ఉత్తమకులములో జన్మించుట, లేదా హీనకులములో జన్మించుట, పవిత్రుడగుట, లేదా అపవిత్రుడగుట, వీరుడుగా నుండుట, లేదా డాంబికముగ వీరుడనని పలుకుట అనువానిలో ఏది ఎవనియందు ఉన్నదో తెలిసికొనవలెనన్న వాని చారిత్రమే వ్యాఖ్యానమై తెలియుచేయును."**

**మనుష్యుని స్వభావమునకు చారిత్రము వ్యాఖ్యానము. కఠినమయ్యిన శ్లోకముయొక్క అర్థమును వ్యాఖ్యానముచే గ్రహింప వీలగును. అట్లే ఈతడు యోగ్యమైన కులమునకు చెందినవాడో? కాదో? అని తెలిసికొనవలెనన్న యోగ్యతాపత్రములు కావు- నిర్ణయించునవి. వాని నడువడియే నిర్ణయించునది. ఇట్లే శౌచము అనగా పవిత్రత ధనము విషయములో లోభపడకుండ నిలచుట అన్ని శౌచములకంటె గొప్పశౌచము. "యోర్థే శుచి స్స హి శుచిః" ధనమునందు ఎవడు పరిశుద్ధుడో వాడు పరిశుద్ధుడు అని మనుస్మృతి. ఇట్టి పరిశుద్ధి తన కున్నదని తాను చెప్పికొనినను ఇతరులు చెప్పినను నమ్మదగినది కాదు. దానిని నడువడిచేతనే నిరూపించవలెను. ఇట్లే వీరుడా? వీరుడనని ప్రగల్భము కొట్టుకొనువాడా? అనునది తెలియుటకు కూడ వానినడువడియే ముఖ్యము. అందుచే "నేను రాజ్యమునందు లోభములేనివాడను సత్య వాక్యమునకు నిలబడువాడను" అని తెలుపుటకు "చారిత్రమును విడువరాదు," అని శ్రీరాముడు చారిత్రము యొక్క ప్రాముఖ్యమును వివరించెను. తాను నడువడిని తప్పక పాటించెను.**

ఆంతరార్థము :- పరమాత్మనుగూర్చి - చారిత్రేణ చ కో యుక్తః ?

పరమాత్మ కూడ చారిత్రము కలవాడే!

చారిత్రమనగా నడువడి. సృష్టికి ముందు కదలిక ఉన్నదా? లేక, లేదా? అప్పట్లున్న పరమాత్మ స్థూలమగు జగద్రూపమున పొగుటయే నడువడి. సృష్టికి ముందును, సృష్టికి తరువాతను ఒకే తత్త్వముండును. సృష్టికి ముందు కదలికలేని జీవప్రకృతులతో చేరియుండును. అదే తత్త్వము, సృష్టికి తరువాత మార్పు చెందిన జీవ ప్రకృతులతో చేరియుండును. అదే తత్త్వము సృష్టికి తరువాత మార్పు చెందిన జీవ ప్రకృతుల కదలికచే కదలినట్లు ఉండును. ఇదే పరమాత్మ యొక్క చారిత్రము. సృష్టికి ముందు సూక్ష్మరూపమున ఉన్న చేతనాచేతనములు అను తన శరీరమును కదలించి జగద్రూపమున స్థూలముగ కదలినవాడు ఎవడు? అని పరమాత్మను గూర్చి ప్రశ్నించెను.

8. సర్వభూతేషు కో హితః! :

బాహ్యార్థము :-

సర్వభూతముల మేలును కోరువాడును, ఆచరించువాడును ఎవడు?

శ్రీరాముడే అట్టి వ్యక్తి. బంధువులకును ఆప్తులకును మేలు కలుగ వలెనని, అందరును కోరుదురు కాని, మనుష్యులందరి యొక్క మేలును కోరి, వారికి మేలు కలుగునట్లు మాటాడి, వారికి ఆపదలు కలుగునపుడు దుఃఖపడెడివాడు, శ్రీరాముడు ఒక్కడే! అయోధ్యా ప్రజలు రాముని యొక్క గుణములను కీర్తించుచు ఇట్లు చెప్పుదురు.

"వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః
ఉత్సవేషు చ సర్వేషు పితేవ పరితుష్యతి." (అయో.2-40)

"పట్టణములో మనుష్యున కెవరికైనను ఆపదలు కలిగినచో ఆపదలు కలిగినవారికంటెను ఎక్కువగా రాముడు దుఃఖించెను. వారికి ఏవైన ఆనంద జనకములగు సంపదలు లభించిన, తండ్రివలె సంతోషించును."

ఈ శ్లోకములో రాముని సర్వభూతహితత్వము సూచింపబడినది. వీరు వారు అనుభేదము లేక మనుష్యులలో ఎవరికి ఎట్టి ఆపదకలిగినను పెద్దది, చిన్నది అను తారతమ్యము లేకుండ వారికన్న ఎక్కువగా రాముడు దుఃఖిం

చునట. ఆపద కలిగిన వారు ఆపద తీరగనే దుఃఖమును విస్మరింతురు. కాని రాముడు మాత్రము దుఃఖించుచునే యుండునట. దీనికి కారణము, వారికి మేలును కలిగించుట తన బాధ్యత యని భావించుటయే! కాపాడవలసిన తల్లి ప్రక్కనుండగా ఏమియు తెలియని పసిపాప ప్రాకుచు పోయి నూతిలోపడినది. తల్లి దానితో పాటు ఉరికి పిల్లను బైటకు తీసినది. పిల్లకు ఆపద తీరినది, నవ్వుచున్నది, కాని తల్లి మాత్రము దుఃఖించుచునే యున్నది. కారణము బాధ్యతగల తాను పరాకుగా నుండి బిడ్డ నూతిలో పడునట్లు చేసితినే యని ఆమె ఆ దుఃఖమును మరువలేదు. అట్లే రాముడు కూడ అందరకు మేలు కలిగింపవలసిన తాను పరాకుగా నుండుటచేతనే గదా? వారికి ఆపద కలిగినదని దుఃఖించును. ఇతడు మనుష్యుల యొక్క హితమునే కోరువాడు కాడు, సర్వభూతములయొక్క హితమును కోరువాడు. అందుచేతనే రావణునిచే దెబ్బ తిని రెక్కలు విరిగి నేలపై కూలి ప్రాణము పోవుటకు సిద్ధముగానున్న జటాయువును చూచి-

"రాజ్యా ద్భ్రంశః వనే వాసః సీతా నష్టా హతో ద్విజః
ఈ దృశీయం మమాలక్ష్మీః నిర్దహే దపి పావకమ్"

(అర. 68-24)

"రాజ్యము పోయినది. వనవాసము లభించినది. సీత కనబడకుండ పోయినది. ఈ పక్షి చనిపోయినది. ఇదంతయు నా దురదృష్టము. ఇది అగ్నిహోత్రమును కూడ కాల్చివేయగలదు." అని ఆ పక్షి చని పోవుటకు కూడ తన దురదృష్టమే కారణమని శోకించును. చనిపోయిన తరువాత ఆ పక్షికి స్వయముగ తానే దహన సంస్కారము చేయును. ఇట్లు రాముడు సర్వభూతహితుడు.

అంతరార్థము :- పరమాత్మను గూర్చి-- సర్వభూతేషుకో హితః?

పరమాత్మ కూడ సర్వభూతహితుడే!

హితుడనగా ఉపాయమైనవాడు. పరమాత్మను పొందుటకు పరమాత్మయే ఉపాయమని కఠోపనిషత్తును, ముండకోపనిషత్తును ప్రతిపాదించుచున్నవి.

"నాయమాత్మా ప్రవచనేనలభ్యః న మేధయా న బహునా శ్రుతేన యమేవైషవృణుతే తేనలభ్యః తస్యైషఆత్మా వివృణుతే తనూం స్వామ్"

"పరమాత్మ శ్రవణముచేగాని, మననముచేగాని, ధ్యానముచేగాని లభింపదు. పరమాత్మ ఎవరిని వరించునో వారికే తన స్వరూపమును దర్శింపచేయును. మనము చేయు కర్మగాని, జ్ఞానముగాని, భక్తిగాని భగవత్ ప్రాప్తికి సాధనములు కావు. భగవానుడే సాధనము.

"సర్వధర్మాపరిత్యజ్య మా మేకం శరణం వ్రజ" (గీత.18-66)

అని శ్రీకృష్ణభగవానుడు చెప్పెను. కావున సర్వభూతములకు హితుడు పరమాత్మయే!

9. విద్వాన్ :

బాహ్యార్థము :-

విద్వాంసుడు ఎవడు?

విద్వాంసుడు శ్రీరాముడు. సర్వశాస్త్రములయొక్క తత్త్వము నెఱింగినవాడు. వేదవేదాంగములయందు పరినిష్ఠితుడు. ధనుర్వేద మందు సుశిక్షితుడు, మంత్రమునందు, రహస్య సమాచార సేకరణమందు, నీతిశాస్త్రమందు, వ్యూహ రచనములయందు బాగుగ నేర్పుగలవాడు. గజస్కంధమునందు, అశ్వపృష్ఠమునందు ఆరితేరినవాడు. ఇట్లు సర్వ విద్యలయందు పాండిత్యము గలవాడు శ్రీరాముడు.

ఆంతరార్థము :- పరమాత్మను గూర్చి -- విద్వాన్.

పరమాత్మ కూడ విద్వాంసుడే!

"యః సర్వజ్ఞః సర్వవిత్" అని ఉపనిషత్తు పరమాత్మ సర్వమును, సమిష్టిగను, వ్యష్టిగను కూడ ఎఱిగినవాడని చెప్పుచున్నది. ఆ జ్ఞానము సంపాదించుకొనినది కాదు, సహజము అని "స్వాభావికీ జ్ఞాన, బల క్రియాచ" అని ఉపనిషత్తు చెప్పుచున్నది. ఈ జ్ఞానము కూడ ఇంద్రియాధీనముకాదు. "పశ్య త్యచక్షుః సశ్రుణోత్యకర్ణః" "కన్ను లేకుండ చూచును. చెవి లేకుండ వినును." అని ఉపనిషత్తు చెప్పుచున్నది. సర్వజగత్ సృష్టికి

అవశ్యకమగు జ్ఞానము కలవాడు పరమాత్మ!

10. సమర్థః :

బాహ్యార్థము :--

సామర్థ్యము కలవాడు ఎవడు?

కేవలము శాస్త్రజ్ఞానము ఉన్నంత మాత్రమున ప్రయోజనము లేదు. కార్య రూపమున ఆచరించుటలో సామర్థ్యము ఉండవలెను. శ్రీరాముడు, చదివిన విషయములను ఇతరులతో చర్చించుటలో సమర్థుడు. శీలవృద్ధులు, జ్ఞానవృద్ధులు, వయో వృద్ధులు కూడ శాస్త్రవిషయములను శ్రీరామునితో చర్చించుచుండెడివారు. రాజ్య నిర్వహణమున రాజనీతిశాస్త్ర పరిజ్ఞానమును వినియోగించగల సమర్థుడు. అస్త్రవిద్య యుద్ధభూమియందు వినియోగించగల సమర్థుడు. అందుచే శ్రీరాముడు సమర్థుడు.

ఆంతరార్థము :-- పరమాత్మనుగూర్చి :- సమర్థః :--

పరమాత్మ కూడ సమర్థుడే !

సర్వజ్ఞుడై సర్వజగత్తును సృష్టించుటకు సామర్థ్యము ఆవశ్యకము. అదే శక్తి. "పరాస్య శక్తి ర్వివిధా చ దృశ్యతే స్వాభావికీ జ్ఞాన బలక్రియాచ" అని సర్వజగన్నిర్మాణమును సంకల్పమాత్రముచే చేయగల సమర్థుడు. సృష్టించిన ప్రతిపదార్థములోను పరమ మహత్పరమాణుడగు తాను అణువగు జీవునికంటె అణువై వ్యాపించును. కర్మల నెరింగి కర్మానుగుణమగు శరీరమును ప్రసాదించి కర్మానుగుణమగు ఫలము నీయ సమర్థుడు.

11. ఏక ప్రియదర్శనః :

బాహ్యార్థము :-

ఎల్లప్పుడు ఒకే విధముగ ప్రియమైన దర్శనము కలవాడు ఎవడు?

ప్రియమైన దర్శనము కలవాడు రాముడొక్కడే ! ఇతరులను చూచి నప్పుడు చూచినవారికి ఒకప్పుడు ప్రీతి, ఒకప్పుడు అప్రీతి కలుగుచుండును. కాని, రాముడట్లుకాదు. చూచిన వారికి ప్రీతియేకలుగును. శత్రువులకైనను, మిత్రులకైనను, స్త్రీలకైనను, పురుషులకైనను, జ్ఞానులకైనను, అజ్ఞానులకైనను, శ్రీరాముని దర్శనము ప్రీతినే కలిగించుచుండును. రాముని చూచి, అడ

విలో నున్న క్రూర మృగములు కూడ ప్రీతిని పొంది తమ దుష్టతను వీడి యుండెడివి. రాముని దర్శనముచే ప్రీతిని, దర్శనము లేకపోవుటచే అప్రీతిని, వృక్షములు, నదులు కూడ పొందినవి. రాముని చూచి, ప్రేమించి తిరస్కరింపబడి, లక్ష్మణునిచే ముక్కు, చెవి కోయబడి ఖరుని వద్దకు వెళ్ళిన శూర్పణఖ---

"తరుణౌ రూప సంపన్నౌ, సుకుమారౌ మహాబలౌ

పుండరీక విశాలాక్షౌ చీర కృష్ణాజినాంబరౌ" (అర. 19-4)

అని వారి రూపమును ప్రశంసించెను. వాలిని చంపిన రాముని నిందింపవలెనని వచ్చిన తార "సా తం సమాసాద్యవిశుద్ధ సత్వా" (కిష్కి.24-30) ఆ రాముని చూడగనే సత్వగుణము ఆవిర్భవించినదియై రాముని దర్శనమున ప్రీతి నొంది--

"త్వ మ ప్రమేయశ్చ దురాసదశ్చజితేంద్రియశ్చోత్తమధార్మికశ్చ

అక్షయ్య కీర్తిశ్చ విచక్షణశ్చక్షితిక్షమావాన్ క్షతజోపమాక్షః"

(కిష్కి.24-31)

అని స్తోత్రము చేసెనే కాని దూషించ లేకపోయెను. రావణుడు కూడ తన పరాక్రమముచే శ్రీరాముని రంజింపచేయుటయే గొప్ప యని భావించును కాని, అన్యథా భావింపలేదు. ఇంక ప్రేమగల దశరథాదులు రామునిజూచి ప్రీతి నొందుటలో ఆశ్చర్య మేమున్నది? మన్మథ మన్మథుడు-పురుషులకు కూడ మోహము కల్గించువాడు. చంద్రునివలె ప్రియదర్శనుడు- అగు రాముడు ఎల్లవేళల, ఎల్లరకు ప్రియమైన దర్శనముకలవాడు.

అంతరార్థము :- పరమాత్మనుగూర్చి :- ఏకప్రియదర్శనః :--

పరమాత్మ కూడ ఏకప్రియదర్శనుడే!

ఎల్లవేళల అందరకు ఆనందమును కల్గించు దర్శనము కలవాడు పరమాత్మయే! ఈ లోకములో అన్ని వస్తువులును సత్వము, రజస్సు, తమస్సు అను మూడు గుణములు కల ప్రకృతిచే నిర్మింపబడినవి. అందు సత్వము సుఖమును కలిగించునది. రజస్సు దుఃఖమును కలిగించునది. తమస్సు శోకమును కలిగించునది. అందుచే లోకములో ఏ వస్తువైనను ఒకప్పుడు సుఖమును కలి

గించునది, వేరొకప్పుడు దుఃఖమును కల్గించుచుండును. పరమాత్మ మాత్రము శుద్ధసత్త్వమయుడై ఆనంద స్వరూపుడై యుండును. అందుచే ఎల్లవేళల ఎల్లరకు పరమాత్మ దర్శనము ఆనందమునే కలిగించున దగుటచే ప్రియమై యుండును. అందుచే పరమాత్మ ఏకప్రియదర్శనుడు.

12. ఆత్మవాన్ :

బాహ్యార్థము :-

ప్రశస్తమైన మనస్సుకలవాడు ఎవడు? ధైర్యము కలవాడు ఎవడు?

ఆత్మయను పదమునకు మనస్సు, ధైర్యము అనికూడ అర్థము కలదు. ప్రశస్తమైన మనస్సుకలవా డగుటచేతనే ఎవరు ఎంత అపకారము చేసినను క్షమింపగలిగినవాడు శ్రీరాముడు. పట్టాభిషేకము సిద్ధమయినది. దశరథుని యాజ్ఞచే, వసిష్ఠుడు సీతారాములకు దీక్ష నొసంగెను. పట్టాభిషేక సామగ్రి సిద్ధమైనది. కైక సుమంత్రునిచే పిలిపించినది. పట్టాభిషేకము లేదు. అడవులకు ఏగుమని చెప్పినది. వెళ్ళునప్పుడు కొద్దిసేపటిలో పట్టాభిషేకము తన కగునని భావించుచు రాముడు వెళ్ళెను. వచ్చునప్పుడు తాను రాజు కాదు అని తెలిపినది. కాని, వచ్చునప్పుడు రాముని ముఖములో మార్పులేదు. ఇది అతని మనస్థ్సితి. అంతేకాదు. తాను ద్వేషించవలసిన కైకను తాను దూషించక పోవుటయే కాక, లక్ష్మణుడు, భరతుడు మొదలగువారు ఎవరు దూషించినను వలదని వారించిన క్షమాశాలి శ్రీరాముడు.

అంతరార్థము :- పరమాత్మను గూర్చి :- ఆత్మవాన్:-

పరమాత్మయు ఆత్మవంతుడే!

ఆత్మలు తనవిగా కలవాడు. జీవులందరు పరమాత్మకే చెందినవారు. అనగా శేషభూతులు. పరమాత్మయందే ఆధారపడియుండి వానియొక్క అతిశ యమునకు వినియోగపడ తగినవారు. ఆత్మకు శరీరము ఎట్లు శేషభూతమై యుండునో పరమాత్మకు ఈ ఆత్మలు కూడ అట్లు శేషభూతములే! శరీరము ఆత్మకు వినియోగించుటకు ఎట్లు ఉపయోగపడునో అట్లే ఆత్మలు పరమాత్మకు యథేష్టముగ వినియోగించుకొనదగినవై యుండును.

13. జితక్రోధః :-

బాహ్యార్థము :-

క్రోధమును జయించినవాడు ఎవడు?

మానవత్వమునకు ఇది ముఖ్యలక్షణము. క్రోధము కలుగుటకు తగిన సన్నివేశము ఉన్నను, క్రోధము రాకుండ జయించినవాడే మానవుడు. శ్రీరాముడు క్రోధము లేనివాడు కాదు. క్రోధమును జయించినవాడు. అందుచేతనే రామునకు క్రోధము వచ్చినప్పుడు, రామాయణమున "క్రోధమాహారయత్" క్రోధము తెచ్చుకొనెను! అనును కాని క్రోధము వచ్చెను అనడు. క్రోధము తెచ్చుకొనవలెను. క్రోధము తనవశమునందు వుండవలెను. కాని క్రోధమునకు తాను వశుడు కాకూడదు. అందుచేతనే శ్రీరామునకు కోపము రాదగిన సన్నివేశము కూడ ఒడలు తెలియని కోపమును తెప్పించలేదు. సుగ్రీవునిపై కోపము వచ్చినప్పుడుకూడ ఔచిత్యము చెడకుండ కబురంపెను. కాని ఆవేశముతో మాటాడలేదు.

"న చ సంకుచితః పంథాః యేన వాలీ హతో గతః"
(కిష్కి.30-81)

"వాలి వెళ్ళిన దారి యింకను మూత పడలేదు" అని చెప్పమనెను. పట్టరానికోపము వచ్చునప్పుడు కూడ కోపము తనవశములో నుండుటచే పలుకులో మార్దవము తగ్గదు. ఇట్లు రామాయణమంతయు రాముడు జితక్రోధుడుగనే కన్పట్టును. కాని రావణునితో యుద్ధము చేయుచున్నప్పుడు రామునికి వాహనముగానున్న ఆంజనేయునికి దెబ్బలు బాగా తగిలి రక్తము కారుచుండెను అప్పుడు—

"రావణేః వక్షతవ్రణం దృష్ట్వా ప్లవగ శార్దూలం కోపస్యవశమేయివాన్"

రావణునిచే గాయపరచబడిన హనుమనుచూచి రాముడు కోపమునకు వశమాయెను. తనకెన్ని కష్టములు వచ్చినను కోపము రానివానికి, ఆంజనేయునికి దెబ్బలు తగులునపుడు మాత్రము ఆపుకొనలేని కోపము వచ్చెను.

అంతరార్థము :- పరమాత్మనుగూర్చి :- జితక్రోధః :-

పరమాత్మకూడ జితక్రోధుడే!

ఈ జీవులు పరమాత్మవలననే సత్తనుపొంది తనస్థితికి, గతికి, ప్రవృత్తికి కూడ కారణమయినవానిని ఎదిరించి దూషించును. అనంతములగు భగవదపచారములను చేయుచుండును. అట్టివానిపై పరమాత్మ కోపము తెచ్చుకొనడు. వానిని అనుసరించి ఎటులైనను రక్షింపవలెనని చూచుచుండును. ధూర్తుడైన కుమారుడు తండ్రితో విరోధించి ఒక సత్రమున చేరి అచట అధికారిని ఆశ్రయించి జీవించుచుండును. తండ్రి కుమారుని వదలలేక ఆ కుమారునికి కనబడకుండ సత్రపు అధికారిని చేరి, వానికి డబ్బునిచ్చి కుమారునకు భోజనము పెట్టించుచుండును. కుమారుడు తండ్రి పెట్టించుచున్నాడని తెలియక అధికారికి విధేయుడై తండ్రిని ద్వేషించుచుండును. ద్వేషించుచుండినను, తండ్రి వదలలేదు. అట్లే భగవానుడుకూడ, కోపము తెచ్చుకొనక ఎన్ని అపరాధములు చేసినను మనను రక్షింప యత్నించుచుండును. అందుచే భగవానుడు జితక్రోధుడు.

## 14. ద్యుతిమాన్ :-

బాహ్యార్థము :-

కాంతిగలవాడు ఎవడు?

శ్రీరాముని కాంతి చంద్రుని వెన్నెలవలె లోకమునకు ఆహ్లాదజనక మయినది, సామాన్యులకుకాదు. దండకారణ్యములో ఋషులు

"రూపసంహననం లక్ష్మీం సౌకుమార్యం సువేషతాం
దదృశుర్వి స్మితాకారాః రామస్య వనవాసినః" (అర.1-13)

రామచంద్రుని దివ్యమంగళ విగ్రహమును, కాంతిని, సౌకుమార్యమును మనోహరవేషమును చూచి విస్మయముతో నిలచి దృష్టిదోషము తగులునేమో యని మంగళము పాడిరట. రాముని లావణ్యమును, కాంతినిచూచి విశ్వామిత్రుడు, జనకుడు మున్నగువారుకూడ ముగ్ధులై మంగళమును పలికిరి. తొడపై పండుకొని నిద్రించుచున్న రాముని శోభను చూచి సీతమ్మ, "శ్రీమాన్ సుఖసుప్తః" అని మేల్కొలుపుటకు ఎంతో బాధపడెను. ఇట్లు శ్రీరాముడు దివ్యకాంతి విరాజితుడు.

అంతరార్థము :- పరమాత్మనుగూర్చి :- ద్యుతిమాన్:-

పరమాత్మకూడ ద్యుతిమంతుడే!

"పరంజ్యోతిః" అని పరమాత్మ యొక్క స్వరూపమును ఉపనిషత్తు వర్ణించినది.

"తస్య భాసా సర్వ మిదం విభాతి"

ఆ పరమాత్మ వసించు స్థానమున సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు మెరుపులు మున్నగు నేవియు ప్రకాశింపవు. ఈ లోకములో కాంతి నొసంగునవి అన్నియు ఆ పరమాత్మ యొక్క కాంతిచేతనే ప్రకాశించుచున్నవి. అందుచే పరమాత్మ ద్యుతిమంతుడు.

15. అనసూయకః :

బాహ్యార్థము :-

అసూయలేనివాడు ఎవడు?

గుణములను దోషములుగా ఎత్తిచూపుట అసూయ. ఈ అసూయ లేనివాడు శ్రీరాముడు. గుణములను దోషములుగా చూపకపోవుటయే కాదు, దోషములనుకూడ గుణములుగ భావించువాడు శ్రీరాముడు. అడవికి వెళ్ళుమనిన తండ్రియందు కాని, ప్రేరేపించిన కైకయందుకాని ఒక్క దోషముకూడ తలంపనివాడు శ్రీరాముడు.

ఆంతరార్థము :- పరమాత్మనుగూర్చి :- అనసూయకః :-

పరమాత్మకూడ అసూయ లేనివాడే!

మన దోషములలో గుణములను ఏరుకొని మనను రక్షించును. భగవానునికి విముఖుడై యున్న జీవుడు చేయుచున్న పనులలో సుకృతముగ పేర్కొనదగినవానిని తానే ఏరుకొని వారిని కాపాడును. చెడ్డపనులే తప్ప మంచిపనులు చేయుట అలవాటు లేని జీవుని రక్షించుట యెట్లని భగవానుడు అన్వేషించుచుండును.

మూడు రకములైన సుకృతములను పరమాత్మ చూచి రక్షించునట.

(1) ఆనుషంగిక సుకృతము

(2) ప్రాసంగిక సుకృతము

(3) యాదృచ్ఛిక సుకృతము.

1. ఆనుషంగిక సుకృతము :-

అనుకోనకుండగ వచ్చిన పుణ్యము. దూడ తప్పిపోవగ వెతుకుటకు ఆల యమునకు వెళ్ళి, దానివెంట పరుగిడుచు మూడుసార్లు ప్రదక్షిణము చేయుట. ఇది వాడు పుణ్యముగా చేయడు. కాని పుణ్యమైన పని జరిగినది. దానిని భగవానుడు లెక్కలోనికి తీసికొనును.

2. ప్రాసంగిక సుకృతము :-

మాటలలో శ్రీరంగము, వేంకటాచలము మున్నగు పేర్లను అనుకొన కుండ వేరొకపనిమీద పలికినను పుణ్యస్థలముల కీర్తించిన సుకృతము క్రింద, భగవానుడు లెక్కపెట్టికొనును. ఇది ప్రాసంగిక సుకృతము.

3. యాదృచ్ఛిక సుకృతము :-

తన వస్తువులను తాను కాపాడుకొనుటకు కూర్చొనియుండగా భగవత్ భక్తులయొక్క వస్తువులుకూడ కాపాడబడినచో అది యాదృచ్ఛిక సుకృతము.

ఇట్లు మూడు సుకృతములను చూచి పరమాత్మ రక్షించెడి ఉదారుడు. దోషములలోకూడ గుణములనే చూచెడి అనసూయకుడు పరమాత్మ.

16. కస్య బిభ్యతి దేవా శ్చ జాతరోషస్య సంయుగే :-

బాహ్యార్థము :-

యుద్ధములో కోపము వచ్చినచో దేవతలుకూడ ఎవనికి భయపడుదురో అతడెవడు?

వెనుక కోపమును జయించినవాడు ఎవడు? అని ప్రశ్నించెను. ఇపుడు కోపము వచ్చినచో దేవతలకు కూడ భయమును గొల్పు కోపము గలవాడు ఎవడని ప్రశ్నించుచున్నాడు.

దీనిచే మానవుడు కోపములేనివాడు కాకూడదు. తగనిచోట కోపము రాకూడదు. వచ్చినపుడు కోపము తన వశమందు ఉండవలెను. యుద్ధభూమిలో తన శత్రువును చూచి రాముడు కోపము తెచ్చుకొనునపుడు అతనికి కోపములేదని తెలియు దేవతలు గూడ నిజముగ కోపము వచ్చినదేమోయని భయపడి దూరముగా తొలగుదురు. ఇది శ్రీరాముని కోపవిధానము.

ఆంతరార్థము :- పరమాత్మనుగూర్చి :- కస్య..................సంయుగే :-

పరమాత్మయొక్క కోపమునకు కూడ దేవతలు భయపడి, తమ తమ పనులను చేయుచుందురని ఉపనిషత్తు చెప్పుచున్నది.

"భీషాస్మా ద్వాతః పవతే, భీషోదేతి సూర్యః
భీషాస్మాదగ్ని శ్చేంద్ర శ్చ, మృత్యు ర్ధావతి పంచమ ఇతి."

"వాయువు పరమాత్మ భయమువలననే వీచుచున్నది. పరమాత్మ భయముపలననే సూర్యుడు ఉదయించుచున్నాడు. పరమాత్మ భయమువలననే ఇంద్రుడు, అగ్ని కూడ తమతమ పనులను చేయుచున్నారు. చివరకు మృత్యువు కూడ ఆ పరమాత్మ భయమువలననే పరుగిడుచున్నది." ఇట్లు పరమాత్మ కోపమునకు దేవతలుకూడ భయపడుదురు.

ఈ విధముగ వాల్మీకి నారదుని ప్రశ్నించిన ఈ పదునారు గుణములలో బాహ్యముగ నరునిగూర్చి, ఆంతరముగ పరమాత్మను గూర్చి ప్రశ్నించుట యున్నదని ఎరుంగవలెను. నారదుడు దానికి తగినట్లుగనే సమాధానమొసంగెను. అందుచే రామాయణ మంతయు బాహ్యముగ నరుడగు రామునిగూర్చి ఆంతరముగ బ్రహ్మమును గూర్చియు ప్రవర్తించినదని చెప్పుటలో సంశయము అక్కరలేదు.

వాల్మీకియొక్క ప్రశ్నకు సమాధానముగ నారదుడు రామకథనంతను ఉపదేశించెను. ఇదియే సంక్షేపరామాయణము. ఇది శ్రీరామాయణములోని మొదటిసర్గ. ఈ సర్గను పారాయణము చేసినచో రామాయణము పూర్తిగ పారాయణచేసిన ఫలితము సిద్ధించును.

రామాయణము గాయత్రీ మంత్రమును ప్రతిపాదించునని నిరూపించుటకు నారదుడు ఉపదేశించిన ఈ బాలరామాయణము గాయత్రీ మంత్రము యొక్క మొదటి అక్షరముతో ప్రారంభమై చివరి అక్షరముతో సమాప్తము అగును. "తపస్స్వాధ్యాయనిరతం" అనుచోట 'త' కారము గాయత్రీమంత్రము యొక్క ఆద్యక్షరము. ఈ సర్గ చివరి శ్లోకము, "జనశ్చ శూద్రోపి మహత్త్వ మీయాత్" దానిలోని 'యాత్' అను అక్షరముతో అంతమగును. ఇది గాయత్రీ మంత్రము యొక్క చివరి అక్షరము. దీనిని చదువుటచే గాయత్రీమంత్రము చేసిన ఫలితము కలుగును.

## శ్రీరామాయణము — తత్త్వ వివరణము

వేదములు ఇతిహాసములు పురాణములు కూడ ఐదు విషయములను బోధించుచుండును.

"ప్రాప్యస్య బ్రహ్మణో రూపం, ప్రాప్తుశ్చ ప్రత్యగాత్మనః
ప్రాప్త్యుపాయం, ఫలం ప్రాప్తేః, తథా ప్రాప్తి విరోధి చ
వదంతి సకలా వేదాః సేతిహాసపురాణకాః"

మానవుడు భగవత్ ప్రాప్తికై జన్మించినాడు. ఈ జన్మ యొక్క లక్ష్యము భగవత్ ప్రాప్తి. దానికై ఎఱుంగవలసిన విషయముల ఐదింటిని సర్వవాఙ్మయము, సర్వమతములు బోధించుచుండును. ఆ అయిదింటికి అర్థపంచకమని పేరు. ప్రాప్తి ప్రధానము కావున దానికి చెందినవి ఐదు విషయములు కోరతగినవి. ప్రాప్తి అనగా పొందుట.

దానికి సంబంధించి :-

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రాప్యము | = | పొందబడునది, |
| 2. | ప్రాప్త | = | పొందువాడు, |
| 3. | ప్రాప్త్యుపాయము | = | పొందుటకు ఉపాయము, |
| 4. | ప్రాప్తిఫలము | = | పొందుటకు ఫలము, |
| 5. | ప్రాప్తివిరోధి | = | పొందుటకు ఆటంకము. |

అనువానిని ఎఱుంగవలెను. శ్రీరామాయణముకూడ ఆంతరార్థమున ఈ ఐదు విషయములను ప్రతిపాదించును.

### 1. ప్రాప్యుడు :-

పొందబడవలసినది పరబ్రహ్మము అని చెప్పబడు శ్రీమన్నారాయణుడే! ఆతడే సర్వజగద్రక్షకుడు. ఆ నారాయణుడే శ్రీరాముడై దేవతలకు, ఋషులకు, మానవులకు, వానరులకు, రాక్షసులకు, పల్లెవానికి, బోయవానికి, గద్దకు, కాకికికూడా అనిష్టమును తొలగించి ఇష్టమును కలుగజేసి రక్షించినవాడు. అందుచే ఆతడే ప్రాప్యుడని తెలియుచున్నది.

2. ప్రాప్త :-

పరమాత్మను పొందెడివాడు- జీవుడు. అతడు పరమాత్మకే చెంది నవాడు. పరమాత్మతో విడదీయరాని సంబంధము కలవాడు. పరమాత్మయే రక్షకుడుగా కలవాడు. పరమాత్మచే ఇష్టము వచ్చినట్లు తనకార్యములయందు వినియోగించుకొనదగినవాడు. పరమాత్మకే పరతంత్రుడు. పరమాత్మకు వలెనే పరమాత్మ భక్తులకు కూడ పరతంత్రుడు. ఈ లక్షణముల నన్నిటిని సీత, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు మొదలగు వారందరును నిరూపింతురు.

3. ప్రాప్త్యుపాయము :-

భగవానుని పొందుటకు ఉపాయము - యజ్ఞము, తపస్సు మున్నగు కర్మలు, జ్ఞానము, భక్తి అనునవి. వీనికంటె ప్రధానమయినది- శరణాగతి, ప్రపత్తి. ఇతరోపాయములను విడచి భగవానుడే ఉపాయమని దృఢముగ నమ్మియుండుట ప్రపత్తి. యోగ్యుడగు ఆచార్యుని ఆశ్రయించి యుండుటచే గూడ భగవత్ప్రాప్తి లభించును. దీనిని శరభంగుడు, అగస్త్యుడు, జటాయువు, విభీషణుడు, శబరి మున్నగువారు నిరూపించిరి,

4. ప్రాప్తి ఫలము :-

పొందుటకు ఫలము. భగవానునితో విడువడకుండ నిత్యము కలసి యుండి పరిచర్యలు, చేయుటయే అని లక్ష్మణ, భరత, శత్రుఘ్న, హనుమత్ సీతాదులు నిరూపించిరి.

5. ప్రాప్తి విరోధి :-

పొందుటకు ప్రతిబంధకము. సత్వ రజ స్తమో గుణములతో కూడియున్న ప్రకృతి వికారమగు శరీర సంబంధముచే కలిగిన అవివేకము. రావణ, విభీషణ, కుంభకర్ణులతో కూడిన లంకలో బంధింపబడుటయే, సీతమ్మ రాముని పొందుటకు ప్రతిబంధక మయినది కదా!

ఈ విధముగ ఎఱుంగదగిన ఐదు విషయములను శ్రీమద్రామాయణము ప్రతిపాదించును. దానినే కొంతవరకు తెలిపికొనయత్నింతము.

భగవానునితో విడువడి ఈ జీవుడు ఎన్నో జన్మలనెత్తి ఆ జన్మలలో చేసిన సుకృతమువలన మానవజన్మ నెత్తును. మానవ జన్మ సర్వోత్కృష్టము. మానవజన్మయే మనసును జయించి దివ్యత్వమును పొందుటకు సమర్థమైనది. అందుకై దానిని ఎట్లు ఉపయోగించుకొనవలెనో వివరించుటకై భగవానుడు తానే నరుడుగ జన్మించి రావణుని జయించి సీతనుపొంది పట్టాభిషిక్తుడ

య్యెను. భగవంతునికి దూరమై శరీరములో బంధింపబడుటకు కారణము మనస్సు.

**"మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః"**

"మనస్సే బంధములో పడుటకు, బంధమునుండి విడుటకు కూడ కారణము." ఆ మనస్సే రావణుడు. **"రావయతి-అసత్ప్రలాపాన్ కారయతి ఇతి రావణః"** చెడుపలుకులను పలికించువాడు రావణుడు, మనస్సే చెడు పలుకులను పలికించునది. అవి రెండు. ఆ రెండును రెండక్షరములు కలవి. ***"1. అహం 2. మమ"*** "నేను-నాది"అనునవి.

**"అనాత్మ న్యాత్మబుద్ధి ర్యా అస్వే స్వమితి యా మతిః**
**అవిద్యా తరుసంభూతి బీజ మేత ద్ద్విధా స్థితం"**

"తానుకాని శరీరమును తానని అహంకరించుట, పరమాత్మదే అయి తనది కాని వస్తుజాతమును తనది యనుకొనుట అను ఈ రెండే అజ్ఞానమను వృక్షమునకు మూలమగు విత్తనము." ఈ మనస్సు అను రావణునికి కూడ రావణునికి వలెనే పదిముఖములు కలవు. మనస్సు వెలుపలికి ప్రసరించుమార్గములే ఇంద్రియములు. అవి పది. జ్ఞానేంద్రియములు ఐదు, కర్మేంద్రియములు ఐదు. చర్మము, నేత్రము, చెవి, నాలుక, ముక్కు అనునవి జ్ఞానేంద్రియములు. వాక్కు, చేయి, పాదము, మలద్వారము, మూత్రద్వారము అనునవి కర్మేంద్రియములు. ఈ పది మనస్సునకు ముఖములు. అందుచేత మనస్సుకూడ దశాననుడు- దశముఖుడే! అతడు పరిపాలించునది లంక, మనసు పరిపాలించునది శరీరము. శరీరము సంసారమను సముద్రముచే చుట్టబడియుండును. లంక నూరుయోజనముల సముద్రముచే ఆవరింపబడియున్నది. రాజస, తామస, సాత్విక చిత్తవృత్తులే రావణ కుంభకర్ణ విభీషణులు. రాజసచిత్తవృత్తి రావణుడు. అది లంకను పాలించునపుడు రాముని భార్యయగు సీత లంకయందు బంధింపబడియుండును. రాజసచిత్తవృత్తి ప్రధానముగా నున్నప్పుడు అవివేక పూర్ణమైన మనస్సు రామునికే శేషభూతమైనదియు రామునిచేతనే రక్షింపబడదగినదియు రామునిచేతనే అనుభవింపబడదగినదియునగు ఆత్మను- సీతమ్మను లంకలో బంధించును.

పరమాత్మయే రాముడు, ఆనందము కలవాడు, ఆనందము నిచ్చువాడు, ఆనంద స్వరూపుడు అగు పరమాత్మయే రాముడుగా అవతరించును. రామ శబ్దమునకు అర్థమదియే. పరమాత్మ వసించు స్థానము - పరమపదము,

వైకుంఠము. దానికే అయోధ్య - అపరాజిత అని కూడ పేర్లు గలవు.

"దేవానాం పూ రయోధ్యా" అని వేదము చెప్పుచున్నది. ఆ రామునకు, జనకుని యజ్ఞ క్షేత్రములో దొరికిన సీత భార్యయగును. సీత జీవ స్వరూపమును నటించును. జన్మింపదు, దొరకును. "న జాయతే మ్రియతే వా, కదాచిత్" అని ఉపనిషత్తు చెప్పుచున్నది. జనకుని యజ్ఞక్షేత్రము కర్మక్షేత్రమగు శరీరము. ఆ శరీరములో అన్వేషించిన లభించునది- ఆత్మ. ఆ ఆత్మ భగవానునకే చెందినదై భగవానునికి భార్యయై యుండును. భార్యకు భర్తతో గల సంబంధము - జీవునకు పరమాత్మతో గల సంబంధము సమానము. ఆ సంబంధము ఆరు విధములుగా నుండును.

1. అనన్యార్హ శేషత్వము :- వానికే తప్ప యితరులకు చెందనిదై యుండుట.
2. అనన్య శరణత్వము :- వాడే తప్ప వేరొకడు రక్షకుడుగా లేకుండుట.
3. అనన్య భోగ్యత్వము :- వానిచేతనే తప్ప ఇతరులచేత అనుభవింపబడరానిదై యుండుట.
4. తత్ సంశ్లేషైక సుఖిత్వము :- వానితో కూడి యుండుటే సుఖముగ నుండుట.
5. తద్విశ్లేషైక దుఃఖిత్వము :- వాని యెడబాటే దుఃఖముగా నుండుట.
6. తదేకనిర్వాహ్యత్వము :- వానిచేతనే నడిపింపబడుట.

ఈ ఆరు లక్షణములు గల భార్యగా సీత రామునితో చేరినది. సీతా కల్యాణము, ఈ రహస్యమును వివరించును. జనకుడు సీతకు వివాహము చేయవలెనని ధనస్సును పణముగా పెట్టెను. ఆ ధనుస్సును ఎవ్వరును వంచలేకపోయిరి. విశ్వామిత్రునివెంట రామలక్ష్మణులు వచ్చిరి. రాముడా ధనుస్సును వంచెను. సీతను భార్యగా పొందెను. ఇచట పణముగా పెట్టిన ధనుస్సు ఉపనిషత్తులలో ప్రసిద్ధమగు ప్రణవము. ప్రణవ మనగా ఓంకారము.

"ప్రణవో ధనుః శరో హ్యాత్మా బ్రహ్మతల్లక్ష్య ముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవ త్తన్మయో భవేత్"

"ప్రణవ మనెడి ధనుస్సులో ఆత్మ యనెడి బాణమును సంధించి పరమాత్మను గురిచేసి వదలవలెను. అపుడు ఆత్మ పరమాత్మతో చేరి యుండిపోవును అని ముండకోపనిషత్తు చెప్పెను. ప్రణవము ఎవరికి వంగునో సీత వారికి

చెందును. ప్రణవము వంగుట అనగా ప్రణవము నామముగా కలిగియుండుట. నామమనగా పేరు. పేరు, పేరుకలవానివైపు వంగును. *"నమతీతి నామ"*, అట్లు ప్రణవము వాచకముగా కలవాడు పరమాత్మ. కావున ఓంకారము వానికే వంగును. రాముడు విల్లును వంచుట, ప్రణవమునకు అర్థము రాముడేయని ఎఱుంగవలెను.

ప్రణవము అ+ఉ+మ్ అని మూడక్షరములు.

'అ' కారము సర్వజగత్కారణము. సర్వజగద్రక్షకము అగు పరమాత్మను తెలియజేయునది.

'మ' కారము జీవుని తెలియజేయునది.

'ఉ' కారము వారిద్దరకు విడదీయరాని సంబంధము కలదని తెలియ చేయునది.

జీవుడు పరమాత్మకే చెందినవాడు అని ప్రణవమునకు అర్థము. ఈ అర్థమును మననము చేసి, ప్రణవమును జపము చేసిన, పరమాత్మతో నిత్య సంబంధము ఏర్పడును. ఇది సీతాకల్యాణమున తెలియును. ఇట్లు పరమాత్మతో నున్న జీవుడు భార్యవలె ఆరు సంబంధములు కలిగి పరమపదమునందైనను, సంసారమునందైనను, పరమాత్మతోనే విడదీయరానివాడై యుండును. అందుచే తనే సీతమ్మ, అయోధ్యలోను అరణ్యములోను రామునితోనే కలసియుండును. రావణాసురుడు లంకకు తీసికొనిపోయినపుడు కూడ.

*"అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యథా!"*
(సుంద.21-15).

"నేను రామునితో వేరైనదానను కాను. సూర్యునితో కాంతివలె కలసియే యుందును" అనును. ఇట్లు భగవానునితో జీవునికి గల సంబంధమును సీత నిరూపించును.

అట్లు పరమాత్మతో సర్వదేశ, సర్వకాల, సర్వావస్థలయందు కలసియుండి తన వాచిక, కాయిక, మానసిక వ్యాపారములను పరమాత్మకే అర్పించుట, పర మాత్మ కొఱకే చేయుచుండుట జీవునకు స్వభావమై యుండవలెనని లక్ష్మణుడు నిరూపించును. పరమాత్మకు పరతంత్రుడై యుండుటయే జీవలక్షణమని భర తుడు నిరూపించును. భరతునకు శత్రుఘ్నునివలె భగవద్భక్తులకు పరతంత్రుడై యుండుటయే జీవధర్మమని, శత్రుఘ్నుడు నిరూపించును. ఇట్లు బాల, అయోధ్య, అరణ్యకాండలలో సగమువరకు జీవ, పరమాత్మలకు గల సంబంధము

జీవ స్వభావము నిరూపింపబడినవి.

ఇట్లు నిత్య సంబంధముగల జీవుడు పరమాత్మ నుండి ఎట్లు విడువ డును? ఎందుకు విడువడును? మరల ఎట్లు కలియును? అను విషయములు మిగిలిన రామాయణమున నిరూపింపబడును. సీత మహాలక్ష్మి. ఆమె జగ న్మాత. రాముడు నరుడుగా అవతరించినట్లే ఆమె మనుష్య స్త్రీయై సీతగ అవతరించినది. పురుషులు ఆచరించవలసిన ధర్మములను రాముడు తానాచ రించి ప్రదర్శించెను. స్త్రీలు ఆచరించ వలసిన ధర్మములను సీత ఆచరించెను. సీత మాత యగుటచే లక్ష్మివలె జీవులను పరమాత్మతో చేర్చుటలో మధ్య వర్తినియై సహకరించుచుండును. జీవుల స్వరూపము నెరింగించుటకు తానే జీవభావమును నటించును. ఇట్లు బాహ్యార్థమున సీత ఆదర్శగృహిణి, పతివ్రత. అంతరార్థమున ఆమె శ్రీ మహాలక్ష్మిగ జీవునిచే సేవింపదగిన మహిషియై యుండును. జీవుని పరమాత్మతో చేర్పెడి ఘటకురాలై యుండును. జీవునివలె నటించును. అనాదిగ పరమాత్మతో కలసియున్న జీవుడు పరమాత్మకు దూరమై సంసార మధ్యమున శరీరములో బంధింపబడుటకు కారణము మాయ. ఆ మాయచే తాననుభవింపదగని దానిని అనుభవింపవలెనని కోరును. దానితో భగవానునికి దూరమగును. అయోధ్యలోను, దండకారణ్యములోను కూడ రాముని ఒక్క క్షణమైనను విడువక భోగములను అనుభవించుచు, ఆనందించు చున్న సీతకు బంగారు చుక్కలు గల మాయలేడిపై కోరిక కలిగెను. ఆ లేడిని పొందవలెనని రాముని ప్రార్థించి, రాముని దూరము చేసికొనెను. దూషించి లక్ష్మణుని దూరము చేసికొనెను. ఏకాకినియై యుండెను. రావణునిచే బంధింపబడెను. సీత లోకైకేశ్వరి. శ్రీరాముడు మోహనరూపుడు. సీత అంతటి వివేకము లేనిదా! రామునికంటె వేరొక వస్తువును భోగ్యముగ కోరుట ఏమి! ఇది అంతయు జీవుడు పరమాత్మ కెట్లు దూరమగునో చూపించుటకే! మారీచుడు మాయామృగమాయెను. మాయామృగ మారీచుని చూచి, సీత భ్రమించెను. మాయ అనగా అవిద్య, అజ్ఞానము. మృగ మరీచి యనగా ఎండమావి. ఎండవేళ గాలికెగురు ఇసుక రేణువులను చూచి దప్పిగొన్న లేడి త్రాగదగిన నీరు అనుకొని పరుగిడి మరణించును. అట్లే అనుభవింపదగని విష యములను చూచి అనుభవింపదగినవని భ్రమించి వానికై ప్రాకులాడి జీవుడు బంధమున పడును. ఆ మృగ మరీచియే (ఎండమావియే) ఈ మృగ మారీచుడు. ఇది మాయ. మాయ మూడు పనులను చేయును. (1) ఒక లాగున్న దానిని వేరొకలాగున కన్పింప చేయును. (2) దానిని అనుభవింపవలె నను బుద్ధిని కలిగించును. (3) భగవంతుని స్వరూపమును మరుగుపఱచును.

ఇచట కూడ మాయా మృగము మారీచునివలె కన్పించక లేడివలె కన్పించెను. సీతకు దాని ననుభవింపవలెనను కోరిక కలిగెను. రాముడు మరుగుపడెను. విషయములు బంగారమువలె మెరసి ఆకర్షించును. అవే లేడికి గల బంగారు చుక్కలు. ఇట్లు మాయచే విషయములు అనుభవింపవలెనను కోరిక కలుగును. దానిచే భగవంతుని జీవుడే దూరము చేసి కొనును. దూరము చేసికొనుట యనగా, భగవంతుని కంటె ఇతరములగు విషయములను కావలెనని కోరుట. -- ఇట్లే భగవత్ భక్తులను కూడ శంకించి, దూషించి, వారినికూడ దూరము చేసికొనును. దానిచే, రావణుడు చెరబట్టెను. ఆత్మ మనసునకు వశమగును. ఇట్లు జీవుని బంధమునకు జీవుడే కారణమని నిరూపించెను.

ఇట్లు విడువడిన జీవుడు మరల భగవంతునితో చేరుటకు కావలసినది ముముక్షుత్వము. అనగా విడువడవలెనను కోరిక కలిగియుండుట. ఆ కోరిక కొన్ని కోట్ల జీవులలో ఏ ఒక్కరికో కలుగును. మనుష్యత్వము ఎంతదుర్ల భమో, ముముక్షుత్వము అంతదుర్లభము. అట్టి జీవుని పొందుటకు పరమాత్మ విలపించును. అన్వేషించును. తానే ప్రయత్నించి పొందును. సీత రావణునిచే బంధింపబడినది మొదలు వాని ఐశ్వర్యమునుకాని ధనమునుకాని కాంక్షింపక వాని బంధము నుండి విడువడి రామునే పొందవలెనని కోరును. రాముడు ఆమెను పొందుటకు వెదకుచు శబరివద్దకు వచ్చును.

శబరి కథ రామాయణకథకు ఏ విధమయిన సంబందము లేనికథ. ఆమె మతంగముని శిష్యుల శిష్యురాలు. బోయది. కర్మాధికారము లేదు. జ్ఞానము లేదు. గురుశుశ్రూషయే ఆమెకు శరణ్యము. గురువునే నమ్మి గురువుమాట ప్రకారము రామలక్ష్మణులు తమ ఆశ్రమమునకు వత్తురని ఎదురుచూచుచుం డెను. రామలక్ష్మణులు అచటికి వచ్చిరి. శబరి మతంగాశ్రమమును చూపించి తమ గురువుల వైభవమును రామలక్ష్మణులకు చూపెను. వారి అనుజ్ఞతో యోగాగ్నిలో శరీరమును ఆహుతి చేసికొని దివ్యతేజముతో విమానముపై దివ్యలోకములకేగెను. దీనితో అరణ్యకాండ ముగియును.

అరణ్యకాండలో శ్రీరాముడు శరభంగుని, సుతీక్ష్ణుని, అగస్త్యుని దర్శిం చును. వారు మహాతపశ్శాలురు. జ్ఞానులు. కాని వారు కూడ రాముని దర్శనమునకై వేచియుండిరి. తమ సర్వస్వము రామునికే అర్పించి రామునే శరణనిరి. శరభంగుడు రాముని అనుగ్రహముతో అగ్నిలో శరీరమును ఆహుతి చేసికొని మోక్షమును పొందును. జటాయువు రామునియందు నిరతిశ యమయిన ప్రీతికలవాడు. ఆ ప్రేమతో సీతకై రావణునితో యుద్ధము చేసి

ప్రాణముల నర్పించి రాముని యనుగ్రహముచే మోక్షము పొందెను. శబరి గురుశుశ్రూష చేసి యజ్ఞము తపస్సు లేకుండ కేవలము గురుశుశ్రూష చేతనే మోక్షము పొందెను. దీనితో భగవత్ప్రాప్తికి ఉపాయములన్నిటికంటె ఆచార్య శుశ్రూషయే ముఖ్యము అని నిర్ణయమయినది. అరణ్యకాండ చివర శబరి వృత్తాంతముతో ఆత్మాన్వేషణములో ఉపాయము ఆచార్యుడే యని నిర్ణయింపబడినది.

ఆచార్యుడే హనుమ. హనుమద్దర్శనముతో కిష్కింధాకాండ ప్రారంభమయినది. హనుమానుని దూతగా వరించి సుగ్రీవుని మంత్రియగు హనుమకు శ్రీరాముడు తన అంగులీయకము నిచ్చి లంకకు పంపి సీతావృత్తాంతమును తెలిసికొని, సైన్యముతో వెళ్ళి రావణుని చంపి సీతమ్మతో అయోధ్యచేరి పట్టాభిషిక్తుడగును. పరమాత్మ ఆచార్యుని దూతగా వరించి తానే జ్ఞానమును ప్రసాదించి శరీరమున కారణ జన్మునిగా జన్మింపచేసి వానివలన ముముక్షువగు జీవుని స్వభావము నెరింగి తానే స్వయముగ ఆ జీవుని బంధించిన మనస్సును మర్దించి తనతో చేర్చుకొని పరమపదమునకు తీసికొనిపోవును. ఇట్లు శ్రీరామాయణకథయంతయు తత్త్వ నిరూపణముతో ఆంతరముగ సాగినది.

## హనుమద్దర్శనము

రామలక్ష్మణులు సీతను అన్వేషించుచు పంపాతీరమున నుండగా సుగ్రీవుడు చూచి తనను చంపుటకై వాలిచే పంపబడినవారని భయపడి ఒకచోట నిలువక మనసు తల్లడిల్ల దిగులుచెంది యుండెను. అపుడు హనుమ--

"సంభ్రమ స్త్య జ్యతా మేష సర్వై ర్వాలికృతే మహాన్
మలయోఽయం గిరివరో భయం నేహాస్తి వాలినః"

(కిష్కి. 2-14)

"తొట్రుపాటు పడకుము. ఇది ఋశ్యమూకము. ఇచటకు వాలిగాని, వాలి సంబంధులుగాని రాలేరు. ధైర్యముగా నుండు" మని చెప్పెను.

సుగ్రీవుని ఆదేశముచే మారుతి వారిని తెలుసుకొనుటకు వారున్నచోటుకు చేరెను. కపిరూపమును విడిచి సన్న్యాసిరూపముతో రామలక్ష్మణుల వద్దకు వచ్చెను. వినీతుడై రామలక్ష్మణులకు నమస్కరించి, సౌమ్యము, మనోహరము నగు వాక్కుతో వారిని ప్రశంసించుచు ఇట్లు మాట్లాడెను.

"మీరు రాజర్షితుల్యులు. దేవతుల్యులు. మనోహరమగు రూపము కల

వారు. తాపస వేషమును దాల్చి వనమున కెట్లు వచ్చిరి? మీ చూపులు సింహపు చూపులవలె గంభీరములై యున్నవి. మీ బలపరాక్రమములు సింహ మును మించియున్నవి. శ్రీమంతులు, రూపసంపన్నులు, కాంతిమంతులు అగు మీరు దివ్యధనుస్సులను ధరించి ఇట్లేల వచ్చిరి? దేవరూపులగు మీరు దేవ లోకమునుండిగాని దిగివచ్చిరా? పుండరీకదళేక్షణులును, జటామండలధారులు నగు మీరు భూమికి దిగివచ్చిన చంద్ర సూర్యులా అనునట్లు ఒప్పుచున్నారు. పొడవైన వర్తులములైన మీ బాహువులు ఆభరణములతో అలంకరించుకొనదగి నవికదా! ఆభరణములకు కూడ అందము నిచ్చునవి గదా! అట్టి బాహువులను అలంకరించుకొనకుండ ఏలవదలితిరి? ఈ భూమండలము నంతను రక్షిం చుటకు మీరు తగుదురు. ఇంతగా మాటాడుచున్న నాతో మాటాడరేమి? సుగ్రీవుడను ధర్మాత్ముడగు వానర రాజొకడు కలడు. ఆతని సోదరుడు వాలి. ఆ వాలి ఆతనిని దేశమునుండి వెడలగొట్టెను. సుగ్రీవుడు పంపగా హను మంతు డను పేరుగల నేను మీ వద్దకు వచ్చితిని. సుగ్రీవుడు మీతో మైత్రిని కోరుచున్నాడు. ఆతని మంత్రిని నేను. ఆతనికి ప్రియ మొనర్పవలెనని మీ వద్దకీ భిక్షురూపముతో వచ్చితిని" అని వాక్యకుశలుడగు హనుమ వాక్యజ్ఞులగు రామలక్ష్మణులతో పలికెను.

హనుమ చూడగనే రామస్వరూపము నెఱింగెను. రాముని చూడగనే మారు రూపముతో వచ్చినవాడు ఆ విషయమును మరచి ఉన్నదాని నున్నట్లు నివేదించెను. రామ సౌందర్యమునకు ఆకృష్టుడయ్యెను. నేత్రములను బాహువు లను దర్శించి తన్మయత చెందెను బాహువులను చూచి అలంకరించుకొనకున్న దృష్టిదోషము తగులునేమో యని భయపడి "స్వామీ!"--

"కిమర్థం న విభూషితాః?" (కిష్కి.3-14)

ఏల అలంకరించుకొనలేదు? అని ప్రశ్నించెను. మంగళగుణములను ప్రశంసించెను. మంగళ విగ్రహమును దర్శించెను. పరమాత్మయేయని గుర్తిం చెను. మరి మాటాడక ఊరకుండెను.

అపుడు రాముడు లక్ష్మణుని జూచి సంతోషముతో నిండిన ముఖముతో శ్రీమంతుడై ఇట్లు పల్కెను. ఇచట వాల్మీకి హనుమ లభించినా డని "ప్రహృష్టవదనః శ్రీమాన్" (కిష్కి.3- 25) అని రాముని శ్రీమంతునిగా పేర్కొనెను. జీవుని తరింపచేయగల ఆచార్యుడు లభించుటచే పరమాత్మ సంతోషించును. శ్రీమంతుడై విరాజిల్లును. వెనుక హనుమను "వాక్యకు- శలః" (కిష్కి. 3-24) "వాక్యకుశలుడు" అని పేర్కొనెను. రామలక్ష్మణులను

"వాక్యజ్ఞౌ" (కిష్కి.3-24) "వాక్యజ్ఞులు" అనెను. మాటాడుటలో నేర్పుగల వాడు హనుమ. మాటలలోని అర్థము నెఱుంగగలిగినవారు రామలక్ష్మణులు. రాముని దశరథపుత్రునిగా గాక సర్వజగద్రక్షకునిగా గుర్తించినవాడు హనుమ. ఆ విషయము స్ఫురించునట్లు మాటాడు నేర్పుకలవాడు హనుమ అనెను. శ్రీ రాముడు ఆతని మాటలలో ఆంతర్యము నెఱింగినవాడు. లక్ష్మణుడు కూడ సోదరునకు తగినవాడే. హనుమ ననుగ్రహించునపుడు లక్ష్మణుని ద్వారా అనుగ్రహించవలెను. కాని తానై మాటాడరాదు. ఆ విషయమును తెలియజేయుటకు రాముడు హనుమతో మాటాడక లక్ష్మణునితో ----

"సౌమిత్రీ! హనుమతో మాటాడుము. ఈతడు ఋగ్వేదమునందు బాగుగా శిక్షణనందినవాడు. యజుర్వేదమును బాగుగా ధారణ చేసినవాడు. సామవేదమును చక్కగ ఎఱింగినవాడు. కానిచో ఇట్లు మాటాడుట శక్యము కాదు. ఈతడు వ్యాకరణమును పూర్తిగా అనేకసార్లు వినినవాడు. అందుచేతనే చాలసేపు మాటాడినను ఒక్క అపశబ్దముకూడ ప్రయోగించలేదు. ముఖము నందుగాని, కన్నులలోగాని, నుదుటియందుగాని, కనుబొమలలోగాని ఏ యిత రావయవములలో గాని మాటాడుచున్నపుడు వికార మేమియు కన్పట్టుటలేదు. ఇంక మాటాడునపుడు విస్తరము కాకుండ, సందిగ్ధము కాకుండ మాటా డినాడు. మాటాడునపుడు తొందరగాకాని, మెల్లగా కాని మాటాడుటలేదు. మధ్యమస్వరములో పల్కినాడు. మాటలలో సంస్కారము కన్పట్టుచున్నది. మంగళప్రదమైన మనోహరమైన తీరులో మాటాడినాడు. ఇట్టిమాటలను విన్నచో కత్తినెత్తిన శత్రువైనను మెత్తపడక తప్పదు. ఏ రాజునకు ఇట్టి దూత దొరకునో వాని కార్యములు తప్పక సిద్ధించును" అని పలుకుచున్నాడు.

అట్టి మాటలలోని అర్థ మెఱింగిన లక్ష్మణుడు హనుమతో "హనుమా! మేము సుగ్రీవునే వెతుకుకొనుచు వచ్చుచున్నాము. నీవు చెప్పినట్లే చేసె దము" అని అనెను. ఆ మాటలను విని హనుమ సుగ్రీవునకు జయము తథ్యమని సంతోషించెను. అపుడు లక్ష్మణుడు శ్రీరామునికథ నంతను హను మకు వివరించెను. వివరించుచు తనకు రామునితో గల సంబంధమును చాల అందముగ చెప్పెను.

*"అహం మస్యావరో భ్రాతా గుణైర్దాస్య ముపాగతః"*

(కిష్కి.4-12)

"నేను ఈతనికి తమ్ముడను. గుణములచే దాస్యము నందినవాడను. రాముని అభిప్రాయములో నేనాతనికి సోదరుడను. కాని రామచంద్రునిగుణ

ములచే నే నాతనికి దాసుడననియే భావించుకొందును."

ఇందు భగవంతునితో మనకు గల సంబంధము దాస్యమే అని భావించుచుండవలెనని లక్ష్మణుడు చెప్పెను.

లక్ష్మణుడు హనుమతో--

"లోకనాథః పురా భూత్వా సుగ్రీవం నాథ మిచ్ఛతి"

(కిష్కి.4-18)

"లోకముల కన్నిటికి ప్రభువై సర్వలోకులచే యాచింపబడు రాముడు ఈనాడు సుగ్రీవుని యాచించుచున్నాడు." సర్వలోకములకు రక్షకుడగు రాముడు నేడు *"సుగ్రీవం శరణం గతః"* (కిష్కి.4-20) సుగ్రీవుని రక్షకునిగా జేరినాడు" అని చెప్పినాడు. ఇట్లు లక్ష్మణుడు చెప్పిన మాటలను విని హనుమ భిక్షురూపమును విడిచి, వానరరూపమునుపొంది రామలక్ష్మణులను తన భుజములపై కూర్చుండబెట్టుకొని సుగ్రీవునివద్దకు వచ్చెను. ఇది శ్రీరామ హనుమత్సమాగమము.

శ్రీరాముడు సీతాన్వేషణమునకు ఉపక్రమించి హనుమతో కలసిన ఈ వృత్తాంతము, భగవంతుడు ముముక్షువులగు జీవులకై అన్వేషించుచు యోగ్యుడగు ఆచార్యుని పొందిన వృత్తాంతమును సూచించుచున్నది. భగవంతుడు జీవులను పొందుటకై తానై యత్నించుచుండును. కాని తనంత పొందదు. ఆచార్యుల ద్వారా తరింపజేయును. అందుకే ఉపనిషత్తు, విరక్తి కలిగిననాడు ఆచార్యునే చేరవలసినదని చెప్పినది.

*"సగురుమేవాభిగచ్ఛేత్."*

అంతియేగాని భగవంతుని సాక్షాత్తుగా చేరుట శక్యముకాదు. అట్టి యార్తి జీవునిలో కలిగిననాడు భగవానుడే యోగ్యుడగు ఆచార్యుని వరించి జీవుని వద్దకు పంపును. ఆచార్యుడు వేద సంపన్నుడు, విష్ణు భక్తుడు, మంత్రజ్ఞుడు, మంత్రభక్తుడు కావలెను. శ్రుతి కూడ--

*"శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్"*

"శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు" అగు ఆచార్యుని చేరవలెనని చెప్పినది.

వేదవేదాంగములను అధ్యయనము చేసి అర్థము నెఱింగినవాడు "శ్రోత్రియుడు."

సతతము భగవదనుభవమున నిలచినవాడు -- "బ్రహ్మనిష్ఠుడు."

ఆ లక్షణములు హనుమకు కలవని రామలక్ష్మణుల సంభాషణ సూచించుచున్నది.

హనుమ ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము అధ్యయనము చేసినవాడని శ్రీరాముడు ప్రశంసించెను. ఇందులో ఆ వేదములయొక్క అధ్యయనములో గల విశేషముకూడ సూచింపబడినది.

ఋగ్వేదమున ప్రతి వర్ణమునకు స్వరముండును. అందుచే దానిని గురువువద్ద ఎంతోఅవధానముతో శిక్షణనొందినవారుగాని చదువలేరు. అందుకై హనుమను 'ఋగ్వేద వినీతుడు' అనును. 'వినీతుడు' అనగా 'శిక్షితుడు'.

యజుర్వేదములో ఒక అనువాకములో వాక్యము మరియొక అనువాకములో కన్పట్టుచుండును. అవి కలియకుండుటకు ధారణ ఆవశ్యకము. అందుచే హనుమను 'యజుర్వేదధారి' అనును.

సామవేదము గాన ప్రధానము. ఆ గానములో మార్పులు చేయుటకు చక్కని జ్ఞాన మవసరము. అందుచేత హనుమను 'సామవేద విదుడు' అనును.

హనుమ మాటాడిన మాటలలో రామచంద్రుని ప్రశంస, కుశలప్రశ్న, సుగ్రీవునికథ చెప్పుట మాత్రమే యున్నవికదా! దానిలో హనుమ వేదము చదువుకొనెనని ఎట్లు తెలిసినది? హనుమ మాటాడిన మాటలలో రహస్యముగ వేదార్థము ఇమిడియున్నది.

"ఉభౌ యోగ్యా వహం మన్యే రక్షితుం పృథివీ మిమాం"

(కిష్కి.3-15)

"వీరిద్దరు ఈ భూమిని రక్షించుటకు సమర్థులనుకొందును" అని జగద్రక్షణము చేయుగలవారని పల్కెను. సృష్టి, స్థితి, సంహారము అనునవి మూడును రక్షణయే.

ప్రళయకాలములో అచేతన పదార్థములతో సమానముగా నున్న జీవులను శరీరము నిచ్చి సృష్టించి రక్షించును.

వారిని జీవింపచేసి, వారికి కావలసినవన్నియు సమకూర్చి స్థితిచే రక్షించును.

ప్రళయములో మరల తనతో చేర్చుకొని రక్షించును.

ఈ విధముగ సమస్త పృథివికి రక్షకుడు భగవానుడు. ఆ విషయమునే ఐతరేయోపనిషత్తు మొట్టమొదట ప్రతిపాదించినది. "సర్వ జగత్ సృష్టి సితి ప్రళయములకు కర్త ఈ రాముడే" అని పై వాక్యములో హనుమ

సూచించెను.

యజుర్వేదములో --

**"అజాయమానో బహుధా విజాయతే"**

"జన్మలేనివాడు పెక్కురూపముల జన్మించుచున్నా" డని నిర్దేశింపబడినది. దానినే హనుమ--

**"మానుషౌ దేవరూపిణౌ"** (కిష్కి.3-13)

"దేవలోకమునుండి మనుష్యులుగా వచ్చిన దేవరూపులా మీ"రని ప్రశ్నించుటలో యజుర్వేదము నధ్యయనము చేసినాడని తెలియుచున్నది.

సామవేదమునకు చెందిన ఛాందోగ్యోపనిషత్తులో --

**"అంతరాదిత్యే హిరణ్మయః పురుషోదృశ్యతే"**

"సూర్య మండలమునందు హిరణ్మయ పురుషుడు ప్రకాశించుచున్నాడు."

**"తస్య యథా కప్యాసం పుండరీక మేవ మక్షిణీ"**

"ఆ పురుషుని నేత్రములు లోతైన నీటిలో బలమైన కాడపై నీటిపై నిలచి అప్పుడే ఉదయించిన సూర్యుని కిరణములచే వికసించిన తామరపూవు రేకులను పోలినవి" అని వర్ణింపబడినది.

"సువర్ణాభౌ (కిష్కి.3-7) పద్మపత్రేక్షణౌ (కిష్కి. --) బంగారు కాంతిగలవారు. పద్మపత్రములను బోలిన కనులుగలవారు" అని హనుమ వర్ణించుటలో సామవేదము అధ్యయనము చేసినవాడని తెలియుచున్నది.

ఇట్లు హనుమ వేదాధ్యయన సంపన్నుడని శ్రీరాముని ప్రశంసనందినాడు. వ్యాకరణము నధ్యయనము చేసినాడనుటచే వేదాంగములను ఎఱింగినవాడని తెలియుచున్నది. వేదాంగములలో 'శిక్ష' ఒక అంగము. 'శిక్ష' వర్ణోచ్చారణ క్రమమును వాక్య ప్రయోగచాతురిని వివరించును. హనుమ మాటాడునపుడు ఏ అవయవములలోను వికారము కలుగకుండ నిండుగ మాటాడును. మాటాడునపుడు విస్తరముగ మాటాడరాదు. సందేహము కల్గునట్లు మాటాడరాదు. మెల్లగా మాటాడినచో ఉపన్యాసకుడు చేవలేనివాడనుకొందురు. తొందరగా మాటాడినచో ఇతరులను మోసగించుచున్నాడనిపించును. అందుచే ఎక్కువ తొందరగా గాక, ఎక్కువ మెల్లగాగాక సమముగామాటాడవలెను. స్వరము బొంగురుగాగాక, కీచుగా గాక మధ్యమముగా నుండవలెను. సంస్కారము కల్గి, శబ్ద శుద్ధి కల్గి యుండవలెను. ఇట్టి లక్షణములన్నియు హనుమలో కలవని

చెప్పుటచే హనుమ శ్రోత్రియుడగు ఆచార్యుడని సూచింపబడినది.

"కష్ట్య వారాధ్యతే చిత్త ముద్యతానే రరే రపి
ఏవం విధో యస్య దూతో న భవేత్పార్థివస్య తు.
సిధ్యంతి హి కథం తస్య కార్యాణాం గతయోఽనఘ"

"ఇట్టివాడు దూతగ నున్నచో కార్యము తప్పక సిద్ధించును. కత్తి నెత్తిన శత్రువుకూడ మెత్తబడును" -- అని దూతగా హనుమ విశిష్టతను వర్ణించెను.

రాజునకు దూత ఎట్లు సాయపడునో భగవంతున కాచార్యుడంత సాయ పడును. భగవంతుని సందేశమును జీవున కందించు దూతయే ఆచార్యుడు. అతనికి కావలసినది వాగ్వైభవమే. అతని వాక్కే మంత్రము. మంత్రమును, మంత్రార్థమును ఎఱింగి శిష్యుల కందింపగలిగినవాడే ఆచార్యుడు. అతని మంత్రము ఎదిరించిన జీవుని మెత్తబరచి ప్రకృతిని జయించి భగవంతునికి వశముచేయును.

అట్టి దూత లభించినాడని రాముడు సంతోషించును. హనుమ రామ లక్ష్మణులను తన భుజముపై కూర్చుండబెట్టుకొని సుగ్రీవుని వద్దకు చేర్చును. ఇంతకాలమునుండి నడచుచున్న రామలక్ష్మణులు ఈ కొద్ది పాటిదూరము నడువలేరా? అదియునుగాక కోతి నెక్కుట యేమి? దీనిలో రహస్యము చూదుడు.

ఆచార్యుడు శ్రోత్రియుడేగాక బ్రహ్మనిష్ఠుడు కూడ కావలెను. వేద వేదాంగములను అధ్యయనముచేయుట చాలదు. వానిచే ప్రతిపాదింపబడు భగవత్తత్త్వమును తాను సతతము అనుభవించు చుండవలెను. అట్టివాడు కాని ఆచార్యుడుగా ఉండతగడు.

దీనిని సూచించుటకు హనుమ రామలక్ష్మణులను వహించెను. ఆచా ర్యుడు అద్దమువంటివాడు. మన స్వరూపమును మనము చూచుకొని సరి చేసికొనవలెననిన అద్దముండవలెను. అద్దము మన నేత్రముల నుండి ప్రస రించుకిరణములను అడ్డి వెనుకకు మరలించి మన చూపునకు మనముఖము కనబడునట్లు చేయును. అట్లే విషయములయందు లగ్నమైన మనదృష్టిని అడ్డి లోనున్న ఆత్మను చూచుటకు మరలించును. అనాడు ఆత్మస్వరూపసాక్షాత్కార మగును. అద్దము మలినముగా నున్నచో బింబము ప్రతిఫలించదు. అట్లే ఆచార్యుడు వేదవేదాంగవేత్త, బ్రహ్మనిష్ఠకలవాడు అయిననే పరిశుద్ధుడై శిష్యుల దృష్టిని ఆత్మవైపు మరలించగలడు. ఆత్మదర్శనమునకు భగవత్ప్రాప్తికి ఇట్టి

ఆచార్యుడావశ్యకమని ఎఱుంగవలెను. ఇట్లు శ్రోత్రియుడు, బ్రహ్మ నిష్ఠుడు అగు ఆచార్యుడు హనుమలో మనకు దర్శన మొసంగును.

భగవానునికి దూరమై భగవానుని పొందవలెనని పరితపించు జీవుని వెతకి భగవంతునితో చేర్చుటకు భగవంతునిచే వరింపబడి భగవద్దత్తమగు సందేశమును అందించెడి ఆచార్యుడే సమర్థుడు. ఆ ఆచార్యుడే హనుమ.

అంతేగాక హనుమ మంత్రస్వరూపుడు. మంత్రము నొసంగు ఆచార్యుడు మంత్రస్వరూపియే యగును. భగవంతుని వహించు శబ్దమే మంత్రము. అట్లు భగవద్వాహకములగు శబ్దములే భగవానునకు ధ్వజముగ నిర్దేశింప బడినవి. శ్రీమహావిష్ణువునకు వాహనమగు గరుత్మంతుడు వానికి ధ్వజము. పరమశివునకు వాహనమగు వృషభము ఆతనికి ధ్వజము. ఇట్లు వాహనమైనది శబ్దము. త్రిమూర్తులకు వాహనములుగా పేర్కొనబడినవి మూడును శబ్దములే! అవి గరుడుడు, ఎద్దు, హంస కావు. "వేదాత్మా విహగేశ్వరః" అని గరుత్మంతుని వేదస్వరూపునిగా పూర్వులు ప్రతిపాదించిరి. వేదములో గూడ సుపర్ణుని వేద స్వరూపునిగా నిర్దేశించిరి. ఋగ్వేదములో ఒక మంత్రము వృషభము శబ్దమే యని నిరూపించుచున్నది.

"చత్వారి శృంగా త్రయో అస్యపాదాః
ద్వే శీర్షే సప్త హస్తాసోఽస్య।
త్రిధా బద్ధో వృషభో రోరవీతి
మహోదేవో మర్త్యాగుం ఆవివేశ"॥

శబ్దమే వృషభము. కోరికలను వర్షించునది గనుక దీనికి వృషభమని పేరు. ఈ వృషభము లోకములోని వృషభమువంటిది కాదు.

ఈ వృషభమునకు నాలుగు కొమ్ములు. నాలుగు విధములగు శబ్దములే నాలుగు కొమ్ములు. వాక్కు (1) పర, (2) పశ్యన్తి, (3) మధ్యమ, (4) వైఖరి -- అను నాలుగు విధములు.

(1) శరీరములో మూలాధారస్థానమందు యోగులకు నిర్వికల్ప సమాధిలో మాత్రము గోచరించెడి శబ్దము పర.

(2) నాభిస్థానమున యోగులకు సవికల్ప సమాధిలో మాత్రము గోచరించెడి శబ్దము పశ్యంతి.

(3) హృదయస్థానమున ఎవనిలో వానికి వినిపించెడి వాక్కు మధ్యమ.

(4) నోటిలో ఆయా స్థానములలో అభివ్యక్తమై తనకు ఇతరులకు కూడ వినిపించెడి వాక్కు వైఖరి.

ఈ నాల్గు విధములగు వాక్కులు ఈ వృషభమునకు నాల్గు కొమ్ములు.

ఈ వృషభమునకు మూడుపాదములు. లోకములోని వృషభమునకు నాల్గు పాదములు. పాద మనగా నడచుటకు సాధనము. అదియే కాలము. 1. భూతకాలము 2. వర్తమానకాలము 3. భవిష్యత్కాలము అనునవి మూడును ఈ వృషభమునకు మూడు పాదములు.

ఈ వృషభమునకు రెండు శిరస్సులు. (1) నిత్యమగు శబ్దము (2) కార్యమగు శబ్దము.

ఈ వృషభమునకు ఏడు చేతులు. చేతులు అన్నిటిని తాకుటకు, పనిచే యుటకు పనికివచ్చును. అట్లే క్రియతో సంబంధమును తెలిపెడి (1) ప్రథమ, (2) ద్వితీయ, (3) తృతీయ, (4) చతుర్థి, (5) పంచమి, (6) షష్ఠి, (7) సప్తమి అను విభక్తు లేడును ఏడు హస్తములు.

ఈ వృషభము మూడు చోట్ల కట్టబడును. ఉరము (హృదయస్థానము) కంఠము, శిరస్సు - అను మూడును శబ్దమును బంధించెడి మూడు స్థానములు.

ఈ వృషభము మహాదేవునకు వాహనము.

శబ్దముచేతనే ఎఱుంగదగినది. భగవత్స్వరూపము ప్రత్యక్షము చేతగాని, అనుమానముచేతగాని గోచరింపదు. అందుచే దానిని వాహనమనిరి. ఈ వాహనమే ఆలయములలో ముందు ప్రతిష్ఠింపబడును. దానికి నమస్కరించియే ఆలయమున ప్రవేశింతురు. దానియర్థమిదియే! వేదవేద్యుడగు పరమపురుషుడే ఆలయమున నున్నవాడు. వానిని వహించు శబ్దమే ధ్వజస్తంభమున ఉండును. ఆ ధ్వజస్తంభము వద్ద నమస్కరించుట యనగా వేదమును ఉపాసించుట. వేదప్రామాణ్యమును అంగీకరించి వేదము నారాధించిన వారికే లోనికి ప్రవేశించుటకు అర్హత. అందుచే ఆలయమున కేగినపుడు ధ్వజస్తంభమునకు నమస్కరించి లోని కేగవలెను. ఇట్లు వాహనమే శబ్దమని తెలియుచున్నది. ఆ శబ్దమే వేదమంత్రము. అది ఆ లోకములో గరుత్మంతుడుగా, ఈ లోకములో హనుమంతుడుగా రూపుదాల్చియున్నది. అందుకే ద్రావిడ సంప్రదాయమున గరుత్మంతుని "పెరియతిరువడి" అనియు హనుమంతుని "శిరియతిరువడి" యనియు వ్యవహరింతురు. 'అడియనగా' పాదము. 'తిరువడి' యనగా శ్రీపాదము. భగవానుని పాదస్థానమున నుండువాడు గరుత్మంతుడు, హనుమ.

పాదము నడచుటకు సాధనము. శబ్దముగూడ భగవానుడు ఇతరుల కందు టకు సాధనము. పాదస్థానీయమై భగవానుని మనకందించు శబ్దమే హనుమ గనుక హనుమ రామునికి వాహనము.

ఈ లోకములో హనుమయొక్క ఉత్పత్తి ప్రకారమును పరిశీలించిన శబ్ద మునకు హనుమతోగల సామ్యము మనకు గోచరించును.

మనలో ఒకయర్థము నెరింగి ఆవిష్కరించవలె ననుకోరిక కలుగగనే శరీ రములో నుండు వాయువులో కదలిక కల్గును. ఆ వాయువుచే అభిహతమై మూలాధారస్థానమునుండి శబ్దము బయలుదేరి నాభిని హృదయమును కంఠ మును దాటి తిన్నగ శిరఃస్థానమును చేరును. అచటినుండి పైకి పోవ వీలు లేక కంఠమునుండి ముఖముగుండా వెలికి వచ్చును. అట్లు వచ్చునపుడు నోటిలోని ఆయా స్థానములలో వాయువుయొక్క తాకిడిచే ఆవాయువు మనకు వినపడెడి శబ్దముగా వెలికి వచ్చును. ఈ శబ్దమే ఋషుల నోటినుండి వచ్చినది. మంత్రరూపమై, వారికి కార్యములను నెరవేర్చుటకు సాయపడు చుండును. అదియే భగవత్స్వరూపమును సంసారుల కందించును. భగవంతునకు పరతం త్రమై వానికే చెందునదై యుండును.

• హనుమదుత్పత్తిని చూడుడు (1) హనుమానుడు వాయువు వలన జన్మించినవాడు. శబ్దముకూడ వాయువువలననే జన్మించినది. (2) పుట్టగనే హనుమ సూర్యమండలమువైపు పోయెను. శబ్దముకూడ శిరస్సువైపు ముందు సాగును. అటుపోవుటకు వీలులేక నోటినుండి వెలికి వచ్చును. నోటిలో ఆయావర్ణములు అభివ్యక్తమగు స్థానములే అంజన. ఆ అంజనయందు శబ్దము జన్మించును గనుక అంజనా తనయుడు. (3) హను వనగా దౌడ సూర్యుని నుండి క్రింద పడినపుడు దౌడలు సొట్టపోవుటచే హనుమంతుడను పేరు కల్గినది. శబ్దము కూడ శిరఃస్థానమునుండి క్రిందకువచ్చినోటిలో దౌడలకదలికచే వినప డునట్లు వర్ణరూపమున వెలికివచ్చును. కావున శబ్దము కూడ "హనుమాన్" అగును. (4) ఈశబ్దము ఉదాత్తానుదాత్తస్వరితములతో చక్కగ ఉచ్చరింపగల సామర్థ్యముగల వేదాధ్యయనపరునకు అవసరమైన కార్యములను నెరవేర్చుటలో మంత్రివలె పనిచేయును. 'సు' =మంచి, 'గ్రీవ'=మెడకలవాడు= సుగ్రీవుడు. స్వాధ్యాయ ప్రవచనశీలియగు శ్రోత్రియుడు, అతనికి సచివుడు హనుమ. (5) ఈ శబ్దమే భగవానుని సందేశమును జీవుల కందించునది. అందుచే 'రామ దూత'. (6) చివరకు రామునకే పరతంత్రమై రామునే వహించుచుండును. కావున రామదాసు. ఇట్ల హనుమకు గల పేర్లు అన్నియు శబ్దమునకు కూడ

పరిపడును.

1. వాయుసూనుడు.

2. అంజనాతనయుడు (ఆంజనేయుడు).

3. హనుమంతుడు.

4. సుగ్రీవసచివుడు.

5. రామదూత.

6. రామదాసు.

ఈవిధముగ ఆలోచించిన హనుమ శబ్దస్వరూపుడుగా గోచరించును. శబ్దమే భగవంతుని మన కందించునది. హనుమయే రాముని సీతమ్మతో కలుపువాడు. ఇట్లు భగవద్దూతయై, భగవద్వాహనమై భగవత్ప్రాప్తికి విరోధుల గువారిని సంహరించునదై, భగవత్పరతంత్రమై యుండెడి శబ్దమే హనుమగా కన్పట్టును. ఇట్లు హనుమ ఆచార్యుడుగా, ఆచార్యులు ప్రసాదించు మంత్ర ముగా గోచరించును. భగవానునికి దూరమై వారిని మరల భగవానునితో చేర్చెడివారు 1. గురువు, 2. మంత్రము-ఈరెండును హనుమ.

సీతాన్వేషణమునకు దక్షిణదిశకు బయలుదేరిన వానరులలో నాయకుడు అంగదుడు. హనుమ అందు ప్రధానుడు. వీరిలో హనుమకు శ్రీరాముడు, సీత మ్మకు తనను గుర్తుచేయుటకు అంగుళీయకము (ఉంగరము) నిచ్చెను. వారు దక్షిణదిక్కును వెతకి నెల దాటుటచే ప్రాణములందాశ వదలి సముద్రతీర మున మరణించుటకు ప్రాయోపవేశమును చేసి యుండిరి. జటాయువుయొక్క సోదరుడయిన సంపాతి లంకలో సీతమ్మ ఉన్నదనియు, నూరుయోజనముల సముద్రమును దాటివెళ్ళిన చూడగలరనియు చెప్పెను. అప్పుడు వానరులం దరు తమతమ బలములను ఉటంకించిరి. హనుమ మౌనముతో నుండెను. అపుడు జాంబవంతుడు ప్రేరేపించగా హనుమ సముద్రలంఘనమునకు ఉద్యు క్తుడాయెను. అందరును మహేంద్రపర్వతమును అధిరోహించిరి. హనుమ లంఘనమునకు సన్నద్ధుడై నిలచియుండెను. దీనితో కిష్కింధాకాండ సమా ప్తమై సుందరకాండ యారంభమగును.

## సుందరకాండ - సౌందర్యము

శ్రీమద్రామాయణములో కాండల పేర్లు ఆయాసంఘటనలు జరిగిన స్థలములనుబట్టి కాని, సన్నివేశమునుబట్టి గాని కల్పింపబడెను.

రామునిబాల్యమునందలి కథను వర్ణించినకాండ 'బాలకాండ'.

అయోధ్యలో జరిగిన వృత్తాంతమును వర్ణించిన కాండ 'అయోధ్యాకాండ'.

అరణ్యములోని వృత్తాంతమును వర్ణించిన కాండ 'అరణ్యకాండ'.

కిష్కింధలో జరిగిన కథను వర్ణించిన కాండ 'కిష్కింధకాండ'.

సముద్రమును దాటి హనుమ లంకచేరి మరలివచ్చిన కథను వర్ణించిన కాండ 'సుందరకాండ'.

యుద్ధమును వర్ణించిన కాండ 'యుద్ధకాండ'.

కాని "సుందరకాండ" యను పేరుమాత్రము వానికంటె ప్రత్యేకముగా నున్నది. దీనిలో సముద్రతరణ, లంకాగమన, సీతాన్వేషణములు జరిగినవి. కావున ఆ పేర్లతో వ్యవహరించి యుండవచ్చును. కాని వాల్మీకి ఇందలి సౌందర్యమును పాఠకులు గుర్తింపవలెనని "సుందరకాండ" యను నామధేయము నుంచెను. ఇందలి సౌందర్యమేమో, ఆ సుందరుడెవరో యథాశక్తి తెలిసికొన యత్నింతము.

శ్రీ రామాయణము మహాకావ్యము. కావ్యమున శబ్దము, అర్థము, రసము- అను మూడును ఉండును. ఆ మూడును సుందరములైయున్న ఆ కావ్యము మహాకావ్యము. సౌందర్యము పాఠకుని హృదయమును స్పందింపజేసి, తన్మయతను కల్గించి ఆనందము నొసంగును. శబ్దములు ఆయారసములకు తగినట్లు, భావములకు తగినట్లు సుందరముగా చెవికింపుగా ఉండవలెను. వినగనే హృదయమున అనుభూతిని కల్గించు ప్రసన్నత యుండవలెను. అట్టి ప్రసాద మాధుర్యములు సుందరకాండలో విరివిగా కన్పట్టును. కిష్కింధాకాండలో కూడ ఆయా వర్ణనలలో శబ్దముల పోహళింపు అందముగ నుండునుగాని సుందరకాండలో శబ్దసౌందర్య మధికము.

కావ్యగతమగు శబ్దార్థరస సౌందర్యములు పరిశీలింతము.

### (1) శబ్ద సౌందర్యము :-

శబ్దానుప్రాసములు ఇందధికముగా కన్పట్టుచుండును. ఐదవ వర్గలో

చంద్రవర్ణనలో -

"హంసో యథా రాజతపంజరస్థః
సింహో యథా మందరకందరస్థః
వీరో యథా గర్వితకుంజరస్థః
చంద్రోపి బభ్రాజ తథాంబరస్థః" (సుంద.5-4)

మున్నగు శ్లోకములలో వర్ణ, పద, అనుప్రాసలు అందముగా కన్పట్టును. అందుచే ఇందు 'శబ్ద సౌందర్యము' కలదు. కావున ఈ కాండ సుందరకాండ.

(2) అర్థ సౌందర్యము :-

ఇందలి కథ చాలా రమణీయమైనది. ఇందలి వర్ణనలు మనోహరములు. ఉపమోత్ప్రేక్షాద్యలంకారములు విచిత్రములు. ఆంజనేయుడు సముద్రము దాటుచున్నపుడు, పర్వతము నుండి దూకుచున్నపుడు చూపిన ఉపమానములు ఎంతో అందముగా నుండును.

హనుమ వేగమునకు లేచి హనుమ వెంట వెళ్లుచున్న చెట్లు బంధువు ననుసరించి వెళ్లుచున్న బంధువులవలె, రాజుననుసరించి వెళ్లు సైన్యమువలె ఉండెనని వర్ణించెను. (సుం.1-47,48)

రావణుని అంతఃపురములో పెట్టిన కాంచనదీపములు ఆరకుండ వెలుగుచుండెను. ఆ దీపములను జూదములో ఓడిపోయినను వదలలేక రెప్పవేయక ఆటవైపు చూచుచున్న జూదగాళ్ళతో పోల్చెను. (సుంద. 9-32)

అశోకవనములో క్రీడాపర్వత మొకటికలదు. దాని శిఖరము నుండి ఒకనది పారుచుండెను. ఆ కొండపై గుబురుగా వంగిన కొమ్మలుగల చెట్లుండెను. ఆ చెట్లు నదిని అడ్డుచుండెను. దీనిని విచిత్రముగా ప్రేయసీప్రియుల వృత్తాంతముగ వాల్మీకి రూపించెను. ఇందు ప్రేయసి ప్రియుడులేరు. సంస్కృతములో పర్వతము పుంలింగము గనుక పురుషుడు, నది స్త్రీలింగము గనుక స్త్రీ. ఆ పురుషుని ఒడిలో కూర్చుండి వినోదించుచున్న ఆ ప్రియురాలికి ప్రణయములో కోపము వచ్చెను. ఆతని ఒడినుండి దూకి చరచర నడిచి ముందునకు సాగి వచ్చుచుండెను. ఆమె చెలికత్తెలు తమ చేతులతో ఆమెను అడ్డి వెనుకకు మరలించిరి. ఇదంతయు కల్పనయే! ప్రియుడు లేడు. ప్రియురాలు లేదు. చెలికత్తెలు లేరు. పర్వతమనెడి ప్రియుని ఒడినుండి దూకి పారుచున్న నదియనెడి ప్రియురాలిని వృక్షములనెడి చెలులు తమ కొమ్మల

నెడి చేతులతో అడ్డి, మరల వెన్కకు పంపించుచున్నట్లు కవి రూపించెను.
(సుంద.14-29,30)

ఇట్టి విచిత్రములగు అలంకారము లిందెన్నియో కలవు.

అంతేగాక సముద్రతరణ, లంకాన్వేషణ, సీతాదర్శన, అశోక భంజన, రావణదర్శన, లంకాదహనాదులలో సన్నివేశవర్ణనలలోని సౌందర్యము చెప్పనలవి గానిది.

వాక్కుల కందని సీతమ్మ అందమునకు ఉపమానములుగా "శ్రద్ధ, మేధ, కీర్తి, సిద్ధి, వాక్కు, విద్య" మున్నగువానిని రూపించుట అతి విలక్షణము. ఇట్లే కాండలో **"అర్థసౌందర్య"** మధికముగా కలదు. కావున ఈ కాండ సుందరకాండ.

(3) రస సౌందర్యము :-

కావ్యములో రసము ప్రధానము. ఈ సుందరకాండలో రసములు తొమ్మి దియును అందముగ నిబంధింపబడినవి.

సీతారాముల పరస్పరానురాగమును ఎడబాటులో వీరు పొందిన తీవ్ర వేదనను వర్ణించుటలో **"శృంగారము"** గోచరించును. అది విప్రలంభ శృంగారము.

ఆంజనేయుడు సముద్రతరణమున చూపు ఉత్సాహము, రాక్షసులను జయించుటలో చూపు ఉత్సాహము, రావణునితో సంభాషించునపుడు చూపు ఉత్సాహము **"వీరరసము"** నకు స్థాయి భావమై అందమును కలిగించినది.

సురసాసింహికలను, లంకిణిని హనుమంతుడు జయించునపుడు హనుమ ఉత్సాహము, వారియొక్క వ్యర్థాటోపము **"హాస్యరసము"**ను సూచించును.

రాక్షసులను చంపుటలో హనుమయొక్క 'రౌద్రము'కన్పట్టును.

లంకాదహనములో కాలిన లంకను జూచునపుడు **"బీభత్సము"** స్ఫురించును.

రాక్షసస్త్రీలు సీతను బెదిరించినపుడు, రావణుడు సీతతో మాటాడునపుడు **"భయానకము"** గోచరించును.

సముద్రలంఘనములో **"అద్భుతము"** గన్పట్టును.

సీత లభించక హనుమంతుడు దిగులుపొందునపుడు నిర్వేదప్రధానమగు **"శాంతము"** కన్పించును.

లంకలో సీత రాక్షసులవలన పడిన బాధలను చూచిన "కరుణ" పొడ చూపును.

ఇట్లు సుందరకాండలో సర్వరసములును చోటుచేసికొనినవి. అందుచే "రససౌందర్యము" గల ఈ కాండ సుందరకాండ.

ఇట్లు కావ్యముగా సుందరకాండను చూచిననాడు (1) శబ్ద సౌందర్యము (2) అర్థ సౌందర్యము (3) రస సౌందర్యము కలదగుటచే ఈ కాండ సుందరకాండ.

కథాగతముగా పాత్రలను బట్టియు ఈ కాండకు సుందరకాండ అను నామధేయము కల్గినది.

ఈ కాండయందు మొదటి నుండి చివరివరకు "హనుమ" కన్పడును.

15వ సర్గనుండి చాలవరకు "సీత" కన్పడును.

చివరిసర్గలలో 'శ్రీరాముడు' కన్పడును.

ఈ ముగ్గురియొక్క సౌందర్యములు ఇందు అభివ్యక్తమగుటచే ఈ కాండకు సుందరకాండ యనుపేరు కల్గినది.

(1) శ్రీరామసౌందర్యము :-

శ్రీరాముడు పురుషులకు కూడ మోహనమైన రూపము గల వాడు. దండకారణ్యమున ఋషులు గూడ శ్రీరాముని సౌకుమార్యమును, సువేషమును జూచి ఆశ్చర్యపడి మంగళమును పాడిరి. అట్టి రూపము సీతాదేవికి ఆకర్షకమగుటలో ఆశ్చర్యములేదు. త్రిభువనైక సుందరి సీత. రాముని సౌందర్యమును కాంక్షించి వేరొకనిని కామింపక యుండెను. అట్టిసౌందర్యమును హనుమ సీతమ్మ ఎదుట ఇందు కీర్తించును. ఆంజనేయునితో రావణుడేమో యని శంకించి సీతమ్మ భయపడి మాటాడకుండెను. హనుమ నమస్కరించి "నేను రామదూతనమ్మా! నమ్ము" మని ప్రార్థించెను. అపుడు సీతమ్మ "నీవు రాముని ఎట్లెరుగుదువు? రాముని చిహ్నము లేమి? ఆతని రూపమెట్లుండును? వర్ణించు" మని కోరెను. వెంటనే హనుమ --

"రామః కమలపత్రాక్షః సర్వసత్త్వ మనోహరః" (సుంద.35-8)

"రాముడు తామరరేకులబోలిన కన్నులు గలవాడు, సమస్త ప్రాణికోటి యొక్క మనస్సుల నాకర్షించువాడు" అని రాముని నేత్ర సౌందర్యమును ముందుగా వర్ణించి ప్రత్యంగము వర్ణించును.

"త్రిస్థిరః త్రిప్రలంబశ్చ త్రిసమః త్రిషు చోన్నతః" (సుంద.35-17)

అని సాముద్రిక శాస్త్ర ప్రకారము ఏ అవయవములు ఏయే లక్షణములు కలిగియుండవలెనో ఆ లక్షణములు గలవాడని పేర్కొనెను. ఇట్లు రామ సౌందర్యము ఈ కాండయందు పరిపూర్ణముగా వర్ణింపబడెను. అందుచే సుందరుడగు "శ్రీరాముని సౌందర్యము"ను వర్ణించినకాండ గనుక ఇది 'సుందరకాండ'.

(2) సీతాసౌందర్యము :-

ఇక సీతమ్మ సౌందర్యము ఇందు మనకు కన్పడకపోయినను ఆంజనేయుడు సీతమ్మను చూచిన తరువాత రామునకు సీతమ్మయే తగును, సీతమ్మకు రాముడే తగునని ప్రశంసించును.

"తుల్యశీలవయోవృత్తాం తుల్యాభిజనలక్షణాం
రాఘవోఽర్హతి వైదేహీం తం చేయ మసితేక్షణా."

(సుంద. 16-5)

"శీలవయోవృత్తాభిజన లక్షణములచే రామున కీమె తగినదని నిర్ణయించును. ఆమె నేత్రసౌందర్యమును 'అసితేక్షణా', 'విశాలాక్షి' అని పలువిధముల ఇందు పేర్కొనును. ఆమెను జూచి ఈమె కొరకు మూడు లోకములను కలత చెందించినను తగునని భావించును. మూడులోకముల సామ్రాజ్యము కూడ ఆమెకు సరితూగ దనును. ఆమె సౌందర్యమును, గుణములను ఎఱింగినరాముడు ఆమెయందలి ప్రేమచే ఆహారము లేక, నిద్ర లేక ఆమెకై విలపించుచుండెనని హనుమ పల్కును. వీటన్నిటిచేత "సీతాసౌందర్యము" ఎంత గొప్పదో మనకిందు నిరూపింపబడినది. కావున ఇది 'సుందరకాండ'.

(3) హనుమత్సౌందర్యము :-

ఇందు ప్రధానపాత్ర హనుమ. ఆతనికి సుందరుడని నామధేయము. భగవానునికి విష్ణుసహస్రనామములలో 'సుందరు' డను నామము కలదు. అమ్మకు "సుందరి" అను నామము కలదు.

సౌందర్యము వస్తునిష్ఠము కాదు. వస్తువులందే సౌందర్యమున్నచో అన్ని వస్తువులును అందరకును సమానముగా అందముగా కన్పడవలెను. కాని ఒకరి కందముగా నున్న వస్తువు వేరొకరికి అందముగా కన్పట్టదు. అందుచే సౌందర్యము వస్తువులయందుండదని తెలియుచున్నది. హృదయములోని ఆనందమును ఏవస్తువు ఉద్బుద్ధముచేయునో ఆవస్తువు అందమైనది. ఒకరికి

ఒకపువ్వును చూచిన ఆనందము గలుగును. అనగా ఆపువ్వు వారి హృదయములోని ఆనందమును అభివ్యక్తము చేసినది, ఉద్బుద్ధము చేసినదన్నమాట.

హనుమ సుందరుడు, అనగా బాహ్యముగా అందమైనవాడని యర్థము కాదు; ఆనందమును కల్గించువాడు అని యర్థము. సర్వ జీవలోక ప్రతినిధి సీత. రాము డానందస్వరూపుడు. ఆ ఆనందస్వరూపుని సీతమ్మకు తెలియజేసి ఆమె హృదయములోని దుఃఖమును తొలగించి, ఆనంద మభివ్యక్తమగునట్లు చేసినవాడు కనుక హనుమ సుందరుడు. సీతారాముల నిర్వురను ఆనందింపచేసినవాడు హనుమయే! అందుచే హనుమ సుందరు డాయెను. ఆనందమును కల్గించువాడే అందగాడు. ఆ హనుమ సీతారాముల హృదయములలో ఏవిధముగ ఆనందమును కల్గించెనో ఇందు వర్ణింపబడినది. ఇదియే హనుమంతుని సౌందర్యమును వర్ణించుట. ఇట్లు "హనుమత్సౌందర్యము" ను వర్ణించినకాండ గనుక ఇది 'సుందరకాండ'.

ఈ విధముగ పాత్రగతముగ సుందరకాండను చూచినవాడు (1) రామసౌందర్యమును, (2) సీతాసౌందర్యమును, (3) హనుమత్సౌందర్యమును వర్ణించినకాండ యగుటచే ఈ కాండ సుందరకాండ.

ఆంతరముగ ఆధ్యాత్మికార్థమున భగవత్సౌందర్యమును, జీవసౌందర్యమును, ఆచార్యసౌందర్యమును వర్ణించినకాండ యగుటచే దీనికి 'సుందరకాండ' యను పేరు కల్గినది.

(1) భగవత్సౌందర్యము :-

భగవానుడు నిరవధికవాత్సల్యము గలవాడు, దయామయుడు. క్షమాశాలి. జీవుడు ఎన్ని తప్పులను చేసినను ఆతడు తనకు దూరమై పరితపించుచున్నపుడు ఓర్వలేడు. ఆతని తప్పులను మరచిపోవును. జీవుడు తనను పొందుటకు పడెడి బాధకంటె తానెక్కువ బాధపడును.

సీతమ్మ కోరి రాముని దూరము చేసికొనెను. తనను రక్షింపగల లక్ష్మణుని దూషించి దూరము చేసికొనెను. ఇట్లు దూరమైన పిదప రాముడినే పొందవలెనని పరితపించుచుండెను. రాముడు ఆమెకంటె ఎక్కువగా బాధపడుచుండెను. స్వామివాత్సల్యమే స్వామికి అందము. ఆవాత్సల్యము, దయ లేనివాడు వాని నెవ్వరును కోరరు. కోరబడినవాడే అందగాడు. అట్టి 'భగవత్సౌందర్య" మిందు వర్ణింపబడినది గావున ఇది 'సుందరకాండ'.

(2) జీవ సౌందర్యము :-

సీతమ్మ జీవుని స్వరూపమును శిక్షించుటకై జీవునివలె నటించుచున్నది. జీవునకు సౌందర్యము అనగా భగవంతునిచే వరింపబడుట. అట్లు భగవంతునిచే వరింపబడుటకు కావలసిన సౌందర్యము బాహ్యమగు రూపము కాదు. అంతరమగు ఆత్మ సౌందర్యము. దానిని జూచియే భగవానుడు వరించును.

దీనికి పార్వతీపరమేశ్వరుల కథ మనకు నిదర్శనము.

పార్వతి త్రిలోకసుందరి. పర్వతరాజపుత్రి తనతండ్రి ఇంటనుండగా పరమశివు డచటికే తపసు చేసికొనుటకు వచ్చెను. ఆతనికి పరిచర్యలు చేయుట కామెతండ్రిచే నియమింపబడెను. సహజసౌందర్యవతి, యౌవనవతియగు పార్వతి అలంకరించుకొని శివుని సన్నిధినుండెను. మన్మథుడు బాణములు వేసి శివుని హృదయములో ఆమెపై అనురాగమును కల్పింప యత్నించెను. కాని పరమశివుడామన్మథుని దహించి లేచిపోయెను. పార్వతి తనరూపమును తానే నిందించుకొనెను. "ప్రియుని ప్రేమను పొందలేని అందము అందమేమి?" అని వెంటనే నారబట్ట కట్టుకొని, జపమాల దాల్చి, మౌంజి ధరించి తపస్సు చేయునారంభించెను. వేసవిలో అగ్నిహోత్రమధ్యమున, వర్షాకాలములో పెనుగాలులతో కూడిన వర్షములలో ఆవరణలేనిచోట నిలచి, శీతకాలములో నీటిలో నిలువబడి తపస్సు సాగించెను. పరమశివుడే బ్రహ్మచారి వేషముతో ఆమెవద్దకు వచ్చెను. తనను తానే నిందించుకొనెను. "పుట్టుక తెలియనివాడు, అందము లేనివాడు, దిగంబరుడు నీకు భర్త ఏమిటి?" అనెను. అయినను ఆమె చలింపక పరమశివునియందే అనురక్తి కలిగియుండెను. అపుడు పరమశివుడు "తనాస్మి దాసః క్రీత స్తపోభిః" "నీకు దాసుడనైతిని, నీతపస్సుచే కొనబడితిని" అనును. బాహ్యముగ పురుషుని ఆకర్షించునది శరీరసౌందర్యము. పరమపురుషుని ఆకర్షించునది ఆత్మసౌందర్యమగు తపస్సు. అందుచే జీవునకు తపస్సే సౌందర్యము.

సీతమ్మ సుందరకాండలో రాముని పొందుటకు చేసిన తపస్సే ఆమె సౌందర్యము. అదియే జీవునకు ఉండవలసిన సౌందర్యము. తాను తపస్సు చేయుచున్నట్లు సీతమ్మయే రావణునితో చెప్పును. "రావణా! నిన్ను నేను దహింపగలను. నీవు దహించుటకు తగియున్నావు. కాని,

"అసందేశాత్తు రామస్య తపస శ్చానుపాలనాత్
నత్వాం కుర్మి దశగ్రీవ భస్మ భస్మార్హ తేజసా"

(సుంద. 22-20)

రాముని సందేశము లేదు గనుకను, నేను తపస్సును పాలించుచున్నాను గనుకను ఓ దశకంఠా! నిన్ను భస్మము చేయనైతిని" అనును. ఇచ్చటామె చేయుతపస్సు "రామునకే చెందినదానను, రామునిచేతనే రక్షింపబడదగినదానను రామునిచేతనే అనుభవింపబడుదానను" అని ఎఱింగి "వానికి చెందినవస్తువు తాను గనుక వాడే రక్షించవలెను గాని తాను రక్షించుకొనకూడదు" అని వానిపై తన భారము నుంచి శక్తి యున్నను తనను తాను రక్షించుకొనకుం డుటయే! దీనినే "న్యాసము" అందురు. రక్షణభారమును భగవంతునిపై ఉంచుట న్యాసము.

"న్యాస మేషాం తపసాం వరిష్ఠ మాహుః."

ఈ న్యాసము అన్ని తపస్సులలో గొప్పది యని ఉపనిషత్తు పేర్కొనినది. దీనినే "సన్న్యాసము" అందురు. "సత్" అనగా పరమాత్మ; ఆతనియందు తాను -- తనది అనువానిని ఉంచుట - సన్న్యాసము. 'సత్+న్యాసము=సన్న్యాసము' -- పరమాత్మయందే రక్షణ భారము నుంచుట. ఇట్టివారిని పరమాత్మ తానే ఉపాయముగ రక్షించును. భగవత్ప్రాప్తిని కాంక్షించు జీవుడు చేయవలసిన తపస్సును సీతమ్మ ఇందు చేసినది. తన రక్షణ ప్రయత్నమును తాను వీడి, వానినే ధ్యానించుచు ప్రేమించియున్నచో వాడే వచ్చి విరోధులను తొలగించి తనతో చేర్చుకొనును. భగవత్ప్రాప్తికై "జీవునకు కావలసిన సౌందర్య"మిది. ఇది ఈ కాండలో ప్రతిపాదింపబడినది గావున ఇది 'సుందరకాండ'.

(3) ఆచార్య సౌందర్యము :-

జీవుడు పొందవలెనని ఎంత ఆర్తి పడుచున్నను భగవంతుడు తనను పొందించుకొనవలె నని తలంచినను వారిద్దరిని కూర్చెడివాడు (ఘటకుడు) ఉండవలెను. ఆతడే ఇందు హనుమ. ఆతడే ఆచార్యుడు. ఆచార్యుడు సుందరుడు. పురుషునిచే వరింపబడినది అందగత్తె. భగవంతునిచే వరింపబడిన జీవుడు అందగాడు. ఎవరు తనను నిరతిశయముగ ప్రేమింతురో వారిని భగవానుడు ప్రేమించి వరించును. అట్టి వారికి తన రూపమును దర్శింపజేయును. అట్టివాడే ఆచార్యుడు. కొన్నికోట్లమంది కోతులలో హనుమనే రాముడు దూతగా వరించి తనముద్రిక నొసంగి, సీతమ్మవద్దకు పంపెను. ఇట్లు వరింపబడిన హనుమయొక్క సౌందర్య మిందు వర్ణింపబడినది. భగవంతుని పొందవలెనని జీవుడెంత యార్తిపడుచుండునో ఆచార్యు డంతకంటె ఎక్కువబా

ధపడుచుండును. జీవుని భగవంతునితో చేర్చుటకై ఆతడు చేసెడి ప్రయత్నమే ఆతని సౌందర్యము. దానిని చూచియే జీవుడాతనిని వరించును. అట్లు భగవంతునితో చేర్చుటకై ఆతడు చేసెడి ప్రయత్నమే ఆతని సౌందర్యము. దానిని చూచియే జీవు డాతనిని వరించును. అట్లు భగవంతునిచే వరింపబడుటకు తగిన భక్తి, జీవునిచే వరింపబడుటకు, తగిన శక్తి, దయకలవాడే ఆచార్యుడు. అట్టి యాచార్యుడే సుందరుడు. ఇట్లు 'ఆచార్యసౌందర్యము' ను వర్ణించిన కాండ గావున ఇది 'సుందరకాండ'.

ఈ విధముగ కావ్యముగా చూచిన (1) శబ్దసౌందర్యము, (2) అర్థసౌందర్యము, (3) రససౌందర్యముగల కాండ ఈ సుందరకాండ.

పాత్రలను బట్టి జూచిన సుందరుడగు (1) రాముని సౌందర్యము, సుందరియగు (2) సీత సౌందర్యము, సుందరుడగు (3) హనుమ సౌందర్యము ఇందు వర్ణింపబడినవి గావున ఈ కాండ సుందరకాండ.

ఆధ్యాత్మికముగ సుందరకాండను చూచిననాడు (1) భగవత్సౌందర్యము, (2) జీవసౌందర్యము, (3) ఆచార్యసౌందర్యము వర్ణించినకాండ కనుక ఇది సుందరకాండ.

ఇట్లు తొమ్మిదివిధము లగుసౌందర్యము లిందు గన్పట్టును.

మానవుని జీవితమే రామాయణము. స్త్రీకి యౌవనము రాగనే సౌందర్య మధిక మగును. వరసమాగమయోగ్యమగు వయసువచ్చి, ఒక పురుషుని ప్రేమించి ఆ పురుషుని పొందించుటకు తగిన పెద్దలు లభించి పురుషు డంగీకరించినాడని తెలిసిననాడామె జీవితము సుందరమగును. అట్లే జీవుడు ఎంతోకాలమునుండి భగవానునికి దూరమైయుండును. ఎన్నో జన్మ లెత్తును. చివరకు మనుష్యజన్మ నెత్తును. ఆ మనుష్య జన్మలో భగవత్ప్రాప్తి కావలెనని కోరిక కల్గును. భగవానుని ప్రేమించును. పొందవలెనని త్వరపడుచుండును. భగవానుడా జీవుని పొందుటకు తానే ఒక ఆచార్యుని వరించి ఆ జీవుని వద్దకు పంపును. భగవత్స్వరూపము నెఱింగించు మంత్రవచనము భగవానుడే ఆ గురువున కిచ్చును. ఆ మంత్రము నా గురువు తెచ్చి జీవునికందించి భగవానుడు తప్పక రక్షించునని చెప్పును. మానవ జీవితములో ఇట్టి స్థితి కలుగుట అందము. జీవితములో అట్టి సుందరమైన భాగమును వివరించు కథ ఈకాండలో కలదు గనుక ఈ కాండ 'సుందరకాండ'.

సీతమ్మ రామునకు దూరమై లంకలో బంధింపబడినది. రాముని పొందవలెనను కోరికతో, పొందనిదే యుండవలేనను ఆర్తితో బాధపడుచున్నది. అప్పుడు రాముడు ఆమె కొరకు తాను కూడ బాధపడుచు హనుమను జేరి తనస్వరూపము సీతమ్మకు గోచరించునట్లు చేసెడి ఉంగరమును హనుమకిచ్చి లంకకు పంపెను. హనుమ సముద్రమును దాటి, లంకను చేరి, సీతను వెదకి, చూచి, ఉంగరమిచ్చి, రాముడు తప్పక రక్షించునని చెప్పెను. ఆమె విరోధులను ఓడించి తిరిగివచ్చి రామునితో సీతకథ నివేదించును. ఇది బాహ్యకథలో సుందరమైన భాగము. ఇట్లు బాహ్యాంతర సౌందర్యములతో నిండిన కాండ గనుక ఇది 'సుందరకాండ'.

మనుష్యుడుగా జన్మించుట, ఈ ప్రకృతి బంధమునుండి విడివడవలెనను కోరికకల్గుట, మహాపురుషుడగు గురువుతో సమాగమము లభించుట అనునవి జీవితములో దుర్లభములు. అవి కలిగిననాడు భగవత్ప్రాప్తికి యోగ్యమగు సౌందర్యము లభించును. అట్టి సౌందర్యమును నిరూపించు ఈ కాండ "సుందరకాండ" గా సార్థకమై అలరారుచున్నది.

* * * * *

# సుందరకాండము — తత్త్వదీపిక

హనుమ సముద్రలంఘనమున కుద్యుక్తుడై మహేంద్రపర్వతము నధిరోహించెను. ముందున కొంకకాలు, వెనుక కొంకకాలు పెట్టి ఆకాశమువైపు చూచుచు ప్రాణమునను ఓగపట్టి, రెండు చేతులు ముందునకు చాచి, తోక పైకెత్తి, నడుము సన్నముచేసి, చెవులు నిగిడించి నిలచెను.

"తతో రావణనీతాయాః సీతాయా శ్శత్రుకర్శనః
ఇయేష పద మన్వేష్టుం చారణాచరితే పథి." (సుంద. 1-1)

తరువాత శత్రువులను కృశింపజేయగల హనుమ రావణునిచే తీసికొని పోబడిన సీతయొక్క స్థానమును అన్వేషించుటకు దేవగాయకులగు చారణులు సంచరించు ఆకాశమార్గమున వెళ్ళవలెనని సంకల్పించెను.

తత్త్వదీపిక :--

ఈశ్లోక మొక్కటియైనను నిత్యము చదువుకొనువారికి బంధనము నుండి విముక్తి కలుగును. చికిత్స చేయుటకు వీలుగాని రోగములుకూడ నయమగును.

ఇందు గాయత్రీమంత్రములో పన్నెండవ అక్షరము 'వ' కలదు.

ఈ శ్లోకములో రహస్యమైన అర్థము నిక్షిప్తమై యున్నది. భగవదనుజ్ఞను పొంది, భగవద్దత్తమైన అంగులీయకమును పొందిన తరువాత, భగవంతుని నుండి వేరుచేయబడిన జీవుని అన్వేషించుటకు ఆచార్యుడు సంకల్పించెనని ఆచార్యస్వరూప మిందు సూచితమైనది.

బయల్దేరిన హనుమకు "శత్రుకర్శనః" అనుపదము ఇందు ప్రయోగింపబడినది. శత్రువులను కృశింపచేయువాడు -- హనుమ. హనుమ సీతమ్మను హింసించు రావణాదులగు రాక్షసులను కృశింపచేయజాలినవాడు. కావున ఆతనికీ పేరు సరిపడినది.

ఆచార్యుడు కూడ 'శత్రుకర్శనుడే' కావలెను. భగవత్ప్రాప్తికి ప్రతిబంధకమగు శత్రువు - కామము ఒక్కటియే! ఆకామమును జయింపగల్గినవాడే గురువు. కామమే శత్రువని భగవద్గీతలో-

"జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్"

"పట్టునకు దొరకని కామ మనెడు శత్రువును చంపు" మని కృష్ణ పరమాత్మ అర్జునునకు ఉపదేశించెను.

(1) తాను స్వతంత్రుడని భావించుట,

(2) తనను తాను గాని, ఇతరులు గాని రక్షింపగలరు-- అని తలంచుట,

(3) భగవత్ప్రాప్తి తన ప్రయోజనమునకే యని భావించుట అనునవి మూడును ఆత్మస్వరూపమునకు, ఉపాయమునకు, ఫలమునకు విరోధులు.

ఆ శత్రువులను జయింపజాలినవాడే గురువు కావలెను.

తాను భగవానునికే చెందిన వాడనని, భగవంతుడే తనకు రక్షకుడని, తాను చేయుపని భగవంతుని కొరకే యని ఎఱింగినవాడు 'శత్రుకర్శనుడు'.

అట్టివాడే సముద్రమును దాటి లంకను చేరి, సీతమ్మను చూడగలడు. హనుమ పై లక్షణములు గలవాడని ముందు తెలియును.

అట్టి గురువుయొక్క సంకల్పమే శిష్యునకు "రక్ష" అని సూచించుటకు "ఇయేష"= సంకల్పించెను-- అని ప్రయోగించెను. భగవత్సంకల్పముకంటె, ఆచార్య సంకల్పమే మనను రక్షింపజాలినది.

ఈతడు సీతమ్మ ఉన్నచోటును వెదకుటకు సంకల్పించినాడు.

ఆచార్యుడు ఈ సంసారమండలములో ఏ సంసారి యగుజీవుడు భగవత్ప్రాప్తి యోగ్యములగు చిహ్నములు గలవాడో అన్వేషించును. దయామయుడగు సర్వేశ్వరుని కటాక్షము జన్మించు సమయమున ఏ జీవునియందు ప్రసరించునో ఆ జీవునకు భగవంతునియందు ద్వేషము తగ్గును, ఆభిముఖ్యము కల్గును. సాత్త్వికులగు సత్పురుషులతో సంభాషణము చేయు నవకాశము లభించును. అట్టి చిహ్నములు గలవారిని ఆచార్యుడన్వేషించును. వారికి భగవద్దత్తమగు జ్ఞానమొసంగును.

'పద' మనగా చోటు- గురుతు. హనుమ సీతమ్మ ఉండెడి చోటును వెతకవలెనని సంకల్పించెను.

ఆచార్యుడు జీవుని లక్షణములను అన్వేషించుటకు సంకల్పించును.

"సీతా" అను పదము ఇందు జీవుని సూచించును. నాగటిచాలులో దొరికినది సీత. శరీరమనెడి కర్మక్షేత్రములో సూక్ష్మమగు బుద్ధిచే త్రవ్వగా దొరికెడి ఆత్మ-సీత. "సీతా" శబ్దము స్త్రీలింగము. జీవుడుకూడ భగవానునకు పరతంత్రుడు గనుక స్త్రీవంటివాడే! శరీరములో మరుగుపడియుండి బుద్ధిచే బయల్పరుపబడి భగవంతునకే పరతంత్రమై యుండెడి జీవుడు- సీత.

సీత రావణ నీత. రావణునిచే తీసికొనిపోబడినది. 'రావయతి అసత్ప్రలాపాన్ కారయతి ఇతి రావణః' అను వ్యుత్పత్తిచే "నేను, నాది" అను

చెడుమాటలను పల్కించెడి అవివేకమోహితమగు మనస్సే రావణుడు. అదియే ఆత్మను శరీరములో బంధించును.

అంతరార్థము :- ప్రతిపదార్థము :-

తతః=ఆపరమాత్మనుండి, రావణనీతాయాః=కామమోహితమగు రాజసమగు మనసుచే తీసికొనిపోబడిన, సీతాయాః=శరీరములో మరుగుపడియుండి, బుద్ధిచే బయల్పరుపబడునదియై, జన్మరహితమగు భగవత్పారతంత్రమగు ఆత్మయొక్క, పదం= భగవదాభిముఖ్యసాత్త్విక సహవాసాది లక్షణములను, అన్వేష్టుం=అన్వేషించుటకు, శత్రుకర్శనః=భగవదితర విషయమగు కామమును జయించినవాడును, స్వాతంత్ర్యము, తన రక్షణమున తనప్రయత్నము, తాను చేయుపనియందు స్వప్రయోజనత్వబుద్ధి అను విరోధులను జయించినవాడను అగు (హనుమ) ఆచార్యుడు, చారణాచరితే=పూర్వఋషులు, ఆచార్యులు ప్రవర్తించిన, పథి=మార్గమున, ఇయేష=వెళ్ళుటకు సంకల్పించెను.

ఇచట హనుమ చారణులు సంచరించు ఆకాశమార్గమున వెళ్ళవలెనని సంకల్పించెను. దీనిలోని యర్థము గ్రహింపవలెను.

ఆచార్యుడు కూడ చారణులు నడచిన మార్గముననే నడువవలెను. చారణు లనగా పూర్వపు ఋషులు, ఆచార్యులు మొదలగువారు, వారు నడచినమార్గము చారణాచరిత మగు మార్గము. శాస్త్రములు చదివినను, పెద్దలయొక్క నడువడియే అనుసరింపదగినది గాని దానిని వీడి క్రొత్తమార్గమున నడువరాదు. అందుచేతనే--

"అథ యది తే కర్మవిచికిత్సా వా వృత్త విచికిత్సా వాస్యాత్
యే తత్ర బ్రాహ్మణా స్సమ్మర్శినః
అలూక్షా ధర్మకామా స్స్యు.
యథా తే తత్ర వర్తేరన్
తథా తత్ర వర్తేథాః"

"ధర్మమార్గమున ప్రవర్తించువారు ఏవిధముగా ఆచరించిరో ఆ విధముగనే ఆచరింపవలెనని, పెద్దలనడువడియే ప్రమాణ" మని ఉపనిషత్తు చెప్పుచున్నది.

మరియు ఆకాశమున వెళ్ళుట యనగా సతతబ్రహ్మనిష్ఠ కలిగియుండుట. ఆకాశ మనగా పరబ్రహ్మము. ఆ=అంతటాపూర్ణముగా, కాశ్=ప్రకాశించువాడు పరమాత్మ. దానియందు విహరించువాడే సంసారసముద్రమును తాను దాటి జీవులను తరింపచేయగలడు.

ఇట్లు ఈ శ్లోకములో జీవుని తరింపచేయగల గురువుయొక్క స్వరూపము తెలియచేయబడినది.

సుందరకాండను ప్రత్యేకముగా ఒక ప్రబంధముగా భావించినచో హనుమ సాధకుడుగా భగవత్ప్రాప్తికి చేయవలసిన సాధనలు వివరించును. సాధకుడు నిష్కామముగ కర్మయోగము నాచరించి, ఆత్మ స్వరూపజ్ఞానముతో ఆత్మస్వరూపమును దర్శించి, భగవత్ప్రాప్తికి ప్రతిబంధకములగు పాపములను పోగొట్టుకొని, భగవత్ప్రాప్తినందవలెను. హనుమ నిష్కామముగ సముద్రలంఘనము నాచరించి, లంకలో సీతమ్మ నన్వేషించి, దర్శించి, రాక్షసులను సంహరించి, మరల భగవానుని చేరును.

హనుమానుడు, భగవదనుగ్రహముచే భగవదనుభవమును పొందిన సిద్ధుడై సంసారమును తరించి, భగవదాజ్ఞచే శరీరములో ప్రవేశించి, అందు బంధింపబడిన జీవులలో భగవత్ప్రాప్తిని కోరెడి జీవుని వెతకి, వాని విరోధులను నశింపచేసి, వారికి జ్ఞానము నొసంగి, వారి వృత్తాంతమును భగవానుని కందించు మహాపురుషుడుగా ఇందు గోచరించును.

ఇట్లు హనుమ సాధకుడుగా, భగవదనుగ్రహమును పొందిన జ్ఞానియగు మహాపురుషునిగా, రామదూతగా ఇందు కన్పట్టుచుండను.

"దుష్కరం నిష్ప్రతిద్వంద్వం చికీర్షకర్మ వానరః
సముదగ్రశిరోగ్రీవో గవాంపతి రివాబభౌ." (సుంద.1-2)

హనుమ సముద్రలంఘనమును చేయవలెనని సంకల్పించెను. ఇది దుష్కరమగు కర్మ. దీనిని చేయవలెనని సంకల్పించిన హనుమ మెడ, తల పైకెత్తి కొండపై నిలచి, మదించిన వృషభమువలె ఒప్పుచుండెను.

తత్త్వదీపిక :-

ఈ మొదటిసర్గలో నాలుగుసార్లు "దుష్కరం" అను పదము వచ్చును. ఇది మొదటి దుష్కరము. ఈ శ్లోకమును చదువుటయే దుష్కరము. 'ష్క', 'ష్ప్ర', 'ర్ష' -- అను సక్షరములను ఇందు నిబంధించి చేయబోవు కార్యములోని దుష్కరత్వమును శబ్దములోనే కవి సూచించెను.

ఇందు వానరులకు వ్యవహరించుపదము లన్నియు ఆచార్యుని సూచించును.

"కపిః, వానరః, శాఖామృగః, హరిః" మున్నగునవన్నియు జ్ఞానికి నామధేయములై చెల్లును.

| | |
|---|---|
| కపిః:- | కం=పరబ్రహ్మమును, పిబతి=ఆస్వాదించువాడు లేదా పానముచేయువాడు, కపి=భగవదనుభవము గలవాడు |
| వానరః:- | అతిమానుషములగు శక్తులుగల ఈతడు మనుష్యుడా? అనిపించును. |
| శాఖామృగః:- | శాఖా=వేదశాఖలయందు, మృగః=భగవత్తత్త్వమును అన్వేషించువాడు. |
| హరిః:- | హరతి=భగవత్ప్రాప్తికి ప్రతిబంధకములగు పాపములను పోగొట్టువాడు. |

ఇట్టి ఆచార్యుడే ఇందు హనుమగా మనకు సాక్షాత్కరించుచున్నాడు. నూఱుయోజనముల సముద్రమును మధ్యలో ఎక్కడ ఆగకుండ దాటవలె నని సంకల్పించుటయే దుష్కరమైనకర్మ. చేయశక్యముకాని పని.

సంసారసముద్రము ఏ ప్రతిబంధకములు కలుగకుండ దాటవలెనని ప్రయత్నించుటయు దుష్కరమే! ఈ అధ్యవసాయము కల్గిననాడు గాని దాటలేడు. అపు డతడు గవాంపతిః ఇవ=వృషభ రాజమువలె ప్రకాశించెను. వృషభము ఏది అడ్డువచ్చినను ఆగక ఎట్లు ముందుకు త్రోసికొనిపోవునో అట్లు పోవుట కుద్యుక్తుడై నిలచినాడు.

గురువు లేదా సాధకుడు కూడ తాను సంతతము ప్రతిశ్వాసలో మంత్రమునే అనుసంధించుచు, తాను మంత్రస్వరూపుడే కావలెను.

గవాంపతిః=మంత్రరాజమువలె ప్రకాశించెను.

ఇట్లు సంకల్పించిన తరువాత-

కొండపై సమతలమున వైడూర్యమువంటి రంగుగల పచ్చిక బయళ్ళలో ధీరుడగు హనుమ హాయిగా ముందునకును వెనుకకును నడుచుచుండెను.

తత్త్వదీపిక :-

ఆ పచ్చిక బయళ్ళే విషయభోగములు. వానిలో విహరించుచున్నను వానియందు తన మనసు రమింపక తాను ఎగురదలంచెడి ఆకాశమునే అనగా పరబ్రహ్మమునే చూచుచు నడువవలెను.

'ధీరః-యథాసుఖమ్' అను పదములు ఇందు రహస్యార్థమును సూచించును. "ధీ=బ్రహ్మజ్ఞానమున, ర=రమించువాడు-ధీరుడు." ఆ పచ్చిక బయళ్ళలో తిరుగుటకు ధైర్య మక్కరలేదు. ఇచట "ధీరః" అను పదము కేవలము బ్రహ్మ

జ్ఞాననిష్ఠుడై ఆ బ్రహ్మానుభవనమునకు భంగము. లేకుండ విషయములయందు విహరించుచున్నా డని సూచించుటకే ఇచట ప్రయోగింపబడినది.

ఇట్లు హనుమ నడచుచుండగా చెట్లపై పక్షులు బెదరిపోయినవి. గుండె చెట్లను రాపాడినది. ఎన్నో మృగములు చనిపోయినవి. బలమైన పెద్ద సింహ మువలె ఇపుడు హనుమ కన్పట్టెను.

నల్లని, ఎఱ్ఱని, పచ్చని రంగులు కలిగిన చిత్రవర్ణముల ధాతువులతో ఆ కొండ నిండియున్నది.

కామ రూపముగల యక్షులు, కిన్నరులు, గంధర్వులు ఆ కొండపై నివసించియుండిరి.

ఆకొండ యొక్క ఉపరితలమున నిలచిన కపివరుడు మడుగులో నిలచిన ఏనుగువలె కన్పట్టెను.

అట్లు నిలచి సూర్యునకు, ఇంద్రునకు, వాయువునకు, బ్రహ్మకు, భూత ములకు నమస్కరించెను.

ఒక్కసారి తూర్పుదిక్కుగా తిరిగి తనజన్మకు కారణమైన వాయువునకు నమస్కరించి, దక్షిణదిక్కునకు పోదలంచి శరీరమును పెంచెను.

రాముని వృద్ధికై సముద్రమును దాటుటకు నిశ్చయించిన హనుమ పర్వ దినములలో పొంగుచున్న సముద్రమువలె అంతకంతకు పైకి ఎదిగెను.

సముద్రమును దాటదలంచినవాడై శరీరమును కొలతకు అందనంతగా పెంచెను. తనచేతులతో పాదములతో పర్వతమును అదిమి పెట్టెను.

అట్లు నొక్కగనే కొండ కదలి పూచినచెట్ల పూలన్నియు రాలిపోయెను.

రాలినపూలతో నిండినకొండ పూలకొండవలె భాసించెను. మదించిన ఏనుగునుండి మదము కారినట్లు కొండనుండి నీరుకారు చుండెను.

బంగారు, వెండి, కాటుకరంగుల నీటిధారలు కారుచుండెను.

నల్లని మనశ్శిలలు క్రిందికి పడుచుండెను.

ఆతడింకను గట్టిగనొక్కెను. గుహలలోని జంతాజాలము వికృత స్వర ములతో మహానాద మొనర్చెను.

ఆ ధ్వని దిక్కులంతటను నిండెను.

ఆతడింకను గట్టిగా నొక్కెను. పాములు విషమును గ్రక్కుచు పడగలు కొట్టి రాళ్ళను కాటువేసెను.

కాటు వేయబడిన ఆ మహాశిలల నుండి అగ్నిహోత్రము బయల్వెడలెను.

శిలలు బ్రద్దలగుచుండెను.

విషమును హరింపజాలిన ఓషధు లెన్నియో ఆ పర్వతమున గలవు. కాని ఆ విషమును ఆ ఓషధులు శమింపలేకపోయెను.

ఆ కొండమీద స్త్రీలతో కూడి పానమును సేవించుచున్న విద్యాధరు లీయులజడిని జూచి కొండ బ్రద్దలగుచున్నదని భయపడిరి. బంగారు మద్య పాత్రల నచటనే వదలిపెట్టి, ఎంతో విలువగల భోజనపాత్రలను, ఆహారపదార్థ ములను, ఆయుధములను అన్నిటిని వదలి మద్యపానముచే మదించినవారు ఉన్నవారున్నట్లే ఆకాశమున కెగిరిపోయిరి.

ఆకాశముపై నిలచి, భార్యలతో కలసి ఆశ్చర్యముగా చూచుచుండిరి.

ఇంతలో ఆత్మ జ్ఞానసంపన్నులగు ఋషులు కొందరు ఆకాశముపై నిలచి "వాయుపుత్రుడగు హనుమ పర్వత సదృశుడై మహావేగము గల సముద్రమును దాటబోవుచున్నాడు. ఈ దుష్కరమైన కర్మను రాముని కొఱకు, వానరుల కొఱకు ఈతడు చేయబోవుచున్నాడు. పొందుటకు శక్యముకాని ఆవతలి ఒడ్డును పొందదలంచినాడు " అని అనుకొనుచుండిరి.

ఈ మాటలను విని విద్యాధరులు ధైర్యముతో ఆ వానరశ్రేష్ఠుని చూచుచు నిలచిరి.

హనుమ ఒడలు దులిపెను. వెంట్రుకలను కదలించెను. మేఘ గంభీర ముగ గర్జించెను. వెంట్రుకలతో నిండిన తనతోకను ఒక్కసారి పైకెత్తి దులిపెను. తోకను చాచి, ముడిచి చాచుచుండగా గరుత్మంతుడు తన్నుకొనిపోవుచున్న ఒక మహాసర్పమువలె ఆ తోక కన్పట్టుచుండెను.

పరిఘలవంటి తన చేతులను కదలకుండ బిగించెను. నడుము సన్నము చేసెను. పాదములు వంచెను. బాహువులు ముడిచెను. మెడను కుంచింప చేసెను. బలమును, వీర్యమును పుంజుకొనెను. దూరముగా చూపులు పరపి మార్గమును చూచుచుండెను. హృదయ స్థానమున ప్రాణములను బిగపట్టెను. ఆకాశమునే చూచుచుండెను. పాదములతో నేలను గట్టిగా నొక్కి పట్టెను. చెవులు ముడిచి, ఎగురదలచి, తనచుట్టునున్న వానరులతో ఇట్లు పల్కెను.

"యథా రాఘవనిర్ముక్త శ్శర శ్శ్వసన విక్రమః
గచ్ఛే త్తద్వ ద్గమిష్యామి లంకాం రావణపాలితామ్ 39
న హి ద్రక్ష్యామి యది తాం లంకాయాం జనకాత్మజామ్
అనేనైవ హి వేగేన గమిష్యామి సురాలయమ్. 40

యది వా త్రిదివే సీతాం న ద్రక్ష్యా మ్యకృతశ్రమః
బద్ధ్వా రాక్షసరాజాన మానయిష్యామి రావణమ్. 41
సర్వథా కృతాకార్యోఽహ మేష్యామి సహసీతయా
ఆనయిష్యామి వా లంకాం సముత్పాట్య సరావణామ్. 42"

"రాముడు వదలిన బాణము ఎట్లు వాయువేగముతో పోవునో అట్లే నేను రావణుడు పాలించు లంకకు పోవుదును.

లంకలోగాని సీతమ్మను చూడలేక పోదునా ఆ వేగముతోనే స్వర్గమునకు వెళ్ళెదను.

అచట కూడ సీతమ్మను గాంచలేకపోతినా ఏమియు శ్రమ లేకయే రావణుని బంధించి లంకతో కూడ తెచ్చెదను.

ఏమైనను పనిపూర్తి చేసికొనియే తిరిగి వచ్చెదను. రావణునితో కలిపి లంకనైనను పెకిలించుకొని వచ్చెదను."

ఇట్లు చెప్పి వానరోత్తముడగు హనుమ ఏమియు ఆలోచింపక, వేగముతో ఆకాశమున కెగిరెను.

తత్త్వదీపిక :-

ఆధ్యాత్మికముగ ఇందులో స్ఫురించు అర్థములను చూతము.

హనుమ ఉపాసకుడు, సంసారమును తరించి, ఆత్మ దర్శనము చేసి, భగవత్సమీపమునకు రావలెనని సంకల్పించెను. మహేంద్రముపై నిలచెను. శరీరముకంటె ఆత్మ వేరు - అని శాస్త్రములచే ఎఱింగి అప్పుడు ఆత్మ దర్శనమునకు సాధన చేయవలెను. దేహము కంటె ఆత్మ వేరని ఎఱుంగుటయే పర్వతముపై నిలచుట.

ఏ కార్యమునకైనను ముందుగ సంధ్యావందన మాచరించవలెను.

"సంధ్యాహీనః అశుచిః నిత్య మనర్హః సర్వకర్మసు"

"సంధ్యావందనము చేయనివాడు సర్వకర్మలకును అర్హుడుకాడు."

హనుమ దాని నాచరించును అని సూర్యునకు, ఇంద్రునకు, వాయువునకు నమస్కరించుట సూచించును.

తరువాత యోగాభ్యాసము చేయవలెను. యమనియమములు దానికంగములు. బాహువులను నిశ్చలముగ నిలుపుట, కటిని సంకోచింపచేయుట, భుజములను వంచుట, చెవులు తిన్నగా నిలుపుట మున్నగునవన్నియు లా నాచ

రింపవలసిన కార్యములలో 'ఇంద్రియములయొక్క ప్రవృత్తిని నియమించుట' సూచించును.

యోగాభ్యాసము చేయువారికి ప్రాణాయామము ముఖ్యము.

"రురోధ హృదయే ప్రాణానూర్ధ్వం ప్రణిహితేక్షణః" (సుంద.1-37)

మున్నగువానిలో 'భ్రూమధ్యమున చూపునిల్పి, కుంభకమున ప్రాణమును నిలుపుట' - సూచించును.

పద్భ్యాం దృఢ మవస్థానం కృత్వా" (సుంద. 1-38)

పాదములతో గట్టిగా పట్టి నిలచి అనుటచే 'ఆసనము' సూచింపబడెను.

"ఆకాశ మవలోకయన్" (సుంద. 1-37)

ఇతర విషయములను చూడకుండ ఆకాశమునే చూచుచుండెను- అనుటచే 'ప్రత్యాహారము' సూచింపబడినది.

ఈవిధముగ యోగాంగములను సూచించెను.

ఇట్లు యోగము నభ్యసించునపుడు శరీరములో 'కంపనము, స్వేదము' కల్గును. అట్లే ఇచ్చట కొండ కదలెను, నీరు స్రవించెను.

లోననున్న రాజస, తామస స్వభావములన్నియు వెలికి పోయి సాత్త్వికమగు మనఃస్థితి' ఏర్పడును. కొండనుండి రంగురంగుల నీళ్ళు కారుట, రాళ్ళు పడుట మున్నగువానిచే దానిని సూచించెను.

లోన కొన్ని 'శబ్దములు' వినపడును. దానినే భూతముల ధ్వనులచే సూచించెను.

ఇట్లు యోగాభ్యాసపరునియొక్క దశలను ఇందు వర్ణించెను.

ఇంకను శరీరములో 'తాపము' బయలుదేరును. అది భరించలేనంత తీవ్రతమమైనది. దీనిని పాములు కాటువేయుటలో, మంటలు రేగుటలో సూచించెను.

కవిగా వాల్మీకి, హనుమ పర్వతమును నొక్కునపుడు పీడనము లోని తారతమ్యమును చిత్రముగా చిత్రించెను. మొదట పర్వతమును బాహువులతో, చరణములతో పీడించెను. అపుడు కొండ కదలెను. పూలు రాలెను. అంతకంటె గట్టిగా నొక్కెను. ఎఱ్ఱని, నల్లని, పచ్చని రాళ్ళు కరిగి నీరైపారెను. బండలు జారెను. అంతకంటె గట్టిగా నొక్కెను. ఆ పీడనమున గుహలలో నున్న జంతువులు నొక్కబడి, గట్టిగా అరచినవి. అపు డంతకంటె గట్టిగా నొక్కెను. సన్నని కన్నములలో నున్న పాములు కూడ నొక్కివేయబడెను.

కోపముతో పాములు విషము గ్రక్కినవి. ఇట్లు చమత్కారముగా పర్వతమును పీడించుటలో ఒక క్రమమును నిర్దేశించెను.

హనుమ ఈ కార్యము చేయునది 'రామార్థం, వానరార్థమ్' (రాముని కొఱకు, వానరులకొఱకు) అని ఋషులు పలికిరి. ఈ కార్యము తన కొఱకు అనుబుద్ధి హనుమకు లేదు. భగవత్ప్రీతికొఱకో, లోక క్షేమమునకో మహాపురుషులు కార్యముల నాచరింతురు.

ఇక ఎగురబోవుచు తన చుట్టునున్న వానరులతో "రాముడు వదలిన బాణము ఎట్లు వాయువేగముతో పోవునో అట్లు పోయి వచ్చెదను" అని చెప్పెను. ఇదియే కర్మయోగము యొక్క మూల సూత్రము. హనుమ ఈ పనిని తాను చేయుచున్నానని గాని, తన కొఱకని గాని, ఈ పని తనది అని గాని భావించుటలేదు. రాముడు వదలిన బాణమునకు సహజమైన వేగముగాని, శక్తిగాని లేవు. అది రాముని పనిముట్టు. రాముడు తన పనికై వినియోగించుకొనును. అపుడు రాముడు వేగముతో లాగి వదలగా రాముడు కల్పించిన వేగమే దాని వేగముగా ఆ బాణము పోవును; మధ్యలో ఆగదు. లక్ష్యమును చేరును. హనుమ తన్ను ఆ బాణముతో పోల్చుకొనుచున్నాడు. రాముని బాణము ఎట్లు సహజమగు వేగములేనిదో నేనును అంతే! రామునిపనిమీద రాముడు పంపగా రామునివేగము నా వేగమై పోవుదును గాని ఇది నా శక్తి కాదు. అని భగవత్పారతంత్ర్యమును భావించుకొనును. ఆత్మజ్ఞానమునకై భగవత్ప్రాప్తికై యత్నించువారు ఈ పారతంత్ర్యమును పూర్తిగా పాటింపవలెను. ఇట్లు భావించి హనుమ ఎగురును.

తత్త్వదీపిక:-

తనను గరుత్మంతునిగా భావించుకొనును.

యోగశాస్త్ర ప్రక్రియలో ఆకాశగమనమున గరుడుడుగా, జల సంచారమున మత్స్యముగ భావనచేయుట ఆవశ్యకమని తెలియుచున్నది. దానిచే ఆకాశగమనశక్తి కలుగును.

హనుమ ఆకాశమున కెగురగనే పూవులతో, పక్షులతో నిండిన చెట్లు ఆతని తొడల వేగమున పైకి లేచి పోయెను. దూర దేశమున కేగు తమ బంధువును బంధువులనుసరించినట్లు ఆవృక్షములు హనుమ ననుసరించెను.

ఇంకను బలమైన వేరుపట్టుగల చెట్లుకూడ ఆతని తొడల వేగమునకు పెరికి వేయబడి సైన్యములు రాజు ననుసరించినట్లు ఆతని ననుసరించి పోయినవి.

పూచినచెట్లతో కూడినవాడై ముందునకేగుచున్న హనుమ ఒక పర్వత మువలె అద్భుతముగ కన్పట్టుచుండెను.

బరువైన చెట్లు సముద్రములో పడి మునిగిపోయినవి. ఆ చెట్ల నుండి పూలు రాలినవి. దూరదేశమున కేగుచున్న మిత్రుని సాగనంపుచు నీటిపట్టు వరకు వెళ్ళి కన్నీరు కార్చుచు దుఃఖములో మునిగిన ఆప్తులవలె ఆ చెట్లు కన్పించెను.

**తత్త్వదీపిక :-**

ఇది చాల విచిత్రమైన సన్నివేశము. కవి ఎంతో రమణీయముగా వర్ణించెను. ఇందులోని చమత్కారము చూడుడు. హనుమంతుననుసరించి వెళ్ళిన చెట్లకు రెండువిధములగు ఉపమానములు ఇందు కన్పట్టును.

(1) బంధువు వెంట వెళ్ళు బంధువులు.

(2) రాజు వెంట వెళ్ళు సైనికులు. (సుందర.1-47,48)

ఈ రెంటిలోను అనుసరించి వెళ్ళుట సమానమే! మొదటిది అనురాగము చేత, రెండవది నిర్బంధముచేత, బంధువు వెంట బంధువులు వదలలేక వెళ్ళుదురు. రాజువెంట సైనికులు ఫలమునకై యాశించికాని, వెళ్ళుట తమ ధర్మమని కాని వెళ్ళుదురు.

ఇట్లే మహాపురుషులు ఆధ్యాత్మికమార్గములో పయనించునపుడు, వారి దర్శనముచేసిన ప్రజలలో కొందరు తమంత తామే భక్తితో వారి మార్గమున నడువవలెనని యత్నించి నడిచెదరు. మరికొందరు వారి బలముచేకాని, ప్రతిఫలాపేక్షచేకాని కొంత దూరము వారివెంట నడతురు.

'వృక్షము' అను పదము శరీరమును సూచించును. పుష్పము జ్ఞానమును సూచించును. ఇచట వృక్షములు కొన్ని బరువైనవి, కొన్ని తేలికయైనవి. బరువైనవి కొంతదూరము హనుమతో వెళ్ళి సముద్రములో పడును. తేలికయైనవి మరికొంతదూరము వెళ్ళును.

మహాపురుషులసన్నిధిలో వారిబలముచే మనకుకూడ వివిధ విషయసంగములు వీడిపోయినట్లుండును. పూలు రాలిపోయినట్లు నానా జ్ఞానములు రాలిపోవును. వారి ననుసరింతుము. కాని అందు బరువైన చెట్లు-విషయవాసనలతో నిండిన శరీరములు. అవి వేగముగ మరల సంసారసముద్రములో

పడును. అంతకంటె తక్కువ వాసనలు గల శరీరములు - తేలికయైన చెట్లు. అవి మరికొంత దూరమేగి సముద్రములో పడును.

ఇట్లు మహాపురుషుల సన్నిధిలో, సామాన్యులలో కలిగెడి పరిణామము ఇచట సూచింపబడెను.

హనుమ రెండుచేతులు ముందునకు చాచుకొని పోవుచున్నాడు.

పర్వత శిఖరమునుంచి పొడుచుకొని వచ్చిన ఐదు తలలుగల పాముల వలె ఆ చేతులు ప్రకాశించుచుండెను.

హనుమ ఏ తీరుగ ఎగిరెనో కవి ముందుగా సూచించుచున్నాడు.

తిన్నగా ముందు సముద్రమువైపు వెళ్ళి, తరువాత ముఖము పైకెత్తి అంతరిక్షమున కెగిరెను.

"పిబన్నివ బభౌ చాపి సోర్మిమాలం మహార్ణవమ్
పిపాసు రివ చాకాశం దదృశే స మహాకపిః" (సుంద.1-57)

కెరటములతో గూడిన ఆ సముద్రమును త్రాగుచున్నాడా అనునట్లు ముందేగును. పిమ్మట ఆకాశమును త్రాగబోవుచున్నాడా అనునట్లు కన్పట్టెను.

తత్త్వదీపిక :-

ఈ వర్ణనలో సముద్రమును త్రాగుచున్నాడా!! అనుటచే తిన్నగా సముద్రమువైపు వెళ్ళినట్లును; ఆకాశమునే త్రాగబోవుచున్నాడా అనుటచే ఆకాశమువైపు తలయెత్తి మీది కెగురుచున్నాడనియును తెలియుచున్నది.

అంతరిక్షమున హనుమ వెళ్ళుచున్నాడు. ముందు నుడి హనుమను చూచిన, మెరపులువలె పచ్చగా మెరసెడి ఆతని కన్నులు కొండపై నున్న రెండు అగ్నులవలె కన్పట్టెను.

సూర్యచంద్రులిద్దరు ఒక్కసారి ఉదయించుచున్నట్లు కన్పట్టును.

ఎఱ్ఱని నాసికతో కూడిన ముఖము సంధ్యారాగరంజితమగు సూర్యమండలమువలె కన్పట్టెను.

ప్రక్కనుండి హనుమను జూచినచో పైకెత్తి తలకు తాకునట్లు వంచబడిన తోక ఇంద్రధనుస్సువలె కన్పట్టును.

పరివేషములో నున్న సూర్యునివలె లాంగూలచక్రముతో కూడిన ఆ

హనుమే కన్పించును.

తత్త్వదీపిక:-

ఇట్లు హనుమ సాగుచున్నపుడు హనుమరూపమును ఎదుటినుండి, ప్రక్కనుండి, వెనుకనుండి దర్శించి వాల్మీకి మనకు దర్శింపచేయును.

రాక్షస వినాశసూచకముగా ఉత్తమువైపు తోకకలిగి, దక్షిణమువైపు పడుచున్న తోకచుక్కవలె హనుమ కన్పట్టెను.

నీడ సముద్రములో పడి హనుమ ముందునకు సాగుచుండగా, నీటిలో కొంత మునిగి, తెరచాప నీడ వడి, సముద్రములో నడచుచున్న పడవవలె హనుమ కన్పట్టెను.

సముద్రములో హనుమ వెళ్ళుచున్న వైపు సముద్రము ఉల్లోల కల్లోలమగుచుండెను. పర్వతమువలె కెరటములు పై కెగయుచుండెను. హనుమ తనగుండెలతో ఆ కెరటములను రాసికొనుచు ముందున కేగుచుండెను. కెరటములను ముందునకు లాగికొనుచు హనుమ ముందుకు ముందుకు దూసికొనుపోవుచుండెను. మేరు మందర సమానములుగ పై కెగసిన కెరటములను లెక్కించుచున్నట్లు ఒక్కొక్క దానిని మీరుచుండెను.

సముద్రములో జలము ఆతని వేగమునకు ప్రక్కలకు తొలగగా తిమిన క్రకూర్మాది జలచరములు వస్త్రమును తొలగించిన అవయవములు కన్పడినట్లు స్పష్టముగ కన్పడుచుండెను.

పది యోజనముల వెడల్పు, ముప్పదియోజనముల పొడవుగల హనుమ నీడ సముద్రములో కన్పట్టుచుండెను.

తత్త్వదీపిక:-

దీనిచే హనుమః ప్రాతఃకాలముననే సముద్రలంఘనము చేసెనని తెలియును. ప్రాతఃకాలమున నీడ శరీరముకంటె ఎన్నోరెట్లు అధికముగా నుండునుగదా!

పక్షులు ఎగిరెడి మార్గములో పక్షిరాజువలె సాగుచుండెను. మేఘమండలమున మేఘములను చిందరవందరచేయు మారుతమువలె సాగుచుండెను.

రంగురంగుల మేఘములను హనుమ ముందునకు లాగికొని పోవుచుండెను.

మేఘములమధ్య మరుగుపడుచు, బయల్పడుచు చంద్రుని వలె హనుమ సాగుచుండెను.

ఇట్లు త్వరితముగ సాగుచున్న హనుమను జూచి దేవతలు పుష్పవృష్టిని కురిపించిరి. సూర్యుడు ఎక్కువ తాపము కలుగకుండచూచెను. వాయువు అనుకూలముగ సేవించుచుండెను.

ఋషులు స్తుతించుచుండిరి. దేవగంధర్వులు ప్రశంసించుచు గానము చేయుచుండిరి. అందరును శ్రమలేకుండ ముందునకేగుచున్న హనుమను జూచి స్తోత్రము చేయుచుండిరి.

తత్త్వదీపిక:-

ఈ వర్ణనలో సముద్రోపరితలమునుండి అంతికుపైకెగిరిన క్రమము వివరింపబడినది.

ఈ విధముగ హనుమ సాగుచుండగా ఇక్ష్వాకువంశమునకు సమ్మానము చేయవలెనని తలంచిన సాగరుడు "ఈవానరేంద్రునకు నేను సాయపడకపోతినా, నే నందఱచేతను నిందింపబడ తగినవాడనగుదును. ఇక్ష్వాకువంశమునకు చెందిన సగరుడు నన్ను పోషించినవాడు. ఆ వంశమునకు చెందిన రామునకీతడు దూత. అందుచే ఈతడు దిగులుచెందకుండ నేను చేయవలెను. ఈతడు విశ్రమించి సుఖముగా ముందునకేగునట్లు ఆశ్రయమును కల్పించెదను" అని ఆలోచించి తనలో దాగియున్న మైనాకుని పిలిచి ఇట్లు చెప్పెను.

"మైనాక! పాతళములో దాగియుండి మరల మరల పైకి ఎగరబోవుచున్న అసురులకు ఆటంకముగా నిన్నింద్రుడు పాతాళద్వారమునకు అడ్డుగా నిల్పినాడు. నీకు అడ్డముగా క్రిందకు పైకి కూడ పెరుగుటకు శక్తి కలదు. అందుచే నీవు పైకి లెమ్ము. రాముని పనికై ఆకాశములో ఎగురుచున్న హనుమ నీపై దిగును. ఇక్ష్వాకువంశమునకు చెందిన రాముని సేవించుచున్న ఈతనికి మనము సాయపడవలయును. నాకు వారు పూజ్యులు కనుక నీకు పూజ్యతములు. ఈ కార్యము మించిపోకుండ నీవు మాకు తోడుపడవలెను.

'కర్తవ్య మకృతం కార్యం సతాం మన్యు ముదీరయేత్' (సుంద. 1-97)

చేయదగినపనిని చేయనిచో పెద్దలకాగ్రహము కలుగును. నీటిలో నుండి పైకి లెమ్ము. ఈ కపివరుడు మనకు అతిథి, పూజ్యుడు. ఈతతడు నీపై విశ్రమించి మిగిలిన భాగమును దాటగలడు. రాముని దయాగుణమును, సీత లంకలో ఉండుటను, హనుమ పడెడి శ్రమను జూచి నీ వీ సాయము చేయక తప్పదు."

ఇట్లు చెప్పగనే హిరణ్య నాభుడగు మైనాకుడు వృక్షములతో, లతలతో, మేఘమును చీల్చుకొని సూర్యుడు బయల్పడినట్లు సముద్ర జలములనుండి పైకి లేచెను. సూర్యునివలె మెఱయుచున్న బంగారు శిఖరములతో ఆ పర్వత శ్రేష్ఠము లేచి నిలచెను.

హనుమ ఎదురుగా నున్న ఆ పర్వతమును అసంగముతో చూచి సముద్రములో తన ప్రయాణమునకు ఏదో విఘ్న మేర్పడినదని భావించెను.

ఉన్నతముగ లేచిన పర్వతశిఖరమును మహావేగముతో పోవుచున్న మహాబలుడగు ఆ హనుమ, గాలి మేఘమును చిందరవందరచేసినట్లు తన గుండెలతో నుగ్గు చేసెను. మైనాకుడు ఆతని వేగమును తెలిసికొని సంతోషించెను. మనుష్యరూపమును దాల్చి పర్వతశిఖరమున నిలచి మైనాకుడు హనుమతో ఇట్లు పల్కెను.

"ఓ వానరోత్తమ! నీవు దుష్కరమగు కర్మ నొనర్చితివి. నా శిఖరములపై విశ్రమించి ముందుకు సాగుము. రఘువంశజులచే సముద్రము పూర్వము పోషింపబడినది. రామకార్యమున వెళ్ళుచున్న నిన్ను సాగరుడు ఆరాధించుచున్నాడు. ఇది రాముని పూర్వులు చేసినదానికి ప్రత్యుపకారము. ఉపకారము చేసినవారికి ప్రత్యుపకారము చేయుట సనాతన ధర్మము.

'కృతే చ ప్రతి కర్తవ్య మేష ధర్మః సనాతనః' (సుంద. 1-114)

నీవు ఆతని ఆతిథ్యమును స్వీకరించుటయే ఆతనికి సమ్మానమని సముద్రుడు భావించుచున్నాడు. నీకు విశ్రాంతి కల్పించుటకు నన్ను సముద్రుడు ప్రేరణ చేసి పంపినాడు. ఆగుము. నాయందు విశ్రమించి ఏగుము. నాశిఖరములపై సువాసనగల రుచ్యములైన కందమూల ఫలములు గలవు. వానిని ఆస్వాదించి వెళ్ళుము. మాకు గూడ నీతో సంబంధమున్నది. వేగముతో ఎగురగల ప్లవంగములలో నీవు ముఖ్యుడవు.

'అతిథిః కిల పూజార్హః ప్రాకృతోపి విజానతా
ధర్మం జిజ్ఞాసమానేన కిం పునస్త్వాదృశో మహా౯' (సుంద. 1-120)

సామాన్యుడైన అతిథినికూడ ధర్మమునెఱింగినవాడు తప్పక పూజింపవలెను. ఇంకను నీవంటివానిని ఆదరించుట ఒక విశేషమా! నీవు మహాత్ముడగు వాయుదేవుని పుత్రుడవు. వేగములో ఆతనికి సమానుడవు. నిన్ను పూజించినచో ఆ వాయువునే పూజించినట్లగును. అందుచే నిన్ను పూజించుట నాకు కర్తవ్యము. ఏలయన-

పూర్వము కృతయుగములో పర్వతములకు రెక్కలుండెడివి. అన్ని దిక్కులకు వాయువేగముతో పోవుచుండెడివి. అవి మీద పడునేమో యని దేవతలు, ఋషులు, సర్వభూతములు భయము నొందినవి. అంత ఇంద్రుడు కోపము తెచ్చుకొని వజ్రముతో పర్వతములరెక్కలు ఛేదించెను. వజ్రమునెత్తి నా రెక్కలను కూడ ఖండించుటకు సన్నద్ధుడై వచ్చెను. అపుడు మహాత్ముడగు వాయువు నన్ను త్రోసి తెచ్చి సముద్రములో పడవైచెను. నా రెక్కలు పోకుండ ఈ సముద్రములో దాచి నన్ను మీ తండ్రి రక్షించెను.

అందుచే నీవు నాకు గౌరవింపదగినవాడవు. నీతో నాకీ సంబంధముండుటచే నిన్ను నేను గౌరవించుచున్నాను. నిన్ను సత్కరించుట సముద్రమునకు, నాకు కూడ కర్తవ్యమే! మాపై ప్రీతిని జూపి, నాశిఖరములపై విశ్రమించి, పూజను స్వీకరించి ఏగుము."

ఇట్లు మైనాకుడు చెప్పగా విని హనుమ ఇట్లు పల్కెను.

"ప్రీతోఽస్మి, కృత మాతిథ్యం, మన్యు రేషోపనీయతాం,
త్వరతే కార్యకాలో మే, అహ శ్చాప్యతివర్తతే,
ప్రతిజ్ఞా చ మయా దత్తా, న స్థాతవ్య మిహాన్తరే"

(సుంద. 1-131, 132)

"సంతసించితిని, ఆతిథ్య మొనర్చితివి. దిగుమని పట్టు పట్టకుము. కార్యమునకు వేళ మీరుచున్నది. ప్రొద్దుపోవుచున్నది. ప్రతిజ్ఞ చేసితిని, మధ్యలో ఆగరాదు."

హనుమ ఇట్లు పలికి పర్వతమును చేతితో స్పృశించి మందహాసముతో ఆకాశములో ముందునకు సాగెను.

తత్త్వదీపిక:-

ఇచ్చట హనుమ చెప్పిన మాటలలో కవి తన లోకజ్ఞతను ప్రదర్శించెను. తొందరగా పోవుచున్నవారిని ఎవరైన కన్పించి ఆదరముతో గౌరవింప చూచినను వారు "వచ్చెదను! వచ్చెదను! సంతోషము, ప్రొద్దుపోవుచున్నది. వేళయగుచున్నది" అని చెప్పి ముందునకు సాగెదరు. అట్లే--

ఇచట హనుమ చెప్పిన సమాధానము చిన్న వాక్యములతో సాగినది.

ప్రతిపదార్థము :-

"ప్రీతోఽస్మి=సంతోషించితిని; కృత మాతిథ్యం=ఆతిథ్యము నిచ్చితివి. మన్యు రేషోఽపనీయతాం=పట్టువదలుము; త్వరతే కార్యకాలో మే= పనితొందరగానున్నది; అహ శ్చాప్యతివర్తతే=ప్రొద్దు పోవుచున్నది; ప్రతిజ్ఞా చ మయా దత్తా =నేను ప్రతిజ్ఞ చేసితిని; న స్థాతవ్య మిహాన్తరే=మధ్యలో ఆగరాదు."

అని పొడిపొడిగా చిన్న చిన్న వాక్యములతో రచన సాగినది.

ఇది సహజమగు ఉక్తి వైచిత్రి.

ఇచట హనుమ "ప్రతిజ్ఞ నిచ్చితిని గనుక ఆగకూడదు" అనెను.

బయలు దేరుచున్నపుడు వానరులతో "రాముడు వదలిన బాణమువలె లంకకు పోవుదు" నని చెప్పెను. రాముని బాణము మధ్యలో ఆగదు. లక్ష్యమును చేరియే తీరును. అందుచే హనుమ మధ్యలో ఆగరాదు. ఆగిన, రామునిబాణముతో పోలిక తనకు తగదు. అందులకై ఆగక ముందునకు సాగెను.

ఇది హనుమ చేసిన రెండవ దుష్కరకర్మ. దానిని జూచి ఋషులు, సిద్ధులు ప్రశంసించిరి.

ఇంద్రుడు సంతోషముతో."మైనాక! సంతోషించితిని. అభయము నొసంగుచున్నాను. నీవు హాయిగా నుండుము. హనుమ సముద్రలంఘనము చేయుచుండగా నీవు సాయపడితివి. రామునికి దూతగా ఏగుచున్న హనుమకు నీవు సత్కార మొనర్చితివి గనుక నేను సంతోషించితిని" అని పల్కెను. ఇట్లు వరమును పొందిన మైనాకుడు వెలుపలనే ఉండిపోయెను.

హనుమంతుడు ముందునకు పోగుచుండెను. దేవతలు, గంధర్వులు, ఋషులు సూర్యునివంటికాంతిగల సురసను చూచి-

"వాయుపుత్రుడగు హనుమ సముద్రమును దాటుచున్నాడు. ఎంతదూరమేగినను అతని కాంతి పెరుగుచున్నదేగాని వాడుటలేదు. నీవాతనికి ఒక్కసారి విఘ్నమును కల్గించుము. ఘోరమగు రాక్షస రూపమును స్వీకరించి, పర్వతమువలె అడ్డముగ నిలచి, కోరలతో భీకరమైన నీ నోటిని ఆకాశమంతచేసి ఆతనిని అడ్డుము. ఈతని బల పరాక్రమములను ఎఱుంగగోరుచున్నాము. నిన్నాతడు ఉపాయముతో జయించునో, లేక దిగులు పడునో చూడవలెను" అని కోరిరి.

ఇట్లు దేవతలు కోరగనే సురస రాక్షస రూపమును దాల్చి హనుమ మార్గమును అడ్డగించి నిలచెను.

"ఓ వానరా! దేవతలు నిన్ను నా కాహారముగా నొసంగిరి. నేను నిన్ను భక్షించెదను. నా ముఖమున ప్రవేశించుము" అనెను.

అపుడు హనుమ సంతోషముతో నిండిన ముఖముగలవాడై శ్రీమంతుడై యుండెను.

తత్త్వదీపిక:-

వెనుక మైనాకమును దాటి ముందున కేగుచున్న హనుమను జూచి దేవతలు 'శ్రీమంతు' డనిరి.

ఇపుడు సురస, ఎదిరించగా కలత చెందక నవ్వుచు నిలచిన హనుమను 'శ్రీమంతు' డనెను.

ఇచట 'శ్రీ' అనగా బాహ్యమగు ఐశ్వర్యము కాదు. సుందరకాండలో 'శ్రీమాన్' అను పదము వచ్చినపుడెల్ల ఆంతరమగు అర్థమును జూచుకొనుచుండవలెను.

సంసారమను సముద్రమును దాటుటకు ఉపక్రమించిన సాధకుడు ఎట్టి అధ్యవసాయముతో నుండవలెనో హనుమ మొదట చూపెను. ఆధ్యాత్మికముగ పయనించువానికి కూడ ముందు వ్యవసాయాత్మికమైన బుద్ధి యుండవలెను. ఈ వ్యవసాయాత్మికమైన బుద్ధి కలిగి ఏమియు ఆధారములేక భగవానునే ఆధారముగా పట్టి సర్వ వ్యాపారములు ఏక ముఖముచేసి ఆత్మజ్ఞానమునకు, భగవత్ప్రాప్తికి ఉద్యమించి సంసారమున సాగుట మొదటి దుష్కరకర్మ.

అట్లు కొంత సాధనచేయగనే భగవదనుగ్రహముచే అనుకొనకుండ

సత్కారములు, పూజలు లభించును. అపుడు వాని కాశపడి ఆగెనా- మరి ముందున కేగడు. భగవంతునికే పరతంత్రుడై తాను లక్ష్యము సిద్ధించువఱకు ఆగకుండ సాగవలెను. ఇట్లు సమ్మాన పూజాదులకు వశపడకుండ ముందునకు సాగుట రెండవ దుష్కరకర్మ.

ఎక్కడ ఆగకుండ సాగుచున్నను అంతకంతకు దానియందాసక్తి పెరిగి విసుగు లేక ముందునకు ఏగగల్గుట ఐశ్వర్యము. ఆ ఐశ్వర్యము కలవాడు గనుక హనుమను దేవతలు 'శ్రీమంతు' డనిరి. ఇపుడు మరొక ప్రతిబంధకము వచ్చినది. దానిని చూడగనే దిగులు చెందలేదు. సంతోషించెను. బంగారమునకు కాల్చినకొలది వన్నెవచ్చినట్లు నిజమైన జ్ఞానులకు ఇట్టి పరీక్షలు మరింత దీప్తిని కల్గించును. ఇట్లు ప్రతిబంధకము కల్గినను చలింపక నిలచుట ఐశ్వర్యము. అట్టి ఐశ్వర్యముగల శ్రీమందు హనుమ.

అట్టి శ్రీ మంతుడగు హనుమ దోసిలి ఒగ్గి సురసతో--

"దశరథపుత్రుడగు రాముడు సోదరుడగు లక్ష్మణునితో, భార్య యగు వైదేహితో దండకారణ్యమున ప్రవేశించెను. వేరొకపనిలో నుండగా రావణుడు పగ పెట్టుకొని ఆతని భార్యను అపహరించెను. ఆమె వద్దకు నేను దూతగా రాముని ఆజ్ఞపై ఏగుచున్నాను. నీవుకూడ ఆ రామునికి సాయము చేయ దగును, లేదా, సీతమ్మను చూచి, మరల రామచంద్రుని చూచి నీనోటిలో ప్రవేశించెదను. నిజము - ఒట్టు" అనెను.

సురస "నన్ను దాటి వెళ్ళుటకు వీలు లేదు, ఇది నాకు దేవతలిచ్చిన వరము. ఇపుడే నానోట నీవు ప్రవేశింపవలెను" అని నోరు తెరచి నిలచెను.

హనుమ "సరే! కానిమ్ము. నన్ను మ్రింగగల్గినంత నోరు తెరువుము" అని పలికి పది యోజనములు పెరిగెను. సురసకూడ ఇరువది యోజనములు నోరు విప్పెను. హనుమ ముప్పదియోజనములాయెను; సురస నలుబది యోజనము నోరు చేసెను. ఇట్లు పెరుగుచుండగ సురస నూఱు యోజనము లనోరు విప్పెను. బుద్ధిమంతుడగు హనుమ, తెరచిన ఆమెనోటిని జూచి ఇట్లు పెరుగుచు పోయిన, దీనికి అంతుండదని తన శరీరమును సంకోచింపచేసి అంగుష్ఠ మాత్రుడై ఆమె నోటిలో ప్రవేశించి దాటి ఆవల నిలచెను.

అంతరిక్షములో నిలచిన ఆ శ్రీమంతుడు "దాక్షాయణీ! నీనోటిలో ప్రవేశించితిని నమస్కారము. వైదేహి యున్నచోటున కేగెదను. నీకు దేవత

లిచ్చిన వరము సత్యమాయెను కదా!" అని పలికి రాహువు పట్టు విడిన చంద్రునివలె ఆనందముతో ప్రకాశించుచుండెను.

సురస స్వస్వరూపమును పొంది --

"అర్థసిద్ధ్యై హరిశ్రేష్ఠ గచ్ఛ సౌమ్య యథాసుఖం
సమానయస్వ వైదేహీం రాఘవేణ మహాత్మనా" (సుంద. 1-162)

"ఓ వానరశ్రేష్ఠ! హాయిగా ముందునకు సాగి కార్యసిద్ధి నొందుము. మహాత్ముడగు రామునితో సీతమ్మను చేర్చుము" అని ఆశీర్వదించి చనెను.

ఇది మూడవ దుష్కరకర్మ. 'సాధు సాధు'=భేష్, భేష్ అని భూతములన్నియు ప్రశంసించెను.

తత్త్వదీపిక:-

ఇందులో కూడ సురసనోటినుండి హనుమ విడువడెను.

"అన్తరిక్షే స్థితః శ్రీమాన్" (సుంద.1-159)

"ఆకాశములో నిలచిన శ్రీమంతుడు"--అని హనుమను శ్రీమంతుడుగా పేర్కొనిరి.

ఆధ్యాత్మిక జీవితమున పయనించునపుడు మూడవ దుష్కరకర్మ సురస నుపాయముతో జయించుట.

మానవునకు శాస్త్రవిహితమగు కర్మాచరణము ముఖ్యము. అది దేవతానుగ్రహమును కల్గించును. ఆకర్మలే బంధము నిచ్చును. అవియే ఉపాయముతో ఆచరించినవాడు బంధింపక ఆత్మజ్ఞానమునకు, భగవత్ప్రాప్తికి సాయపడును. ఈ రహస్యము సురస వృత్తాంతములో చిత్రింపబడినది.

శాస్త్ర విహితములగు కర్మలను ఆచరించినవాడు ఈ లోకములోను పై లోకములోను సుఖమును పొందును. అట్లు సుఖము నిచ్చెడి విహితములగు కర్మలకు 'సురస' అని పేరు.

"సు=మంచి; రస=ఆనందమును నిచ్చునది."

ఆ కర్మ దేవతలచే పంపబడినది. అనగా వారిచేతనే నియమింపబడి చేయబడునది. కాని దానిని 'నేను నా కొరకు చేయుచున్నాను' అను బుద్ధితో, కోరికతో ఆచరించిన అది ఫలము నిచ్చును. కాని ఆ సుఖముచే బంధించును.

కాని దానినే 'చేయునది వాడే, చేయించునది వాడే, ఫలము వానిదే' అని ఫల సంగ కర్తృత్వములను విడచి చేసినచో ఆ కర్మ బంధింపదు. ఆత్మజ్ఞానమును, భగవత్ప్రాప్తిని పొందుటకు సాయపడును.

సురస రాక్షసికాదు. రాక్షసి రూపమున మ్రింగుటకు వచ్చినది. దేవతల ప్రేరణే వచ్చినది. అట్లే కర్మలు మనము చేయదగినవి, చేయవలసినవి-అని శాస్త్రములలో చెప్పబడినవి చెడ్డవి కావు. కాని అవి బంధించునట్లు కన్పడును. అవి శాస్త్రవిహితములు. వానిని కోరికతో ఆచరించి ఫలమును పొందుట-సురస నోరు పెంచిన కొలది హనుమ పెరుగుట. కోరిక లధికమైన కొలది కర్మ లధికమగు చుండును. అధికముగ ఫలము నిచ్చుచుండును. అట్లు పెరుగుట మాని హనుమ బుద్ధిమంతుడై శరీరమును సంకోచింపచేసెను. "నేను-నాది-నాకొఱకు" అనునవి పెరుగుటయే హనుమ పెరుగుట. అవి తగ్గుట హనుమ తగ్గుట. ఇది బుద్ధిమంతుడు చేయుపని. బుద్ధి=జ్ఞానము. ఆత్మస్వరూపము నెఱిగినవాడు ఫల సంగ కర్తృత్వములను విడిచి కర్మ నాచరించును. ఆ కర్మలు వానిని బంధింపవు. అపుడాకర్మ యజ్ఞ మగును.

"యజ్ఞార్థా త్కర్మణోన్యత్ర లోకోఽయం కర్మబంధనః."

భగవత్పరముగ చేయు కర్మ బంధింపదు. దీనిని ఎఱింగి కర్మ చేయుటచే కర్మఫలము నీయదు. సురస నోటిలో నుండి దూరినను హనుమ మ్రింగబడ లేదు. కర్మలాచరింపవలెను, కాని వానిచే బంధింపబడరాదు. కర్మలను నాశము చేయరాదు. హనుమ సురసను చంపలేదు. నోటిలో నుండి దూరెను. కాని బంధింపబడలేదు.

ఇట్లు కర్మాచరణమున మానవు డవలంబింపవలసిన విధానమును సురస వృత్తాంతము నిరూపించును. ఇది మూడవ దుష్కరకర్మ. కర్మలు బంధించునని భయపడక వానినాచరించుచు వాని నుండి బయటపడి ఆ కర్మలనే ఆత్మజ్ఞానమునకు, భగవత్ప్రాప్తికి సాయపడునట్లు చేసికొనెడి ధీమంతుడే శ్రీమంతుడు.

హనుమ ముందునకు సాగుచుండెను. గరుడ వేగముతో పోవుచుండెను. నిరాలంబముగ, ఆకాశమున రెక్కలు గల పర్వత మెగురుచున్నట్లు పోవుచుండెను.

సముద్రములో కామరూపిణియగు 'సింహిక' యను రాక్షసి ఆ హనుమను జూచి "ఇంతకాలమునకు నాకు భోజనము దొరికినది, ఇంతటి పెద్ద జంతువు నాకు స్వాధీనమైనది" అని అనుకొని హనుమ నీడను పట్టి లాగు

చుండెను.

హనుమ నడక కుంటుపడెను. ఎదురుగాలికి మందగించిన ఓడవలె హనుమ ఉండెను. ప్రక్కలకు, మీదకు, క్రిందకు చూచెను. క్రింద సముద్రములో ఆ మహాభూతమును జూచెను.

సుగ్రీవుడు సముద్రములో నీడను బట్టి లాగెడి ఒక మహాసత్త్వమున్నదని చెప్పెను. ఆమాట హనుమకు గుర్తు వచ్చెను. అది సింహిక యని ఎఱింగెను.

తన శరీరము నొక్కసారి పెంచెను. పెరుగుచున్న ఆతనిని మ్రింగుటకు తగినంతగా సింహిక నోరు పెంచెను. మ్రింగుట కాతని మీదకు వచ్చెను.

వెంటనే హనుమ తన శరీరమును సంకోచింపచేసి, దాని నోటిలో దూరి తన గోళ్ళతో దాని మర్మములను త్రుంచి మరల అంతరిక్షమును చేరెను. తన శరీరమును యథాపూర్వముగ పెంచెను.

సింహిక హృదయము నాతడు త్రుంచుటచే ఆమె సముద్రములో పడెను. ఆకాశమునం దుండు భూతములన్నియు హనుమ చేసిన ఆ మహాభయంకరమగు కృత్యమును జూచి--

"వానరేంద్ర! నీ కభిమతమగు అర్థమును సాధించుము. నీవలె ఎవనికి ధృతి, దృష్టి, మతి, దాక్ష్యము ఉండునో వాడు తన కర్మలలో ఎన్నడును దిగులునొందదు" అని పలికెను.

ఇట్లు సముద్రమును దాటుట పూర్తికావచ్చినది. ఈ సింహికను చంపుట నాల్గవ దుష్కరకర్మ.

తత్త్వదీపిక :-

ఆధ్యాత్మికమార్గములో పయనించువాడు విహితకర్మలను ఎట్లాచరింపవలెనో, నిషిద్ధకర్మలను అట్లు పరిత్యజింపవలెను. చేయకూడదు- శాస్త్రములలో చెప్పని కర్మలను, మన మాచరించిన అవి మనలను హింపించును. కావున అవి 'సింహిక' యనబడును, సింహిక=హింపించునది.' నిషిద్ధకర్మకు మనమెట్లు వశమగుదుమో మనకు తెలియదు. చేయకూడదని తెలిసియు, చేయవలదనుకొనుచునే, దానికి వశమగుదుము. వశమైన తరువాత గాని వశపడినట్లు తెలియదు.

ఈ కర్మలు మనకు తెలియకుండ ఆక్రమించుటయే-సింహిక నీడను బట్టి లాగుట. అట్టి కర్మలను వెంటనే విడువవలెనే గాని వానిని ఆచరింపరాదు. అందుకే సురసను చంపకుండ వదలిన హనుమ సింహికను చంపెను.

ఇద్దరును స్త్రీలే! అయినను ---

ఆమెలో నుండి దూరి, బైటపడి, నమస్కరించి ఆశీర్వాదమును పొందును.

ఈమెలో నుండి దూరి చంపును.

విహితకర్మల నాచరించుచు బంధింపబడకుండ ముందునకు సాగవలెను. నిషిద్ధకర్మలను అక్కడకక్కడే వదలవలెను.

సముద్రలంఘనమున హనుమ చేసిన దుష్కరకార్యములు నాలుగు.

1. "నిరాలంబముగ ఆకాశమున పయనించి నూఱు యోజనముల సముద్రమును దాటెదను" అని పూనికతో నిలచుట.

2. మైనాకుడు సగౌరవముగ విశ్రాంతిని కల్పించినను దానిని పొంద కుండుట.

3. సురసను ఉపాయముతో జయించి బయల్పడుట.

4. సింహికను చంపుట.

ఈ నాలుగింటికి నాలుగు లక్షణములు ఉండవలెను.

1. ధృతి 2. దృష్టి 3. మతి. 4. దాక్ష్యము.

1. వ్యవసాయాత్మిక బుద్ధి :-

తన బుద్ధుల నన్నిటిని ఆత్మజ్ఞానము వైపే మరలించి వేర్వేరు ఫలము లను కోరక సర్వవ్యాపారములను ఆత్మోన్ముఖము చేయుట. దీనికి కావలసినది 'ధృతిః'=ధైర్యము.

అన్నిటిని ఎఱిగి దేనిచేతను కలత చెందకుండ నిలచెడి సాత్త్విక ధృతి యున్నవాడే ఇట్టి అధ్యవసాయమును కల్గియుండగలడు.

2. సత్కారమానపూజలకు వశపడకుండ లాభాలాభములలో సమ- త్వము కల్గియుండుట. :-

ఇది మైనాకదర్శనమున కన్పట్టును. దీనికి 'దృష్టి' యుండవలెను. దేనిని పొందవలెనని బయల్దేరెనో దానియందే తప్ప అవాంతరఫలములపై 'దృష్టి' నుంచకుండ సాగవలెను.

3. విహితకర్మాచరణము :-

దీనికి 'మతి'=జ్ఞానము కావలెను. ఆచరింపవలసిన కర్మల నాచరించుచు; బంధింపబడకుండ సాగుటకు "ఆత్మ స్వరూపజ్ఞానము" ఆవశ్యకము..

విషిద్ధకర్మత్యాగము :-

దీనికి "దాక్ష్యము" = "సామర్థ్యము" ఆవశ్యకము. చేయ కూడని పను లను చేయకుండ మానుటకు, వానికి వశపడకుండ వానిని త్రోసిపుచ్చుటకు నిగ్రహశక్తి కావలెను-అదియే "దాక్ష్యము."

ఇట్టి నాలుగు లక్షణములు కల హనుమ సముద్రమును లంఘించి నట్లే ఆధ్యాత్మికమార్గములో పయనించువాడు నిష్ప్రమాదముగ ముందునకు సాగుటకు ఈ నాలుగును ఆవశ్యకములు- అని ఈ వృత్తాంతము సూచించును.

హనుమ నూఱుయోజనములు దాటి ఆవతలియొడ్డున నున్న తోటను చూచెను. సాగరములో కలిసెడి నదీముఖములను చూచెను.

తన శరీరమును చూచి రాక్షసులు అలజడి పడెదరని వెంటనే. తన శరీరమును సంకోచింపచేసెను.

ఆత్మజ్ఞానము కల్గినవాడు మోహమును వీడి స్వస్వరూపము నందినట్లు తన సహజరూపమునందెను.

అచటనున్న పర్వతముయొక్క శిఖరమున దిగెను. దిగి, అమరావతివంటి లంకను చూచెను.

**2** హనుమ నూఱుయోజనముల సముద్రమును దాటి త్రికూట పర్వత శిఖరమున నిలచి లంకను చూచెను.

ఆతడు కొండపై దిగుటచే కదలిన చెట్లనుండి పూలు రాలెను. ఆతడు పూవులతో నిండి పుష్పమయుడై గోచరరించెను.

ఉత్తమపరాక్రమశాలియగు హనుమ ఏమియు బడలిక చెందక నిశ్శ్వాస మును కూడ తీయక నిలచియుండెను.

"నేనీ విధముగ ఎన్ని నూఱుయోజనములనైనను దాటగలను- అనిన ఈ సముద్రమును దాటుట ఎంతపని?" హనుమ భావించెను.

తత్త్వదీపిక :-

సాధనచేయువానికి ఈ స్థితి ఆవశ్యకముగా నుండవలెను. ఆసనముపై నుండి ప్రాణాయామాదులను చేసి లేచిన తరువాత శరీరముకాని మనసు కాని బడలిక చెందరాదు. ఇంకను ఎంతకాలము చేసినను చేయగల నన్నట్లు ఉత్సాహముగా నుండవలెను. ఇది కలుగువరకు సాధన పూర్తికాదు.

ఇచ్చట ఒక విషయమును గుర్తింపవలెను. సముద్రము 'నూఱుయోజన

ములు' అనుటలో కేవలము సముద్రము యొక్క పరిమాణమే నిర్దేశింపబడి నదని భావింపరాదు. ఇందు తాత్త్వికమగు విషయము ఇమిడియున్నది.

నూఱు అంకె (100) తత్త్వజ్ఞానమును సూచించును. తత్త్వజ్ఞానము కలుగుటయే సంసారసముద్రమును దాటుట. నూఱు సంఖ్యచే తత్త్వస్వరూపము నిర్దేశింపబడినది. తత్త్వములు మూడు:-

1. భగవత్తత్త్వము.
2. జీవతత్త్వము.
3. ప్రకృతితత్త్వము.

వీనిలో భగవత్తత్త్వము ప్రధానము. జీవ, ప్రకృతి తత్త్వములు దానిపై ఆధారపడి యుండునవి, అది లేనిచో ఉండనివి. కారణావస్థలో ఈమూడును ఉండును. కాని భగవతత్త్వము స్పష్టముగా కన్పడుచుండును. జీవ ప్రకృతి తత్త్వములు ఉండియు లేనట్లు ఉండును. అనగా సూక్ష్మావస్థయందుండును. సూక్ష్మావస్థయందుండి, ఉండియు నామరూపములు లేకపోవుటచే లేనట్లుగా నుండు జీవ ప్రకృతితత్త్వవములతో కూడిన భగవతత్త్వమే ఈ జగత్తునకు కారణము అని ఎఱుంగుట తత్త్వజ్ఞానము.

ఈ తత్త్వజ్ఞానమును నూఱు అంకె సూచించును. ఒకటి ప్రక్కనున్న రెండుసున్నలు నూఱు. (100) నూఱులో నున్న రెండుసున్నలకు విలువ యున్నది. కాని అంకెలుగా లేవు. సున్నలుగా నున్నవి. ఆ ఒకటి తీసివేసినచో వానికి విలువలేదు. ఒకటి ప్రక్కనున్ననే అవి విలువకలవి; లేనిచో విలువలేదు. ఒకటి ప్రధానము-రెండుసున్నలు అప్రధానములు. ఈ రెండు సున్నలును- సూక్ష్మదశలో నున్న జీవ ప్రకృతితత్త్వములను సూచించును. ఒకటి- భగవత్త త్త్వమును సూచించును. కారణతత్త్వము యొక్క స్వరూపమును ఇట్లెఱుం గుటయే తత్త్వజ్ఞానము. ఆ తత్త్వజ్ఞానము కల్గుటయే నూఱుయోజనములు దాటుట.

"కారణంతు ధ్యేయః"

కారణతత్త్వమునే ధ్యానింపవలెనని శాస్త్రము చెప్పుచున్నది.

దీనిని సూచించుటకే మనవారు ఆయుర్దాయము నూఱేళ్ళనిరి. బ్రహ్మ కైనను, దేవతలకైనను, మానవులకైనను నూఱేళ్ళనిరి ఆయుర్దాయము. అనగా తత్త్వజ్ఞానము కల్గునంతవరకే శరీరసంబంధము. శరీరముతో సంబంధము కల్గియుండుటయే ఆయుర్దాయము. కారణ స్వరూపము నెఱుంగుటయే

నూతేళ్ళు నిండుట. ఇట్లు నూఱుయోజనముల సముద్రమును దాటుట యనగా తత్త్వజ్ఞానము కల్గి సంసార సముద్రమును దాటి, భగవదాజ్ఞచే శరీర సంబంధమును పొందుట. మహాపురుషుల జన్మస్థితి - హనుమ లంకకు చేరుట.

హనుమ ఆ పర్వత శిఖరమున నిలచి వనములను, ఉపవనములను లంకను చూచెను. పూవులతోను, మొగ్గలతోను నిండిన, పక్షులు వ్రాలిన, గాలికి కదలుచున్న సరళ కర్ణికార ఖర్జుర నీప సప్తచ్ఛదాది వృక్షములను జూచెను.

హంసలు కారండవము లనెడి జలపక్షులునిండిన, తామర పువ్వులతో, కలువలతో నిండిన దిగుడుబావులను, జలాశయములను చూచెను.

సర్వర్తుల యందుండెడి పుష్పములతో, ఫలములతో నిండిన వివిధవృక్షములు గల ఉద్యానవనములను చూచెను.

పద్మములతో, కలువలతో అలంకృతమైన కందకములతో చుట్టుకొనబడిన రావణపాలితయగు లంకను లక్ష్మీవంతుడగు హనుమ దగ్గరగా చూచెను.

ధనుర్ధరులగు రాక్షసులు అంతట పంచరించుచు కాపాచుండిరి. బంగారు ప్రాకారము పట్టణమునకు చుట్టును ఉండెను. శరత్కాలమునందలి మేఘములవలె, గ్రహమండలమువలె భవనములు భాసించు చుండెను.

కాంచనతోరణములు, అట్టాలకములు అందముగా ప్రకాశించుచుండెను.

త్రికూట పర్వత శిఖరమందున్న ఆ లంక ఆకాశములో నున్నట్లుండెను.

ఆ పట్టణమును విశ్వకర్మ నిర్మించెను. రాక్షసరాజు పాలించుచుండెను. ఆ పట్టణమును విశ్వకర్మ మనసుతో నిర్మించినాడా! అనునట్లుండెను.

పైపైకి వ్యాపించిన మేడలతో ఆ పట్టణము ఆకాశములో ఎగురుచున్నట్లు కన్పట్టుచుండెను.

శూలపట్టిసములను దాల్చిన, కోరలుగల, భీకరులగు రాక్షసులచే ఆ పట్టణము కాపాడబడుచుండెను.

హనుమ ఆపట్టణముయొక్క కట్టుదిట్టమైన రక్షణ ఏర్పాట్లను, చుట్టునున్న సముద్రమును, ఘోరమైన శత్రువగు రావణుని తలంచి ఇట్లనుకొనెను.

"ఇచటికి మా వానరులు వచ్చియు ఏమి చేయుగలరు? దేవతలు కూడ లంకను యుద్ధములో జయింపలేరు."

ఈ విషమమగు లంకను మహాబాహువగు రాముడే చేరినను ఏమి చేయ గలడు?

రాక్షసులవిషయమున సామవచనములు పనిచేయవు. దాన, భేదములకు వశపడరు. యుద్ధమున కవకాశము లేదు.

మహాత్ములగు నల్గురు వానరులకు మాత్రమే ఇచటకు ప్రవేశించు శక్తియున్నది. వాలిపుత్రుడగు అంగదుడు, అగ్నిపుత్రుడగు నీలుడు, వాయుపుత్రుడనగు నేను, సూర్యపుత్రుడగు మారాజు సుగ్రీవుడు. ఈ నలుగురే ఇచటకు రాగలరు.

సరే, కానిమ్ము. సీత బ్రతికియున్నదో లేదో తెలిసికొని, తరువాత ఆమెను జూచి, అప్పుడే ఆలోచించెదను" అని ఆలోచించుకొనుచు రామాభ్యుదయమును కాంక్షించు హనుమ ఆ పర్వతశిఖరమున నిలచియుండెను.

"ఇక నేను మాత్రము పట్టణములో ప్రవేశించుట ఎట్లు? ఈ రూపముతో ప్రవేశించుట సాధ్యముకాదు. బలవంతులు, క్రూరులునగు రాక్షసులు కాపాడుచున్నారు. వారిని వంచించి నేను సీతమ్మను వెతకవలెను. అందుచే రాత్రివేళ కనీకన్పడనట్లున్న రూపముతో నేను ప్రవేశింపవలెను.

దురాత్ముడగు రావణుని కంటపడకుండ సీతమ్మ నెట్లు చూచెదను? రాముని కార్యము చెడకుండునట్లు ఒక్కడను ఆమెను ఒంటరిగా నుండగా చూడలేను.

'భూతా శ్చార్థాః విపద్యన్తే దేశకాలవిరోధితాః
అర్థానర్థాంతరే బుద్ధిర్నిశ్చితాపి న శోభతే
ఘాతయంతిహి కార్యాణి దూతాః పండితమానినః' (సుంద.2-39,40)

దూత ఆలోచింపకుండ పనులు చేసినచో సిద్ధమైన కార్యములు కూడ చెడును. ఆలోచన లేని దూత దొరకినచో కార్యాకార్యములను నిర్ణయింపజాలిన స్వామ్యమాత్యులయొక్క బుద్ధికూడ ప్రకాశింపకుండును. పండితులమని అహంకరించు దూతలు కార్యములను పాడుచేయుదురు.

కార్యము చెడరాదు, నా చేతగానితనముచే కార్యము చెడరాదు. సముద్రము దాటుట వ్యర్థము కారాదు. ఇన్నిటికి తగినట్లు కార్యమాచరింపవలెను. నేను రాక్షసులకంట పడితినా? రాముని కార్యము చెడిపోవును. రాక్షసరూపముతో వెళ్ళినను రాక్షసులకు తెలియకుండ లంకలో నుండుట సాధ్యముకాదు. వాయువుకూడ వారికి తెలియకుండ పట్టణమున కదలాడలేదు. నారూపముతోనే నేనున్నచో నన్ను వారు తప్పక నాశనము చేయుదురు. దానిచే స్వామికార్యము తప్పక చెడును. అందుచే రాత్రివేళ శరీరమును బాగుగ తగ్గించుకొని ఈ వానరరూపముతోనే లంకలో ప్రవేశింతును. రావణపురి నంతను వెదకి

జనకాత్మజను చూచెదను."

ఇట్లు హనుమ అనేక విధముల ఆలోచించి కార్యమును నిశ్చయించుకొని సూర్యాస్తమయ మగువరకు నిరీక్షించుచు ఆ పర్వతమున నుండెను.

సూర్యు డస్తమించగనే తన శరీరమును సంకోచింపచేసికొని పిల్లి అంతయై హనుమ అద్భుతదర్శనుడై పట్టణమున ప్రవేశింప బయలుదేరెను.

విశాలమైన రాజవీధులు, ప్రాసాద పంక్తులు, కాంచన రాజత స్తంభములు, బంగారు కిటికీలు, ఏడెనిమిది అంతస్తులు గల మేడలతో నిండిన ఆ పట్టణమును హనుమ చూచెను.

ఊహించుటకు కూడ అలవికాని అద్భుతమగు ఆకారముగల ఆ పట్టణమును చూచి హనుమకు ప్రవేశింపలేము అని విషాదము, ఆశ్చర్యకరమైన నిర్మాణమును చూచి హర్షముకూడ కల్గెను.

చంద్రుడు హనుమకు మంత్రిత్వము చేసి సాయపడవచ్చినాడా అన్నట్లు నక్షత్రరాశితో ఆకాశము నలంకరించి, వెన్నెల చాందినీతో లోకమునంతను ఆవరించి ఉదయించెను.

"శంకప్రభం క్షీరమృణాళవర్ణ
ముద్గచ్ఛమానం వ్యవభాసమానం,
దదర్శ చంద్రం స హరిప్రవీరః
పోప్లూయమానం సరసీవ హంసం." (సుంద.2-58)

శంఖప్రభము, క్షీరమృణాళవర్ణము అగు ఆ చంద్రమండలము ఆకాశమున ముందున కేగు చుండగా నల్లని నీళ్ళతో నిండిన సరసులో ఈదుచున్న హంసవలె హనుమకు కన్పించెను.

తత్త్వదీపిక :-

ఇంతవరకు హనుమ లంకను బైటనుండి చూచెను. దాని నిర్మాణమును, రక్షణను వర్ణించెను.

దేహముకంటె ఆత్మ వేరని శాస్త్రములవలన, గురూపదేశము వలన ఎఱింగి ఆ శరీరముయొక్క స్వభావమును, స్వరూపమును వివిక్తముగా ముందు దర్శింపవలెను.

హనుమ తాను వేరుగా ఉండి లంకను జూచుచున్నాడు. లంక విశ్వకర్మచే నిర్మింపబడినది, రాక్షసేంద్రునిచే పాలింపబడుచున్నది.

మనశరీరము కూడ విశ్వకర్మయగు పరమాత్మచేతనే నిర్మింపబడినది, మనసుచే పాలింపబడుచున్నది. విశ్వమంతయు తన కర్మగా వ్యాపారముగా కలవాడు విశ్వకర్మ. చెడుమాటలను పలికించు మనసే రావణుడు. కుమ్మరి కుండను చేసినటట్లు పరమాత్మ ఈ శరీరమును నిర్మింపడు. సంకల్పమాత్ర ముచే నిర్మించును. ఆ విషయమునే --

"మనసేవ కృతాం లంకామ్" (సుంద.2-21)

అని సూచించెను.

భోగస్థానము శరీరము. భోగోపకరణము లింద్రియములు. ఇవియే మేడలు, మిద్దెలు, ఉద్యానములు, సరస్సులు మున్నగునవి. ఈ పట్టణమునకు కట్టుదిట్టమైన రక్షణ కలదు, మన శరీరములో గూడ ఆసురములు, రాక్షస ములైన చిత్తవృత్తులు భగవద్విషయము లోపలికి రాకుండ కాపాడుచుండును. దీనికి బంగారు ప్రాకారము కలదు. విషయోపభోగమనెడి బంగారు ప్రాకారము మన శరీరమునకు చుట్టును కలదు. జరామరణములు, సుఖదుఃఖములు, ఆకలిదప్పులు మున్నగు కెరటములతో నిండిన సముద్రము దానికి చుట్టును ఉన్నది. ఇట్టి రక్షణగల ఈ శరీరములోనికి ఆత్మాన్వేషణై ప్రవేశించుట ఎవరికి సాధ్యమగును? నలుగురికే ఇచ్చటకు ప్రవేశము కలదు.

1. అంగదుడు 2. నీలుడు 3. హనుమ 4. సుగ్రీవుడు.

ఈ నలుగురి విశేషము చూదుడు.

1. అంగదుడు:-

ఆత్మ జ్ఞానమునకై లోపలి కేగవలెనన్న ఇంద్రియములు బహిర్ముఖములై యుండును గాన విషయోపభోగములనే అనుభవింపదలంచును గాని భగద్విష యమును అనుభవింప యత్నింపవు. అట్టిచో మొదట చేయవలసినపని నామ సంకీర్తనము. ఏదో ఒకనామము నాశ్రయించి కీర్తించుచున్నచో విషయముల నుండి ఇంద్రియములు వెనుకకు మరలి భగద్విషయమువైపు ప్రసరించును.

అం=భగవంతుని; గద=కీర్తించువాడు-అంగదుడు-అనగా నామసంకీర్త నము చేయువాడు.

2. నీలుడు :-

శరీరములో నున్న ఆత్మతత్త్వమును, భగవత్తత్త్వమును దర్శించుటకు మనము చేసిన పాపములు ప్రతిబంధకములుగా నుండును. అవి తొలగుటకు అగ్నిహోత్రమును సేవించి హోమమును యజ్ఞము నాచరింపవలెను. అవు

డాయజ్ఞముచే జ్ఞానమునకు ప్రతిబంధకము తొలగును. దర్శనమున కవకాశ మేర్పడును. యజ్ఞము, దానము, తపస్సు మున్నగుకర్మలే మనసున కంటిన మాలిన్యమును తొలగించి పవిత్రము చేయును. దానిచే దర్శనము కలుగును. ఈ కర్మలే నీలుడు.

నీలుడు అగ్నిహోత్రుని పుత్రుడు, అగ్నిహోత్రునియొక్క అనుగ్రహము పొందినవాడు కావున ఆతడు లంకలోనికి ప్రవేశింపగలడు.

3. హనుమ :-

హనుమ వాయుపుత్రుడు. అనగా మంత్రము.

మంత్రమును జపించుటచే శరీరములో మరుగుపడియున్న ఆత్మ పరమాత్మల దర్శనము కల్గును. మంత్రము యొక్క అర్థము మననము చేయుటచే ఆత్మ పరమాత్మల స్వరూపము, వారి సంబంధము తెలిసి, దర్శింపవీలగును. అందుచే హనుమ లంకలో ప్రవేశింపగలవాడు.

4. సుగ్రీవుడు :-

సుగ్రీవుడు=వేదాధ్యయనసంపన్నుడు. ఇంద్రియములకు గోచరము కాని దానిని ఎఱింగించునది వేదము. దాని నధ్యయనము చేసినచో శరీరములో మరుగుపడియున్న ఆత్మ పరమాత్మల దర్శనమున కవకాశము కల్గును.

హనుమ "నలుగురు వానరులకే లంకలో ప్రవేశింపశక్తికలదు" అని పలికెను. దాని యర్థము శరీరములో మరుగుపడియున్న ఆత్మతత్త్వమును ఎఱుంగుటకు--1. నామ సంకీర్తనము, 2. యజ్ఞ దానాదికర్మలు, 3. మంత్రజపము, 4. వేదాధ్యయనము అనునవి నాలుగే సాధనములని తెలియుచున్నది.

లంకలో ప్రవేశించుట ఎప్పుడు? ఎట్లు? అనునది హనుమ రెండవ ఆలోచన.

రాత్రివేళ, కనపడీ కన్పడనిరూపముతో ప్రవేశింపవలె నని నిశ్చయించుకొనెను.

రాక్షసులు నిశాచరులుకదా, వారు రాత్రి సంచరించుచుందురే, అపుడు ప్రవేశించుట ఏమి? ఆలోచింపవలెను.

రాత్రి యనగా బాహ్యమైన రాత్రికాదు. పదార్థము కన్పడ కుండ చేయు చీకటి ఆవరించిన కాలము- రాత్రి. ఉన్న వస్తువు అనగా ఆత్మ, కన్పడకుండ చేయు అజ్ఞానము ఆవరించిన సమయము- రాత్రి.

అట్లు జ్ఞాన మావరించిన సమయమున విహరించునవి రాక్షస చిత్తవృ

త్తులు, విషయవాసనలు. అదియే ఆసురసంపద. ఇది నిశాచరము. అందుచే రాక్షసులను నిశాచరు లనిరి.

ఆంజనేయుడు రాత్రివేళ మేల్కొని సీతను వెతకుచుండును. మిగిలిన వారందరు నిద్రించియుందురు.

ఈ రాత్రిని భగవద్గీత :-

"యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః"

అని వివరించినది.

"సర్వభూతముల కేది రాత్రియో అపుడు యోగి మేల్కొని యుండును. ఎపుడు సర్వభూతములు మేల్కొని యుండునో అది యోగికి రాత్రి.

లౌకికములైన విషయములనుభవింపదగినవిగా, నిత్యములుగా, శరీరమే ఆత్మగా మనకు కన్పించుచుండును. యోగులకు అట్లు కన్పింపదు. వారికి భగవద్విషయమే అనుభవింపదగినదిగా, శరీర మనిత్యముగా, శరీరముకంటె వేరైన ఆత్మ నిత్యముగా కన్పట్టుచుండును. అందుచే మనము చూచుచున్నపుడు గోచరించునవి యోగులకు గోచరింపలేదు. కనుక వారికి లౌకిక విషయములు రాత్రి. యోగులకు ఆత్మవస్తువే కన్పించును. కనుక అది వారికి పగలు, మనకు రాత్రి.

ఇట్లు 'రాత్రివేళ వెతుకుట' అనుటచే లోకులు విషయభోగపరాయణులై, ఆత్మ విముఖులై ఉన్నప్పుడు, విషయ విముఖుడై మనన శీలుడైన యోగి ఆత్మవస్తువును దర్శింపజాలిన సమయమున అన్వేషణమునకు ఉపక్రమించుచున్నాడని ఎఱుంగవలెను. మనరాత్రి-ఆత్మ వస్తువును చూచుటకు తగిన జ్ఞానదశ యోగికి లభించిన సమయము. అట్టివాడే గురువుగా, విషయభోగపరాయణులగు జీవులలో ఎవరు భగవత్ప్రాప్తికి అర్హులో వెతకి జ్ఞానమును ప్రసాదించును. సాధకుడు కూడ విషయ వైముఖ్యము కలిగి 'ఆత్మయే పొందదగిన' దని మననము చేయుదశలోనే ఆతనికి దర్శనము సాధ్యమగును. అందుచే హనుమ చెప్పినరాత్రి యోగులు ఆత్మదర్శనము చేసెడి సమయమని ఎఱుంగవలెను.

అట్టి సమయమున లక్ష్యాలక్ష్యమగు రూపముతో లంకలో ప్రవేశింపవలెను.

ఆత్మాన్వేషణము చేయునపుడు బాహ్యముగ ఈ శరీరమున నున్నట్లు కన్పడినను శరీరభావము ఉండును. ఆ శరీరమే లక్ష్యాలక్ష్యమగు శరీరము.

శరీరము బైటకు ఉన్నట్లు కన్పడును గావున లక్ష్యము. కాని బాహ్యావిషయా నుభవమునకు అది వినియోగపడదు. కనుక అది అలక్ష్యము. అట్టి దశలో అన్వేషించుటకు ఉపక్రమించును.

ఇందు దూతయొక్క లక్షణములు వర్ణింపబడినవి.

భగవదాజ్ఞచే భగవత్ప్రాప్తి కామనగల జీవునికి భగవత్సందేశము నందిం చుటకై వచ్చిన దూత గురువు. ఆతడు ఎంతో జాగరూకుడై యుండనిచో భగవత్కార్యము చెడును. రాత్రియైన తరువాత పిల్లియంతవాడై హనుమ పట్టణములో ప్రవేశించును.

"పృషదంశకమాత్ర స్సన్ బభూ వాద్భుతదర్శనః" (సుంద.2-49)

పృషదంశకము=పిల్లి.

'పిల్లియంత' అగుట ఏమి? అంతకంటె చిన్న జంతువు లేదా? అను సందేహము కలుగవచ్చునని "అద్భుతదర్శనః" అను పదమును వాడెను. చీక టిలో మనకంటికి కన్పడని వస్తువును చూడగలశక్తి పిల్లికంటికి ఉన్నది. అట్టి దర్శనము కలవాడు హనుమ.

అజ్ఞానావృతమగు శరీరములో మరుగుపడిన ఆత్మ నన్వేషించి దర్శింప జాలిన శక్తిగలవాడై హనుమ లంకలో ప్రవేశించెను.

భగవద్గీతలో ఆత్మతత్త్వమును "ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చిదేనం" అని అద్భుతమైన వస్తువుగా వర్ణించెను. అట్టి వస్తువు యొక్క దర్శనము గలవాడు అద్భుతదర్శనుడు.

ఆత్మాన్వేషణమునకు, దర్శనమునకు తగిన లోచూపుకలవాడై హనుమ లంకలో ప్రవేశించెను. అపుడు చంద్రుడు స్పష్టముగా బైటకు వచ్చెను. ఆతడు హనుమకు మంత్రిత్వమును చేయుచుండెను.

సీతాన్వేషణము చేసిన ఈ రాత్రి మూడుసార్లు చంద్రుడు మనకు కన్పించును. ఆత్మ వస్తువు యొక్క విశద, విశదతర, విశదతమ భాసనము దీనిచే సూచింపబడెను.

మొదటిది మనన దశ. రెండవది ధ్యాన దశ, మూడవది దర్శన దశ. ఈ మూడు దశలను చంద్రుని కలదలికచే మన కిందు స్ఫురింపచేయును.

మరొక రహస్యము. గురువు శిష్యులను తరింపచేయునపుడు తాను తరింపచేయుచున్నానని భావింపడు. తమ ఆచార్యులు ఒసంగిన జ్ఞానమే తనకు సాయమై నడిపించుచున్నదని భావించును. ఇచట చంద్రుడు ఆచార్యుడు.

ఇతడు హనుమకు సీతాన్వేషణమున సాయపడుచున్నాడు.

సూర్యుడు భగవత్తత్త్వము - చంద్రుడు ఆచార్యతత్త్వము.

సూర్య తేజస్సు చూడశక్యము కానిది. ఆ తేజే చంద్రుని యందు పడిననాడు చల్లనై ఆహ్లాదమును కల్గించును.

అట్లే భగవత్తేజము ఆచార్యుని ద్వారా ప్రసరించి వెన్నెలవలె తాపమును తగ్గించి ఆహ్లాదమును కల్గించును. కన్పడని వస్తువులను కన్పింపచేయును. అందుచే హనుమకు చంద్రుడు తోడుపడి సీతమ్మ నన్వేషింపచేసెను. తన గురు వొసంగిన జ్ఞానసహాయముచే మహా పురుషుడు శిష్యులను వెతకి తరింపచేయును. సాధకుడు ఆచార్యాను గ్రహముచే లభించిన జ్ఞానముచే ఆత్మాన్వేషణమునకు ఉపక్రమించును. ఇక అన్వేషణము ఆరంభమగును.

**3** హనుమ రాత్రివేళ మనోహరములగు కాననములతో శారద మేఘములవంటి భవనములతో నిండిన లంకను చేరవలెనని బయలుదేరి ప్రాకారమువద్దకు వచ్చెను.

జాంబూనదమయద్వారములతో, వైడూర్య వేదికలతో, మణి కుట్టిమము లతో, కాంచన నిర్యూహములతో, వైడూర్య సోపానములతో, తూర్యాభరణ నిర్ఘోషములతో నిండిన ఆ పట్టణమును జూచి హనుమ సంతసము నొందెను.

ఆలంక-అలకానగరివలె, ఇంద్రపురివలె ప్రకాశించుచుండెను.

ప్రకాశించుచున్న భవనకాంతులచే చీకట్లు తొలగి ఆ పట్టణమందముగా కన్పట్టుచుండెను.

పట్టణములోనికి ప్రవేశించుచున్న మహాబలుడగు మారుతికి లంకానగరి తనరూపములో కన్పడెను.

రావణపాలిత యగు లంక వికృతమగు ఆననము, వికృతములగు చూపులు కలదియై, లేచి నిలచెను. గంభీరమగు గర్జనమును చేసెను.

"ఓ వనాలయా! నీవు ఎవడవు? నీ కిచట ఏమి పని? నీ ప్రాణములుండగా సత్యమును చెప్పుము. రావణ సైన్యముచే రక్షింపబడుచున్న ఈ లంకలో నీవు ప్రవేశింపజాలవు" అని లంక హనుమతో పల్కెను.

హనుమ ఎదురుగానున్న లంకను జూచి "నీవు నన్నడిగిన విషయము చెప్పెదను. కాని విరూపములగు నేత్రములుగల నీవు ఈ పట్టణద్వారమున నిలచి, నన్నడ్డి, ఏల భయపెట్టుచున్నావు? నీ వెవరవు?" అని పల్కెను.

హనుమ ద్వాక్యమును విని కామరూపిణియగు లంక కోపము గలదై పరుషముగా ఇట్లు పల్కెను.

"అహం రాక్షసరాజస్య రావణస్య మహాత్మనః
ఆజ్ఞా ప్రతీక్షా దుర్ధర్షా రక్షామి నగరీ మిమామ్."

(సుంద. 3-28)

"అహం హి నగరీ లంకా స్వయ మేవ ప్లవంగమ
సర్వతః పరిరక్షామి హ్యేతత్తే కథితం మయా." (సుంద.3-30)

"మహాత్ముడు, రాక్షసరాజు అగు రావణుని ఆజ్ఞను పాలించుచు నేనీ లంకానగరిని కాపాడుచుందును. నేనే లంకను. నేనీ నగరిని కాపాడుచుందును. నన్ను ధిక్కరించి నీవు పట్టణమున ప్రవేశింపలేవు. నాచే దెబ్బ తిని నీవిప్పుడే నేల కూలెదవు" అని లంక పల్కిన మాటలను విని ఏమియు జంకక కొండవలె నిలచి హనుమ--

"ప్రాకార తోరణములతో కూడిన లంకను చూడవలెనని వచ్చితిని. పట్టణము నంతను చూచుటయే నా రాకకు మూలము" అనెను.

అపుడు లంక "దుర్బుద్ధి! రాక్షసరాజు పాలించు ఈ పట్టణమును నన్ను జయింపనిదే నీవు చూడలేవు." అనెను.

ఆ కపిశ్రేష్ఠుడు నిశాచరితో "ఒక్కసారి పట్టణమును చూచి మరల వెళ్ళిపోవుదును" అనెను.

వెంటనే ఆమె భయంకరమగు మహానాదమును చేసి, అరచేతితో వానరుని కొట్టెను.

అప్పుడా వానరరాజు తన ఎడమచేతి వ్రేళ్ళను ముడిచి గంభీరముగ గర్జించుచు ఆడుది కదా యని ఎక్కువకోపము తెచ్చుకొనకుండ కొద్దిపాటి కోపముతో పిడికిలితో ఆమెను కొట్టెను.

ఆ దెబ్బతో నిశాచరి నేలపడెను. వెంటనే ఆమె బెదరి గద్గద స్వరముతో గర్వ ముడిగి హనుమంతునితో--

"మహాబాహూ! అనుగ్రహించుము, రక్షించుము. నీవంటి బలవంతులు మర్యాదను పాటింతురుగదా! నేను లంకానగరిని. నీచేత ఓడింపబడితిని. పూర్వము బ్రహ్మ నాకొక వరము నిచ్చెను. ఏనాడొకవానరుడు పరాక్రమముచే నిన్ను జయించునో అపుడు రాక్షసులకు కీడు కల్గునని గుర్తించుము. ఆ సమయము నే డాసన్నమైనది. సీతా నిమిత్తముగా రావణునికి రాక్షసులకు వినాశము సమీపించినది. నీవు పట్టణములో ప్రవేశించి చేయదలచిన పనుల నన్నిటిని చేసికొనుము. అంతటను పోయి తిరిగి సీతమ్మను వెతకికొనుము" అని చెప్పి యూరకుండెను.

తత్త్వదీపిక :-

ఇందు లంకాహనుమత్సంవాదము గుర్తింపదగినది. దేహము కంటె వేరుగా ఆత్మ యున్నదని తెలియకుండ చేసి, ఆత్మను మనసు వశములో నుంచి కాపాడునది దేహాత్మాభిమానము. ఈ దేహమునే 'నే' నని అనుకొను టయే దేహాత్మాభిమానము. అది ఉన్నంతకాలము ఆత్మాన్వేషణము సాగదు. మనసు శక్తి తగ్గదు. ఇచట హనుమకు ఎదురుగా లంకయే "నేను" అని నిలచినది. ఆ నిలచినది ఈ దేహ మనెడి లంకను కాపాడెడి రాక్షసి. ఈమెయే 'అహ' మని (దేహాత్మాభిమానమని) సూచించుటకు ఆమె చెప్పు సమాధానము రెండు శ్లోకములలో "అహం," "అహం" అని శ్లోకము మొదట ప్రయో గింపబడినది. ఆత్మకాని దేహమును ఆత్మయను కొనుటయే అహంకారము. ఇది యున్నంతకాలము, లోనికేగి ఆత్మను చూచుట సాధ్యపడదు. దానిని జయించియే లోని కేగవలెను. దానిని జయించిననాడు రావణుడు, రాక్షసులు కూడ నశింతురు. మనసు, మనసులోని వాసనలు చిత్త వృత్తులు నశిం చును. సీతమ్మ దర్శనమగును. జ్ఞాని యగు గురువు దేహాత్మాభిమానమును జయించి, దేహమున ప్రవేశించి, మోక్షమందు కోరికగల జీవుని అన్వేషించి తరింపచేయును. ఆత్మాన్వేషణమును చేయవలెనను కోరికగల సాధకుడు కూడ ముందుగ వశపరచుకొనవలసినది ఈ దేహాత్మాభిమానమునే! ఇచ్చట వీరి సంవాదములో కొన్ని పదములలో గల అందమును చూదుదు.

లంక ప్రశ్నించుచు :-

"కస్త్వం? కేన చ కార్యేణ ఇహ ప్రాప్తో వనాలయ?"

(సుంద. 3-23)

'నీ వెవడవు? వనాలయ!, నీ వేపని మీద ఇచటకు వచ్చితివి?' అనును.

"వనాలయ=వనములోనుండువాడా! వనములో నుండక పట్టణమున కేల వచ్చితి వయ్యా! నీ కిచ్చట ఏమి పని!" అని చమత్కరించును.

కాని ఈ "వనాలయ" శబ్దములో హనుమ బ్రహ్మనిష్ఠుడని ధ్వనించు చున్నది.

వనము=బ్రహ్మము. ఉపనిషత్తులలో :-

"బ్రహ్మ వనం బ్రహ్మ సవృక్ష ఆసీత్"

అని బ్రహ్మను వనముగా రూపించును. అట్టి ఈవనమునందు వసించు వాడు కావున ఆతనిని "వనాలయు" డనెను.

హనుమ తిరిగి :--

"కా త్వం? విరూపనయనా?" (సుంద. 3-26)

"వికృతమగు నేత్రములుగల నీ వెవ్వతెవు?" అని ప్రశ్నించును.

ఇందు ఆమెయే మాయ-ప్రకృతి అనబడెడి అజ్ఞానమని సూచించును. విరూపమును= మారురూపును, నయతి=పొందించునది-- ప్రకృతి.

ఆత్మకాని దేహమునందు ఆత్మయను బుద్ధిని కల్గించుటయే విరూపము నొందించుట. అట్టి మాయచే కలుగు దేహాత్మభ్రాంతియే లంకయని ధ్వనించి నది. ఆ దేహాత్మ భ్రాంతియే హనుమను కూడ ఎదిరించెను.

మహాపురుషులను కూడ ఇది జయిప యత్నించును. కాని వారు దానిని జయించి లోని కేగి అన్వేషింతురు. మనము దానికి వశపడి లోనికేగలేము.

ఇట్లు హనుమ దేహాత్మాభిమానమును జయించుటయే, లంకిణిని జయిం చుటలో సూచిత మాయెను.

**4** హనుమ కామరూపిణియగు లంకను జయించి ద్వారముగుండా కాక ప్రాకారమును దాటిలోన ప్రవేశించెను.

"అద్వారేణ మహాబాహుః ప్రాకార మభిపుప్లువే" (సుంద.4-1)

మహాబాహువగు హనుమ ద్వారముగుండా గాక ప్రాకారమును దూకి లోని కేగెను.

తత్త్వదీపిక :-

శత్రువుల పట్టణమును ప్రవేశించునపుడు ద్వారముగుండా ప్రవేశింపరాదు అనెడి రాజనీతిని పాటించి హనుమ తనస్వామికి శత్రువగు రావణునిపట్టణమున

అద్వారముగ ప్రవేశించెను.

జ్ఞానియగు మహాపురుషుడు జన్మించువిధము ఇంతు నిరూపింపబడినది. జ్ఞానులజన్మ సామాన్య మానవుల జన్మవంటిది కాదు. వారు దేహముకంటె వేరుగ ఆత్మస్వరూపము నెఱింగి భగవత్స్వరూపమును దర్శించి, కర్మభోగము నకై గాక భగవదాజ్ఞా నిర్వహణమునకై జన్మింతురు.

హనుమ లంకిణిని జయించెను. ఆమెలోనికి వెళ్ళుమని అనుమతించెను. ద్వారముగుండా ప్రవేశింపలేదు. ద్వారముగుండా గాక ప్రాకారముమీదనుండి దూకి లోనికి జొచ్చెను.

లంక శరీరము. అందు ప్రవేశించుద్వారము కర్మ. అనుభవింపవలసిన కర్మలేనివారు జన్మనెత్తుట ఎందులకు? భగవదాజ్ఞచే జీవులను తరింపచేయుటకు.

అట్టివాడు హనుమ. అందుచే ద్వారముగుండా కాక ప్రక్కనుండి ప్రవేశించెను.

'అద్వారేణ' అనుమాటకు "ద్వారముగుండాకాక" అని ఒక యర్థము. అ=భగవంతుడు -- అతడు నిమిత్తముగా ప్రవేశించెను. అనగా భగవంతునియాజ్ఞచే భగవంతునిపనిమీద ప్రవేశించెను.

హనుమను 'మహాబాహువు' అనిరి. ప్రాకారముపైకి చాచిపట్టుకొని దూకుటకు సమర్థుడని సూచించుటకు "మహాబాహు" వనెను. బాహువులు కర్మను చేయు సాధనములు. వానికిగల మహత్త్వము పొడవుగా నుండుట కాదు, బలముగా నుండుట కాదు. చేసిన కర్మ అంటకుండ చేయుగల బాహువుగలవాడు మహాబాహువు. అనగా ఫలసంగకర్తృత్వములను విడచి కర్మ నాచరించువాడు. అట్టివాడు శరీరమున నుండి కర్మ చేయుచున్నను బంధింపబడడు.

హనుమ ప్రాకారమును దూకెను. లంకకు బంగారు ప్రాకారము కలదు. మన శరీరమునకు చుట్టును ఉండు విషయములే బంగారు ప్రాకారము. వానిననుభవింపకుండ వానిని క్రిందు చేసి దూకగలవాడు జ్ఞాని. అందుచే ఇచట "అద్వారేణ, మహాబాహు, ప్రాకారం" అను మూడు పదములచేతను మహాజ్ఞానియొక్క లక్షణములు సూచింపబడినవి.

శత్రువులతలపై మోపినట్లు తన ఎడమపాదమును హనుమలంకలో ముందుగ పెట్టెను.

ముత్యములతో, పువ్వులతో ప్రకాశించుచున్న మహాపథమున బయలుదేరెను. పెద్ద నవ్వులు వినబడెను. మంగళవాద్యముల ధ్వనులు వినబడెను. వజ్రపుకిటికీలతో ప్రకాశించెడి మేఘములవంటి గృహములను చూచెను. భవనములు పద్మాకారముగా, స్వస్తికాకారముగా నుండెను. వర్ధమానములను పేరుగల భవనములు కన్పట్టెను. చిత్రములగు మాల్యములు, ఆభరణములతో ప్రకాశించుచున్న లంకను రాముని కార్యమునకై శ్రీమంతుడగు హనుమ చూచి ఆనందించెను.

తత్త్వదీపిక :-

స్వామి కార్యమునకై లంకలో నుండి సీతమ్మ నన్వేషింపయత్నించుట ఇచ్చుట హనుమకు గల "శ్రీ".

ఇంటినుండి ఇంటికి సాగుచు ప్రతిఇంట వెతకుచుండెను.

మంద్ర మధ్యమ తారస్థాయిలలో పాడుచున్న స్త్రీల మధురమగు గానమును వినెను. కాంచీనినాదమును, నూపురధ్వనిని వినెను. మెట్లపై నడచునప్పుడు వచ్చెడి ధ్వనులు వినబడెను. మల్లుల ఆస్ఫోటన ధ్వనులనెడి సింహగర్జనములను వినెను.

కొందరి భవనములలో మంత్రజపములను వేదాధ్యయనమును చేయువారిని చూచెను. రావణస్తోత్రపారాయణలు చేయుచున్న వారిని జూచెను. నగర మధ్యమున, రాజమార్గమున స్థాపింపబడిన సైన్యమును చూచెను. దీక్షితులు, జటాధరులు, ముండులు. గోజినమును ధరించినవారు, మంత్రించిన దర్భలను దాల్చినవారు, ఏకాక్షులు, ఏకకర్ణులు, లంబోదరులు, ధనుర్ధరులు, ఖడ్గధరులు మున్నగు రాక్షసుల నెందరనో చూచెను. మరీలావు కాని, మరీ సన్నము కాని, మరీ పొట్టికాని, మరీ పొడుగుకాని, మరీ నలుపుకాని, మరీ తెలుపుకాని, మరీ మరుగుజ్జు కాని వివిధ రూపములుగల రాక్షసుల నెందరనో చూచెను.

పట్టణములో మధ్య రావణభవనమునకు దగ్గరగా నూఱువేల మూల బలమున్నది.

త్రికూట పర్వతశిఖరమున నున్న బంగారుతోరణములు గల రావణభవనము జూచెను. ఆ భవనమునకు చుట్టును కందకము, ప్రాకారము గలవు. గుఱ్ఱములు, రథములు, వాహనములు, విమానములు, ఏనుగులు, మృగములు, పక్షులు మున్నగువానితో ఆ ప్రాంతము నిండియుండెను. పరాక్రముగల వేలకొలదిరాక్షసులు ఆ భవనమును కాపాల కాచుచుండిరి. అట్టి రావణభవనమును

హనుమచేరెను.

5 ఆసమయమునకు చంద్రు డాకాశమధ్యమున నుండెను. వెన్నెలను వెళ్ళిగక్కుచుండెను. చంద్రుడు ఆకాసమున గోశాలలో మదించిన వృషమువలె తిరుగాడుచుండెను. చంద్రుడు లోకముల పాపములను నశింపచేయుచుండెను. సముద్రమును పొంగింపచేయుచుండెను. సర్వభూతములను ప్రకాశింపచేయుచుండెను.

తత్త్వదీపిక :-

ఈ సర్గలో చంద్రవర్ణనము-చంద్రునివలె ఆహ్లాదజనకముగ నుండవలెనని

"లోకస్య పాపాని వినాశయన్తం
మహోదధిం చాపి సమేధయన్తం
భూతాని సర్వాణి విరాజయన్తం
దదర్శ శీతాంశు మథాభియాన్తమ్." (సుంద.5-2)

మనోహరములగు అంత్యానుప్రాసలతో సాగెను.

వెండిపంజరములో నున్న హంసవలె, మందరపర్వతగుహలో నున్న సింహమువలె, మదించిన ఏనుగుపై నున్న వీరునివలె ఆకాశములో నున్న చంద్రుడు ప్రకాశించెను.

వాడియైన కొమ్ములుగల వృషభమువలె, ఉన్నతమగు శిఖరములుగల పర్వతమువలె, బంగారు కొమ్ములు కట్టిన ఏనుగువలె శృంగములతో నిండిన చంద్రుడు ప్రకాశించెను. చిత్తడి నేలలతో కూడినవాడై శశాంకుడు ప్రకాశించుచుండెను.

తత్త్వదీపిక :-

ఇందు :- "భగవాన్ శశాంకః" (సుంద.5-6)

అనెను. చంద్రునికి "భగవాన్" అను విసేషణమును వాడెను.

"భగవాన్ ప్రదోషః" (సుంద.5-8)

అనెను రాత్రికి "భగవాన్" అను విశేషణమును వాడెను.

సీతాన్వేషణమున సాయపడెడి ప్రకాశము నిచ్చెడి శశాంకుడు "భగవానుడు".

ఏ జ్ఞానము భగవంతుని, ఆత్మను గోచరింపచేయునో ఆ జ్ఞానము పవి

త్రమైనది. ఏ జ్ఞానము లౌకిక విషయములను ప్రదర్శించునో అది హీనమైనది. ఇచట సీతాన్వేషణమునకు సాయపడు శశాంకుడు "భగవానుడు".

ఏ 'రాత్రి' - ఏ 'జన్మము', ఆత్మాన్వేషణమున కుపయోగపడునో ఆ 'రాత్రి' - ఆ 'జన్మము' - 'భగవాన్' - 'పూజ్యము'.

శిలాతలముపై కూర్చుండిన మృగేంద్రునివలె, మహారణమున నిల్చిన గజేంద్రునివలె, రాజ్యమునధిష్ఠించిన నరేంద్రునివలె చంద్రుడు ప్రకాశించెను.

కర్ణసుఖములగు తంత్రీస్వనములు సాగుచుండెను.

పతివ్రతలగు స్త్రీలు భర్తలతో నిదురించుచుండిరి.

నిశాచరులు అంతటను విహరించుచుండిరి.

భవనములలో రాక్షసులు ఒకరినొకరు ఆక్షేపించుకొనుచుండిరి. బలమైన భుజములను ఒకరిపై ఒకరు వేసికొనుచుండిరి. మత్త ప్రలాపములను అధిక ముగ పల్కుచుండిరి. ఒకరినొకరు భయపెట్టుకొనుచుండిరి. ఛాతీలను విప్పి ఒకరికొకరు చూపుకొనుచుండిరి. విచిత్రములగు వేషములను మార్చుచుండిరి. దృఢములగు ధనస్సులను సారించుచుండిరి.

కొందఱు స్త్రీలు అంగరాగముల నలంకరించుకొనుచుండిరి. మరి కొందఱు స్త్రీలు నిదురపోవుచుండిరి. అందమైన ముఖములు గల కొందఱు స్త్రీలు నవ్వుచుండిరి. కొందఱు కోపగించుచుండిరి. మరికొందఱు నిట్టూర్పులు వదలుచుండిరి.

ఇట్టి స్త్రీల నందఱను చూచుచు హనుమ సాగుచుండెను.

ఉత్తమ బుద్ధిమంతులు, ఆస్తికులు, మనోహరములగు నామధేయములు కలవారును, మంచిగుణములు, రూపము కలవారును అగు రాక్షసులను కొంద ఱను చూచెను.

రాక్షస స్త్రీలలో కొందఱు పరిశుద్ధస్వభావలు, మహానుభావలు, సుప్రభా వలు, కాంతిమతులు, లజ్జావతులు, రాత్రివేళ ప్రియుల పరిష్వంగమున నున్న వారునై కన్పట్టిరి. మరికొందఱు సౌధాగ్రముల కూర్చుండినవారు, కొందఱు స్త్రీలు బంగారు తీగలవలె మెరయుచున్నవారు, బంగారుకాంతులు గలవారు, మేలి ముసుగులేనివారలై యుండిరి. ఈ విధముగనుండు అభిరామలగు రామల నెందఱనో ఆ హరివీరుడు దర్శించుచు సాగుచుండెను.

ఆ స్త్రీలముఖపంక్తులు చంద్రప్రకాశముకలవై ఒప్పుచుండెను. నేత్రపం

క్షులు వక్రములగు పక్ష్మములతో విరాజిల్లుచుండెను. వారి యాభరణపంక్తులు మెరపుల బారులవలె కన్పట్టుచుండెను.

తత్త్వదీపిక :-

హనుమ స్త్రీలను వెతకుచు వారిముఖములను, నేత్రములను, ఆభరణములను చూచుచుండెను. ముఖము, నేత్రము చూడగనేవారు అసురస్త్రీలో కారో గుర్తింపవీలగును.

అసుర స్త్రీలు కాకపోయినను సీత యగునో కాదో తెలిసికొనుటకు వారి ఆభరణములను చూచును. సీతమ్మ ఆభరణములను కొన్ని తాను చూచెను, కొన్నిటిని రాముడు పేర్కొనగా వినెను. అందుచే ఆభరణములను చూచిన సీతమ్మను గుర్తింపవచ్చునని చూచుచుండెను.

సుందరకాండయందు మూడు భాగములు కలవు.

1. అన్వేషణము.

2. దర్శనము.

3. విరోధినిరసనము.

హనుమ సీతమ్మను (1) వెతకును, (2) చూచును, (3) ఆమెకు విరోధులైన రాక్షసులను చంపును.

ఆత్మను (1) అన్వేషించును, (2) దర్శించును, (3) భగవత్ప్రాప్తికి ప్రతిబంధకములగు పాపములను నశింపచేసికొనును.

ఉపనిషత్తు :-

"సోఽన్వేష్టవ్యః"

అని పరమాత్మ నన్వేషింపవలెనని చెప్పెను. ఆ పరమాత్మ ప్రాప్తికి ముందు, ఆత్మను కూడ అట్లె అన్వేషింపవలెను.

గురువు భగవత్ప్రాప్తికి యోగ్యులగు జీవులను అన్వేషించునపుడు హనుమ చూచినట్లే ముఖములను, నేత్రములను, ఆభరణములను చూచుచుండును. స్త్రీలముఖమునందు చంద్రప్రకాశము కన్పట్టుచుండును.

భగవత్ప్రాప్తికి యోగ్యులగువారి ముఖమునందు సౌమ్యత కన్పట్టును.

కన్నులయందు భగవద్విషయము వినినప్పుడు -- వికసించుట, లేనప్పుడు ముడుచుకొనిపోవుట అను లక్షణము కన్పట్టవలెను. కన్ను జ్ఞానమునకు

సూచకము. ఆ జ్ఞానము భగవద్విషయకమై యుండవలెను. అదే దానికి అందము.

శరీరమున కాభరణములవలె ఆత్మకు శమదమాదిగుణము లుండవలెను.

ఇట్లు :-(1) సౌమ్యమగు ముఖము,

(2) భగవద్విషయకమగు జ్ఞానము,

(3) శమదమాదిగుణములు

కలవారినే గురువు ముముక్షువులుగా ఎఱింగి స్వీకరించును.

ఇట్లు అన్వేషించుచుండెనే గాని అత్యంతాభిరామ స్వరూప, అయోనిజ అగు సీత మాత్రము కన్పడలేదు.

సనాతనమగు పాతివ్రత్యమునే పాలించునది, రాముని చూచుట యందే పట్టుదల కలది, శ్రేష్ఠులగు స్త్రీలందఱిలో ఉత్కృష్టయైనది, శ్రీమంతమగు భర్త మనసులో సదా నివసించునది అగు సీత మాత్రము కన్పడలేదు.

కన్నీటితో అడ్డుపడుచున్న కంఠస్వరముకలది, ఉత్తమమగు నిష్కమను ఆభరణమును మెడను దాల్చినది, మనోహరమగు కంఠము కలది అగు సీతమ్మ మాత్రము కన్పడలేదు.

"అవ్యక్త రేఖా మివ చంద్రరేఖాం
పాంసుప్రదిగ్ధా మివ హేమరేఖాం
క్షతప్రరూఢా మివ బాణరేఖాం
వాయుప్రభిన్నా మివ మేఘరేఖామ్." (సుంద. 5-26)

'సీతమ్మ స్పష్టముగ కానరాని చంద్రరేఖవలె నుండును. మట్టిపట్టిన బంగారుతీగవలె నుండెను. బాణపుదెబ్బ తగిలి, లోనములుకుండిపోయి, పైకి మానిన గాయమువలె నుండును. గాలికి చెదరిన మేఘరేఖవలె నుండును' - అని హనుమ భావించుచుండెను.

తత్త్వదీపిక :-

ఇందు అస్పష్టముగ కన్పట్టు చంద్రకళవలె సీత అత్యంతము కృశించి కాంతిహీనమై యుండును. మట్టిపట్టిన బంగారుతీగవలె సహజముగ కాంతికల్గియు తాత్కాలికముగ మలినమై యుండును. ములుకులోన ఉండి పైకి మానిన బాణపుగాటువలె లోపల రామవిరహవేదనను తీవ్రముగ అనుభవిం

చుచు పైకి చిరునవ్వుతో నుండును. గాలికి చెదరిన మేఘరేఖవలె ఎక్కడి కక్కడ శిథిలములైన అవయవములు కలదై యుండును -- అని హనుమ ఊహించెను.

మనుజేశ్వరుడగు రామునియొక్క పత్నిని--సీతను గాంచలేక హనుమ మందునివలె చాలసేపు దుఃఖించుచు ఉండిపోయెను.

తత్త్వదీపిక :-

హనుమ అన్వేషించుటలో అందమైన సన్నివేశముల నెన్నిటినో చూచెను. భవనములను చూచెను, పురుషులను చూచెను, సుందరాంగులగు స్త్రీలను చూచెను.

కాని ఆతని మనస్సునకు సుఖము కలుగలేదు. దుఃఖమే కల్గెను.

ఆత్మాన్వేషణమున ప్రవర్తించినవారు కూడ దానికంటె అందమైన అనుభూతులను పొందినను ఆనందింపరు; ఆత్మదర్శనము కాలేదేయని దుఃఖించుచుందురు.

ఈ అన్వేషణములో ముందు రమణీయములగు సన్నివేశములను హనుమ దర్శించెనని వర్ణించి, చివరకు సీతమ్మను చూడక దుఃఖించెనని వర్ణించుచుండెను

మనము ఆలయములోనికి వెళ్ళునపుడు అచట అందమగు శిల్పములుం డును. మనసు నాకర్షించు బొమ్మ లుండును. గర్భాలయమున ఎచ్చటనో దర్శింపతగిన మూర్తి ఉండును.

అన్వేషించుచు పోవలసినది ఆ ప్రధానమైనమూర్తి వద్దకు. ఈ బాహ్యమైన శిల్పసౌందర్యాదులు మనసునకు తృప్తినిచ్చినచో ఆతడన్వేషణమున మందగిం చును. వీనిని చూచి తృప్తినొందక చూడవలసిన మూర్తిని చూచునంతవరకు ఆర్తితో బాధపడువాడే ఆ లోపలనున్న మూర్తిని దర్శింపగలడు.

అట్టి సన్నివేశమే ఇచ్చట హనుమదన్వేషణములో కూడ మనకు కన్పట్టును.

సుందరములగు భవనములు, మనోహరములగు శిల్పములు, సుందరాం గులగు విలాసవతులు, హనుమకు కన్పట్టుచుందురు. వాని సౌందర్యము ఆతని నాకర్షించి నిలుపలేదు. అతనికి కావలసినది సీతమ్మ. ఆమె లేదనగనే వానిని వదలును. ఆ అందమైన వస్తువులను చూచి ఆనందింపడు. సీతమ్మ కన్పడలే దని దుఃఖపడును. అన్వేషణములో సాగెడి విధానమును ఇందు అందముగా ప్రదర్శించెను.

**6** హనుమ మరల కామరూపమును దాల్చి లాఘవముతో విమానము లపై తిరుగుచు సీతను వెతకుచుండెను.

"ఆససాదాథ లక్ష్మీవాన్ రాక్షసేంద్రనివేశనం." (సుంద.6-2)

అపుడు లక్ష్మీవంతుడగు హనుమ రాక్షసేంద్రభవనమును చేరెను.

తత్త్వదీపిక :-

రాక్షసేంద్ర భవనమును చేరిన హనుమకు "లక్ష్మీవంతు" డను విశేష ణమును ప్రయోగించెను.

(1) తాను వేరుగా నుండి లంకను చూడగల్గుట :-ఐశ్వర్యము.

(2) లంకను చేరి లంకిణిని చంపుట :-ఐశ్వర్యము.

(3) అన్వేషించుచు రావణభవనమును చేరుట :-ఐశ్వర్యము.

(4) ఆత్మకంటె దేహము వేరని ఎఱుంగుట :-ఐశ్వర్యము.

(5) అట్టి ఆత్మ నన్వేషించుటకు శరీరములోనికి చూడయత్నించుట :-ఐశ్వర్యము.

(6) దేహాత్మాభిమానమును ఎదిరింపగల్గుట :- ఐశ్వర్యము.

(7) మనసును చూచి దాని నెఱుంగుట :-ఐశ్వర్యము.

ఇట్లు ఆత్మాన్వేషణములో ఆయాస్థితులను పొందిననాడు వాడైశ్వర్య వంతు డనిపించుకొనును. కాని బాహ్యమైన ఐశ్వర్యము- ఐశ్వర్యము కాదని లంకాన్వేషణము చేయుచున్న హనుమకు 'శ్రీమాన్', 'లక్ష్మీవాన్' అను విశే షణములను ప్రయోగించుచుండును.

రావణభవనము సూర్యునికాంతివలె ప్రకాశించుచున్న ప్రాకారముతో ఆవ రింపబడి యుండెను.

వనము సింహములచే రక్షింపబడినట్లు ఆ భవనము భయంకరులగు రాక్షసులచే రక్షింపబడుచుండెను.

వెండితో చేయబడి, బంగారముచే అకర్షింపబడిన చిత్రములగు తోరణ ములు, విచిత్రములగు కక్షలు అచ్చట కన్పట్టెను. ద్వారము లతిమనోహరములుగ నుండెను. ఏనుగులను అధిరోహించు ప్రధానులగు శూరులు; రథికులు; సింహ వ్యాఘ్రాది చర్మములతో నిర్మించిన తొడుగులు కల దంతము, వెండి, బంగారురథములు అచట కన్పట్టెను.

చూడదగిన మృగములు, పక్షులు వేలకొలది నిండియుండెను.

సుశిక్షితులగు బాహ్యారక్షకులచే రక్షింపబడుచుండెను. శ్రేష్ఠులగు స్త్రీలచే నిండియుండెను. సంతుష్టిగల స్త్రీలతో, వారి ఆభరణ ధ్వనులతో సముద్ర ఘోషమువంటి ఘోషము కల్గియుండెను.

రాజుల కుపయోగింపదగిన అగరు, చందనము మున్నగు వానితో నిండి యుండెను.

భేరి మృదంగ శంఖాదుల ధ్వనులతో ధ్వనించుచుండెను. సముద్రమువలె గంభీరమై యుండెను.

మహారత్నసమాకీర్ణమై గజాశ్వరథసంకులమై విరాజిల్లుచున్న ఆభవనము లంకాభరణమువలె ఉండెను.

రాజభవనములలో కక్ష్యలుండును. ఆ కక్ష్యలలో ఒక దానిలో ఏనుగులు, గుఱ్ఱములు, రథములు మొదలగునవి ఉండును. రథికులు, హాస్తికులు ఉందురు.

వేరొక కక్ష్యలో పరిమళద్రవ్యములు తయారు చేయబడుచుండును. వేరొక కక్ష్యలో మంగళవాద్యములు వినబడుచుండును.

వెలుపలి కక్ష్యలు జనకోలాహలములతో నుండెను.

లోపలి కక్ష్యలు రావణునివద్ద భయముచే నిశ్శబ్దముగా నుండెను.

ఇట్లు హనుమ రావణభవనములోని కక్ష్యల నన్నిటిని జూచి రక్షకజన కోలాహల మింకను సాగుచున్నదని ఇతర ప్రాసాదముల నన్వేషించుటకు బయలుదేరెను.

ముఖ్యమంత్రియగు ప్రహస్తునియొక్క భవనమును, మహాపార్శ్వభవనము, కుంభకర్ణ విభీషణ భవనములను వెదకెను.

మహోదరుడు, విరూపాక్షుడు, విద్యుజ్జిహ్వుడు, విద్యున్మాలి, వజ్రదంష్ట్రుడు, శుకుడు, సారణుడు, ఇంద్రజిత్తు మొదలగువారి భవనములనన్నిటిని వెదకెను. వారిభవనములలో నున్న వారి వారి ఐశ్వర్యములను చూచెను.

అన్నిటిని దాటి మరల రాక్షసేంద్రభవనమును 'లక్ష్మీవంతు' డగు హనుమ చేరెను.

రావణుడు పండుకొనియుండగా మేల్కొనియుండు కాపలా కాచెడి శూలము, ముద్గరము, శక్తి, తోమరము మొదలగు ఆయుధములను దాల్చిన

వికృతేక్షణలగు రాక్షసస్త్రీలను చూచెను. ఆ రక్షోధిపతిభవనమున సేనానివేశ ములను పెక్కింటిని చూచెను. కట్టబడియున్న ఎఱ్ఱని తెల్లని గుఱ్ఱములను చూచెను. ఉత్తమజాతికి చెందిన రూపసంపన్నములగు ఏనుగులను చూచెను. శత్రుగజములతో ఎదిరించి యుద్ధము చేసెడి ఐరావతములవంటి సుశిక్షితము లగు మదమును స్రవించు ఏనుగులను చూచెను. బంగారు ఆభరణములతో కూడిన వేలకొలది కాల్బలమును చూచెను. వివిధాకారములగు పాలకీలను చూచెను. అచ్చట లతాగృహములు, చిత్రశాలలు, క్రీడాగృహములు, దివాగృహ ములు, కామగృహములని వేరు వేరు ప్రయోజనములకై నిర్మింపబడిన వేరు వేరు గృహములను చూచెను. నెమళ్ళు కూర్చుండి నృత్యము చేయుటకు ఏర్పరచిన స్థానమును చూచెను.

అనేక రత్నములతో, నిధులతో నిండిన ఆ భవనము పరమేశ్వరభవనము వలె నుండెను.

అచట పాన్పులు, ఆసనములు, పాత్రలు అన్నియు బంగారుతో తయారు చేయబడినవే!

మద్యములతో తడిసియుండి, మణిభాజనములతో నిండియుండి మనో హరముగ నొప్పుచున్న విశాలమగు ఆ భవనము కుబేరభవనమువలె నుండెను.

రత్నములకాంతితో రావణుని తేజస్సుతో ఆభవనము కిరణములతో ప్రకా శించుచున్న సూర్యునివలె నుండెను.

స్త్రీల నూపురధ్వని, మొలనూలుచప్పుడు, మద్దెలధ్వనులు భవనమంత టను నిండుచుండెను.

మేడవరుసలు, వేలకొలది స్త్రీలు, చక్కని అమరికగల కక్ష్యలు అందు ఒప్పుచుండెను.

ఇట్టి మహాగృహమున హనుమ ప్రవేశించెను.

7 ఆ భవనము వైడూర్యములతో పొదుగబడిన బంగారు జాలక ములుగలదై వర్షాకాలమందు మెరుపులతో కూడిన మేఘమండ లమువలె భాసించుచుండెను.

గృహములో అనేక విధములగు శాలలు, ఆయుధశాలలు ఒప్పుచుండెను. మేడలపై చంద్రశాలలు విరాజిల్లుచుండెను. ఆ గృహములు నానా విధ ధనములతో నిండినవై, దేవాసురులచేత పూజింపబడునవై దోషవర్జితములై

యుండెను.

మయుడు స్వయముగ ప్రయత్నముతో దేని నెచట ఉంచవలెనో దాని నచట నుంచి ఆ భవనమును నిర్మించెను.

తరువాత అ ప్రతిమ సౌందర్యముగలది, ఎత్తుగా నున్న మేఘమువలె ఒప్పుచున్నది, బంగారుకాంతులతో నిండినది, రావణుని బలమునకు తగినట్లు నిర్మింపబడినది యగు వేరొక గృహోత్తమమును జూచెను. అది భూమండల మునకు దిగిన స్వర్గమా! అనునట్లు కాంతితో ప్రకాశించుచుండెను.

అనేకవిధములగు రత్నము లచట పరచబడియుండెను.

చెట్ల పూవులు అంతట జల్లుకొని, వాని పుప్పొడి వ్యాపించియున్న పర్వతశిఖరమువలె ఆ భవనము భాసించుచుండెను.

మెఱపులతో మేఘము ఆవరింపబడి యున్నట్లు అందగత్తెలైన స్త్రీలచే ఆ భవనము ప్రకాశించుచుండెను.

హంసలు మోయుచున్న సుకృతాత్ముల సుందరమగు విమానమువలె ఆ విమానము కన్పించుచుండెను. ఆ భవనమే కుబేరుని జయించి తెచ్చిన పుష్పకవిమానము. దానిని రావణుడు తనమేడపై నుంచుకొనినాడు.

రంగురంగుల ధాతువులచే చిత్రమగు పర్వతాగ్రమువలె గ్రహములతో చంద్రునితో చిత్రముగానుండు ఆకాశమువలె, రాశీభూతమైన మేఘములచే చిత్రమైన ఆకాశమువలె, బహుచిత్రమై ఆ విమానరత్నము ఒప్పుచుండెను.

తత్త్వదీపిక :-

ఆ విమానమున భూమండలమంతయు చిత్రరూపమున లిఖింపబడియున్నది. ఆ చిత్రలేఖనమున స్వల్పమగు విషయములు కూడ చక్కగ చిత్రింపబడెను.

వాల్మీకియొక్క కావ్య నిర్మాణ శిల్పము ఈ చిత్రలేఖనమున గోచరించును.

"మహీకృతా పర్వతరాజిపూర్ణా
శైలాః కృతాః వృక్షవితానపూర్ణాః
వృక్షాః కృతాః పుష్పవితానపూర్ణాః
పుష్పం కృతం కేసరపత్రపూర్ణమ్." (సుంద.7-9)

భూమి పర్వతపంక్తులతో చిత్రింపబడినది. పర్వతములు వృక్షపంక్తులతో నిండినవిగా చిత్రింపబడినవి. వృక్షములు పుష్పసమూహములతో నిండినవిగా

చిత్రింపబడినవి. ఆ పుష్పములు కేసరములతో, పత్రములతో నిండుగా నున్నట్లు చిత్రింపబడినవి.

అంచు పాండురములగు భవనములు, పుష్పములతో నిండిన సరస్సులు, సకేసరములగు పద్మములు, చిత్రములగు వనములు చిత్రింపబడినవి.

అన్నిటికంటె అధికమగు ప్రమాణముగల రత్నకాంతులతో పైపైకి వృద్ధి నొందుచు నున్నట్లున్న పుష్పకమను మహావిమానమును హనుమ దర్శించెను.

అందు-

వైడూర్యములతో వెండితో, పగడములతో పక్షులు నిర్మింపబడియున్నవి.

నానారత్నములతో భుజంగములు, ఉత్తమజాతి అశ్వములు నిర్మింపబడినవి.

అందమైన ముఖములు, అందమైన రెక్కలు కలిగి కొద్దిగ వంచిన రెక్కలు కల్గునట్లు పక్షులను నిర్మించి ఆపక్షుల రెక్కలపై పగడములతోను, బంగారముతోను చేయబడిన పువ్వులను అమర్చిరి. అవి మన్మథునకు కామోద్దీపనమున సాయపడుచున్నట్లుండును.

ఆ విమానమునందు ఒక తామరకొలను కలదు. అందు అందమైన తొండములుగల, ఒడలినిండ పద్మకింజల్కము లంటియున్న ఏనుగులు, సుందరములగు బాహువులతో పద్మములను దాల్చి పద్మమునందు కూర్చున్న లక్ష్మికి తమంత తామే కలువరేకులతో అభిషేకమును చేయుచుండును.

ఈ విధముగ ఆ గృహము పరమసుందరము, పరమసుగంధిలము, ఆశ్చర్యజనకము.

అట్టి భవనమును చూచియు హనుమ సీతమ్మ కానరాకపోవుటచే అత్యంతము దుఃఖితుడాయెను.

"తతస్తదా బహువిధభావితాత్మనః
కృతాత్మనో జనకసుతాం సువర్త్మనః
అపశ్యతోఽభవ దతిదుఃఖితం మనః
సుచక్షుషః ప్రవిచరతో మహాత్మనః." (సుంద.7-17)

అపుడు అనేకవిధములుగ సీతమ్మను గూర్చి మనసులో ఆలోచించుచున్నవాడును, నిశితమైన బుద్ధిగలవాడును, చేయవలసిన ప్రయత్నమంతయు

చేయుచున్నవాడును, సదాచారసంపన్నుడును, దూరదర్శియు, సూక్ష్మదర్శియు, మహాధైర్యశాలియు నగు ఆ హనుమ మనసు ఎంతయో దుఃఖమును పొందిన దాయెను.

తత్త్వదీపిక :-

రమణీయములగు వస్తువులను చూచుచున్నను, రమణీయములగు అనుభూతుల ననుభవించుచున్నను చూడవలసిన ఆత్మవస్తువును చూడనినాడు బాహ్య సుందరవస్తు సందర్శముచే కాని, బాహ్యవిషయానుభూతిచేగాని ఆత్మాన్వేషణపరుని మనసునకు శాంతికలుగదు. దుఃఖమే కలుగును. అట్టి మహాత్ముని స్వరూపము నిందు చిత్రించుచున్నాడు.

(1) బహువిధభావితాత్ముడు = అనేకవిధములుగ ఆత్మవస్తువును గూర్చియే భావన చేయువాడు

(2) కృతాత్ముడు = దానిని తప్పక పొందవలెనని నిశ్చితమగు బుద్ధి కల్గి, దానిని పొందుటకు ప్రయత్నము నాచరించినవాడు

(3) సువర్త్ముడు = సదాచారసంపన్నుడు. నీతి తప్పని మార్గమున నడచువాడు.

(4) సుచక్షువు = ఆత్మవస్తువును చూచుటకు తగిన సూక్ష్మదర్శియగు అంతరనేత్రము కలవాడు.

ఇట్టి మహాత్మునికి చూడవలసిన వస్తువు సీత లేదా ఆత్మ. అది కనపడనిచో మనసు అతిదుఃఖితమగును. ఇతరునకు సుందరములగు వస్తువులను చూడగనే మనసు ఆనందమునే పొందుచుండును.

**8** వెనుక కక్ష్యలతో కూడిన భవనమును ప్రవేశించి, దానిలో నున్న మహాగృహమును చేరి ఆ భవనముమధ్యలో నిల్చిన మణి వజ్రచిత్రితమగు విమానమును గాంచెను. మరల దీని మధ్యలో ఉన్న విపులము, ఆయతమునగు భవనమును చూచెను.

తత్త్వదీపిక :- ఇందు మూడుసార్లు

"ఆససాదాథ లక్ష్మీవాన్ రాక్షసేంద్రనివేశనమ్"

(సుంద. 6-2. 6-28. 9-4)

అనుశ్లోకపాదమును ప్రయోగించును. సప్తకక్ష్యలను దాటిన తరువాత

"హనుమాన్ప్రవివేశమహాగృహం"

అని చెప్పి ఆ భవనమును వర్ణించును.

"పత్న్యస్యమధ్యే భవనస్య సంస్థితం" (సుంద. 8-1)

అని ఆ భవనము మధ్యలో నున్న విమానమును వర్ణించును.

"తస్యాలయవరిష్ఠస్య మధ్యే విపులమాయతం
దదర్శభవనశ్రేష్ఠం హనుమాన్ మారుతాత్మజః" (సుంద.9-1)

అని రావణపత్నులు, రావణుడు పరుండిన భవనమును వర్ణించును. దీనిచే మన కొక విషయము తెలియుచున్నది. ఈ మూడు స్థలములలో సీత లేదు కావున ఇవి ఆత్మ స్థానమగు విజ్ఞానమయకోశమునకు ముందున్న అన్నమయ, ప్రాణమయ, మనోమయ కోశములని భావింపవీలగును. మనోమయకోశమనెడి మూడవస్థానములో మనస్స్వరూపుడగు రావణుడు శయనించి యుండును. ఈ మూడిటిని ఒక్కొక్కదానిని అన్వేషించునపుడు ఒక్కొక్కసారి హనుమను "లక్ష్మీవంతుడు" అనును.

ఇప్పుడు ఆ భవనములో మధ్యనున్న మహావిమానమును హనుమ కాంచెను. అందు కృత్రిమముగా నిర్మింపబడిన శిల్పరాశి 'ఇట్టిది' అని చెప్పుటకు శక్యముకాదు.

దానివలె వేరొక వస్తువును చేయుటకు శక్యముకాదు. విశ్వకర్మ వానిని స్వయముగా ఇది చాల అందముగా నున్నదని తానే ప్రశంసించుచు నిర్మించెను. ఈ విమానము ఆకాశమునందున్నది. వాయుమార్గమున సంచరించునట్లు స్థాపింపబడియున్నది.

తత్త్వదీపిక :-

ఈ శ్లోకములో

"దివంగతం వాయుపథ ప్రతిష్ఠితం" (సుంద.8-2)

అనుపదములు ఇది ప్రాణమయకోశమును సూచించుచున్నట్లు స్ఫురింప చేయుచున్నవి.

ఆ విమానమున ఏ ఒక్కటియు ప్రయత్నముతో చేయబడనిది లేదు. గొప్ప విలువగల రత్నములు పొదగబడనిది లేదు. ఆ విమానమునందలి విశేషములు దేవభవనములయందుకూడ కన్పట్టవు. మహావిశేషము లేని నిర్మాణము ఏ ఒక్కటియును అందులేదు.

తపోఽనుష్ఠానముచేతను, పరాక్రమముచేతను రావణుఁడా విమానము నార్జించెను.

దాని నధిరోహించినవారు మనసులో ఎట్లు తలంచిన ఆ విధమున పెక్కుగతుల నడువగలది ఆ విమానము. అనేకములగు విమాన గోపురాది సన్నివేశము లందు కలవు. ఒకదాని నొకటి పోలినట్లే యుండి విశిష్టముగా నుండును. ఏకాగ్రముగ నున్న మనసుతో శీఘ్రముగ నడచును. దాని గమనమును ఏదియు ఆటంకపరుపజాలదు. ఎంతో పుణ్యమొనర్చిన మహైశ్వర్య సంపన్నులగు ఇంద్రాదుల భవనమును పోలియుండును. దాని భాగములలో ప్రత్యేకమగు భాగములు ఎంతో విశిష్టములుగ నుండును. విచిత్రములగు శిఖరములు, అవాంతర శిఖరము లనేకములు అందు కన్పట్టును.

శారదచంద్రునివలె నిర్మలమై, మనోహరమై యుండును.

ఆవిమానమును మహాకాయులు, కుండలశోభితముఖమండలులు అగు నిశాచరులు మోయుచున్నట్లు ప్రతిమలు నిర్మింపబడెను.

వసంతఋతువునందలి పూవులపరపుకంటె మనోహరమగు దర్శనము గలదియు, వసంతమాసముకంటె మధురమైనదియునగు ఆ పుష్పకవిమానమును వానరవీరుడగు హనుమ దర్శించెను.

**9** ఇపుడు హనుమ రావణస్త్రీలు, రావణుడు పరుండెడి భవనమునకు వచ్చుచున్నాడు.

ఆపుష్పకవిమాన మధ్యభాగమున విశాలముగ పొడవుగనున్న ఒక భవన శ్రేష్ఠము కలదు.

అది అర్ధయోజనము విస్తీర్ణము, యోజనము పొడవుగలదై యుండెను. అందు బహుప్రాసాదములు గలవు.

ఆయతలోచన యగు వైదేహిని వెదకుచు హనుమ అందంతట తిరుగుచుండెను.

**తత్త్వదీపిక :-**

ఇది హనుమ తిరిగిన రావణభవనములలో మూడవ అంతస్తు. ఇదియే మనోమయకోశము. ఇచటకు చేరగానే హనుమను "లక్ష్మీవంతు" డనును.

ఆ భవనమును నాలుగు దంతములు, మూడు దంతములు గల ఏను

గుంతో ఆయుధధారులై భటులు రక్షించుచుండిరి.

అందు రావణుని పత్నులగు రాక్షసస్త్రీలు, అతడపహరించి తెచ్చిన రాజ కన్యలును నిండియుండిరి మొసళ్ళతోను, తిమింగలములతోను, చేపలతోను నిండిన గాలికి కదలాడుచున్న సముద్రమువలె ఆ భవనము కన్పట్టుచుండెను.

ఆ రావణభవనమునందు కుబేరుని ఐశ్వర్యము, ఇంద్రుని ఐశ్వర్యము ఎల్లప్పుడు కుంతూగుచుండును. కుబేర, యమ, వరుణాదుల ఐశ్వర్యమును మించిన యైశ్వర్యము అచ్చట కన్పట్టుచుండును.

ఆ భవనములో మధ్యను ఒకస్థానము కలదు. ఈ పుష్పకవిమానమును పూర్వము విశ్వకర్మ బ్రహ్మకొఱకు నిర్మించెను. ఇది సర్వరత్న విభూషితము. కుబేరుడు తపసుచేసి దానిని బ్రహ్మనుండి పొందెను. పరాక్రమముచే ఆ కుబేరుని జయించి రావణుడీ విమానమును తెచ్చెను.

బంగారు, వెండి తోడేళ్ళ బొమ్మలతో నిండిన స్తంభములతో మేరుమం దర సదృశములగు భవనములతో, సువర్ణ సోపానములతో, సుందర వేదికలతో, కాంచనస్ఫాటికవాతాయనము (కిటకీ) లతో, పగడములతో, మణులతో, ముత్య ములతో నిర్మింపబడిన నేలలతో, సూర్యమండల సదృశమై ఆ విమానము వెలుగొందుచుండెను.

ఆ దివ్య పుష్పకవిమానమును హనుమ అధిరోహించెను.

అచట పానములయొక్క, భక్ష్యములయొక్క, అన్నముల యొక్క వాస నలు గుబాళించుచుండెను. ఉత్తముడగు బంధువును "రమ్మ రమ్మ" ని పిల్చినట్లు ఆ వాసనలా హనుమను రావణుడున్న వైపు పిలచెను.

హనుమ ఆ రావణ శయనమందిరమును దర్శించెను. ఆ శాల రావణుని మనఃకాంత యగు కాంతవలె ఒప్పుచుండెను.

అందు మణులతో మెట్లు, బంగారముతో జాలు, స్ఫటికముతో నేల నిర్మింపబడియుండెను. అందు మణిస్తంభములు గలవు. ఆ స్తంభములను ముత్యములతో, పగడములతో, వెండితో, బంగారముతో అలంకరించిరి. ఆ స్తంభములు సమానముగ, తిన్నగ, ఎత్తుగ అలంకరింపబడి ఉండెను.

నేలపై పెద్దతివాచీ పరచియుండెను. దానిపై రాష్ట్రములతో, గృహము లతో, భూమండలమంతయు చిత్రింపబడియుండెను. అది దివ్యగంధములతో సువాసితమై యుండెను. విలువగల పాన్పులతో అమర్చబడి యుండెను.

అగరుధూపముల పొగజిమ్ముచుండెను. రంగు రంగుల పూవులు పరచుటచే చిత్రవర్ణము కల్గియుండెను.

తల్లి-పిల్లలను ఆనందింపచేసినట్లు ఆ భవనము ఐదు ఇంద్రియములను ఐదు విషయములచే తృప్తిపరచు చుండెను.

హనుమ ఆ భవనమును జూచి "ఇది స్వర్గమా? దేవలోకమా? ఇంద్రపురియా? సిద్ధిక్షేత్రమా?" అని భావించెను.

అచట కాంచనదీపములు రెప్పవేయకుండ ధ్యానముచేయుచున్నవా అన్నట్లు వెలుగుచుండెను. పెద్దజూదగాండ్రచే ఓడిపోయిన జూదరులవలె ఆ దీపములు కన్పట్టుచుండెను.

దీపముల వెలుగు, రావణుని తేజస్సు, భూషణముల కాంతి, వ్యాపించి ఆ భవనమంతయు మండుచున్నట్లుండెను.

నేలపై పరచిన ఆ యాస్తరణములపై రంగురంగుల చీరలు, హారములు ధరించి నానావేషములతో భూషితలగు వేయిమంది స్త్రీలు పరుండియుండిరి.

అర్ధరాత్రి సమయము దాటుటచే పానముచే నిద్రావశలై క్రీడించి అలసి ఆ స్త్రీలందరు గాఢనిద్రను పొందియుండిరి.

ఆభరణముల కదలికచే కల్గు ధ్వని లేకుండ నిశ్శబ్దముగ పరున్న ఆ స్త్రీమండలి సద్దుమణిగియున్న హంసలతో, భ్రమరములతో కూడిన పద్మవనమువలె నుండెను.

దంతములు, కన్నులు మూతబడియుండిన వారి ముఖములు ప్రాతఃకాలమున విడి సాయంకాలమున మరల మూతపడిన తామర పువ్వులవలె కన్పట్టెను. స్త్రీలతో ప్రకాశించుచున్న ఆ విశాలమగు భవనము శరత్కాలమందు తారలచే శోభితమగు ప్రసన్నమగు ఆకాశమువలె భాసించుచుండెను.

ఆ స్త్రీలతో కూడిన రాక్షసాధిపుడగు రావణుడు తారాపరివృతుడగు నక్షత్రరాజువలె ప్రకాశించుచుండెను. పుణ్యావశమున ఆకాశమున తారలై-కొద్దిగా మిగిలిన పుణ్యముతో భూమికి జారిన తారలా యనునట్లు ఆ స్త్రీలు కన్పట్టుచుండిరి. ఆ స్త్రీలు బాగుగా త్రాగి, క్రీడించి చెదరిన ఆభరణములతో పరుండియుండిరి.

కొందఱకు బొట్లు చెరిగిపోయెను, కొందఱ కాలియందెలు తొలగిపోయెను, కొందఱిహారములు ప్రక్కకు జారెను, కొందఱి వస్త్రములు జారెను,

కొందఱి మెడలలోని పుష్పమాలలు తెగి నలిగి యుండెను.

చంద్రకాంతులవంటి కాంతులుగల ముత్యాలహారములు ముద్ద కట్టి హంసలవలె వక్షమున ఒకచోట పడియుండెను.

కొందఱి మెడలలోని వైదూర్యహారములు కాదంబపక్షులవలె, కొందఱిమెడలలోని బంగారుహారములు చక్రవాకములవలె ప్రకాశించుచుండెను.

ఆ స్త్రీలు నదులవలె కన్పట్టుచుండిరి. వారిపై ముక్తావైడూర్య హేమ సూత్రములు హంస కారండవ చక్రవాకములవలె ప్రకాశించుచుండెను.

వారి జఘనములు ఇసుకతిన్నెలువలె కన్పట్టుచుండెను.

నిద్రపోవుచున్నపుడు నోటినుండి వెల్వడు గాలికి ముఖముపై పడిన పైట చెంగులు పైపైకి లేచుచు పడుచుండెను. వారి ముఖముల నుండి వచ్చు నిట్టూర్పు ఆసవగంధములతో వాసితమై యుండెను.

నిద్రలో ఒడలు తెలియక రావణుని ముఖ మనుకొని సవతుల ముఖములను వాసన చూచుచుండిరి.

ఒకతె గుండెలపైన- వేరొకతె చేయివేసికొని పరుండెను. ఒకతె గుండెలపైన--వేరొకతె తొడ వేసికొని పరుండెను.

ఇట్లు ఒకరిచేతితో ఒకరిని తాకుచు, ఒకరి తొడలను వేరొకరికి చేర్చుకొనుచు ఆ స్త్రీలందరు పరుండియుండిరి. ఈ స్త్రీలవరుస ఒక మాలవలె నుండెను. అన్యోన్యము తగులుచుండిన వారి భుజములు ఆ మాలలో సూత్రమువలె నుండెను.

"అన్యోన్య భుజసూత్రేణ స్త్రీమాలా గ్రథితా హి సా"

(సుంద. 9-63)

అందముగా ఒక పూల దండవలె ఆ స్త్రీల సమూహము కన్పట్టుచుండెను.

ఒకరినొకరు దగ్గరగా చేరి పరుండుటచే ఆభరణములుగాని, అవయవములు గాని, వస్త్రములు గాని, మాలికలు గాని ఎవరివి ఏవో తెలిసికొనుటకు వీలులేకుండ కలసి యుండెను.

అచట రాజర్షికాంతలు, పితృకాంతలు, దైత్యకాంతలు, గంధర్వకాంతలు, రాక్షసకాంతలు కూడ అతనితో కామపరవశలై కలసి పరుండియుండిరి.

వారిలో కొందఱను వారి సంబంధులతో యుద్ధమును కాంక్షించి హరించి తెచ్చెను. కొందరు తమంతతామే కామించి వచ్చిరి.

వారిలో ఏ ఒక్కతెను ఆమె కిష్టములేనిదే, బలాత్కరించి ఆతడు పొందలేదు. పరాక్రమముచే పొందలేదు. కేవలగుణముచేతనే వారి నాకర్షించి పొందెను.

ఇంతకుముం దొకరిని ప్రేమించి తప్పక వచ్చినది గాని, ఇచట నుండియు వేరొకచోట ఆసక్తి గలదిగాని ఒక్క తెయును లేదు. కులవతి కానిదిగాని, హీన రూపగాని, మర్యాదలేనిదిగాని, దాక్షిణ్యములేనిదిగాని, నివిహీనమగు స్వభావము కలదిగాని, కామింపతగనిది గాని అందొక్కతెయు లేదు.

వీరి నందఱను చూడగనే సాధుబుద్ధియగు హనుమ మనసులో "శ్రీరాముని ధర్మపత్ని కూడ ఈ రాక్షసరాజు భార్య లెట్లుండిరో అట్లున్నచో ఈతనిజన్మ శోభనమై యుండును" అని తోచెను.

తత్త్వదీపిక :-

ఈ ఊహలో మూడురకములుగా భావము వచ్చుటకు వీలున్నది.

(1) "స్వయంవరమునకు ముందే రాముని పొందకుండ ఈ రావణుని పొంది యున్నచో ఈ రాక్షసరాజు యొక్క భార్యలవలెనే ఈమెకూడ రావణునితో రమించిన ఆతని జన్మ ధన్యమై యుండెడిది."

ఇట్టి బుద్ధి హనుమకు కల్గియుండదు. ఆతడు 'సాధుబుద్ధి'. ఆ వాక్యము అట్టి అర్థము నిచ్చుచున్నది.

ఇట్లే మరియొక అర్థము వచ్చుచున్నది.

(2) "ఈ రాక్షసరాజు భార్యలు తమ భర్తతో ఎట్లు ఆనందముగ పరుండి యున్నారో అట్లు మా రాముని భార్యకూడ మారామునితో పరుండియున్నచో ఈ రావణుని జన్మ ధన్యమైయుండు" నని సాధుబుద్ధియగు హనుమకు తోచెను.

మరియొక అర్థము వచ్చుచున్నది.

(3) "మారాఘవ ధర్మపత్ని వీనిచే అపహరింపబడి ఈ విధముగ ఎట్లున్నదో అట్లు వీని భార్యలు కూడ మరియొకనిచే అపహరింపబడియున్నచో వీని జన్మకు తగినపని జరిగియుండును."

ఇట్లు మూడర్థములు తోచుచున్నవి.

"బభూవ బుద్ధి స్తు హరీశ్వరస్య
యదీదృశీ రాఘవధర్మపత్నీ

ఇమా యథా రాక్షసరాజభార్యాః
సుజాత మస్యేతి హి సాధుబుద్ధేః" (సుంద. 9-72)

హనుమ తలంచిన తలంపులో దోషము లేకున్నను దోషము స్ఫురించుటకు అవకాశమున్నది. రావణుడు తన స్త్రీలతో ఎట్లు కలసియున్నాడో అట్లు రాముడు కూడ తనసీతతో కలసి యున్నచో వీని ఐశ్వర్య మవిచ్ఛిన్నమై వీని జన్మ ధన్యమై యుండెడిది గదా! యని హనుమ భావించెను. కాని వాక్య నిర్మాణమున అశ్లీలమగు అర్థము కూడ స్ఫురించుటకు అవకాశ మున్నదని హనుమకు వెంటనే స్ఫురించెను.

"పున శ్చ సోఽచిన్తయ దార్తరూపః
ధ్రువం విశిష్టా గుణతో హి సీతా." (సుంద.9-73)

హనుమ బాధపడుచు ఆర్తుడై మరల,

"ఈ రాక్షసస్త్రీలతో పోలిక చెప్పుటకు కూడ సీత తగదు. వీరి కంటె గుణములలో, పాతివ్రత్యధర్మములో సీత ప్రత్యేకత గలది" అని అనుకొనెను.

అట్టి యామెను రాక్షసస్త్రీలవలె అని పోల్చినందుకు హనుమ ఎంతో బాధపడెను.

"ఈ లంకేశ్వరుడు మహాతపశ్శాలియైయుండియు యుక్తము నాలోచించక అనార్యులు చేయవలసిన క్రూరమైన పనిని ఆ మహాపతివ్రత విషయమున చేసెను. ఆహా! ఏమిది?" అని బాధపడెను.

"మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే
యతతా మపి సిద్ధానాం కశ్చి న్మాం వేత్తి తత్త్వతః."

"కొన్నివేల మనుష్యులలో ఒక్కడు సిద్ధికి యత్నించును. యత్నించిన వారిలో సిద్ధిపర్యంతము కొందరే సాగుదురు. అట్లు సాగిన వారిలో ఏ ఒక్కడో భగవత్స్వరూపము నెరుంగజాలును."

అట్లే లంకలో రావణునిచే బంధింపబడిన కొన్ని వేలమందిలో ఒక్కరికి కూడ వానిని వదలి వేరొకనిని పొందవలె ననుకోరికయే కలుగలేదు. వేరొకడు పొందదగిన వాడున్నాడను భావనయే లేక హాయిగా నున్నారు.

ఒక్క సీతమ్మ మాత్రమే రావణుని ఐశ్వర్యమును ధనమును కాదని శ్రీరాముని కోరుచున్నది.

ముముక్షువు (మోక్షమందు కోరికగలవాడు) అగుట ఎంత దుర్లభమో దీనిచే తెలియుచున్నది.

**10** అచటనే స్ఫటికమయమగు, రత్నభూషితమగు, దివ్యమగు శయనమును హనుమ చూచెను. ఆశయమునకు ఆధారముగ నిర్మింపబడిన పర్యంకముదంతముతోను, బంగారముతోను నిర్మింపబడెను. వైడూర్యములతో దానినుండి దిగుటకు మెట్లవంటివి నిర్మింపబడెను. మహామూల్యమగు ఆస్తరణము దానిపై ఉంచబడెను. దాని శిరోభాగమున చంద్రమండల సన్నిభమగు తెల్లని గొడుగుండెను. చామరములు చేతిలో పట్టుకొని స్త్రీలు చుట్టును వీచుచుండిరి.

ధూపపరిమళములు, సుగంధద్రవ్యవాసనలు అంతట నిండియుండెను. పుష్పమాలిక లంతట కట్టబడెను.

ఆ పాన్పుపై నీరు పట్టిన నల్లని మేఘమువలె రావణుడు పరుండియుండెను. చెవులకుండలములు మెరయుచుండెను. ఆతడు పొడవైన బాహువులు, ఎఱ్ఱని నేత్రములు గల్గియుండెను. బంగారువస్త్రమును దాల్చెను; మంచి పరిమళముగల ఎఱ్ఱచందనము అతని ఒడలి నిండ పూయబడి యుండెను. ఒడలినిండ ఆభరణము లుండెను.

సంధ్యాకాలమున సంధ్యారాగము వ్యాపించిన మెరుపులతో కూడిన నల్లని మేఘమువలె ఆతడు ప్రకాశించుచుండెను. వృక్షములతో, పొదలతో కూడిన మందరపర్వతము నిద్రపోవుచున్నదా! అన్నట్లుండెను.

రాత్రివేళ స్త్రీలతో మద్యమును సేవించి, క్రీడించి, ప్రకాశించుచున్న శయనముపై నిద్రించుచున్న రాక్షసాధిపుని హనుమ చూచెను. మనసులో ఉద్వేగము కల్గెను.

భయపడినవానివలె ప్రక్కకు తొలగి ఒక మెట్టు నెక్కి వేరొక వేదికపై నిలచి నిద్రపోవుచున్న రాక్షసరాజును మహాకపి చూచుచుండెను.

**తత్త్వదీపిక:-**

మనసునందలి వాసనలు లేదా చిత్తవృత్తులు మూడుదశలు కల్గియుండును.

(1) సుప్తదశ (2) క్షీణదశ (3) ఉద్బుద్ధదశ

ఒకప్పుడవి నిద్రించుచుండును. అపుడు వానిశక్తి బైటకు ప్రసరింపదు.

నిద్రించుచున్న వాడెంత క్రూరుడైనను నిద్రపోవుచున్నప్పుడు క్రూరము లగు వ్యాపారములను చేయదు.

అట్లే ఒకప్పుడు ఆసుర రాక్షసములైన చిత్తవృత్తులు అణగి యుండును. ఒకప్పుడు బాగుగా తగ్గి, కృశించి లేవన్నట్లుండును.

కోపము బాగుగా తగ్గినప్పుడు లేదన్నట్లుండును. కాని చిన్న కణమువలె నున్న నిప్పుపై కొద్దిగ కొద్దిగ ఊకవేసి రాజబెట్టినచో మరల ఎట్లది ప్రజ్వలించునో అట్లే ఈ కృశించిన కామక్రోధాదిభావములు కూడ అనుభవింపదగు విషయములు లభించుచున్నదో మరల విజృంభించును. ఒకప్పుడు బాగుగ విజృంభణముగ నుండును.

కావున నిద్రాణములై యున్నదశలో అన్వేషణ సాగింపవలెను. రాజస, తామసములగు భావనములు ప్రకృతివశమున తగ్గియున్నపుడే అన్వేషణ సాగింపవలెనని దీనిచే సూచింపబడినది.

అట్టి దశలో కూడ, దానిని జయింపజాలిన శక్తిగలవానికి కూడ, మనసు భయమును కల్గించుచునే యుండును.

అందుచేతనే శత్రుకర్శనుడై వేయిమంది రావణులనైనను జయింపజాలిన హనుమ కూడ, రావణుని జూచి భయపడెను.

అన్వేషణలో బాహ్యసౌందర్యము, విషయభోగము ఎంత ఆకర్షించునో, దానికి తట్టుకొని ఆత్మాన్వేషణముననే సాగుట ఎంత కష్టమో ఇంద్రియార్థములు ఇంద్రియములను ఎంత బలాత్కరించుచుండునో ఇచట మనకు కన్పట్టును.

లోకోత్తరమగు సౌందర్యముగల భవనములు, శిల్పములు, స్త్రీలు, మధురములగు భక్ష్యములు, పానములు మున్నగు వెన్నియో హనుమ కిందు కన్పించుచుండును. వాని నన్నింటిని చూచుచు వాని వైపు మనసు పోకుండ సీతాన్వేషణముననే సాగుచుండెను. దీనిని మనకు తెలియచేయుటకు లంకాసౌందర్యమును ఇందెంతో అధికముగా వర్ణించెను.

అయోధ్యాపుర వర్ణనమునకును లంకాపుర వర్ణనమునకును భేదము కన్పట్టును.

అయోధ్యపుర వర్ణనమున --

పట్టణముయొక్క వర్ణనముకంటె ప్రజలయొక్క వర్ణన మధికముగా చన్పట్టును.

"నాకుండలీ నామకుటీ నాస్రగ్వీ నాల్పభోగవాన్" (బాల. 6-10)

అని వారి సంపదను;

"ననాస్తికః, నచానృతకథః నావిద్వాన్, నా బహుశ్రుతః"
(బాల. 6-14)

అని వారి గుణసంపదను వర్ణించును. కాని--

లంకాపుర వర్ణనమున-

భవన సౌందర్యమును, శిల్పసౌందర్యమును అధికముగా వర్ణించును.

ఇది బాహ్యాభ్యుదయము. దీనియందాసక్తి కల్గియుండుటయే ఆత్మబంధహేతువు.

ఈ బాహ్యాభ్యుదయమును చూచియు వశపడనివాడు, దీనివైపు దృష్టి మరలక ఆత్మయందే ఏకాగ్రమగు చిత్తముగలవాడు మాత్రమే ఆత్మ దర్శనము చేయుగలడు.

ఈ రహస్యమును హనుమ దన్వేషణమున మనకు సూచించెను.

అట్లు శయనించియున్న రావణుని హనుమ చూచెను.

బంగారు భుజకీర్తులను ధరించిన తన రెండు భుజములను రెండు ఇంద్రధ్వజములవలె పైకి చాచుకొని పరుండెను. ఆ బాహువులు- ఐరావతముయొక్క దంతములచే గాయపరపబడినవి, వజ్రముచే దెబ్బతినిన బలమైన మూపులుగలవి, విష్ణువుయొక్క చక్రముచే గాయపడినవి, సమమైన అంసములుగలవి, మంచిబలముగలవి, మంచిలక్షణములు గల గోళ్ళు-వేళ్ళు కలవి, పరిఘలను (గడియలు) పోలియున్నవి. గుండ్రనివి, ఏనుగుతొండములను బోలియున్నవి, ఐదుతలలు గల రెండు పాములవలె నున్నవి, చెవులపిల్లి రక్తమువలె ఎఱ్ఱనైన-చల్లనైన పరిమళముగల విలువగల చందనముచే అలంకరింపబడినవి, ఉత్తమలగు స్త్రీలచే మర్దింపబడినవి, యక్ష కిన్నర గంధర్వ దేవ దానవులను మొర పెట్టించినవి.

**తత్త్వదీపిక :-**

పాన్పుపై పైకి చేతులు చాచుకొని పరున్న ఆ రావణుని చూచి హనుమ

ఆ చేతులనే ఎంతయో వర్ణించును.

ఆ బాహువులు మందర పర్వత మధ్యమమున పగపట్టి పరున్న పాముల వలె నున్నవట.

సర్వకర్మలకు మూలము బాహువులు. కర్మలే మనను బంధించునవి. అట్లు బంధహేతువులగు ఆ రావణుని బాహువులను జూచి హనుమ ఆశ్చర్యముతో వానిని వర్ణించెను.

కామపూరితమైన మనసుయొక్క ప్రేరణచేచేసెడి కర్మలను బంధహేతువులుగా గుర్తింపవలెనని ఈ రావణుని బాహువులను మనకు చూపించెను.

ఆ బాహువులతో రెండు శిఖరములతో నుండిన మందరమువలె రావణుడు విరాజిల్లుచుండెను.

భుజించిన పదార్థములయొక్క వాసన, పానగంధము, ఆసవగంధము మున్నగు వాసనలతో నిండిన నిట్టూర్పు ఆతని ముఖము నుండి వెల్వడి ఆ భవనము నంతను నింపుచుండెను.

ముక్తామణి విచిత్రమగు కాంచన కిరీటము రావణుని తలనుండి కొద్దిగ ప్రక్కకు సడలియుండెను.

ముఖము కుండలములతో ప్రకాశించుచుండెను.

ఎఱ్ఱ చందనము అలుముకొనిపోయిన హారము పీనాయత విశాలమగు వక్షమున విరాజిల్లు చుండెను.

పాన్పుపై పరున్న ఆ రావణుడు మిణుగురులపోకవలె నుండెను. బుసకొట్టుచున్న పామువలె నుండెను. గంగానదియొక్క ఇసుక తిన్నెపై నిద్రించుచున్న ఏనుగవలె నుండెను.

ఆతడు పరుండిన పాన్పునకు నాలుగుప్రక్కల నాలుగు కాంచన దీపములు వెలుగుచుండెను. ఆ దీపములు, మెరుపులు మేఘమును వలె ఆతని సర్వావయములను ప్రకాశింపచేయుచుండెను.

తత్త్వదీపిక :-

నిద్రించుచున్న రావణుని వర్ణించినపుడు,

'భుజౌ' (సుంద. 10-15)

అని ద్వివచనముచే రెండు భుజములే ఉన్నట్లును,

'మకుటేన అపవృత్తేన' (సుంద. 10-25)

అని ఏకవచనముచే ఒకే శిరసున్నట్లును మనకు కన్పట్టును.

పదితలలు, ఇరువది చేతులుకలవాడు కదా, ఇచట ఇట్లేల వర్ణించెనని సందియము కల్గును.

కామరూపి గనుక యుద్ధములోను, వెలుపల తిరుగునపుడును పదితలలతో ఇరువది చేతులతో నుండి, ప్రియురాండ్రతో గలసి రమించి నిద్రించినపుడు ఒకతల, రెండుచేతులు గలవాడై యుండునని చెప్పవచ్చును.

కాని ఇందు వేరొకయర్థము కలదు.

రావణుడు మనస్సు.

పది ఇంద్రియములు పది ముఖములు.

నిద్రించునపుడు ఇంద్రియ వ్యాపారములు విరమించును, మనసు మాత్రమే పనిచేయుచుండును. అందుచే పదితలలు ఉండవు, ఇరువది చేతులును ఉండవు. మరల లేచినపుడు ఇంద్రియములు తమ తమ వ్యాపారముల నారంభించును, అందుచే పది తలలు లేచును. మనము పండుకొన్నపుడు కన్ను చూడదు, చెవి వినదు. కాని లేచుసరికి మాటలు విన్పడుచుండును. వాసనలు వచ్చుచుండును, అందుచే మరల ఇంద్రియములు లేచును.

ఉదయము లేవగనే సీతమ్మ దగ్గరకు వెళ్ళునపుడు రావణునకు మరల పది తలలు కన్పడును. ఒక్కొక్క ఇంద్రియమునకు ప్రవృత్తి-నివృత్తి అని రెండుచేతులు. అందుచే మొత్తమిరువది చేతులు.

ఇట్లు ఇంద్రియ వ్యాపారములు తగ్గినపుడు హనుమ అన్వేషణమును చేయుచున్నాడు.

రావణాసురుని పాదములవద్ద చంద్రముఖులు, చారుకుండల భూషితలు, వాడని మాల్యములు, చెదరని ఆభరణములు దాల్చిన వారు-నృత్త వాదిత్రకుశలలు అగు కొందరు స్త్రీలు కూర్చుండి యుండిరి.

రావణునితో రమించి బడలిక చెందిన స్త్రీలు అక్కడే పరుండి నిద్రించిరి.

ఒకతె వీణను కౌగిలించుకొని పరుండెను. ఒక పెద్దనదిలో పడవకు తామరతీగ చుట్టుకొనినట్లు ఆమె ఒప్పుచుండెను.

మరొకామె చిన్నపిల్లవానిని చంక పెట్టికొనినట్లు మడ్డుకమను వాద్యమును చంకపెట్టుకొని పరుండెను.

మరొకామె చాలకాలమునకు వచ్చిన ప్రియుని కౌగిలించుకొనినట్లు పటహమును కౌగిలించుకొని పరుండెను.

వేరొకతె వేణువు, మరొకతె విపంచిని, ఇంకొకతె మృదంగమును, మరొకామె పణవమును, మరొకామె డిండిమమును, మరొకామె ఆడంబరమను వాద్యమును పట్టుకొని నిద్రించుచుండిరి.

పద్మ పత్రాక్షి, పూర్ణచంద్రానన అగు వేరొకతె మదభ్రాంతయై వేరొక స్త్రీని కౌగిలించుకొని పరుండెను.

వీరందరు పరున్నచోట గాక, వేరుగా శయనముపై శయనించియున్న రూపసంపన్నయగు ఒక స్త్రీని హనుమ చూచెను. ముక్తా మణిమయము లగు ఆభరణములచే అలంకరింపబడిన ఆమె తన కాంతిచే భవనమునంతను ప్రకాశింపచేయుచుండెను. బంగారువలె పచ్చని రంగుగల అంతఃపుర స్త్రీలలో ప్రధానురాలగు సుందరాంగియగు ఆ మండోదరిని జూచి మహాబాహువగు మారుతాత్మజుడు సీతమ్మ యనుకొనెను.

తత్త్వదీపిక :-

రూపము, యౌవనము సీతమ్మవలెనే యుండెను. మండోదరి కూడ సీతమ్మవలె అందకత్తె. సీతమ్మవలె యౌవనవతి. హనుమ సీతమ్మ యనుకొనుటకు ఆ రూపము, యౌవనమే కారణములు. గుణములను బట్టి జూచినచో సీతమ్మకు ఈమె ఈడుకాదు. హనుమకు తాత్కాలికముగా అంత ఆలోచన తోచలేదు. సీతమ్మయే అనుకొనెను, మహానందము నందెను.

ఇప్పుడు హనుమ చేయుచేష్టలు ఇట్లు వర్ణింపబడెను.

"ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛం
ననన్ద చిక్రీడ జగౌ జగామ
స్తంభా నరోహత్ నిపపాత భూమౌ
విదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనామ్." (సుంద. 10-54)

"జబ్బలు చరచికొనెను, తొడలు చరచికొనెను. గిఱ్ఱునత్రిప్పి తోక తీసి ముద్దుపెట్టుకొనెను, సంతోషించెను, నృత్యమును చేసెను, పాటలు పాడెను, నడచెను, స్తంభము లెక్కెను, భూమిపైకి ఉరికెను, కోతుల సహజచాపల్యమును జూపుచు హనుమ విచిత్రములగు చేష్టలు చేసెను."

తత్త్వదీపిక :-

సీతయే అనుకొని హనుమ పొంగిపోయెను.

నిండుదనములేని పసివారికి ఏదైన హర్షకారణము కల్గినచో ఎగ్గెగిరిగంతులు వేయుదురో అట్లే హనుమ కూడ ఎగిరి గంతులు వేసెను. ఇది పూర్ణమైన స్థితి కాదని కపిచేష్టితమని చూపించుచు,

"నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనాం" (సుంద. 10-54)

కపి ప్రకృతిని హనుమ ప్రదర్శించె ననెను.

పిల్లల కేదైన ఉత్సాహము కల్గినచో గంతులు వేయుదురు. వారి ఆనందము క్రియల చేతనే ఎక్కువగా ఆవిష్కృతమగును.

ఆ విషయమును సూచించుట కిచ్చట కవి క్రియాపదములను బహుళముగా వాడెను.

ఇది నిజమైన సీతను చూచుట కాదని అతని చేష్టల చేతనే మనకు స్ఫురింపచేయుచు చివర కిది కపి ప్రకృతి యని పేర్కొనెను.

కేవలము శాస్త్రములలో చదివి, ఊహించి, --

(1) దర్శించినట్లు అనుభవించుట, (2) ప్రత్యక్షముగ దర్శించుట అను ఈ రెండింటిలో గల భేదమును మండోదరి దర్శనమున, సీతా దర్శనమున మనకు కాననగును.

బుద్ధిచే మాత్రమే ఎఱింగినవారు దానిని అనుభవించినట్లే ఉండును. కాని అది నిజమైన అనుభూతి కాదు. మండోదరి సీతకాదు, కాని సీతవలె నున్నది.

సీతవలె నున్న మండోదరిని జూచినపుడు గంతులు, పాటలు వచ్చెను. నిజముగా సీతను జూచినపుడు

'బాష్పపర్యాకులేక్షణః' (సుంద. 16-2)

కన్నీటితో నిండిన కన్నులుగలవాడై హనుమ విచారించుచు మాటాడక యుండిపోయెను.

తుమ్మెద పూవుచుట్టును తిరుగుచున్నంత సేపు ధ్వనిచేయును. పూవుపై వ్రాలి మకరందము నాస్వాదించునపుడు మౌనమే తప్ప ధ్వనిచేయదు.

అట్లే ఆత్మానుభవమును గాని, భగవదనుభవమునుగాని చేయువారు

కంఠము గద్గదమై, ఒడలు గగుర్పొడిచి, ఆనందాశ్రువులతో తన్మయత నందియుందురు గాని కేవలము బాహ్యమగు చేష్టలచే మాత్రమే ఆనందము నావిష్కరింపరు.

కావున ఇచటి దర్శనము సీతా దర్శనము కాదని స్పష్టము చేసెను.

**11** హనుమ ఆ బుద్ధిని వెండనే త్రోసిపుచ్చి స్వస్థచిత్తుడై,

"న రామేణ వియుక్తా సా స్వప్తు మర్హతి భామినీ
న భోక్తుం నాప్యలంకర్తుం న పాన ముపసేవితుం"
(సుంద. 11-2)

"నాన్యం వర ముపస్థాతుం సురాణా మపి చేశ్వరం
న హి రామసమః కశ్చి ద్విద్యతే త్రిదశే ష్వపి. (సుంద. 11-3)
అన్యేయ మితి నిశ్చిత్య పానభూమౌ చచార సః."
(సుంద. 11-4)

"రామునితో వియోగము నొందిన సీత నిద్రింపదు, భుజింపదు, అలం కరించుకొనదు, పానము సేవింపదు. ఇంద్రుడైనను సరే వేరొక పురుషుని సేవింపదు. రామునితో సమానుడు దేవతలలో కూడ లేడు. ఈమె ఎవరో వేరొకతెయై యుండును" అని పాన భూమియందు వెతకవలెనని ఏగెను.

అచట కొందఱు క్రీడించి బడలినవారు, కొందరు గానముచేసి అలసిన వారు, కొందఱు నృత్తముచే బడలిక నొందినవారై యుండిరి.

పానముచే మత్తెక్కి మద్దిళ్ళయందు, ఆసనములయందు, పాన్పుల యందు పరుండి నిద్రించుచుండిరి. భూషణభూషితలగు చాలమంది స్త్రీ లచ్చట నిద్రించుచుండిరి.

ఆ పానభూమి సర్వకామములతో నిండియుండెను.

ఆ పాన భూమియందు మృగముల, మహిషముల, వరాహముల మాంస ములు అచట నచట ఉంచబడెను. విశాలమగు వెండిపాత్రలలో సగముతినిన నెమళ్ళు, కోళ్ళు, వరాహములు, వార్ధ్రీణసములను పక్షులు మున్నగునవి ఉండెను. పెరుగు, సౌవర్చలమను లవణము నంజుకొనుటకు ఉంచబడెను. క్రకరములను పక్షులు, చకోరములు, మేకలు, మత్స్యవిశేషములు అచట పాత్ర లలోనుంచబడెను. లేహ్యములు (నాకదగినవి), పేయములు (త్రాగదగినవి),

వివిధములగు భోజ్యములు సిద్ధముగా నుంచబడెను. పులుపు, తీపి, ఉప్పు కల్గిన చిక్కని, పలుచని పదార్థములు ఆవాలు పోగుపు వేసినవి సిద్ధము చేయబడియుండెను.

(తీపి, పులుపు, ఉప్పు మొదలగు ఆరు రుచులు కలిగి పలుచగా నున్నచో రాగమందురు. చిక్కగా నున్నచో షాడబ అందురు.)

పానభాజనములందు వివిధములగు ఫలము లుంచబడెను.

అలంకారమునకు పుష్పము లుంచబడెను. శర్కరాసవము (బెల్లముతో వండిన మద్యము), మాధ్వీకాసవము (ఉప్పపూవుతో చేసిన మద్యము), పుష్పాసవము, ఫలాసవము మున్నగు వివిధములగు ఆసవములు, దివ్యమగు సుర (కల్లు), కృత్రిమముగ తయారుచేయబడిన సుర (కల్లు) అచ్చట ఉంచబడెను.

బంగారు, వెండి, స్ఫటికముతో సిద్ధమయిన మద్యపాత్రలు అచట కనిపించుచుండెను. కొన్ని సగము త్రాగి వదలినవి, కొన్ని పూర్తిగా త్రాగినవి, కొన్ని ఇంకను త్రాగబడనివి అగు మద్య పాత్రలు అచట కన్పడెను.

అనేక విధములగు భక్ష్యములు, పానములు, అన్నములు అచట కన్పట్టెను.

చక్కని పాన్పులపై కొందఱు స్త్రీలు పరుండియుండిరి. చల్లని చందనముయొక్క, మద్యములయొక్క, పుష్పమాలలయొక్క, అగరుధూపముయొక్క వాసనలతో నిండి మంచి పరిమళముగల గాలి ఆ పుష్పక మంతట వీచుచుండెను.

ఈ విధముగ రావణాంతఃపురము నంతను హనుమ చూచెను. కాని జానకి మాత్రము కన్పడలేదు.

ఆ స్త్రీలను చూచి ధర్మలోపము కల్గినదని శంకించి హనుమ ఇట్లు చింతించుచుండెను.

"అంతఃపురమున పరస్త్రీలు నిద్రించుచుండగా చూచుటచే నాకు ధర్మలోపము కల్గినది. పరస్త్రీలను చూడవలెనని నేను చూడలేదు. కాని పరస్త్రీలు నాచే చూడబడిరి. అవును చూచితిని. కాని, నా మనస్సున కేమియు వికారము కలుగలేదు.

"మనో హి హేతు స్సర్వేషా మింద్రియాణాం ప్రవర్తనే
శుభాశుభా స్వవస్థాసు తచ్చ మే సువ్యవస్థితం" (సుంద. 11-41)

మనస్సే కదా సర్వేంద్రియములను ప్రవర్తింపచేయుటలో కారణమైనది. మంచియైనను చెడ్డయైనను మనసు వలననే కల్గును. నా మనసు నిలుకడగా

మన్నది.

సీతను స్త్రీలలో వెదకవలెను గాని వేరొకచోట వెదకుట కుదరదుగదా! స్త్రీలు స్త్రీలలోనే ఉందురు. ఎవ రేజాతికి చెందినవారో వారిని ఆ జాతివారిలో వెతకవలెను. స్త్రీ తప్పిపోయినదని లేళ్ళలో వెతకముగదా!

అందుచే నేను పరిశుద్ధమగు మనసుతో వెతికితిని. ధర్మ లోపములేదు. రావణాంతఃపురము నంతను వెతకితిని. కాని జానకి కానరాలేదు.

దేవగంధర్వకన్యలు, నాగకన్యలు మున్నగువారెందఱనో చూచితిని. కాని జానకిని కాంచలేకపోతిని" అని సీతమ్మను చూడక బాధపడుచు ఆ పానభూమిని విడిచి మిగిలిన ప్రదేశములలో వెదకసాగెను.

తత్త్వదీపిక :-

ఇందు వికారమును కల్గించెడి స్త్రీలను జూచినను హనుమ యొక్క మనసులో వికారము లేకుండుట వర్ణింపబడినది. ఇట్టి స్థితి ఆత్మ దర్శనమునకు ముందు ఆవశ్యకము.

స్థిత ప్రజ్ఞావస్థలో విషయములను చూచుచున్నను విషయములు మనసున కల్గించెడి వికారములు కల్గింపకుండుట ఉత్తమస్థితి.

స్త్రీలను చూచినపుడుగాని, పానభక్ష్యాదులను చూచినపుడు గాని అవి భోగములు, భోజ్యములు అనెడి బుద్ధి హనుమకు కలుగలేదు.

సీతయే ఆతని మనస్సులో మెదలుచున్నది. ఆమెనే ధ్యానించుచు సర్వత్ర ఆమెనే అన్వేషించుచు ఆమె కంటె ఇతరములగు వస్తువులను చూచినను వాని వలన కలుగవలసిన వికారముల నుండి ఇంద్రియములను మనసును వశపరచుకొని, విషయములనుండి ఇంద్రియములను మరలించుకొని అన్వేషించుచున్నదశ ఇందు కాననగును.

**12** మారుతి మరల అన్వేషణమున కుపక్రమించి లతాగృహములను, చిత్రగృహములను, నిశాగృహములను అన్వేషించెను. కాని సీతమ్మ మాత్రము కానరాలేదు.

అపుడు హనుమ రఘునందనుని ప్రియమగు సీతమ్మను జూడక బాధపడుచు ఇట్లెన్నోవిధముల ఊహించుకొనుచుండెను.

"ఇంత వెతకినను సీతమ్మ నాకు కన్పడలేదు. నిశ్చయముగ సీతమ్మ చనిపోయియుండును.

తన శీలమును కాపాడుకొనుచు సన్మార్గమును కట్టుబడి పట్టుదలతో నిలచిన జానకిని దుష్టకర్ముడగు ఈ రాక్షసుడు చంపియుండును.

విరూపములగు అవయవములుగల వికృతవేషములుగల కాంతిహీనలగు ఈ రాక్షసస్త్రీలను జూచి జనకాత్మజ చనిపోయియుండును. నేను ఇంత కాలము గడిపి, శత్రుసేనలపై పరాక్రమమును చూపక, సీతమ్మను చూడక మరల సుగ్రీవుని వద్దకు వెళ్ళుట సాధ్యపడదు. సుగ్రీవుడు తీక్ష్ణముగ దండించు స్వభావము కలవాడు.

అంతఃపుర మంతయు వెతికితిని. అంతఃపురస్త్రీల నందఱను జూచితిని. పతివ్రతయగు సీత మాత్రము కన్పడలేదు.

నా శ్రమ అంతయు వ్యర్థమాయెను.

నేను సీతమ్మను చూడకుండ వెనుక కేగిన మా వానరులందరు నన్ను చేరి నీ వచటికేగి ఏమి చేసితివి? చెప్పు మనిన నేనేమి చెప్పెదను?

కాలము మీరి పోవుటచే వారు ప్రాయోపవేశము చేయుదురు. వృద్ధుడగు జాంబవంతుడు ఏమనునో?" అని దిగులునొందెను.

మరల ధైర్యము తెచ్చుకొని--

**"అనిర్వేద శ్శ్రియో మూలం అనిర్వేదః పరం సుఖం**
**అనిర్వేదో హి సతతం సర్వార్థేషు ప్రవర్తకః**
**కరోతి సఫలం జన్తోః కర్మ య త్తత్కరోతి సః**
**తస్మా దనిర్వేదకృతం యత్నం చేష్టేహ ముత్తమమ్."**

(సుంద. 12-10, 11)

"దిగులు పడకుండ ఉత్సాహము కల్గియుండుట ఐశ్వర్యమునకు మూలము. ఉత్సాహమే ఉత్తమమగు సుఖము. ఉత్సాహమే సర్వార్థములయందు మానవుని ప్రవర్తింపచేయును. మనము చేయు ఏపని నైనను ఉత్సాహమే ఫలవంతముగా చేయును అందుచే ఉత్సాహముతో మరల ప్రయత్నించెదను" అని అనుకొనెను.

**తత్త్వదీపిక :-**

లౌకికమగు కార్యములలో కృషి ఒకసారి భంగపడినను మరల ఉత్సాహముతో ఎట్లు యత్నము చేయుచుండవలెనో అట్లే ఆత్మాన్వేషణమున కూడ ప్రయత్నమును మానక ఉత్సాహముతో ముందునకు సాగుచుండవలెను- అని లౌకిక, ఆధ్యాత్మిక సాధారణముగ అనిర్వేదము = ఉత్సాహము ఆవశ్యకమని భావించి మరల హనుమ అన్వేషణకు ఉపక్రమించెను.

హనుమ మరల పానశాలలను, పుష్పగృహములను, చిత్రశాలలను, క్రీడా గృహములను, ఇంటి పెరటితోటలను. అవాంతరవీథులను, భూమీగృహములను, చతుష్పథమండపములను, ఊరికి దూరముగా స్వైరవిహారమునకై నిర్మింపబడిన గృహములను ఈవిధముగ అన్ని గృహములను వెదకెను.

రావణాంతఃపురములో నాలుగంగుళముల మేరయైనను వెతకకుండ వదలలేదు.

వివిధాకారములు గల విరూపములు వికృతలునగు రాక్షసస్త్రీలు కన్పడుచుండిరే గాని సీత కానరాలేదు.

రూపములో సాటిలేని శ్రేష్ఠలగు విద్యాధర స్త్రీలను హనుమ చూడగల్గెనే కాని రాఘవనందినిని చూడలేక పోయెను.

పూర్ణచంద్రముఖులగు నాగకన్యలు కంటబడిరేకాని సుమధ్యయగు సీత కన్పించలేదు.

రాక్షసేంద్రుడగు రావణునిచే బలాత్కరించికొని రాబడిన నాగకన్యలు కన్పడిరే కాని హనుమకు జానకి కన్పడలేదు.

ఈవిధముగ హనుమ ఎందఱనో స్త్రీలను చూచియు సీత కానరాలేదని మరల దుఃఖితుడయ్యెను. వానరుల యొక్క ప్రయత్నము, తాను సముద్రమును దాటుట వ్యర్థమాయెనని తలంచి శోకము నొందెను.

**13** విమానము నుండి దిగి మారుతాత్మజుడగు హనుమ మనసులో ఈ క్రిందివిధముగా చింతించుచుండెను.

"రామునికి ప్రియ మాచరింపవలెనని లంకనంతను గాలించితిని. కాని సర్వాంగశోభన యగు వైదేహిని చూడలేకపోతిని."

నీటిపడియలు, తటాకములు, సరసులు, నదులు, దుర్గములు, పర్వతములు, సమస్తము వెతికితిని. కాని జానకి కానరాలేదు.

సీత రావణభవనమున నున్నదని గృధ్రరాజగు సంపాతి చెప్పెను. కాని ఆమె ఎచ్చటను కానవచ్చుటలేదు.

(1) సీత; (2) వైదేహి, (3) మైథిలి అగు జనకాత్మజ దుష్టవర్తనుడగు రావణుని వినశయై చేరునా? చేరదు."

తత్త్వదీపిక :-

(1) సీత - అయోనిజ, (2) వైదేహి - విదేహదేశములో జన్మించినది, (3) మైథిలి - ఆచార ప్రధానమగు జనక వంశమునకు చెందినది, జనకునిచే పెంచబడినది. అట్టి సీత రావణుని ఎంతమాత్రముచేరదు.

రామబాణములకు భయపడి సీత నెత్తుకొని తొందర తొందరగా ఆకాశమునకు వచ్చుచున్న రావణాసురుని నుండి మధ్యలో పడియుండునా? అట్లు రావణుడు పడనీయడు.

రావణుడెత్తుకొని వచ్చుచుండగా సిద్ధులు సంచరించెడి అంతరిక్షమార్గమున వచ్చుచు అడుగున సముద్రమునుజూచి ఆమె హృదయమాగిపోయి యుండునా? వీరపత్ని అంత భీరు వగునా? కాదు.

రావణుడు భుజములతో నొక్కిపట్టి, తొడలతో వేగముగ ఎగిరి వచ్చుచుండగా ఆ విశాలాక్షి యగు సీత తనంత తావే ప్రాణములను వీడియుండునా? అట్లయి యుండదు.

సముద్రముపై అంతకంతకు పై భాగమున ఏగుచున్న రావణుని చేతులవిండి విడిపించుకొనుటకు ఇటునటు గింజుకొనుచు సముద్రములో పడియుండునా? రావణుడు పడనీయడు.

క్షుద్రుడగు రావణుడు తన శీలమును కాపాడుకొనుచున్న ఈమె పట్టుదల నోర్వలేక తనవారెవ్వరు లేరని భక్షించి యుండునా? తా నత్యంతము ప్రేమించిన యామెను తానై చంపలేదు.

అసితేక్షణ యగు సీత ఈ రాక్షసరాజు భార్యలచే భక్షింపబడి యుండు నేమో? రావణుడంతగా ప్రేమించిన యామెను అతని భార్యలు మాత్రము చంపగలరా? చంపరు.

పరిపూర్ణ చంద్రతుల్యమై తామరరేకులు బోలిన కన్నులు గల రాముని ముఖమును ధ్యానించుచు సీత ప్రాణములను వదలి యుండునా? 'హా రామ! హా లక్ష్మణ! హా అయోధ్యా!' అని మైథిలి పెక్కు విధముల విలపించి ప్రాణములను వదలి యుండును. అట్లు సీత చనిపోదు.

ఆమెకు శ్రీరామునియందు నిరతిశయమైన ప్రేమగలదు. ఆ ప్రేమచే తానెన్ని కష్టములు పడియైనను రామునికొఱకు ఆమె జీవించి యుండును.

రావణుడు తన భవనముననే గోరువంకను పంజరములో బంధించినట్లు ఎచటనో బంధించి యుండును. అచట సీత విలపించుచుండును.

జనకుని కూతురు, నాగటిచాలు నుండి బయల్వెడలిన అయోనిజ రామ పత్ని అగు సీత రావణునికి వశమగుట ఏమి? ఈమె ఎచటనో భూగృహాదులలో దాచబడి యుండవచ్చును. సముద్రములో పడుట మున్నగువాని వలన ప్రాణములను వీడియైన ఉండవచ్చును. లేదా రామ విరహదుఃఖము నోర్వలేనిదై స్వయముగ చనిపోయి యుండవచ్చును.

కాని భార్య అనిన ఎంతో ప్రేమగల రామున కీవార్త నివేదించుట ఎట్లు? నివేదించుటయు దోషమే, నివేదించకపోవుటయు దోషమే. నివేదించితివా చని పోవును. నివేదించకపోదునా వంచించినట్లగును. విషమముగ నున్నది. ఈ పరిస్థితిలో ఏమి చేయవలెనో తోచుటలేదు.

సీతమ్మను చూడకుండ నేను వెనుకకు తిరిగి కిష్కింధ కేగినచో ఏమిలా భము? నేనీ నూఱు యోజనముల సముద్రమును దాటుట వ్యర్థము: లంకలో ప్రవేశించుట వ్యర్థము. రాక్షసులను చూచుట వ్యర్థము.

సుగ్రీవుడు, వానరులు, ఆ రామలక్ష్మణులు కిష్కింధకు చేరిన నన్ను జూచి ఏమందురు?

అచటి కేగి రాముని చూచి "సీతమ్మను చూడలేదు" అని నేను చెప్పి నచో రాముడు ప్రాణములను వీడును. సీతమ్మ విషయమున చెవికి పరుషమైన, భయంకరమైన, క్రూరమైన, అపహ్యమైన దుర్వాక్యమును నేను పలుకగనే ఆ రాముడు విని మరి ఉండడు (బ్రతకడు).

రామునియందు అధికమగు అనురాగముగల లక్ష్మణుడు రాము డాప దను పొందినాడని చూడగనే తానును మరణించును.

సోదరులిద్దరు మరణించిరని విని భరతుడు కూడ మరణించును.

మరణించిన భరతుని చూచి శత్రుఘ్నుడు తనువును వీడును.

కుమారులు మరణించినారని తెలియగనే కౌసల్య, కైకేయి, సుమిత్ర కూడ మరణింతురు; సందేహములేదు.

కృతజ్ఞుడు, సత్యసంధుడు అగు సుగ్రీవుడు అట్టి అవస్థను పొందిన రాముని జూచి ప్రాణములను వీడును. తరువాత రుమ, తార, అంగదుడు చనిపోవుదురు.

తమ ప్రభువు చనిపోయినాడని తెలిసి ఇంతకాల మాతనిచే ఎంతో లాలనతో, గౌరవముతో పెంచబడిన వానరులందరు ప్రాణములను వీడుదురు. వానరులందరు భార్యలతో, బిడ్డలతో, మంత్రులతో పర్వత శిఖరములనుండి పడి విషమును త్రాగి, ఆయుధములతో నరుకుకొని, అగ్నిలో ప్రవేశించి, ఉప వాసముండి ఏదో ఒక విధముగ ప్రాణములను వీడెదరు.

ఇట్లు నేను వెళ్ళినచో ఇక్ష్వాకుకులము, వానరకులము కూడ నశించును. అంతటా ఏడుపులే నిండును.

అందుచే నే నిచట నుండి కిష్కింధానగరికి వెళ్ళను. సీతమ్మ లేకుండ సుగ్రీవుని ముఖము నేను చూడలేను.

నే నిచటనే యున్నచో ధర్మాత్ములగు ఆ రామలక్ష్మణులు ఆశచే బ్రతి కియుందురు. వానరులుకూడ బ్రతికియుందురు.

నే నిచటనే చేతిలో పడినది తినుచు, నోటిలో పడినది తినుచు చెట్ల మొదళ్ళనే కూర్చుండుచు, వానప్రస్థుడనై యుండెదను. లేదా సాగర ప్రాంత మున చితి నేర్పరచుకొని అగ్నిని ప్రజ్వలింపచేసి అందు ప్రవేశించెదను. లేదా ప్రాయోపవేశము చేసి, కాకులు, క్రూర మృగములు ఈ శరీరమును తినునట్లు వదలివైచెదను. లేదా నీటిలో ప్రవేశించి ప్రాణములను వదలుదును. మహర్షులు కూడ అట్లు ప్రాణము వదలుదురని వింటిని గాన అది దోషము కాదు.

ఈ రాత్రి మంగళకరముగ ప్రారంభమైనది. చంద్రోదయముచే రమ్యమై ఒప్పినది. హనుమ లంకలో ప్రవేశించిన రాత్రి యని, లోకములో ప్రసిద్ధి నొందదగిన ఈ రాత్రి-సీతను చూడకపోవుటచే వ్యర్థమై గడచుచున్నది.

ఏ చెట్టు మొదటనో కూర్చుండి తాపసుడనై యుండెదను. అంతియేగాని సీతను చూడకుండ వెనుకకు వెళ్ళను.

సీతను జూడకుండ నేను వెనుక కేగినచో దక్షిణ దిక్కున వెదుకుటకు బయలుదేరిన వానరులు అంగదుడు కూడ బ్రతికి యుండరు.

"వినాశే బహవో దోషాః జీవన్ భద్రాణి పశ్యతి"

(సుంద. 13-47)

"చనిపోవుటచే ఎన్నో దోషములు సంభవించును. బ్రతికియుండిన సుఖముల గాంచవచ్చును. అందువలన ప్రాణములను ధరించియుందును."

అని ఈ విధముగ అనేక విధములగు ఊహలను చేసుకొనుచు హనుమ శోకాక్రాంతుడై యుండెను.

"మహాబలుడు దశాననుడు నగు రావణుని చంపెదను. సీత నపహరించిన దానికి ప్రతీకారము చేసినట్లగును.

లేదా, ఈ రావణుని పైపైకి ఎత్తికొనిపోయి సముద్రమును దాటి పశుపతికి పశువును వలె రామునికి చేర్చెదను."

ఇట్లు బహువిధములుగ చింతించి ధ్యానశోకములచే నిండిన మనసుకలవాడై మరల ఆలోచించుచుండెను.

"రామపత్ని యగు సీతను చూచువరకు ఈలంకాపురిని మరల మరల వెదకెదను.

సంపాతి వాక్యమును విని, రాముని తీసుకొని వచ్చితినా రాముడు తన భార్య కన్పడక పోగనే సర్వవానరులను దహించును.

ఇచ్చటనే నియతాహారుడైన ఇంద్రియనియమముతో ఉండెదను. నేను తిరిగి వెళ్ళిన నావలన నర వానరులందరు నశింతురు."

ఇట్లు చింతించుచుండగా అశోకవనము కన్పడినది.

అదిగో! వృక్షములతో అశోకవనము కన్పట్టుచున్నది. ఈ వనమును నేను వెతకలేదు. దీనియందు వెతకెదను.

వస్తువులను, రుద్రులను, ఆదిత్యులను అశ్విని దేవతలను మరుత్తులను నమస్కరించి ఇందు అన్వేషింప పోయెదను" అని ఒక క్షణకాలము మనసులో బాగుగా ఆలోచించుకొని మహాతేజశ్శాలియగు మారుతాత్మజుడు లేచి సిద్ధపడెను.

"నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యై చ తస్యై జనకాత్మజాయై
నమోఽస్తు చంద్రార్క మరుద్గణేభ్యః" (సుంద. 13-59)

హనుమ అశోకవనము నన్వేషించుటకు సిద్ధపడి లేచి పైవిధముగ ప్రార్థించెను. "లక్ష్మణునితో కూడియున్న రామచంద్రునకు నమస్కారము. దేవియగు ఆ జనకాత్మజకు నమస్కారము. రుద్ర, ఇంద్ర, యమ, వాయుదేవతలకు నమస్కారము. చంద్ర, సూర్య, మరుద్గణములకు నమస్కారము." ఇట్లు దేవతలందరకు నమస్కరించి, సుగ్రీవునకు నమస్కరించి, అన్నివైపుల చూచి అశోకవనమును గూర్చి బయలుదేరెను.

తత్త్వదీపిక :-

ఈ ప్రార్థనాశ్లోకము నిత్యము చదువుకొనదగినది. రామాయణ పారాయణమున దీనిని ప్రార్థనగా ఉపయోగింతురు.

వెనుక మహేంద్ర పర్వతమునుండి బయల్దేరినపుడు హనుమ నమస్కారముచేసి బయల్దేరెను. అప్పుడు సూర్యునకు, ఇంద్రునకు, బ్రహ్మకు, వాయువునకు నమస్కరించెను.

కాని ఇపుడు రామునకు, లక్ష్మణునకు, సీతకు ముందు నమస్కరించి తరువాత ఇతర దేవతలకు కూడ నమస్కరించెను.

భగవదనుగ్రహము, భగవద్భక్తుల అనుగ్రహము, దేవియనుగ్రహము కల్గినవాడు గాని ఆత్మదర్శనము, తద్ద్వారా భగవద్దర్శనము లభింపవు.

ఇతర దేవతలను నమస్కరించుట, వారి యనుగ్రహమును పొందుట అంతఃకరణ శుద్ధికి ఆవశ్యకము. కాని ఆత్మస్వరూపావలోకనము చేయవలెననిన భగవదనుగ్రహమే ఆవశ్యకము.

భగవానుని నమస్కరించునపుడు భగవద్భక్తుల ద్వారా దేవి ద్వారానే ఆశ్రయింపవలెను- అను నియమమును ఇందు హనుమ పాటించెను.

వెనుక నమస్కారము చేసినపుడు 'నమ' శ్శబ్దమును వాచ్యముగా ప్రయోగింలేదు. ఈ శ్లోకములో మూడుసార్లు 'నమ' శ్శబ్దమును ప్రయోగించెను.

'సీత' సాక్షాత్తు 'లక్ష్మి స్వరూప'. ఆమె ఎన్నడును స్వామిని వీడియుండునది కాదు. జీవస్వరూపమును శిక్షించుటకై ఆమె ఇందు బంధనమున నున్నట్లు జీవభావమును నటించుచుండెను. అట్టి యామెను తాను వెతకుట

ఏమి? "ఇది కేవలం లోకవిడంబన" మని హనుమ ఎఱింగెను. వెంటనే తాన న్వేషించువాడు కాడని హనుమ గుర్తించెను. గుర్తించి తానన్వేషించుచున్నా నన్న స్వాతంత్ర్య భావన విడిచి పారతంత్ర్యమును ఇందు ప్రకటించెను.

'నమః - మః = నాది, న = కాదు'

ఈ అన్వేషించుటలో 'నేను కర్తను కాను, నేను వారి పని ముట్టును' అని భావన మనోవాక్కాయములచే ప్రదర్శించి భగవంతుని శరణాగతి చేసెను. అపుడు గాని సీతమ్మ దర్శనము ఒసంగలేదు.

సీతమ్మ కూడ సాక్షాత్తు 'లక్ష్మీస్వరూపిణి' గనుక ఆమె యనుగ్రహ మున్ననే ఆమె దర్శన మిచ్చునని హనుమ గుర్తించి "నమోఽస్తు దేవ్యై జనకాత్మజాయై" అని నమస్కరించెను.

'దేవీ' అను పదమునకు క్రీడించునది, ప్రకాశించునది -- అని యర్థము. ఇది యంతయు ఆమె క్రీడ; కన్పడక పోవుటయు కన్పడుటయు గూడ ఆమె క్రీడయే!

అంతేగాక ఆమె ప్రకాశ స్వరూపిణి. ప్రకాశము ఇతరమైన వానిని ప్రకాశింపచేయును. తానును ప్రకాశించును. అందుచే ఆమెను అన్వేషింపనక్క రలేదు. ఆమెయే తనంత తాను కన్పట్టును. అందుకే ఆమెను 'జనకాత్మజ' అనెను. జనకుని కూతురని యర్థము కాదు. "జనకునకు తనను కన్పింపచేసి నది" అని యర్థము.

"అమ్మా! ఆనాడు జనకుడు నిన్ను పొందవలెనని యజ్ఞ క్షేత్రమును దున్నలేదు. తాను తనంత యజ్ఞక్షేత్రమును దున్నుచుండగ నీ వనుగ్రహించి ఆతనికి కన్పడితివి. అట్లే నీ వనుగ్రహించి నాకు కన్పడవలెనేగాని నేను నిన్ను వెతుకుటయా?" అను భావము స్ఫురించునట్లు పై వాక్యము పల్కెను.

ఇట్లు ప్రార్థించి "ఇచ్చట తోట కాపలాదారులుండి వృక్షములను కాపా డుచుందురు. కావున రాముని కార్యము సఫలమగుటకును, రావణునకు కన్పడకుండుటకును, నా శరీరమును సంక్షేపించుకొందు" నని శరీరమును చిన్నదిగ చేసెను.

**తత్త్వదీపిక :-**

ఇప్పుడు దేవతలందరు తనకు సిద్ధిని ఒసంగెదరని ఆయా దేవతలను కీర్తించుచున్నాడు.

"సిద్ధిం మే సంవిధాస్యంతి దేవా స్సర్షిగణాస్త్విహ
బ్రహ్మా స్వయంభూ ర్భగవాన్ దేవాశ్చైవ దిశంతు మే
సిద్ధి మగ్ని శ్చ వాయు శ్చ పురుహూత శ్చ వజ్రభృత్
వరుణః పాశహస్త శ్చ సోమాదిత్యౌ తథైవ చ
అశ్వినౌ చ మహాత్మానౌ మరుత శ్శర్వ ఏవ చ
సిద్ధిం సర్వాణి భూతాని భూతానాం చైవ యః ప్రభుః
దాస్యంతి మమ యే చాన్యే హ్యదృష్టాః పథి గోచరాః."
(సుంద. 13-65, 66, 67)

"సర్వదేవతలు, ఋషులు నాకు సిద్ధి నొసంగుదురు గాక! బ్రహ్మ, అగ్ని, వాయువు, ఇంద్రుడు, వరుణుడు, చంద్ర సూర్యులు, అశ్వినీ దేవతలు, మరుత్తు, శివుడు, సర్వభూతములు, సర్వభూతాధిపతి యగు విష్ణువు నాకు సిద్ధి నొసంగుదురు గాక!" అని సిద్ధిని ఒసంగునట్లు సర్వదేవతా సమూహమును ప్రార్థించెను.

"ఉన్నతమగు నాసిక, పాండురములగు దంతములు, పవిత్రమగు మంద హాసము, తామరరేకులను బోలిన నేత్రములు కలిగి మొటిమలు లేక సుందరమై ప్రసన్న చంద్రతుల్యమై యుండు ఆ సీతమ్మ ముఖమును ఎన్నడు చూచెదనో?

క్షుద్రుడు, పాపాత్ముడు, క్రూరకర్ముడు, అతి భయంకరుడు అగు రావణునిచే బలాత్కరింపబడిన దుర్బల, దీన అగు ఆ సీత ఎపుడు నా కంటపడునో?" అని ఆమెనో ధ్యానించుచు అశోకవనముమ ప్రవేశించుటకు ఉద్యుక్తుడాయెను.

**14** రావణ భవన ప్రాకారమునుండి హనుమ అశోకవనములోనికి దూకెను. ఆ రోజులు వసంతమాస ప్రారంభదివసములు. చెట్లన్నియు పూచి యున్నవి. సాలములు, అశోకములు, చంపకములు, చూతములు మున్నగు వృక్షము లన్నియు పూచి యున్నవి.

లాగి వదలిన బాణమువలె ఆ వృక్షవాటికలో హనుమ ప్రవేశించెను.

పక్షులు కూయుచుండెను. మృగసంఘము లంతట సంచరించుచుం డెను. నెమళ్ళు మదించి కేకలు వేయుచుండెను.

హనుమ రాజపుత్రి నన్వేషింప చెట్లపై భాగముల సాగుచుండగా సుఖ

ముగ నిద్రపోవుచున్న పక్షులు మేల్కాంచెను. చెట్లనుండి పుష్పములు రాలెను.

ఆ వృక్షసమూహములమధ్య పూలతో నిండిన హనుమ పుష్పమయమగు పర్వతమువలె కన్పట్టెను.

వేగముగా పోవుచున్న హనుమచే కదల్పబడిన చెట్లనుండి నేలపై రాలిన పూలతో భూమి అనెడి కాంత అలంకరింపబడినట్లుండెను.

హనుమ గెంతుటచే విరిగిపోయిన శిఖరములు, రాలిపోయిన ఆకులు, పూవులు, పండ్లు గల చెట్లు మ్రోడులై - జూదములో ఓడి వస్త్రములను ఆభరణములను గూడ పణముగా పెట్టి దిగంబరులై యున్న జూదగాండ్రవలె నుండెను.

పువ్వులు లేక పండ్లు లేక గాలికి కదులుచున్న ఆ వృక్షములు గల వనము-పురుషునిచే ఉపభుక్తయై అంగరాగము చెరిగిపోయి. కేశపాశము జల్లుకుపోయి, నఖదంతక్షతములతో బడలియున్న యువతివలె భాసించుచుండెను.

ఆ వనమునందు మణి భూములు గలవు. అచటి మణి సోపానములతో ఉత్తమ జలపూర్ణములైన వివిధాకారములు గల దిగుడు బావులుండెను. రెండు ఒడ్లను పొడవైన చెట్లు గల అమృతము వంటి జలములతో నిండిన నదులు పారుచుండెను.

పొడవైన శిఖరములతో మేఘమండలమును బోలిన ఒక పర్వతముండెను. ఆ పర్వతము శిలాగృహములతో, నానా వృక్షములతో నిండి యుండెను. ఆ పర్వతమునుండి ఒక నది క్రిందకు పారుచుండెను. అట్లు చర చర క్రిందకు పారుచున్న ఆ నది ప్రియుని ఒడినుండి దూకి పోవుచున్న ప్రియురాలివలె నుండెను. ఆ నదీ జలములలో చెట్లకొమ్మలు నదిని ముందుకు పొగకుండ అడ్డుపడి యుండెను. ప్రియమైన బంధువులచే మరల ప్రియుని వద్దకు వెళ్ళునట్లు మరలింపబడిన ప్రణయ కుపితమగు ప్రమదవలె ఆ నది కన్పట్టుచుండెను.

ఆ పర్వతమునకు సమీపముననే అనేక పక్షిసంఘములతో గూడిన తామర కొలనులు గలవు. చల్లని నీటితో నిండిన ఒక దిగుడు బావి కలదు. దానికి మణులతో మెట్లు కట్టబడి యుండెను. ముత్యములతో దానియందిసుక ఏర్పరుపబడినది. అందనేక ప్రాసాదములు గలవు.

పుష్పములతో, ఫలములతో నిండిన వృక్షములు, ఆ వృక్షముల క్రింద

గొడుగులు, ఆ గొడుగుల క్రింద అరుగులు నిర్మింపబడెను.

అచట అన్నియు బంగారు వేదికలే. దట్టముగా ఆకులతో అలముకొనిన బంగారు శింశుపావృక్షమును ఒకదానిని హనుమ చూచెను. దానివద్ద బంగారు వేదికలుండెను. ఆ బంగారు వృక్షముల కాంతిచే వీరుడగు ఆ హనుమ బంగారుకాంతి గలవాడై యుండెను.

పూలతో నిండియున్న, మనోహరమైన అంకురములు, పల్లవములు సమృద్ధిగా నిండియున్న, ఆకులతో గుబురుగా నున్న ఆ శింశుపా వృక్షమును హనుమ అధిరోహించెను.

"రామదర్శనమునందు ఆసక్తి కలిగియుండు వైదేహిని ఇటనుండి చూచెదను. ఈ అశోకవనము చంపకములతో, చందనములతో, వకుళములతో చాల రమ్యముగ నున్నది. రాముని దేవి తప్పక ఇచటకు రాగలదు. వనములో సంచరించు నేర్పుగల జానకి సుందరమైన ఈ వనభాగమునకు తప్పక రాగలదు. రామునిగూర్చి చింతించుచు కృశించినదై, రాముని గూర్చిన శోకముచే సంతప్తయగు జానకి ఈ ప్రదేశమునకు తప్పక రాగలదు. సంధ్యాసమయమున సూర్య నమస్కారము చేయు సంకల్పము గల జానకి పవిత్రములగు జలములు గల ఈ నదికి తప్పక సంధ్యాసమయమున వచ్చును. ఈ అశోకవనము రాముని భార్యయగు సీతమ్మకు తగియున్నది. సీతమ్మయే బ్రతికియున్నచో తప్పక ఈ నదివద్దకు వచ్చును."

అని భావించి మహాత్ముడగు హనుమ సీతమ్మకై ఎదురు చూచుచు, ఆమె ఎటునుండి వచ్చునా యని చూచుచు పూలతో, ఆకులతో గుబురుగా నున్న ఆ చెట్టుపై, పైకి కానరాకుండ కూర్చుండి అంతయు చూచుచుండెను.

**15** ఆ చెట్టుపై కూర్చుండి అశోకవన ప్రదేశమునంతను చూచుచుండెను.

సంతానక లతలు అల్లుకొనిన వృక్షములతో, దివ్యగంధరసములతో అంతయు శోభావంతమై యుండెను.

ఆ అశోక వనము నందన వనమువలె నుండెను.

హర్మ్యములు, ప్రాసాదములు అందు నిండియుండెను.

మృగములు, పక్షులు, కోకిలలు అంతట కలకలము చేయుచుండెను.

అన్ని ఋతువులలో పూచెడి పూవులు, పండ్లు అచ్చటి చెట్లయందు కాన

వచ్చుచుండెను. పూలతో నిండిన శోకనాశనములగు అశోకములు వందలకొలది ఆ అశోకవనమున నుండెను.

అది కుబేరుని చైత్రరథమువలె ప్రకాశించుచుండెను. వివిధములగు వాసనలను వెదజల్లుచు, మనోహర మగు రెండవ గంధమాదనపర్వతమా యన్నట్లు చైత్యప్రాసాద మొకటి దగ్గరగా కన్పట్టుచుండెను. ఆ ప్రాసాదమున వేయి స్తంభములు గలవు. ఆ ప్రాసాదము కైలాసమువలె నుండెను. దాని మెట్లు పగడములతో నిర్మింపబడినవి. అచటి వేదికలు బంగారుతో నిర్మింపబడినవి. ఉన్నతమై ఆకాశమును అంటుచున్నదా యన్నట్లున్న ఆ ప్రాసాదము, కాంతిచే ప్రకాశించుచు కనులను దోచుకొనుచున్నట్లుండెను.

హనుమ ఆ చెట్టుమీదనుండి చూచుచుండగా సీతమ్మ కాన్పించెను.

ఆమె మలినమైన వస్త్రమును దాల్చి యుండెను.

రాక్షసస్త్రీలు ఆమె చుట్టును ఆవరించియుండిరి.

ఉపవాసములచే కృశించి, దీనురాలై, మరల మరల నిట్టూర్పు వదలుచుండెను. చాలసేపు చూచినగాని గుర్తించుటకు వీలుగాని రూపముతో శుక్లపక్షాదియందు చంద్రరేఖవలె మనోహరమగు కాంతి కలదై యుండెను.

సహజమగు కాంతి కలిగియుండియు పైన మాలిన్య మావరించి యుండుటచే, పొగ ఆవరించియున్న అగ్నిజ్వాలవలె భాసించుచుండెను.

బాగుగా నలిగిన ఉత్తమమైన వస్త్రము నొకదానిని దాల్చి బురద యంటిన తామరపూవులు లేని తామర తీగవలె అలంకారరహితయై ఒప్పుచుండెను.

సిగ్గుతో దుఃఖముతో వాడిపోయి దీనురాలై కుజగ్రహముచే పీడింపబడిన రోహిణివలె నుండెను.

సీత కన్నీరు నిండిన ముఖము గలదై దీనురాలై ఆహారము లేక కృశించినదియై శోక ధ్యానపరయై నిత్యము దీనురాలై యుండెను.

ప్రియుని చూడక అప్రియమైన రాక్షసీగణమును చూచుచున్న సీత స్వగణము (తనవారు) చుట్టును లేనిదై, శ్వగణము (కుక్కల గుంపు) చే చుట్టుకొనబడిన ఆడులేడివలె నుండెను.

నల్లని త్రాచుపామును బోలిన జడ పిరుదులవరకు వ్రేలాడుచుండెను.

వర్షాకాలము వెళ్ళిన తరువాత నల్లని వనపంక్తితో కూడిన భూమివలె ఆమె జడతో గూడిన వీపు కన్పడుచుండెను. సుఖములనే అనుభవించుటకు

తగిన సీత- కష్టముల నెఱుగని జానకి, దుఃఖముతో తపించుచుండగా విశా లాక్షి యగు సీతను జూచి హనుమ ఆమె సీతయే అని తగిన కారణములచే నిర్ణయించు కొనుచుండెను.

తత్త్వదీపిక :-

ఇచట సీత మూడు రూపములతో కాననగును.

(1) ఆమె దేవదేవుని దివ్యమహిషియైన లక్ష్మి.

ఆమెయే సీతయై అవతరించెను. కావున దేవిగా హనుమచే ఆరాధింప బడును.

(2) ఆమె జగన్మాత. తల్లివలె సర్వేశ్వరునకు జీవులకు మధ్యవర్తినియై జీవుని సర్వేశ్వరునితో చేర్చునదై యుండును.

ఇట్లు ఘటకురాలై విభీషణునికి రామునితో కలయికకు పరోక్షముగా సాయపడును.

రావణుడు వినకపోయినను భగవానుడగు రామచంద్రునితో మైత్రి చేసి కొనుమని ఉపదేశించి రామునితో ఘటనచేయ యత్నించును.

(3) జీవునివలె నటించుచు పరమాత్మకు దూరమైన జీవుడు మరల పరమాత్మను చేరుటకు ఎట్లు ప్రవర్తింపవలెనో ఆంతరముగ ఉపదేశించును.

బాహ్యముగ పతివ్రతయగు స్త్రీ భర్తకు దూరముగ నున్నపుడు ఎట్లు ప్రవర్తించునో ఉపదేశించును.

ఇట్లు సీత ఇందు భిన్నరూపములుగ కన్పట్టును కావున ఆమెను అన్ని రూపములతో మనము దర్శించుచు ఆమె ఇచ్చెడి ఉపదేశములను గ్రహింపవ లెను.

హనుమ సీతను జూచి--

"ఆనాడు కామరూపి యగు రాక్షసుడు అపహరించి తెచ్చుచున్నపుడు ఏ రూపమును గాంచితినో ఆ రూపమే ఈమె యందు కానవచ్చుచున్నది.

పూర్ణచంద్రముఖి, శోభన మగు కనుబొమలుగలది, నీలకేశి, బింబోష్ఠి, అందమైన నడుము కలది, తామర రేకుల బోలిన కన్నులు గలది అగు సీతమ్మ తన కాంతులచే సర్వదిక్కులను ప్రకాశింప చేయుచున్నది.

సమస్త జగత్తునకు పూర్ణచంద్రప్రభవలె ఒప్పుచున్నది. అట్టి ఈమె నేలపై

కూర్చుండి, తాపసివలె నియమశీలయై, ఆదుఱ్ఱాచుపాముచవలె అధికముగ నిట్టూర్పులు వదలుచు దుఃఖముచే ప్రకాశరహితయై యున్నది.

శోకముతో నిండిన సీతమ్మ పొగ ఆవరించి బైటకు కానరాకుండ లోపలనే యున్న అగ్నిహోత్ర జ్వాలవలె నున్నది.

ఈమె సందిగ్ధమగు అర్థముగల (మన్వాది) స్మృతివలె నున్నది.

తరిగిపోయిన ఐశ్వర్యమువలె నున్నది.

అధికమగు అవిశ్వాసముచే చెడిన శ్రద్ధవలె నున్నది.

కార్యము ఫలింపని ఆశవలె నున్నది.

విఘ్నములతో అడ్డుపడిన సిద్ధివలె నున్నది.

కాలుష్యములతో నిండిన బుద్ధివలె నున్నది.

అసత్యమగు అపవాదముచే చెడిపోయిన కీర్తివలె నున్నది.

రాముని పొందకుండ రావణునిచే హరింపబడి కృశించినదై కన్నీటితో నిండిన అప్రసన్నమగు ముఖముతో మరల మరల నిట్టూర్పు వదలుచున్న ఈమె కాలమేఘములచే ఆవరింపబడిన చంద్రప్రభవలె ఉన్నది.

చాలకాలము క్రిందట నేర్చిన విద్య పురశ్చరణ-మరల చర్వణ లేకపోవుటచే శిథిలమైనచో ఎట్లు సందేహము కల్గునో అట్లు ఈమె సీతమ్మ ఔనా కాదా!" యని హనుమకు సందేహము కల్గెను.

విశాలాక్షి, రాజపుత్రి అగు ఆ సీతమ్మను జూచి అలంకార రహితయై యుండుటచే కొంతసేపు సందేహించినను వ్యుత్పత్తి లేనివాడు మాటాడిన మాటల కర్థము తెలిసికొనినట్లు కష్టముతో సీతమ్మను గుర్తించెను.

ఈ క్రింది కారణములచే ఆమె సీతమ్మయే యని హనుమ ఊహించెను.

సీతమ్మ అవయవములయందు ఏ ఆభరణము లుండునని రాముడు పేర్కొనెనో ఆ ఆభరణము లన్నియు ఈ కొమ్మలపై కన్పడుచున్నవి. ఆమె తన ఆభరణముల నీకొమ్మపై పెట్టియుండును.

కర్ణవేష్టములనెడి చెవిదుద్దులు, శ్వదంష్ట్రము లనెడి చెవిపూలు, మణులతో పగడములతో చిత్రములగు హస్తాభరణములు - అవియే!

ఈ ఆభరణములు చాలకాలము ఆమె ధరించుటచే నల్లబడియున్నవి. ఆ ఆభరణములు తీసిన ప్రదేశములు ఆ ఆభరణముల గుర్తులు కలిగియున్నవి.

అందుచే ఈ యాభరణములు ఆమెవే అయియుండునని అనుకొందును.

అచట ఋశ్యమూకమున ఏ ఆభరణముల నీమె పడవేసినదో అవి ఇచట లేవు.

ఇచట నున్న ఆభరణములు అచటలేవు. కావున ఈ యాభరణములు సీతమ్మవే! ఈమె దాల్చిన వస్త్రము ఆనాడు కొండమీద నగలు మూటకట్టి పడవేసిన వస్త్రమువలె పచ్చగ బంగారు రంగు కల్గియున్నది.

ఆనాడీమె నగలకు కట్టిపడవేసిన వస్త్రము ఈమె ధరించిన వస్త్రములో భాగమే!

చాలరోజులై కట్టుకొనుచుండుటవలన ఈ చీర బాగుగ నలగిపోయినది.

దీనిరంగు దానిరంగు సమానమే! ఈ బంగారుఛాయ గల వనిత మా రాముని పట్టపు రాణియే!

ఇంతకాలము కన్పడకున్నను ఆ రాముని మనసును వీడని సౌందర్యరాశి ఈమెయే!

రాముడీ మెకొఱకు నాలుగు కారణములచే బాధపడుచున్నాడు.

(1) స్త్రీ కన్పడకుండ పోయిననాడు ఆమెతో కలసియున్న మగవాడు ఆమెను రక్షించకుండ యూరకొనుట కారుణ్యము గల వానికి తగదు. అందుచే అయ్యో! ఆడుది తప్పిపోయినదే యని దయతో బాధపడుచున్నాడు.

(2) తామే రక్షకులని ఆశ్రయించియున్న ఆమెను ఎవరో అపహరించిన పుడు పురుషుడు వదిలి యూరకుండట క్రూరత్వము అని బాధపడుచున్నాడు.

(3) అగ్నిసాక్షికముగ వివాహమై ధర్మాచరణమునకు తనకు తోడుపడు సహధర్మచారిణియగు పత్ని కన్పడకుండ పోయినదని శోకముతో బాధపడుచు న్నాడు.

(4) ప్రియురాలు కన్పడకుండ పోయినదని కామముచే బాధపడుచు న్నాడు.

ఇట్లు సీత విషయమున రాముడు

(1) కారుణ్యము, (2) ఆనృశంస్యము, (3) శోకము, (4) కామము అను నాలుగుకారణములచే పరితపించుచున్నాడు.

"స్త్రీ ప్రణష్టేతి కారుణ్యాత్ ఆశ్రితే త్యానృశంస్యతః
పత్నీ నష్టేతి శోకేన ప్రియేతి మదనేన చ." (సుం.కా. 15.50)

స్త్రీయని కారుణ్యము, ఆశ్రితురాలని ఆనృశంస్యము, పత్నియని శోకము,

ప్రియురాలని కామము అను నీ నాలుగు రాముని బాధించుచున్నవి.

అంతేగాని కేవల కామపరవశుడై రాముడు బాధపడుటలేదు.

హనుమ సీతనుజూచి ఇంకను ఇట్లనుకొనుచుండెను.

"ఈమె రూపము, అంగప్రత్యంగముల సౌష్ఠవము రామునికి తగియున్నది. ఆ రాముని రూపము ఈ అసితేక్షణకు తగియున్నది. ఇంతటి సౌందర్యము, అనురాగము కల్గియున్న ఈ దంపతులు ఒకరి నొకరు విడిచి ఇంతకాలము ఎట్లు బ్రతికియున్నారో తెలిసినది.

"అస్యా దేవ్యా మనస్తస్మిన్ తస్య చాస్యాం ప్రతిష్ఠితం
తేనేఽయం స చ ధర్మాత్మా ముహూర్త మపిజీవతి."

(సుంద. 15.52)

ఈమె మనసు ఆ రామునియందే యున్నది. ఆ రాముని మనసు ఈమెయందే ఉన్నది. అందుచే వీరు ఒకరి మనసు వేరొకరియందుండుటచే జీవించియున్నారుగాని, ఎవరి మనసు వారిలోనే యున్నచో క్షణకాలము కూడ జీవింపరు.

హనుమ మాల్యవత్పర్వతమందు సీతావిరహముతో బాధపడుచున్న రాముని జూచి "ఏమి ఈ శ్రీరాముడు! ఆడుదానికై ఇంత విలపించుట ఏమి? వసిష్ఠుని శిష్యుడు ఒక స్త్రీకై ఇంత అగుచున్నాడేమి" యని మనసులో కొద్దిగ పరిహాసముగ భావించెను.

కాని ఈనాడు సీతమ్మయొక్క సౌందర్యాతిశయమును చూచి విశేషజ్ఞుడగు హనుమ--

"దుష్కరం కృతవాన్ రామః హీనో య దనయా ప్రభుః
ధారయ త్యాత్మనో దేహం న శోకే నావసీదతి."

(సుంద. 15.53)

"దుష్కరం కృతవాన్ రామః య ఇమాం మత్తకాశినీం
సీతాం వినా మహాబాహుః ముహూర్త మపిజీవతి."

(సుంద. 15.54)

"ఈమెకు దూరమై రాముడింతకాలము శరీరము నెట్లు నిలపెట్టుకొనగల్గినాడో! చాల దుష్కరమైన పనిని చేసినాడు; శోకముతో శరీరము క్రుంగియుండవలసి యుండెను. కాని కఠినుడు గనుక బ్రతికియున్నాడు" అనుకొనెను.

ఇట్లు హనుమ సీతను జూచి ఆమె రూప వైభవమునకు ఆశ్చర్యమును, ఆనందమును పొంది-

"ఇంతటి సౌందర్యవతిని, పతివ్రతాధర్మమున సాటిలేనిదానిని పొందిన రాముడెంత ధన్యుడో!"

అని ఒకసారి మనసులో రాముని తలంచుకొని ప్రశంసించెను.

**16** ప్రశంసింపదగిన శీలసౌందర్యములు గల సీతమ్మను, గుణాభిరాముడగు శ్రీరాముని తలంచుకొని హనుమ కన్నుల నీరు నిండినవాడై సీతమ్మను గూర్చి ఇట్లు విలపించెను.

వసిష్ఠాదులచే శిక్షితుడైన లక్ష్మణునిచే గౌరవింపబడునదియు, రామునికి ప్రీతిపాత్రురాలును అగు సీతమ్మకూడ దుఃఖముతో బాధపడుచున్న దనినచో-

"కాలో హి దురతిక్రమః" (సుంద. 16.3)

"ఎవ్వరికైనను కాలము మీరరానిది" అని తెలియుచున్నది.

తత్త్వదీపిక :-

తానే రక్షకుడని నమ్మి, తన్నాశ్రయించి యున్నవారిని రక్షించుటలో పట్టుదలగల రామునియొక్క పూనిక నెఱింగినది సీత.

రాముడు పొరపడినను తాను పొరపాటుపడని ధీమంతుడగు లక్ష్మణుని ధీవైభవము నెఱింగినది సీత.

"అందుచేతనే వర్షాకాలములో కూడ గంగ కలతచెందనట్లు కలత చెందకుండ నున్నది."

(తత్త్వదీపిక :-)

సంసారములో బంధింపబడి భగవత్ప్రాప్తికై ఆర్తిపడుచున్న జీవునకు శోకము కలుగకుండ ధైర్యము కలిగించునవి రెండు

(1) భగవంతునియొక్క వ్యవసాయము - పట్టుదల.

(2) ఆచార్యుని జ్ఞానవైభవము -

"నీ వాడను అనిన వానిని అభయమిచ్చి రక్షించుటనావ్రతము" అని భగవంతుడు పల్కెను.

"స కృ దేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే
అభయం సర్వభూతేభ్యో దదామ్యే తద్వ్రతం మమ."
(యుద్ధ. 18.33)

అను భగవద్వాక్యము మనకు శరణము.

దండకారణ్యమున ఋషులు శరణుపొందినపుడు సీతమ్మ వారింపప్రయత్నింపగా రాముడు-

"అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే సలక్ష్మణామ్
నతు ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః."

(అర. 10.19)

"ఆశ్రితులకు ఒనర్చిన ప్రతిజ్ఞను పాలించుటకు అవసరమైనచో జీవితమునైనను, సీతనైనను, లక్ష్మణునైనను విడువగల"నని పల్కిన పట్టుదలయే జీవులకు శరణము."

ధీమంతుడగు లక్ష్మణుని ధీశక్తిశరణము. మాయామృగము ననుసరించి రాముడు వెళ్ళబోవుచున్నపుడు ఆ మృగము - మృగముకాదు, మారీచుడని ఉపదేశించినవాడు, అన్వేషించినపుడు సాయపడి రక్షింప ప్రేరణ చేయువాడు ధీమంతుడగు లక్ష్మణుడు. అట్టి లక్ష్మణుని జ్ఞానము శరణము.

భగవంతుడు ఆశ్రితులను రక్షించు పట్టుదల గలవాడు. ఒకవేళ వారి కర్మము ననుసరించి భగవంతుడు ఉదాసీనుడై యున్నను ఆచార్యుడు రక్షింప చేయ యత్నించును.

ఇచట సీతమ్మ క్షోభ పొందకుండటకు కారణమును సూచించుచు జీవులు ఈ బంధములో నుండియు శోకింపకుండుటకు ఎట్లుండవలెనో ఉపదేశించుచున్నది.

"రామస్య వ్యవసాయజ్ఞా లక్ష్మణస్య చ ధీమతః
నాత్యర్థం క్షుభ్యతే దేవీ గంగేవ జలదాగమే." (సుంద. 16-4)

(1) రాముని శరణాగత రక్షణ వ్యవసాయము

(2) ఆచార్యుని ధీవైభవము

మనకు శరణములని నమ్మియుండిన కలత చెందరు.

హనుమ సీతమ్మను జూచి సీతారాములయొక్క అన్యోన్యాను రూప్యమును ఇట్లు భావించెను.

"తుల్యశీలవయోవృత్తాం తుల్యాభిజనలక్షణాం
రాఘవో ఽర్హతి వైదేహీం తం చేయ మసితేక్షణా."

(సుంద. 16-5)

వధూవరులకు-

(1) శీలము, (2) వయసు, (3) వృత్తము (4) అభిజనము, (5) లక్షణము

అనునవి తుల్యములై యుండవలెను.

(1) శీలము = అలవాటు - స్వభావము

సీతారాముల స్వభావము దీటుదీయనిది.

శ్రీరాముడు 'ఆశ్రితరక్షణశీలుడు.'

తన్నాశ్రయించిన కాకికి, గ్రద్దకు, పల్లెవానికి, బోయతకు, వానరునకు, రాక్షసునకుకూడ అభయ మొసంగి రక్షించినవాడు శ్రీరాముడు.

సీత నిరపేక్షముగ రక్షించు శీలము కలది.

రక్షింపదగినవారు తన్ను రక్షింపుమని ప్రార్థింపనక్కరలేకయే తనంత తాను రక్షించెడి స్వభావముగలది సీత. తనను హింసించుచున్న రాక్షసస్త్రీలను తానై రక్షించిన కరుణామయి.

అందుచే సీతారాముల శీలము సమానము.

(2) వయసు

సీతారాములకు సరిపడి యున్నది.

రామునికి ఇరువది నాలుగేండ్లు నిండినపుడు,

సీతకు పదునెనిమిదేండ్లు నిండియున్నట్లు

మనకు తెలియుచున్నది. అది వధూవరులకు తగిన వయస్సు.

(3) వృత్తము = నడువడి.

సీతారాముల నడువడి సమానముగా నుండును. ఒకరి నొకరు విడిచి యున్నపుడు ఒకరిపై యొకరు, ఒకరికంటె నొకరు ఎక్కువగా బాధపడిరి. ఇట్లు భర్తగా రాముడు, పత్నిగా సీత చక్కని నడువడిని ప్రదర్శించిరి.

(4) అభిజనము = వంశము

శ్రీరాముడు ఇక్ష్వాకువంశమునకు చెందినవాడు.

సీత విదేహ రాజవంశమునకు చెందినది.

(5) లక్షణము = రూపము

రూపము రామునకును సీతకును పరస్పరము సదృశము.

ఇట్లు "వారి దాంపత్యము అన్యోన్యము తగియుండెను." అని ప్రశంసించెను.

తత్త్వదీపిక :-

పై శ్లోకములో సీతారాము లన్యోన్యము తగినవారని హనుమ ప్రశంసించెను.

ఇందులో- (1) శీలము, (2) వయస్సు, (3) వృత్తము, (4) అభిజనము, (5) లక్షణము.

అనునవి ఇద్దరకు సమానములు.

అతడు రాఘవుడు, ఈమె వైదేహి.

రాఘవుడు = రఘువంశమున జన్మించినవాడు రాముడు.

విశ్వజిత్తును యాగమును చేసి బ్రాహ్మణులకు సర్వస్వము వర్షించి గురుదక్షిణ యాచింపవచ్చిన కౌత్సునికొఱకై మంత్రజపముచేసి కుబేరుని జయించుటకు పోవలెనని రఘువు సంకల్పించెను. అంత కుబేరుడే బంగారు నాణెములను వర్షించెను. వాటి నన్నింటిని కౌత్సునకే ఒసంగి తీసికొని పొమ్మని రఘువును, తాను కోరినదానికంటె అధికము వలదని కౌత్సుడును పట్టుపట్టిరి.

ఇట్లు తనయొద్ద లేకపోయినను కోరినవారి కోర్కెలకంటె అధికముగా ఒసంగెడి దాత రఘువు.

అట్టి ఉదారుడగు రఘువుయొక్క వంశమున జనించినవాడు రాముడు.

వైదేహి = దేహమును కూడ తనదిగా భావింపని మహాజ్ఞానులగు విదేహుల వంశమున జన్మించినది వైదేహి.

అని, ఇంతవరకు సీతారాముల సాదృశ్యమును చూపించెను.

'తం' అని రామునకు

'ఇయం' అని సీతకు.

సర్వనామములను ప్రయోగించెను.

రాముడు 'తత్' శబ్దముచే చెప్పబడువాడు. అనగా పరబ్రహ్మమని యర్థము.

'ఇయం' అనునది లక్ష్మీవాచకము. 'ఇ'కారము లక్ష్మీవాచకము.

ఇట్లన్నియు ఇద్దరకు సమానముగా చెప్పి చివర-

'అసితేక్షణా'

అను పదమును సీతకు అధికముగా వాడెను.

'నల్లని చూపులు' గలది సీత.

ఈ నేత్రసౌందర్యమే సీతకు అధికము. ఈ నేత్రసౌందర్యమును భావించియే ఆమె లేనిదే క్షణకాలము జీవింపలేనని రాముడు బాధపడెను.

ఈ సుందరకాండలో సీతమ్మ నేత్రసౌందర్యము, చిరునవ్వు యొక్క అందము సూచింపబడుచుండును.

"అసితేక్షణా, విశాలాక్షీ, శుచిస్మితా"

అను పదములు సీతకు అధికముగా వాడుచుండును.

ఇందామె నేత్రములకు గల నల్లదనము, వైశాల్యము, చిరునవ్వులో గల పవిత్రత కన్పట్టును.

ఆమె నేత్రములు బాహ్యముగ విశాలముగ నుండి నల్లదనము కలవి. అందుచే అందమైనవి.

ఆమె తనను హింసించు రాక్షసస్త్రీలపై కూడ కోపమును తెచ్చుకొనుట ఎరుగదు. కంటితుద ఎరుపెక్కుట లేదు. పరమ దయామయి. చల్లనితల్లి. తనకు ద్రోహమును చేసినవానిని గూడ పుత్రునిగా భావించెడి ఔదార్యము కలది. అందుచే సీతమ్మయొక్క కన్నులలో గల చల్లదనమే నల్లదనము. ఆ నల్లదనమే వాత్సల్యము. ఆ వాత్సల్యము గల చూపులే సీతమ్మకు రామునికంటె విశేషము.

అందుచే సుందరకాండలో తనను చుట్టుముట్టి హింసించుచున్న రాక్షసస్త్రీలపైగాని, తనను అపహరించి తెచ్చిన రావణునిపైగాని ఆమెకు కోపమువచ్చినట్లు కన్పట్టదు.

భగవానునికంటె లక్ష్మికి గల వాత్సల్యము ఈ విశేషమే!

సర్వేశ్వరుడు, జీవుడు చేసిన అపరాధములను క్షమింపడు. తదనుగుణముగా నిచ్చును. అతడు నిగ్రహమునకు - అనుగ్రహమునకు కూడ సమర్థుడు.

కాని, లక్ష్మి అనుగ్రహమునే తప్ప నిగ్రహము నెఱుగదు. ఆమె వాత్సల్యస్వభావ. అందుచే ఆమె నేత్రములు నల్లనివి, విశాలములు.

అట్టి లక్ష్మిస్వభావమే ఇచటి సీత స్వభావము.

ఇట్లు సీతమ్మను జూచి, రాముని మనసులో తలంచుకొని, ఇట్లనుకొనెను.

ఈ విశాలాక్షికొఱకే మహాబలుడగు వాలిని రాముడు చంపినాడు. రావణునితో తుల్యుడగు కబంధుని చంపినాడు. విరాధుని హతమార్చినాడు. జనస్థానమున అగ్నిశిఖోపములగు పదునాలుగు వేలమంది రాక్షసులను, ఖరదూషణత్రిశిరులను సంహరించినాడు.

అహో! ఈమెకొఱకే గదా! వాలి పాలించిన ఇతర వానర దుర్లభమగు ఐశ్వర్యమును మా సుగ్రీవుడు పొందినాడు.

ఈ విశాలాక్షి కొఱకే నేను సముద్రమును దాటి ఈ లంకాపురిని జూచితిని.

సముద్ర పరివేష్టితమగు భూమండలము నంతనే కాదు, జగత్తునంతను ఈమెకొఱకు తల్లక్రిందులు చేసినను తగుననియే నా కనిపించుచున్నది.

"రాజ్యం వా త్రిషు లోకేషు సీతా వా జనకాత్మజా
త్రైలోక్య రాజ్యం సకలం సీతాయా నాప్నుయాత్ కలామ్"

(సుంద. 16.14)

మూడు లోకముల సామ్రాజ్యము నొకవంక, జనకాత్మజయగు సీతమ్మ నొకవంక ఉంచినచో మూడులోకముల సామ్రాజ్యము సీతమ్మకు ఒక అంశమునకు కూడ సరిపడదు.

ఈమె మహాత్ముడు, ధర్మశీలుడు అగు మిథిలాధిపతి యగు జనకుని కుమార్తె యగు సీత. భర్తయందు దృఢమైన భక్తి కలది. ఆనాడు జనకుని యజ్ఞభూమిలోని రేణువులు పద్మ రేణువులవలె ఆమె కంటి యుండును.

పరాక్రమశాలి, సాధుస్వభావుడు అగు దశరథుని పెద్దకోడలీమెయే!

ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు అగు రాముని ప్రియురాలు. అట్టి యీమె రాక్షస స్త్రీల వశమున నున్నది. అహో! ఏమి యాశ్చర్యము!

సర్వభోగములను విడచి భర్తయందు ప్రేమచే కష్టమనియైన ఆలోచింపకుండ నిర్జనమగు వనమున ప్రవేశించినది ఈమెయేగదా!

భర్తృశుశ్రూషయందే ఆసక్తిగలదై ఫలమూలములను తిని యానందించుచు అడవిలోకూడ ఇంటిలోనున్నట్లే ప్రీతితో నుండినది.

ఈమె మాటాడునపుడు ఎన్నడును చిరునవ్వు తొలగుటలేదు. ఆపదలను పొందుటకు తగని యీమె ఇంత ఆపదను ఓర్చుకొనుచున్నది.

ఇట్టి శీలవతియగు ఈమెను రాముడు మరల పొంది రాజ్యము పోయిన రాజు రాజ్యమును పొంది ఎంత ఆనందించునో అంత ఆనందించును.

కామభోగములు లేవు, బంధువులులేరు. అయినను రామునియందు ప్రీతిచే రాముని పొందవలెనను కోరిక కల్గి తన శరీరమును నిల్పుకొనుచున్నది.

"నైషా పశ్యతి రాక్షస్యః నేమాన్ పుష్పఫలద్రుమాన్
ఏకస్థ హృదయా నూనం రామ మే వాను పశ్యతి."
(సుంద. 16.25)

ఈమె రాక్షస స్త్రీలను చూచుటలేదు. పుష్పవృక్షములను గాని, ఫల వృక్షములనుగాని కాంచుటలేదు. రామునియందే మనసు నిల్పి రామునే చూచుచున్నది.

తత్త్వదీపిక :-

ఇది ధ్యానదశ :-

సీతయున్న వనము అశోకవనము. ఇది శోకరహిత స్థితి.

బంధములో నుండి అశోకవనమున నున్నది. ఈ అశోకము సవికల్ప సమాధి.

ఒకే వస్తువును తలంచుచు, ఇతర వస్తువులు చూడక అన్నివేళల అంతట ఒకేవస్తువును గాంచుట ఈ దశయం దేర్పడును. విషయముల నుండి మనసు వెనుతిరిగి భగవంతునే సర్వత్ర జూచుచు ధ్యానించెడి ఈదశలో శోక ముండదు. బాహ్యముగ విడివడియున్నట్లున్నను అంతరముగ కలసియుండును. వాని బాహ్య సంశ్లేషము నపేక్షించును. ఇట్టి దశ పొందినవాడే భగవత్సం శ్లేషమునకు యోగ్యత కల్గినట్లు భావింపబడును.

స్త్రీకి నగలన్నిటికంటె నగయైనవాడు భర్త. అతడు లేక ఈమె ప్రకాశించుటలేదు.

ఈమె దగ్గరలేకపోయినను రాముడు బ్రతికియుండియేయున్నాడు. ఎంత దుష్కరము! తామరపూవులు పోలిన నేత్రములు కల్గిన ఈ సీత దుఃఖించు చుండగా జూచి నామనసు కూడ బాధపడుచున్నది.

అని హనుమ బాధపడెను.

తత్త్వదీపిక :-

హనుమ తన బాధను శబ్దములలో కూడ అవిష్కరింపచేయుటకు 'క్ష' కారము ఎక్కువసార్లు వచ్చునట్లు ఈక్రిందివిధముగా అనుచున్నాడు.

"క్షితిక్షమా పుష్కరసన్నిభాక్షీ
యా రక్షితా రాఘవలక్ష్మణాభ్యామ్

సా రాక్షసీభిః వికృతేక్షణాభిః

సంరక్ష్యతే సంప్రతి వృక్షమూలే." (సుంద. 16.29)

ఈ శ్లోకములో ప్రతిపదమున 'క్ష' కారము కలదు. ఈ ఉచ్చారణము యొక్క క్లేశము, హనుమయొక్క మనఃక్లేశమును సూచించును.

భూమిని పోలిన ఓరిమి గలది, తామరలను పోలిన కన్నులు గలది, రామ లక్ష్మణులచేత రక్షింపబడునది అగు సీత నేడీచెట్టు మొదట వికృతేక్షణలగు రాక్షస స్త్రీలచే రక్షింపబడుచున్నది.

మంచునకు రాలిపోయిన ఆకులు, పువ్వులు గల తామరతీగవలె శోభ లేనిదై వ్యసన పరంపరచే పీడింపబడుచున్నదై, మగచక్రవాకము తోడుగా లేని ఆడుచక్రవాకమువలె ఈ జనకరాజసుత దీనావస్థను పొందియున్నది.

పూలతో నిండిన ఈ అశోకవనములు ఈమెకు అధికముగ శోకమును కల్గించుచున్నవి. వసంతర్తువున చంద్రుడు కూడ చల్లని కిరణములు గలవాడై ఆకాశమున కన్పట్టుచున్నాడు.

ఈవిధముగ హనుమ, రాముని గూర్చి, సీతమ్మను గూర్చి పెక్కుభంగుల ఆలోచించి ఈమె సీతమ్మయే! యని మనస్సున నిశ్చయించుకొన్న వాడై ఆ వృక్షమునందు కూర్చుండియుండెను.

తత్త్వదీపిక :-

**17** ఈ రాత్రి లంకాపురి నన్వేషించుటకు బయల్దేరగనే చంద్రుడు సహాయముచేయుచు ఉదయించినట్లు సూచించెను.

తరువాత లంకాపురిని అన్వేషించునపుడు చంద్రుడు మధ్యంగతుడై యున్నట్లు వర్ణించెను.

ఇపుడు మరల హనుమ సీతను దర్శించునపుడు చంద్రుడు ఆకాశము యొక్క పరభాగమును చేరినట్లు సూచించెను.

"ప్రజగామ నభశ్చంద్రో హంసో నీల మివోదకమ్"

(సుంద. 17.1)

"హంస నల్లని ఉదకములో పోవుచున్నట్లు ఆకాశమున చంద్రుడు పోవుచుండెను" అని వర్ణించెను.

తత్త్వదీపిక :-

చీకటిలో వస్తువును దర్శింపచేయువాడు చంద్రుడు. అటే భగవంతుని

దర్శించుటకు మననము, ధ్యానము, దర్శనము అను మూడు దశ లుండును.

లంకలో సీత యున్నదని సంపాతివలన వినినాడు హనుమ. అది శ్రవణదశ. ఈ దశ కిష్కింధకాండలో చెప్పబడినది.

కేవలము సుందరకాండలో మనన, ధ్యాన, దర్శన దశలు చూపబడినవి.

(1) లంకలో ప్రవేశించి సీతమ్మను వెతకవలెనని నిశ్చయించుకొని హనుమ బయల్దేరెను. ఈ దశలో చంద్రుని వెన్నెలవంటి జ్ఞానము విశదముగా నుండును. ఇది మననదశ.

(2) తరువాత హనుమలంక నన్వేషించును. ఇతరమైన వానిని వేని నిచూడక సీతమ్మనే తలంచుచు అంతట తిరుగును. ఇపుడు చంద్రుడు మధ్యకు వచ్చి నిలచెను.

ఆచార్యు డొసంగిన ఆత్మ యాథాత్మ్యజ్ఞానముచే దానినే ధ్యానించుచు అన్వేషించెను. ఇది ధ్యానదశ.

(3) దీని తరువాత హనుమ అశోకవనమున ప్రవేశించి సీతమ్మను దర్శించును. ఇచ్చట మరల చంద్రుడాకాశమున సాగుచున్నట్లు వర్ణింపబడెను. ఇది దర్శనదశ.

ఈమూడుదశలలో మొదట జ్ఞానము విశదమైయుండును. తరువాత విశదతరమై యుండును. తరువాత విశదతమమై యుండును.

చంద్రుడు సాచివ్యము చేయుచుండ ఆచెట్టుమీదను కూర్చుండిన హనుమ సీతమ్మను చూచుచుండెను. ఆమె బరువుతో నిండిన పడవవలె శోకభారముచే దుఃఖమనెడి జలములో మునుగుచున్నట్లుండెను.

ఆమెకు దగ్గరగా భయంకరరూపలగు రాక్షసస్త్రీ లుండిరి.

ఏకాక్షి, ఏకకర్ణి, అకర్ణ, శంకుకర్ణ, అతికాయ, ధ్వస్తకేశి, అకేశి, కేశకంబళధారిణి, లంబకర్ణ, లంబోదర, లంబోష్ఠి, చుబుకోష్ఠి, లంబాస్య, లంబజానుక మున్నగు వికృతరూపలగు రాక్షసస్త్రీలను చూచెను.

తత్త్వదీపిక :-

ఆత్మను ఆవరించియుండు ఆసురచిత్తవృత్తులే ఈ రాక్షసస్త్రీలు ఇంద్రియ ప్రవృత్తులలో అభివ్యక్తమగు ఈ చిత్తవృత్తులను భిన్న భిన్న నామములతో ఇందు మనకు చూపిరి. ఆయా ఇంద్రియముల ప్రకోపమధికముగా నుండిన వారిని ఆయా ఇంద్రియముల నామములతో వ్యవహరింపవచ్చునేమొ! కంటిలో, చెవిలో, కడుపులో, ముఖములో వికృతములగు వ్యాపారములు గలవారు ఏకాక్షి

ఏకకర్ణ* మున్నగు నామధేయములతో వ్యవహరింపబడవచ్చును. ఆత్మ భగవదభి ముఖమై ప్రవర్తించునపుడు ప్రతిబంధకములై హింసించెడి చిత్తవృత్తులే రాక్షస స్త్రీలు.

ఆ స్త్రీలు సతతము క్రోధముగలవారలై, కలహప్రియులై, వికృతాననలై, మాంస మద్యప్రియులై ఉండిరి. వారు మాంసమును, రక్తమును ఒడలి నిండ పూసికొని యుండిరి. వారిని చూడగనే భయముకొల్పగా ఒడలు గగుర్పాటు చుచుండెను.

హనుమ కూర్చుండిన ఆ శింశుపావృక్షము లావైన మొదలు గలది. దానిచుట్టు రాక్షసస్త్రీలు కూర్చుండిరి.

ఆ చెట్టుక్రిందను కూర్చుండిన రాజపుత్రియగు సీతాదేవిని లక్ష్మీవంతు డగు హనుమ చూచుచుండెను. సీతాదేవిని స్పష్టముగా దర్శించిన హనుమ "లక్ష్మీవంతుడు."

సీత కాంతిహీనమై శోకసంతప్తయై, మాలిన్యముతో నిండిన, క్లేశములు కలదై, పుణ్యము క్షీణించుటచే భూమియందు పడిన తారకవలె నుండెను.

తత్త్వదీపిక :-

సీతమ్మకు ఇందు చూపిన ఉపమానములు చాల ప్రత్యేకమైనవి. స్త్రీకి అటువంటి ఉపమానములను ఏ కవియు ఏ కావ్యములోను ఉపయోగింపలేదు.

ఆమెను స్మృతి, సిద్ధి, ఆశ, బుద్ధి, కీర్తి, పూజ, విద్య, వాక్, అగ్నిశిఖ, తారక మున్నగువానితో పోల్చును.

ఇందు కొన్ని కాంతిమంతములై తాత్కాలికముగ మాలిన్య మావరించి నవి. కొన్ని రూపరహిత పదార్థములు. ఇందు కొన్ని లక్ష్మీ నామములు.

విద్య, వాక్, కీర్తి మున్నగునవి లక్ష్మీనామములలో నున్నవి. అట్టి సీతమ్మను హనుమ చూచుచు ఇట్లనుకొనుచుండెను.

"ఈమె దీనవదనయై యున్నను భర్త తేజస్సుచే అదీనయై ఒప్పుచున్నది.

ఈమె తనశీలముచేతనే రక్షింపబడుచున్నది.

ఈమె లేడిపిల్లవలె బెదరుచు ఇటునటు చూచుచున్నది.

శోకముతో నిండిన నిట్టూర్పులతో, చూచుచున్న వృక్షములను దహించు చున్నదా అనునట్లున్నది.

శోకములయొక్క సమూహము ముద్దకట్టి యున్నదా అనునట్లున్నది.

ఉవ్వెత్తుగ పైకి లేచిన దుఃఖపు కెరటమువలె నున్నది.

రూపు దాల్చిన ఓరిమివలె నున్నది.

అట్టి సీతను చూచితిని" అని హనుమ మనసులో సంతోషించెను. కన్ను లనుండి ఆనందబాష్పములను రాల్చెను. రామునకు నమస్కరించెను. సీతను చూడగల్గితినని పొంగిపోయెను. ఆ చెట్టు యొక్క ఆకుల గుబురులలో హనుమ దాగియుండెను.

**18** హనుమ అట్లు చెట్టుపై కూర్చుండి పూచిన పూలతో నిండిన వనము నంతను చూచుచుండెను. అప్పటికి రాత్రి కొంచెము మిగిలియుండెను.

తత్త్వదీపిక :-

ఈ రాత్రులే జన్మపరంపర.

రాత్రి = చీకటి యావరించి, ఉన్నవస్తువు ఉన్నట్లు కన్పడని సమయము.

అజ్ఞాన మావరించి సద్వస్తువగు ఆత్మ కన్పడకుండచేయు జన్మమే రాత్రి.

అట్టి జన్మలెన్నో గడచిన తరువాత భగవంతుని యందాభిముఖ్యము కల్గి, భగవంతుని విడిచి ఉండలేనని వేదన కల్గి, అతనిని పొందలేదే యను ఆర్తికల్గును.

అపుడు భగవదనుగ్రహముచే లభించిన జ్ఞానముగల ఆచార్యుడు మనకు లభించును. అపుడు సత్త్వగుణము వృద్ధిపొందియుండును. ఆ సత్త్వగుణమే వెన్నెల.

అపుడే సాధకుడు ఆత్మాన్వేషణము చేయును. ఆచార్యుడు శిష్యాన్వేషణము చేయును. ఇట్టి అన్వేషణమే హనుమ దన్వేషణము.

ఇది సాగిన రాత్రి ఒక జన్మము. సాయంకాల మన్వేషణ మారంభమైనది. కొద్దిపాటి రాత్రి మిగిలియుండగా ఉషఃకాలమున హనుమ సీతాదర్శనముచేసి మాటాడును.

ఇట్లు జీవితములో సాధనక్రమమును ఈ హనుమ దన్వేషణము సూచించును.

భగవంతునకు దూరమై పొందవలెనని కోరికకల్గి ఆర్తి కల్గియున్న జీవుడు ఎట్లుండవలెనో సీతమ్మ స్థితి సూచించును. అట్టి స్థితిలో ఆత్మ మనసుతో పడెడి ఘర్షణ సీతారావణ సంవాదములో మనకు కన్పట్టును. దీనికి తట్టుకొని ఎదిరించి నిలచినగాని గురువు అనుగ్రహము లభించి భగవత్ప్రాప్తి కలుగదు. సీతారావణ సంవాదమై రావణుని ధిక్కరించి సీత నిలబడిన తరువాత హనుమ సీతతో మాటాడును. ముముక్షువగు జీవునకు మనసుతో కలిగెడి సంఘర్షణ

మే ఇపుడు సీతారావణ సమావేశమున మనము చూచెదము.

తెల్లవారుజామైనది.

వేదవేదాంగముల నధ్యయనము చేయుచు యజ్ఞానుష్ఠానము చేయుచున్న బ్రహ్మరాక్షసులయొక్క వేదఘోషలు హనుమకు వినబడెను.

మనోహరములగు మంగళవాద్యధ్వనులతో మహాబాహువగు దశగ్రీవుడు మేల్కొనెను.

రాక్షసేంద్రుడు సగము జారిన మాల్యములతోను, వస్త్రములతోను మేల్కొనిన వెంటనే సీతమ్మను తలంచెను. ఆమెయందుగల తీవ్రమైన కామముచే ఆతడు దానిని లోపల అణచుకొని యుండలేక పోయెను. వెంటనే విచిత్ర పుష్పఫలవృక్షసంకులము, నానా మృగగణాకీర్ణము, విచిత్రము అగు ఆ అశోకవనమును ప్రవేశించెను.

ఆతనివెంట వందమంది దేవకాంతలు, గంధర్వకాంతలు అనుగమించి వచ్చిరి. కొంతమంది ఆతని కిరుపార్శ్వముల కాంచనదీపములను పట్టుకొనిరి. కొందఱు స్త్రీలు వాలవ్యజనములను, మరికొందరు తాళవృంతములను దాల్చిరి. బంగారు కలశములతో జలమును పట్టుకొని కొందరు వెనుక నడచుచుండిరి. మద్యముతో నిండిన రత్నమయ పాత్రను పట్టుకొని ప్రక్కను కొందఱు నడచుచుండిరి. రాజహంసవలె, పూర్ణచంద్రునివలె తెల్లనైన బంగారుదండము గల ఛత్రమును గ్రహించి వేరొకతె వెనుకను వచ్చుచుండెను. నిద్రమత్తుతో బరువైన కన్నులుగల రావణుని భార్యలు మెరుపులు మేఘమువెంట వచ్చినట్లు ఆతని ననుసరించి వచ్చిరి.

ఆ స్త్రీల హారకేయూరములు ఇటునటు చదరినవైయుండెను. ఒడలికి పూసికొనిన చందనాదులు చెరిగియుండెను. ముఖములు చెమర్చియుండెను. మద్యపుమత్తు, నిద్రమత్తు వదలక తిరుగుడుపడుచున్న కన్నులతో, చెదరిన పూవులతో, జల్లుకొనిన జుత్తులతో ఆ స్త్రీలందరు ఆతని ననుసరించి వచ్చుచుండిరి.

ఆ రావణుడు కామపరాధీనుడై సీతయందాసక్తమైన మనసు గలవాడై మదముతో మెల్లగా నడచి వచ్చుచుండెను.

చెట్టుపై కూర్చుండిన హనుమకు ఆ స్త్రీలయొక్క మొలనూళ్ల కాలి యందెల చప్పుళ్ళు వినిపించెను.

ముందు అనేకములైన దీపములు ప్రకాశించుచు వచ్చుచుండ వాని వెనుక వచ్చుచున్న అప్రమేయ బలపౌరుషములుగల రావణుడు హనుమకు

అమృతమును మథించగా వచ్చిన నురుగును బోలిన తెల్లని వస్త్రమును ఆరావణుడు ధరించియుండెను. పైనుండి జారిన ఉత్తరీయమును విలాసముగ తీసి భుజకీర్తిపై వేసికొనుచుండెను.

హనుమ చెట్టుపైనుండి ఆ రావణుని స్త్రీలను, రాక్షసాధిపుని జూచు చుండెను. "ఓహో! ఈతడా రావణాసురుడు!" అని మహా తేజశ్శాలియగు ఆ రావణుని తేజస్సుచే ఒక్కసారి త్రోయబడినట్లయి హనుమ పత్రముల గుబురులో దాగి కూర్చుండెను.

రావణుడు సీతను చూడగోరి ఆమె ఉన్న వృక్షమువద్దకు వచ్చెను.

**19** రూప యౌవన సంపన్నుడు, భూషణోత్తమ భూషితుడు అగు రాక్షసాధిపుని జూచి పెద్దగాలికి అరటిచెట్టు ఊగినట్లు సీత వణకిపోవుచుండెను.

తన తొడలతో కడుపును, బాహువులతో పయోధరములను కప్పికొని ఏడ్చుచు ఆమె కూర్చుండి యుండెను.

రాక్షసులచే రక్షింపబడుచున్న వైదేహిని దశగ్రీవుడు చూచెను.

ఆమె సముద్రములో మునిగిన పడవవలె దుఃఖములో మునిగియుండెను. ఆస్తరణము లేని నేలమీద నియమశీలయై కూర్చుండియుండెను. నరుకబడి నేలబడిన ఒక పెద్దచెట్టుకొమ్మవలె ఆమె యుండెను. ఒడలి బట్టిన మట్టిరేఖలే ఆమె అవయువములకు ఆభరణములవలె ఉండెను. ఆభరణములను దాల్చుటకు దగిన ఆమె, ఆభరణములు లేక యుండెను. బురదపట్టిన తామర తూడువలె ఆమె ప్రకాశింపకయే ప్రకాశించుచుండెను. సంకల్పములనెడి గుఱ్ఱములను పూన్చిన మనోరథములతో రాజసింహుడగు రామునియొద్దకు ఆమె వెడలిపోవుచున్నట్లుండెను. ఏడ్చుచు ధ్యానశోకములతో నిండినదై, ఒంటరిగా దుఃఖమునకంతమును కాననిదై, రామునే అనుసరించిన మనసుకలదై యుండెను. మణిమంత్రాదులచే కట్టుబడి గిలగిల కొట్టుకొనుచున్న త్రాచుపామువలె ఆమె యుండెను. వృత్తము, శీలము, వడువడి కల ధార్మికమగు వంశమున పుట్టి వివాహముచే దుష్టవంశమున పడిన కన్యవలె ఆమె కన్పట్టుచుండెను. నిజముగా లేని అపవాదముతో మాసినకీర్తివలె నుండెను. అవృత్తి లేకపోవుటచే శిథిలమైన విద్యవలె నుండెను.

సహజముగ పరిశుద్ధమై తాత్కాలికముగ రావణ భవన వాసముచే అపరిశుద్ధత నందిన సీతకు అట్టి దృష్టాంతములనే ఇచట వాల్మీకి ఉపయోగించెను. క్షీణించిన మహాకీర్తివలె, అవమానమునొంది తగ్గిపోయిన శ్రద్ధవలె, బాగుగా క్షీణించిపోయిన పూజవలె, తగ్గిపోయిన భవిష్యత్ ధనలాభమువలె, సాగని

ఆజ్ఞవలె, ఇతరులచే అపహరింపబడిన పూజవలె, మంచుచే పూర్తిగా పోయిన తామరవలె, శూరులందఱు చనిపోయిన సేనవలె, చీకటిచే మూసిన ప్రభవలె, నీరుతీసి ఒట్టిపోయిన నదివలె, అపవిత్రులగు వారిచే స్పృశింపబడిన యజ్ఞ వేదికవలె, తగ్గిపోయిన అగ్నిజ్వాలవలె, రాహువు పట్టిన చంద్రమండలముగల పూర్ణిమరాత్రివలె సీతమ్మ కన్పట్టుచుండెను.

ఏనుగు సరసులో దిగి ఆకులను పూవులను పెకలించి, పక్షులను బెద రించి తొండముతో కలక చెందించిననాడు కలగియున్న పద్మినివలె సీత ఒప్పుచుండెను.

అప్పుడే తీసిన తామరతూడు ఎండకు వాడినట్లు విరహముచే తపించు చున్న సీత ఒప్పుచుండెను. ఉపవాసముచే, శోకముచే, ధ్యానముచే, భయముచే బలము తగ్గి శరీరము కృశించి దీనురాలై, అల్పాహారయై, తపోధనయై సీత కన్పట్టుచుండెను.

రాముడు ఎన్నడైనను వచ్చి రావణుని పరాభవించునాయని ప్రార్థించు చున్నదా యన్నట్లుండెను.

ఇట్లు రామునికొఱకై ఎదురుచూచుచు, ఏడ్చుచు, రామునే మనసులో ప్రార్థించుచున్న ఆ మైథిలిని రావణుడు చంపుదునని భయపెట్టుచుండెను.

**20** ఇట్లు భర్తనే ధ్యానించుచు దీనురాలై, ఆనందవిరహితయై రామవిరహమును తపసుగా పాలించుచున్న సీతమ్మకు రావణుడు చేష్టలతో, మాటలతో తన అభిప్రాయము నిట్లు వ్యక్తపరచెను.

"ఓ సుందరాంగీ! నన్ను చూచి భయపడి నీ స్తనములను, ఉదరమును నాకు కన్పడకుండునట్లు మరుగుపరచదవేల? ఓ విశాలాక్షీ! నిన్ను నేను కామిం చుచున్నాను. నన్ను గౌరవింపుము. ఇచట మనుష్యులుగాని, కామరూపులగు రాక్షసులుగాని ఎవ్వరునులేరు. నావద్ద నీవు భయపడవలసిన అవసరములేదు."

తత్త్వదీపిక :-

"మనస్సు మనను వంచించి తనవశమున పెట్టుకొనుటకు ఎన్ని ప్రలోభ ములు కల్గించునో ఈ రావణుని ఉపన్యాసములో మనము చూడవలెను."

భగవంతునికంటె ఇతరములగు పదార్థములను కోరవలెనని యున్నను ఎవరైన మనవారు చూతురేమో యని జంకుచుందుము. ఎవ్వరును చూడని చోట తప్పుపనిచేయుటకు జంకుకలుగదు.

అందుచే సర్వత్ర భగవద్భావన లేనివారికి "ఇచట ఎవ్వరులేరు గదా!

చేసిన నేమి?" అనిపించును. దీనిని సూచించుచునే రావణుడు "ఇచట ఎవ్వరు లేరుగదా! భయమెందుకు?" అని ప్రశ్నించెను.

"పరస్త్రీలను హరించుట, వారితో రమించుట పాపమను కొందువేమో! అది మాకు తప్పుకాదు. అది మాకు స్వధర్మము" అని రావణుడు చెప్పెను.

"స్వధర్మో రక్షసాం భీరు సర్వథైవ న సంశయః
గమనం వా పరస్త్రీణాం హరణం సంప్రమథ్య వా."
(సుంద. 20.5)

"ఓ పిరికిదానా! రాక్షసులకు పరస్త్రీలను బలాత్కారముగా హరించుట, వారితో రమించుట అనునవి సర్వథా స్వధర్మములు; సంశయములేదు."

**తత్త్వదీపిక :-**

పరుడగు సర్వేశ్వరుని స్త్రీలగు ఆత్మలను, బలాత్కారముగా హరించుట, వానిని తనివిగా చేసికొని రమించుట, మనసుయొక్క ధర్మము. ఆత్మ సహజముగా శుద్ధస్వభావము కలదైనను కర్మవశమున ఏర్పడిన ప్రకృతి వికారమగు శరీరములోని మనస్సునకు వశమగును. జీవులందరు పరమాత్మచే భరింపబడి పరమాత్మకే సర్వవిధముల చెందెడి వారు కనుక పరస్త్రీలు. వారిని తనవశము చేసికొని వారితో కలిసి విహరించుట మనసునకు స్వధర్మమని రావణుడు చెప్పెను.

"ఓ మైథిలీ! బలాత్కరించి తెచ్చుట మాకు స్వధర్మమైనను నన్ను కోరనిదే నిన్ను నేను స్పృశింపను. కామము నా శరీరములో అధికముగ విజృంభింపనిమ్ము, ఎంత విజృంభించినను నిన్ను స్పృశింపను. నీవు భయపడకుము. నన్ను నమ్ముము. నిజముగ నాయందు ప్రీతికల్గి యుండుము. శోకపరాయణు రాలవు కాకుము" అని రావణుడు మరల చెప్పెను.

**తత్త్వదీపిక :-**

ఇచ్చట రావణుడు చెప్పిన వాక్యము పరిశీలింపదగినది.

"ఏవం చైత దకామాం తు న త్వాం స్ప్రక్ష్యామి మైథిలి"
(సుంద. 20.6)

"బలాత్కరించి హరించుట మాకు స్వధర్మమే అయినను అకామవగు నిన్ను నేను స్పృశించను" అని రావణుడు చెప్పెను. మనసు మనను బంధించుటలో గల రహస్యము ఇచ్చట తెలియచేయబడెను. మనసునకు బంధింపగల శక్తి యున్నను, బంధించుట దానిస్వభావమే అయినను కామము లేని జీవుని

అది బంధింపదు. కామమే బంధహేతువు. భగవంతునికంటె ఇతరము లగు పదార్థమును అనగా బంగారు లేడిని సీత కోరుటచేతనే రావణుడామెను బంధింపగల్గెను. ఇపుడు రాముని తప్ప ఇతరమైనదానిని కోరకుండుటచే రావణుడామెను స్పృశింపలేకున్నాడు.

'అకామ'యను పదమునకు రెండర్థములు. కోరిక లేనిది, విష్ణువునందే కోరిక గలది. "అ" కారమునకు విష్ణువని యర్థము.

విష్ణువునే కోరి విష్ణువుకంటె ఇతరములగు విషయములను కోరని వానిని మనసు బంధింపదు. రావణుడును అంతే! రావణునికి అది బ్రహ్మ శాపము.

రావణుడింకను సీతతో ఇట్లు చెప్పుచున్నాడు. "ఒంటిజడ దాల్చి నేలపై పరుండి, మలినమగు వస్త్రమును దాల్చి ధ్యానముతో ఉపవాసముతో నుండుట నీకు తగదు. విచిత్రములగు మాల్యములను, చందనములను, పరిమళ ద్రవ్యములను, వస్త్రములను, ఆభరణములను స్వీకరింపుము. నాతో కూడియుండి పానమును సేవించి యోగ్యములగు శయనాసనములను ఉపయోగించుకొనుచు, గీతనృత్తవాద్యములతో హాయిగా కాలము గడుపుము. స్త్రీరత్నమవు. నీవిట్లు ఆభరణములు లేకుండుట తగదు. నీ యౌవనము గడచిపోవుచున్నది. ప్రవహించి పోయిన నీరు మరల వెనుకకు రానట్లే గడచిపోయిన యౌవనము వెనుకకు రాదు. అది గడచిపోకముందే భోగముల ననుభవింపుము."

తత్త్వదీపిక :-

లోకములో మనకు గూడ మన మనస్సు ఇట్టి ఉపదేశములనే చేయుచుండును. భగవత్ప్రాప్తికై సాధనచేయునపుడు మనసు దానినుండి వెనుకకు లాగుటకు ఇట్లు బోధపరచును. "ఈ జడలెందుకు? ధ్యాన మెందుకు? ఈ కాషాయములు - మురికి బట్టలు ఏమి? ధ్యానము, ఉపవాసము ఏమి? అనుభవింపగల్గిన శక్తి యుండగా విషయముల ననుభవింపవలెను గాని మానుటయా? మానిన తరువాత ననుభవింపగలమా?" అని యౌవనము గడచిపోవుచున్నదని రావణుడు బాధపడును. రాముడును బాధపడును. రావణుడు విషయోపభోగముల ననుభవింపగల్గిన బాహ్యమైన శరీరసంబంధియగు యౌవనమును గూర్చి ప్రలపించును.

శరీరమే ఆత్మ అనుకొనువారు "జన్మనెత్తుట విషయములను అనుభవించుట కొఱకే" అని భావింతురు. అట్టివారికి విషయముల ననుభవింపగల వయస్సు గడచిపోవుచున్నదని రావణునివలె బెంగగానుండును. కాని ఆత్మ శరీరముకంటె వేరు; అది శరీరమును ప్రవేశించుట, భగవంతుని పొంది, భగవదనుభవము నొందుటకు ఆ అనుభవమునకు యోగ్యమైనది మానవజన్మ

మొక్కటియే!

మానవజన్మ యౌవనమువంటిది. అది గడచిపోక మునుపు భగవద నుభవము నందవలెను. లేకున్న పురుషుననుభవింపకుండ గడచిపోయిన స్త్రీ యౌవనమువలె మానవజన్మ వ్యర్థమగును.

"న చేదిహా వేదీ న్మహతీ వినష్టిః" అని ఉపనిషత్తు.

మానవజన్మనందియు భగవదనుభవమునకై యత్నింపక విషయానుభవ మునవే మునిగియుండువారికి గూర్చి భగవానుడు విచారించుచుండును. అది రాముని విచారము.

దేవతలు నిత్యము యౌవనము కలవారమటలోని రహస్యమిదియే! నిత్య భగవదనుభవశీలురగువారే దేవతలు. దానినే యౌవనముమందురు. ఇట్లు రావణుడు సీతమ్మను రామునియందు మనసు విడచి భోగములయందు ప్రవర్తించునట్లు ఉపదేశించుచుండును.

రావణుడింకను ఇట్లు చెప్పుచున్నాడు. "వైదేహీ! రూపయౌవనశాలివగు నిన్ను జూచి సాక్షాత్తు బ్రహ్మయైనను వదలి వెళ్లగలడా! నీశరీరములో ఏ అవయవమును జూచిన ఆ అవయవమునందే నాచూపు కట్టబడుచున్నది. ఈ నీ మోహమును విడిచిపెట్టుము. నాకు భార్యవుకమ్ము. నేను అన్నిదిక్కుల నుండి ఎందఱనో స్త్రీలను అపహరించి తెచ్చితిని. వారిలో నీవు పెద్దరాణివై యుండుము. లోకములను కొల్లగొట్టి నేను తెచ్చిన రత్నములు, రాజ్యము, నేనుకూడ నీవారమే! నీవు నన్ను ప్రేమించితివా ఈ భూమండలము నంతయు జయించి జనకున కొసగెదను. నా కెదురుగ నిలబడగల్గిన బలశాలి ఎవ్వ డులేడు, యుద్ధములలో దేవదానవుల నెందఱనో నేనోడించితిని. హాయిగా నీవు అలంకారములను స్వీకరింపుము. కాంతిమంతములగు భూషణములు నీ అంగముల నలంకరించుగాక! భోగములను అనుభవింపుము, పానమును సేవింపుము, రమింపుము. నా అనుగ్రహముచే రమించుచున్న నిన్నుజూచి నీ బంధువులందరు రమింతురుగాక! నా ఐశ్వర్యమును, శోభను చూడుము. అడవిలో నారబట్టలు దాల్చి, విజయవార్త నెఱుంగక, రాజ్యముపోయి సంచ రించుచున్న రామునితో నీకేమి పని? అడవిలో వ్రతములను పూని నేలపై పరుండెడి రాముడు బ్రతికియున్నాడో లేడో! ఒకవేళ ఉన్నను నా నుండి నిన్ను పొందలేడు.

"చారుస్మితే! చారుదంతి! చారునేత్రే! విలాసిని! మనోహరసి!"
(సుంద. 20.29)

సుందరమగు చిరునవ్వుకలదానా, సుందరమగు పలువరుస గలదానా, సుందరమగు నేత్రములు గలదానా, నా మనసును నీవు హరించుచున్నావు. నిన్ను చూచి నాభార్యలతో రమింప నాకు కోరిక కల్గుటలేదు. నా అంతఃపురములో నివసించెడి స్త్రీలెందరు గలరో అందరిమీద నీకు ప్రభుత్వము కల్గును. వారందరు నీకు అప్సరసలు లక్ష్మికివలె పరిచర్యలు చేయుదురు. రాముడు తపస్సులోగాని, బలములోగాని, పరాక్రమములోగాని, ధనములోగాని, తేజస్సులోగాని, యశస్సులోగాని నన్నుపోలనవాడుకాడు."

తత్త్వదీపిక :-

దేహాత్మాభిమానముచే అహంకరించిన మానవుడు భగవంతుని గూర్చి పల్కెడి పలుకు లిట్లే యుండును. ఇది యంతయు మనసుయొక్క ప్రభావము. భగవంతునికంటె "నేనే గొప్ప" అనిపించును. ఐశ్వర్యములను, భోగమును, భాగ్యములను జూపి భగవంతునకు దూరముచేయ యత్నించును. చివరకు రావణుడు చెప్పినమాటలు మనకు మనసు నిత్యము చేయునట్టి అసదుపదేశము చూడము.

"పిబ విహర రమస్వ భుంక్ష్వ భోగాన్
ధననిచయం ప్రదిశామి మేదినీం చ
మయి లల లలనే యథా సుఖం త్వం
త్వయి చ సమేత్య లలన్తు బాంధవాస్తే." (సుంద. 20-35)

తత్త్వదీపిక :-

ఈ శ్లోకరచనలు విచిత్రమైన ప్రక్రియలో సాగినది. త్రాగి భోగలాలసుడై హేలగా తిరిగెడి మానవుని నడకలోని ఊపు ఈ శ్లోకము నడకలో కన్పించును.

"త్రాగుము, తిరుగుము, రమించుము, అనుభవించుము భోగములను, ధనమును భూమిని నేనొసంగెదను. నాయందు నీవు హాయిగా రమించియుండుము. నిన్నుచేరి నీ బంధువులు హాయిగా రమింతురుగాక!"

తత్త్వదీపిక :-

ఇదియే మన మనసు నిత్యము చేసెడి అసదుపదేశము. "త్రాగు, తిరుగు, భోగములననుభవించు" ఇదియే జీవిత పరమార్థమని బోధించును. రావణుడును అదియే బోధించినాడు.

ఇందు "లల్"అను ధాతువును కవి ప్రయోగించినాడు. దీనికి తూగుట, ఊగుట, రమించుట అను భావములు కలవు.

త్రాగుటలో రమించుటలో గల సుఖముచే ఊగెడి ఊగు ఈ 'లల్'అను ధాతువుచే సూచించెను. ఇట్లు రావణుడు సీతతో తన అభిప్రాయమును నావిష్కరించెను.

**21** క్రూరరాక్షసుడగు రావణుని మాటలను విని ఆర్తురాలైన సీత దీనస్వరముతో, దీనముగా, మెల్లగా ఇట్లు బదులు పల్కెను.

దుఃఖముతో బాధపడుచు, ఏడ్చుచు, వణకిపోవుచు పతివ్రతయగు ఆ సీత భర్తనే ధ్యానించుచు ఇట్లు పలికెను.

గడ్డిపోచను మధ్యలోపెట్టి పవిత్రమైన మందహాసముకలదై మాటాడుటకు ఉపక్రమించెను.

తత్త్వదీపిక :-

పతివ్రత యగుటచే పరపురుషునకు ఎదురుగా తాను మధ్యలో వ్యవధానము లేకుండ నిలువరాదని గడ్డిపోచ నుంచుకొనెను.

పరపురుషునితో సాక్షాత్తుగ మాటాడరాదని మధ్యలో గడ్డిపోచను పెట్టెను.

గడ్డిపోచకైనను నాతో మాటాడుట కర్హతకలదు కాని నీకులేదని రావణునకు సూచించుటకు గడ్డిపోచ నుంచెను.

ఎండిన గడ్డిపోచవలె నీవు దహింపతగియున్నావని సూచించెను. రాముని కాగ్రహము కల్గినా వెనుక ఇట్టి గడ్డిపోచయే ఒకటి కాకిని మూడులోకములు త్రిప్పెను. "నీకును అదే గతి పట్టు" నని తృణమును మధ్యలో నిక్షేపించెను.

ఈవిధముగ అనేక విధములగు భావములు స్ఫురించునట్లు తృణమును మధ్యలో నిక్షేపించును.

సాక్షా జ్జగన్మాత ఎత

కుమారుడు అనరాని మాటలాడినను వాత్సల్యముచే తల్లికెట్లు కోపము రాదో అట్లే సీతమ్మకు కోపము రాలేదు.

పాపము తెలివితక్కువవాడు, కోరకూడనిదానిని కోరుచున్నాడని జాలితో మందహాసము చేసెను.

మోయలేని బరువును, తినలేని పదార్థమును పసివాడు కోరినపుడు తల్లి ఎట్లు చిన్ననవ్వు నవ్వునో అట్లామె నవ్వెను.

ఆ నవ్వులో పవిత్రతయే కాని కాలుష్యములేదు, క్రోధములేదు, ద్వేష

ములేదు. సీత ఇట్లు చెప్పుచుండెను.

"తృణ మంతరతః కృత్వా ప్రత్యువాచ శుచిస్మితా
నివర్తయ మనో మత్తః స్వజనే క్రియతాం మనః"

(సుంద. 21.2,3)

గడ్డిపోచను మధ్యనుంచి పవిత్రమగు చిరునవ్వుగలదై సీతమ్మ ఇట్లు పల్కెను.

"నా నుండి మనసును మరలింపుము. నీవారియందు మనసు నుంచు కొనుము. పాపము చేసినవాడు సిద్ధిని కాంక్షించుట ఎంత అయుక్తమో నీవు నన్ను కాంక్షించుట అంత అయుక్తము."

తత్త్వదీపిక :-

ఇచ్చట సీత చెప్పెడి సమాధానము ఉపదేశమువలె కన్పట్టును. పర స్త్రీలను కాంక్షించెడి పురుషుల కిది మహోపదేశము. పరమాత్మకే చెందిన ఆత్మను స్వతంత్రమని తనదిగా భావించెడి జీవులకు చేసెడి జ్ఞానోపదేశమిది.

రావణాసురుడు చేసిన పనినే మనమందరము చేయుచున్నాము.

ఈ జగత్తులో ఏ ఒక్కటియు పరమాత్మచే వ్యాపింపబడని పరమాత్మకే చెందనిదిలేదు. బాహ్యమైన ప్రకృతియు వానిదే! అంతరమగు జీవుడును వాడే! కాని అజ్ఞానముచే వానికి చెందిన పదార్థములను నావియని భావింతుము. వానికే చెందిన ఆత్మను "నేను" అని స్వతంత్రముగా భావింతుము.

భగవంతునికి చెందిన సీతమ్మయే ఆత్మ. దానిని తాను తనదిగా చేసి కొనవలెనని రావణుడు ప్రయత్నించుచున్నాడు.

దీనిని ఎటింగి సీత ఉపదేశించుచున్నది.

నాది అని బుద్ధిపుట్టుటకు కారణము మనస్సు. అది తాబేలువంటిది. దానిని తిరగవేసి పడవేసినచో ఒక్క దెబ్బతో చనిపోవును.

అట్లే 'మనః' అను శబ్దమును తిరగవేసిన 'నమః' అగును. దీనిని ఉచ్చరించుచు దీని యర్థమును మనసులో భావించినచో భగవంతునికి చెందిన దానిని తనదిగా చేసికొనుబుద్ధి నశించును.

నమః = మః నాది, న = కాదు, అని యర్థము.

ఇదే త్యాగము. దీనితో అనుభవించిననాడు మనసునకు బంధించు శక్తిపోవును.

ది భగవానునిది. అనుభవింపచేయువాడు ప్రీతినందువాడును భగవా

నుదే! అను భావనతో సాగిననాడు మనస్సు బంధకము కాదు.

అందుచే రావణునకు సీత "మనసును మరలింపుము"అని ఉపదేశించెను.

సీతమ్మనుండి మనసును మరలింపుము అని ఒక యర్థము.

'మనః' అను శబ్దమును తల్లక్రిందుచేసి పలికి దాని యర్థమును భావన చేయుము అని రెండవ యర్థము.

పాపము చేసినవాడు సిద్ధిని కోరుటకు అర్హుడుకాడు.

తత్త్వదీపిక :-

పాపమనగా భగవత్ ప్రాప్తికి ప్రతిబంధకము. అదియే 'నేను, నాది' అనుకొనుట.

భగవత్ ప్రాప్తియే సిద్ధి.

పై పాపముకలవానికి భగవత్ ప్రాప్తి అర్హతలేదని సీతమ్మచెప్పెను.

"రావణా! పతివ్రతనగు నేను ఉత్తమమగు వంశములో జన్మించితివి. ఉత్తమ వంశమునకు చెందిన నేను "అకార్యమును చేయరాదు" అని పలికి ఆ రావణునికి వెనుతిరిగి మరల ఇట్లు చెప్పనారంభించెను. "నేను నీకు పొందదగిన భార్యనుకాను. నేను పరభార్యను. పతివ్రతను. ధర్మము నాలోచింపుము. మంచిగా ప్రవర్తింపుము."

"యథా తవ తథా న్యేషాం దారా రక్ష్యా నిశాచర
ఆత్మాన ముపమాం కృత్వా స్వేషు దారేషు రమ్యతాం."
(సుంద. 21.7)

పరుని భార్యను అనుభవింపవలెనని కోరిక కల్గినపుడు ఒక్కసారి తన విషయమున గూడ "నాభార్యను వేరొకడు బలాత్కరించి చెరబట్టినచో ఎట్లుందును?" అని ఆలోచించుకొనవలెను.

తన భార్యను తాను ఇతరులకు వశముగాకుండ రక్షించుకొనవలెనని ఎట్లు ప్రయత్నించుచుండునో అట్లే ఇతరుల భార్యనుకూడ రక్షింపవలెనని తలంచి నీభార్యలతో నీవు రమించుము.

తన భార్యతో సంతుష్టిపడక ఇంద్రియచాపల్యముచే పరస్త్రీని కాంక్షించువాడు ఆ పరస్త్రీలచే తప్పక పరాభవము నొందును.

మాతృమూర్తివలె ఎంత ఉదారముగ ఉపదేశించుచున్నదో చూడుడు.

"ఇహ సంతో న వాసంతి సతో వా నానువర్తసే
తథాహి విపరీతా తే బుద్ధి రాచారవర్జితా." (సుంద. 29.9,10)

"మీ పట్టణమున మంచివారెవరును లేరా? ఉన్నను వారిని నీవు ఆశ్రయించి అడిగి వారు చెప్పిన మంచిని వినవా? నీవు పెద్దల నాశ్రయించి మంచిని గ్రహింపలేదని నీనడువడిలేని బుద్ధియే తెలుపుచున్నది. నడువడి లేని బుద్ధి రావణుని బుద్ధి. అది ప్రమాదకరము.

లేదా పెద్దలు చెప్పిన మంచిని ఈ రాక్షసుల వినాశనమునకై నీకు వినవలెనని బుద్ధిపుట్టలేదా? నిశ్చలమైన మనసులేని రాజు రాజ్యమును పాలించుచున్నచో సమృద్ధములైన రాష్ట్రములు, నగరములు కూడ నశించును. నీవొక్కడవు చేసిన తప్పువలన లంకయంతయు కొద్దికాలములోనే నశింపగలదు. రావణా! నీవు చేసిన పాపకర్మలచే నీవొకనాడు చనిపోయిననాడు సర్వభూతములు నీ మరణమును అభినందించును. క్రూరుడు అదృష్టవశమున చనిపోయినాడని అందరు సంతోషించెదరు.

"శక్యా లోభయితుం నాహం ఐశ్వర్యేణ ధనేన వా
అనన్యా రాఘవే ణాహం భాస్కరేణ ప్రభా యథా."
(సుంద. 21-15)

"ఓ రావణా! నీ అంతఃపుర స్త్రీలను, రాజ్యమును, నిన్ను నియమించు అధికారము లభించునని, ధనము నొసంగెదనని నన్ను లోభపెట్టితివి. కాని నేను వానిచే లోభపెట్టబడుదాననుకాను. రామునితో వేరుగా గాక సూర్యునితో కాంతివలె ఎల్లప్పుడు కలిసియుండుదానను నేను."

తత్త్వదీపిక :-

తాను లక్ష్మీదేవినని రావణునకు సీతమ్మ తెలియజేయుచున్నది. భగవంతునితో విడువక నిత్యము కలసి యుండెడిది లక్ష్మి.

సూర్యునితో కాంతివలె, పూవుతో వాసనవలె భగవానునితో విడువడి యుండనిది లక్ష్మి.

ఆ రాముడే పరమాత్మ. "నే నాతనితో వీడియుండని లక్ష్మిని"అని సూచించెను.

లక్ష్మీనారాయణులకు గల సంబంధమే సీతారాములకు గల సంబంధము.

"సూర్యునినుండి ప్రభను వేరుచేయుటకు ప్రయత్నించుట ఎంత అవివేకమో నన్ను రామునినుండి విడదీయ ప్రయత్నించుట అంత అవివేకము.

సర్వలోకములను నియమించువాడు రాముడు. అందుచే అతడు సర్వేశ్వరుడు. ఐశ్వర్యమాతనిది. నేను లక్ష్మిని. అందుచే ధనము నాది. ఆ రెండిటిచే నన్ను లోభపెట్టుట ఎట్లు సాధ్యపడును? అంతేకాదు.

"లోకులందఱచే యాచింపబడు లోకనాథునియొక్క భుజమును రక్షకముగా నమ్మి దానిపై తలమోపి పరుండిన నేను ఈనాడు వేరొకని భుజము ఎట్లు తలగడగా అంగీకరింపగలను? నే నారామునకే తగిన భార్యను. కావున రావణా! నన్ను రామునితో చేర్చుము."

తత్త్వదీపిక :-

భగవత్ ప్రాప్తిని కాంక్షించు జీవుడు విషయభోగము లెదురుగా వచ్చి లోభపెట్టుచున్నను వానికి వశపడక భావింపవలసిన భావనను సీత ఉపదేశించుచున్నది. పరమాత్మకే చెంది, పరమాత్మచేతనే రక్షింపబడి, పరమాత్మచేతనే అనుభవింపబడదగిన ఆత్మ, ఐశ్వర్యమునకు ధనమునకు వశపడి భగవానునికి దూరమై మనసునకు వశమగుటకంటె అవివేకములేదు.

వాడే రక్షకుడని, వాడే భర్తయని దృఢముగ నమ్మియుండవలెను. ప్రతి క్షణము మనను మనసు లోభపెట్టుచునే యుండును.

దానికి వశపడకుండ ఉండవలెను. సీతమ్మ రావణునికి ఎవ్వరును ఉపదేశించువారు లేరుగదాయని తానే ఉపదేశించుచున్నది.

"మిత్ర మౌపయికం కర్తుం రామ స్థానం పరీప్సతా
వధం చానిచ్ఛతా ఘోరం త్వయాఽసౌ పురుషర్షభః,
విదిత స్సహి ధర్మజ్ఞ శ్శరణాగతవత్సలః
తేన మైత్రీ భవతు తే యది జీవితు మిచ్ఛసి."
(సుంద. 21.19,20)

"రావణా! లోకములో నిలుకడ కావలెనని కోరినచో రామునితో మైత్రి చేసికొనుటయే నీకు తగును. రామునితో మైత్రి యొనరించుటకంటె చనిపోవుటయే మేలని నీవు భావించినను ఘోరమైన చావు చావకుండుటకైనను రామునితో మైత్రి చేసికొనుము."

తత్త్వదీపిక :-

రావణుడు దురభిమాని. అందుచే "రాముని శరణాగతిచేయు"మనిన అహంకరించి తిరస్కరించునేమో యని తల్లి పిల్లవానికి నచ్చురీతిని చెప్పినట్లు రామునితో మైత్రి చేసికొమ్మని చెప్పినది.

మైత్రి యనిన రావణుడంగీకరింపవచ్చును.

శరణాగతి యనిన రాముడు గొప్పవాడు, తాను తక్కువవాడను భావన వచ్చును.

మైత్రి యనిన ఇద్దరు సమానులే అను భావన వచ్చును గనుక రావణుడంగీకరింపవచ్చునని తల్లి తలంచెను.

"నీవుండవలెనని కోరిన, రామునితో మైత్రి చేసికొను"మనెను.

సర్వవస్తువులయొక్క ఉనికి వాని యధీనము. చెట్టుకొమ్మ నరికెడివాడు చెట్టుపై కూర్చుండియే కొమ్మను నరుకవలెను. అట్లే భగవానునకు ద్రోహము చేయదలంచి భగవంతుని వస్తువును అపహరింపదలచినవాడు కూడ వాని నాశ్రయించియే తన ఉనికిని నిలబెట్టుకొనవలెను.

కాని రావణుడు దురహంకారియై "ఉనికి లేకపోయిన లేక పోవుగాక, కాని రాముని ఆశ్రయింపను" అనునేమోయని "నాయనా! ఈ శరీరములో నున్నంతకాలము సుఖముగా నుండుటకు వాని యనుగ్రహ మెట్లు కావలెనో, ఈ శరీరమును వీడుటకు కూడ వాని అనుగ్రహము కావలెను. వాని అనుగ్రహము లేకున్నచో సుఖమైన మరణము రాదు."

అందుచేతనే రావణుడు సైన్యముపోయి, బంధువులు పోయి, మంత్రులుపోయి, సోదరులుపోయి, కుమారులు పోయి, చివరకు ఒక్కొక్క తల తెగి చిత్రవధ ననుభవించెను. అందుచే హాయిగా మరణించుటకు కూడ వాని అనుగ్రహము కావలెను.

ఇందులో--

"తేన మైత్రీ భవతు తే యది జీవితు మిచ్ఛసి"

(సుంద. 21,20)

జీవింపవలెనని కోరిక ఉన్నచో వానితో మైత్రిని కాంక్షింపుమనుటలో ఒక విశేషము కలదు.

మన మందరము శరీరముతో నుండి కదలుట మాత్రముచేతనే జీవించుచున్నామనుకొనుచున్నాము. కాదు ఇది జీవించుటకాదు.

శరీరమును ఆత్మ వీడకుండ ఉండుట జీవించుట. ఈ బాహ్య శరీరము ఆత్మను వీడకుండ నుండుట శరీరము జీవించుట. శరీరమున కాత్మ ఎట్లో ఆత్మకు పరమాత్మ అట్లే ఆత్మయై ఉండును. ఆ పరమాత్మతో దూరముగా కుండ ప్రేమతో కలసియుండుట యథార్థమైన జీవించుట. అట్టి జీవించుట కాంక్షించినచో పరమాత్మతో మైత్రి యుండవలెనని సీతమ్మ ఉపదేశించెను.

"రామునితో మైత్రిచేసికొను మంటివి గాని ఇంత ద్రోహముచేసిన నన్ను రాముడిపుడంగీకరించునా?" అని జంకకుము. రాముడు ధర్మజ్ఞుడని, శరణాగతవత్సలుడని లోకములో ప్రసిద్ధి నొందినవాడు. తన్నాశ్రయించినవారిని రక్షించుటయే తన ధర్మమని ఎఱింగినవాడు రాముడు. తానే రక్షకుడు అని నమ్మి వచ్చినవారి దోషములను కూడ ఆతడెంతో ఇంపుగా స్వీకరించును.

దోషములను భోగ్యముగా తీసుకొనుటయే వాత్సల్యము. కాస్తనలిగిన గడ్డిని కూడ వాసన చూచి విడిచిపెట్టెడి ఆవు తానీనిన దూడ ఒడలియందలి మాలిన్యమును ఆహారపదార్థముకంటె రుచ్యముగా భుజించును. ఇదియే వాత్సల్యము.

రావణా! నీదోషములను కూడ రాముడు భావింపడు. అందుచే వానితో మైత్రి చేసికొనుము" అని సీతమ్మ ఉపదేశించెను.

మనము కూడ రావణుని వలెనే భగవంతున కాగ్రహమును కల్గించెడి అపరాధముల నెన్నిటినో చేయుచుందుము. వానికి ప్రాయశ్చిత్తములేదు. ఆతడు ధర్మజ్ఞుడు శరణాగతవత్సలుడు అని గుర్తించివాడే ఉపాయమని వానిని ప్రేమించుటయే కర్తవ్యము.

"రావణా! ఆ శరణాగతవత్సలుడగు రాముని అనుగ్రహింప చేసికొనుటకు నన్నాతని కొసంగుము. అట్లిచ్చితివా నీకు క్షేమమగును. లేదా నీవాతనిచే వధ నొందెదవు."

తత్త్వదీపిక :-

రావణునకు సీతమ్మ చేసిన ఈ యుపదేశము సంసారుల కందఱకు ఉపదేశమే!

వాని వస్తువును మనదిగా చేసికొని అహంకరించు సంసారులమగు మనము ఆచరింపవలసినది వాని వస్తువును వాని కర్పించుటయే!

"రావణా! ఇంద్రుడు వదలిన వజ్రమైనను, యముడైనను నిన్ను చంపక వదలిన వదలవచ్చును గాని లోకనాథుడగు రాముడు నిన్ను విడువడు.

రాముని ధనుస్సుయొక్క శబ్దమును నీవు త్వరలోనే వినగలవు. రామలక్ష్మణనామాంకితములగు బాణములు నీపై త్వరలో పడగలవు.

విష్ణువు మూడడుగులచే రాక్షసులాక్రమించిన లక్ష్మిని మరల తీసికొని పోయినట్లు నా భర్త నన్ను కొద్దికాలములోనే తీసికొని వెళ్లును.

జనస్థానములో నీరాక్షసబలము చనిపోగా రాముని ఎదిరింపచేతగాక ఈ అకార్యమును చేసితివి.

ఆ నారసింహులగు సోదరులు ఆశ్రమమునుండి బైటకేగినపుడు నీవీ యసాధుకృత్యమును చేసితివి.

రామలక్ష్మణుల వాసన తగిలినచో నీవు పెద్దపులి వాసనకు కుక్కవలె ఓర్వలేక పారిపోయి యుందువు. కొద్దిరోజులలోనే లక్ష్మణునితో కూడిన రాముడు తన బాణములతో నీ ప్రాణములను సూర్యుడు కిరణములతో నీటిని పీల్చినట్లు పీల్చివేయగలడు.

నీవు కుబేరుని కొండకే వెళ్ళినను, వరుణుని సభకు వెళ్ళినను పిడుగుపడిన చెట్టువలె నీవు రామునిచే మరణింపక తప్పదు."

**22** ఇట్లు సీత పలికిన పరుషవాక్యములను విని రాక్షసాధిపుడిట్లు పల్కెను.

"బతిమాలిన కొలది స్త్రీకి లొంగినట్లగును. మంచిమాటలు మాటాడిన కొలది పురుషడవమానింపబడుచుండును. నీపై కల్గిన కామము నాకోపము నాపివేయుచున్నది. అమార్గములో పోవుచున్న గుఱ్ఱములను మంచి సారథి ఆపినట్లు కామమే నా కోపము నాపు చున్నది. మనుష్యులకు కామము చాల ప్రతికూలమైనది. ఎవరియందు కాముముండునో వారియందు దయ, స్నేహము కల్గుచుండును. అందుచే ఈ మాయ సన్న్యాసినీ వేషమున నటించుచున్న నిన్ను చంపలేకున్నాను, నీవు నన్నాడిన పరుష వాక్యములకు నిన్ను క్రూరముగ చంపవలసియుండెను" అని అనుచుండగనే అతనికి కోపము అంతకంతకు అధికమాయెను.

కోపము నాపుకొనలేక "సీతా! నీకు సంవత్సరము గడు వొసంగితిని. ఇక రెండు మాసములు మాత్రమే మిగిలి యున్నవి. అప్పటికి నీవు నాపాన్పున ఉండవలెను. అప్పటికి కూడ నీవు నన్ను అంగీకరింపనిచో మావంటయింటిలో నిన్ను నాకు ప్రొద్దున భోజనమునకు వినియోగింతురు" అని బెదరించెను.

ఈవిధముగ రావణుడు భయపెట్టుచుండగా రావణుని వెంటనున్న దేవ గంధర్వ కన్యలందఱు వికృతములైన చూపులతో, విషాదముతో చూచుచుండిరి.

కొందఱు సీతను పెదవులతో, కొందఱు ముఖములతో, కొందఱు కన్నులతో సంజ్ఞలు చేసి ఓదార్చుచుండిరి.

సీతమ్మ మరల కొంచెము ఆశ్వాసమునొంది రాక్షసాధిపుడగు రావణునితో తన పాతివ్రత్య బలమునకు తగినట్లు ఇట్లు మాటాడెను.

"రావణా! ఈ పట్టణములో నీ శ్రేయస్సును కోరెడివాడెవ్వడును లేడు. అందుచేతనే నిన్నెవ్వడును ఈ పాపపు పనినుండి మరలింపలేదు.

ఇంద్రునియొక్క భార్యయగు శచీదేవివలె వేరొకరిచే కోరబడరాని దానను.

ధర్మాత్ముడగు రామచంద్రుని భార్యను నన్ను నీవు తప్ప ఈ లోకములో వేరొక డెవ్వడును మనసులోనైన కామించునా?

రాక్షసాధమ! అమిత పరాక్రమశాలియగు రాముని భార్యను. నీవాడిన పాపపుమాటలకు ఫలితమును నీవెచ్చటకు పోయినను అనుభవింపక తప్పదు.

రాముడును, నీవును ఈలోకములోనే ఉన్నారని సమానులను కొనుచు న్నావేమొ!

మదించిన ఏనుగు, చెవులపిల్లి ఒక అడవిలో కలసి యుండుట లేదా? రాముడు ఏనుగువంటివాడు. నీవు నీచమైన చెవులపిల్లివంటి వాడవు. రాముడు పరాక్రమహీనుడు, అడవిలో నున్నాడు అని ఏవేవో మాటలతో రాముని ఆక్షేపిం చుచుంటివే! నీకు సిగ్గులేదా? వారి కంటికి కూడ నీవు కన్పడలేదే! పతివ్రత నగు నన్ను దుష్టమగు భావనతో చూచిన నీ విరూపములగు క్రూరములగు నేత్రములు ఎందులకు నేలపడలేదో తెలియదు.

ధర్మాత్ముడగు రామచంద్రుని భార్యను. దశరథుని కోడలను. ఇట్టి దుర్వాక్యములను పల్కిన నీ నాలుక ఏల చీలుకొనిపోలేదో?"

"అసందేశాత్తు రామస్య తపస శ్చానుపాలనాత్

న త్వాం కుర్మి దశగ్రీవ! భస్మ భస్మార్హ తేజసా." (సుంద. 22-20)

'రాముని సందేశము లేదు కనుక, నేను తపసును పాలించుచున్నాను గనుక నిన్ను నేను భస్మము చేయులేదు. నీవు భస్మమగుటకు తగి యున్నావు. నిన్ను భస్మముచేయుటకు తగిన తేజస్సు నాకున్నది. కాని చేయను.'

తత్త్వదీపిక :-

ఈ శ్లోకము పాతివ్రత్య లక్షణమును, భగవంతుడే ఉపాయమని నమ్మిన ప్రపన్నుల లక్షణమును తెల్పుచున్నది. పతివ్రతయగు స్త్రీ భర్తయే తనకు రక్షకు డని నమ్మియుండవలెను. తనను రక్షించుకొను ప్రయత్నము, శక్తి యున్నను తాను చేయకూడదు. భగవంతుడే ఉపాయమని నమ్మియున్నవారు తమ రక్షణమునందు తమ ప్రయత్నము లేక యుండవలెను. శక్తియున్నను దానిని వినియోగించుకొనరాదు. సీతమ్మ దానినే ఇచట నిరూపించినది. భగవానుడు తానే జీవుల కందఱకు రక్షకుడని--

"పతిం విశ్వస్యాత్మేశ్వరం"

అని చెప్పియుండెను. కాని జీవుడు తనను తానే రక్షించుకొనవలెనని వేదములో చెప్పలేదు. అందుచే రాముని సందేశము లేదు అనెను.

తాను తపసుచేయుచున్నాననెను. రామునికి దూరమై రావణుని బంధములోనున్న సీత చేయుచున్న తపస్సేమి? రాముడే రక్షకుడని నమ్మి తనను తాను రక్షించుకొను ప్రయత్నమును మానుటయే తపస్సు. న్యాసమే తపస్సు. రక్షణభారమును పరమాత్మయందుంచుట న్యాసము. ఇట్టి తపస్సులో సీతమ్మ ఉన్నది కనుక రావణుని దహింపలేదు.

సీతమ్మకు రావణుని దహించు శక్తియున్నదా అను సందేహమక్కర లేదు. ఆంజనేయుని తోకకు నిప్పంటించినపుడు --

"శీతో భవ హనూమతః" (సుంద.53-28)

అని హనుమంతునకు చల్లబడుమని అగ్నిని ప్రార్థించగనే అగ్ని చల్లబడెను. అట్టి సీత "దగ్ధోభవ దశానన" అని యనినచో అగ్నిహోత్రుడు రావణుని దహింపడా! కాని యామె అనలేదు. పాతివ్రత్యమునకు గల శక్తి ఆమెకు తెలియును. కాని ఆ శక్తిని తనను రక్షించుకొనుటకు వినియోగించుకొనలేదు. ఇదియే పాతివ్రత్య ధర్మము. శరణాగత ధర్మము.

"రావణా! నన్ను నీవు దొంగిలించుకొని వచ్చితినని భావించుచున్నావేమొ! నన్ను దొంగిలించుకొనివచ్చుట నీకు సాధ్యముకాదు. నిన్ను చంపుటకు ఈ ఏర్పాటు చేయబడినది. సందేహము లేదు. కుబేరుని సోదరుడవు, శూరుడవు, బలవంతుడవు, రాముని ఆశ్రమము నుండి మాయచే దూరముచేసి భార్యాచౌర్యము నేల చేసితివి?"

సీతమ్మ పల్కిన ఈ మాటలను వినగనే రావణుని కన్నులు ఎఱ్ఱనై తిరుగుడుపడుచుండెను. రావణుడు భయంకరముగ సీతవైపు చూచెను.

అపుడు రావణుడు భయంకరమైన రూపముతో నీలజీమూతమువలెనుండెను. ఆతని భుజములు, కంఠములు భయంకరముగ కన్పట్టుచుండెను.

సింహమువంటి గమనము కలవాడై, మండుచున్న నాలుకలు, ఊగుచున్న కిరీటములు కలవాడై, చిత్రములగు మాల్యములను - అంగరాగములను తాల్చినవాడై, రక్తమాల్యములను - రక్తవస్త్రములను దాల్చినవాడై, భయంకరమగు భుజకీర్తులు గలవాడై, చూచుటకు భయముకొల్పుచుండెను. అమృతమథన సమయమున మందరమునకు కట్టిన వాసుకివలె ఆతని మొలకుకట్టిన మొలనూలు కన్పడుచుండెను.

పరిపూర్ణమగు భుజములతో రెండు శిఖరములతో గూడిన కొండవలెనుండెను. రక్తపల్లవపుష్పములతో గూడిన అశోకములతో నిండిన పర్వతమువలె బాలసూర్యవర్ణముగల కుండలములతో రావణుడు ప్రకాశించుచుండెను. ఇన్ని

యలంకారములతో అలంకరింపబడి మూర్తీభవించిన వసంతమా! కల్పవృక్షమా! అనునట్లుండెను. కాని,

"శ్మశానచైత్యప్రతిమో భూషితోఽపి భయంకరః" (సుంద.22-29)

శ్మశానములోని చైత్యమువలె ఎంత అలంకరింపబడినను భయమును కొల్పుచునే ఉండెను.

కోపముచే ఎఱ్ఱనైన నేత్రములు గలవాడై సీతమ్మను జూచుచు పాము వలె నిట్టూర్పు వదలుచు సీతమ్మతో -

"నీతి లేనివానిని, ధనము లేనివానిని అనుసరించుటయందు ఇంత పట్టు దల గల నిన్ను ఇప్పుడే చంపెదను" అని పల్కెను.

ఏకాక్షి, ఏకకర్ణ మొదలగు రాక్షసస్త్రీలతో "ఈ జానకి నాకువశమగునట్లు మీరందఱు కలసి ప్రయత్నము చేయుడు. సామ దాన భేదోపాయములను, అవసరమైనచో దండమునైనను ఉపయోగించి ఆమెను లొంగదీయుడు" అని చెప్పి కామమన్యువులతో నిండిన మనసుకలవాడై సీతమ్మను మరల బెదరించెను.

అపుడు ధాన్యమాలిని వేగముగా రావణునివద్దకుచేరి, కౌగిలించుకొని రావణునితో నిట్లనెను.

"మహారాజా! నాతో క్రీడింపుము. ఈ సీతతో ఏమి? ఈమె మనుష్యస్త్రీ. కాంతిహీన, దీన. నీవార్జించిన భోగములను అనుభవించెడి అదృష్టము ఈమెకు లేదు. పోనిమ్ము. నిన్ను ప్రేమింపని వారిని ప్రేమించిన సుఖముండదు. నిన్ను కోరుచున్న యామెను అనుభవించిన ప్రీతికల్గును" అని ధాన్యమాలిని పలుకగా నవ్వుచు ఆమెతో కలిసి ఆటనుండి బయల్వెడలి భవనమును చేరెను.

**23** రావణు డీవిధముగ సీతమ్మను బెదరించి, రాక్షసస్త్రీలతో చెప్పి వెడలిపోయిన తరువాత భీమరూపులగు ఆ స్త్రీలు సీత చుట్టును చేరి కోప ముతో పరుషముగా--

"సీతా! మహాత్ముడగు రావణుని భార్యగా నుండుటను నీ వాదరింపకు న్నావు. చాల తప్పు చేయుచున్నావు" అని పల్కిరి.

తరువాత ఏకజట అను రాక్షసి, "సీతా! ప్రజాపతులు ఆరుగురిలో నాల్గవ ప్రజాపతి పులస్త్యుడు, ఆ పులస్త్యుని మానసపుత్రుడు మహర్షియగు విశ్రవసుడు. ఆ విశ్రవసుని కుమారుడే ఈరావణుడు. అట్టి ఉత్తమవంశమున జన్మించిన రావణుని నీ వంగీకరింపకపోవుట యుక్తముగా లేదు. నా మాట

వినుము" అనెను.

తరువాత హరిజట అను రాక్షసి పిల్లిగ్రుడ్లు కలదై కన్నులు త్రిప్పుచు "ముప్పదిమూడు కోట్ల దేవతలు, దేవరాజగు ఇంద్రుడు కూడ మా రావణునిచే ఓడింపబడినవారలే! కావున వానికి భార్యవుకమ్ము" అనెను.

తరువాత ప్రఘస యను రాక్షసి క్రోధముతో సీతను భయపెట్టుచు "పరాక్రమముచే మదించినవాడు, శూరుడు, యుద్ధములో వెనుతిరుగనివాడు నగు మా రావణునకు భార్యగా నుండుట నీ భాగ్యము. తన ప్రేమకు, గౌరవమునకు స్థానమైన భార్యనుగూడ విడిచి నిన్నందఱకు రాణిగా చేయబోవుచున్నాడు. ఇంతకంటె నీయదృష్టమే మున్నది?" అనెను.

తరువాత వికట యను మరియొక రాక్షసి, "దేవ దానవ గంధర్వులను జయించిన రావణుడు నీకు లభించినను నీవు దాని నంగీకరింపకుండుట క్షమింపరానిది" అనెను.

తరువాత దుర్ముఖి "మా రావణుని యొద్ద భయముచే సూర్యుడు ఎండకాయుడు. గాలి గట్టిగా వీచుటకు భయపడును. అట్టి వానిమాట పాటింపకుండుటకు నీకెంత ధైర్యము? నీకు మంచి చెప్పుచున్నాను గ్రహింపుము. లేనిచో నీవు బ్రతుకవు" అనెను.

**24** మరికొందరు రాక్షసస్త్రీలు సీతచుట్టుచేరి "విలువగల పాన్పులతో నిండిన, సర్వభూతమనోహర మగు అంతఃపురమున నుండుటకు అంగీకరింపకున్నావు. మనుష్యస్త్రీవి గావున మనుష్యునకే భార్యవు కావలెనని కోరుచున్నావు. రామునినుండి మనసును త్రిప్పికొనుము. రామునకు భార్యగా మరి ఎన్నడును ఉండబోవు. మూడు లోకముల ఐశ్వర్యమును అనుభవించెడి రావణుని భర్తగా పొంది హాయిగా విహరింపుము. రాజ్యము పోయినవాడు. కోరికలు తీరనివాడు. ధైర్యహీనుడు, మనుష్యుడు నగు రాముని కోరుచున్నావు. ఏమి ఈ తెలివితక్కువతనము?" అనిరి.

రాక్షసస్త్రీలు పల్కిన ఈ మాటలు విని కన్నీరు నిండిన నేత్రములతో సీత ఇట్లు పల్కెను.

"మీరందఱు చెప్పుచున్నది లోకవిరుద్ధము. మనుష్యస్త్రీ రాక్షసునకు భార్యయగుటకు తగదు. నన్ను మీ యిష్టము వచ్చినట్లు తినివేయుడు. కాని మీ మాటను నేను చేయలేను.

"దీనో వా రాజ్యహీనో వా యో మే భర్తా స మే గురుః"

(సుంద. 24-9)

దీనుడే కానిండు, రాజ్యహీనుడే కానిండు నాకు భర్త ఎవడో వాడే గౌరవింపదగినవాడు.

సువర్చల సూర్యుని, శచీదేవి ఇంద్రుని, అరుంధతి వసిష్ఠుని, రోహిణి చంద్రుని, లోపాముద్ర అగస్త్యుని, సుకన్య చ్యవనుని సావిత్రి సత్యవంతుని, శ్రీమతి కపిలుని, మదయంతి సౌదాసుని, కేశిని సగరుని దమయంతి నైషధుని ఎట్లనుసరించియుండి పతివ్రతలైరో నేనుకూడ అట్లే రామునే అనుసరించి యుందు పతివ్రతను" అని సీత చెప్పెను.

ఆమాటలను విని రాక్షసస్త్రీలు కోపముతో పరుషములగు వాక్యములతో ఇట్లు భయపెట్టుచుండిరి.

శింశుపావృక్షముపై కూర్చుండిన హనుమ ఏమియు మాటాడకుండ కూర్చుండి రాక్షసస్త్రీలు సీతను భయపెట్టుచున్న మాటలను వినుచుండెను.

భయముతో వణకుచున్న సీతయొక్క చుట్టును చేరిన రాక్షసస్త్రీలు పెదవులు వేలవేసికొని ఆమె మీదకు వచ్చి క్రూరముగ భయపెట్టుచుండిరి.

సీత ఆ రాక్షసస్త్రీలు చుట్టుముట్టగా ఆ శింశుపావృక్షమును దగ్గరగా చేరి శోకముతో విలపించుచుండెను.

అపుడు వినత యను రాక్షసి "సీతా! భర్తపై నీవు చూపుచున్న ప్రేమ చాలును. ఏ విషయమైనను ఎక్కువగా చేయరాదు.

"సర్వత్రాతి కృతం భద్రే వ్యసనా యోపకల్పతే" (సుంద.24-21)

ఎక్కువ చేసిన ఏదియైనను దుఃఖమునే కల్గించును. మనుష్యస్త్రీగా నీవు చూపిన పాతివ్రత్యమునకు సంతోషము. కాని నీ మేలుకోరి చెప్పుచున్న నా మాటను వినుము. సర్వరాక్షసులకును భర్తయగు రావణుని భర్తగా పొందుము. ఆతనికి విక్రమము, రూపము, దాక్షిణ్యము, త్యాగము మున్నగు గుణము లెన్నియో కలవు. రాముడు దీనుడు, మనుష్యుడు. రావణుని పొందినచో దివ్యాంగ రాగములను, దివ్యాభరణములను నీవు పొందెదవు. సర్వలోకములకు నీవే నియంత్రివై యుండెదవు. సీతా! దీనుడు, ఆయువు మూడినవాడు నగు రాముడెందుకు? వదులుము. నేను చెప్పినమాట నీవు చేయకపోతివా ఇప్పుడు నిన్ను మేము భక్షింతుము" అనెను.

అపుడు వికటయను మరొకతె లేచి పిడికిలి పైకెత్తి గర్జించుచు "మైథిలీ!

నీయందు దయవలన ఇంతకాలము నీమాటల నోర్చితిమి. ఇప్పుడింక మేము చెప్పిన మాటలను వినుము. సముద్రముయొక్క ఇవతలి ఒడ్డునకు తేబడితివి. రావణాంతఃపురమున ఉంచబడితివి. ఇచ్చటి కెవ్వరును చేరలేరు. రావణభవనములో బంధింపబడి మాచే రక్షింపబడుచున్న నిన్ను సాక్షాత్ ఇంద్రుడైనను కాపాడలేదు. నీ హితమునుకోరి పల్కుచున్నాను. నామాటలు వినుము. వ్యర్థముగ కన్నీరు కార్చకుము. శోకమును వీడుము. ప్రీతిని పొందుము. సంతోషముతో నుండుము. దైన్యమును వదలిపెట్టుము. రాక్షసరాజుతో హాయిగా క్రీడించుము. ఓ పిరికిదాన! స్త్రీలకు యౌవనము స్థిరముగా నుండదు. అది గడచిపోకమునుపే సుఖము ననుభవింపుము. రావణునితో కలసి హాయిగ ఉద్యానములలో, పర్వతప్రాంతవనములలో విహరించుము. సుందరీ! ఏడు వేలమంది స్త్రీలు నీ వశమున నుందురు. రావణుని భర్తగా భజించుము. నేను చెప్పినట్లు వినకపోతివా నీ గుండెలు పెకలించి భక్షింతుము" అని భయపెట్టెను.

అపుడు చండోదరి యను రాక్షసి శూలమును త్రిప్పుచు సీత మీదకు వచ్చి "రావణుడు హరించి తెచ్చిన ఈ లేడిచూపుల సీతను జూచి నాకు నోరూరుచున్నది. ఈమె యకృత్తు, ప్లీహము, హృదయము, ఆంత్రములు, శిరసు కూడ తినవలెనని నాకు కోరికగా నున్నది" అనెను.

అప్పుడు ప్రఘస అను రాక్షసి "ఎందుకట్లు ఊరక కుండెదరు? రండు. ఈ దుర్మార్గురాలి పీక పిసికెదము. మనుష్య స్త్రీ చనిపోయినదని ప్రభువునకు తెలియజేయుదము. సరే! మీరు తినివేయుడని ప్రభువనును. సందేహము లేదు" అనెను.

అప్పుడు అజాముఖి అను రాక్షసి "ఈమెను ఖండించి సమానములగు ముక్కలను చేయుడు. మన మందఱము పంచికొందము. నా కీ వివాదము నచ్చలేదు. వేగముగ పానము తెండు" అనెను.

తరువాత శూర్పణఖ అను రాక్షసి "అజాముఖి చెప్పినది నాకును నచ్చినది. సర్వశోకవినాశినియగు సురను తెండు. మనుష్య మాంసమును తిని నికుంభిలా నృత్యమును చేయుదము" అనెను.

ఈవిధముగ బెదిరింపగా సీత ధైర్యమును వీడి ఏడ్చుచుండెను.

**25** ఆ విధముగ పరుషముగ పెక్కుమాటలు మాటాడుచున్న రాక్షసస్త్రీల మాటలను విని, కన్నీటితో, గద్గదమైన స్వరముతో సీత ఇట్లు పలికెను.

"మనుష్య స్త్రీ రాక్షసునకు భార్య యగుట తగదు. మీరందఱు నన్ను తినుడు. మీ మాటను మాత్రము వినను" అని దృఢముగ చెప్పి సీత దుఃఖించుచుండెను.

అశోకవృక్షముయొక్క పూచిన ఒక కొమ్మను బట్టుకొని కన్నీటిధారలతో వక్షఃస్థలమును తడుపుచు గాలికి కదలుచున్న అరటిచెట్టువలె వణకిపోవుచున్నదై, వివర్ణవదనయై యుండెను, వెడల్పై, పొడవైన ఆమె జడ కదలుచున్న త్రాచుపామువలె కన్పడెను.

"హా రామ! హా లక్ష్మణ! హా కౌసల్యే! హా సుమిత్రా!" యని విలపించుచుండెను.

"అకాలమునందు మృత్యువు దుర్లభ మని పండితులు చెప్పిన మాట సత్యము.

క్రూరరాక్షసు లింత బాధించుచున్నను రామునికి దూరమై కూడ నేను జీవించుచున్నాను.

దురదృష్టవంతురాలనై సముద్రమధ్యములో బరువుతో నిండిన పడవ గాలికి భగ్నమైనట్లు నేనిక నశింతును. రాక్షసీవశమున నుండి భర్తను చూడక ప్రవాహము కొట్టిన ఒడ్డువలె కూలిపోవుచున్నాను.

తామర రేకుల బోలిన కన్నులు గలవాడును, సింహమువలె నడచువాడను, కృతజ్ఞుడును అగు నా నాథుని ధన్యులెవరో దర్శింతురు. స్వామియగు రామునకు దూరమైన నేను విషమును త్రాగినవానివలె మరణింపక తప్పదు. జన్మాంతరములో ఎట్టి పాపము చేసితినో కదా! ఈ జన్మలో ఇట్టి ఘోరమైన దుఃఖము నందితిని. ఈ శోకముతో ఇక నేను ప్రాణములను వీడుదును. మనుష్య జన్మ -- అందులో స్త్రీ జన్మ -- స్వేచ్ఛగా ప్రాణములను వీడుటకు కూడ అర్హత లేనిది గదా! ఛీ!" అని కన్నీళ్ళతో విలపించుచుండెను.

**26** జనకాత్మజ ఇంకను ఈ క్రిందివిధముగా దుఃఖించుచుండెను. "రాఘవుడు మరొక పనిమీద ఉండగా కామరూపి యగు రాక్షసుడు మొర పెట్టుచున్నను లెక్కచేయక బలాత్కరించి తెచ్చినాడు. ఈ రాక్షసస్త్రీలు నన్ను

భయపెట్టుచున్నారు. ఈ దుఃఖముతో ఇక నేను బ్రతకలేను. నాకు జీవిత మక్కరలేదు. ధనమక్కరలేదు. భూషణము లక్కరలేదు. రాముడులేని నాకు వీనితో పని ఏమి? నాగుండె రాతివలె కఠినమైనది. జరామరణములు లేనిది. అందుచేతనే ఇంత దుఃఖమును తట్టుకొని నిలచినది.

ఛీ! నేను పతివ్రతను గాను. గౌరవింపదగినదానను కాను. రామునకు ఎడముగా నుండి క్షణకాలమైనను జీవితమును నిల్పుకొనదగునా? ప్రియుడు లేని నాకు జీవితమునందు శ్రద్ధ ఏమి? ఈ శరీరము ముక్కలు చేయబడినను సరే, తినివేయబడినను సరే, దీనితో నాకు ప్రయోజనము లేదు.

ఈ రావణుని కామించకపోవుటకాదు, ఎడమకాలితో తాకుట కూడ నేను చేయను. తనను, తనవంశమును నేను తిరస్కరించుచున్నానని మూర్ఖు డెఱుంగకున్నాడు. క్రూరస్వభావముతో నన్ను మరల మరల ప్రార్థించుచున్నాడు. నన్ను రెండు ముక్కలు చేసినను సరే! బ్రద్దలు చేసినను సరే! ఏ కీలున కా కీలు ఊడదీసినను సరే! మండుచున్న అగ్నిలో దహించినను సరే! రావణుని మాత్రము పొందను.

ఓ రాక్షసులారా! మీ రెందుల కింతసేపు శ్రమపడి పల్కెదరు?

ప్రసిద్ధుడు, ప్రాజ్ఞుడు, కృతజ్ఞుడు, దయాశీలుడు అగు రాఘవుడు నా భాగ్యహీనతవలన నేడు దయలేనివా డాయెనని అనుకొందును. జనస్థాన ములో ఒక్కడు పదునాల్గు వేలమంది రాక్షసులను సంహరించిన రాముడు ఈ రాక్షసులను చంపి నన్ను పొందలేడా! కొద్దిపాటి పరాక్రమముగల ఈ రావణుడు నన్ను బంధించినాడు. ఈ రావణుని చంపుట రామున కసాధ్యము కాదు. దండకారణ్యములో విరాధుడను రాక్షసుని చంపిన నా రాముడు నన్ను రక్షింపడా? సముద్ర మధ్యములో లంక యున్నది గావున ఎవ్వరును చేరలేరని అనుకొందురేమొ! మా రాముని బాణములకు ఈ సముద్రము అడ్డుకాదు. లక్ష్మణునితో కూడియున్న రామునకు నే నిచ్చట నున్నానని తెలిసియుండదు. అందుచే రాముడు నన్ను రక్షింప రాలేదు. నే నిచ్చట నున్నానని తెలిసినచో ఓర్వడు. రావణు డపహరించినాడని చెప్పెడి జటాయువు కూడ రణములో రావణుచే హతుడైనాడు. నే నిచ్చట నున్నానని మారామునకే తెలిసియుం డునా లోకమున రాక్షసులు లేకుండ చేయును. లంకాపురిని దహించును. సముద్రము నింకించును. నీచుడగు రావణుని కీర్తిని, పేరును కూడ లేకుండ

చేయును. నే నిపుడెట్లేడ్చుచున్నానో అట్లు భర్తలు పోయి రాక్షస స్త్రీలు ఇంటింట ఏడ్తురు. రామలక్ష్మణుల కంటబడినచో రావణుడు క్షణకాలమైన జీవింపడు. చితాధూమములతో ఆవరింపబడి గ్రద్దలగుంపులతో సంకులమై ఈ లంక కొద్దిరోజులలోనే శ్మశానసదృశ మగును. కొద్దిరోజులలో నా కోరిక తప్పక నెరవేరును. మీరు చేయుచున్న దుర్మార్గప్రవర్తనయే మీకు కీడు కల్గునని తెలియచేయుచున్నది.

లంకలో అశుభము లగు సూచనలు కన్పట్టుచున్నవి. అందుచే కొద్ది రోజులలో లంక మాసిపోక తప్పదు. పాపాత్ముడును రాక్షసాధముడగు రావణుడు చనిపోవగనే లంక విధవవలె నగును. పండుగలతో కూడిన లంక భర్తపోయిన స్త్రీవలె అగును. ఇంటింట ఏడ్చుచున్న రాక్షసస్త్రీల రోదనములను కొద్దిరోజులలోనే విందును. రామబాణములచే దహింపబడి అంధకారావృతయై, కాంతిహీనయై లంకాపురి యుండగలదు. ఈ నృశంసుడగు రావణుడు పెట్టిన గడువు పూర్తికావచ్చుచున్నది. పాపాత్ములగు రాక్షసులకు చేయకూడని పని కూడ తెలియకున్నది. వీరు చేసిన అధర్మము మహోత్పాతమును కల్గించును.

ఈ రాక్షసులు ధర్మము నెఱుంగరు. ఒకనాడు తప్పక నన్ను ప్రొద్దునవేళ భోజనమునకు ఖండింతురు. నే నేమి చేయగలను? విషము నిచ్చెడివారైనను ఎవరును ఇక్కడలేరు. నే నిచ్చట జీవించియున్నానని రాముడెఱుంగడు. ఎఱిగి యున్నచో వారు నన్ను అన్వేషింపక యుండరు. నేను కన్పడలేదను దుఃఖముచే దేహమును వీడి రాముడు దేవలోకమునకు ఏగియుండును. ఆ దేవలోకము నందలి సిద్ధులు, గంధర్వులు, ఋషులు ధన్యులు. రాజీవలోచనుడగు రాముని వా రచ్చట కాంచుచుందురు. ధర్మమునే కాంక్షించెడి రాజర్షియగు రామునకు భార్యవగు నాతో ఏమి పని? చూచినంతసేపు ప్రీతి యుండును. చూడనపుడు ప్రేమ ఉండదు. ఎంతమాట! అట్లు కృతఘ్నులు ప్రేమను వీడుదురు గాని మా రాముడు ప్రేమను వీడడు. ఏవో నా దుష్కృతములున్నవి. నా భాగ్యము తరిగిపోయి ఉండును. అందుచే రామునికి దూరమై బాధపడుచున్నాను. చారిత్రములో మచ్చ లేనివాడును, శత్రుసంహారకుడు నగు రామచంద్రునికి దూరమై జీవించుటకంటె మరణించుట మేలు. మూలఫలములను తినుచు అడవిలో తిరుగుచున్న రామలక్ష్మణులు అస్త్రసన్న్యాసము చేసియుందురా? లేక దురాత్ముడగు రావణునిచే వంచనతో చంపింపబడియుందురా? ఇట్టి పరిస్థితిలో చనిపోవలెనని యున్నది. కాని ఇంత దుఃఖములో కూడ దైవము

వాకు చావుపెట్టలేదు.

"ప్రియా న్న సంభవే ద్దుఃఖం అప్రియా దధికం భయం
తాభ్యాం హి యే వియుజ్యన్తే నమస్తే షాం మహాత్మనామ్".
(సుంద.26-50)

"ప్రియమైన వస్తువు లభించునపుడు దానిని పొంది మరల దుఃఖము నొందక సుఖమే ఎవ్వరనుభవింతురో, అప్రియమగు వస్తువువలన అధికమగు భయము నెవ్వరందకుందురో అట్టి మహాత్ములకు నమస్కారము. ఇక నేను రామునికి దూరమై రావణుని వశమైతిని గాన ప్రాణములను వీడుదును."

**27** ఈ విధముగ సీత రాక్షసస్త్రీలతో తన అభిప్రాయమును స్పష్టముగ చెప్పెను.

అపుడా రాక్షసస్త్రీలు కోపముతో రావణునితో చెప్పుటకు వెళ్ళిరి.

కొందఱు సీతను జేరి మరల పరుషముగా ఇట్లు మాటాడుచుండిరి.

"పాపనిశ్చయము గలదానా! సీతా! నేడు నీ మాంసమును రాక్షసస్త్రీలు భక్షింతురు" అని భయపెట్టుచుండిరి.

అచటనే పండుకొనియున్న విభీషణుని పుత్రికయగు త్రిజట నిద్రనుండి మేల్కొని--

"ఓ అనార్యులారా! నన్ను తినివేయుడు. సీతను మాత్రము తినవద్దు. ఈమె జనకుని కూతురు, దశరథుని కిష్టమైన కోడలు. ఇప్పుడు నేను ఒడలు గగుర్పొడుచునట్టి భయంకరమగు స్వప్నమును గాంచితిని. ఆ స్వప్నము రాక్షసుల వినాశమును రాముని విజయమును సూచించుచున్నది" అని పల్కెను.

త్రిజట ఇట్లు పలుకగనే క్రోధ మావేశించియున్న రాక్షసస్త్రీలందఱును ఒక్కసారి భయపడి త్రిజటతో "నీవు చూచిన స్వప్నమేమొ చెప్పుము" అనిరి.

ఇట్లువారు అడుగగనే త్రిజట తన స్వప్నము నిట్లు వివరించెను.

"ఏనుగుదంతములతో చేయబడిన దివ్యమైన ఒక పల్లకీని వెయిహంసలు మోయుచు అంతరిక్షమున తెచ్చుచుండెను. ఆ శిబికయందు తెల్లని మాల్యములను, తెల్లనివస్త్రములను దాల్చిన శ్రీరామచంద్రుడు లక్ష్మణునితో కలసి కూర్చుండి యుండెను. సీత తెల్లని వస్త్రములను దాల్చి సముద్రమధ్యమున

మన్న ఒక పర్వతముపై కూర్చుండియుండెను. రాముడా హంసలు మోయు చున్న పల్లకితో సీతవద్దకు వచ్చెను. ప్రభ సూర్యునితో కలసినట్లు సీతమ్మ రామునితో కలసినది. అపుడు రాముడు నాల్గుదంతముల ఏనుగును లక్ష్మ ణునితో కలసి అధిరోహించియుండెను. శుక్లమాల్యాంబరములను ధరించిన ఆ రామలక్ష్మణులు జానకిని చేరిరి. ఆ కొండశిఖరమునకు దగ్గరగా ఆకాశము నందు నిలచిన ఏనుగుపైకి రాముడు సీతమ్మ నెక్కించెను. సీతమ్మ రాముని ఒడిలో కూర్చుండెను. ఆమె ఆ ఒడినుండి కొద్దిగ లేచి సూర్యచంద్రుల నిద్దఱను చేతితో రాయుచుండెను. తరువాత ఆ రామలక్ష్మణులతో, సీతతో కూడిన ఆ ఏనుగు లంకపైన నిలచెను. అపుడు సీతారామలక్ష్మణులు ఎనిమిది వృషభములు పూన్చిన రథము నధిరోహించిరి. తరువాత వారే పుష్పక విమానము నధిరోహించి ఉత్తరదిక్కున కేగుచుండిరి. ఇట్లు విష్ణుపరా క్రముడగు రాముడు సీతా లక్ష్మణులతో గూడి ఉత్తర దిక్కున కేగుచుండగా నేను చూచితిని. మహాతేజశ్శాలియగు రాముడు దేవతలచే గాని, రాక్షసులచే గాని జయించుటకు శక్యమైనవాడు కాడు.

ఇక రావణుడు- నేలపై నూనెలో ఎఱ్ఱనివస్త్రములు దాల్చి త్రాగి మదించి గన్నేరు పూలదండతో పడియుండగా చూచితిని. రావణుడు పుష్పకవిమా నమునుండి నేలపై పడెను. నల్లనిబట్ట కట్టుకొని నున్నని గుండుతో ఒక ఆడుది ఈడ్చుచుండగా కన్పడెను. గాడిదలు పూన్చిన రథముతో ఎఱ్ఱని మాల్యములను, ఎఱ్ఱని చందనమును పూసికొని నూనె త్రాగుచు నవ్వుచు నృత్యము చేయుచు దక్షిణదిక్కుకు పోవుచుండెను. మరల నాతడు గాడిదనెక్కి దక్షిణదిక్కుకు పోవుచుండగా భయముచే గాడిదనుండి నేలపై తలక్రిందులుగా పడెను. వెంటనే లేచి తొట్రుపడుచు భయముతో పిచ్చివానివలె దిగం బరుడై ఏవేవో చెడ్డమాటలను పల్కుచు దుర్గంధము నరకోపమమునగు మలపంకమున ప్రవేశించి అందు మునిగెను. అపు డొక స్త్రీ నల్లని, ఎఱ్ఱని వస్త్రమును దాల్చి ఒడలినిండ బురద పూసికొని రావణుని కంఠ మందు బంధించి దక్షిణదిక్కునకు లాగుచుండెను. ఇట్లే కుంభకర్ణుడు కూడ కన్పడెను. రావణుని కుమారులందఱు తైలములో పడియుండిరి. నూనె పూసికొని దశగ్రీవుడు వరాహముతో, ఇంద్రజిత్తు శింశుమారముతో, కుంభకర్ణుడు ఒంటెతో దక్షిణదిక్కునకు పోవుచుండిరి. ఒక్క విభీషణుడు మాత్రము తెల్లని గొడుగువేసికొని, శుక్లమాల్యాంబరములను ధరించి, తెల్లని

చందనము పూసికొని శంఖదుంధుభిధ్వనులతో, నృత్తగీతములతో, పర్వతము వంటి నాల్గుదంతములుగల ఒక ఏనుగును అధిరోహించియుండెను. మరియు విభీషణుడు నలుగురు మంత్రులతో ఆకాశముపై నిలచియుండెను. గుఱ్ఱము లతో ఏనుగులతో రథములతో కూడిన ఈ లంకయంతయు గోపురములు తోరణములు విరిగి సముద్రములో పడియుండెను. రాముని దూతయగు ఒక వానరుడు లంకను కాల్చివేసినట్లు చూచితిని. నూనెత్రాగి, నృత్యము చేయుచు, నవ్వుచు, భస్మమైన లంకలో రాక్షసస్త్రీలు ప్రవేశించుచున్నారు. కుంభకర్ణాదులందఱు రక్తవస్త్రములను దాల్చి గోమయహ్రదము (పేడమడుగు) లో ప్రవేశించి యుండిరి".

"అందుచేత తొలగుడు. ఇంక ఆమెకంట పడకుడు. రాముడు సీతను పొందును. రాక్షసులతో పాటు రావణుని చంపును. క్రూరవాక్యములు పలుకకుడు. సీతమ్మను యాచింతము. అదియే తగిన పని యని నాకు అనిపించుచున్నది. ఇంత దుఃఖములో నున్న ఆమెను గూర్చి ఇట్టి కల వచ్చుట ఆమెకు దుఃఖము తొలగి ప్రియము కల్గునని తెలియచేయుచున్నది. ఇంతసేపు ఏ సీతమ్మను బెదరించితిరో ఆమెను ఇపుడు యాచింపుడు. రాముని వలన మనకు ఘోరమగు భయము రానున్నది."

"ప్రణిపాత ప్రసన్నా హి మైథిలీ జనకాత్మజా
అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్."

(సుంద.27-44)

"నమస్కరించిన మాత్రముననే వెనుకటి తప్పులను చూడక అనుగ్రహించునది జానకి. ఈమె మనలను మహాభయమునుండి రక్షింపసమర్థురాలు."

తత్త్వదీపిక :-

ఈ శ్లోకము మాతృస్వభావమును, లక్ష్మీస్వభావమును, సీతాస్వభావ మును చిత్రించును. ఆమెకే ప్రత్యక్షముగ అపరాధము చేసిన వారలను కూడ క్షమింపజాలిన ఔదార్యవతి. తాను క్షమించుటయేకాదు. ఇతరులు హింసింపకుండ రక్షించును.

రాక్షసస్త్రీలు చేసిన తప్పిదమునకు, హనుమ ఆగ్రహించి రావణ వధానంతరము వారిని చంపవలెనని ఉద్యుక్తుడాయెను. అపుడు సీతమ్మ--

-"న కశ్చి న్నాపరాధ్యతి?" (యుద్ధ. 116-44)

తప్పుచేయనివాడెవడు? అని వారిని హనుమ చంపకుండ రక్షించెను.

ఇట్లు ప్రణిపాత మాత్రముచే ప్రసన్న యగునది తల్లి సీతమ్మ. అందుచే ఆమె నాశ్రయించిననే రక్షణ లభించునని త్రిజట ఉపదేశించినది.

"త్రిజట ఇంకను ఇట్లు చెప్పెను-- మరియు చూడుడు. విశాలాక్షియగు ఈ సీతమ్మ అవయవములలో ఏమాత్రము వైరూప్యమురాలేదు. కాంతిమాత్రము కొంచెము తగ్గెను. అందుచే తప్పక సీతమ్మ కార్యము నెరవేరును. రావణాసురుడు నశించును. రాముడు జయించును. అదిగో చూడుడు. ఈమెకు ప్రియము కల్గబోవుచున్నదని తెలియజేయుచు ఈమె ఎడమకన్ను అదరుచున్నది. ఎడమ భుజము కూడ అదరుచున్నది. ఎడమతొడ అదరుచున్నది. ఈ నిమిత్తములన్నియు సీతమ్మ ఎదుట రాముడు నిలచినట్లే తెల్పుచున్నవి."

"అదిగో చెట్టుమీద పింగళిక యను పక్షికూడ కూయుచున్నది. ఆ పక్షి కొమ్మలలో బాగుగ దాగియున్నది. చాల సంతోషముతో నున్నది."

"విచారింపకుము నీ భర్త వేగముగా వచ్చును. ఇది శోకమునకు తగిన సమయము కాదని మరల మరల ఉత్తమమగు సాంత్వనవచనములను పల్కుచున్నట్లున్నది. శ్రీరామునకు స్వాగతవచనములను పల్కుచున్నట్లున్నది."

తత్త్వదీపిక :-

ఈ పక్షి పల్కిన పల్కులను గూర్చి చెప్పిన ఈ శ్లోకము ఇందు చాల ముఖ్యమైనది.

"పక్షీ చ శాఖానిలయః ప్రహృష్టః
పునః పున శ్చోత్తమసాంత్వవాదీ,
సుస్వాగతాం వాచ ముదీరయానః
పునః పునశ్చోదయతీవ హృష్టః" (సుంద. 27-51)

(1) పక్షి :-

ఈ శ్లోకములో వర్ణింపబడిన "పక్షి" ఈ సుందరకాండకు ప్రధానుడైన హనుమ. ఆతడా చెట్టు గుబుర్లలో దాగియున్నాడు. పల్కబోవుచున్నాడు. ఆతడే ఆచార్యుడు.

రామునికి దూరముగా నున్న సీతమ్మకు రాముని సందేశము నందింప వచ్చి ఇంతవరకు పరీక్షించుచున్న హనుమ ఇంక మాటాడెడి శుభసమయ మాసన్నమైనది.

మహాపురుషుడు, జ్ఞాని యగు ఆచార్యుని స్వభావము నీశ్లోకము చిత్రించుచున్నది.

బ్రహ్మనిష్ఠుడై, ఆచరణముచే పరిపూర్ణుడైన ఆచార్యుడు-జ్ఞానియగు మహాపురుషుడు "పక్షి."

పక్షములు కలది పక్షి. ఇది ఆకాశమున విహరించును. అట్లాకాశమున పోవుటకు సాధనములు పక్షములు=రెక్కలు.

ఆకాశమే పరబ్రహ్మము. దానిని చేరుటయే ఆకాశమున విహరించుట,

ఆ=అంతట పూర్తిగా; కాశ=ప్రకాశించునది- ఆకాశము.

అనగా స్వయంప్రకాశమగు పరమాత్మ.

*"ఉభాభ్యా మేవ పక్షాభ్యాం యథా ఖే పక్షిణాం గతిః*
*తథైవ జ్ఞానకర్మభ్యాం నియతా పరమా గతిః."*

రెండు రెక్కలతో పక్షి ఆకాశమున సాగునట్లే జ్ఞానకర్మలచే పురుషుడు పరమగతి నొందును.

యజ్ఞము, దానము, తపస్సు అనునవి ఆచరించి అంతఃకరణ నైర్మల్యమును సంపాదించిననాడే జ్ఞాన మావిర్భవించును. అట్టి జ్ఞానముతో ఆరాధ్యుడగు పరమపురుషు నెఱింగి పరమపురుష సమారాధనరూపముగా కర్మల నాచరించుటయే సిద్ధి.

అట్లు జ్ఞానకర్మలు రెండును కలవాడే ఆచార్యుడు. 'ఆచార్య' శబ్దమునకు నిర్వచనము కూడ అదియే!

"ఆచినోతి హి శాస్త్రార్థాఆచారే స్థాపయ త్యపి
స్వయ మాచరతే యస్మాత్తస్మా దాచార్య ఉచ్యతే."

వేద శాస్త్రములలో చెప్పిన విషయములను తెలిసికొనవలెను. తెలిసికొనిన వానిని ఇతరులచే ఆచరింపచేయవలెను. తానాచరింపవలెను. అట్టివానిని ఆచార్యుడనవలెను. అట్లు జ్ఞానానుష్ఠానములతో పరిపూర్ణుడయి పరబ్రహ్మానుభవమును అనుభవించుచు వేదవేదాంగముల నధ్యయనముచేసిన శ్రోత్రియుడగు

బ్రహ్మనిష్ఠుడే పక్షి.

(2) శాఖానిలయః :-

శాఖలయందు బాగుగ లీనమైయున్న దీ పక్షి.

వేదశాఖలే శాఖలు - కఠశాఖ, కలాపశాఖ మున్నగునవి. వానిని అధ్యయనము చేసినది మొదలు మరణపర్యంతము స్వాధ్యాయప్రవచనములను చేయుచుండవలెను. దాని యర్థము నెఱింగి ఆచరించువాడు కావలెను. వేదములో పూర్వభాగములో చెప్పిన కర్మల నాచరించుట, ఉత్తరభాగములో చెప్పిన పరబ్రహ్మ విషయమున శ్రవణమనన నిదిధ్యాసనములను ఒనర్చుట పాటింపవలెను.

ఆచార్య లక్షణమును వివరించుచు-

"ఆచార్యో వేదసంపన్నః విష్ణుభక్తో విమత్సరః
మంత్రజ్ఞో మంత్రభక్తశ్చ సదా మంత్రాశ్రయ శ్శుచిః
గురుభక్తి సమాయుక్తః పురాణజ్ఞో విశేషతః
ఏవం లక్షణసంపన్నః గురురిత్యభిధీయతే."

అని వేదజ్ఞాన సంపన్నుడే గురువు కాదగునని చెప్పబడినది.

"సిద్ధం సత్సంప్రదాయే స్థిర ధియమనఘం
శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్."

అని వేదవేదాంగముల నధ్యయనము చేసినవాడు, బ్రహ్మనిష్ఠుడు గురువుగా నుండదగునని తెలియుచున్నది.

ఉపనిషత్తులలో -

"స గురు మేవాభి గచ్ఛేత్ సమిత్పాణిః
శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్."

అని శ్రోత్రియునే గురువుగా ఆశ్రయింపవలెనని చెప్పబడినది. అందుచే వేదశాఖానిలయుడు గురువు.

(3) ప్రహృష్టః

ఎల్లప్పుడు సంతుష్టమైన హృదయము కలవాడై యుండవలెను. విషయములను కామించి వాని లాభాలాభములచే సుఖదుఃఖములను అనుభవించు

సంసారులవలె గాక సదా భగవద్గుణములనే అనుభవించుచు ఆ అనుభవముచే కల్గిన ప్రీతి నిండిన హృదయముతో ఎల్లప్పుడు సంతుష్టుడై ఉండవలెను. ఆ ప్రీతి హృదయమునుండి ఆనందబాష్పములుగా, గగుర్పాటుగా బైటకి ప్రసరించుచుండును. అట్టి యనుభవము గలవాడే ఆచార్యుడు.

*"ఆహ్లాద శీతనేత్రాంబుః పులకీకృత గాత్రవాన్*
*సదా పరగుణావిష్టః ద్రష్టవ్యః సర్వదేహిభిః."*

భగవదనుభవానందముచే చల్లని కన్నీరు కార్చుచు ఒడలు గగుర్పొడుచుచు భగవద్గుణముల ఆవేశము కల్గి ఎల్లప్పుడు అందఱకు కన్పడవలయును.

(4) "పునః పునశ్చ ఉత్తమ సాంత్వవాదీ" :-

మరల మరల ఉత్తమమైన సాంత్వనవచనములను గురువు చెప్పుచుండవలెను.

భగవంతుడు నిరంకుశుడని అపరాధములను జూచి క్షమింపడని సామాన్యముగ భగవంతుని చేరుటకు భయపడుచుందుము. భగవంతుని చేరుటకు భయములేకుండ ఆతడు పల్కిన సాంత్వనవచనములను చెప్పి ధైర్యమును ఆచార్యుడు కల్గించుచుండును.

భగవంతుడు పురుషోత్తముడు, దయామయుడు. ఎచట మనము పొందవలెనన్న అచటనే ఉండును. అతని చేరుటకు ఎచ్చటకును పోనక్కరలేదు, ఏమియును సమర్పింపనక్కర్లేదు, సర్వసులభుడని శిష్యునకు గురువు ధైర్యమును కల్గించుచుండవలెను. ఆ పురుషోత్తముడు పల్కిన సాంత్వనవచనములను, ఆ పురుషోత్తమునిగూర్చి సౌలభ్యమును ప్రదర్శించు వచనములను పల్కవలెను.

"ఉత్తమఃపురుష స్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః"

"ఉత్తమపురుషుడు పరమాత్మ. ఆ పరమాత్మ సాంత్వనవచనములను ఆచార్యుడు చెప్పుచుండెను. ఆత డెక్కడో ఉండడు. మన హృదయములలోనే ఉండును. అతనితో వివాదము లేకున్నచో ఎచ్చటకును నీ వేగనక్కరలేదు. గంగాది దివ్యతీర్థములను గాని, కురుక్షేత్రాది పుణ్యక్షేత్రములను గాని దర్శింపనక్కరలేదు" అని గురువు సాంత్వనవచనములను చెప్పను.

"యమో వైవస్వతో రాజా య స్తవైష హృది స్థితః
తేన చే దవివాద స్తే మా గంగాం మా కురూ గమః"

"యముడు, వైవస్వతుడు, రాజునగు ఎవడు నీ హృదయమందున్నాడో

వానితో నీకు వివాదము లేకున్నచో గంగాది తీర్థములకు గాని, కురుక్షేత్రాది క్షేత్రములకు గాని వెళ్ళకుము.

చేతనాచేతనములను నియమించువాడు కావున పరమాత్మ యముడు.

అతడే సూర్యమండలమున నుండువాడు గావున వైవస్వతుడు.

ఆనందింపచేయువాడు కావున రాజు.

సర్వనియామకుడు, సూర్యమండలాంతర్వర్తి, ఆనందప్రదుడు నగు పరమాత్మయే సర్వమానవుల హృదయములందుండువాడు. వానితో వివదించుటచేతనే చేసిన అపరాధములకు ప్రాయశ్చిత్తముగా తీర్థయాత్రలకేగుట, పుణ్యనదీస్నానము చేయుట ఆవశ్యకము లగును. అందుచే వానితో వివదింపకుండుటయే చేయదగినపని" అని గురువు ఉపదేశించును.

ఇచట యముడు, వైవస్వతుడు, రాజు అను మూడు పదములలో అందముగా మనకు భగవంతుడేర్పరచిన మూడు భయస్థానములను సూచించెను.

చనిపోయిన తరువాత పై లోకములో యమునిచే బాధపడుదుమని పాపములను ఆచరింపము.

సూర్యుడు ప్రకాశించుచుండగా పగటివేళ పాపము చేయుటకు భయపడుదుము.

ఈ రెంటిని లక్ష్యము చేయనివారు కూడ రాజునకు భయపడి పాపమును చేయకుందురు.

ఈ మూడును భగవత్స్వరూపములే!

ఈ మూటిని లక్ష్యము చేయనివారు కూడ అంతర్యామియగువానికి భయపడుదురు.

కాని వానితో గూడ వివాదము పెట్టుకొని "నేను స్వతంత్రుడను, అంతయు నాదే" అనెడివారు కొందఱుందురు. ఆ వివాదమునే మానవలెను.

భగవంతునితో జీవునకు కల్గు వివాదమును ఒక భక్తుడు అందముగ చిత్రించెను.

"త్వం మేఽహం మే కుతస్తత్తదపి కుత ఇదం వేదమూల ప్రమాణా
దేతచ్చాఽనాదిసిద్ధా దనుభవవిభవాత్తర్హి సాక్రోశ ఏవ

క్వాఽఽక్రోశః?కస్య?గీతాదిషు మమ విదితః కోఽత్రసాక్షీ?
సుధీఃస్యా

ద్ధంత! త్వత్పక్షపాతీ స ఇతి నృకలహే మృగ్యమధ్యస్థవత్త్వమ్."

భగవంతుడు మన నెట్లైనను తనవారినిగా చేసికొనుటకు ప్రయత్నించు చుండును. మనము వానికి దూరముగా నుండుటకే ప్రయత్నించుచుందుము. అట్టిచో భగవంతు డెన్నియో ప్రయత్నముల నొనర్చుచుండును.

భగవంతునకు నిత్యము చేయు అభిషేకము భగవంతునకు మురికి పోవుటకు కాదు. "భగవంతుడు నిరంజనుడు కదా! ఆతనికి మరల మురికి యుండునా? స్నానమెందుకు?" అని సందేహము కల్గినది ఒక భక్తునకు. స్నానము చేయుచున్న భగవన్మూర్తిని జూచి, "ఓహో! స్వామీ, నాతో వివాదము కలిగి ఏ విధముగను జయింప లేక చివరకు ప్రమాణము చేయుటకు స్నానము చేయుచుంటివా?" అని భావించినాడు.

జీవులకు భగవంతునితో కల్గిన వివాదమును చూడుడు.

భగవంతుడు జీవునితో "త్వం మే, నీవు నావాడవు" అనును. జీవు లందరు తనకే చెందినవారు గనుక తనకు దూరమైన వారిని మరల తనవారినిగా చేసికొనుటకు "నీవు నా వాడవు" అని భగవంతుడనును. జీవుడు అవివేకి కదా! పసిపిల్లవలె అన్నమాటయే మరల అనును "నీవు నావాడవు" అనిన "నీవు నావాడవు" అనునని భగవంతు డనుకొనెను.

"భగవంతునికి మనము చెందినవారము" అని యనుకొనినను "భగవంతుడు మనకు చెందినవాడు" అని యనుకొనినను సంబంధము నంగీకరించినవాడే యగును గనుక భగవంతుడు సంతోషించును. "త్వం మే" అని "త్వం మే" అనును, అని భగవంతుడనుకొనెను.

కాని జీవుడు చాల గడుసరి. "త్వం మే" అనిన "అహం మే" అనెను. "నేను నావాడను" అని జీవుడనెను.

భగవంతు డాశ్చర్యపోయెను. "ఈ జగత్తులో ప్రతివస్తువుకూడ నాదే గదా! వీడు "నేను నావాడను" అని అనుకొనుచున్నాడేమి? అని తలచి,"కుతస్తత్" "అది యెట్లు?" అనెను.

జీవుడు "తదపికుతః" "నేను నీవాడనగుట మాత్రము ఎట్లు" అనెను

అపుడు భగవంతుడు "ఇదం వేదమూల ప్రమాణాత్" "వేదములో అట్లు

చెప్పబడి యుండుటవలన" అనెను.

"పతిం విశ్వస్య" "విశ్వమునకంతకు ప్రభువుగా భగవంతునే వేదము పేర్కొనెను" అని ప్రమాణము చూపెను.

జీవుడు "ఏతచ్చ అనాది సిద్ధాత్ అనుభవవిభవాత్" "అనాదిగా నేను నా వాడనని అనుభవించుచున్నాము. మీ లిఖిత ప్రమాణ మెంత గొప్పదో మా అనుభవమంత గొప్పది" అనెను.

భగవంతుడు "హన్త! సాక్రోశ ఏవ" "నీ అనుభవమును ఎప్పటికప్పుడు కాదని చెప్పుచునేయుంటిని గదా" అనెను. ఒకరొక ఇంటినో, భూమినో ఒకరి దానిని అనుభవించుచున్నప్పుడు యజమాని వారి అనుభవమును చెల్లనీయ కుండ తనది యని అప్పుడప్పుడు కోర్టుమూలముగ తెలియచేయుచుండును. ఆట్లే భగవంతుడు కూడ "ఈ విశ్వమంతయు నాది, ఈ జీవులు నావారు" అని తెలియచేయుచుండెను.

జీవుడు "క్వాక్రోశః కస్య?" "ఎక్కడ? ఎవరు చెప్పిరి?" అని యడిగెను.

భగవంతుడు "గీతా దిషు మమ విదితః". "గీత మున్నగు వానిలో నేనే చెప్పితిని" అనెను. వేదములో చెప్పినది కాలదోషము పట్టుచున్నదని మరల భగవద్గీతలో 'మమైవాంశః' జీవుడు నాఅంశము అనియు 'నా పరాప్రకృతి' అనియు భగవానుడే మరల చెప్పెను.

జీవుడు 'మీదని మీరు చెప్పిన సరిపడునా?' "కోఽత్ర సాక్షీ?" "సాక్షి ఎవరు?" అని యడిగెను.

భగవానుడు "సుధీఃస్యాత్" "జ్ఞానులగు వ్యాసపరాశరాదులు సాక్షులు" అనెను. జీవుడు "హన్త! త్వ త్పక్షపాతీ సః" "ఆతడా! మీ పక్షపాతి" అనెను.

"ఇతి నృకలహే మృగ్య మధ్యస్థవత్త్వం" "ఈ విధముగ జీవునకు భగ వంతునికి ఏర్పడిన వివాదములో చివర కేవిధముగను భగవంతుడు జీవుని జయింపలేక ప్రమాణము చేయుటకు స్నానము చేయుచున్నాడా!" అనినట్లుం డెనట.

భగవంతునితో జీవునకు కలుగు వివాదసరణి ఇది.

ఇట్టి వివాదము పడకుండుటయే చాలు. భగవంతుని పొందుటకు, పాపములను పోగొట్టుకొనుటకు ఏమియు చేయనక్కర్లేదు. భగవంతుడు సులభుడు. 'ఆతడే మనకై ఇంత యత్నము చేయుచుండును' అని

ఉత్తమసాంత్వనవచనములను గురువు చెప్పుచుండును.

(5) "సుస్వాగతాం వాచ ముదీరయానః" :-

సు=చక్కగా సంప్రదాయబద్ధముగా, స్వ=తనకు, ఆగతాం=వచ్చిన, వాచం= వాక్కును-మంత్రమును, ఉదీరయానః=చెప్పుచున్నవాడు.

భగవంతునినుండి, లక్ష్మినుండి పూర్వాచార్యపరంపరలో వచ్చిన మంత్రములను శిష్యులకు ఉపదేశించుచుండును. గురుపరంపరాప్రాప్తమగు మంత్రములనే ఉపదేశింపవలెను గాని సంప్రదాయ సిద్ధము కాని మంత్రముల నుపదేశింపరాదు.

(6) "పునః పునశ్చోదయతీవ" :-

మరల మరల శిష్యుని అపమార్గమున పడకుండ ప్రేరణ చేయవలెను.

'స్థాలిత్యేశాసితారమ్' అని అపమార్గమున ప్రవర్తించునపుడు శాసించువాడే గురువు. గీతలో ఒకసారి ఉపదేశించి మరల అర్జునుడు ప్రశ్నించిన 'దుర్మేధా' యని కృష్ణభగవానుడు నిందించును. కాని ఆచార్యుడు శిష్యుని మరల మరల చెప్పి సన్మార్గమున ప్రవర్తింప చేయును గాని విసుగుచెందడు.

(7) హృష్టః :-

శిష్యుడు భగవదనుభవము ననుభవింపగా జూచి యానందించువాడు. తన యనుభవముకంటె శిష్యానుభవమును చూచి గురువు ఎక్కువ ఆనందించును.

ఇట్లు ఈ శ్లోకములో-

"జ్ఞానకర్మలు కలవాడు, వేదాధ్యయన సంపన్నుడు, భగవదను భవజనితానందము ననుభవించునాడు, భగవద్విషయకము లగు సాంత్వన వచనములను పలుకువాడు, ఆచార్య పరంపరాప్రాప్తమగు మంత్రముల నుపదేశించువాడు, సదా శిష్యుని పరిశీలించువాడు, శిష్యానుభవముచే ఆనందించువాడు, గురువుగా నుండదగినవాడు" అని నిరూపింపబడినది. అట్టి ఆచార్యుడు లభించుటయే శుభశకునము.

ఆచార్యస్వరూపు డగు హనుమ చెట్టుపై నున్నాడు అని దీనిచే సూచితమైనగి.

**28** ఆ రాక్షసరాజగు రావణుడు పల్కిన మాటలే సీత మనసున మెదలుచుండెను. ఆతడు పల్కిన అప్రియములైన మాటలకు అడవిలో సింహము పైబడగ, బెదిరిన ఆడ ఏనుగువలె సీత బెదిరిపోయెను.

ఆ రాక్షస స్త్రీలమధ్య రావణుని మాటలకు బెదరినదై వనమున ఒంటరిగా వదలిన బాలికవలె సీత విలపించుచుండెను.

పెద్దలు అకాలమున మృత్యువు రాదని చెప్పినమాట నిజము. ఇంత భయపెట్టబడుచున్నను నేను బ్రతికియే యున్నాను.

సుఖ మేమియు లేకపోయినను, దుఃఖములతోనే నిండియున్నను నా హృదయము ముక్కలగుటలేదు.

ఏమిచేయును? నా తప్పు లేదు. రావణుడెంత ప్రయత్నించినను నా మనస్సు నాతనికి వశము చేయులేను. అతడు నన్ను తప్పక చంపును.

గర్భములో నున్న బిడ్డను సుఖప్రసవము కానపుడు శల్యముతో ఛేదించినట్లు నన్ను ఈ రాక్షసేంద్రుడు తప్పక శస్త్రములతో ముక్కలు చేయును.

చాలకాలమునుండి దుఃఖపడుచున్న నాకు రావణునిచే చంపబడుట కింక రెండుమాసములే గడువు. రాజాపరాధము చేసి బంధింపబడిన తస్కరుని వధించినట్లు నన్ను వధింతురు.

హా రామ! హా లక్ష్మణ! హా సుమిత్ర! హా రామజనని కౌసల్య! గాలికి సుడిలో పడి సముద్రములో మునుగుచున్న పడవవలె నేను మునిగిపోవుచున్నాను.

మృగరూపమును దాల్చి వచ్చిన మృత్యువు బలశాలురగు రామలక్ష్మణులను విద్యుదభిఘాతముచే రెండు సింహములను చంపినట్లు చంపియుండును. మృత్యువే మృగరూపమును దాల్చి వచ్చి నన్ను ఆనాడు లోభపెట్టినది. మూఢురాలనై రాముని తమ్ముడగు లక్ష్మణుని, లక్ష్మణుని అగ్రజుడగు రాముని వదలుకొంటిని."

తత్త్వదీపిక :

ఇచ్చట

"రామానుజం లక్ష్మణపూర్వజంచ" (సుంద. 28-10)

అని రామానుజుడు, లక్ష్మణాగ్రజుడు అని రామలక్ష్మణులను వ్యవహ

రించెను.

ఆచార్యుడు, భగవానుడు-జీవునకు రక్షకులు, మోహముచే వారి నిద్ద అను వదలుకొనిన జీవుడే బంధమున బడును.

గురువును భగవత్సంబంధముతోను, భగవానుని ఆచార్య సంబంధము తోను భావింపవలెను. మహాపురుషుడగు ఆచార్యుని ప్రసాదించినవాడు కావున భగవానుడు మన కారాధ్యుడు. అట్టి భగవానుని చేరుటకు సాయపడెడివాడు కావున ఆచార్యుడు సేవింపదగినవాడు.

ఈ విషయమును గుర్తుచేయుటకు "రామానుజుడు" అని లక్ష్మణుని, "లక్ష్మణపూర్వజుడు" అని రాముని సీత ఇందు భావించెను.

"హే రామ! సత్యవ్రత! హే దీర్ఘ బాహు! పూర్ణచంద్ర సమానవక్త్ర! జీవలోకమునకు హితమును ప్రియమును గూర్చువాడ! నే నీ రాక్షసస్త్రీలచే చంపబడుచున్నానని నీ వెఱుంగవు కదా!

అనన్య దైవత్వ మియం క్షమా చ
భూమౌ చ శయ్యా నియమ శ్చ ధర్మే,
పతివ్రతాత్వం విఫలం మమేదం
కృతం కృతఘ్నే ష్వివ మానుషాణామ్;
మోఘో హి ధర్మ శ్చరితో మయాఽయం" (సుంద.28. 12,13)

రాముడు తప్ప వేరొక దైవమును నే నెఱుంగను. ఓరిమితో నుంటిని. నేలమీద పరుంటిని. నియమముతో ధర్మము నాచరించితిని. పతివ్రతనై యుంటిని. కృతఘ్నులగు మనుష్యుల విషయమున చేసినట్లే రాముని విషయమున చేసిన ధర్మపాలన కూడ వ్యర్థమైనది. రాముని కాంచలేకపోతిని. కలిసెద నని ఆశ కూడ లేదు."

తత్త్వదీపిక :

భగవత్ ప్రాప్తిని కోరి, ధర్మము నాచరించి, ఫలము సిద్ధింపక, బాధ పడుచు, కాలవిలంబనము నోర్వలేక, ఉపాసకులు ఇట్లు బాధపడుచుందురు. చేసిన దంతము వ్యర్థ మనిపించును. సీతమ్మ అట్టి దశను పొందెను.

'తండ్రిగారి యాజ్ఞను నియమముతో పాలించి వనమునుండి మరల పట్టణమున కేగి నేను లేకపోయినను మరికొందఱు స్త్రీలతో రాముడు హాయిగా రమించుచుండును.

రామా! నేను మాత్రము నీయందే కామము కల్గి, నీయందే అనురాగము నుంచుకొని, వ్యర్థమగు తపము నాచరించి, భాగ్యహీననై, నీయందలి ప్రేమ నాకు వినాశమునకే సాయపడగా జీవితమును వీడుచున్నాను.'

విషముతోనో, వాడియైన శస్త్రముతోనో ఇంక వేగముగా ప్రాణములను వదలెదను. నాకిచట విషము నిచ్చువా డెవడు? శస్త్రము నిచ్చువా డెవడు?" అని సీత బహువిధములుగ విలపించి సర్వాత్మనా రామునే స్మరించుచు, వణకిపోవుచు, నోరు ఎండిపోవుచుండ, పూచిన శింశుపా వృక్షమును చేరెను.

శోకముతో తపించిన సీత అనేకవిధముల ఆలోచించి చివరకు జడ ఉరిపోసికొని ప్రాణములను వదలి, యముని సన్నిధి చేరెద నని నిశ్చయించు కొనెను.

సుకుమారగాత్రి యగు సీత అపు డా చెట్టుయొక్క పూచిన కొమ్మను వంచి పట్టుకొని యుండెను.

అట్లు రాముని, రామానుజుని తలంచుకొనుచుండగ శోకమును ఉపశ మింపచేసెడి, ధైర్యమును కల్గించెడి కొన్ని నిమిత్తములు కన్పట్టెను.

**29** చెప్పట కలవికాని దుఃఖము ననుభవించుచున్న, వ్యథనందుచున్న, పతివ్రతయై-హర్షవిరహితయై- దీనమనస్కయైయున్న సీతమ్మకు శుభశకునములు కన్పట్టెను.

ఐశ్వర్యము గలవానిని సేవకులు వచ్చి ఆశ్రయించినట్లు శుభశకునములు ఒకదానిపై నొకటి ఆమెకు పొడచూపెను.

వక్రము లగు పక్ష్మములతో, నల్లనగు తారకతో, సుందరమై, చివరల ఎఱ్ఱగీతలు కల్గి మిగిలిన భాగము తెల్లగా నున్న ఆమె వామ నేత్రము స్పందించెను. ఆమె వామ భుజము కంపించెను. ఏనుగుతొండమును పోలియున్న ఆమె ఎడమతొడ అదురుచు రాము డెదురుగా నున్నట్లే భావింపచేసెను.

నిలచియున్న సీతమ్మయొక్క బంగారురంగు గల చీర కొద్దిగా జారెను.

ఈ నిమిత్తములు ఇంతకు ముందుకూడ ఆమెకు కల్గినవి. బింబఫల మువంటి అధరోష్ఠముగల, అందమైన కన్నులు గల, నల్లని కేశములు గల, తెల్లని పలువరప గల ఆ సీతమ్మ ముఖము రాహువు వీడిన చంద్రునివలె ఆనందముతో నిండెను.

ఎండకు, గాలికి, వాడి కన్పడకుండ పోయిన విత్తనము వర్షముచే మరల

ఉత్తేజము నందినట్లు సీతమ్మ ఆనందము నొందెను.

"సా వీతశోకా వ్యపనీతతంద్రీ
శాంతజ్వరా హర్ష వివృద్ధసత్త్వా
అశోభతార్యా వదనేన శుక్లే
శీతాంశునా రాత్రి రివోదితేన" (సుంద. 29.8)

సీతమ్మ శోకముతొలగినదై, జాడ్యములేనిదై, జ్వరము శమించినదై, హర్షముతో వికసించిన చిత్తముకలదై, సంతోషముతో నిండిన ముఖముతో, ఉదయించిన చంద్రునితో కూడిన రాత్రివలె కాంతివంతమై విలసిల్లుచుండెను.

**తత్త్వదీపిక :**

దీనితో సీతమ్మ దుఃఖము అంతమగుచున్నది. హనుమ బైటికి వచ్చుచున్నాడు. రాక్షసుల నందఱను చంపగల శక్తి కలవాడయ్యు హనుమ చెట్టుయొక్క ఆకులలో దాగి యుండెను. గాని ఇంతవరకు కానరాలేదు.

సీతావిలాపమును, రాక్షసీ తర్జనమును, త్రిజటా స్వప్నవృత్తాంతమును, అంతయు విని చివరకు బైటికి వచ్చును.

ఇది యంతయు ఆచార్యుడు చేయు శిష్యపరీక్ష.

శిష్యునకు ఐదు లక్షణము లుండవలెను.

1. అనన్యసాధ్యత్వము, 2. ఆర్తి, 3. అధ్యవసాయము 4. ఆదరము, 5. అనసూయ

రామునే తప్ప ఇతరులను పొందవలెనను కోరికలేక ఐశ్వర్యమునుగాని, ధనమునుగాని కాంక్షింపక సీతమ్మ ఉండెను. అందుచే--

1. ఆమె సాధ్యాంతరములయందాసక్తి లేనిదై భగవానుడగు రామచంద్రుడే పొందదగినవాడని నిశ్చయముతో నుండెను. ఇది మొదటి లక్షణము.

2. దైన్యముతో, నిరాహారముతో, నేలపై శయనించిఉండుట ఆమె ఆర్తిని తెల్పును. ఇది రెండవ లక్షణము.

3. రాముని పొందనిచో ప్రాణమునైన వీడుదునని చెట్టునకు జడ ఉరిపోసికొని ప్రాణమును వీడుటకు సిద్ధపడుట ఆమె అధ్యవసాయమును తెలియచేయును. ఇది మూడవ లక్షణము.

4. రామకథను హనుమ చెప్పినపుడెంతో ఆదరముతో వినును. ఇది

నాల్గవ లక్షణము.

5. రాముని గుణములయందు రాముడు తనను ఇంతకాలము అలక్ష్యముచేసినను సీతమ్మకు అసూయ ఏర్పడలేదు. అతని గుణములను వర్ణించుచునే యుండెను. ఇది ఐదవ లక్షణము.

ఈవిధముగ ఈ ఐదు లక్షణములు గలవారే శిష్యులుగా ఆచార్యుల అనుగ్రహమును పొందుటకు యోగ్యులగుదురు.

**30** హనుమంతుడు చెట్టుక్రింద జరిగిన వృత్తాంతమునంతను చూచుచు వారి మాటలను వినుచు ఉండెను. చెట్టుక్రింద ప్రాణత్యాగము చేయుటకు సిద్ధముగానున్న సీతమ్మను చూచుచుండెను.

నందనవనములో దేవతవలె ఉన్న సీతాదేవిని జూచి ఈక్రింది విధముగ బహువిధముల యోచించుచుండెను.

"వేలకొలది అనేక వానరులు అన్ని దిక్కులలో ఏ అమ్మను చూడవలెనని వెతకుచున్నారో ఆమె నాకు లభించినది. శత్రువు యొక్క శక్తిని పరీక్షించుచు నీతిగల చారుడు గూఢముగ సంచరించుచు చూడవలసినదాని నంతను నేను చూచితిని.

రాక్షసులయొక్క గొప్పతనమును చూచితిని. లంకాపురిని చూచితిని. రాక్షసాధిపతియగు రావణుని ప్రభావమును గాంచితిని. సర్వప్రాణులయందు సహజముగ దయ కలిగియుండెను అప్రమేయుడగు రామచంద్రుని భార్యను, భర్తృదర్శనమును కాంక్షించుచున్న యామెను, నే నిపుడు ఓదార్చుట న్యాయము.

దుఃఖములనెన్నడు ఎఱుగనిది, అంతములేని దుఃఖములో పడి ఆర్తురాలై యున్నది అగు ఈ పూర్ణచంద్రాననను నేను ఓదార్చెదను. శోకోపహతురాలగు ఈ దేవిని, నే నోదార్చకుండ వెనుకకు పోవుట దోషమగును. నేను వెళ్ళగనే రక్షించువారెవ్వరు లేక పోవుటచే జానకి ప్రాణములను వీడును. నే నీమెతో మాటాడి సీతాదర్శనమునకై త్వరపడుచున్న రాముని ఓదార్చవలెను.

అమ్మతో మాటాడుట ఎట్లు? రాక్షసస్త్రీల ముందు మాటాడుట తగదు. తెల్లవారక మునుపు మాటాడి యోదార్చకపోతినా ఈమె తప్పక జీవితమును విడిచిపెట్టును. నేను వెళ్ళిన తరువాత 'సీతమ్మ ఏమనిన' దని రాముడు నన్నడిగినచో ఆమెతో మాటాడకుండ ఏమి చెప్పుదును?

సీతమ్మ చెప్పిన సందేశమును తీసికొనిపోకుండ తొందరగా వెనుకకు వెళ్ళినచో తీవ్రమైన కోపముతో రాముడు నన్ను దహించును.

మా సుగ్రీవుని ప్రేరణచేసి రాముని ఇచ్చటకు తీసికొనివచ్చిన వారి రాక వ్యర్థమగును. సంతాపముతో నిండియున్న ఈమెను సమయము చూచికొని మెల్లగ ఓదార్చెదను.

నేను పెద్ద శరీరము కలవాడను. వానరుడను. మనుష్యవాక్యాన మాటాడుదును.

వానరుడు బ్రాహ్మణునివలె మనుష్యవాక్కులో మాటాడుచున్నాడని రావణునిగా తలంచి సీతమ్మ భయపడును. వానరుడనగు నేను ఆమెతో మాటాడుట మనుష్యభాషలో తప్ప మరియొక భాషలో కుదురదు. మనుష్యభాషలోనే మాటాడవలెను. మరియొక విధముగ ఆమెను ఓదార్చుట కుదరదు.

నా వానరరూపమును, మనుష్యభాషణమును జూచి, రాక్షసులకు భయపడిన ఈమె మరింతగా భయపడును. భయపడి కామరూపుడగు రావణుడే అని భావించి కేకలువేయును. ఆమె శబ్దముచేయగనే మృత్యుసమానులగు రాక్షసులు నానావిధములగు ఆయుధములను దాల్చి చుట్టుముట్టెదరు. నన్ను వారు పట్టుకొని చంపుటకు యత్నింతురు. చెట్లను కొమ్మలను చెట్ల మొదళ్ళను పట్టుకొని పరుగెత్తుచున్న నన్ను చూచి వారు భయముతో శంకితులగుదురు. అడవిలో తిరుగుచున్న నా భయంకరమగు రూపమును జూచి రాక్షస స్త్రీలు భయముచే చెదరిపోవుదురు. వారు రాక్షసుల నాహ్వానింతురు.

రావణ భవనములో నున్న రాక్షసులు శూలము, శక్తి, ఖడ్గము మున్నగు ఆయుధములను దాల్చి వేగముగా నాపై పడుదురు. నన్ను చుట్టుముట్టి వారు అరికట్టగ నేను వారితో యుద్ధముచేయుదును.

కాని సముద్రమును దాటి అవతలి ఒడ్డునకు వెళ్ళలేనేమో! వారు నాపై పడి నన్ను పట్టుకొని బంధింతురు. నేను వచ్చిన పని చెడును. పట్టుబడుటయు జరుగును.

లేదా హింసాస్వభావులగు రాక్షసులు ఈ సీతమ్మనే హింసింపవచ్చును.

అట్లయినచో రామసుగ్రీవుల కార్యమే చెడును. సాగరముచే ఆవరింపబడిన, రాక్షసపరివారితమైన, దారి తెలియని ఈ ప్రదేశమునందు సీతమ్మ దాచబడి యున్నది.

ఆమె జాడ వెతెంగిన నేను పట్టుబడుట గాని మరణించుటగాని జరిగినచో రామునికి కార్యసాధనములో సాయపడువాడు మరియొక డెవ్వడు లేడు. ఆలోచించినచో నేను చనిపోయినచో ఈ నూఱు యోజనములు విస్తీర్ణముగల సముద్రమును దాటగల వానరుడు కానరాడు.

వేలకొలది రాక్షసులవైనను నేను చంపగలను. కాని సముద్రముయొక్క ఆవలియొడ్డును చేరలేను.

యుద్ధమే సంభవించినచో యుద్ధమున జయాపజయములు అనిశ్చితములు. సంశయము లేకుండ జరిగెడి కార్యమును ప్రాజ్ఞుడు సంశయముగల దానినిగా చేయరాదు.

నే నిపుడు మాటాడకున్నచో సీతమ్మ ప్రాణత్యాగముచేయుట తథ్యము. వానరరూపముననే ఎదుట నిల్చి మాటాడినచో వెనుక చెప్పిన ప్రమాదమంతయు సంభవించును.

"భూతాశ్చార్థా వినశ్యన్తి దేశకాల విరోధితాః
విక్లబం దూత మాసాద్య తమ స్సూర్యోదయే యథా
అర్థా నర్థాన్తరే బుద్ధిః నిశ్చితాపి న శోభతే
ఘాతయన్తి హి కార్యాణి దూతాః పండితమానినః."

(సుంద. 30-37, 38

"సిద్ధమైన కార్యములు గూడ దేశకాల విరుద్ధముగా చేసెడి అవివేకియగు దూతచేతిలో పడినచో సూర్యుడుదయించుసరికి చీకటి విడిపోవునట్లు చిందరవందరయై పాడైపోవును. స్వామియు మంత్రులును కలసి ఆలోచించి ఇది అర్థము, ఇది యనర్థము అని నిశ్చయించినను అవివేకియగు దూతయున్నచో వారి యాలోచన ఫలింపదు. తానే పండితుడనను కొనెడి దూతలు కార్యములను పాడుచేయుదురు."

అందుచే కార్యము చెడకూడదు. నేను బుద్ధిహీనుడననిపించుకొనకూడదు. సముద్రలంఘనము వ్యర్థము కాకూడదు.

ఇన్నింటికి తగినట్లు సీతమ్మతో మాట్లాడవలెను. ఎట్లు మాటాడవలెను? ఏమి మాటాడవలెను? ఏమాట మాటాడిన ఆమె బాధపడక వినునో అట్టిమాట మాటాడవలెను."

అని ఆలోచించి బుద్ధిమంతుడగు హనుమ ఇట్లు నిశ్చయముచేసికొనెను.

సీతమ్మ మనసు సంతతము బంధువగు రామచంద్రుని యందే ఉండును. అందుచే రాముని కీర్తించిన ఆమె బెగడొందక వినును.

ఇక్ష్వాకువంశ శ్రేష్ఠుడగు రామునిగూర్చి ధర్మయుక్తములు, శుభములు, మధురములునగు వాక్యములను విన్పించెదను. నేను పల్కెడి మధురమైన వాక్కును విని ఈమె తప్పక నన్ను నమ్మును.

*"ఇతి బహువిధం మహానుభావః*
*జగతిపతేః ప్రమదా మవేక్షమాణః*
*మధుర మవితథం జగాద వాక్యం*
*ద్రుమవిటపాన్తర మాస్థితో హనుమాన్"*

చెట్ల కొమ్మల మధ్యలో కూర్చుండిన హనుమ జగతీపతియగు రామచంద్రుని భార్యను జూచుచున్నవాడై అనేక విధములుగ ఆలోచించి మధురము, సత్యమునగు వాక్యములను పల్కెను. రామకథ మధురము, అవితథము చెవికింపైనది, సత్యమైనది.

**తత్త్వదీపిక :**

ఇందు కల్పితమైనది ఏ ఒక్క అంశము ఉండదు. హనుమ పల్కుచున్నది. రామకథయే కాదు. వాల్మీకి నోటినుండి వచ్చిన రామాయణము కూడ మధురము, అవితథము. బాహ్యముగ కావ్యముగ మధురము. అంతరముగ ఉపనిషదర్థప్రతిపాదకమై సత్యమైనది. అవితథము.

**31** *"ఏవం బహువిధాం చింతాం చింతయిత్వా మహాకపిః*
*సంశ్రవే మధురం వాక్యం వైదేహ్యా వ్యాజహార హ."*
(సుంద. 31-1)

ఈవిధముగ హనుమ అనేక విధములుగ ఆలోచనలనుచేసి సీతమ్మకు బాగుగ వినపడునంత దగ్గరలో చెవిని పడినంతనే మనసు సంబంధములేకయే ఆనందము కల్గించెడి వాక్యమును దేహమునందు నిస్ప్రుహ కలదియగు సీతమ్మకు దేహము నొసంగి విననట్లుచేసి హనుమ విన్పించెను.

**తత్త్వదీపిక :**

చనిపోవుచున్న సీతమ్మకు మరల ప్రాణమును పోసిన దీ రామకథ. దేహమునందు నిస్ప్రుహకల్గి దేహము తనది కాదని వదలిన సీతమ్మకు మరల

దేహమునందు మమతను పెంచిన దీ రామకథ.

మనసుయొక్క సహకారము అక్కరలేకయే చెవిలో పడినంతమాత్రము ననే ఆనందము నిచ్చునది రామకథ.

అందుచేతనే పూర్వులు--

"మృతసంజీవనం రామచరితం" -- అనిరి.

ఇందు "సంశ్రవే మధురం" అనునది రామకథయొక్క వైభవమును ప్రక టించుచున్నది. సీతమ్మ మనసు ఇంద్రియములతో కలసియుండలేదు. మనసు ఇంద్రియములద్వారా ప్రసరించి శబ్దమును గ్రహించిననాడు గాని ఆనందము కలుగదు. కాని రామకథ మనసుయొక్క సంబంధ మక్కరలేకయే చెవిలో పడినంతమాత్రముననే ఆనందమును కల్గించును.

కథయంతయు వినిన తరువాత, పూర్వాపర నిరూపణముచేసిన తరు వాత లోకములోని కథలు ఆనందమును కల్గించును.

కాని రామకథలో "వాక్యం మధురం" ఏ వాక్యమున కా వాక్యమే మధురము.

ఇపుడు సీత 'వైదేహి'యై యుండెను. ఇందు తరచుగా సీతను వైదేహి యనుచుండును. విదేహ రాజపుత్రి అని యర్థము. ఆ వంశముయొక్క ప్రభావముచే దేహమునుకూడ లెక్కచేయక వదలిన దశలోనున్నది సీతమ్మ. దేహభావము లేకయున్నది. అట్టి స్థితిలో నున్న ఆమెకు ముందు దేహభావము కల్గించినగాని మాటాడినను లాభములేదు. ఆమెకు విన్పడదు. అందుకై హనుమ 'వ్యాజహార' = పలికెను'.

ఇచ్చట "ఆజహార", "వ్యాజహార" అని రెండుగా క్రియాపదములను భావించుకొనవలెను. 'ఆజహార = తెచ్చెను; వ్యాజహార = పలికెను.' హనుమ శరీరభావము లేని సీతకు శరీరమును తెచ్చెను-- శరీర భావమును కల్గించెను. రామకథను పల్కెను.

రామకథలోని గొప్పతనము శరీరమును విల్పును, చెవి కింపగును, మన స్సును తృప్తిపరచును, ఆత్మ నానందింపచేయును.

ఇట్టి విచిత్రమగు శక్తికల రామకథను హనుమ పలుకుచున్నాడని వాల్మీకి ముగ్ధుడై "హ" అనెను.

ఇది ఆశ్చర్యమును సూచించును.

రామాయణమున వాల్మీకి "హ" అను అక్షరమును ప్రయోగించినపుడెల్ల అచ్చట అద్భుతమైన సన్నివేశమున్నదని గ్రహింపవలెను. కేవలము పాదపురాణ మునకు "హ" అను అక్షరమును వాల్మీకి ప్రయోగింపడు. దీనికి అనేకములగు దృష్టాంతములను రామాయణమునుండి చూపవచ్చును. ఒకటి చూపెదను చూడుడు.

దండకారణ్యమున సీతారామలక్ష్మణులు ప్రవేశించి నడచునపుడు ముందు రాముడు, మధ్య సీత, వెనుక లక్ష్మణుడు నడచుచుండిరి.

"అగ్రతః ప్రయయౌ రామః మధ్యే సీతా సుమధ్యమా,
పృష్ఠతస్తు ధనుష్పాణిః లక్ష్మణో ఽనుజగామ హ."
(అర. 11.1)

"ముందు రాముడు ఏగుచుండెను. మధ్యలో సుమధ్యమయగు సీత నడచుచుండెను. వెనుక ధనుష్పాణియగు లక్ష్మణుడు నడచుచుండెను."

అని శ్లోకమును పూర్తిచేయక చివర "హ" అనెను. ఇందేదో విచిత్రమైన సన్నివేశమున్నదని పెద్దలు పరిశీలించిరి.

రామ సీతా లక్ష్మణులు ఓమ్ కారములోని మూడక్షరములగు 'అ' 'ఉ' 'మ్' అనునవే నడచుచున్నవిగా వాల్మీకి భావించెను.

అకారము రాముడు, ఉకారము సీత, మకారము లక్ష్మణుడు.

అకారము విష్ణువాచకము; రాముడు శ్రీమహావిష్ణువు.

ఉకారము లక్ష్మీవాచకము; సీత లక్ష్మీస్వరూపిణి.

ఆ అర్థమును సూచించుటకే సీతను 'సుమధ్యమ' అనిరి.

జీవునకు, పరమాత్మకు సమాగమమును కల్పించునది మధ్యవర్తినియగు జగన్మాత సీత.

మకారము జీవుని తెలియచేయును.

మకారము జ్ఞానవాచకము. జ్ఞానస్వరూపుడు జీవుడు.

ఆతని చేతియందు సంతతము ధనుస్సుండును. అందుకు లక్ష్మణుని 'ధనుష్పాణి' యనిరి.

జీవుడు సంతతము ధరించవలసినది ప్రణవము.

ప్రణవమే ధనుస్సని ఉపనిషత్తు చెప్పుచున్నది. అందుచే "అకార ఉకార మకారము"లు నడచి వెళ్ళుచున్నట్లు వాల్మీకికి కన్పించెను.

దానిని జూచి ప్రణవ జపము చేయుచున్న ఋషుల ననుగ్రహించుటకు ప్రణవార్థమే నడచి వెళ్ళుచున్నది అని వాల్మీకి ఆశ్చర్యపడి "హ" అనెను. ఇట్లు "హ" అను నక్షరము వచ్చిన స్థలములందంతటను ఏదో ఒక విచిత్ర సన్నివేశముండును.

హనుమ చెట్టుమీదినుండి రామకథను చెప్పుట కారంభించెను.

*"రాజా దశరథో నామ రథకుంజర వాజిమాన్"*

(సుంద. 31-2)

"రథములు, ఏనుగులు, గుఱ్ఱములు అధికముగా గలవాడు, పుణ్యశీలుడు, మహాకీర్తి అగు దశరథుడను రాజు ఉండెను. ఆతడు గుణములచే రాజర్షులలో శ్రేష్ఠుడు, తపస్సుచే ఋషులతో సమానుడు, అహింసాశీలుడు, దయాళువు, సత్యపరాక్రముడు, భూమండలమంతయు వ్యాపించిన కీర్తిగలవాడు, ఇతరులకు సుఖమును కల్గించితాను సుఖము ననుభవించువాడు."

అట్టి దశరథుని జ్యేష్ఠపుత్రుడు, చంద్రుని పోలిన ముఖము కలవాడు రాముడు. సర్వధనుర్ధరులలో శ్రేష్ఠుడు.

*"రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా,*
*రక్షితా జీవలోకస్య ధర్మస్య చ పరంతపః."* (సుంద.31-7)

'రాముడు తన ధర్మమును తాను రక్షించుకొనువాడు. తనవారిని రక్షించువాడు. జీవలోకము నంతను రక్షించువాడు. ధర్మమును రక్షించువాడు.'

తత్త్వదీపిక :-

ఈ శ్లోకము సంక్షేపరామాయణమునను, మరల ఇచ్చుటను కూడ వచ్చును.

ఇది రాముని స్వభావమును నిరూపించునది.

రామునికి ప్రధానమైన లక్షణము రక్షకత్వము. రాముడు భగవదవతారము.

భగవదవతారమునకు ప్రయోజనము సాధురక్షణము, ధర్మరక్షణము. దానిని చేయువాడని తెలియుచున్నది.

రాజుగా రాముడు రక్షకుడు. అట్లు రక్షించుటలో ముందుగా తన ధర్మ

మును రాజు రక్షించుకొనవలెను. తన ధర్మమును రక్షించుకొనకుండ ఇతరుల ధర్మమును రక్షింప జూచువాడు రాజుగా నుండుటకు తగడు.

అందుచే ముందుగా తన ధర్మమును రక్షించుకొనువాడని పేర్కొనిరి.

రెండవది స్వజనమును రక్షించుట. తన దేశములో నున్న ప్రజలను రక్షింపనినాడు ప్రజల అనురాగము చెడి రాజుయొక్క రాజత్వమే పోవును.

రక్షణ మనగా ఆపదలను తొలగించుట, అభిమతమును సమకూర్చుట. ఇది తన ప్రజలకు చేయువాడు రాజు.

మూడవది జీవలోక రక్షణము. రాజు సర్వభూతహితుడై వర్తింపవలెను. తన వారిని కాపాడుచున్నంత మాత్రమున ఇతరులను నశింపచేయుటకు యత్నింపరాదు. కేవలము ప్రజలనే కాక జీవకోటి నంతను కాపాడుట రాజు బాధ్యత.

నాల్గవది ధర్మరక్షణము. ప్రజ లందఱును వారి వారి ధర్మముల నాచరించునట్లు జూచుట రాజు యొక్క బాధ్యత.

ఇట్లు చతుర్విధముగా రక్షణమును సాగించురాజు శ్రీరాముడు.

ఇక పరమాత్మగా శ్రీరాముడు రక్షకుడు.

పరమాత్మకు ప్రధాన లక్షణము. 'అ' కారము పరమాత్మకు పేరు. 'అవరక్షణే' అను ధాతువునుండి 'అ' అను నక్షరము వచ్చినది.

'అ' అను నక్షరము అన్ని యక్షరములకు ముందున్న అక్షరము. సర్వ వాఙ్మయమునకు అది మూలము. సర్వ పదార్థములకు శ్రీమహావిష్ణువు కారణము. అందుచే అకారమునకు విష్ణువు అర్థమైనాడు.

సర్వజగత్తునకు కారణమైనవాడు, సర్వజగత్తునకు రక్షకుడైన వాడు 'అ' కారముచే తెలియచేయబడును.

అందుచే ఈశ్లోకము పరమాత్మగా రక్షకుడైన రాముని స్వభావమును తెలియజేయుచున్నది.

జగత్తున కంతకు నిరుపాధిక రక్షకుడు సర్వేశ్వరు డొక్కడే. మిగిలినవా రెవ్వరును అందఱకును అన్నివేళల రక్షకులు కాలేరు. అందుచే ఆపదలను తొలగించువాడు, ఇష్టమును సంపాదించువాడు సర్వేశ్వరుడొక్కడే! కావున రక్షకుడను పదము సర్వేశ్వరుని కొక్కనికే చెందును.

అట్టి రక్షకత్వము నిందు వివరించుచున్నారు.

శరణాగతుని రక్షించుట పరమాత్మ ధర్మము. ఆ స్వధర్మమును రక్షించువాడు పరమాత్మ. పరమాత్మకు స్వజనము జ్ఞానులు.

"జ్ఞానీ త్వాత్మైవ మే మతం"

అని పరమాత్మ చెప్పెను. అట్టి స్వజనమును రక్షించువాడు పరమాత్మ. విశేషరక్షణము స్వజనము విషయమున నుండునుగాని జీవలోకమంతయు పరమాత్మ అధీనమైయే నిలచుచున్నది, నడచుచున్నది. అందుచే జీవలోక రక్షకుడు పరమాత్మ. సూర్యునికి అగ్నికి ప్రకాశము, అగ్నికి దాహకత్వము మున్నగు ధర్మములు కూడ పరమాత్మాధీనములే. అందుచే ధర్మరక్షకుడు పరమాత్మ. ఇట్లు పరమాత్మయొక్క రక్షకత్వము ఇందు వివరింపబడినది.

అట్టి రాముడు సత్యప్రతిజ్ఞుడగు తండ్రియొక్క మాటవలన భార్యతో, సోదరునితో రాజ్యమును వీడి వనమున కేగును.

అచట మహారణ్యమునందు మృగమువెంట వేటకై రాముడేగి అనేకమంది కామరూపులగు రాక్షసులను సంహరించెను. జనస్థానమందు రాక్షసులను రాముడు సంహరించెనని, ఖర దూషణులను చంపెనని, తెలిసి రావణుడు అమర్షముచే మాయతో మృగరూపమున నున్న రాక్షసునిచే రాముని వంచించి జానకిని అపహరించెను.

రాముడు అడవిలో ఆ సీత నన్వేషించుచు వచ్చి సుగ్రీవుడను వానరుని మిత్రునిగా చేకొనెను. వాలిని చంపి కపిరాజ్యమును సుగ్రీవున కొసంగెను. సుగ్రీవునిచే ఆజ్ఞాపింపబడిన కామరూపులగు వానరులు అన్నిదిక్కులయందును సీతకై అన్వేషించుచున్నారు. సంపాతి మాటలవలన నూఱు యోజనముల సముద్రమును ఈ సీతమ్మ కొఱకు దాటి వచ్చితిని."

"యథా రూపాం యథా వర్ణాం యథా లక్ష్మీం చ నిశ్చితాం
అశ్రౌషం రాఘవస్యాహం సేయ మసాదితా మయా."

(సుంద.31-11)

"ఎటువంటి రూపముతో, ఎటువంటి రంగుతో, ఎటువంటి కాంతితో సీతమ్మ యుండునని రామునివలన నేను వింటినో అట్టి సీతను నేను చూడగల్గితిని."

ఇట్లు చెప్పి వానరపుంగవు డగు హనుమ ఊరకుండెను.

జానకి హనుమ చెప్పిన ఆ కథను విని, పరమాశ్చర్యమునందెను.

తత్త్వదీపిక :-

హనుమ కథ చెప్పుటలోని యుక్తిని చూడుడు.

సీతమ్మకు తెలిసిన కథను ముందు వివరించి ఆమె ఎఱుగని రామ సుగ్రీవమైత్రిని, సీతాన్వేషణమును, సాగరలంఘనమును, సీతాదర్శనమును వర్ణించెను.

తెలిసిన కథనుబట్టి తెలియని కథ కూడ నిజమని నమ్మవలసివచ్చెను.

ఆమెకు విశ్వాస మేర్పడునట్లు కథను వివరించెను. అపుడు సీత సంస్కారహీనమై, వ్రేలాడుచున్న కేశములచే ఆవరింపబడియున్న ముఖమును పైకెత్తి భయపడుచు శింశుపావృక్షమును చూచెను.

ఆ వానరుని మాటలను విని సీతమ్మ అన్నిదిక్కులకు, మూలలకు చూచి రామకథ వినుటచే రామునే స్మరించుచు అధికమగు ఆనందము నొందెను.

ప్రక్కలకు, మీదకు, క్రిందకు చూచుచు అచింత్య మగు బుద్ధి వైభవము గల వానర రాజునకు అమాత్యుడు, వాయుదేవునకు పుత్రుడగు హనుమను ఉదయపర్వతముపై సూర్యోదయమునకు ముందుదయించిన అరుణునివలె దర్శించెను.

**32** తరువాత కొమ్మలమధ్యన మరుగుపడియున్న హనుమను చూచి ఒక్కసారి ఆమె మనసు చలించెను.

ఆతడు తెల్లని వస్త్రమును దాల్చి యుండెను. మెరుపుల రాశివలె పచ్చగ నుండెను. పూచిన అశోకముల గుత్తివలె నున్న వాడును పచ్చని బంగారు పోలిన కన్నులు గలవాడును, ప్రియమును పల్కిన వాడును అగు ఆ వానరుని సీతమ్మ చూచెను. చూచి పరమాశ్చర్యము నందెను.

"ఏమి ఈ వానరుని రూపము? చూచుటకు శక్యముగాకుండ నున్నదే!" అనుకొని మరల ఆమె మూర్ఛపోయెను.

ఒక్కసారి తెలివితెచ్చుకొని జాలికల్గునట్లు భయముతో "రామ! రామ! లక్ష్మణ!" అని అధికముగ విలపించెను. మందస్వరముతో మందముగా వెక్కుభంగుల ఏడ్చెను.

ఆ వానరశ్రేష్ఠుడగు హనుమ వినయముకలవానివలె చేతులు జోడించుకొని చెట్టుపై నుండెను. వానిని చూచి సీత కల యనుకొనెను. వక్రమైన ముఖము గల ఆ హనుమ రూపము ఆమె మరల చూచెను. చూచిన వెంటనే

తెలివితప్పి ప్రాణములే పోయినట్లాయెను.

మరల తెలివి తెచ్చుకొని --

"శాస్త్రములలో కలలో కోతిని చూచుట దోషమని చెప్పబడినది. లక్ష్మణునితో రామునకు, మా తండ్రి యగు జనకునకు మంగళ మగుగాక! ఇది స్వప్నము కాదు. కలవచ్చుటకు నేను నిద్ర పోవుట లేదు. శోకముతో దుఃఖముతో పీడింపబడుచు ఆ రామచంద్రునికి దూరముగా నున్న నాకు సుఖములేదు. నిద్ర ఎట్లు వచ్చును? 'రామ రామ' యని ఎల్లప్పుడు రామునే మనసులో ఆలోచించుచు నోటితో దానిని పల్కుచుండుటచే దానికి తగిన కథ విన్పడి యుండును. ఇట్టి రూపము కన్పడి యుండును. మనసులో సంతతము రామ విషయక మగు ప్రేమచే పీడింపబడుచున్న దాననై, రాము నియందే సర్వభావములు నిల్పుకొని, ఆ రామునే ధ్యానించుచుండుటచే ఇట్టి రూపము కన్పడి యుండును. అట్టి మాటలు విన్పడి యుండును. నా కోరికకు తగినట్లుగా నా బుద్ధిలోని ఊహల కనుగుణముగా ఈ రూపము కన్పడుచున్నది అనుకొనుటకు వీలులేదు. బుద్ధిచే ఊహించినదానికి రూప ముండదు. ఈతడు స్పష్టమైన రూపముతో నా యెదుట మాటాడుచున్నాడు" అని ఆలోచించెను.

"నమోఽస్తు వాచస్పతయే సవజ్రిణే
స్వయంభువే చైవ హుతాశనాయ చ
అనేన చోక్తం యదిదం మమాగ్రతో
వనౌకసా తచ్చ తథాస్తు నాన్యథా." (సుంద.32-14)

"వాచస్పతికి, ఇంద్రునకు నమస్కారము. బ్రహ్మకు, అగ్నికి నమస్కారము. ఈ వానరుడు ఏమాటలను చెప్పినాడో అవి యన్నియు సత్యమగుగాక! వేరొకవిధముగా కాకుండ గాక!" అని సీత దేవతా బృందమును ప్రార్థించెను.

**33** పగడమువలె ఎఱ్ఱనైన ముఖము గల హనుమ వినయముతో, దైన్యముతో నమస్కరించుచు ఆ చెట్టు కొమ్మల పైభాగము నుండి క్రిందకు దిగి ఆమెకు దగ్గరగా వచ్చెను. హనుమ శిరస్సుపై అంజలిని ఘటించి మధుర మైన వాక్కుతో-

"అమ్మా! తామరపూవుల రేకుల బోలిన కన్నుల గలదానా! నలిగిన పట్టుబట్ట దాల్చినదానా! చెట్టుకొమ్మను పట్టుకొని నిలచి యుంటివేల? నీ వెవరవమ్మా? తామరపూవు రేకునుండి నీరుజారినట్లు నీ నేత్రముల నుండి

శోకముచే కన్నీరు రేల కారుచున్నదమ్మా? దేవతలకు, రాక్షసులకు, నాగజాతికి, గంధర్వజాతికి, యక్షజాతికి, కిన్నెర జాతికి చెందినదానవా నీవు?

నీ వెవరవో దేవతవలె కన్పట్టుచున్నావు. రుద్రులకు, మరుత్తులకు, వసువులకు చెందినదానవా?

నక్షత్రములలో శ్రేష్ఠ యగు రోహిణివా? చంద్రుని విడచి దేవలోకము నుండి ఈ భూలోకమున పడితివా?

కోపమువలన గాని, మోహమువలన గాని వసిష్ఠుని కోపగింపజేసి ఈ భూలోకమునకు దిగి వచ్చిన అరుంధతివి కావు గదా!

ఆ స్వర్గమునుండి ఈ మనుష్యలోకమునకు దిగి వచ్చి ఆ లోకమున నున్న పుత్రుడు, పిత, సోదరుడు, భర్త మున్నగువా రెవరికొఱకైన శోకించు చుంటివా! అట్టివా రెవరు యుందురు?

ఏడ్చుచుండుటవలన, ఎక్కువగా నిట్టూర్పులు విడచుచుండుట వలన భూమిని స్పృశించి నిలచుటవలన, రాజలక్షణములు కాన్పించుటవలన నీవు దేవతా స్త్రీవి కావని అనుకొందును.

నీ యవయవములను, నీ లక్షణములను చూచినచో ఎవరో ఒక రాజు యొక్క పట్టపురాణివో, రాజకన్యవో అయి యుందువని నాకు తోచుచున్నది.

అమ్మా! జనస్థానమున రావణునిచే బలాత్కారముగ అపహరింపబడిన సీతవు నీవు కావు కదా? అట్లయినచో చెప్పుము. నీ దైన్యము నీ అతిమానుష మగు రూపము, తపసును సూచించుచున్న నీ వేషము, చూచినచో నీవు రాముని దేవివై యుందువని నిశ్చయముగా తోచుచున్నది" అని పలికెను.

హనుమ పల్కిన రామప్రసంగముచే సంతుష్టయై ఆతని మాటలను విని చెట్టుమీద నున్న హనుమంతుని చూచి వైదేహి ఈ విధముగ పలికెను.

"పృథివ్యాం రాజసింహానాం ముఖ్యస్య విదితాత్మనః
స్నుషా దశరథస్యాహం శత్రుసైన్య ప్రతాపినః
దుహితా జనకస్యాహం వైదేహస్య మహాత్మనః
సీతా చ నామ నామ్నాహం భార్యా రామస్య ధీమతః."

(సుంద. 33-15, 16)

"భూమండలములో రాజులలో ప్రధానుడు, ప్రసిద్ధుడు, శత్రుసైన్యమును

తపింపచేయువాడు అయిన దశరథుని కోడలను. మహాత్ముడు, విదేహాధిపతి అగు జనకుని కుమార్తెను. నా పేరు సీత, ధీమంతుడగు రాముని భార్యను."

తత్త్వదీపిక :-

ఇందు స్త్రీ తనను గూర్చి చెప్పుకొనినపుడు ఎట్లు చెప్పవలెనో సీతమ్మ సూచించెను.

ముందుగా భర్త పేరు, తన పేరు చెప్పుట సంప్రదాయము కాదు.

ముందుగా మామగారి పేరు చెప్పి 'వారి కోడలను' అనవలెను. తరువాత తండ్రి పేరు, తరువాత తన పేరును, భర్త పేరును చెప్పవలెను. ఇది భారతీయ సంప్రదాయమును సూచించును.

అమ్మ ఎంత శాంతస్వభావయైనను లంకలో బంధింపబడిన తనను రాముడింతకాల ముపేక్షించినాడే యని భర్తపై కొంచెము కినుక కల్గినట్లు ఈ చెప్పుటలో గోచరించుచున్నది.

"శత్రుసైన్యములను తపింపచేయు మా మామగారే ఉన్నచో ఇంతకాలము న న్నీ లంకలో ఉండనిచ్చునా?" అను కినుక నావిష్కరించుచున్నట్లు ఒక శ్లోకము మామగారినిగూర్చి చెప్పెను.

తండ్రియైన జనకుడు ఊరకుండుట న్యాయమే! ఆతడు మహాత్ముడు. దేహ సంబంధులపై మమత లేనివాడు. అందుచే తండ్రి ఊరకుండుట సహజమే! "వైదేహస్య మహాత్మనః" అని చెప్పెను.

తనను రక్షించుకొనుటకు తనకు శక్తి కలదు. సీత అయోనిజ. అందుచే దివ్యమైన శక్తి యుండును.

కాని "భార్యా రామస్య ధీమతః" రాముని భార్యను గనుక రాముడే రక్షింపవలెను గాని నన్ను నేను రక్షించుకొనకూడదు కావున 'రాముడు' అను పేరు సార్థకము. ఆత డానందమును కల్గించువాడు. అయినను నా ఎడల సార్థకము కాలేదు. ఆతడు ధీమంతుడు. భార్యను భర్తయే రక్షింపవలెనని ఎఱుంగడా? కాని నా ఎడల ఆ జ్ఞానము పనిచేయలేదు. ఇట్లు ఈ శ్లోకములో "రాముడు తనను రక్షించలేదే!" అనెడి ఆక్రోశము కన్పట్టుచున్నది.

ఆధ్యాత్మికముగ ఈ చెప్పుటలో ఒక రహస్యము గోచరించుచున్నది.

ఎవరైనను తమను గూర్చి చెప్పుకొనినపుడు ఈ శరీర సంబంధము కంటె ముందుగా ఆత్మసంబంధమును చెప్పవలెను.

శరీరము నొసంగువాడు తండ్రి. ఆంతరముగ ఆత్మస్వరూపము నొసంగువాడు గురువు.

ఇచ్చట దశరథుడు గురుస్థానీయుడు. జనకుడు జన్మనిచ్చిన తండ్రివంటి వాడు.

భగవానునకు తండ్రి గురువు. గురువు మంత్రము ద్వారా భగవంతుని ప్రకటించును. అట్టి మంత్రము నొసంగిన గురువును ఇచట మామగారుగా పేర్కొనెను.

తరువాత శరీరము నొసంగిన తండ్రిని చెప్పవలెను. తరువాత ఆత్మస్వరూపమును ప్రకటింపవలెను.

ఆత్మస్వరూపము పరతంత్రము, భగవంతునికి శేషభూతము. ఈ రెండిటిని 'సీతా', 'భార్యా' అను రెండు శబ్దములచే సూచించెను.

జీవుడు పరమాత్మకు పరతంత్రుడు. సర్వవ్యాపారములయందు పరమాత్మయొక్క అతిశయమునకే ప్రవర్తించువాడు.

తరువాత భగవత్స్వరూపమును ప్రకటింపవలెను.

"రామస్య ధీమతః" ఆనందము నిచ్చువాడు, ఆనందము కలవాడు, జ్ఞానము కలవాడు పరమాత్మ అని "రామస్య ధీమతః" అనుటచే సూచింపబడినది.

ఇట్లు జీవుడు ఆత్మస్వరూపము నెఱింగినవాడు తనను నివేదించుకొను విధానమును ఇందు సీత నిరూపించెను.

"నేను మామగారి ఇంట పన్నెండు సంవత్సరములు మనుష్యులు అనుభవించిన భోగము లన్నింటిని అవిచ్ఛిన్నముగ అనుభవించితిని. పదమూడవ సంవత్సరమున దశరథమహారాజు రామునకు పట్టాభిషేకము చేయవలెనని సిద్ధపడెను.

పట్టాభిషేకమునకు ఏర్పాటుచేయుచుండగా కైకేయి భర్తతో "రామునకు పట్టాభిషేకము చేసినచో నేను త్రాగను, ఆహారము తీసి కొనను, నేను మరణింతును. మీరు వెనుక ఇచ్చిన వరము పాటించుటకు రాముడు అరణ్యమున కేగవలెను" అని పలికి అట్లు జరుగవలెనని పట్టుపట్టెను.

ఆడినమాట తప్పలేని దశరథుడు వెనుక కైకకు ఇచ్చినవరములను గుర్తుతెచ్చుకొని ఆమె మాట చేయలేక మానలేక మోహమునందెను.

చివరకు ఎట్లో సత్యమును ధర్మమును వీడలేనివాడై దశరథుడు పెద్ద కుమారుడగు రాముని, భరతునకు రాజ్యము నొసంగుమని యాచించెను.

శ్రీమంతుడగు రాముడు తండ్రిమాటను 'అభిషేకము చేసెదను' అన్న మాటకంటె సంతోషముతో స్వీకరించెను. మనస్సులో ముందుగనే పితృవాక్యమును పాలించుటకు నిశ్చయించుకొని మాటతో అంగీకారమును తెలిపెను."

తత్త్వదీపిక :-

ఇది రాముని స్వభావము.

తాను చేయుదలంచిన పనిని పెద్దల నిర్బంధముచే ఆచరించినను మనస్సులో ఇష్టములేకుండ చేయువాడు కాదు రాముడు.

పితృవాక్యమును పాలించుట తండ్రి నిర్బంధముచే, మాటచే అంగీకరించినను మనసులో బాధపడువాడు కాదు.

మనసులోనే ముందుగా నిశ్చయము చేసికొని మాటలతో దాని నావిష్కరించును.

సీతమ్మ రాముని స్వభావమును నిరూపించుచున్నది.

*"దద్యాన్న ప్రతిగృహ్ణీయాత్ న బ్రూయాత్కించి దప్రియం,*
*అపి జీవితహేతో ర్వా రామ స్సత్యపరాక్రమః"* (సుంద.33-25)

"రాముడొకరి కొసంగునే గాని, ప్రతిగ్రహింపడు. మనసునకు నొప్పికల్గించు మాటలు పలుకడు. తన ప్రాణము రక్షించుకొనుటకైనను ఒకరి మనసును బాధించుట రాము డెఱుంగడు. రాముడు సత్యపరాక్రముడు."

తత్త్వదీపిక :-

రామాయణములో "సత్యపరాక్రము" డను మాట ఎన్నోసార్లు వచ్చును. దీనికి భిన్నార్థములు గలవు:-

(1) సత్యమైన పరాక్రమము కలవాడు.

(2) సత్యమే పరాక్రమముగా గలవాడు.

(3) సత్యముచే పరలోకముల నాక్రమించువాడు.

అట్టి రాముడు విలువగల మేలివస్త్రములను విడిచి రాజ్యమును మనసార విడిచి తల్లియగు కౌసల్యవద్ద నున్నుండుమని ఆజ్ఞాపించెను.

కాని నేను ఆయనకంటె ముందే వనమునకు బయల్దేరితిని. రాముడు

లేనిదే స్వర్గములో కూడ నేనుండలేను.

మా ఇద్దరికంటె ముందుగా మహానుభావుడగు సౌమిత్రి అన్ననుసరించి అరణ్యమున కేగుటకు నారబట్టలను దాల్చెను.

ఈ విధముగ మేము ముగ్గురము దశరథ చక్రవర్తి యాజ్ఞను పాలించుటకు పూనికతో ఇంతకుముం దెన్నడును చూడని గహనమగు వనమున ప్రవేశించితిమి.

దండకారణ్యమున నివసించుచుండగా ఆ రాముని భార్యనగు నన్ను దురాత్ముడగు రావణుడు అపహరించినాడు. ఆతడు నాకు ఇక రెండు మాసములు మాత్రము బ్రతుకుట కవకాశము నిచ్చినాడు. రెండు నెలల తరువాత నా జీవితమంత మగుట తథ్యము" అని సీతమ్మ చెప్పెను.

**34** ఆ సీతమ్మ పలికిన పలుకులను హనుమ విని అంతకంత కధికమగు దుఃఖమును పొందుచున్న ఆమెకు ఓదార్పుగా ఇట్లు బదులు పల్కెను.

"అమ్మా! నేను రాముని సందేశమువలన నీవద్దకు వచ్చినాడను. వైదేహీ! రాముడు కుశలముగా నున్నాడు. నిన్ను కుశలమడిగినాడు. బ్రహ్మాస్త్రమును, వేదములను ఎఱింగిన వేదవిద్వరుడగు రాముడు నిన్ను కుశల మడిగినాడు.

మహాతేజశ్శాలి, నీ భర్త కనుచరుడు, ప్రియుడు నైన లక్ష్మణుడు శోక సంతప్తుడై శిరసుతో నీకు నమస్కారము చేసినాడు."

ఇట్లు హనుమ చెప్పిన రామలక్ష్మణుల కుశలవార్తను విని ప్రేమతో ఒడలంతయు పులకరించినదియై హనుమంతునితో ఇట్లు పలికెను.

*"కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతిమా*
*ఏతి జీవన్త మానందో నరం వర్షశతా దపి."* (సుంద. 34-6)

"లోకములో వాడుకలో నున్న సామెత నాకెంతో శుభకరమైనదిగా కన్పట్టుచున్నది. జీవించియున్న మానవునికి నూఱేండ్లకైనను ఆనందముకల్గును అని లోకములోనున్న వాడుక నా విషయమున సత్యమైనది."

తత్త్వదీపిక :-

బ్రతికియుండిన సుఖముల బడయువచ్చునని పెద్దలు చెప్పిన మాట నిజమని సీత ఇపుడు పల్కుచున్నది.

ఇది లౌకికమగు గాథయే కాదు; అలౌకికము కూడ. నూతేండ్లకైనను జీవించియున్న నరుని ఆనందము పొందును అను వాక్యములో ఆధ్యాత్మిక సత్యము కూడ చిత్రింపబడినది.

ఆనందమే పరబ్రహ్మము. దానికి దూరమై జీవుడు దుఃఖము నందును. అనేక జన్మల నెత్తును. ఎన్ని జన్మలకైనను భగవదాభిముఖ్యము కల్గి జీవుడు ఆనంద స్వరూపమగు పరబ్రహ్మమును పొందుట తథ్యము. అందుచే జీవితము ఆనందముతోనే అంతమగును.

భారతీయ సంప్రదాయమున జీవితము ఒక్క జన్మతో ముగియునది కాదు. పరమాత్మకు విముఖుడై దూరమైన జీవుడు అభిముఖుడై మరల పరమాత్మను చేరుట ఒక జీవితము.

ఈ జీవిత మెప్పుడు సుఖముతోనే అంతమగును. అందుచేతనే జీవితమునకు ప్రతిబింబములగు, నాటకములను భారతీయులు సుఖాంతముగ నొనర్చు సంప్రదాయమును అవలంభించిరి. ఇందు "నరుడానందమును పొందును" అనలేదు. "ఆనందము నరుని పొందును" "ఆనందః నరం ఏతి" అనెను.

నరుడు తనంత తాను భగవంతుని పొందలేడు. భగవదాభిముఖ్యము కల్గి పొందవలెనని ఆర్తి కల్గినచో ఆ ప్రేమకు వశమై భగవానుడే జీవుని పొందును.

ఈ విషయమునే సీతమ్మ ఈ కాండలో మనకు స్పష్టము చేయును. అందుచే ఈ శ్లోకము భగవత్ప్రాప్తి అందరకును కల్గునా? ఎట్లు కల్గును? ఎన్నాళ్ళకు? అను విషయములను--

"ఏతి జీవన్త మానందో నరం వర్షశతా దపి" (సుంద. 34-6)

అను శ్లోకార్థము స్పష్టము చేయుచున్నది.

ఈ విధముగ మాటాడిన హనుమపై సీతమ్మకు అద్భుతమైన ప్రీతి కల్గినది. నమ్మకముతో ఒకరితో నొకరు మాటాడుకొనుచుండిరి.

సీతమ్మ యొక్క మాటలను విని హనుమ శోకదీనురాలగు ఆమెను ఓదార్చవలెనని సీతమ్మకు దగ్గరగా దిగుచుండెను.

ఆ హనుమ దగ్గర దగ్గరగా వచ్చుచున్నకొలది ఆతడు రావణుడే అను శంక అంతకంతకు ఎక్కువ యగుచుండెను.

"అహో! ఏమి నా దుష్కృతము. యోచించుకొనకుండ అంత విషయము మీతనికి చెప్పితిని. రూపాంతరమును దాల్చి వచ్చిన ఆ రావణుడే ఈతడు"

అని పట్టుకొనిన అశోకవృక్షముయొక్క కొమ్మను విడిచి నేలపై కూలెను.

హనుమంతుడు కూడ భయముచే మోహము నందియున్న సీతమ్మను జూచి నమస్కరించెను.

కాని ఆమె భయముచే బెదరినదై మరల ఆతనివైపు చూడలేదు.

ఎటులనో మరల నమస్కరించుచున్న ఆ హనుమను జూచి గట్టిగ నిట్టూర్పు వదలి ఇట్లు పల్కెను.

"మాయావి వగు నీవు మరల మాయరూపమును దాల్చి వచ్చిన రావణుడవే అయినచో బాధపడుచున్న నన్ను మరల బాధ పెట్టుట నీకు న్యాయము కాదు. ఆనాడు జనస్థానములో నీ రూపమును వదలి సన్న్యాసి రూపమును దాల్చి వచ్చినవాడవు నీవే కదా! ఉపవాసములచే కృశించి దీనురాలనై తపించుచున్న నన్ను మరల తపింపచేయుట నీకు మంచిదికాదు.

నేను శంకించినట్లు ఈతడు రావణుడై యుండడు. ఈతని చూచినందువలన నా మనసులో ప్రీతి కల్గుచున్నది కాని భయము కల్గుట లేదు.

నీవు రామునిదూతవే ఐనచో నీకు మంగళ. మగుగాక! వానర శ్రేష్ఠా! నాకు రామకథ ప్రియమైనది. అందుచే అడుగుచున్నాను. నా ప్రియుడగు రాముని గుణములను చెప్పుము. నదీ ప్రవాహము ఒడ్డును లాగివేసినట్లు రామగుణప్రవాహము నా మనసును ఆకర్షించును. ఎచ్చటనో ఉన్న రాముని నుండి లంకలో నున్న నావద్దకు దూత ఎట్లు వచ్చును? ఇది స్వప్నమే అయి యుండును.

రాముడు పంపిన దూతగా ఒక వానరుడు వచ్చినట్లు ఎంత మంచి స్వప్నము వచ్చినది. స్వప్నములోనైనను రామలక్ష్మణులను నేను చూడకల్గిన నేనింత దిగులును పొందియుండను. కాని స్వప్నము కూడ నాయందు పగబట్టి యున్నది. కల కూడ వచ్చుటలేదు. ఇది కల కాదు.

కలలో వానరుడు కన్పడిన అభ్యుదయము కలుగనేరదు. కాని నాకు రామకథను వినెడి అభ్యుదయము కల్గినది. రాముని క్షేమవార్త వినవలెనని సంతతము కుతూహలము పడుచుండుటచే ఇట్టి భ్రాంతి మనసులో కల్గినదేమో! ఇది అసత్యమగు సంకల్పమై యుండును. లేక ఉపవాసములు చేయుటచే వాతప్రకోపము కల్గి లేనిది ఉన్నట్లు కన్పించుచున్నదో! లేక విరహములో నున్నప్పుడు ప్రేమ యధిక మగుటచే కల్గిన ఉన్మాద మయియుండును. లేదా ఎండమావివలె, లేని వానరుడున్నట్లు నాకు కన్పడుచున్నాడో!

కాదు. ఇది ఉన్మాదము కాదు. మోహము కాదు. ఎదురుగా వానరుడు కన్పించుచున్నాడు. మాటాడుచున్నాడు. నా స్వరూపమును, వానరుని కూడ నేను గుర్తించుచుండగా ఉన్మాదమెట్లగును?"

ఇట్లనేకవిధముల ఆలోచించి రాక్షసులు కామరూపు లగుటచే "ఈ వానరుడు రావణుడే" అని యనుకొనెను. ఇట్లు నిశ్చయము చేసికొని సీత వానరునితో మాటాడక యూరకుండెను.

మారుతాత్మజు డగు హనుమ సీతమ్మయొక్క అభిప్రాయమును గ్రహించి ఆమె చెవికి ఇంపగు మాటలను పల్కుచు ఆమె నానందింప చేయుటకు ఇట్లు పల్కసాగెను.

"అమ్మా! రాముడు సూర్యునివలె తేజశ్శాలి. చంద్రునివలె లోకాహ్లాదకుడు. కుబేరునివలె సర్వలోకములకు అధిరాజు. విష్ణువువలె విక్రమసంపన్నుడు. బృహస్పతివలె సత్యమును మధురముగా పల్కువాడు. సౌందర్యముకలవాడు. రమణీయుడు. కాంతిమంతుడు. రూపుదాల్చిన మన్మథునివలెనుండును. ఎవరిపై కోపము తెచ్చుకొనవలెనో, ఎవరిని కొట్టవలెనో ఎఱిగినవాడు. లోకములో శ్రేష్ఠుడగు మహారథుడు. ఆ మహాత్ముని భుజచ్ఛాయ నాశ్రయించి లోకమంతయు చల్లగా మనజాలుచున్నది.

అట్టి రాముని లేడి రూపమున వచ్చి, ఆశ్రమమునుండి దూరము చేసి, నిన్ను రావణుడు అపహరించి తెచ్చినాడు. దానికి ఫలముగా రావణుడు అనుభవింపబోవుదానిని నీవు చూడగలవు.

వీర్యవంతుడగు రాముడు అగ్నిహోత్రమువంటి తన బాణములతో యుద్ధములో కొద్దిరోజులలో రావణుని చంపనున్నాడు.

ఆతడు పంపగా దూతనై నేను నీ వద్దకు వచ్చితిని. నీ ఎడబాటుచే రాముడు దుఃఖార్తుడై నిన్ను కుశల మడిగినాడు. మహా తేజస్వియగు లక్ష్మణుడు నమస్కరించి నిన్ను కుశల మడిగినాడు. రాముని మిత్రుడు, వానరరాజు అగు సుగ్రీవుడు నిన్ను కుశల మడిగినాడు.

రామ లక్ష్మణ సుగ్రీవులు నిత్యము నిన్ను స్మరించుచుందురు.

మా అదృష్టము వలన అమ్మా! నీవు జీవించియున్నావు. కొద్ది రోజులలో రామలక్ష్మణులను, వానరసైన్యముతో సుగ్రీవుని నీవు చూచెదవు.

నేను సుగ్రీవుని మంత్రిని. వానరుడను. నా పేరు హనుమ. సముద్రమును లంఘించి లంకలో ప్రవేశించితిని. దురాత్ముడగు రావణుని లెక్కచేయక నిన్ను చూచుటకు వచ్చితిని. అమ్మా! నీవు అనుకొనినట్లు నేను రావణుడను కాను. మాయారూపమున వచ్చినవాడను కాను. శంకను వీడుము. నామాటను నమ్ముము."

**35** వానర శ్రేష్ఠు డగు హనుమ చెప్పిన రామకథను విని వైదేహి మధుర మగు వాక్కుతో ఇట్లు పల్కెను.

"రామునితో నీకు కలయిక ఎచట కల్గినది? లక్ష్మణుని నీ వెట్లు ఎఱుగుదువు? గురుకులవాసాదుల నెఱుంగని చపలచిత్తులగు వానరులకును, వసిష్ఠ శిష్యులగు నరులకును సమాగమ మెట్లు కల్గెను? రాముని చిహ్నాము లేవి? లక్ష్మణుని చిహ్నాము లేవి? రాముని అవయవ సన్నివేశ మెట్లుండును? ఆకార మెట్లుండును? తొడ లెట్లుండును? బాహువు లెట్లుండును? లక్ష్మణు డెట్లుండును? వీనిని వివరింపుము. అవి వినుటచే నాకు శోకము అంటకుండ నుండును.

ఈ విధమున వైదేహి యడుగగా మారుతాత్మజు డగు హనుమ రాముని రూపమును, గుణములను ఉన్నట్లుగా వర్ణించుటకు ఆరంభించెను.

"జానన్తీ బత దిష్ట్యామాం వైదేహి పరిపృచ్ఛసి" (సుంద.35-6)

"అమ్మా! నీవు ఎఱింగియే నన్నడగుచున్నావు. నీ భర్తయొక్క రూపమును, లక్ష్మణుని యొక్క రూపమును, వారి చిహ్నములను నేను చూచినవానిని చెప్పెదను వినుము.

"రామః కమలపత్రాక్షః సర్వసత్త్వ మనోహరః
రూప దాక్షిణ్య సంపన్నః ప్రసూతో జనకాత్మజే"(సుంద.35.8)

తత్త్వదీపిక :-

హనుమ రాముని వర్ణించుచు ముందుగా రాముడు తామర పూవుల రేకుల బోలిన నేత్రములు గలవాడని ఆరంభించెను.

రాముని అందములను వేరుగా చెప్పనక్కరలేదు.

(1) రామః :-

"రాముడు" అనిననేఅందమైనవాడని అర్థము. ఆనందమును కల్గించు

వాడు రాముడు. మన్మథ మన్మథుడు రాముడు. చూచెడి వారి చూపులను, మనసును ఆకర్షించెడివాడు రాముడు.

రామ రాజ్యములో రాముని చూడనివాడు, రామునిచే చూడ బడనివాడు ఇద్దరే నిందితులుగా నుండెడివారు. అందుచే రాముడు అందమైనవాడు అనక్కరలేదు. రాముడనిన చాలును. సర్వాంగసుందరుడని తెలియును. అందుచే హనుమ సౌందర్యమును వర్ణించుట కారంభించి "రామః" అనెను.

(2) కమలపత్రాక్షః :-

ఆ సౌందర్య మొక ప్రవాహమువలె ప్రవహించుచుండగా అందులో పడినవారిని మరి పైకి తేలనీయకుండ ముంచెడి సుడి వంటిది రామ నయన సౌందర్యము. చూచెడివారిని మొట్టమొదట వశపరచుకొనునది స్వామి నేత్రసౌందర్యమే! ఆ నేత్రసౌందర్యముయొక్క శక్తి ఎంత గొప్పదో వివరించుచున్నాడు.

(3) సర్వసత్త్వ మనోహరః :-

సమస్తప్రాణులయొక్క మనస్సు నాకర్షించువాడు. "కోతియై చెట్టునుండి చెట్టునకు ఎగిరెడి హనుమనుకూడ ఆకర్షించిన వా నేత్రములు. అందములోని తేడా తెలియని హనుమను కూడ ఆకర్షించిన నేత్ర సౌందర్యము గలవాడు."

(4) రూప దాక్షిణ్య సంపన్నః :-

"రూపము, దాక్షిణ్యము కలవాడు." దేహ గుణము లన్నియు రూప మనుటచేతను, ఆత్మగుణము లన్నియు దాక్షిణ్య మనుటచేతను సూచింపబడినవి.

రూపము=సౌందర్యము, దాక్షిణ్యము=దయ.

ఇట్లు దేహగుణములతో, ఆత్మగుణములతో కూడియున్న వాడు రాముడు. ఇట్టి గుణములు ప్రయత్నము చేసి సంపాదించుకొనినవి కావు.

(5) ప్రసూతః :-

గుణములతోనే పుట్టినాడు.

(6) జనకాత్మజే :-

"మరియు అధికముగ వర్ణించుచున్నావు, అట్టివారు వేరొకరు లేరా!" అని సీతమ్మ అనునేమో యని "పురుషులలో ఎవ్వరు లేరమ్మా. స్త్రీలలో నీవు మాత్రము ఆ గుణములు కలదానివి" అని స్ఫురింపజేయుటకు "జనకాత్మజే" అని సంబోధించును.

అంతరార్థము :-

ఇందు ఆంజనేయుడు రాముని పరతత్త్వముగా గుర్తించినట్లు కూడ సూచించుచున్నాడు.

(1) రామః :-

ఆనందస్వరూపుడు, ఆనందము గుణముగా గలవాడు, ఆనందము నిచ్చువాడు అగు జగత్కారణతత్త్వమే ఈ దశరథపుత్రుడని 'రామః' అను పదముచే సూచించెను.

(2) కమల పత్రాక్షః :-

అట్లు జగత్కారణమైన పరతత్త్వమే ఉపాసకుల సౌలభ్యమునకై సూర్య మండలమున నుండును. సూర్యమండలాంతర్వర్తియగు నారాయణుడు పుండ రీకములను పోలినకన్నులు గలవాడని ఛాందోగ్యోపనిషత్తు చెప్పుచున్నది.

"హిరణ్మయః పురుషో దృశ్యతే
హిరణ్యశ్మశ్రుః హిరణ్యనఖః,
ఆప్రణఖాత్ సర్వ ఏవ సువర్ణః
యథా కప్యాసం పుండరీక మేవ మక్షిణీ."

'ఆదిత్య మండలమునందు హిరణ్మయుస్వరూపుడగు పురుషుడు కన్పట్టు చుండును. బంగారు కేశములు, గడ్డము, గోళ్ళు అన్నియు బంగారమువలె స్పృహణీయములై యుండును. లోతైన నీటిలో మొలచి, లావైన కాడపై నిలచి, అప్పుడే ఉదయించిన సూర్యుని కిరణములచే వికసించిన తామరపూవులను పోలిన నేత్రములు గలవాడు' అని ఉపనిషత్తులో చెప్పబడిన పుండరీకాక్షుడు రాముడే! దానిని తెలియజేయుటకు "కమలపత్రాక్షః" అనెను.

(3) ప్రసూత :-

ఆ పరతత్త్వమే సూర్యమండలాంతర్వర్తి యగు పురుషుడు. ఆతడే సూర్యవంశమున దివ్యమంగళవిగ్రహ గుణములతో, దివ్యాత్మ గుణములతో పరి పూర్ణుడై అందరి కన్నులకు గోచరించునట్లు జన్మించినాడు. జన్మ లేనివాడు జన్మించినా డని "ప్రసూతః" అనెను.

ఈ విధముగ రాముని వర్ణించుట కుపక్రమించి ఆతని పరత్వమును కూడ హనుమ వర్ణించెను. పైన చెప్పిన గుణములనే వివరించుచున్నాడు. "తేజస్సుచే సూర్యునితో సమానుడు. ఓర్మిచే భూమితో తుల్యుడు. బుద్ధిలో

బృహస్పతితో సదృశుడు. కీర్తిలో ఇంద్రుని పోలినవాడు."

రామునకు ప్రత్యేకముగా చెప్పవలసినది రక్షకత్వము. అట్టి రక్షకత్వమును నిరూపించెడి "రక్షితా జీవలోకస్య" అను శ్లోకమును మరల చెప్పెను.

రాముడు లోకములో నాలుగు వర్ణములవారి ధర్మములను రక్షించువాడు. లోకముయొక్క మర్యాదను ఏర్పాటుచేయువాడు. నడిపించువాడు. మర్యాద=అవధి, హద్దు. లోకములో ఎవరి హద్దులేవో నిర్ణయించువాడు రాముడే!

అంతేకాదు. పరతత్త్వముగా సూర్యుడు, చంద్రుడు కూడ తమతమ పరిధులను దాటకుండ చేయువాడు పరమాత్మయగు రాముడే! కాంతిమంతుడు, అందతే పూజింపబడువాడు, బ్రహ్మచర్యమును పాటించువాడు.

వివాహమైన పిదపకూడ ఋతుకాలమున తప్ప స్త్రీతో రమింపకుండుట బ్రహ్మచర్యమే!

సాధువులకు ఉపకారము చేయువాడు. కర్మలయొక్క ప్రయోగము నెఱింగినవాడు. రాజవిద్యలయందు బాగుగా శిక్షణ పొందిన వాడు. బ్రాహ్మణులను సేవించువాడు. శాస్త్రముల నెఱింగినవాడు. శీలవంతుడు. వినయసంపన్నుడు. యజుర్వేదమును బాగుగా అధ్యయనము చేసినవాడు. వేదవేత్తలచే పూజింపబడువాడు. ధనుర్వేదమునందు ఇతరవేదములయందు, వేదాంగములయందు పరినిష్ఠితుడు.

ఈ విధముగ ఆత్మ గుణములను చెప్పి ఇక స్వామి రామచంద్రుని యొక్క రూపమును వర్ణించుచున్నాడు. వెడల్పయిన భుజశిరస్సులు గలవాడు. పొడవైన బాహువులు కలవాడు. శంఖమును పోలిన మెడ కలవాడు. సుందరమగు ముఖము గలవాడు. లోతైన మూపువద్ద ఎముక గలవాడు. ఎఱ్ఱని నేత్రములు గలవాడు. దుందుభిధ్వనిని పోలిన కంఠస్వరము గలవాడు. మెరయుచున్న దేహచ్ఛాయ గలవాడు. ఏ అవయవమునకు ఆ అవయవము సమముగ పంచినట్లున్నవాడు. నీలమేఘశ్యాముడు.

1. త్రిస్థిరః :-

వక్షము, మణిబంధము, పిడికిలి స్థిరముగా నున్నవాడు.

2. త్రిప్రలంబః :-

కనుబొమలు, బాహువులు, వృషణములు పొడవుగా నున్నవాడు.

3. త్రిసమః :-

కేశాగ్రములు, వృషణములు, జానువులు సమముగా నున్నవాడు.

4. త్రిషుచోన్నతః :-

ఉదరము, నాభి చుట్టుభాగము, హృదయము ఎత్తుగా కలవాడు.

5. త్రితామ్రః :-

నేత్రాంతములు, గోళ్ళు, అరచేతులు ఎఱ్ఱగా నున్నవాడు.

6. త్రిషుస్నిగ్ధః :-

పాదరేఖలు, శిరోరుహములు, లింగమణి ఈ మూడును నునుపుగా నున్నవాడు.

7. త్రిషు గంభీరః :-

స్వరము, నడక, నాభి ఈ మూడును గంభీరముగా నున్నవాడు.

8. త్రివలీవాన్ :-

కడుపుపై మూడు మడతలు కలవాడు.

9. త్ర్యవనతః :-

స్తనములు, చూచుకములు, పాదరేఖలు లోతుగా నున్నవాడు.

10. చతుర్వ్యంగః :-

నరములు తేలని పాదములు, ఒక్కొక్క వెంట్రుక గల రోమ కూపము, దీర్ఘముగా లేని లింగము, మాంసము కాని పొత్తి కడుపు కలవాడు.

11. త్రిశీర్షవాన్ :-

మూడు సుడులు గల్గిన శిరస్సు కలవాడు.

12. చతుష్కలః :-

బొటనవ్రేలి మొదట నాల్గు రేఖలు కలవాడు.

13. చతుర్లేఖః :-

నుదుటియందు నాలుగు రేఖలు, పాదమునందు చేతియందు నాల్గు రేఖలు కలవాడు.

14. చతుష్కిష్కుః :-

తొంబదియారు అంగుళముల ఎత్తుగలవాడు.

15. చతుస్సమః :-

బాహువులు, జానువులు ఊరువులు, గండస్థలములు సమముగా నుండువాడు.

16. చతుర్దశసమద్వంద్వః :-

పదునాలుగు జతలు సమముగా నుండువాడు.

1. కనుబొమలు. 2. ముక్కుపుటములు. 3. నేత్రములు. 4. చెవులు. 5. పెదవులు. 6. స్తనాగ్రములు. 7. ముంజేతులు. 8. మణికట్లు. 9. మోకాళ్ళు. 10. వృషణములు. 11. పిరుదులు. 12. చేతులు. 13. పాదములు. 14. మడమలు.

17. చతుర్దంష్ట్రః :-

పండ్లు మెరయుచు గట్టివై, వాడివై, సమములై యుండువాడు.

18. చతుర్గతిః :-

సింహము, శార్దూలము, గజము, వృషభము అను నాల్గు జంతువుల నడకలవంటి నడకలు గలవాడు.

19. మహోష్ఠహనునాసః :-

పెదవి, దౌడ, ముక్కు, ఎత్తుగా, బొద్దుగా నున్నవాడు.

20. పంచస్నిగ్ధః :-

చూపులో, దంతములలో, చర్మములో, కేశములలో, పాదములలో స్నిగ్ధత కలవాడు.

21. అష్టవంశవాన్ :-

పొడవైన ఎనిమిది అవయవములు గలవాడు.

1. వెన్నుముక. 2. చేతి(వేళ్ళు, 3. కాలి(వేళ్ళు. 4. చేతులు. 5. ముక్కు. 6. కన్నులు. 7. చెవులు. 8. లింగము.

22. దశపద్మః :-

పద్మాకారము అగు అవయువములు పది కలవాడు.

1. ముఖము. 2. నేత్రములు. 3. పెదవి. 4. అంగుడు. 5. స్తనములు. 6. గోళ్ళు. 7. చెవులు. 8. పాదములు.

(చెవులు రెంటిని-పాదములు రెంటిని గ్రహింపవలెను).

23. దశబృహత్ :-

పది అవయవములు పెద్దవిగా నున్నవాడు.

1. శిరస్సు. 2. లలాటము. 3. చెవులు. 4. మెడ. 5. గుండెలు. 6. ఉదరము. 7. చేతులు. 8. పాదములు. 9. వీపు. 10. హృదయము.

24. త్రిభిఃవ్యాప్తః :-

తేజస్సు, యశస్సు, కాంతి అను నీ మూడును అంతట వ్యాపించినవాడు.

25. ద్విశుక్లవాన్ :-

దంతములు, నేత్రములు తెల్లగా నున్నవాడు.

26. షడున్నతః :-

ఆ రవయవములు ఎత్తుగా నున్నవాడు.

1. కక్షము (చంక). 2. కుక్షి. 3. వక్షఃస్థలము. 4. ముక్కు. 5. మూపు. 6. నుదురు.

27. నవతనుః :-

తొమ్మిది సూక్ష్మముగా నున్నవాడు.

1. కేశములు. 2. గోళ్ళు. 3. చర్మము. 4. లింగము. 5. వ్రేళ్ళు. 6. గుంపులు. 7. బుద్ధి. 8. గడ్డము. 9. వెంట్రుకలు.

ఇట్లు సాముద్రిక శాస్త్రములో చెప్పబడిన సర్వలక్షణములు గలవాడు శ్రీరాముడు.

28. త్రిభిః వ్యాప్నోతి :-

ధర్మార్థకామములను మూడింటిని పూర్వాహ్ణ, మధ్యాహ్న, అపరాహ్ణముల యందాచరించువాడు.

సత్యధర్మములను పాటించువాడు. శ్రీమంతుడు. ధనమునార్జించుట, యోగ్యులగువారికి ఒసంగుట తెలిసినవాడు. దేశకాలములను ఎఱింగి ప్రవర్తించువాడు. సర్వలోకమునకు మనసునకు నొప్పి కలుగకుండ మాటాడువాడు.

ఇట్టి లక్షణములు గల రామునకు అన్ని విధముల సమానముగా నుండువాడు లక్ష్మణుడు.

అతనిని సుమిత్ర ఎంతప్రేమతో పెంచినదో కౌసల్య కూడ అంతప్రేమతో పెంచినది.

అందుచే లక్ష్మణుడు ద్వైమాత్రుడు. అనురాగముచేతను, రూపము చేతను, గుణములచేతను కూడ రామునివంటివాడే.

అమ్మా! ఆ రామలక్ష్మణు లిద్దరు నిన్ను చూడవలె నని వేడుక కలిగి అంతట వెతకుచు మాతో కలసినారు. నిన్ను వెతకికొనుచు వచ్చుచున్న ఆ రామలక్ష్మణులతో అన్నచే రాజ్యమునుండి వెట్టివేయబడిన సుగ్రీవుడు కలిసెను. సుగ్రీవుడు అన్నకు భయపడి ఋశ్యమూకపర్వతమునందుండెను. సత్యప్రతిజ్ఞుడగు ఆ వానరరాజగు సుగ్రీవుని రాజ్యము పోయినతరువాత కూడ మేము సేవించుచుచుంటిమి. శ్రేష్ఠములైన ధనుస్సులను ధాల్చినవారలై, నార బట్టలను కట్టుకొని, ఆ రామలక్ష్మణు లిరువురు ఋశ్యమూకపర్వతమువద్దకు వచ్చిరి. ధనుర్ధరు లగు వారిద్దఱను జూచి సుగ్రీవుడు అన్నవద్ద భయముచే మోహమునొంది కొండశిఖరమునుండి గంతులు వేసెను. ఆ కొండయందే సుగ్రీవుని ఆజ్ఞానుసారముగా రూపలక్షణసంపన్ను లగు ఆ పురుష శ్రేష్ఠుల నిద్దరను నేను చేరి నమస్కరించి నిలచితిని. వారికి తత్త్వమును వివరించితిని. యథార్థమైన సుగ్రీవుని వృత్తాంతము నెఱింగి ప్రీతితో కూడినవారలై, నాతో సుగ్రీవుని వద్దకు వచ్చుటకు అంగీకరించిరి. నేనే వారిని నా భుజములపై కూర్చుండబెట్టుకొని మా సుగ్రీవునివద్దకు తెచ్చితిని. వారన్యోన్యము మాటాడుకొనిరి. ఒకరిపై ఒకరికి ప్రేమలు కల్గినవి. దానితో ఆ రామసుగ్రీవులు ఒకరిపై నొకరు నమ్మకము గలవారలైరి. రాముడు సుగ్రీవుని ఓదార్చెను. సీతా విరహముచే రామునికి కల్గిన శోకమును లక్ష్మణుడు సుగ్రీవునకు నివేదించెను. లక్ష్మణుడు చెప్పిన మాటలను విని, సుగ్రీవుడు గ్రహణముపట్టిన సూర్యునివలె శోకముచే కాంతిహీనుడాయెను. నీవానాడు రావణునిచే అపహరింపబడుచు నీ శరీరముపై నున్న ఏ ఆభరణములను మా పర్వతముపై పడవేసితివో ఆ ఆభరణములను నేనే తెచ్చి రామునకొసంగితిని. వానిని క్రిందపెట్టగనే ఇటునటు చల్లుకొని ధ్వనివచ్చినది. దానితో రాముడు తెలివి తప్పినవాడాయెను. రాముడా ఆభరణములనొడిలో నుంచుకొని అనేకవిధముల విలపించెను. ఆ యాభరణులను చూచుచు ఏడ్చుచున్న రామునకు శోకము మరింత ఎక్కువాయెను. దుఃఖార్తుడై చాలసేపు ఆతడు పరుండెను. ఓదార్పుమాటలను చెప్పి నేనే అతికష్టముపై లేవనెత్తితిని. రాముడు ఆ యాభరణములను చాలసేపు తాను చూచి, లక్ష్మణునకు చూపి, సుగ్రీవున కిచ్చెను. మండుచున్న అగ్నిహోత్రముతో అగ్నిపర్వతము జ్వలించుచున్నట్లుగా నీవు కన్పడలేదను శోకముచే రాముడు పరితపించుచున్నాడు. అగ్నిహోత్రశాలలో మూడగ్నిహోత్రములు ప్రజ్వలించుచు

న్నట్లు రామునిలో అనిద్ర, శోకము, చింత అను మూడును విడువక వసించుచున్నవి. నిన్ను చూడలేదని రాముడు భూకంపమునకు కొండ కదలినట్లు కదలిపోవుచున్నాడు. అందములగు వనములుగాని, నదులుగాని, సెలయేళ్ళుగాని రాముని మనసునకు ఆనందమును కల్గించుట లేదు. మిత్రులతో, బంధువులతో కూడ రావణుని చంపి రాముడు నిన్ను త్వరలో పొందనున్నాడు. రామసుగ్రీవులిర్వురు ఒకరి కొకరు వాలిని చంపుటకు, సీతమ్మను వెదకుటకు ప్రతిజ్ఞలు చేసికొనినారు. సుగ్రీవుడు రామలక్ష్మణులతో కలిసి కిష్కింధకు వెళ్ళి వాలితో యుద్ధము చేయుచుండ రాముడు బాణమువేసి వాలిని చంపి సుగ్రీవుని రాజుగా చేసెను.

"రామసుగ్రీవయో రైక్యం దేవ్యేవం సమజాయత,
హనుమంతం చ మాం విద్ధి తయోర్దూత మిహాగతమ్."
(సుంద.35-52)

అమ్మా! రామసుగ్రీవులకు సమాగమ మీవిధముగా కల్గినది. హనుమంతుడను పేరుగల నన్ను ఇచ్చటికి దూతగా పంపిరి.

తత్త్వదీపిక :-

వారులకు నరులకు సమాగమ మెట్లు కల్గెనని సీత ప్రశ్నించిన దానికి సమాధానముగా కథ నంతను చెప్పి "ఏవం సమజాయత" సమాగమ మిట్లు కల్గెను" అనెను.

వెనుక చెప్పిన విధముగా నరవానరులు కలిసిరని ఒక భావము.

"అంతఃపుర స్త్రీ వద్దకు దూతగా పంపుటకు ఎంతో అంతరంగమైన వారుండవలెను. కాని మా రామసుగ్రీవులకు కల్గిన మైత్రి వలన ఆ సుగ్రీవుని మంత్రినగు నన్ను - ఒక కోతిని అంతఃపుర స్త్రీ వద్దకు దూతగా పంపించునంతటి విశ్వాసము రామున కేర్పడెను. నరవానరులకు కల్గిన మైత్రిలోని గాఢత దీనివలన నీకు అర్థమగును."

"సుగ్రీవుడు తన రాజ్యమును పొంది అన్ని దిక్కులనుండి వానరులను పిలిపించి పది దిక్కులకు పంపెను.

సుగ్రీవుని యాజ్ఞచే పర్వతసమానులగు వానరులు భూమండలమంతయు వెదకుచున్నారు.

అందులో కొందరము మేము దక్షిణదిక్కున వెదకుటకు వాలి కుమారు

డగు అంగదుడు సైన్యములో మూడవవంతును వెంటబెట్టుకొని బయల్దేరెను. మేము వెదకుచుండగా వింధ్యపర్వతములో చాలకాలము గడచిపోయినది. ఒక బిలములో కొంతకాలముండిపోతిమి. ఇట్లు చాలకాలము గడచిపోవుటచే కార్యము మరి సిద్ధింపదని నిరాశచెందితిమి. కాలము మించిపోయినదని భయముచే సుగ్రీవుని వద్దకు వెళ్ళుటకు భయపడి ప్రాణములను విడచుటకు నిశ్చయించుకొంటిమి. సముద్రతీరమున ప్రాయోపవేశమును చేసితిమి. అపుడు మా నాయకుడగు అంగదుడు సీతమ్మ కన్పడకపోవుట, వాలిని రాముడు చంపుట, జటాయువు మరణించుట- పేర్కొనుచు విలపించుచుండెను.

గృధ్రరాజగు జటాయువు యొక్క సోదరుడు సంపాతి తన సోదరుని మరణవార్తను విని కోపముతో "నా సోదరుని ఎవడు చంపెను?" అని యడిగెను.

అంగదుడు జనస్థానమున రావణునిచే సీతానిమిత్తమై జటాయువు చంపబడెనని చెప్పెను.

జటాయువధను విని, సంపాతి దుఃఖించినవాడై సీతమ్మ రావణ భవనము నందున్నదని చెప్పెను.

ఆ మాట విని అంగదాదులు ప్రీతి నందిరి.

సముద్రపు టొడ్డునకు అందరము వచ్చితిమి. కాని నూఱు యోజనముల సముద్రమును జూచి మా సైన్యమంతయు భీతిచెందెను. అపుడు వారి భీతిని పోగొట్టి నే నీ నూఱుయోజనముల సముద్రమును దాటితిని.

రాత్రివేళ లంకలో ప్రవేశించితిని. రావణుని చూచితిని. శోకముతో బాధపడుచున్న నిన్ను జూచితిని. అమ్మా! జరిగిన కథయంతయు జరిగినట్లు విన్నవించితిని. దేవీ! నేను దాశరథి దూతను. నాతో మాటాడుము. రాముని కార్యమునకై ప్రయత్నించి వచ్చిన సుగ్రీవ సచివునిగా నన్నెఱుంగుము.

శ్రీరాముడు కుశలియై యున్నాడు. అన్న గారిని సేవించుటయందు లక్ష్మణుడు శ్రద్ధ కలవాడై యున్నాడు. పరాక్రమవంతుడగు నీ భర్త హితమును కోరినవాడనై నేనొక్కడనే ఇచ్చటకు వచ్చితిని. అసహాయుడనై నే నిచ్చట సంచరించుచు వెతకుచుంటిని. నీవు కన్పడలేదని బాధపడుచున్న మా వానరసేనల సంతాపమును నేనింక తొలగించెదను.

భాగ్యవశమున సాగరలంఘనము వ్యర్థము కాలేదు. నిన్ను చూడగల్గితిని.

కీర్తి నందితిని. రాముడు రావణుని చంపి త్వరలో నిన్ను పొందగలడు.

పర్వతములలో కెల్ల ఉత్తమమైన పర్వతము మాల్యవంతము. అచ్చట మా తండ్రి నివసించుచుండెడివాడు. ఆతని పేరు కేసరి. ఆతడు దేవర్షులచే నియోగింపబడి గోకర్ణమను పర్వతమునకేగి అచట పుణ్యతీర్థమునందున్న శంబసాదనుడను రాక్షసుని సంహరించెను. ఆ కేసరి భార్యయగు అంజనయందు ఆ కేసరి దేశాంతరమున కేగియుండగా వాయువుచే జన్మించినవాడను నేను. నేను పుట్టగనే సూర్యునివరకేగి క్రిందపడుటచే నాదౌడ వంకరకాగా నాకు హనుమంతుడను పేరు వచ్చెను. నీకు నమ్మకము కల్గుటకు రాముని గుణములను కీర్తించితిని. త్వరలోనే రాముడు ఇటనుండి నిన్ను తీసికొని ఏగును."

ఈ విధముగ హనుమ చెప్పిన మాటలచే సీతమ్మకు నమ్మకము కల్గెను. ఆతని దూతగా నమ్మెను. సంతోషమధికమై నేత్రములనుండి ఆనందబాష్పములు స్రవించెను. ఆమె సుందరములగు నేత్రములు గల ముఖము రాహువు విడిచిన చంద్రునివలె ప్రకాశించెను. హనుమంతుని యథార్థముగ వానరుడేయని సీతమ్మ భావించెను.

అపుడు హనుమ మరల ఇట్లనెను "అమ్మా నీ కంతయు విన్నవించితిని. నీ వికదిగులును విడుము. నీకెట్లు ఇష్టమైన అట్లు చేయుదును. నీవంగీకరించిన వెనుకకు వెళ్ళెదను. శంబసాదనుని చంపిన కపివీరుడగు కేసరి భార్యయందు వాయువు వలన జనించినవాడను. ప్రభావముచే వాయువుతో సమానుడను."

**36** అని చెప్పి హనుమ సీతమ్మను నమ్మకము కల్గించుటకై వినయముతో ఇట్లు పలికెను.

"వానరోఽహం మహాభాగే దూతో రామస్య ధీమతః
రామనామాంకితం చేదం పశ్య దేవ్యంగుళీయకమ్.
ప్రత్యయార్థం తవానీతం తేన దత్తం మహాత్మనా
సమాశ్వసిహి భద్రం తే క్షీణదుఃఖఫలాహ్యసి." (సుంద. 36-2,3)

"అమ్మా! నేను వానరుడను. ధీమంతుడగు రాముని దూతను. రామనామాంకిత మగు ఈ ఉంగరమును చూడుము. ఈ ఉంగరము రాము డొసంగినాడు. నీకు ప్రత్యయము (నమ్మకము) కల్గుటకై తెచ్చితిని. ఆశ్వాసము నందుము. ఇంక నీదుఃఖము పోవుచున్నది. నీకు మంగళ మగుగాక!"

తత్త్వదీపిక :-

ఈశ్లోకములను చదివి, రామునకు అర్ఘ్యపాద్యముల నిచ్చి, హారతినిచ్చి, తరువాత పారాయణము చేయవలెను.

ఈ శ్లోకములలో ఆచార్యస్వరూపము గోచరించును.

హనుమ చెట్టుపై నుండి చాలసేపు పరీక్షించెను. తరువాత సీతారావణ సంవాదమై, ఆర్తితో సీత ప్రాణత్యాగమునకు సిద్ధపడినపుడు రామకథను విన్పించెను. తరువాత సీతమ్మకు కన్పడి రాముని దివ్యమంగళ విగ్రహ సౌందర్యమును, ఆత్మగుణములను వర్ణించెను. తరువాత తమకు రామునితో కల్గిన పరిచయమును వివరించెను.

ఇపుడు సీతకు పూర్తిగా నమ్మకము కల్గినది. ఇపుడు సీతకు నమ్మకము కల్గించుటకు ఉంగరము నీయవలసిన అవసరములేదు. మొదటనే ఇచ్చి యుండవచ్చును. కాని అట్లీయలేదు. దీనిలో శిష్యునకు జ్ఞానము నుపదేశించు టలోని క్రమమును హనుమ ప్రదర్శించెను.

ముందుగా భగవత్కథను వినవలెను. తరువాత భగవంతుని దివ్యమంగళ విగ్రహసౌందర్యమును, గుణములను ఎఱుంగవలెను. వానిచే ఆకృష్టుడైన వానికి అట్టి భగవంతునిపైనను, అట్లు గుణానుభవమును కల్గించిన ఆచార్యులపైనను ప్రీతికల్గును. ఆప్రీతిచే అభిముఖమైన తరువాత తన స్వరూపమును, తన వృత్తాంతమును శిష్యున కెఱింగించును. భగవదనుభవము తన కెట్లు కల్గినది, భగవదనుగ్రహముఎట్లు లభించినది అను విషయములను శిష్యున కెఱింగించును. అపుడు శిష్యునకు పరిపూర్ణమైన విశ్వాస మేర్పడిన తరువాత భగవదనుగ్రహముచే లభించిన మంత్రమును శిష్యునకు అందించును. ఈ క్రమమునే హనుమ పాటించెను.

ఈ శ్లోకములలో ముందుగా "వానరోఽహం" నేను వానరుడను అని చెప్పెను.

వానరః = నరుడా? అను సందేహము కల్గునట్లుండు భగవదనుగ్రహపా త్రులగు మహాపురుషులే వానరులు.

అందుచే ముందుగా తాను భగవదనుగ్రహముచే జ్ఞానమును పొంది ఈ శరీరమున నున్న వాడనని చెప్పెను.

"మహాభాగే" అని సీతమ్మను సంబోధించెను. భగవదనుగ్రహపాత్రురాల గుట అనెడి మహాదృష్టము కలది సీత యని సంబోధించెను. భగవదనుగ్రహము ప్రసరించిన వానికిగాని యోగ్యుడగు ఆచార్యుడు లభింపడు. కావున ఆచార్యుడు లభించినవాడు శిష్యుడు మహాభాగ్యశాలి.

ఇంక అట్టి జ్ఞానము గల మహాపురుషుడు భగవంతుని సందేశమును ముముక్షువగు జీవున కందించును. అందుచే ఆతడు దూత ఆ విషయమును తెలియజేయుచు "దూతః" అనెను.

అట్టి దూతగా నుండుట ధీమంతుడగు రామునికి "రామస్య ధీమతః" 'రామ' అనుటచే ఆనందస్వరూపుడని, 'ధీమాన్' అనుటచే జ్ఞానగుణకుడని తెలియుచున్నది. జ్ఞానానందస్వరూపుడగు పరమాత్మయొక్క దూతయే ఆచార్యుడు.

ఆతడిచ్చెడిది రామనామాంకితమగు అంగుళీయకము. అంగుళీయకము కరవిభూషణమని ముందు పేర్కొనబడుమ. ఇదియే మంత్రము. భగవంతుడే రక్షకుడను జ్ఞానమును మన కది ప్రసాదించును. ఈ నామముచే రాముడే ఎదురుగా నున్నట్లు సీతమ్మకు కన్పట్టును. అట్లు మంత్రమే భగవంతుని సాక్షాత్కరింపచేయు సాధనము. ఈ ఉంగరము సీతమ్మకు ప్రత్యయమును కల్గించును. నమ్మకమే ప్రత్యయము = అనుభూతి. భగవదనుభూతిని కల్గించునది మంత్రము.

ఉంగరము రామునిచే ఒసంగబడినది. ఆంజనేయునిచే తేబడినది. అష్టాక్షరీమంత్రము నారాయణ మునిగా అవతరించిన భగవంతునిచేతనే ఒసంగబడినది. అది గురువుద్వారా శిష్యునకు లభించును. ఇంతకాలము బంధములోనుండి విలపించు సీతకు ఇప్పుడు ఓదార్పు లభించినది. ముముక్షువునకు మంత్రము లభింపగనే దుఃఖము పోవును. ఓదార్పు కల్గును.

ఇట్లు శిష్యాచార్యులమధ్యజరిగెడి క్రమమును ఇందువివరించెను.

"గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కరవిభూషణం
భర్తార మివ సంప్రాప్తా జానకీ ముదితాఽభవత్."

(సుంద. 36-4)

ఆ ఉంగరము చేతితో పట్టుకొని చూచుచు సీత భర్తనుపొందినట్లుగనే ఆనందము ననుభవించిన దాయెను.

**తత్త్వదీపిక :-**

ఈ శ్లోకములో ఉంగరమునకు "కరవిభూషణము" అని ప్రయోగించెను.

ఉంగరము వ్రేలికి ఆభరణము. కాని దానిని ఇందు కరవిభూషణ మనుట రహస్యార్థమును సూచించుటకే!

కరము పనిచేయుటకు సాయపడునది. భగవంతుడు చేయుపని ఏముం డును? సంకల్పమాత్రముచేతనే అన్నియు సిద్ధించును. అట్టి సర్వేశ్వరుని చేతికి విభూషణము జగద్రక్షణము. జగద్రక్షణమును చేయునది సర్వేశ్వరుడొక్కడే!

సృష్టి, స్థితి, లయములు మూడును జగద్రక్షణమే! ఈ మూడును చేయు పరమాత్మయే రక్షకుడను అధ్యవసాయము కల్గుటకు గురువు ఇచ్చిన మంత్రము సాయపడును.

మంత్రములోని ప్రణవము - 'ఓం'కారము

జగద్రక్షకుడగు పరమాత్మకే చెందినవాడు జీవుడను అర్థమును సూచిం చును.

దాని వివరణమే "నమో నారాయణాయ" అను మిగిలిన మంత్రము.

ఆ సర్వేశ్వరుని రక్షకత్వమును గుర్తించి వానియందేభారమునుంచుట మంత్రము లభించిననాడు లభించును.

- దానిని మననము చేయుచున్న మానసికముగా భగవానుడు కన్పడినట్లే అగును. దానివలన ఆనందము లభించును.

"అన్ని ఆభరణములను విడచి అడవికి వచ్చిన రామునివద్ద ఉంగర మెట్లు న్నది? ఉంగరమును సీతమ్మ కెట్లు పంపెను?" అని సందేహమేర్పడును.

దీనికి సమాధానమును మన పెద్దలు చెప్పిరి.

ఎవరి పేరుగల ఉంగరము వారివద్ద ఉండదు. ఒక్క రాజులవద్దనే ఉండును. అది వారిముద్ర. రాముడింకను రాజు కాలేదు. అందుచే అతనివద్ద రామనామాంకితమగు ఉంగరము ఉండుటకు అవకాశములేదు.

ప్రియుని పేరుని జూచి ఆనందించుచుండుటకు అట్టి ఉంగరము సీతమ్మ వద్ద ఉండెను. అడవిలో మండగా ఆ ఉంగరమును పణముగా పెట్టి సీతమ్మ

రామునితో ఆటాడుచుండెను. రాముడు గెలిచెను. ఉంగరము రామునివద్ద నుండెను. ఆ సమయములో మాయలేడి వచ్చెను. సీతమ్మ కోరికపై రాముడు సీతమ్మకు దూరమాయెను. రాముని వ్రేలిని ఆ యుంగరము ఉండిపోయెను. ఆ ఉంగరమును నిపుడు హనుమచే రాముడు పంపెను.

దీనిలోని రహస్యార్థమును చూడుడు. జీవుడు సంతతము భగవంతుడే రక్షకుడు అను నర్థముగల ప్రణవమును ధరించియుండవలెను. ఆ ప్రణవమే 'రామ' యైనది.

ఇది చేతిలో నుండుట యనగా భగవంతుని రక్షకత్వమును అనుసంధిం చుకొనుచుండుట. దానిని మరచుట ఉంగరము తన చేతిని లేకపోవుట. సీతమ్మయొక్క చేతియుంగరము ఆటలో రామునిచేరినది. అనగా భగవంతుడే రక్షకుడను నమ్మిక సీతమ్మనుండి దూరమైనది. అట్లు దూరము కాగానే సీతమ్మ బంధమున పడినది.

మరల ఆచార్యునిద్వారా భగవంతుడు జీవునకు భగవద్రక్ష కత్వమును గుర్తుచేయు మంత్రమును పంపును. ఇదియే రామనామాంకిత మగు కరవి భూషణము.

రామనామముచే లేదా ప్రణవముచే తెలియజేయబడునది భగవద్రక్షకత్వ జ్ఞానము. లేదా భగవదేకోపాయత్వజ్ఞానము. దాని నాచార్యుడు ప్రసాదించగనే భగవదనుభూతి కల్గును. మానసిక మగు భగవత్సాక్షాత్కారము కల్గును. దుఃఖము తొలగును. ఆనందము లభించును. ఇట్టి రహస్యమగు అర్థమంతయు ఈ యంగుళీయకప్రదానమున ఇమిడియున్నది.

తరువాత సీత భర్తృసందేశముచే హర్షమునొందినదై హనుమను సమ్మా నించుచు ఇట్లు ప్రశంసించెను.

"వానరోత్తమ! నీవు విక్రమము గలవాడవు. సమర్థుడవు. ప్రాజ్ఞుడవు. అందుచే నీ వొక్కడవే ఈ రాక్షసస్థానమగు లంక నాక్రమించితివి."

తత్త్వదీపిక :-

"విక్రాంతః - సమర్థః - ప్రాజ్ఞః" అని మూడు పదములను ఇచట ప్రయో గించెను. ఈ మూడింటిచే బలము, శక్తి, జ్ఞానము కలవాడని తెలియుచున్నది. జ్ఞానము కలవాడగుటచే "ఈ రాక్షస వాసస్థానమును ఆక్రమింపగల్గితివి."

"త్వయా ఏకేన' 'నీ వొక్కడవే' 'అనుటచే శక్తి సూచింపబడినది.

"ప్రధర్షితం" "మట్టు పెట్టితివి" అనుటచే బలము సూచింపబడినది.

జ్ఞాన శక్తి బలములు మూడును గురువున కావశ్యకములు.

రాజస, తామసములగు ప్రకోపములు గల శరీరమునందుండి దానిని వశపరచుకొనుటకు జ్ఞానమవసరము. తాను ఏకాకిగా నుండియు బలిష్ఠములగు అనే కేంద్రియములను, మనస్సును, బుద్ధిని వశపరచుకొనుటకు సామర్థ్య మవసరము. దాని నదిమిపట్టుటకు బలము అవసరము. ఇట్లు జ్ఞాన శక్తి బలములు గల ఆచార్యుని ప్రశంసించెను.

"వానరోత్తమా! పొగడదగిన పరాక్రమముతో నూఱుయోజనముల విస్తీర్ణమగు సముద్రమును గోష్పదమువలె నీవు దాటితివి.

నీవు సామాన్యుడవగు వానరుడవని నేననుకొనను. నీకు రావణునివలన భయములేదు. తొట్రుపాటులేదు. నాతో మాటాడుటకు నీవు తగుదువు. అందుచేతనే రాముడు నిన్ను పంపినాడు.

దుర్జయుడగు రాముడు పరీక్షింపనిదే ఏ కార్యమునకు ఎవరిని పంపడు. అందులో ముఖ్యముగా నావద్దకు పంపడు.

ధర్మాత్ముడు, సత్యప్రతిజ్ఞుడు అగు రాముడు భాగ్యవశమున కుశలముగా నున్నాడా? మహాతేజస్వియగు లక్ష్మణుడు కుశలముగానున్నాడా? సముద్రముచుట్టును గల భూమిని కోపముచే ప్రజ్వలించిన ప్రళయకాలాగ్నివలె దహింపలేదా రాముడు? అయినను ఊరకున్నాడు. పోనిమ్ము. కుశలముగా నున్నాడు గదా!"

తత్త్వదీపిక :-

ఇచ్చట సీతమ్మ ప్రణయరోషముచే రాముని కొద్దిగా ఆక్షేపించుచున్నది. "కకుత్థ్సుని వంశములో జన్మించినవాడు గదా! పరుల పరిభవము నోర్వలేని వంశముగదా! ఊరకున్నాడేల? భూమినే దహింపగలవాడు ఈ జలమును మాత్రము దహింపలేడా? భూమిని దహించుట కొక బాణము, జలమును దహించుటకు వేరొక బాణము కావలయునా? తనవారికి పరిభవము కల్గినపుడు రక్షింపనని ప్రతిజ్ఞయా? కుశలియై యుండియు భూమిని సముద్రమును దహింపలేడా? శక్తి లేని వాడా? శక్తి గలవాడైనచో దహింపడేమి? అని కొంచెము కోపమువచ్చి మాటాడి మరల మనసును సరిచేసికొని ఇట్లనుచున్నది.

దేవతలను గూడ నిగ్రహించుటలో శక్తిగలవారు రామలక్ష్మణులు. సందే

హముళ్లేదు. కాని దుఃఖములకే అంతములేదనుకొందును.

" రాముడు కృశించియుండలేదు గదా! పరితపించుటలేదుకదా! నన్ను పొందుటకేవైన కార్యములు చేయబడుచున్నవా?

దీనుడు - సంభ్రాంతుడు అయి యుండలేదుకదా! చేయవలసిన పనులయందు మోహమందుటలేదుకదా! రాజపుత్రుడగు రాముడు పౌరుషముతో చేయవలసిన పనులను చేయుచున్నాడా? మిత్రుల విషయమున మిత్రుడై సామదానములనెడి ఉపాయములను రెంటిని, అమిత్రుల విషయమున జయించు కోరిక గలవాడు గాన భేద దండములను ఉపయోగించుచున్నాడా? మిత్రుల కుపకారమునుచేసి మిత్రులచే ఉపకారమును పొందుచున్నాడా? దేవతానుగ్రమును కాంక్షించుచున్నాడా? కేవల పౌరుషమును, కేవల దైవమును ఆశ్రయించి ఉండక రెండిటిని సమముగ ఆదరించుచున్నాడా? నేను దూరమగుటచే నాయందు ప్రేమలేనివాడు కాలేదు గదా! నన్నీయాపదనుండి విడిపించునా? ఎన్నడు సుఖములనే తప్ప దుఃఖములను అనుభవించుటకు తగని రాముడు అధికమగు ఇట్టి దుఃఖమును పొంది బాధపడుట లేదు గదా!

కౌసల్యా సుమిత్రల క్షేమవార్త, భరతుని క్షేమవార్త తెలియుచున్నదా! నా వలన రాముడు శోకముతో బాధపడుటలేదు కదా! రాముడు కార్యాంతరాసక్తుడై నా విషయమును మరువలేదు కదా! సోదరునియెడ ప్రేమగల భరతుడు రామునకు సాయముగా సైన్యమును పంపగలడా?

వానరాధిపతి యగు సుగ్రీవుడు వానరులతో కలసి నన్ను రక్షించుటకు వచ్చునా!

సుమిత్రానందవర్ధనుడగు లక్ష్మణుడు తన బాణములతో రాక్షసులను వశింపచేయునా?

తీవ్రమగు అస్త్రముతో యుద్ధములో చంపబడిన రావణుని కొద్దికాలము లోనే నేను చూడగలనా

బంగారముతో సమానమగు రంగు గల, పద్మముతో సమానమగు పరిమళము గల రాముని ముఖము శోకముచే దీనమై, ఎండచే ఇంకిన నీరుగల కొలనులోని తామరపూవువలె వాడియుండలేదు గదా!

ధర్మముకొఱకు రాజ్యమును విడిచి అరణ్యములో నాతోకలసి నడచి, భయము గాని శోకము గాని లేక వచ్చిన రాముడు, నా యెడబాటులో కూడ ధైర్యముగనే ఉన్నాడా!

రాజ్యమును వదలినను, అరణ్యమునకు తీసికొనివచ్చినను, అరణ్యములో తాను నడచినను, నన్ను నడపించినను రాముని ధైర్యము తొలగలేదు. కాని నన్ను విడిచిపెట్టుటచే రాముడు ధైర్యహీనుడై యుండును.

రామునికి తల్లికాని, తండ్రికాని, వేరొకరెవరుగాని ప్రేమలో నాతో సమానులు గాని, నాకంటె అధికులు గాని లేరు.

రాముని ప్రేమయంతయునాయందే ఉండునుగాని, వేరొకరిపై నుండదు. అంత ప్రేమగల రాముడు నిద్రాహారములు లేక బాధపడి, సముద్రమును బంధించివచ్చినచో, నేను లేకపోయినచో రాముడు జీవింపడని నేనా రాముని వార్త వినునంతవరకే జీవించి యుండదలంచితిని."

తత్త్వదీపిక :-

"నేను పరతంత్రను. రాముని సమ్మతి లేనిదే ప్రాణములను వీడుటకు కూడ నా కధికారము లేదు. అందుచే నేను చనిపోవుటలేదు. గాని కేవలము శరీరము నిల్పుకొనవలెనను కాంక్షచేకాదు."

ఈవిధముగ సీత మధురార్థముగల మహార్థమగు మాటలను పలికి ఆ హనుమ మాటలను వినుటకు యూరకుండెను.

భీమవిక్రమడగు మారుతి సీతమ్మ మాటలను విని శిరసున అంజలి ఘటించి ఇట్లు బదులు పలికెను.

"అమ్మా! రామునకు నీవిచ్చట నున్నట్లు తెలియదు. అందుచే ఇంద్రుడు శచీదేవివలె నిన్ను తీసికొని వెళ్ళలేదు.

నీ వార్తను నేను వెళ్ళి చెప్పగనే విని రాముడు వానరసైన్యముతో వెంటనే ఇచ్చటకు రాగలడు. బాణములచే సముద్రమును బంధించి లంకాపురిని రాక్షసరహితముగా చేయుగలడు.

ఆ రాముని మార్గములో మధ్య దేవతలే నిలచినను, రాక్షసులే నిలచినను రాముడు వారిని కూడ చంపగలడు.

నిన్ను కాంచలేక శోకముతో రాముడు సింహముచే పీడింపబడిన ఏనుగువలె సుఖము నందుటలేదు. అమ్మా! నేను చెప్పిన మాటలన్నియు సత్యము.

మలయము, వింధ్యము మేరువు, మందరము, దర్దురము అను పర్వతములపై ఒట్టు పెట్టుకొనుచున్నాను. మూలములపై, ఫలములపై కూడ

ఒట్టు పెట్టుకొనుచున్నాను.

సుందరమగు నేత్రములు, సుందరమగు కుండలములు దాల్చిన పూర్ణ చంద్రునివంటి రాముని ముఖమును త్వరలో నీవు చూడగలవు.

ప్రస్రవణ పర్వతముమీద నున్న రామచంద్రుని స్వర్గమున నున్న ఇంద్రుని వలె తొందరలో నీవు చూడగలవు. రాముడు నీ కొఱకై బాధపడుచు మాంసమును భుజించుటలేదు. మద్యమును సేవించుటలేదు. అడవిలో నివసించుచున్న తనకు విహితమైన కందమూలాదికములను ప్రొద్దుపోయిన తరువాత భుజించుచుండును.

ఈగలను గాని, దోమలనుగాని, పురుగులనుగాని, పాములనుగాని శరీరముపై వాలుచున్నను, పాకుచున్నను తొలగించుకొనుటలేదు. రాముడు నిత్యము నిన్నే ధ్యానించుచు, నీకొఱకే శోకించుచు, ఇతరమైనదానిని దేనిని తలంచకుండ కామపరవశుడై ఉండును.

రాముడు నిద్రపోవుటలేదు. ఎప్పుడైనను నిద్రపట్టినను "సీతా" యను మధురమగు నీ పేరునే పల్కుచు మేల్కొనును. మనోహరమగు పండునుగాని, పూవును గాని చూచినప్పుడు "హాప్రియా" అని గాఢముగ నిట్టూర్చుచుండును.

దేవీ! రాముడు నీకొఱకే తపించుచున్నాడు. నిన్ను గూర్చియే మాటాడుచున్నాడు. నిన్ను పొందుటకే పట్టుదలతో ప్రయత్నముచేయుచున్నాడు."

"సా రామసంకీర్తన వీతశోకా
రామస్య శోకేన సమానశోకా
శరన్ముఖే సాంబుద శేషచంద్రా
నిశేవ వైదేహసుతా బభూవ." (సుంద. 36-47)

ఇట్లు హనుమ చెప్పిన మాటలను విని రాముడు బ్రతికియున్నాడని ఎఱింగి శోకమును వీడినదాయెను. రాముడు తనకు దూరమైనాడని తనను విడిచి రాముడు బాధపడుచున్నాడని రాముని శోకముతో సమానమైన శోకము కలదైయుండెను. శరత్కాల ప్రారంభమునందు మబ్బులు కొంచెముగా మిగిలియున్న చంద్రుడు గల రాత్రివలె సీత భాసించుచుండెను. వర్షకాలము గడచినను కొద్దిగ మబ్బు ఉండుటచే చంద్రుడు పూర్తిగ ప్రకాశింపనట్లే రాముడు సుఖముగా జీవించియున్నాడని తెలిసినను కొంత శోకము పోయినను రాముడు శోకించుచున్నాడన్న శోకము మాత్రము మిగిలియుండెను.

**37** పూర్ణచంద్రానన యగు సీత హనుమంతుని మాటలను విని ధర్మార్థసహితముగ ఇట్లు పల్కెను.

"హనుమ! విషముతో కలసిన అమృతమువలె నీమాటలున్నవి. రాముడు అన్యమనస్కుడై లేడు. నన్నే తలంచుచున్నాడని చెప్పితివి. అది అమృతమువలె నున్నది. కాని శోకించుచున్నాడంటివి. అది విషమువలె నున్నది.

పుష్కలమగు ఐశ్వర్యమునందుగాని, దారుణమగు ఆపదలోగాని దైవము త్రాటితో కట్టినట్లు పురుషుని బంధించి లాగుగొనిపోవును. ప్రాణులకు దైవము నివారింపశక్యమైనదికాదు. లక్ష్మణుడు, నేను, రాముడు ఆపదలతో నిట్లు బాధపడుచుండుట చూడుము. రాముడీ శోకమునకు అంతమును ఎన్నడు పొందునో?

రాక్షసులను వధించి, రావణుని నాశనముచేసి, లంకను పెకలించి, నా స్వామి నన్నెపుడు చూచునో? సంవత్సరము నిండకమునుపే నన్ను రక్షింప తొందరపడుమని రామునితో విన్నవింపుము.

పదవనెల నడచుచున్నది. ఇక రెండు నెలలు రావణుడు నా కిచ్చిన గడువు మిగిలియున్నది.

సోదరుడగు విభీషణుడు రామునకు తిరిగి నన్ను సమర్పించుమని ప్రయత్నముతో అనునయించెను. కాని రావణుడంగీకరించలేదు. నన్ను తిరిగి రామునకిచ్చుట రావణుని కిష్టముకాదు. ఆతడు మృత్యువును పొందుటకే సిద్ధముగా నున్నాడు.

విభీషణుని పెద్దకూతురు 'అనల' అనునామె తల్లి ప్రేరణచే నాకాసం గతి తెలియజేసెను.

తప్పక నన్ను నా ప్రభువు పొందగలడు. నా అంతరాత్మ పరిశుద్ధముగా నున్నది. రామునియందనేక గుణములు గలవు. అందుచే రాముడు నన్ను వదలడు. రాముడు నన్ను తప్పక పొందగలడు.

ఉత్సాహము, పౌరుషము, బలము, మార్దవము, కృతజ్ఞత, విక్రమము, ప్రభావము రామునియందు కలవు.

జనస్థానములో సోదరుడు తోడులేకనే పదునాలుగువేలమంది రాక్షసులను చంపిన రామునికి ఎవడు భయపడడు? పురుషశ్రేష్ఠుడగు రాముడు ఆపదలచే చలించువాడు కాదు.

రాముడనెడి దివాకరుడు (సూర్యుడు) తన బాణములనెడి కిరణములతో శత్రువులగు రాక్షసులనెడి బలమును తప్పక ఇంకించగలడు."

అని మాటాడుచు రాముని విషయమున శోకముతో కన్నుల నీరు బెట్టుకొనియున్న సీతమ్మను హనుమ చూచి మరల ఇట్లనెను.

"అమ్మా! రాముడు నీవార్తను నేను చెప్పగనే సైన్యముతో తప్పక రాగలడు కాని నే నిప్పుడే నిన్ను ఈ దుఃఖమునుండి విడిపింతును. నా వీపుపై కూర్చుండుము. నిన్ను వీపుపై కూర్చుండబెట్టుకొని సముద్రమును దాటించెదను. నిన్నే కాదు, రావణునితోపాటు లంకనుకూడ మోసికొనిపోగలశక్తి నాకున్నది. అగ్నిహోత్రుడు హోమముచేసిన ద్రవ్యములను ఇంద్రునకర్పించినట్లు నిన్ను తీసికొని వెళ్ళి ప్రస్రవణ పర్వతముపై నున్న రామునకర్పింతును. వైదేహీ! రాక్షసవధయందు పూనికతో నున్న విష్ణువువలెనున్న రాముని లక్ష్మణుని ఇప్పుడే చూడగలవు. దేవీ! నా వీపుపై కూర్చుండుము. ఆలోచింపకుము. చంద్రునితో రోహిణివలె రామునితో కలియుము. చంద్రునితోను, సూర్యునితోను మాటాడుచున్నట్లుగా నా వీపుపై కూర్చుండి ఆకాశమున పయనించి మహార్ణవమును దాటుము. నిన్ను తీసికొని వెళ్ళుచున్న నన్ననుసరించి వచ్చుటకు లంకలో నున్న వారెవ్వరును సమర్థులు కారు. నే నీ లంక కేవిధముగ వచ్చితినో ఆ విధముగనే మరల నిన్ను తీసికొని ఇటనుండి ఏగగలను."

ఇట్లు పల్కిన హనుమ వాక్యములను మైథిలి విని హర్షముతో గగుర్పొడిచిన అవయవములు కలదై ఇట్లనెను.

"హనుమా! ఇంతదూరము నన్ను నీవు వహింపవలెనని అనుకొనుచుంటివి. అది నీ సహజమగు కపిత్వ మనుకొందును. ఇంత స్వల్పమైన శరీరము గల నీవు నన్ను రామునివద్దకు ఎట్లు తీసికొని వెళ్ళగలవు?"

సీత పల్కిన మాటలువిని మారుతాత్మజుడగు హనుమ ఇంతకు ముందెన్నడును పరాభవ మెరుగనివాడు పరాభవమును పొందినవాడై "సీతకు నా బలముగాని శక్తిగాని తెలియదు. అందుచే ఈమెకు నా రూపమును చూపించెదను" అని తలంచి చెట్టుమీదనుండి క్రిందకుగెంతి, సీతమ్మకు నమ్మకము కల్గుటకై శరీరమును పెంచనారంభించెను. మేరుపర్వతమంత, మందరపర్వతమంతగా పెరిగి ప్రజ్వలించుచున్న అగ్నిహోత్రముతో సమానుడై సీత ఎదుట నిలబడెను.

అపుడు ఎఱ్ఱని ముఖము, వజ్రములను పోలు నఖములు, దంష్ట్రలుగల్గి

మహాబలుడగు హనుమ పర్వతమువలె ఒప్పుచుండెను.

హనుమ సీతమ్మతో--

"పర్వత వన ప్రాంతములతో, ప్రాకార తోరణములతో, రావణునితో కలిపి ఈ లంకను మోసికొనిపోవుటకు నాకు శక్తి కలదు. శోకమును విడిచిపెట్టుము. బుద్ధిని దృఢముగా నుంచుకొనుము. ఉపేక్షాభావమును వదులుము. రామలక్ష్మణులు నిన్ను జూచి శోకరహితులగునట్లు చేయుము" అని పలికెను.

అపుడు సీత భయంకరమగు మారుత పుత్రునిజూచి, "ఓ మహాకపీశ్వర! నీ బలమును, నీ శక్తిని నే నెఱుంగుదును. వాయువువంటి గమనము, అగ్నివంటి తేజస్సు కలవాడవు. సామాన్యుడగు వానరుడైనచో సముద్రమును దాటి దక్షిణతీరమున నున్న ఈ లంకకు రాలేదు. నీవు సముద్రమును దాటి వెళ్ళగలవని నన్ను తీసికొని వెళ్ళగలవని కూడ నే నెఱుంగుదును. కాని, ఓ కపిశ్రేష్ఠ! వాయువేగముతో సమానమగు వేగముకల నీ వేగము నన్ను మోహపెట్టును. ఆకాశముపై నీవు పోవుచున్నప్పుడు ఆ వేగములో పైనుండి సముద్రమును జూచి భయపడి నేను క్రిందకు పడవచ్చును. అందుచే నీతో నేను వచ్చుట తగదు అంతేకాదు-

సముద్రములో పడిన నన్ను క్రూరములగు జలజంతువులు తినివేయును. నీతో రాకుండుటకు వేరొక కారణము కూడ కలదు.

నన్ను రక్షించు నీవు ఎగురుచున్నపుడు నీ ప్రాణమునకుకూడ ప్రమాదము సంభవింపవచ్చును. నన్ను హరించుకొని పోవుచున్నావని జూచి దురాత్ముడగు రావణునిచే ఆజ్ఞాపింపబడిన క్రూర రాక్షసులు నిన్ను వెంటాడుదురు. ఆయుధములను దాల్చి వారు వెంటాడగా రక్షింపదగిన నాతోపాటు నీకును జీవితసంశయ మేర్పడును. ఏమియు ఆధారములేని ఆకాశమునందు సాయుధులగు అనేకులతో నిరాయుధుడవగు నీ వొక్కడవు ఒకవంక యుద్ధము చేయుచుండవలెను. ఒకవంక నన్ను, నిన్ను కాపాడుకొనుచుండవలెను. ఇది నీకు శక్యమగునా?

క్రూరకర్ములగు రాక్షసులతో నీవు యుద్ధము చేయుచుండగా భయముచే నేను నీ వీపుపై నుండి క్రిందకు పడవచ్చును. లేదా బలవంతులు, భయంకరులునగు రాక్షసులు నిన్ను యుద్ధములో ఓడింపవచ్చును. నీవు యుద్ధముచేయుచుండగా క్రిందపడిన నన్ను పాపాత్ములగు రాక్షసులు పట్టుకొని మరల తీసికొని పోవచ్చును. యుద్ధములో జయ పరాజయములు నిశ్చయముగా

నుండవుకదా! అందుచే నీవైనను ఓడిపోవచ్చును. నేనైనను చనిపోవచ్చును. అట్లయిన నీవుచేసిన ప్రయత్నమంతము వ్యర్థమగును.

కాక మరొకవిషయము. నీవు రాక్షసుల నందరను చంపి నన్ను తీసి కొని పోగల సమర్థుడవే! అయినను నీవు రాక్షసులను చంపినచో రామునికీర్తి మాసిపోవును. నీ చేతినుండి బలాత్కారముగ నన్ను లాగికొనిపోయి నీవు కాని, వానరులు కాని, రామలక్ష్మణులు కాని గుర్తించుటకు వీలులేనిచోట నన్ను దాచివేయవచ్చును. దానిచే నాకొఱకు నీవు చేసిన ప్రయత్నమంతయు వ్యర్థమగును. నీతో నేను వచ్చుటకంటె రాముడు నీతో వచ్చుట చాలమేలు. రాముడు, సోదరులు, రాజకులమంతయుగూడ నాపై ఆధారపడి బ్రతికియు న్నారు. నే నేమైన అయినచో వారందరు వానరులతో సహా ప్రాణములను వీడుదురు.

మరియొక విషయము. నేను పతివ్రతను. అందుచే రాముని శరీరమును తప్ప మరియొక పురుషుని శరీరమును స్పృశింపను. ఆనాడు రావణుని శరీరమును బలాత్కారముగ స్పృశింపవలసివచ్చినది. కాని ఆనాడు నేనే నా స్వాధీనములో లేను. అందుచే అట్లు స్పృశింప వలసివచ్చినది.

రాముడు బంధువులతోకూడ రావణుని చంపి నన్ను లంకనుండి స్వయ ముగ తీసికొని వెళ్ళుట ఆ రామునకు తగునని చెప్పము. రాముని పరాక్రమములను ఎన్నిటినో నేను వింటిని, చూచితిని. దేవ గంధర్వ భుజంగ రాక్షసులెవ్వరును యుద్ధములో రామునకు సమానులు కారు. వాయువుచే ప్రేరేపింపబడి ప్రజ్వలించుచున్న అగ్నిహోత్రమువలె నున్న లక్ష్మణునితో కూడిన రాముని చూచి ఎవరు ఓర్వగలరు?

అందుచే ఓ వానరశ్రేష్ఠ! లక్ష్మణునితో వానరసేనానాయకులతో రాము డిచటకు వచ్చునట్లు చేయుము. రాముని గూర్చి శోకముచే కృశించిన నన్ను సంతోషమునందు దానినిగా చేయుము."

**38** సీతమ్మ చెప్పిన ఆ మాటలను విని వాక్యవిశారదుడగు హనుమ సంతుష్టుడై ఇట్లు పల్కెను.

"అమ్మా! నీవు చాల యుక్తముగా మాటాడితివి. స్త్రీ స్వభావము నకు, పాతివ్రత్యమునకు, వినయమునకు తగినట్లు పల్కితివి. స్త్రీవైన నీకు సముద్రమును దాటుట శక్యముకాదు. అది యుక్తమే! నాపై కూర్చుండి

వచ్చునపుడు జరిగెడి ప్రమాదమును చెప్పితివి. అవి యుక్తమే! అవి స్త్రీ స్వభావమునకు తగియున్నవి. వినయముతో పాతివ్రత్యమునకు తగినట్లు రామునికంటె ఇతర పురుషుల శరీరమును స్పృశించను అని చెప్పితివి. మహాత్ముడగు రాముని భార్యవగు నీకు ఆమాట తగును. నీవు తప్ప వేరొక రెవ్వరు ఇట్టిమాట పల్కగలరు? నీవు చెప్పిన మాటలు, నీవద్ద నేను చూచిన చేష్టలు అన్నియు రామునితో చెప్పెదను. రామునికి ప్రియముచేయవలెనను తలంపుతో, ప్రేమచే అనేక కారణముల వలన నిన్ను నాతో తీసికొనిపోవుదునని పల్కితిని.

లంక ప్రవేశించుటకు శక్యముకానిది. సముద్రము దాటుటకు వీలుకానిది. నాకు నిన్ను దాటింపగల సామర్థ్యమున్నది, అని అట్లు పల్కితిని. ఇప్పుడే నిన్ను రామునితో కలుపవలెనని కోరితిని. రాముని యందున్న ప్రేమచే తను, భక్తిచేతను అట్లు పల్కితినిగాని వేరొకటికాదు. నాతో వచ్చుటకు నీకు ఇష్టములేనిచో రాముడు గుర్తింపగల అభిజ్ఞానము నొసంగుము."

అని హనుమ అడుగగా సీత కన్నీటితో స్వరము గద్గదము కాగా ఈ క్రింది మాటలను పల్కెను.

'రామునకు నన్ను జ్ఞాపకముచేయుట కిది మంచి గుర్తు. ఈ కథను నేను చెప్పినట్లు రామునితో చెప్పుము.'

"చిత్రకూట పర్వతముయొక్క ఈశాన్యదిక్కున నున్న ఒక సమీప పర్వతమునందు తాపసాశ్రమము కట్టుకొని నివసించుచుంటిమి గదా! మందాకినీ నదికి సమీపములో ఆశ్రమ ప్రదేశమున నివసించుచు నానావిధములగు పుష్పములతో పరిమళించుచున్న ఉపవనములలో విహరించి అలసినదాననైన నేను రాముని తొడపై పరుంటిని. అపుడచ్చట ఎండబెట్టిన మాంసమునందాసక్తిగల కాకి ఒకటి వచ్చి ఆ మాంసమును కొరికెను. అపుడు నేను మట్టిబెడ్డతో దానిని కొట్టితిని. అది నామీద కెగిరి గుండెలపై గీరుచు అచ్చటనే పొంచియుండెను. మాంసమును తినుట మాత్రము మానలేదు. అపుడు నాకు కోపమువచ్చి దానిని కొట్టుటకు మొలనూలు తీయబోవుచుండగా రామునకు తెలివివచ్చి నావైపు చూచెను. అపుడు పక్షిపై కోపము తెచ్చుకొంటివని స్వామి అవహసించగా నేను సిగ్గుపడితిని. మాంసమునందాశగల కాకి మరల నన్ను గీరుచుండగా

కూర్చుండిన రాముని చేరి ఒడిలో పరుంటిని. కాకిపై కోపమువచ్చిన నన్ను స్వామి ఓదార్చెను. ఆ కాకి పెట్టుచున్న బాధ కోర్వలేక కన్నుల నీరువచ్చి, కోపమువచ్చి రామునకు కన్పడకుండ చేసికొనవలెనని తుడుచుకొనుచుండగా స్వామి కనిపెట్టెను. ఆ కాకి పెట్టెడి బాధచే దానిని వారించుకొనుటకు యత్నించి అలసి రాముని ఒడిలో నేను పరుంటిని. కొంతసేపయిన తరువాత రాముడు నా ఒడిలో పరుండెను. నేను మేల్కొని కూర్చుండుటను చూచి కాకి మరల ఎగిరి నా వక్షఃస్థలమున గోళ్ళతో గీరెను. నా గుండెలనుండి పడిన రక్తపుబిందువులతో తడిసి రాముడు మేల్కొనెను.

"పమయా బోధితః శ్రీమాన్ సుఖసుప్తః పరంతపః"

(సుంద. 38-25)

"ఆ కాకి ఎక్కువగా బాధపెట్టుచుండగా సుఖముగ నిద్రపోవుచున్న శ్రీమంతుడగు రాముడు నాచే మేల్కొల్పబడెను."

తత్త్వదీపిక :-

ఈ శ్లోకములో "శ్రీమాన్ సుఖసుప్తః" అని రాముడు నిద్రపోవుచున్నప్పటి అందమును జూచి సీత 'శ్రీమాన్' అనెను.

నిద్రాకాలమున రాముని సౌందర్యము అధికముగ నుండును. దానిని జూచి ఆనందించినవారు విశ్వామిత్రుడు, సీత.

ఆ అందమును చూచి సీత 'శ్రీమాన్' అనెను. "కాకి బాధ భరించలేక ఇంతటి సౌందర్యానుభవమునుపోగొట్టుకొని మేల్కొల్పితినే శత్రువులను నిరసించుటకు స్వామి మేల్కొనవలెనా? నిద్రించుచున్నను నిరసింపగలడు."

"సుఖసుప్తః పరంతపః" సుఖముగ నిద్రించుచున్నను పరులను తపింపచేయువాడు. "అట్టివాడు నిష్కారణముగ నాచే మేల్కొల్పబడినా"దని బాధపడెను.

"అపుడు రాముడు మేల్కొని స్తనములయందు గీరబడియున్న నన్ను జూచి సర్పమువలె కోపముగలవాడై ఇట్లనెను :-

"ఎవడు నీ వక్షమును గాయపరచినవాడు? ఐదు తలలు గల పాముతో ఎవడాటలాడుచున్నాడు?" అని ఇటునటు చూచుచుండగా కాకి రాముని కంట

బడెను. దాని గోళ్ళకు రక్తమంటి యుండెను.

ఆ కాకము ఇంద్రుని కుమారుడు. వాయువుతో సమానమైన వేగముగల వాడు. ఆ వాయసమునందు కోపముగల్గి రాముడుకూర్చుండిన ఆసనమునుండి దర్భను తీసి బ్రహ్మాస్త్రమునభిమంత్రించి, వాయసముపై వదలెను. అది ఆకాశమున కాకిని వెంటాడుచుండెను. ఆ బ్రహ్మాస్త్రము వెంటాడుచుండగా రక్షకులకై అన్వేషించుచు ఆ కాకి అన్ని లోకముల సంచరించెను. తండ్రి ఇంద్రుడుగాని, దేవతలు గాని, మహర్షులుగాని, ఎవ్వరును రక్షింపనుద్యమింప లేదు. మూడు లోకములను తిరిగి మరల రామునే శరణుపొందినది."

తత్త్వదీపిక :-

కాకము తెలిసి శరణుపొందలేదు. వేరొక దిక్కులేక రాముడున్న చోటు నకే వచ్చి పడుటగూడ శరణాగతియే! మనసులో భగవానుడే ఉపాయమని భావించుట, నోటితో అనుట, చేతితో నమస్కరించుట, లేదా భగవాను డున్నచోటుకు వచ్చి పడుటకూడ శరణాగతియే అగును. శరణాగతులను రక్షించుటయందు సాధువు రాముడు.

తన ఎదుట నేలపై బడిన కాకిని జూచి, శరణాగతుడని భావించి కృపతో రాముడు కాపాడెను. మూడు లోకములలో ఎచ్చటను సౌఖ్యమును పొంద లేక మరల రామునే శరణుపొందెను. అపుడా కాకినిజూచి రాముడు "ఇది బ్రహ్మాస్త్రము. వ్యర్థమగుటకు వీలుకాదు, ఏమి చేయవలెనో చెప్పు" మనెను.

అపుడా కాకము "నా కుడికంటిని నీ బాణమునకు గురిచేయుము" అని ప్రార్థించెను. అపుడు రాముడు దాని కుడికంటిని ఆ అస్త్రముచే పోగొట్టి దాని ప్రాణమును రక్షించెను.

అపుడా కాకము రామునకు, దశరథునకు నమస్కరించి రామునివద్ద సెలవు తీసికొని తన స్థానమున కేగెను. "నా కొఱకొక కాకియందు బ్రహ్మాస్త్రమును ప్రయోగించితిరే! ఈనాడు నన్ను దొంగిలించి తెచ్చిన రావణుని యూరకుంటిరేల?" అని అడిగితినని చెప్పుము అనెను.

తత్త్వదీపిక :-

ఈ కథలో సీతమ్మ తాను రక్షింపదగినదాననని రామునకు గుర్తుచేసెను.

దేవతలు రావణవధకు రాముడుద్యుక్తుడగుటకు అతనికి ఎట్లు కోపము వచ్చునా? అని పరీక్షించుటకు కాకిని పంపించిరి. ఈ కాకము సీతనే హింసించెను. చివరకు రామునకు కోపమువచ్చి దానిపై బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. పట్టణమునకు దూరమైనను, తల్లిదండ్రులకు దూరమైనను, రాజ్యమే పోయినను రామునకు కోపమురాలేదు. కాని సీతమ్మను హింసించి నంతమాత్రమున చంపవలెననునంత కోపము వచ్చెను. దేవతలు దీనిని కనిపెట్టి సీతాదేవిని రావణునిచే అపహరింపచేసిరి.

"రావణుని చంపుటకై నన్ను లంకలో ప్రవేశపెట్టితివి గదా! రావణుని చంపి నన్ను తీసికొని వెళ్ళుట నీ కర్తవ్యము! అదియే అవతారప్రయోజనము కదా! దానిని విస్మరించితివా?" అని సీత ఇందు గుర్తుచేసెను.

ఈ కథలో సీతమ్మ కాకమును వారించుటకు తాను రెండు మూడు పార్లు ప్రయత్నము చేయును. కోపము తెచ్చుకొనును. మొల నూలు లాగి విసరబోవును. కాకి మరల మరల పొడుచుచుండును. రాముడు ఉపేక్షించి నవ్వుచుండును. కాని కోపము తెచ్చుకొనడు. కాకిని వారింపడు. చివరకు సీత తన ప్రయత్నమును మాని రాముని ఒడిలో చేరియుండును. అప్పుడు కాకి సీతమ్మను పొడువగా రాముడు లేచి, కోపగించి, కాకిపై బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను.

తనను రక్షించుకొనుటకు తాను ప్రయత్నము చేసినంతసేపు రాముడుపేక్షించును. తాను ప్రయత్నమును విరమించునపుడు భగవంతుడే విరోధులను తొలగించి రక్షించును, అను విషయము కాకాసుర వృత్తాంతములో తెలిసినదికదా యని సీతమ్మ నేడు తన ప్రయత్నమును తాను విడచి రాముడే రక్షకుడని యుండెను. అట్లున్నపుడు రక్షింపవలసిన బాధ్యత వానిదే యని గుర్తుచేయుటకు సీతమ్మ ఈ కథను పేర్కొనెను.

సీతమ్మ మరల హనుమతో ఇట్లు చెప్పుచున్నది.

"అట్లు కాకియందు బ్రహ్మాస్త్రమును ప్రయోగించిన నీవీనాడు నాయందు

కృపకల్గి పాలింపుము.

నీవు నరోత్తముడవు కదా! నాథుడు కల్గియుండియు అనాథవలెనున్న నన్ను చూచుచు ఊరకుండుట నీకు తగదు.

వెనుక నీతో కలిసియున్నపుడు "నీకు అభిమతమగు ధర్మమేది?" యని నే నడుగగా--

"ఆనృశంస్యం పరోధర్మః" (సుంద. 38-41)

"పరుల దుఃఖమును జూచి ఓర్వలేకుండుటయే నాకు పరమధర్మ"మని మీరు చెప్పితిరిగదా! అట్టివారు ఇపుడు నా దుఃఖమును జూచుచు ఊరకుంటి రేల?

స్వామీ! మీరు మహావీరులని, మహోత్సాహులని, మహాబలశాలురని ఎఱుంగుదును. సముద్రపరివేష్టితమగు భూమిని భరించువారు మీరని ఎఱుంగుదును. అట్టి మీరు ఈ రాక్షసులయందు అస్త్రమును సంధింపకుండుటకు కారణమేమి?

గంధర్వులు గాని, అసురులు గాని, మరుత్తులు గాని, నాగులు గాని యుద్ధములో మీ వేగమునోర్చుటకు సమర్థులు కారు" అని పల్కితినని చెప్పుము.

పరాక్రమము గల రామునకు నన్ను చూడవలెనను సంభ్రమమే యున్నచో తీక్ష్ణములగు బాణములతో రాక్షసుల నేలచంపడు? అన్నగారి యాజ్ఞను పాటించి లక్ష్మణుడైనను ఏల నన్ను రక్షింపరాదు? వాయువు, అగ్నివంటి తేజస్సులు గల ఆ పురుషశ్రేష్ఠులిద్దరు సమర్థులైయుండియు నన్నేల ఉపేక్షించుచున్నారు? దేవతలుగూడ వారిని చెనకలేరు గదా!

"మమైవ దుష్కృతం కించిత్ మహ దస్తి న సంశయః
సమర్థా వపి తౌ యన్మాం నావేక్షేతే పరంతపౌ."
(సుంద. 38-48)

సమర్థులైనను రామలక్ష్మణులు నన్నుపేక్షించుచున్నారనిన ఏదో పాపము నాదే. తెలియనిదో, తెలిసినదో, చిన్నదో, పెద్దదో ఉండి యుండవలెను" అనెను.

తత్త్వదీపిక :-

ఇంతవరకు సీతమ్మ రాముడు రక్షింపకుండుటకు రాముని దయలేకపో వుటయే కారణమని అనుకొనినది. కాని ఇపుడు తన పాపమే కారణమని ఆమె భావించుచుండెను.

భగవంతుడే ఉపాయమని విశ్వసించియున్నవారు తమకు కష్టములేవైన వచ్చినపుడు భగవంతుని దూషించుట, దెప్పుట చేయరాదు. ఆ కష్టములు వచ్చుటకు తాము చేసిన పాపమే కారణమనియు, భగవంతుడు ఆ కర్మ ననుభ వింపచేసి తనను చేర్చుకొనుటకే అనుగ్రహించుచున్నాడనియు భావింపవలెను.

ఇట్లే సీతమ్మ తాను అనుభవించుచున్న కష్టమునకు తన పాపమే కార ణమని ఇప్పుడనుకొనుచున్నది.

"కొద్దియో, గొప్పయో నా పాపమే కారణము" అనుటలో కొద్ది, గొప్ప అను రెండు పాపములను పేర్కొనెను. అందు కొద్ది పాపము భగవదపచా రము; గొప్ప పాపము భాగవతాపచారము.

భగవంతుని విషయములో చేసిన తప్పుకంటె, భగవద్భక్తుల విషయ ములో చేసిన తప్పు పెద్ద పాపము అనబడును.

సీతమ్మ రామచంద్రునితో అరణ్యమునకు వత్తునని చాలసేపు బ్రతిమాలి చివరకు రాముని,

"కిం త్వా మన్యత వైదేహః పితా మే మిథిలాధిపః
రామ జామాతరం ప్రాప్య స్త్రియం పురుషవిగ్రహమ్"

(అయో. 30-3)

"భార్యను అరణ్యమునకు తీసికొని వెళ్ళలేదని మా తండ్రియగు జనకు నకు తెలిసినచో ఆతడు స్త్రీయే, పురుష వేషమున వచ్చి నా కుమార్తెను వివాహమాడెనని తలంచును" అని అధిక్షేపించెను.

ఇది భగవంతుడగు రాముని విషయమున సీత చేసిన అపచారము. ఇది కొంచెము పాపము.

మాయలేడిని చంపుటకు రాముడు వెళ్ళి మారీచుని చంపగా "హా సీతా! లక్ష్మణ!" అని కేకవేసి మారీచుడు చనిపోయెను. అపుడు సీత రాముని రక్షించుటకు లక్ష్మణుని వెళ్ళుమని నిర్బంధించి పరుషముగ మాటాడును. ఇది భగవద్భక్తుడగు లక్ష్మణుని విషయమున చేసిన అపచారము. ఇది మహాప చారము.

ఈ రెంటిని అనుభవించుచున్నానని సీతమ్మ గుర్తించెను. ఈ రెంటి ఫలమే బంధము.

ఇట్లు సీతమ్మ జాలివేయునట్లు కంట నీరు పెట్టుకొని పల్కిన మాట లను విని హనుమ ఇట్లనెను.

"అమ్మా! రాముడు నీకై శోకించుచు ఇతరములగు విషయములను వేనిని కాంక్షించుటలేదు. నిజము. ఒట్టు. రాముడు దుఃఖమునందగనే లక్ష్మణుడు కూడ తపించుచుండును. ఎట్లో నిన్ను చూడగల్గితిని. ఇక శోకింపనక్కరలేదు. ఈ క్షణముననే నీ దుఃఖము లంతమగుచున్నవి. మహాబల శాలురగు ఆ రామలక్ష్మణులిర్వురు నిన్ను చూడవలెనను ఉత్సాహముతో వచ్చి లంకను భస్మముచేయుదురు. క్రూరుడగు రావణుని బంధువులతోసహా చంపి రాముడు నిన్ను తన పట్టణమునకు తీసికొని వెళ్ళును. రామలక్ష్మణులతో సుగ్రీవునితో ఏమి చెప్పమందువు?"

అని హనుమ పల్కగనే సీత శోకసంతప్తయై హనుమతో ఇట్లు పల్కెను.

"కౌసల్యా లోకభర్తారం సుషువే యం మనస్వినీ
తం మమార్థే సుఖం పృచ్ఛ శిరసా చాభివాదయ"
(సుంద. 38-25)

"లోకభర్తయగు రాముని విశాలమైన మనస్సుగల ఏ కౌసల్యకనెనో ఆ రాముని సుఖముగా నున్నాడా! అని నేనడిగినట్లు చెప్పుము. శిరసుతో నేను నమస్కరించితినని నమస్కరింపుము."

తత్త్వదీపిక :-

"లోకములో స్త్రీలందరు తమను రక్షించుటకొఱకు పిల్లలను కందురు.

కాని విశాలమైన మనసుగల కౌసల్య నాకుమారుడు లోకరక్షకుడు కావలెనని వ్రతముచేసి లోకోపకారుడగు పుత్రుని కనెను. ఆమె సంకల్ప మమోఘము కదా! నేను మాత్రము ఆ లోకములో ఒకదానను కానా! నన్ను మాత్రము రక్షింపడా? తప్పక రక్షించును. అంతవరకు కాగలేక నేను తొందరపడుచుంటినే గాని నేను ప్రార్థింపనక్కర్లేదు. ఆతడు సుఖముగా నున్నంతకాలము నా రక్షణమున నా ప్రయత్నమక్కరలేదు. అందుచే నేను కోరవలసినది ఆతడు సుఖముగా నుండవలెననియే! అందుచే హనుమా! నే నాతని సుఖమును గూర్చియడిగితినని చెప్పుము.

భగవంతుడున్నాడని ఎఱింగినచో చాలును. రక్షింపుమని ప్రార్థింపనక్కర లేదు. చేయవలసిన దొక్కటే! వంగి నమస్కారముచేసి నేను నావాడను కాను, నీవాడనని స్వామిత్వము నంగీకరించుటయే! అది నేను చేసినట్లు నీ వచ్చుట చేయుము" అని సీతమ్మ చెప్పెను.

"సర్వరత్నములు, మాలికలు, ప్రియతమలగు స్త్రీలు మున్నగువవన్నియు మన్నను, దుర్లభమగు ఐశ్వర్యమున్నను వాని నన్నిటిని విడచి, తల్లిని తండ్రిని అంగీకరింపచేసి రామునితో అరణ్యమునకు వెంటనంటి వచ్చిన లక్ష్మణుని కన్న తల్లి సుమిత్ర - మంచిబిడ్డను కన్నతల్లి.

ధర్మాత్ముడగు ఆ లక్ష్మణుడు రామునియందు భక్తితో దివ్యమగు సుఖమును వదలి అరణ్యమునకు వచ్చినాడు. సింహస్కంధుడు, మహాబాహువు, ప్రియదర్శనుడునగు లక్ష్మణుడు రామునియందు తండ్రివలె నా విషయమున తల్లివలె ప్రవర్తించుచుండును.

ఆనాడు నన్ను రావణుడపహరించినట్లు లక్ష్మణునకు తెలియదు. లక్ష్మీవంతుడగు లక్ష్మణుడు పెద్దలను సేవించు స్వభావముగలవాడు సమర్థుడు. పెక్కు మాటలు మాటాడనివాడు. మా మామగారికి తగిన కుమారుడు. నాకు మిక్కిలి ఇష్టుడు. ఏ పనిని నియమించిన ఆ పనిని చక్కగా నిర్వహించును. రాముడా లక్ష్మణుని చూచుకొని తండ్రి చనిపోయినాడను విచారము లేకయుండెను. సౌమ్యుడు, సమర్థుడు, పవిత్రుడు, రామునకు ప్రియుడునగు ఆ లక్ష్మణుని కుశలమును నే నడిగినట్లు చెప్పుము.

"త్వ మస్మి న్కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ
రాఘవ స్త్వత్సమారంభాత్ మయి యత్నపరో భవేత్."
(సుంద. 38-66)

"ఆంజనేయ! వానరోత్తమ ! ఈ కార్యమును సమకూర్చుటలో నీవే వ్యవస్థాపకుడు. రాముడు నీప్రేరణవలన నా విషయమున ప్రయత్నము చేయు వాడగుగాక!"

తత్త్వదీపిక :-

ఈ శ్లోకము ఒక మంత్రము. దీనిని హనుమ మర్దేశించిచదివిన రామా నుగ్రహము లభించును.

"శూరుడగు రామునితో, మరల మరల ఈ మాటను చెప్పుము దశరథా త్మజ! నెలరోజులు మాత్రమే బ్రతికెదను. నెలరోజుల తరువాత జీవింపను. నేను చెప్పునది సత్యము. రావణునిచే బంధింపబడిన నన్ను, పూర్వము ఇంద్రునికి వృత్రవధచే పాపము సంక్రమించినపుడు అతనిని వీడి పాతాళములో దాగిన శ్రీని శ్రీమహావిష్ణువు పాతాళము నుండి తెచ్చి రక్షించినట్లు రక్షింపుమని చెప్పుము."

ఇట్లు చెప్పి వస్త్రములో దాచియుంచిన దివ్యమగు చూడామణిని తీసి రామునకొసంగుమని సీత హనుమంతునకిచ్చెను. వీరుడగు హనుమ ఉత్తమ మగు ఆ మణిని స్వీకరించి వ్రేలికి పెట్టుకొనెను.

తత్త్వదీపిక :-

అపుడతని భుజము లావుగా లేకుండెను. వెనుక హనుమ స్వస్వరూప మును ప్రదర్శించెను. అపుడు పెద్దవాడై యుండెను. కాని మరల వెంటనే శరీరమును తగ్గించెను. దానిని సూచించుటకు వ్రేలికా చూడామణిని పెట్టు కొనెనని వర్ణించెను.

అట్లా మణిశ్రేష్ఠమును పుచ్చుకొని, సీతకు నమస్కరించి, ప్రదక్షిణము చేసి, ప్రక్కన నిలచి, మహానందభరితుడై, హృదయముతో రాముని చేరినవాడై శరీరముతో మాత్రమే అచ్చట నిలచెను.

పెద్దగాలికి కదల్పబడి మరల ఆ కదలిక తగ్గి, స్వస్థతనొందిన కొండవలె, చాలసేపు ఆరాటపడి సుఖమునందిన మనసుగలవాడై హనుమ తిరిగి వెనుకకు వెళ్ళుటకు ఉద్యుక్తుడాయెను.

**39** సీతాదేవి హనుమంతునకు మణి నిచ్చి "ఇది రామునకు బాగుగా తెలిసిన గుర్తు. మణిని చూడగనే రామునకు ముగ్గురు జ్ఞాపకమునకు వత్తురు. మా తల్లి, నేను, దశరథుడు.

ఈ మణిని వివాహసమయములో దశరథుడు చూచుచుండగ మొట్ట మొదటిసారిగా నాకు మా తల్లి అలంకరించినది. అందుచే ఇది రామునకు బాగుగ తెలియును. హరిసత్తమ! నీవే ఈ కార్యము సిద్ధించుటలో ఉపాయము నాలోచింపుము."

"త్వ మస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ
హనుమన్ యత్న మాస్థాయ దుఃఖక్షయకరో భవ."
(సుంద. 39-4)

"ఈ కార్యమును సమకూర్చుటలో వానరోత్తమ! నీవే ప్రమాణము. హనుమ! నీవే ప్రయత్నించి నా దుఃఖము తొలగునట్లుచేయుము."

తత్త్వదీపిక :-

ఈ శ్లోకముకూడ హనుమ త్ప్రార్థనగా నిత్యము అనుసంధింపదగును. దీనిచే హనుమ దనుగ్రహము కల్గి దుఃఖక్షయమగును.

అపుడు హనుమ అట్లేయని ప్రతిజ్ఞచేసి సీతమ్మకు నమస్కరించి బయు ల్దేరుటకు సిద్ధపడెను.

బయుల్దేరుచున్న హనుమను జూచి బాష్పగద్గదమగు వాక్కుతో మైథిలి ఇట్లు పల్కెను.

"హనుమ! రామలక్ష్మణులను కుశల మడిగితిననుము. సుగ్రీవుని, మంత్రులను, సర్వవానరులను కుశల మడిగితిననుము. ఆ రామచంద్రుడు నన్నీ దుఃఖసముద్రమునుండి తరింపచేయునట్లు నీవు అనుకూలపరచుము. రాముడు

వచ్చి నన్ను జీవించియుండుదానినిగా చేయునట్లు నీమాటను వినియోగింపుము."

"వాచా ధర్మ మవాప్నుహి" (సుంద. 39-10)

"వాచికధర్మము నొనరింపుము. ఉత్సాహముతో నీవు పల్కెడి మాటలే రామునకు పౌరుషము వృద్ధిపొందించి నన్ను పొందునట్లు చేయును. నేను చెప్పిన సందేశమును నీవు చెప్పగనే రాముడు విని తప్పక పరాక్రమించును."

సీత మాటలను విని మారుతాత్మజుడగు హనుమ శిరసున అంజలి ఘటించి ఇట్లు బదులుపల్కెను.

"అమ్మా! రాముడు వానరులతో త్వరలో వచ్చును. యుద్ధమున శత్రువులను జయించి నీ శోకమును తొలగించును. మర్త్యులలోగాని, అసురులలోగాని, దేవతలలో గాని రాముడు వదలెడి బాణములను ఎదుర్కొనజాలినవాడు ఒకడును లేడు. సూర్యుడు, పర్జన్యుడు, యముడు వీరేకాదు ఎవరు వచ్చినను సరే రాముడు యుద్ధములో నీ కొఱకు ఎదిరింపగలడు. రామునకు జయము నీవలననే కల్గును."

హనుమ చెప్పిన ఈ మాటలను విని జానకి మరల ఇట్లనెను.

బయల్దేరబోవుచున్న హనుమను చూచుచు, "ఒక్కరోజు నా కొఱకు ఇచట నుండుము. మరుగైనచోట విశ్రమించి రేపు వెళ్ళెదవుగాక! నీవున్నచో నీసాన్నిధ్యమువలన నా శోకము క్షణకాలము తగ్గినట్లగును. మరల వచ్చుటకొఱకు నీవు నన్ను వీడి ఇపుడే వెళ్ళినచో నా ప్రాణములు నిలుచునో లేదో! నిన్ను గాంచకపోవుటచే శోకము మరింత అధిక మగును. కాని ఒక్క సందేహము నాకున్నది. తీర్చెదవా? మీ సేనలోనున్న వానరులలో నీవు గొప్పవాడవు. కాని మిగిలిన వానరులు, రామలక్ష్మణులు దాటుటకు శక్యము కాని ఈ సముద్రము నెట్లు దాటెదరు? ఈ సముద్రమును దాటుటకు గరుత్మంతునకు, వాయుదేవునకు, నీకు - ఈ ముగ్గురకే శక్తి కలదు. ఇట్టి స్థితిలో సముద్రమును దాటి రాగలవారెవరు? అని నాకు సందేహముగానున్నది. నీ వాలోచించి సమాధానముచెప్పుము. నీ వొక్కడవే ఈకార్యమును సాధించుటలో సమర్థుడువు. ఎట్లు నెరవేర్చి కీర్తినందెదవో? సంపూర్ణమగు సైన్యముతో రావణుని యుద్ధమున ఓడించి రాముడు అయోధ్యకు నన్ను

తీసికొని ఏగిననాడు రాముడు కీర్తిమంతుడగును.

"శరై స్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః
మాం నయే ద్యది కాకుత్స్థః తత్తస్య సదృశం భవేత్."
(సుంద. 39.30)

"పరసైన్యమును మర్దింపజాలిన రాముడు తన బాణములతో లంకను చీకాకుపరచి నన్ను వెంటపెట్టుకొని ఏగినచో అది యాతనికి తగినది అగును. ఆతని పరాక్రమమునకు తగినట్లుగా కార్యమును నెరవేర్చునట్లు నీవు చేయుము" అనెను.

తత్త్వదీపిక :-

సీతమ్మ, తనను హనుమ తీసికొని వెళ్ళెదను అనిన అంగీకరింపలేదు. అది పాతివ్రత్యమునకు తగదు, రానని తిరస్కరించెను.

భగవంతుడే ఉపాయమని విశ్వసించినవారు తమను రక్షించుకొనుటలో తమ ప్రయత్నమును చేయరాదు. ఇతరులు రక్షకులనిగూడ విశ్వసించి యుండ రాదు. భగవానుడే వచ్చి తమను స్వీకరించునని ధైర్యముతో నుండవలెను.

తన ప్రయత్నముచే తాను భగవంతుని పొందుట స్వగత స్వీకారము.

భగవంతుడే అనుగ్రహించి వచ్చి తన శత్రువులను నిరసించి, తనను వెంటబెట్టుకొని ఏగుట పరగత స్వీకారము.

స్వస్వరూపము నెఱింగినవారు రెండవమార్గము ననుసరింతురు.

సీత రెండవ మార్గమునకు చెందినది. భగవంతుడే వచ్చి రక్షింపవలెనను దృఢమైన అధ్యవసాయము కలది. అందుచే సీత తనను ఆంజనేయుడు తీసుకొనివెళ్ళుటకు అంగీకరింపలేదు.

లంక శరీరమే గదా! ఆ శరీరములో ప్రవేశించుట ఎపుడు? అనునది ఎవ్వరికిని తెలియునది కాదు. అది అనాది.

రావణుడు దొంగతనముగా తీసికొనివచ్చి సీతమ్మను లంకలో పెట్టెను. జీవునకు అనాదిగా శరీరసంబంధ మేర్పడెను. ఈ శరీర సంబంధము వీడుట. మరల శరీర మంటకుండునట్లు పోవుట మోక్షము=విడుదల. అది రహస్యముగా జరుగునది కాదు. పరమాత్మయే హృదయస్థానమున నున్నవాడై జీవుడు తనను పొందుటకు ప్రతిబంధకములగు పాపములను పోగొట్టి, సుషుమ్నానాడిగుండ జీవుని వెంటబెట్టుకొని వెళ్ళును. అపుడు శిరసు పగిలి జీవుడు బైటకు పోవును. ఇట్లు జీవుని ప్రవేశము మాయచే జరుగును.

మోక్షము భగవదనుగ్రహముచే ప్రకాశముగా జరుగును.

అట్లు శిరఃస్థానమునుండి గాక ప్రక్కదారిగా వెళ్ళినచో జీవుడు మరల శరీరమున ప్రవేశించును. అందుచే సీతమ్మ రావణుని చంపిన తరువాత రామునితో కలసి వెళ్ళవలెనని కోరుచున్నది.

హేతుమంతములగు సీతమ్మ మాటలను విని హనుమ ఇట్లు బదులుపల్కెను.

"అమ్మా! వానర సైన్యనాయకుడగు సుగ్రీవుడు బలవంతుడు. నిన్ను రామునితో చేర్చుటకు కృతనిశ్చయుడై యున్నాడు. కొన్ని కోట్ల వానరులతో ఆతడు త్వరలో ఇచ్చటకు రానున్నాడు. ఆ సుగ్రీవుని ఆజ్ఞను పాలించి మన సుకంటె అధికమగు వేగముతో పోగల బలవంతులగు వానరులు కొన్నికోట్లు గలరు. వారు పైకినైనను, క్రిందకైనను, అడ్డముగానైనను పోగలరు. ఎంత గొప్పపనులనైనను వారు దిగులొందక చేయగలరు. వా రనేకపర్యాయములు మహోత్సాహముతో వాయుమార్గము ననుసరించి, భూమికి ప్రదక్షిణము చేసి వచ్చినవారు.

"మ ద్విశిష్టా శ్చ తుల్యా శ్చ సన్తి తత్ర వనౌకసః
మత్తః ప్రత్యవరః కశ్చిత్ నాస్తి సుగ్రీవసన్నిధౌ.
అహం తావదిహ ప్రాప్తః కిం పునస్తే మహాబలాః
నహి ప్రకృష్టాః ప్రేష్యన్తే ప్రేష్యన్తే హీతరేజనాః."

(సుంద. 39.38,39)

"నేనే గొప్పవాడనని నీ వనుకొంటివి. కాని, అమ్మా! సుగ్రీవునివద్ద నాకంటె గొప్పవారు, నాతో సమానులు ఎందరో గలరు. నాకంటె తక్కు

వవా డొక్కడును లేడు. ఇటువంటిపనులకు ఉన్న వారిలో తక్కువవారిని పంపుదురుగాని పెద్దవారిని పంపరు. అందుచే నన్ను పంపిరి. నేనే ఇచ్చటకు వచ్చినపుడు వారి సంగతి చెప్పవలయునా?

అందుచే విచారింపకుము. మా వానరులు ఒక్కగంతున లంకలో దూకగలరు. నా వీపుపై కూర్చుండి మహాబలశాలురగు రామలక్ష్మణులు చంద్రసూర్యులవలె నీవద్దకు వచ్చెదరు. లంకను బాణములతో చీకాకుపరచెదరు. రాముడు రావణుని చంపి నిన్ను తీసుకొని పట్టణమున కేగును.

కాలమున కెదురు చూచుచు ఓర్పుకొనుము. కొలది కాలములో ప్రజ్వ లించుచున్న అగ్నిహోత్రమువలె రాముని చూడగలవు. రోహిణి చంద్రునితో కూడినట్లు రామునితో చేరగలవు.

ఇట్లు వైదేహిని ఓదార్చి హనుమ తిరుగు ప్రయాణమునకు సిద్ధపడెను. మరల సీతమ్మకు ధైర్యముచెప్పి "అమ్మా! శోకముతో విలపింపకుము. నీ మనసునకు అప్రియము జరుగదు. శచీదేవి ఇంద్రునితో కూడియుండినట్లు నీవు రామునితో కూడెదవు. రామునికంటె గొప్పవాడు వేరొక డెవడును లోకములో లేడు. లక్ష్మణునితో సమానుడంతకంటె లేడు. అగ్నివాయువులతో సమానులగు వారిద్దరు నీకాశ్రయమై యున్నారు. నీకు భయములేదు.

"నాస్మిం శ్చిరం వత్స్యసి దేవి దేశే
రక్షోగణై రధ్యుషితేఽతిరౌద్రే,
న తే చిరా దాగమనం ప్రియస్య
క్షమస్వ మత్సంగమకాలమాత్రమ్." (సుంద.39.54)

"అమ్మా! ఈ ప్రదేశమున నీవు చాలరోజులుండవు. రాక్షసులధివసించిన భయంకరమగు ఈ లంకలో ఇక నీవు ఉండవు. కొద్ది రోజులలోనే, నీ ప్రియుడగు రాముడు వచ్చును. నే నా రామునితో కలియుటయే ఆలస్యము. అంతవరకు మాత్రము నీవు ఓర్చియుండుము."

**40** మహాత్ముడగు వాయుపుత్రుని మాటలను విని సీత మరల ఇట్లు పల్కెను.

"వానర! పగము మొలచిన చేనుగల పొలముపై వర్షము పడినట్లు నీమాట నాకానందమును కల్గించుచున్నది. పురుషశ్రేష్ఠుడగు రాముని, శోక

ముచే కృశించిన నా అవయవములతో స్పృశించునట్లుగా అనుగ్రహింపుము. కాకిపై అస్త్రమును ప్రయోగించిన గాథను రామునకు గుర్తుగా ఎఱింగింపుము.

ఒకనాడు నా బొట్టు చెరిగిపోగా మనశ్శిలతో బొట్టును పెట్టిన సంగతి గుర్తుచేయుము.

పరాక్రమవంతుడ వగు నీవు రాక్షసస్త్రీల మధ్యను నేనుండగా ఎట్లోర్చితివి, అనినా నని చెప్పుము. ఇంతకాలము ఈ చూడామణిని జాగ్రత్తగా రక్షించుకొని రాముని చూచినట్లే చూచి ఆనందించుచున్నానని చెప్పుము.

ఈనా డీమణిని నీద్వారా రామునకు పంపుచున్నాను. ఇక నెలరోజులు దాటి జీవింపను. ఈ రాక్షసస్త్రీలయొక్క హృదయభేదకములగు మాటలను, సహింపరాని దుఃఖమును, రామ! నీకొఱకై అనుభవించుచున్నాను. నెలరోజులు మాత్రమే ఇక జీవింతును. నెలరోజులు దాటిన తరువాత నీవు లేనిదే జీవింపను.

రాక్షసరాజగు రావణుడు చాల ఘోరమైనవాడు. నావిషయమున వాని చూపు సుఖముగా లేదు. రామ! నాకొఱకు బాధపడుచుంటివని తెలిసినది. కావున ఇంక నేను క్షణమైనను జీవింపలేను."

అని కన్నీటితో దీనముగా సీతమ్మ పల్కుచున్న మాటలను విని, హనుమ ఇట్లనెను.

"అమ్మా! రాముడు శోకముచే ఏ విషయమునను ఆనందమనుభవించుటలేదు. ఆతని దుఃఖమును చూచి లక్ష్మణుడు బాధపడుచున్నాడు. నీవు నా కంటబడితివి. ఇంక శోకింపనవసరములేదు. ఈ క్షణముతో నీ దుఃఖము లంతమైనవి. రామలక్ష్మణు లిర్వురు ఉత్సాహముతో నిన్ను చూడవచ్చి లంకను భస్మముచేయుదురు. క్రూరుడగు రావణుని యుద్ధములో చంపి నిన్ను తమ పట్టణమునకు తీసికొని వెళ్ళుదురు. అమ్మా! రామునికి ప్రీతిని కల్గించు గుర్తును వేరొకదానిని దేనినైనను ఒసగెదవా?" అని హనుమ యడుగగా---

సీతమ్మ "ఈయునే ఇచ్చితిని?" ఈ నా కేశభూషణమును జూచిన రామునకు నీమాట నమ్మదగినది యగును" అని చెప్పెను.

వెంటనే హనుమ శరీరమును పెంచి మరల ఎగురుటకు ఉత్సాహముతో నుండెను. అట్లు సిద్ధపడుచున్న హనుమనుజూచి, కనుల నీరునింపుకొని, బాష్పగద్గదమగు స్వరముతో సీతమ్మ హనుమతో ఇట్లనెను.

"ఓ హనుమ! సింహసదృశులగు ఆ రామలక్ష్మణులను, సుగ్రీవుని, మంత్రులను, అందరను కుశల మడిగితినని చెప్పుము."

"యథా చ స మహాబాహుః మాం తారయతి రాఘవః,
అస్మా ద్దుఃఖాంబు సంరోధాత్ త్వం సమాధాతు మర్హసి.
ఇమం చ తీవ్రం మమ శోకవేగం
రక్షోభి రేభిః పరిభర్త్సనం చ,
బ్రూయాస్తు రామస్య గతస్సమీపం
శివశ్చ తేఽధ్వాస్తు హరిప్రవీర." (సుంద. 40-23,24)

"వానరోత్తమ! మహాబాహువగు రాముడు నన్నీ దుఃఖసముద్రమునుండి తరింపచేయునట్లు నీ వొనర్పవలెను. రాముని సమీపమున కేగి నే ననుభవించుచున్న తీవ్రమైన శోకమును, రాక్షస స్త్రీలు నన్ను బెదిరించుటను చెప్పుము. నీ ప్రయాణము సుఖముగా సాగుగాక!"

ఈ విధముగ రాజపుత్రియగు సీతమ్మ తన బాధ లన్నింటిని చెప్పగా తెలిసికొని వానరుడు కృతార్థుడై ఆనందముతో ఇక చేయవలసిన పని కొద్దిగ మిగిలియున్నదని తలంచి, మనసుతో ఉత్తర దిక్కును చేరెను.

## 41 తత్త్వదీపికః-

రాముడు పంపి ఉంగరము కరవిభూషణము. దాని కర్థమేమో తెలిసికొంటిమి.

సీత తిరిగి రామునకు గుర్తుగా పంపించినది చూడామణి. ఇది కేశభూషణము.

దీని యర్థమేమో చూతము.

పరమాత్మయే రక్షకుడను విశ్వాసమును కల్గించెడి మంత్రమును భగవంతుడాచార్యుని ద్వారా పంపును. మోక్షమం దిచ్ఛగల జీవుడు ఆచార్యునిద్వారా భగవంతునకు తెలియజేయవలసినది తనకు గల భగవద్వ్యామోహము. ఆ వ్యామోహమునకే కేశభూషణము అనిపేరు.

స్త్రీయొక్క కేశపాశమే పురుషునకు వ్యామోహమును కల్గించును. అందుచే పురుషుడు లేని స్త్రీకి వ్యామోహము పోయినదని సూచించుటకు

కేశములను తీసివేయుట ఆచారమైనది.

అట్లే భగవత్సన్నిధిని కేశముల నర్పించుట వ్యామోహమును విడుచుటయే! వ్యామోహము ఆత్మకు, విషయములపైనను - భగవంతునిపైనను కూడ ఉండవచ్చును.

విషయములపై వ్యామోహము ఆత్మస్వరూపమును చెరచును.

భగవంతునిపై వ్యామోహము ఆ వ్యామోహమునకే అందము నిచ్చును.

అందుచే భగవద్వ్యామోహము కేశభూషణము. విషయములపై వ్యామోహములేక భగవంతునియందే వ్యామోహముకల్గి, ఆ వ్యామోహముచే, పొందిన గాని జీవింపలేనిస్థితి కల్గినట్లు ఆచార్యునిద్వారా భగవంతునికి ఎఱింగింపవలెను. ఇదియే సీతమ్మ పంపిన చూడామణి.

కాకాసురవృత్తాంతముచే తాను శరణాగత వనియు, శరణాగత రక్షణము నీచుడగు కాకాసురునియందు గూడ ప్రదర్శించిన స్వామి తన నుపేక్షింప తగదని నివేదించును.

చివరకు రాముడు మనశ్శిలతో బొట్టు నుంచుట గుర్తుగా చెప్పెను.

భగవదనురాగము=భక్తి కూడ భగవద్దత్తమే గాని తన ప్రయత్నముచే లభించినది కాదని అమ్మ సూచించెను.

ఈ విధముగ విడుదలను కోరు జీవుడు-ముముక్షువు ప్రవర్తింపవలసిన విధానము ఇంతవరకు సూచింపబడెను.

హనుమ ఆచార్యుడుగా శిష్యుని పరీక్షించెను.

కావి శిష్యుడు కూడ గురువును సరిగా తెలిసికొననిదే గురువుగా వరింపరాదు. గురువుయొక్క జ్ఞానవైభవమును వారి ఆచరణముచే తాను గుర్తించి అపుడు గురువుగా వరింపవలెను.

సీతమ్మ హనుమను అనుమానించెను. హనుమ రాముని దివ్యమంగళవిగ్రహమును, గుణములను కీర్తించును. కొంతనమ్మును. ఆపైన అంగులీయకము నొసంగును. స్వస్వరూపమును దర్శింపచేయును.

ఇట్లాచార్యుని స్వరూపము నెఱింగి శిష్యుడు వరింపవలెనని సీత తన ఆచరణే సూచించెను.

ఆచార్యునకు ఎంతశక్తియున్నను అహంకార ముండరాదు. అహంకార

మున్నచో ఎంత జ్ఞాన మున్నను ఆ జ్ఞానము విషము కలిసిన ద్రాక్షరసమువలె అనుపయుక్త మగును. అందుచే అహంకార రహితుడై యుండవలెను. ఆ విషయమును హనుమ ఇందుసూచించును.

సీతమ్మ హనుమను ప్రశ్నించుచు, "నీవు ఒక్కడవు తప్ప సముద్రము దాటగలవారు మీ వానరులలో లేరుగదా! కార్యము ఎట్లు నెరవేరును?" అని పలికెను. నిజముగ హనుమ ఒక్కడే సముద్రలంఘనమున సమర్థుడు. అయినను హనుమ అహంకరింపక "మా వానరసైన్యములో అందరును నాకంటె గొప్పవారో, నాతో సమానులో గాని నాకంటె తక్కువవాడు ఒక్కడును లేడు" అని పల్కెను. ఇది హనుమ యొక్క అహంకార రాహిత్యమును సూచించును. ఈ స్థితి ఆచార్యునకెంతయు ఆవశ్యకము.

ఇట్లు సీతా హనుమత్సంభాషణమున శిష్యాచార్యస్వరూపము స్పష్టముగా నిరూపింపబడెను.

ఇంతవరకు రెండుభాగములైనవి. 1. అన్వేషణము, 2. దర్శనము. ఇక మిగిలినది 3. విరోధి నిరసనము.

ఇందు హనుమ సాధకుడుగా, భగవదనుగ్రహము నొంది జీవుని తరింప చేయుటకు వచ్చిన ఆచార్యుడుగా, దూతగా మనకు కన్పట్టును. భగవత్ప్రాప్తిని కోరు సాధకుడు ముందుగా దేహముకంటె ఆత్మ వేరు అను జ్ఞానమును పొంది, ఆ జ్ఞానముతో కర్మ నాచరింపవలెను. దానిచే ఆత్మస్వరూపమును దర్శించుటకు తగిన ఇంద్రియజయము, మనోజయము సిద్ధించి సిద్ధ్యసిద్ధులలో సమత్వబుద్ధి ఉదయించి ఆత్మనిష్ఠుడై ఆత్మదర్శనమును చేయును. దానిచే భగవత్ప్రాప్తికి విరోధులను నశింపచేసికొని భగవానుని వద్దకు చేరును. సుందరకాండలోని హనుమ ప్రయాణ వృత్తాంతము దీనిని సూచించును.

ఆచార్యుడు భగవదనుగ్రహమును పొంది వాని యాజ్ఞచే సంసారమున ప్రవేశించి, భగవత్ప్రాప్తికై తపించుచు బంధములో నున్న జీవుని అన్వేషించి, పరీక్షించి, భగవత్కథాప్రసంగములచే, భగవద్గుణవర్ణనలచే ఆనందమును కల్గించి, తన స్వరూపమును శిష్యునకు దర్శింపచేసి, మంత్రము నొసంగి, ధైర్యమును కల్గించి, భగవత్ప్రాప్తికి గల ప్రతిబంధకములను తొలగించి, మరల భగవానుని వద్ద కేగి, జీవుని వ్యామోహమును భగవానునకు విన్నవించి రక్షింపచేయును. ఇది ఆచార్యకృత్యము. దీనిని సుందరకాండ వివరించును.

రామదూతగా హనుమచేసిన మహాద్భుతమగు వృత్తాంతము సుందర కాండమున నిరూపింపబడినది. సీతారామ భక్తుడుగా హనుమ ఇందు మనకు దర్శనము ఇచ్చును.

సీతాదేవి ఇందు భగవంతునికి దూరమై, బంధములో నుండి, భగవత్ప్రాప్తికై తపించుచున్న ముముక్షువగు జీవుడు ఎట్లు ప్రవర్తింపవలెనో నిరూపించును.

జగన్మాతగా భగవద్విముఖుడగు జీవుని భగవంతునితో చేర్చుటకు ప్రయత్నముచేసి ఘటకురాలుగా లక్ష్మీస్వరూపమును నిరూపించును.

పతివ్రతయైన స్త్రీ భర్తకు దూరముగా నున్నపుడు ఎట్లు ప్రవర్తింపవలెనో పాతివ్రత్యము యొక్క మహిమ ఎట్టిదియో సీత నిరూపించును.

ఇట్లు బాహ్యాంతరార్థములతో సుందరకాండ జీవితమున ఆవశ్యకమగు విషయములను వివరించెను.

శ్రీరామమంత్రము :- "ఓం రామాయ నమః"

అని మూడుభాగములుగా నుండును. ఇందు 'ఓం' అనునది 'అ' కారముచే తెలియజేయబడు సర్వేశ్వరునకే, 'మ' కారముచే తెలియజేయబడు జీవుడు చెందినవాడని నిరూపించును.

'ఓం' అను అక్షరముతోనే ఆత్మను పరమాత్మతో చేర్చవలెను.

'ఓం' అను అక్షరముతోనే ధ్యానము చేయవలెను.

నిత్యము కలసి యుండవలసిన జీవపరమాత్మలను కలుపుటకు చేయు ప్రయత్నమే అన్వేషణము. ఆ అన్వేషణము 'ఓం' అను అక్షరముతో జరుగును.

కావున హనుమ సీతను అన్వేషించిన భాగమంతయు 'ఓం' అను మంత్రములోని ప్రథమాక్షరమునకు వివరణము.

సీతమ్మ రామునికే చెందిన దానవని ఐశ్వర్యమును గాని, ధనమును గాని కాంక్షింపక రావణుని తిరస్కరించి, రామవృత్తాంతమును విని ఆనందము నొందిన సీతావృత్తాంతము 'రామాయ' అను పదము యొక్క అర్థమును వివరించును.

రామాయ=రాముని కొఱకు. అనుపదము 'రామునకే చెందినది' అని "రాముని శేషిత్వము" ను "జీవుని స్వరూపము"ను నిరూపించును. రాముని

గుణములను స్వరూపమును తెలియచేయును. సీతమ్మ చేసిన తపస్సంతయు అదియే! అందుచే సీతమ్మ వృత్తాంతము, శ్రీరామవర్ణనము 'రామాయ' అను పదముయొక్క అర్థమును వివరించును.

మూడవ పదము 'నమః' అనునది విరోధులను తొలగించును. హనువు అశోకవనమును పాడుచేయుట, లంకను కాల్చుట మున్నగు చివరికథ యంతయు 'నమః' అను పదముయొక్క అర్థమును వివరించును. ఇట్లీ కాండ రామమంత్రమునకు వివరణముగా సాగినది.

సీతమ్మచే పూజింపబడిన హనుమ ఆ ప్రదేశమునుండి తొలగి, వెనుకకు పోదలంచి ఇట్లాలోచించెను.

"కార్యమంతయు పూర్తియైనది. ఇక కొద్దిగా మిగిలియున్నది. సీతమ్మను చూచితిని.

ఇక నేను రాక్షసుల బలమును, దుర్గమును పరీక్షింపవలెను. వీరివద్ద సామ, దాన, భేదములు పనికిరావు. దండమునే ఉపయోగింపవలెను.

తామసులగు రాక్షసులకు సామము పనికిరాదు. ధనముచే బలిసిన వారలవద్ద దానము కుదురదు. బల దర్పితులగు జనులు భేదములచే చీల్చుటకు అశక్యమైనవారు.

అందుచే పరాక్రమమునే వీరియెడల చూపవలయును. రాక్షస బలాబల ములను, రావణుని హృదయమును ఎఱుంగుటకు పరాక్రమము తప్ప వేరొక మార్గము లేదు. యుద్ధములో రాక్షసులను కొందరను చంపినచో వారు మెత్తపడుదురు."

చేయవలసిన పనిని చేయుచు ఎవడు మరికొన్ని పనులను ఎక్కువగా చేయునో వాడు కార్యమును చేయగల సమర్థుడు: మొదటి కార్యము చెడ కుండ మరికొన్ని కార్యములను సాధించుట కార్యసాధకుని లక్షణము.

స్వల్పమైన కార్యమును సాధించుటకుకూడ అనేకవిధముల యత్నములు చేయవలెను. అట్టిచో ఇట్టి మహాకార్యమున చెప్పనదేమున్నది? ఒక విషయ మును తెలిసికొనుటకు ప్రయత్నించి అనేక విషయములను ఎఱుంగగల్గినవాడే కార్యసాధనమున సమర్థుడు.

శత్రుబలముయొక్క, మా బలముయొక్క శక్తులలోని తారతమ్యము

నెఱింగి నేను కిష్కింధ కేగవలెను. అప్పుడే నేను మా ప్రభువు శాసనమును పాటించినట్లగును. రాక్షసులతో బలాత్కారముగా యుద్ధము కలుగవలెను. అట్లు యుద్ధము తనంతవచ్చునట్లు చేయవలెను.

అపుడు రావణుడు తనవారి బలమును నా బలమును ఎఱుంగగలడు. సైన్యముతో, మంత్రులతో కూడిన రావణుని నేను చూడవలెను. వాని మనస్సులోని అభిప్రాయము నెఱుంగవలెను. అపుడు నేను సుఖముగా వెనుక కేగగలను. అట్లు రావణుని చేరుటకు ఒక్కటే ఉపాయము కావవచ్చుచున్నది.

నేత్రములకు, మనస్సునకు మనోహరమగు నందనవనమును బోలిన రావణుని ఈ వనమును, అగ్నిహోత్రుడు ఎండిన వనమును కాల్చినట్లు ధ్వంసము చేయుదును.

ఈ వనము పాడుకాగా రావణునకు కోపము వచ్చును. దానితో అశ్వములతో, రథములతో, ఏనుగులతో గూడిన, త్రిశూలపట్టిసాది ఆయుధములతో గూడిన సైన్యమును రావణుడు నాపై పంపును. అపుడు నాకు వారితో యుద్ధము కల్గును. చండపరాక్రములగు రాక్షసులతో అసహ్యపరాక్రముడనగు నేను యుద్ధముచేసి, రావణుడు పంపిన ఆ సైన్యమును చంపి నేను సుఖముగా కిష్కింధ కేగుదును" అని హనుమ మనసులో ఆలోచించుకొనెను.

వెంటనే భీమపరాక్రముడగు మారుతి కోపముగలవాడై పెనుగాలివలె తొడలవేగముతో చెట్లను ఊపుట కారంభించెను. పక్షులతో నిండిన, వృక్షములతో లతలతో గూడిన, ఆ అంతఃపుర వనమును వీరుడగు హనుమ భంజించెను. వృక్షములు విరువబడెను. జలాశయము కూలద్రోయబడెను. పర్వతశిఖరములు పిండిచేయబడెను. ఆ వనము చూచుటకు బాధను కల్గించుచుండెను. బెదరిన పక్షుల కూతలతో, కూలిన ఒడ్డుగల జలాశయములతో, వాడిన ఎఱ్ఱని చివుళ్ళతో వనమంతయు కార్చిచ్చు కాల్చినట్లుండెను. లతాగృహములు, చిత్రగృహములు పాడుచేయబడినవి. మహోరగములు, క్రూరమృగములు పీడింపబడినవి. శిలాగృహములు కూలద్రోయబడినవి. ఇట్లా మహావనమంతయు రూపు చెడియుండెను.

"సా విహ్వలా ఒశోకలతాప్రతానా
వనస్థలీ శోకలతాప్రతానా

జాతా దశాస్య ప్రమదావనస్య
కపేర్బలాద్ధి ప్రమదావనస్య." (సుంద. 41.20)

తత్త్వదీపిక :-

ఉద్యానభంగమును చేయుచున్న హనుమ ఎంత హేలగా ఆ వనమును ధ్వంసము చేయుచున్నాడో స్ఫురించునట్లు శబ్ద చిత్రములతో ఈ శ్లోకమును కవి రచించెను.

"అశోకలతాప్రతానా" ఆనందింపదగిన లతాసమూహములు గల వనస్థలి "శోకలతాప్రతాన" ఆయెను. శోకముతో నిండిన కమల, కల్హారాది పుష్పములు గలది ఆయెను.

దశాస్య ప్రమదావనమునందలి వనస్థలి ప్రమదావను డగు హనుమయొక్క బలముచే శోకింపదగిన స్థితినందెను.

ఇది రావణప్రమదావనము. అంతఃపురస్త్రీలు సంచరించెడి వనము.

హనుమ "ప్రమదావనుడు". ప్రమదా+అవన=సీతారక్షకుడు. ఇట్లు శబ్దచిత్రములతో అందముగా నడచినదీ శ్లోకము.

ఈ విధముగ వనమును పాడుచేసి మహాత్ముడగు రావణుని మనసునకు అప్రియమును కల్గించి, మహాబలులగు రాక్షసులతో ఒక్కడే యుద్ధము చేయదలంచి కాంతిమంతుడై తోరణము నధిష్ఠించి హనుమ ఒప్పుచుండెను.

**42** పక్షుల అరపులు, చెట్లు విరిగన చప్పుళ్ళు విని లంకలో నున్న వారందరు భయముచే కలత చెందిరి.

ఆ వనములోని మృగములు, పక్షులు భయముచే బెదరి పారిపోవుచుండెను.

రాక్షసులకు ఘోరమగు అపశకునములు కన్పట్టుచుండెను. సీతమ్మవద్ద కాపలా ఉన్న రాక్షసస్త్రీలు నిద్ర తెలివిరాగా ఆ వనమునంతయు ఒక కోతి పాడుచేయుచుండుట చూచిరి.

ఆ రాక్షసస్త్రీలనుజూచి మహాబలుడగు హనుమ వారికి భయమును గొల్పునట్టి రూపమును కన్పింపచేసెను.

కొండవలెనున్న మహాకాయుడగు ఆ వానరుని చూచి రాక్షస స్త్రీలు

"వీడెవడు? ఎవనివాడు? ఎటనుండి వచ్చెను? ఎందుకు వచ్చెను? నీతో వీ డేమి మాటాడెను? చెప్పుము. భయపడకుము" అని సీతమ్మ నడిగిరి.

అపుడు పతివ్రత యగు సీత "భీమరూపులగు రాక్షసులను నేనెట్లెఱుంగగలను? ఎవడో, ఏమిచేయునో, మీరే తెలిసికొనుడు."

"అహి రేవ హ్యహేః పాదాన్ విజనాతి న సంశయః" (సుంద.42-9)

"పాము జాడ పామే ఎఱుంగును. సంశయము లేదు. నేను కూడ వీనిని జూచి భయపడితిని. ఎవడో తెలిసికొనలేకపోతిని. కామరూపముతో వచ్చిన రాక్షసుడే అనుకొంటిని" అని పల్కెను.

తత్త్వదీపిక :-

ఇచట సీత అసత్యము పల్కినది. అట్లు పలుకవచ్చునా? అను సందేహము కల్గును.

హనుమ తన ప్రాణరక్షకుడు. నిజము చెప్పిన, ఆతనిని హింసింతురు. అందుచే నిజము చెప్పుట తప్పు. చెప్పకున్న అసత్య దోషము వచ్చును.

తాను సత్యము పల్కినందువలన వేరొకరికి అపాయము కలుగునపుడు తా నసత్య మాడి వారికి అపాయము కల్గకుండ చేయుట ధర్మము.

ఇట్లు సత్య మాడుటచే వచ్చిన పాపమును తాను పొందిన పొందుగాక! అని భావించి భూతహితమే సత్యము గనుక తా నిట్లు చెప్పుట సత్యమే యని సీతమ్మ అట్లు పల్కెను.

ఆమె చెప్పిన దానిలో సత్యము-అసత్యము కూడ ఉన్నది. మొట్టమొదట ఆ వానరుని తానెఱుంగకపోవుట, భయపడుట, రాక్షసుడనుకొనుట కూడ సత్యమే! కాన సత్యము చెప్పినది.

'పాము' అనుటకు సంస్కృతమున 'అహి' అను పదమును వాడెను.

'అహి' అను పదమునకు రెండర్థములు. 1. పాము, 2. అంతశ్శత్రువు.

సీతమ్మకు రాక్షసస్త్రీలు అంతశ్శత్రువులు. రాక్షసస్త్రీలకు హనుమ అంతశ్శత్రువు. అందుచే "వానిజాడ మీకే తెలియు" నని చమత్కారముగా పల్కెను.

హనుమ ఆచార్యుడు. సీతమ్మ శిష్యురాలు. ఆతని శరీరము రక్షణమునకు ఆమె అసత్య మాడినను దోషమురాదు. ఆమె రక్షణమునకు ఆమె ప్రయత్నించుకొనకూడదు గాని గురువు రక్షణకు తాను జాగరూకత వహింప

వలెను. అందుచే ఆమె అసత్య మాడినది.

ఇట్లే రాముడు కూడ అయోధ్యనుండి బయల్వెడలి అరణ్యమునకు వచ్చునపుడు అసత్య మాడుమని సుమంత్రునితో చెప్పెను.

రథముపై సీతారామలక్ష్మణు లేగుచుండగా వెనుకనుండి దశరథుడు వచ్చుచు "ఆపుము, ఆపుము" అనుచుండెను.

రాముడు "నడుపుము, నడుపుము" అనుచుండెను. అపుడు సుమంత్రు డేమి చేయుటకు తోచక సంశయించుచుండెను.

రాముడు "రథముసందడిలో విన్పడలేదని రేపు తండ్రిగారితో చెప్పుదువు. ఇప్పుడు పోనిమ్ము" అనెను.

ఇది ఒకరిని అసత్య మాడుమని చెప్పుట. ఇది మరియు దోషముకదా! రాముడిట్లేల చేసెను? అను సందేహము కల్గును.

కాని ఇది ధర్మమే!

తండ్రి ధర్మాచరణమున సమర్థుడు కానపుడు కుమారుడు వాని తరపున ధర్మము నాచరింపవలెను.

రాజు దేశమునకు మూలము. ఆతడు అసత్య వచనుడు కారాదు. ఆతని సత్యమును నిల్పుటకు కుమారుడైనను, మంత్రియైనను అసత్యమాడవచ్చును.

అందుచే తండ్రిని సత్యవచనుని చేయుటకు సుమంత్రుని అసత్యమాడు మని రాముడు ప్రేరణచేయుట ధర్మమే!

ఇట్లు సీతమ్మ పల్కిన మాటలను విని రాక్షసస్త్రీలు రావణునితో నివే దించుట కేగిరి. రావణుని సమీపమున కేగి ఆ వానరుని గూర్చి --

"రాజా! భీమశరీరుడగు ఒక వానరుడు అశోకవన మధ్యమున సీతతో మాటాడినాడు. ఆతనిని గూర్చి మేమెంత అడిగినను సీతమ్మ చెప్పుటలేదు.

ఆతడు ఇంద్రుని దూతయో, కుబేరుని దూతయో, సీతను వెతకుటకు రాముడే పంపినాడో, తెలియదు. అద్భుతరూపుడగు ఆ వానరుడు మృగగణా కీర్ణమగు నీ ప్రమదావనమును తుడిచిపెట్టినాడు. అందాతడు పాడుచేయని ప్రదేశము ఒకటియు లేదు. జానకి వసించిన ఆ వృక్షప్రాంతమే ఆతడు పాడుచేయలేదు.

శ్రమచేతనో, జానకిని రక్షించుటకో తెలియదు. ఆతనికి శ్రమ ఏమి?

జానకిని రక్షించుటకే! సందియము లేదు. సుందరములగు చివుళ్ళతో, పూలతో నిండిన బలసిన శింశుపావృక్షమును మాత్రమే ఆతడు పాడుచేయకుండ వదలినాడు.

ఉగ్రుడవగు నీవు, ఉగ్రరూపుడగు ఆ కోతికి తగిన దండము నాజ్ఞాపింపవలెను. నీవు మనసులో ప్రేమించిన సీతమ్మతో మాటాడుట ప్రాణములు తీసిన పని" అని చెప్పిరి.

రాక్షసస్త్రీలు పల్కిన మాటలను విని రావణుడు హోమము చేసిన అగ్నిహోత్రమువలె కోపముతో మండిపడెను.

"దీప్తాభ్యా మివ దీపాభ్యాం సార్చిష స్స్నేహ బిందవః"

కోపము కల్గిన ఆతనినేత్రములనుండి కన్నీటి బిందువులు మండుచున్న దీపములనుండి మంటతో నూనెబొట్లు పడినట్లు పడెను.

తత్త్వదీపిక :-

వాల్మీకి ఉపమానప్రయోగచాతుర్యము విచిత్రమైనది. సహజమైనది. సుందరకాండమున అది బహుభంగిమల కన్పట్టును.

మండుచున్న దీపమునుండి నూనె బొట్టుపడినచో అదిమంటతో పడును. అందు స్నేహము, దీప్తి రెండుండును. అట్లే రావణుని నేత్రములనుండి పడిన కన్నీటిబొట్లలో ప్రేమ, కోపము- అనునవి రెండును కన్పట్టుచున్నవి. మంటవలె కోపము. నూనెవలె ప్రేమ. ఈ రెంటి సమ్మేళనమును చూపించుటయే ఈ ఉపమానములోని అందము.

వెంటనే రావణుడు హనుమంతుని నిగ్రహించుటకు తనకు సమానులగు ఎనుబదివేలమంది కింకరులనెడి రాక్షసులను నియమించెను.

వా రాయుధములను దాల్చి హనుమను పట్టుకొని తేవలెనని సన్నద్ధులై బయల్దేరిరి.

హనుమ తోరణముపై నుండెను. ఆ కింకరు లందరు మిడతలు మంటలో దూకిన ట్లొక్కసారి హనుమపై పడిరి.

వారు గదలతోను, పరిఘలతోను, బాణములతోను హనుమను కొట్టిరి. ఆయుధములను దాల్చి ఆతని చుట్టుముట్టి నిలచిరి.

తేజస్వియగు హనుమకూడ పర్వతమంత పెరిగి, నేలపై తోక కొట్టి, గర్జించి, ఒడలు చరచికొనెను. ఆ ధ్వని ప్రతిధ్వనితో కలసి అంతట వ్యాపింపగా ఆకాశమున నున్న పక్షులు ప్రాణములను వీడి నేల కూలెను.

అపుడు హనుమ ఇట్లు తనను గూర్చి ఉద్ఘోషించెను.

"జయ త్యతిబలో రామో లక్ష్మణ శ్చ మహాబలః
రాజా జయతి సుగ్రీవో రాఘవే ణాభిపాలితః.
దాసోఽహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః.
న రావణ సహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్
శిలాభి స్తు ప్రహరతః పాదపై శ్చ సహస్రశః.
అర్దయిత్వా పురీం లంకా మభివాద్య చ మైథిలీం
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్."
(సుంద. 42.33, 34, 35, 36)

"అధిక బలుడగు రాముడు, మహాబలుడగు లక్ష్మణుడు అతిశయముతో వర్థిల్లుచున్నారు. రామునిచే రక్షింపబడిన సుగ్రీవుడు జయము కల్గి ఒప్పుచున్నాడు. నేను కోసలేంద్రుడగు రాముని దాసుడను. శత్రు సైన్యములను చంపువాడను. వాయువు పుత్రుడను. వేయిమంది రావణులు వచ్చినను యుద్ధములో నన్నెదిరించి నిలువలేరు. శిలలతో, వృక్షములతో మాత్రమే నేను కొట్టెదను. లంకాపురిని మర్దించి, మైథిలికి నమస్కరించి, సాధింపవలసిన కార్యమును సాధించి, రాక్షసులందరు చూచుచుండగా వెళ్ళెదను.

తత్త్వదీపిక :-

ఇది హనుమ రాక్షసవిజయమున కుపయోగించు జయమంత్రము. దీనిని చదువుకొనుచున్నచో మనకు కూడ విరోధులు తొలగి విజయము చేకూరును.

కింకరు లనెడి రాక్షసులను చంపుటకు ముందు తా నెవడో హనుమ చెప్పుకొని తోరణమునుండి దిగును.

సీతమ్మ హనుమ వెటింగించుటకు జంకి దాచెను. కాని హనుమ తననుగూర్చి తానే వివరించెను. తాను రామదాసుడనని ఇందు పేర్కొనెను.

ఇంతవరకు హనుమ ఎచ్చటను తనను దాసునిగా పేర్కొన లేదు. సుగ్రీ

వసచివుడు, రామదూత అనియే చెప్పచుండెను.

సీతమ్మను చూచిన తరువాత హనుమకు స్వస్వరూపము తెలిసెను.

ఆత్మలకు సహజమగు రూపము భగవద్దాస్యము.

"దాస భూతాః స్వత స్సర్వే హ్యాత్మానః పరమాత్మనః"

ఆత్మ లన్నియు పరమాత్మకు సహజముగా దాసులేయని చెప్పబడినది. తాను ఏ కార్యము చేయుచున్నను వానిదాసుడై వాని అతిశయమునకే చేయ వలెను.

సర్వశక్తిమతి యగు సీత రామునకే చెందినదై ఉండుట చూచి అట్టి శేషత్వమే ఆత్మ స్వరూప మని హనుమ గుర్తించెను. అందుచే తనను రామదాసుగా పేర్కొనెను.

ఇట తాను చేయు సర్వవ్యాపారములు రాముడే తన ద్వారా చేయించు చున్నాడని దానివలన కలుగు అతిశయ మాతనిదే యని భావించును. అట్లు భావించి రాక్షసులను జయించును.

మనము కూడ దీనిని భావించినచో హనుమవలె, ఖేదము నొందక విజ యము నొందుదుము.

ఇపుడు హనుమ చేయునది విరోధి నిరసనము. శత్రువులను చంపుట. దానిని చేయువాడు తాను కాదనియు ఆ కర్మ తనది కాదనియు, దానివలన కలుగు ప్రీతియు తనది కాదనియు హనుమ భావించుచుండెను. అట్లు భావించుచు కర్మ చేయుచుండెను.

ఇదియే మనము అలవరచుకొనవలసిన విజయమంత్రము.

దీనిని సూచించుటకు హనుమ ఇచట తోరణముపై కూర్చుండియుం డును. రాక్షసులను చంపుటకు మాత్రము క్రిందికి దూకుచు మరల తోరణము నెక్కుచుండును.

ఈ తోరణ మేమో తెలిసికొనవలెను.

మనకు విరోధులు మూడు——

(1) "నేను స్వతంత్రుడను-నాకే చెందినవాడను" అనుకొనుట.

(2) తనను తాను రక్షించుకొన యత్నించుట.

(3) తాను చేయు కర్మవలన కలిగెడి ప్రీతి తనదే అనుకొనుట.

ఈ మూటిని జయించుటయే విరోధి విజయము.

దీనికి "నమః" అను శబ్దము సాధనము.


భగవత్ ప్రాప్తి మానవ జీవితమునకు ప్రధాన లక్ష్యము. దానిని చేరుటకు మంత్రమే ద్వారము.

అది ఎనిమిది అక్షరముల మంత్రము కావచ్చును. ఆరక్షరముల మంత్రము కావచ్చును.

అందు మూడు భాగము లుండును. ఈ మూటిని ద్వారముగా భావింపవలెను.

"థామ్ రామాయ నమః"

గుమ్మమునకు నాలుగు కమ్ములుండును. రెండుప్రక్కల రెండు. పైన ఒకటి, క్రింద ఒకటి.




ఇందు "శాం, రామాయ" అనునవి గుమ్మమునకు రెండు ప్రక్కలనుండు రెండు కమ్ములవంటివి. "నమః" అనునది రెండుగా విడదీయ దగినది. "న, మః," 'మః' అనునది గుమ్మునకు క్రింది కమ్మి "న" అనునది పై కమ్మి. పై దానిని తోరణ మందురు. దానిపై హనుమ విలచియుండెను.

అనగా "నమః" శబ్దములోని "న" కారముపై ఊనిక కల్గియుండెను. "మః"=నాది, "న"= కాదు.

"నేను నాకు చెందినవాడను కాను. నేను నాకు రక్షకుడనుకాను. చేసిన పనివలన కల్గెడి ప్రయోజనము నాది కాదు" అను భావముతో నుండి హనుమ యుద్ధము చేయుటకు దిగెను. విరోధి నిరసనమునకు హనుమ అనుసరించిన విధమును జీవితమున మనము నేర్చుకొనవలెను.

ఇట్లు తననుగూర్చి చాటుకొనుచున్న హనుమను ఆ కింకరులు చూచిరి. స్వామి ఆజ్ఞచే విచిత్రములగు ఆయుధములతో ఆతనిపై పడిరి. ఆత డా తోరణమునకు చెందిన ఇనుప పరిఘ నొకదానిని పట్టుకొని ఆ రాక్షసుల నందరను చంపెను.

పరిఘను పట్టుకొని హనుమ పామును పట్టుకొనిన గరుడుని వలె కన్పట్టెను. హనుమ ఇట్లు కింకరుల నందరను చంపి, మరల యుద్ధమును కోరి తోరణము నధిరోహించెను.

కొందరు రాక్షసులు భయపడి పరుగెత్తి హనుమ కింకరులను చంపెనని రావణునకు నివేదించిరి. రాక్షసులు చనిపోయినారని విని వెంటనే రావణుడు అప్రతిమపరాక్రము డగు ప్రహస్తుని కుమారుని హనుమపై పంపెను.

## 43 హనుమ కింకరులను చంపి—

"వనమంతయు విరిచితిని. కాని ఈ చైత్య ప్రాసాదమును మాత్రము పాడుచేయనైతిని. దీనిని కూడ ధ్వంసము చేసెదను" అని అనుకొనుచుండెను.

మేరుపర్వత శిఖరమువలె నున్న ఆ ప్రాసాదముపైకి దూకెను. పర్వతమువలె నున్న ఆ ప్రాసాదము నధిరోహించిన హనుమ సూర్యున కెదురుగా నిల్చిన సూర్యుడా? అనునట్లుండెను.

ఆ ప్రాసాదమును పాడుచేసి హనుమ పారియాత్ర మను కుల పర్వతమువలె భాసించుచుండెను.

ఒక్కసారి గర్జించి ఒడలు చరచికొనెను. ఆ ధ్వనితో ఆ ప్రాసాదమునకు కాపలా ఉన్నవారందరు మూర్ఛపడిరి. అపుడు హనుమ మరల,

"అస్త్ర విజ్ఞయతాం రామో లక్ష్మణ శ్చ మహాబలః
రాజా జయతి సుగ్రీవో రాఘవే ణాభిపాలితః." (సుంద.43-8)

అని వెనుకటి జయమంత్రమును మరల ఉచ్చరించెను. దానిని విని ఆ ప్రాసాదమును కావలా కాచువారు వందమంది ప్రాసములను, ఖడ్గములను పట్టుకొని మారుతిని చుట్టుముట్టిరి. వారు గదలతో, పరిఘలతో హనుమను మొత్తిరి. అపుడు కుపితుడై హనుమ భీమరూపమును దాల్చి ఆ మేడయొక్క ఒక బంగారు స్తంభమును ఊడబెరికి అనేక విధములుగా త్రిప్పుచుండెను. అపుడా స్తంభము తగిలి భవనము నుండి అగ్ని బయల్దేరెను. ఆ ప్రాసాదము తగులబడెను. ఆ స్తంభముతో ఆ నూఱుమంది రాక్షసులను చంపెను.

శ్రీమంతుడగు హనుమ అంతరిక్షములో నిలచి--

"సుగ్రీవుని యాజ్ఞ ననుసరించి నావంటి కొన్నివేల మంది వానరులు భూమండల మంతట సంచరించుచున్నారు. వారిలో కొందరు పది ఏనుగుల బలము గలవారు. కొందరు నూఱు ఏనుగుల బలము గలవారు. కొందరు వేయి ఏనుగుల బలము గలవారు. కొందరు వాయుబలులు. కొంద రప్రమేయ బలులు.

అట్టివానరులతో మిమ్ముల నందరను చంపుటకు సుగ్రీవుడు వచ్చుచున్నాడు. మహాత్ముడగు రామునితో వైరమును పెట్టుకొనుటచే మీ లంకాపురి యుండదు. మీరు ఉండరు. రావణుడు ఉండడు." అని చెప్పుచుండెను.

**44** రావణునిచే ఆజ్ఞాపింపబడినవాడై ప్రహస్తుని కుమారుడగు జంబుమాలి ధనుర్ధరుడై హనుమపై దాడికి వెడలెను. ఎఱ్ఱని మాల్యములను, వస్త్రములను దాల్చినవాడై తిరుగుడుపడుచున్న కన్నులు గలవాడై, ఇంద్రధనుస్సుతో సమానమగు ధనుస్సును సారించుకొనుచు బయల్దేరెను. ఆ ధనుస్సు యొక్క ధ్వనితో దిక్కులు విదిక్కులు కూడ నిండిపోయెను.

గాడిదలు పూన్చిన రథము నెక్కి వచ్చిన ఆ జంబుమాలిని జూచి హనుమ సంతోషించెను. తోరణముపై కూర్చుండిన హనుమను జంబుమాలి చూచి వాడియగు బాణములతో కొట్టెను. అర్ధచంద్రాకారమగు బాణముతో ముఖమునందు శిరస్సునందు కొట్టెను. పది బాణములతో బాహువులపై కొట్టెను.

బాణపు దెబ్బలకు రక్తము చిమ్మి హనుమ ముఖము వికసించిన ఎఱ్ఱ తామరపువ్వువలె నుండెను.

బాణపుదెబ్బ తిని హనుమ కోపముగలవాడై ఆ ప్రక్కనే ఉన్న విశాలమగు వొక శిలను జూచి దానిని పెకలించి జంబుమాలిపై విసరెను. దానిని జంబుమాలి పది బాణములతో ముక్కలు చేసెను. అపుడు హనుమ ప్రక్కనున్న ఒక పెద్ద చెట్టును ఊడబెరికి జంబుమాలి పైకి వెళ్ళుచుండెను.

అపుడు జంబుమాలి ఆ చెట్టును నాలుగు బాణములతోను, భుజముపై ఐదు బాణములతోను, గుండెపై ఒక బాణముతోను, రొమ్ముపై పది బాణములతోను హనుమను కొట్టెను. దానితో హనుమకు కోపమువచ్చి ఆ తోరణముయొక్క పరిఘ నూడబెరికి జంబుమాలి గుండెలపై కొట్టెను.

దానితో --

"తస్య చైవ శిరో నాస్తి న బాహూ న చ జానునీ
న ధను ర్న రథో నా ఽశ్వాః తత్రా దృశ్యన్త నేషవః"
(సుంద.44.17)

జంబుమాలి నుగ్గునుగ్గాయెను. ఆ జంబుమాలి శిరసు లేదు. బాహువులు లేవు. మోకాళ్ళు లేవు. ధనుస్సు లేదు. రథము లేదు. అశ్వము లేదు. బాణము లేదు. ఏవియు కన్పడలేదు. అంతయు పొడియాయెను.

తత్త్వదీపిక :-

ఇట్లు పొడి యగుట సూచించుటకు వాల్మీకి ఈ శ్లోకమును వ్యస్తపదము లతో రచించెను ఇం దొక్కటైనను సమస్తపదము లేదు. అన్నియు వ్యస్తములే. జంబుమాలి శరీరము, రథము మున్నగునవి కూడ అట్లే విడిపోయినవని యర్థము.

జంబుమాలి చనిపోయినా డని, కింకరులు చనిపోయినా రని రావణునికి మరింత కోపము వచ్చెను. వెంటనే మహాపరాక్రమవంతులగు ఏడుగురు మంత్రి పుత్రులను హనుమ మీదికి వెళ్ళవలసినదిగా రావణు డాజ్ఞాపించెను.

**45** రాక్షసేంద్రుడగు రావణునిచే ప్రేరేపింపబడినవారలై, అగ్నిహోత్రముతో సమానమగు వర్చస్సు గల ఏడుగురు మంత్రిసుతులు హనుమపై యుద్ధమునకు బయలుదేరిరి. మహాబలులగు వారేడుగురును మహాబలు లగు సైనికులతో కూడినవారై హనుమను జయింపవలెనని బయల్దేరిరి.

బంగారు జాలుతో గూడిన ధ్వజములు, పతాకములతో గూడిన, మేఘగర్జనమువంటి ధ్వనిగల మహారథములతో, బంగారుతో పొదుగబడిన చిత్రములగు ధనస్సులను సారించుచు ఉత్సాహముతో బయలుదేరిరి.

వారేడుగురును తోరణముపై నున్న హనుమపై మేఘములు వర్షించు చున్నట్లు బాణములను వర్షించిరి. వర్షములకు కొండవలె ఆ శర వృష్టిచే హనుమ కప్పబడి యుండెను. అతి వేగముగ ఇటు నటు సంచరించుచు బాణములు తలపై పడకుండునట్లు, వేగము గల రథములు తనను చేరకుండునట్లు హనుమ చేయుచుండెను.

ఇంద్రధనస్సులు గల మేఘములతో గాలి విహరించునట్లు, ధనుర్ధరు లగు ఆ మంత్రిసుతులతో హనుమ క్రీడించుచుండెను. ఘోరముగ శబ్ద

ముచేయుచు ఆ సైన్యము నంతను బెదరించుచు, హనుమ ఆ రాక్షసులపై పరాక్రమించుచుండెను. అరచేతితో కొందఱను కొట్టెను. పాదముతో కొంద ఱను కుమ్మెను. పిడికిలితో కొందఱను గుద్దెను. గోళ్ళతో కొందఱను గీరెను. గుండెతో కొందఱను త్రోసెను. తొడలతో కొందఱను కొట్టెను. కొందఱూ హనుమ ధ్వనికే నేలకూలిరి. ఇట్లు మంత్రిసుతు లందరును హనుమచే చంపబడిరి.

మిగిలిన సైన్య మంతయు బెదరి పది దిక్కులకు పారిపోయెను. రక్తము కారుచుండగా, అరచుచు పారిపోవుచున్న ఆ రాక్షసుల ధ్వనితో లంకయం తయు ప్రతిధ్వనించెను.

ఇట్లు హనుమ ఆ మంత్రిసుతులను చంపి ఇంకను మరికొందఱను చంపనుత్సాహము కలవాడై తోరణమును మరల అధిరోహించెను.

**46** మహాత్ముడగు హనుమ, మంత్రిసుతులను చంపినాడని విని రావణుడు లోలోపల ఆలోచించుకొని విరూపాక్షయూపాక్షులను, దుర్ధరుని, ప్రఘసుని, భాసకర్ణుని పంపుటకు నిశ్చయించుకొనెను.

వీ రైదుగురును సేనాగ్రనాయకులు. వీరు నీతి విశారదులు. వాయు వేగ సమవేగము కలవారు. హనుమంతుని పట్టవలెనను పట్టుదల గలవారు.

వారితో రావణుడిట్లు చెప్పెను.

"ఓ సేనానాయకులారా! వాజిరథమాతంగములతో మీరేగి ఆ వానరుని శాసింపుడు. వాని ఎదుట అప్రమత్తులుగా నుండవలెను. దేశకాలవిరోధులగు కార్యములను పరిహరింపుడు. ఆతడు వానరుడుకాడు. మహాబలముగల మహా భూతమై యుండవలెను. దానిని మనకొఱకు ఇంద్రుడు తన తపోబలముచే సృజించి యుండును.

ఇంతకుముందు మీ యందఱి సాయముతో నాగ యక్ష గంధర్వ దేవా సుర మహర్షుల ఓడించితిని. వారందరు మనకు అప్రియము చేయవలెనని పట్టుదలతో నుందురు.

ఈ వానరుడు వారి సృష్టియే అయియుండును. సందేహములేదు. వాని నెట్లైనను బలాత్కారముగ పట్టుడు. ధీరపరాక్రముడగు ఆ వానరుని అవమానింపకుడు.

ఇంతకుముందు పరాక్రమశాలురగు వానరుల నెందఱనో ఎఱుంగుదును.

వారి కిటువంటి వేగముగాని, తేజస్సుగాని, పరాక్రమముగాని, బలముగాని, ఉత్సాహముగాని, ఇచ్చవచ్చినట్లు రూపుమార్చెడి శక్తిగానిలేదు.

ఏదో మహత్తరమగు భూత మీ కపిరూపమున వచ్చియుండును. గట్టి ప్రయత్నముతో మీరితనిని పట్టవలెను.

ఇంద్రుడుగాని, సురాసురులుగాని యుద్ధములో మీ ఎదుట నిల్చుటకు సమర్థులుకారు. ఐనను జయమును కాంక్షించుచు, నీతి నెఱింగిన మీరు ఆత్మ రక్షణమును జాగరూకతతో చేసికొనవలెను. యుద్ధములో సిద్ధి స్థిరముగా నుండునది కాదు."

ఇట్లు రావణుడు చెప్పినమాటలను గ్రహించి, ఆ సేనానాయకులు రథములతో, గుఱ్ఱములతో బయల్వెడలిరి.

తన తేజస్సుచే సూర్యునివలె ప్రకాశించుచున్న ఆ మహాకపిని వీరులగు ఆ సేనానాయకులు గాంచిరి. తోరణముపైనున్న మహోత్సాహుడు, మహావీరుడునగు ఆ హనుమను చూచి, అన్ని దిక్కులనందరు నిలచి, ఆయుధములతో ఆతనిని చుట్టుముట్టిరి.

దుర్ధరుడు వాడియగు ఐదు బాణములను ఆ హనుమ శిరసున ప్రయోగించెను. ఐదు బాణముల దెబ్బతిని, ఒక్కసారి ధ్వనిచేయుచు, పది దిక్కులను ప్రతిధ్వనింపచేయుచు హనుమ ఆకాశములోని కెగిరెను. రథముతో నున్న దుర్ధరుడు హనుమపై వందలకొలది బాణములను చిమ్ముచుడెను. బాణములను వర్షించుచున్న ఆ దుర్ధరుని, వాయువు మేఘమును వారించినట్లు హనుమ అడ్డుకొనెను. దుర్ధరునితో హనుమ యుద్ధముచేయుచు చాల దూరముగ ఆకాశముపైకి ఎగిరి కొండపై పిడుగుపడినట్లు దుర్ధరుని రథముపై పడెను. దానితో దుర్ధరుని రథము విరిగిపడెను. ఎనిమిది గుఱ్ఱములు కూలిపోయెను. దుర్ధరుడు ప్రాణముల వీడి నేలపడెను.

నేల పడిన దుర్ధరుని జూచి విరూపాక్ష యూపాక్షులు రోషముతో హనుమపైకి ఉరికిరి. వేగముగల వారిరువురి వేగమును తగ్గించి హనుమ నేలపైకి దిగి ఆ ప్రక్కనున్న సాలవృక్షము నొకదానిని ఊడబెరికి ఆ ఇద్దరు రాక్షసులను చంపెను.

ఇట్లు ముగ్గురు చనిపోయినారని చూచి ప్రఘసుడు హనుమపై బడెను. ఒకవైపునుండి భాసకర్ణుడు శూలములు పట్టుకొని హనుమపైకి ఉరికెను.

రెండవవైపునుండి ప్రఘసుడు వాడియగు పట్టసముతో హనుమ నెదిరించెను. వారిరువురి దెబ్బలచే హనుమయొక్క ఒడలంతయు రక్తసిక్తమాయెను. అపుడు హనుమ బాలసూర్యునిపగిది భాసించుచుండెను. అపుడు కోపముతెచ్చుకొని హనుమ, మృగములతో, వృక్షములతో కూడిన ఒక కొండ శిఖరమును పెరికి ఆ యిరువురిని చంపెను.

ఇట్లయిదుగురు సేనాపతులు చనిపోగా వారి సైన్యమును, గుఱ్ఱములతో గుఱ్ఱములను, ఏనుగులతో ఏనుగులను, యోధులతో యోధులను, రథములతో రథములను కొట్టి హనుమ నాశనముచేసెను.

ఇట్లా హనుమ ఐదుగురు సేనానాయకులను చంపి ప్రళయకాలమున ప్రజాక్షయముచేసి ఉత్సాహముతో నున్న కాలునివలె ఉత్సాహముతో మరల తోరణమును అధిరోహించెను.

**47** హనుమ ఐదుగురు సేనాపతులను చంపెనని విని రావణుడు ఎదురుగా నున్న అక్షకుమారునివైపు చూచెను.

రావణుని చూపు తనపై పడుటయే ప్రేరణకాగా ప్రతాపవంతుడగు అక్షకుమారుడు బ్రాహ్మణులు ఉంచిన హవిస్సుతో ప్రజ్వలించిన అగ్నివలె ఒకసారి సభలో లేచి నిలచెను.

వెంటనే ఆతడు బాలసూర్యునివలె మెరయుచున్న బంగారుజాలుతో అలంకరింపబడిన రథము నధిష్ఠించి ఆ హనుమ నెదుర్కొనుటకు బయల్దేరెను.

ఆతడధిష్ఠించిన రథము తపస్సుచేసి సంపాదింపబడినది. పతాకముతో విరాజిల్లుచున్నది. రత్నములతో అలంకరింపబడిన ధ్వజముగలది. మనోజవము లగు ఎనిమిది గుఱ్ఱములు పూన్చినది. దేవతలు రాక్షసులు కూడ ఎదిరింపజాలనిది. శక్తి తోమరము మున్నగు పూర్ణమగు ఉపకరణములతో నిండినది. చంద్రుసూర్యులతో సమానమగు కాంతి గలది.

అట్టి రథ మధిరోహించి అక్షకుమారుడు హనుమతో యుద్ధమునకు బయల్వెడలెను. తురంగ మాతంగ మహారథ ధ్వనులు భూమ్యాకాశములను నింపుచుండ, సైన్యముతో గూడి అక్షకుమారుడు వచ్చి తోరణముపై కూర్చుండిన సమర్థుడగు హనుమను చేరెను.

ఆతనిని చూడగనే అక్షకుమారున కాశ్చర్యము తొట్రుపాటుకల్గెను. ఆత

నిపై గౌరవ మేర్పడెను. గౌరవముతో చూచెను. మహాత్ముడగు ఆ వానరుని వేగమును, పరాక్రమమును, తన బలమును, అక్షకుమారుడు నిర్ధరించుకొని మంచుతొలగగనే సూర్యుడు ప్రకాశించుచున్నట్లు ప్రకాశించెను.

స్థిరముగా, ఎవరిచే వారింపబడుటకు వీలుగాకుండ కూర్చుండిన ఆ హనుమను జూచి కోపముతో అక్షకుమారుడు మూడు బాణములతో హనుమను రెచ్చగొట్టెను. ఏమియు శ్రమలేక గర్వముతో లక్ష్యములేకుండ కూర్చుండిన ఆ హనుమను బాణపాణియై, ధనుర్ధరుడై అక్షకుమారుడు చూచెను.

బంగారు కంఠాభరణముతో, అంగదములతో, కుండలములతో ప్రకాశించుచు పరాక్రమశాలియగు అక్షకుమారుడు హనుమకు దగ్గరగా చేరెను.

వారిద్దరు ఒకరితో నొకరు చేరుచుండగా సురాసురులకుకూడ సంభ్రమము కల్గెను.

భూమి ధ్వనించుచుండెను. సూర్యుడు ప్రకాశింపలేదు. వాయువు వీచుటలేదు. కొండలు కదలిపోవుచుండెను.

ఆ హనుమకు అక్షకుమారునకు జరిగెడి యుద్ధమును జూచి పైవిధమగు మార్పు అంతట ఏర్పడెను.

ఆకాశము శబ్దించుచుండెను. సముద్రము కలతచెందుచుండెను. బాణములు సంధించుట విడచుట, లక్ష్యమును గురిచేసి కొట్టుట బాగుగా ఎఱింగిన అక్షకుమారుడు, వాడియైన మొనలుగల మూడు బాణములను విషముతో కూడిన పాములనువలె వానరునిశిరముపై ప్రయోగించెను.

శిరసుపై తగిలిన ఆ మూడు బాణములతో రక్తముస్రవించెను. కన్నులు తిరుగుడుపడుచు శిరసుపై గ్రుచ్చుకొనిన బాణములు కిరణములవలె నొప్పగా అపుడే ఉదయించిన సూర్యునివలె హనుమ ఒప్పుచుండెను.

చిత్రములగు ఆయుధములను, చిత్రమగు ధనుస్సును దాల్చియున్న అక్షకుమారుని చూచి తగినవాడని హనుమ సంతోషించెను.

యుద్ధమునకు సిద్ధమై పెరుగుచుండెను. మందర పర్వతశిఖరమున నిల్చిన సూర్యునివలె తీవ్రమై హనుమ తన నేత్రాగ్నికాంతులతో, బలముతో వాహనముతో కూడిన అక్షకుమారుని దహించెను.

అపుడా రాక్షసుడనెడి మేఘము వానరుడనెడి పర్వతముపై బాణములను వర్షించెను.

వృద్ధిపొందుచున్న తేజస్సు, బలము, వీర్యముగల చండవిక్రముడగు అక్ష కుమారుని జూచి, హనుమ సంతోషముతో గర్జించెను.

పరాక్రమముచే గర్వించినవాడై, కోపముగలవాడై, బాలుడగుటవలన, హనుమ స్వరూపము నెఱుంగలేక, గడ్డిపైని పరచిన గోతిలో ఏనుగుదిగినట్లు హనుమతో యుద్ధమునకు దిగెను.

అక్షకుమారుడు వదలిన బాణములు ఒడలిపైనాటగా హనుమ గట్టిగ గర్జించెను. ఒక్కసారి చేతులు విరజిమ్మి భయంకరమగు దర్శనము గలవాడై ఆకాశముపైకి ఎగిరెను.

ఆకాశములో నెగురుచున్న హనుమపై అక్షకుమారుడు బాణవర్షమును కురిపించెను. ఆ బాణములు ఒడలి కంటకుండ హనుమ మనోజవుడై ఆకాశ మున విహరించెను.

ఇట్లు బాణములను వదలుచున్న అక్షకుమారుని జూచి "ఈతడు సమ ర్థుడే" యని హనుమ మెచ్చుకొనుచు ఆతనివైపు జూచెను. చూచి—

"ఈతడు బాలసూర్యప్రభ కల్గి మహాబలుడై గొప్ప యుద్ధముచేయుచు న్నాడు. ఇట్టివానిని చంపుటకు నాకు బుద్ధిపుట్టకున్నది. ఈతడు మహాత్ముడు. పరాక్రమములో గొప్పవాడు. యుద్ధములో మంచి ఓర్మిగలవాడు. ఈతడు చేయుచున్న యుద్ధమును జూచి నాగులు, యక్షులు, మునులు కూడ ఈతనిని పూజింతురు. మనసున పరాక్రమోత్సాహములు వృద్ధిపొందుచుండగా నా కెదురుగా వచ్చి నిలచి ధైర్యముగా జూచుచున్నాడు. వీని పరాక్రమము దేవదానవులకు కూడ మనస్సున భీతిని కల్గించును. ఉపేక్షించిన వెనుకకు తిరిగిపోవువాడుకాదు. పరాక్రమము అంతకంతకు పెరుగుచున్నది. అందుచే ఈతనిని చంపుటయే తగును అని నాకు తోచుచున్నది. ప్రజ్వలించుచున్న అగ్నిని ఉపేక్షించుట తగదు."

అని ఈవిధముగ హనుమ శత్రువుయొక్క వేగము నాలోచించుచు తాను చేయవలసిన పనిని నిర్ణయించుకొనెను.

మహాబలుడగు ఆ కపీశ్వరుడాతనిని చంపుటకు తొందరతో లేచెను. భారము నోర్వగల్గిన మహాజవములగు అక్షకుమారుని రథమునకు పూన్చిన ఎనిమిది గుఱ్ఱములను అరచేతితో చరచి హనుమ చంపెను. ఆ మహారథ మును గూడ అరచేతితో ఒక్క దెబ్బ కొట్టెను. దానితో రథము విఱిగిపడెను. గుఱ్ఱములు చనిపోయెను.

అపుడా మహారథుడగు అక్షకుమారుడు రథమును వదలి ఖడ్గమును ధరించి శరీరమును విడిచి దేవలోకమున కేగుచున్న ఋషివలె ఆకాశమున కెగిరెను.

ఆకాశములో సంచరించుచున్న అక్షకుమారునిచేరి రెండుపాదములను హనుమ గట్టిగా పట్టుకొనెను. గరుత్మంతుడు పామును కొట్టినట్లు అక్షకుమారుని నేలవేసి పలుసార్లు కొట్టెను. దానితో బాహువులు, ఊరువులు, మొల, మెడ విరిగిపోయెను. రక్తము ప్రవించుచుండెను. ఎముకలు, కన్నులు వలిగిపోయెను. సంధులు విరిగిపోయెను. బంధనములు జారిపోయెను. అక్షకుమారుడు చనిపోయినవాడై నేలపై పడెను.

మహర్షులు, భూతములు, యక్షులు, పన్నగులు, దేవతలు ఆశ్చర్యముకలవారై అక్షకుమారుని చంపిన హనుమను చూచుచుండిరి.

ఈవిధముగ అక్షకుమారుని చంపి రక్తమువలె ఎఱ్ఱనైన కన్నులు గలవాడై వీరుడైన హనుమ మరల తోరణమును ఎక్కెను.

**48** అక్షకుమారుడు చనిపోయిన తరువాత రావణుడు క్షొంతసేపటికి ధైర్యము తెచ్చుకొని ఇంద్రుతుల్యుడగు ఇంద్రజిత్తును ఇట్లాజ్ఞాపించెను.

"నీవు బ్రహ్మాస్త్రము నెఱింగినవాడవు. శస్త్రవిదులలో అగ్రేసరుడవు. సురాసురులకు కూడ శోకమును కల్గించువాడవు. బ్రహ్మదేవు నారాధించి, అస్త్రముల నార్జించినవాడవు. నీ అస్త్రబలమున కెదురుగా అసురులుగాని, దేవతలుగాని యుద్ధములో నిలువలేరు. మూడు లోకములలో నీ ఎదురుగా యుద్ధముచేసి శ్రమనొందనివాడు లేడు. భుజపరాక్రమముచేత, తపసుచేత రక్షింపబడినవాడవు. దేశకాల విభాగము నెఱింగినవాడవు, మతిమంతుడవు. యుద్ధములలో పౌరుషముచే నీవు సాధింపలేనిదిలేదు. వివేకముతో ఆలోచించుచు నీ వెఱుంగనిదిలేదు. మూడు లోకములలో నీ అస్త్రబలము నెఱుంగనివాడు లేడు. నీయొక్క తపోబలము, పరాక్రమము, నాకు తగినవి. యుద్ధములో విజయమును పొందుటలో సందియములేదు.

కింకరులందరు చనిపోయినారు. జంబుమాలి మరణించినాడు. అమాత్యపుత్రులు హతమార్చబడినారు. సేనానాయకులు నశించినారు. అశ్వగజరథములతోకూడిన సమృద్ధములగు సైన్యములు నశించినవి. నీ సహోదరుడగు అక్షకుమారుడు చంపబడినాడు. వారు నీయంత సమర్థులుకారు.

ఈ వానరునియొక్క బుద్ధిని, ప్రభావమును, పరాక్రమమును చూచి, నీ బలమును చూచుకొని నీ బలమునకు తగినట్లుగ ఆతనిపైకి ఏగుము. శత్రువులను జయించెడి స్వభావముగల నీవు, నీ బలమును శత్రుబలమును ఆలోచించుకొని మన సైన్యము నశింపకుండ యుద్ధము నారంభించుము.

ఒక్కసారి అనేకులను గుంపులు గుంపులుగ చంపగల హనుమ ఎదుట, సేనలు ఏమియు చేయలేవు. హనుమంతునివద్ద వజ్రము అల్పసారము. అందుచే దానిని పట్టుకొని హనుమవద్దకు వెళ్ళకుము. ఈతనికున్న వేగము వాయువునకు కూడలేదు. అగ్నిసదృశుడగు హనుమను పిడికిలి పోట్లు మున్నగువానితో చంపుటకు శక్యముకాదు.

అందుచే ఈవిధముగ అంతయు బాగుగ ఆలోచించుకొని కార్యసిద్ధికి తగినట్లు ఏకాగ్రచిత్తుడవై దివ్యాస్త్రమంత్రములను స్మరించుచు ఏగుము.

నిన్ను యుద్ధమునకు పంపుట శ్రేష్ఠమైనపనికాదు. కాని రాజ ధర్మము లలో రాజులకు ఇది తప్పదు. యుద్ధములలో నానావిధములగు శస్త్రములతో యుద్ధముచేయు నేర్పును ఎఱింగియుండుము. యుద్ధములో విజయమును ఆర్జించుటకు సన్నద్ధుడవుకమ్ము."

ఇట్లు తండ్రి చెప్పిన మాటలను విని దేవతుల్యప్రభావముగల ఇంద్ర జిత్తు తండ్రికి ప్రదక్షిణముచేసి ధైర్యముతో యుద్ధమునకు నిశ్చితమైన బుద్ధితో బయల్వెడలెను.

ఇంద్రజిత్తునకు ఇష్టులగు సైనికులందరు ఇంద్రజిత్తును అభినందించిరి. యుద్ధమునకు సిద్ధపడి ఉత్సాహముతో బయల్దేరుచుండెను.

శ్రీమంతుడు విశాలమగు నేత్రములు గలవాడగు ఇంద్రజిత్తు పర్వ దినములలో పొంగెడి సముద్రమువలె ఉత్సాహము పొంగులువారుచుండ బయలుదేరెను.

గరుత్మంతునితో తుల్యమగు వేగముగల వాడియగు కోరలుగల నాలుగు సింహములను పూన్చిన రథమును ఇంద్రజిత్తు అధిరోహించెను. శస్త్రజ్ఞుడు, అస్త్రవిదులలో శ్రేష్ఠుడు, ధనుర్ధరులలో అగ్రేసరుడు, రథికుడు అయిన ఇంద్ర జిత్తు రథము నధిరోహించి, హనుమ ఉన్నచోటున కేగెను.

వానరవీరుడగు హనుమ ఆ ఇంద్రజిత్తు రథముయొక్క ధ్వనిని వింటె నారిధ్వనిని విని ఆనందించెను.

గొప్ప వింటిని, వాడి అమ్ములను చేకొని ఇంద్రజిత్తు హనుమకెదురుగా ఏగెను.

హర్ష పరవశుడై ఇంద్రజిత్తు యుద్ధమునకు వచ్చుచుండగా దిక్కులన్నియు మసక మసక ఆయెను. రౌద్రములగు మృగములు అరచుచుండెను. నాగ యక్ష మహర్షి సిద్ధ సంఘములు ఆకాశము నావరించి యుండిరి. పక్షిసంఘములు రొద చేయుచుండెను.

శీఘ్రముగ వచ్చుచున్న ఇంద్రజిత్తును జూచి హనుమ శరీరము పెంచి, పెద్దగ గర్జించెను.

ఇంద్రజిత్తు తన రథముపైనుండి ధనుస్సును ఎక్కుపెట్టెను. మహావేగము, మహాబలము గలవారలై యుద్ధమునకు జంకక హనుమ ఇంద్రజిత్తులు తలపడిరి.

మహారథుడగు ఇంద్రజిత్తు వదలుచున్న బాణముల వేగమును వ్యర్థము చేయుచు హనుమ వాయుమార్గమున సంచరించుచుండెను. తీక్ష్ణశల్యములు, కాంచన పుంఖములు కల్గిన వజ్రమువంటి వేగముగల బాణములను ఇంద్రజిత్తు హనుమపై ప్రయోగించెను.

గురిచేసి కొట్టుటలో ప్రసిద్ధుడగు ఇంద్రజిత్తుయొక్క బాణములు తనకు తగులకుండ హనుమ ఆ బాణమధ్యమున అతివేగముతో తిరుగుచుండెను. ఇంద్రజిత్తు రథముయొక్క ధ్వనిని, మృదంగ భేరీ పటహాదివాద్యముల ధ్వనిని, అమ్ము తొడుగుటకు లాగుచున్న వింటి ధ్వనిని విని హనుమ పై కెగిరెను. రెండు చేతులను ముందుకు చాచుకొని బాణముల కెదురుగా ఎగురుచుండెను.

ఇద్దరు వేగముగలవారలే! ఇద్దరు యుద్ధకర్మవిశారదులే!

సర్వభూతములయొక్క మనసు నాకర్షించు యుద్ధమును వారిద్దఱు చేయుచుండిరి.

హనుమను కొట్టుటకు ఇంద్రజిత్తున కవకాశము లభించుటలేదు. ఆ ఇంద్రజిత్తును కొట్టుటకు హనుమకు అవకాశము చిక్కుటలేదు. దేవతుల్య పరాక్రములై ఒకరి నొకరు ఓర్వలేనివారలై యుండిరి.

అమోఘములగు బాణములను ప్రయోగించుచున్నను ఒక్క బాణము గూడ తగులకుండ హనుమ తిరుగుచుండగా బాణమును సంధించుటలో, గురి

జూచి కొట్టుటలో, అప్రమత్తుడై యుద్ధముచేయుచున్న ఇంద్రజిత్తు తీవ్రమగు ఆలోచనలో పడెను.

"ఈ హరివీరుడు అవధ్యుడు. ఇతని వేగము నెట్లయినను తగ్గించి పట్టు కొనవలెను" అని ఇంద్రజిత్తు నిశ్చయించుకొనెను.

అపుడు బ్రహ్మాస్త్రమును సంధించి అవధ్యుడగు మారుతిని ఇంద్రజిత్తు బంధించెను. ఆ అస్త్రముతో బంధింపబడిన హనుమ కదలిక లేనివాడై నేలబ డెను. బ్రహ్మాస్త్రముచే కట్టబడితినని గుర్తించెను. వేగము తగ్గినవాడాయెను. కాని బ్రహ్మకు తనపై అనుగ్రహముకలదని భావించెను.

"ఏ అస్త్రమునకును వశముకాకుండునట్లు బ్రహ్మ నాకు వరమునిచ్చెను. కాని ఆ బ్రహ్మ ప్రభావమువలన బ్రహ్మాస్త్రమును మాత్రము విడిపించికొ నుటలో నాకు శక్తిలేదు. ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రముచే బంధించినాడు. ఈ యస్త్రబంధమును నేను అనుసరించి తీరవలెను" అని అస్త్రముయొక్క బల మును, తనకా అస్త్రబంధము విడునట్లు బ్రహ్మయే అనుగ్రహించుననియు ఆలోచించి బ్రహ్మయొక్క ఆజ్ఞననుసరించి ఆ అస్త్రమునకు కట్టుబడి యుండెను.

అట్లుండి "అస్త్రముచే బంధింపబడినను నాకు భయముకల్గుటలేదు. నన్ను పితామహమహేంద్రులు వాయువు రక్షించుచున్నారు. ఈ రాక్షసులు నన్ను బంధించుటయే మేలు. రావణునితో సంవాదము లభించును. బంధిం పనిమ్ము" అని నిశ్చయించుకొని పరవీరులను చంపగలవాడయ్యు ఆలోచించి పనులుచేయు స్వభావముగల హనుమ చేష్టలుడిగియుండెను.

రాక్షసులు బలాత్కారముగా పట్టుకొని బెదరించుచుండ గర్జించుచుం డెను.

అపుడు రాక్షసులు కదలిక లేకుండ పడియున్న ఆ వానరుని చూచి జనపనారతో, చెట్టు పట్టలతో గట్టిగ కట్ట నారంభించిరి. శత్రువులు తనను బంధించుట, వారు తనను నిగ్రహించుట హనుమ కిష్టముగా నుండెను. "రావణుడు కుతూహలముతో, నన్ను చూడదలంచును" అని సంతసించుచుం డెను.

నారతో కట్టగనే బ్రహ్మాస్త్రము వీడెను. బ్రహ్మాస్త్రము వేరొక కట్టును ఓర్వదు.

చెట్లనారలతో కట్టిన హనుమను ఇంద్రజిత్తు చూచి బ్రహ్మాస్త్రము పట్టు వదలినదని గుర్తించెను.

"వేరొకకట్టు కట్టినచో బ్రహ్మాస్త్రముయొక్క కట్టునిలువదు. అయ్యో! ఇంత కష్టపడిచేసిన పనిని వ్యర్థముచేసిరి. బ్రహ్మాస్త్ర మంత్రముయొక్క పద్ధతిని వీరు ఆలోచింపలేదు. బ్రహ్మాస్త్రము వీడిన తరువాత మరియొక అస్త్రము వానిపై పనిచేయదు. మరల బ్రహ్మాస్త్రమువేసినను పనిచేయదు. అందరకును ప్రాణసంశయ మేర్పడినది" అని ఇంద్రజిత్తు విచారించుచుండెను.

బ్రహ్మాస్త్రము వదలినదనికూడ హనుమ పట్టించుకొనలేదు.

రాక్షసులు త్రాళ్ళతో బిగించి కట్టి లాగుచుండిరి. కట్టెలతో, పిడికిళ్ళతో కొట్టుచుండిరి.

ఇట్లు కొట్టుచు రావణాసురుని సమీపమునకు లాగుకొనిపోయిరి.

ఇంద్రజిత్తు అట్టిస్థితిలోనున్న మహాబలుడగు ఆ వానరవీరుని సపరివారముగ కొలువుతీరియున్న రావణునకు చూపెను. త్రాళ్ళతోకట్టి తెచ్చిన మదించిన ఏనుగువలె ఆ వానరోత్తముని రాక్షసులు రాక్షసేంద్రుడగు రావణుని ఎదుట పెట్టిరి.

ఆ సభలోనున్న రాక్షసవీరులందరు "వీడెవడు? ఎవరికి చెందినవాడు? ఎచటనుండి వచ్చెను? ఏమి పని? దిక్కెవరు?" అని యనుకొనుచుండిరి.

రాక్షసులలో కొందరు హనుమపై కోపముగలవారలై "వీనిని చంపుడు. కాల్చుడు. భక్షింపుడు" అని ఒకరితో నొకరు అనుచుండిరి.

మార్గమంతయు దాటి హనుమ రావణుని పాదసన్నిధి నున్న మంత్రి వృద్ధులను, రత్న విభూషితమగు భవనమును చూచెను.

రాక్షసులచే లాగికొనిరాబడుచున్న హనుమను రావణుడు చూచెను.

తేజస్సుచే, బలముచే సూర్యునివలె ప్రకాశించుచున్న రాక్షస రాజగు రావణుని ఆ వానరోత్తముడు కూడ చూచెను. రావణుడు కోపముతో, ఎఱ్ఱనైన చూపులతో ఇటునటు చూచుచు, ఆ వానరుని చూచి అచట కూర్చుండియున్న మంత్రిముఖ్యులను ఆ వానరుని గూర్చి తెలిసికొనవలసినదిగా ఆజ్ఞాపించెను.

అపుడా మంత్రులు హనుమను "నీ వెందుకు వచ్చితివి? ఎవరు పంపిరి?" అని యడిగిరి. అపుడు హనుమ, "వానర రాజగు సుగ్రీవునివద్దనుండి దూతగా వచ్చితిని" అని చెప్పెను.

(ఈ సర్గ (48) పారాయణ చేసినచో శనిగ్రహదోషము శమించును.)

**49** భీమపరాక్రముడగు హనుమ రోషముచే ఎఱ్ఱబారిన కన్నులతో రావణాసురుని చూచెను.

గొప్ప విలువగల ముత్యములజాలు వ్రేలాడుచున్న బంగారు కిరీటముతో రావణుడు ప్రకాశించుచుండెను. వజ్రములు పొదిగిన బంగారు ఆభరణములతో ప్రకాశించుచుండెను. విలువగల తెల్లనిపట్టు బట్టను కట్టుకొని, రక్తచంద నము పూసికొని, విచిత్రములగు రేఖలుగా అంగరాగములను పూసికొనినవాడై, భయంకరములగు పది శిరస్సులతో ప్రకాశించుచు శిఖరముతో కూడిన మంద రపర్వతమువలె ఒప్పుచుండెను. నల్లని కాటుకపోగువలె నున్న రావణుడు ముత్యాలహారమును వక్షఃస్థలమున వేసికొని కూర్చుండి యుండగా కొంగలబా రుతో కూడిన నల్లని మేఘమువలె ఒప్పుచుండెను. ఉత్తమమగు చందనమును పూసికొని కేయూరములు ధరించిన బాహువులతో ఐదు తలలుగల పాము లతో కూడినవాడువలె ఒప్పుచుండెను. రత్నములు పొదిగి అలంకరింపబడిన, ఉత్తమాస్తరణము పరచిన స్ఫటికాసనముపై కూర్చుండి యుండెను.

బాగుగా అలంకరించుకొనిన స్త్రీలు చుట్టును వాలవ్యజనములతో సేవిం చుచుండిరి. దుర్ధరుడు, ప్రహస్తుడు, మహాపార్శ్వుడు, నికుంభుడు అనెడి నలుగురు మంత్రులు నాలుగు సముద్రములవలె రావణుని చుట్టును కూర్చుండి యుండిరి.

మేరుశిఖరమున నున్న నీరుపట్టిన మబ్బువలె సింహాసనము నధిష్ఠించిన తేజశ్శాలియగు రాక్షసరాజును హనుమచూచెను. భీమపరాక్రములగు రాక్షసు లచే పీడింపబడుచున్నను ఆశ్చర్యముతో రావణునే చూచుచుండెను. హనుమ ఆతని తేజస్సుచే మోహమునందెను.

*"అహో! రూప మహో! ధైర్య మహో! సత్త్వ మహో ద్యుతిః*
*అహో! రాక్షసరాజస్య సర్వలక్షణయుక్తతా.*
*య ద్యధర్మో న బలవాన్ స్యా దయం రాక్షసేశ్వరః*
*స్యా దయం సురలోకస్య సశక్రస్యాపి రక్షితా."*

(సుంద. 49.17, 18)

"అహో! ఏమి రూపము? ఏమి ధైర్యము? ఏమి బలము? ఏమి కాంతి? ఈ రాక్షసరాజు సర్వలక్షణములతో ఒప్పుచున్నాడు. ఈతనిలో అధర్మ

మేగాని ఎక్కువకాకుండెనా ఇంద్రునితో కలిపి మూడు లోకములకు పాలకుడై యుండెడివాడు"

అని హనుమ మనసులో అనుకొనెను.

"ఈతని క్రూరములగుపనులచే లోకములన్నియు భయపడుచున్నవి. ఈత డుత్సహించెనా జగత్తునంతను ఒకే సముద్రముగ చేయగలడు" అని రాక్షసరాజు ప్రభావమును జూచి హనుమ పలువిధముల భావించుచుండెను.

**50** మహాబాహువగు రావణుడు ఎదురుగానున్న హనుమను చూచి గొప్ప కోపముతో మనసులో నిట్లు శంకించుకొనుచుండెను.

"పూర్వము నేను కైలాసమును కదల్చినపుడు నందీశ్వరుడు నన్ను శపించినాడు. ఆతడే ఈ వానరరూపమున వచ్చి యుండునా? లేక ఈతడు బాణాసురుడై యుండునా!"

ఇట్లాలోచించి రోషముతో ప్రహస్తుడను ప్రధానమంత్రితో--

"ఈ దుర్మార్గుని ప్రశ్నింపుడు. ఎవడు? ఎటునుండి వచ్చెను? ఏమి పని? మన వనమును పాడుచేయుటకు కారణమేమి? అడుగుపెట్టుటకు వీలుకాని నా పట్టణములో ప్రవేశించుట కేమి హేతువు? యుద్ధముచేయుటకేమి ప్రయోజనము? ఈ దుర్మార్గుని అడిగి తెలిసికొనుడు" అనెను.

రావణుని మాటలను విని హనుమతో ప్రహస్తుడిట్లు పల్కెను.

"ధైర్యముగానుండుము. భయపడకుము, నీ వెవరవో చెప్పుము. నిన్ను ఇంద్రుడు పంపెనా? భయపడకుండ నిజము చెప్పుము. కుబేరుని యొక్క చారుడవా? యముని చారుడవా? వరుణుని చారుడవా? చెప్పుము. విజయమును కోరి విష్ణువు నిన్ను దూతగా పంపెనా? నీ తేజస్సు వానరులకు చెందినదికాదు. నీ రూపముమాత్రమే వానరరూపము. నిజము చెప్పితివా విడువబడుదువు. అనృతము పల్కితివా జీవితము దక్కదు. రావణ భవనమున ప్రవేశించుటకు కారణమేమియో తెల్పుము."

తత్త్వదీపిక :-

ఇట్లు ప్రహస్తుడు ప్రశ్నింపగా, అడిగిన ప్రహస్తునివైపు చూచి సమాధానముచెప్పక "నాకు నీదెంతపాటి?" అనునట్లు రావణునితోనే సమాధానము చెప్పుటకు హనుమ సిద్ధపడెను. రాక్షస చక్రవర్తియగు తాను కోతితో మాటాడుటయా అని రావణుడు భావించి ప్రహస్తునిద్వారా అడిగించెను. కాని హనుమ తనతో మాటాడుటకు ప్రహస్తుడు తగడని, చెప్పవలసిన సందేశము రావణు

నికే చెప్పవలెనని రావణునితోనే మాటాడుటకు సిద్ధపడెను.

"రక్షో గణేశ్వర! నే నింద్రుని దూతను కాను. యముని దూతను కాను. వరుణుని దూతనుకాను. కుబేరునితో గాని, యమునితోగాని నాకు స్నేహములేదు. విష్ణువు నన్ను పంపలేదు.

మా జాతియే వానరజాతి. నేను వానరుడను. మీ దర్శనము దుర్లభమని దర్శనముకొఱకై వనమును పాడుచేసితిని.

యుద్ధమును చేయుటకు బలవంతులగు రాక్షసులు వచ్చిరి. దేహరక్షణమునకు వారి నెదిరించి నేను యుద్ధమును చేసితిని. దేవతలు గాని, రాక్షసులు గాని, అస్త్రములతోగాని, పాశములతోగాని నన్ను బంధింపలేరు. ఇది నాకు బ్రహ్మ ఇచ్చిన వరము.

రాక్షస రాజును చూడవలెనను కోరికచే బ్రహ్మాస్త్రమునకు నేను లొంగి కట్టువడితిని. ఒకానొక రాజకార్యముచే నీవద్దకు వచ్చితిని. అమిత పరాక్రముడగు రామచంద్రుని దూతను. నీకు మేలు కల్గించు కొన్ని మాటలను చెప్పెదను. వినుము"

**51** మహాబలుడగు రావణుని జూచి ఏమియు తొట్రుపాటు పడక, అర్థవంతములగు వాక్యములతో వానరోత్తముడు దశాననుని గూర్చి ఇట్లు పల్కెను.

"సుగ్రీవుని సందేశమును తీసికొని నీ పట్టణమునకు నేను వచ్చితిని. నీకు సోదరుడును మహాత్ముడువగు సుగ్రీవునియొక్క సందేశమును వినుము.

ఇది ధర్మార్థసహితము. ఈ లోకమున పైలోకమున అభ్యుదయమునకు సాధనము చెప్పెదను వినుము.

రథములు, ఏనుగులు, గుఱ్ఱములు సమృద్ధిగాగల దశరథుడను రాజు కలడు. ఆతడు లోకమునకు తండ్రివలె బంధువు. ఇంద్రునితో సమానమగు కాంతిగలవాడు. ఆతని జ్యేష్ఠపుత్రుడు రాముడు. ఆతడు తండ్రికి చాల ఇష్టమైనవాడు. అందరను నియమింపజాలినవాడు. తండ్రియొక్క ఆజ్ఞవలన పట్టణమును వీడి దండకారణ్యమున ప్రవేశించెను.

ఆతనిని సోదరుడగు లక్ష్మణుడు, భార్యయగు సీత కూడ అనుసరించిరి. రాముడు ధర్మము తప్పని మార్గమున ప్రవర్తించువాడు. ఆతని భార్య సీత పతివ్రత. మహాత్ముడగు విదేహరాజ జనకుని కుమార్తె. ఆమె అడవిలో కన్పడకుండపోయెను.

లక్ష్మణునితో కలసి రాముడామెను వెతకికొనుచు ఋశ్యమూకమునకు

వచ్చి సుగ్రీవునితో కలిసెను.

సుగ్రీవుడు సీతమ్మను వెతికించెదనని రామునకు ప్రతిజ్ఞచేసెను. రాముడుకూడ సుగ్రీవునకు వానరరాజ్యమునొసంగుటకు ప్రతిజ్ఞచేసెను.

వాలిసుగ్రీవులు యుద్ధముచేయుచుండగా వాలిని రాముడు చంపి సుగ్రీవుని వానర రాజ్యమున ప్రతిష్ఠించెను.

వాలిని నీ వింతకుముందెఱుగుదువు కదా! అట్టి బలశాలియగు వాలిని రాముడు ఒక్క బాణముతో చంపెను.

సత్య ప్రతిజ్ఞుడగు సుగ్రీవుడు సీతాన్వేషణమున శ్రద్ధగలవాడై అన్ని దిక్కులకు వానరులను పంపెను. కొన్ని వేల కోట్ల వానరులు మీద, క్రింద, ఆకాశములో అన్ని దిక్కుల సీతను వెతకుచున్నారు. అందులో కొందరు గరుత్మంతునితో సమానమగు వేగముగలవారు. కొందరు వాయువుతో సమమగు వేగముగలవారు. హరివీరులందరు మహావేగవంతులు.

నేను హనుమంతుడను. వాయుదేవుని పుత్రుడను. సీతకొఱకై నూఱు యోజనముల సముద్రమును దాటి వచ్చితిని. ఇచటకు వచ్చి ఆమెను చూడవలెనని కోరికతో పట్టణమంతయు తిరుగుచు నీ భవనములో సీతమ్మను చూచితిని.

నీవు శాస్త్రములు చదివి ధర్మస్వరూపమును, అర్థస్వరూపమును బాగుగా తెలిసికొనినవాడవు. గొప్ప తపస్సు నార్జించినవాడవు. మహాప్రాజ్ఞుడవు. పరుని భార్యను నిర్బంధించుట నీకు తగదు. అనేక విధముల హానిని కల్గించు ధర్మవిరుద్ధములగు కార్యములందు నీవంటి బుద్ధిమంతులు ప్రవర్తింపరు.

కొద్దిపాటి అపాయములైన తొలగించుకొనవచ్చును. కాని పరదారాపహరణమనెడి కార్యము నిన్నే లేకుండచేయును. ఇది మూలఘాతి. మొదలు చెరచునది.

రాముని కోపము ననుసరించి లక్ష్మణుడు వదలిన బాణములకు ఎదురుగా నిలచుటకు దేవాసురులలో నెవ్వరును సమర్థులు కారు.

రాజా! రామునికి క్షపియము నాచరించి బ్రతికియుండుట కల్ల. రామునకు క్షపియము నాచరించి సుఖము నెవ్వడును పొందలేడు.

ఈ మాటలు ధర్మబద్ధములు. ప్రయోజనకారులు. మూడు కాలముల మేలు కల్గించునవి. విని ఆలోచించుకొని రామచంద్రునకు సీతమ్మను తిరిగి అర్పింపుము.

ఇతరుల కందరకు దుర్లభమగు సీతాదర్శనము నాకు లభించినది. చూచు టయే నావంతు. నా మాట విని తరువాత రాముడే మిగిలిన పనిని చేయును.

శోకపరాయణయగు సీతను నేను గాంచితిని. ఆమె నీవశమున నున్నదని అనుకొనుచుంటివి. కాని ఆమె ఐదు తలల త్రాచుపామని ఎఱుంగకున్నావు. జాగ్రత్త. ప్రాణములు తీయును. అసురులు గాని అమరులు గాని ఆమెను అనుభవింపలేరు.

జాఠరాగ్నికి శక్తి యున్నది గదా యని విషముతో కూడిన అన్నము తినినచో ఎట్లు జీర్ణముకాదో అట్లే సీతను వశపరచుకొనుట నీకు శక్యముకాదు.

ఎంతో కష్టపడి తపస్సు చేసి, ధర్మమునార్జించి, ఆ ధర్మమునకు ఫలముగా ఎవరిచేతను చావు లేకుండ వరమును పొందితివి. దానిని పాడుచేసికొనుట నీకు తగదు.

తపస్సుచే ఎవరిచేతను చావు లేకుండ వరమును పొందితి నను కొను చున్నావేమొ. దానిలో కూడ నీవు భయపడవలసిన విషయమున్నది.

నీకు దేవాసురులచే మరణము లేదు నిజమే! సుగ్రీవుడు దేవుడు కాడు. అసురుడు కాడు. రాక్షసుడు కాడు. దానవుడు కాడు. గంధర్వుడు కాడు. యక్షుడు కాడు. నాగజాతికి చెందినవాడు కాడు. నీవు కోరుకొనినవారిలో సుగ్రీవుడు ఎందులోను చేరడు.

నీవు తిర్యక్కులను మనుష్యులను వదలితివి కదా! అందుచే సుగ్రీవుడు నిన్ను చంపకుండ ఏది రక్షించగలదు? పూర్వము సంపాదించిన ధర్మమున్నది గదా ఆ ధర్మముయొక్క ఫలము చావు లేకుండుట. పరదారాపహరణ మనెడి అధర్మము నాచరించితివి.

ఒకేవ్యక్తి రెంటిని ఏకకాలమునం దనుభవింపవచ్చును గదా! పుణ్యవశ ముచే రాజ్యముకల్గి, పాపవశముచే రోగము కల్గిన రెండిటిని ఒక వ్యక్తి ఏక కాలమున అనుభవించుటలేదా? అట్లే నేనును ధర్మఫలమును, అధర్మఫల మును ఏక కాలమున అనుభవింతును- అను కొందువేమొ.

ఇచట ధర్మఫలము అధర్మఫలము ఏక కాలమునం దనుభవింపబడవు. నీవు చేసిన ధర్మమునకు ఫలము చావులేకుండుట. నీవిపుడు చేసిన అధర్మము నకు ఫలము చంపబడుట. ఈ రెండును ఏక కాలమునం దనుభవింపదగినవి కావు. పరస్పర విరుద్ధములు.

ధర్మము ధర్మఫలమునే ఇచ్చును.

ధర్మము ఫలమిచ్చు చున్నంతకాలము అధర్మఫల మంటదు.

కాని అధర్మమును ధర్మములేకుండ చేయదు.

ధర్మఫలమైన తరువాత అధర్మఫలమును గూడ అనుభవింపవలసివచ్చును. ధర్మము అధర్మమును ఫలము నీయకుండ ఆపగలదు కాని, అధర్మము ధర్మమును ఫలము నీయకుండ నాశముచేయలేదు.

అందుచే ధర్మఫలము నీచే అనుభవింపబడుచున్నది. కాని, అధర్మఫలమునుగూడ అనుభవించియే తీరవలెను.

కొద్దిరోజులలోనే ఈ అధర్మఫలమునుకూడ అనుభవింతువు. అధర్మమును తొలగించుకొనుటకు ప్రాయశ్చిత్తరూపమగు ధర్మము నాచరించినచో ఆ అధర్మము ఫలమునీయకుండ అగును.

నీవిపుడు చేసిన పరదారహరణ రూపమగు అధర్మమునకు ప్రాయశ్చిత్తము, అమెను మరల రామున కర్పించుటయే! అది చేసితివా, ఈ అధర్మముయొక్క ఫలమగు మరణము నీకు తప్పును.

సరే! ధర్మాధర్మ చర్చను అటుంచుము. వాస్తవమగు విషయము నాలోచించినను నీవు సీతమ్మ నపహరించుట మేలుకాదు.

రాముడు ఏకాకియై జనస్థానమున పదునాలుగువేల మంది రాక్షసులను, ఖరదూషణ త్రిశిరులను చంపెను.

విన్నాకనాడు చంకనిరికించుకొని నాలుగుసముద్రముల త్రిప్పి, తెచ్చి వదలిన బలశాలియగు వాలిని రాముడొక్క బాణముతో చంపెను.

కొన్నికోట్ల కోతులకు రాజు, బలశాలియునగు సుగ్రీవునితో రాముడు మైత్రిని చేసికొనెను.

వీనిని జూచి నీ కేది మేలో నీవే తెలిసికొనుము.

మా వానరులుగాని, సుగ్రీవుడుగాని అవసరములేదు. నేనొక్కడనే గుర్రములతో, రథములతో, ఏనుగులతో కూడిన నీ లంకను పూర్తిగ నాశనము చేయుటకు తగుదును. కాని, అది రామచంద్రుని నిర్ణయముకాదు.

వానర సమూహముల ముందు "సీతను ఎవడు అపహరించినాడో ఆ శత్రువును నేను నాశనము చేయుదు" నని రాముడు ప్రతిజ్ఞ చేసెను. అందుచే నే నాపని చేయకూడదు.

రామునకు అపకారముచేసి సాక్షాత్ ఇంద్రుడే కానిమ్ము, వేరొకడే కానిమ్ము, సుఖము పొందలేడు. అయినచో నీవది సాహాయ్యము నీయుము

చెప్పవలెనా?

"సీత నావశమునందున్నది" అని నీవెవతెను తలంచుచున్నావో ఆమె సీత కాదు; సర్వలంకావినాశినియగు కాళరాత్రియని ఎరుంగుము. సీతారూప ముననున్న కాలపాశమును కోరి మెడను చుట్టుకొనుచున్నావు.

చేయుదగినపని ఏమో ఆలోచించుకొనుము. సీతమ్మయొక్క తేజస్సుచే, రామునియొక్క కోపముచే నీపట్టణమంతయు మిద్దెలతో వీథులతో తగులపడి పోవుచున్నదని గుర్తించుము.

నీవునాశనమగుటయేకాక; నీమంత్రులను, మిత్రులను, సోదరులను, కుమారులను, జ్ఞాతులను, ఆప్తులను, భోగములను, భార్యలను, లంకసుకూడ నాశనము చేయుకుము.

నామాట సత్యము. ఓ రాక్షసరాజా! వినుము.

నేను రామదాసుడను. అందుచే రామునిశక్తిని ఎఱుంగుదును.

దూతను. అందుచే నీకు హితము నుపదేశించు అధికారమున్నది.

వానరుడను. నాకు మనుష్యులు రాక్షసులు కూడ సమానమే!

నేను మధ్యస్థుడను. కావున నామాట వినుము.

భూర్భువరాదిలోకములనన్నింటిని, పృథివ్యప్తేజోవాయురాకాశములనెడి పంచభూతములతో, జంగమాజంగమ రూపముగ నున్న వాని నన్నింటిని ఒక్కమారు సంహరించి మరల ఒక్కసారి సృజింపగల సమర్థుడు రాముడు."

తత్త్వదీపిక :-

"ఆతడే పరమాత్మ" యని హనుమ సూచించెను; జగత్సృష్టి స్థితిప్రళయములను చేయువాడతడే! అతడు మహా యశస్సుకలవాడు.

శ్రుతులలో------

"న తస్యే శే కశ్చన తస్య నామ మహద్యశః"

అని పరమాత్మకు "మహద్యశః" అని పేరుగలదు. ఆతడు రాముడు.

దేవ అసుర నరేంద్రులలో గాని, యక్షరరక్షోగణములలో గాని, విద్యాధరులలో గాని, గంధర్వులలోగాని, ఉరగులలో గాని, సిద్ధులలో గాని, కిన్నరులలోగాని, పక్షులలోగాని అన్నిభూతములలో అంతట అన్నికాలములలో విష్ణుతుల్యపరాక్రముడగు రాముని ఎదిరించి యుద్ధము చేయగలవాడు లేడు.

దీని నాలోచించి చూచుకొనుము. సర్వలోకేశ్వరుడగు రామచంద్రునకు

అప్రియము నొనర్చి నీవు బ్రతికియుండుట దుర్లభము.

దేవతలుగాని, దైత్యులుగాని, గంధర్వ విద్యాధర నాగయక్షులుగాని, లోక త్రయనాయకుడగు రామునకు యుద్ధములో ఎదుట నిలువజాలరు. ఈ సామాన్యదేవతలే కాదు; ఆ దేవతలకు ప్రభువులగు ఇంద్ర రుద్ర బ్రహ్మలు కూడ రామునిచే చంపబడెడివానిని రక్షింపలేరు" అని ఆవేశముతో హనుమ ఇట్లు చెప్పుచున్నాడు.

"బ్రహ్మా స్వయంభూ శ్చతురాననో వా
రుద్రస్త్రిణే త్రస్త్రిపురాన్తకోవా
ఇంద్రో మహేంద్ర స్సురనాయకోవా
త్రాతుం నశక్తాయుధిరామవధ్యమ్." (సుంద.51:45)

తత్త్వదీపిక :-

ఇందు ఒక్కొక్కరికి మూడేసి పర్యాయపదములు వాడెను. అది యావేశములో అధిక్షేపించుచు వారిగొప్పతనములను ఎత్తిపెట్టి రాముని ఆధిక్యమును నిరూపించుటను తెలుపును.

ఇంద్రుడనగా పరమైశ్వర్యముగలవాడు. త్రైలోక్యాధిపతియైనను శత్రువు నెదిరించు సామర్థ్యములేనివాడు కాదు మహేంద్రుడు. వృత్రాసురుని చంపినవాడుగదా! వృత్రాసురుని చంపుటచేత అతనికి మహేంద్రుడని పేరువచ్చెనని శ్రుతి చెప్పుచున్నది.

మహేంద్రుడుగదా యని రాముని ఎదిరింపగలడనుకొందువేమో! అతనికికూడ శక్తిచాలదు. అతడు దేవతలకు నాయకుడుగదా, దేవతలు సహాయముగానున్నచో రక్షింపగల డనుకొందువేమో! సురనాయకుడుకూడ సమర్థుడుకాడు.

సర్వసంహారకుడగు రుద్రుడు సమర్థుడనుకొందువేమో! రాముని ఎదుట అతనిశక్తి పనికిరాదు. కంటిచిచ్చుగల త్రినేత్రుడైనను ఎదిరింపజాలడు. గొప్పబలముగల త్రిపురములను సంహరించినవాడనుకొందువేమో! త్రిపురాంతకుడు కూడ రామునిఎదుట నిలువలేడు.

ఆ రుద్రునికంటె పై వాడగు బ్రహ్మయున్నాడని తలపుదువేమో! అతడును కర్మవశ్యుడే! అతడు నీకెట్లు సాయపడగలడు? తనంత తాను పుట్టినవాడు గనుక ధైర్యపడుదువేమో! స్వయంభువైనను ప్రయోజనములేదు. ఒక్కసారి నాలుగు వేదముల నుచ్చరింపగల నాలుగు మోములు కలవాడు గనుక సమర్థుడనుకొందువేమో! చతురాననుడైనను లాభములేదు.

విడివిడిగాకాదు; కలిసివచ్చినను రాముని ఎదిరింపలేరు. అందుచే రాము నిచే చంపబడునపుడు నిన్ను రక్షించువా డుండడు. చూచుకొనుము- అని ఉపదేశించెను.

ఈవిధముగ చాలచక్కగ, ధైర్యముగ పల్కిన హనుమ యొక్క అప్రియ ములగు మాటలను విని కోపముతో తిరుగుడు పడుచున్న కన్నులుగలవాడై "వీనిని చంపుడ" ని రావణు డాజ్ఞాపించెను.

**52** క్రోధ పరవశుడైన రావణుడు మహాత్ముడగు హనుమను చంపుమని ఆజ్ఞాపింపగనే దూతగా వచ్చితినని చెప్పిన హనుమను చంపుట న్యాయము కాదని విభీషణుడు అంగీకరింపలేదు.

"రాక్షసరాజు కోపముతో నున్నాడు. దూతను చంపవలసినదిగా ఆజ్ఞాపిం చియున్నాడు. ఏమి చేయుదగున" ని విభీషణు డాలోచించి ప్రీతివచనములతో అన్నను పూజించి ఆతని కత్యంతము హితమగు వాక్యములను ఇట్లు చెప్పదొ డంగెను.

"రాక్షసేంద్ర! క్షమించుము. రోషమును వీడుము. ప్రసన్నుడవగుము. నామాటను వినుము. చేయుదగినది, చేయరానిది ఎఱింగిన ప్రభువులు దూతను చంపరు. దూతగావచ్చిన ఈకోతిని చంపుట రాజధర్మమునకు విరుద్ధము. లోకపుతీరులో నింద్యము. నీవంటివీరుడు చేయుటకు తగనిది. ధర్మముల నెఱిం గినవాడవు. పెద్దలు చేసిన ఆచరణము నెఱింగినవాడవు. స్వీకరింపదగినది, విడువదగినది ఎఱింగినవాడవు అగునీవే పరమార్థవేత్తవు. నీవంటి విద్వాంసులు కూడ కోపమునకు లొంగిపోయినచో శాస్త్రములలో పరిశ్రమ చేయుట శ్రమయే అనిపించుచున్నది. అందుచే అనుగ్రహించి యుక్తాయుక్తముల నాలోచించి దూతకు తగిన దండనము విధింపుము."

రావణాసురుడు విభీషణుని మాటలను విని రోషావేశముతో నిట్లు బదులు పల్కెను.

*"న పాపానాం వధే పాపం విద్యతే శత్రుసూదన"*

(సుంద.52-11)

"పాపాత్ములను చంపుటలో పాపము లేదు. అందుచే ఈ వానరుని చంపెదను" అనెను.

ఈ మాట వినగనే విభీషణుడు, "ఆ వాక్యము అధర్మమూలము. బహు దోషయుక్తము. అనార్యజుష్టము" అని తలంచి పరమార్థమును ప్రతిపాదించు

వాక్యమును ఇట్లు పల్కెను.

"లంకేశ్వరా! రాక్షసరాజా! ప్రసన్నుడ వగుము. ధర్మార్థములతో కూడిన నామాటను వినుము. అన్ని దేశములలో, అన్ని జాతులలో దూతలను చంప కూడదని సత్పురుషు లందరు చెప్పుచుందురు. ఈతడు కేవలము దూతయే కాదు. అక్షకుమారుడు మున్నగువారిని చంపుటచే శత్రువుకూడ - అని నీ వనవచ్చును. సందేహములేదు. నిశ్చయమే! ఈతడు చాల బలమైనవాడు. మనకు చెప్పలేనంత యుపకారము చేసినాడు. కాని దూతలను చంపుట పెద్దల ఆచారముకాదు. దూతకు అనేక రకములగు శిక్షలు విధింప దగినవని పెద్దలు చెప్పినారు. ఏదో ఒక అవయవము లేకుండ చేయవచ్చును. కొరడాలతో కొట్టించవచ్చును. జుత్తు గొరిగించవచ్చును. కొన్ని గుర్తులను శరీరముపై కాల్చి వేయవచ్చును. ఈ విధముగ ఏవో శిక్షలను విధింపుమని పెద్దలు చెప్పు చున్నారు గాని దూతవధ మాత్రము ఎచ్చటను చెప్పబడలేదు. ధర్మార్థముల నెఱింగినవాడవు. మంచిచెడ్డలను బాగుగా తెలిసికొనినవాడవు. నీవంటివాడు కోపమునకు వశమగుట తగదు. నీవంటి పట్టుదల గలవారలు కోపమును విగ్రహించుకొనవలెను.

దేవతలలో గాని, అసురులలోగాని, ధర్మశాస్త్రమునందుగాని, లోకాచా రమునందుగాని, శాస్త్రములను గ్రహించుటలో దానిని ధరించుటలోగాని నీకు సమానులైన వారెవ్వరును లేరు. వీనిని చంపుట ధర్మ విరోధ మనియే కాదు. మనకు ప్రయోజనము కూడ లేదు. ఈ కోతిని చంపిన మనకు వచ్చెడి లాభమేమి? వీనిని పంపిన వారు ఎవరో వారిని చంపవలెను. మంచివాడే కానిమ్ము. చెడ్డవాడే కానిమ్ము. ఈత డితరులచే పంపబడినవాడు కదా!

"బ్రువన్ పరార్థం పరవాన్ న దూతో వధ మర్హతి"
(సుంద.52-19)

ఇతరులకొఱకు ఇతరులు చెప్పిన మాటలను చెప్పెడి దూతను చంపుట తగదు. అంతేకాదు. ఈతనిని చంపినచో వేరొకడెవ్వడును నూఱుయోజనముల సముద్రమును దాటి ఆకాశములో ఎగిరి రాలేడు. అందుచే ఈతనిని చంపు టకు ప్రయత్నము చేయకుము. ఈతడు చనిపోయినచో ఆ రాజకుమారుడు వేరొక దూతను ఎవనిని పంపలేడు. యుద్ధమున కుత్సాహపడుచున్నవారు వీని మాటలను విని మనపైకి యుద్ధమునకు రాగలరు. పరాక్రమము, ఉత్సాహము, పౌరుషముగల దేవదానవులకు కూడ దుర్జయుడవగు నీవు రాబోవుచున్న యుద్ధ మునకు అవకాశమును కల్పించుకొనవలెనుగాని పాడుచేయరాదు. హితులు,

శూరులు, ఉత్తమకులసంజాతులు, పౌరుషవంతులు, శస్త్రధరులు నగు యోధులు కోట్లకొలది నీవద్ద మన్నారు. వారిలో ఏ కొద్దిమందినో నీ వాజ్ఞాపించి పంపించినచో ఆ మూఢులగు రాజపుత్రులను బంధించి నీ ప్రభావమును తెలియజేయుదురు" అనెను.

తమ్ముడగు విభీషణుని ఉత్తమమగు వాక్యమును ఆ రాక్షసరాజు విని యుక్తమే అని దానిని అంగీకరించెను.

**53** రావణుడు దేశకాలోచితముగ పల్కిన విభీషణుని మాటలను విని ఇట్లు పల్కెను.

"నీవు చెప్పినది బాగున్నది, దూతను చంపుట నింద్యమే! వీనికి వేరొక శిక్ష విధింతును. కోతులకు తోక చాల ఇష్టమైనది. దానిని కాల్చివేయుడు. కాలిన తోకతో ఇతడు వెనుకకు వెళ్ళుగాక! తోక లేని వీనిని మిత్రులు, జ్ఞాతులు, బంధువులు, సుహృత్తులు చూచెదరు గాక! ఈతని తోక కాల్చి కాలుచున్న తోకతో ఊరంతయు త్రిప్పు" డని ఆజ్ఞాపించెను.

రావణుని మాటలను వినగనే రాక్షసులు పాత మాలు బట్టలను హనుమ తోకకు చుట్టిరి. బట్టలను చుట్టుచున్నకొలది హనుమ తోకను పెంచుచుండెను. ఆ గుడ్డల నన్నిటిని నూనెతో తడిపి నిప్పంటించిరి. తోకకు నిప్పంటించగనే ఆ తోకతో ప్రక్కనున్న రాక్షసులను పడగొట్టెను.

హనుమంతుని తోకకు నిప్పంటించిరని తెలిసి పట్టణములోని స్త్రీలు, బాలురు, వృద్ధులు సంతోషముతో పరుగెత్తుకొని వచ్చిరి. రాక్షసులందరు కలిసి హనుమను గట్టిగా కట్టి పట్టుకొనిరి.

హనుమ అపుడిట్లాలోచించెను.

"బంధించినను నన్ను వీరేమియు చేయలేరు. త్రాళ్ళను తెంపుకొని పై కెగిరి వీరిని చంపగలను. కాని వీరు వారి ప్రభువుయొక్క హితమునకై, ప్రభువుయొక్క ఆజ్ఞచే నన్నిట్లు బంధించుచున్నారు. అంతమాత్రముచే నా కేమియు హాని లేదు. ఈ రాక్షసు లందరను నేను చంపగలను. కాని రాముని ప్రీతికొఱకు వీరు చేయు ఈ అవమానమునను నేను సహించెదను.

లంక అంతయు రాత్రివేళ తిరిగినను దుర్గములను బాగుగ చూడలేదు. వీరిప్పుడు త్రిప్పినచో మరొకసారి లంక చూచుటయగును. లంకను చూచుట ఆవశ్యకము. ఈ రాక్షసులు నన్ను కట్టినను, నా తోకకు నిప్పంటించినను నా మనసున కేమియు శ్రమ కల్గుట లేదు" అని యనుకొనెను.

హనుమ తన స్వరూపము బైటపడకుండ మరుగు పరచుకొనియుండెను.

అట్టి హనుమను రాక్షసులు సామాన్యమగు కోతినిగా భావించి పట్టు కొనిరి. శంఖభేరీధ్వనులతో పెద్ద ధ్వనులు చేయుచు రాక్షసులు హనుమను పట్టణము చుట్టును త్రిప్పుచుండిరి. రాక్షసులు వెంట వచ్చుచుండగా హనుమ పట్టణ మంతయు సుఖముగా తిరుగుచుండెను.

విమానములను, భూమి భాగములను, మహావీధులను, అవాంతర వీధు లను, నాలుగు మార్గముల కూడలులను, చిన్న ఇళ్ళను, పెద్ద ఇళ్ళను జూచుచు ముందునకు సాగుచుండెను.

చతుష్పథములయందు, చతుస్తంభ మంటపముల యందు రాక్షసులు హనుమను నిలబెట్టి "చారీకు" డని (చారుడు) చాటు చుండిరి. చారుడుగా వచ్చి పరాభవము నొందినాడని వారు హాస్యము చేయుచుండిరి.

స్త్రీలు, బాలురు, వృద్ధులు, మందుచున్న తోకతో వెళ్ళుచున్న కోతిని చూచుటకు ఇండ్లనుండి బయల్వెడలి వచ్చుచుండిరి. ఈ విధముగ లాంగూలము దహింపబడుచుండుట చూచి అప్రియమైన ఆ వృత్తాంతమును రాక్షసస్త్రీలు సీతమ్మకు చెప్పిరి.

సీతా! ఇంతకుముందు నీతో మాటాడిన ఎఱ్ఱమూతి కోతిని తోకకు నిప్పంటించి ఊరు చుట్టు త్రిప్పుచున్నారు."

ఆ మాటను విని తన ఆత్మనే అపహరించినట్లుగా సీతమ్మ బాధపడెను.

శోకసంతప్తయై హనుమకు మంగళము కలుగవలెనని శుచియై అగ్నిహో త్రుని ఈ విధముగ ఉపాసించెను.

"యద్యస్తి పతిశుశ్రూషా యద్యస్తి చరితం తపః
యది చా స్త్యేకపత్నీత్వం శీతో భవ హనూమతః.
యది కించి దనుక్రోశ స్తస్య మయ్యస్తి ధీమతః
యది వా భాగ్య శేషో మే శీతో భవ హనూమతః."
"యది మాం వృత్తసంపన్నాం తత్సమాగమలాలసాం
స విజానాతి ధర్మాత్మా శీతో భవ హనూమతః.
యది మాం తారయే దార్య స్సుగ్రీవ స్సత్యసంగరః
అస్మా ద్దుఃఖాంబుసంరోధాత్ శీతో భవ హనూమతః."

(సుంద.53-28, 29, 30, 31)

"నేనే పతిశుశ్రూష చేసినదాన నైనచో, నే నాచరించిన తపమే యున్నచో, నేను పతివ్రతనే అయినచో, ఓ హుతాశన! హనుమకు చల్లబడుము.

నాయందు రామచంద్రునకు దయ ఏమాత్రమైన ఉన్నచో, నా కేమైనను భాగ్యశేష మున్నచో ఓ హూతాశన! హనుమకు చల్లబడుము.

హనుమ నా పాత్రివ్రత్యమును గుర్తించినవాడైనచో, నేను రామునితో కలియవలెనని ఆరాటపడుచున్నానని ఎఱిగినచో ఓ హుతాశన! హనుమకు చల్లబడును.

సత్యప్రతిజ్ఞుడు, పూజ్యుడు అగు సుగ్రీవుడు నన్నీ దుఃఖ సముద్రము నుండి తరింపచేయువాడే అయినచో హూతాశన! హనుమకు చల్లబడుము."

అపుడు తీవ్రమగు జ్వాలలతో అధికముగ ప్రజ్వలించుచున్న హనుమ తోక నున్న అగ్ని సీతమ్మకు శుభమును సూచించుచున్నట్లుగా ప్రదక్షిణజ్వాలలతో తిరుగుచుండెను.

హనుమ తోక కంటియున్న అగ్నిజ్వాలలతో వెచ్చనైన వాయువు సీతమ్మకు స్వస్థతను కల్గించునదై మంచుగాలివలె చల్లగా వీచెను.

**తత్త్వదీపిక :-**

ఇచ్చట హనుమయొక్క లాంగూలమును దహింపగా హనుమ శక్తికల్గియు ఆ వేడిని సహించుటకే నిశ్చయించుకొని ఊరకుండెను.

కాని సీతమ్మ మాత్రము ఓర్వలేక తన ప్రాణములే పోయినట్లు బాధపడి అగ్నిహోత్రుని ప్రార్థించెను.

తన పాతివ్రత్యమును, రామ హృదయమును, హనుమ దభిప్రాయమును, సుగ్రీవాభిప్రాయమును స్పష్టము చేయునట్లు ప్రతిజ్ఞలు చేసి అగ్నిహోత్రుని చల్లబరచెను. అగ్నిహోత్రము చల్లబడుట, చల్లని గాలి వీచుట, హనుమకు శుభము.

హమమకు స్వస్థత అని వర్ణింపవలెను. కాని హనుమ తోక చల్లబడుట సీతమ్మకు శుభము. చల్లని గాలి వీచుట సీతమ్మకు స్వస్థత. హనుమకు అగ్ని చల్లబడె నన్నచో "సీతమ్మ పతివ్రత, రామునకు సీతమ్మపై దయ గలదు, సీతమ్మకు భాగ్యమింకను మిగిలియున్నది, హనుమ ఆమెను పతివ్రతగా గుర్తించెను. సుగ్రీవుడు సీతను తప్పక దాటించును" -- అను విషయములు సత్యములని ఋజువాయెను. అందుచే ఇదంతయు సీతమ్మకే శుభము.

శిష్యాచార్యులలో శిష్యుడు, ఆచార్యుడు ఒకరితో నొకరు ఎట్టి సంబంధము కల్గిఉండవలెనో ఈ సన్నివేశము విశదపరచుచున్నది.

శిష్యుని ఆత్మరక్షణమున ఆచార్యుడు బాధ్యత వహింపవలెను. శిష్యుడు దానికై దిగులుచెంది "నే నెట్లు తరింతునా" యని విచారించుచుండరాదు.

భగవదనుగ్రహముచే జ్ఞానానుష్ఠానములు గల ఆచార్యుడు లభించిన పిమ్మట నాకేమి లోటు? ఆతడే తరింపచేయును. భగవానుడు తప్పక అనుగ్రహించును. ఇట్టి ఆచార్యుడు లభించిన నాకు భగవత్ప్రాప్తి తథ్యము" అను ధైర్యముతో నుండవలెను.

భగవత్ ప్రాప్తికై ఆర్తితో అధ్యవసాయముతో నుండుట తప్ప వేరొక ప్రయత్నము చేయరాదు.

అట్లే సీతమ్మ రావణుని చంపుటకు తనశక్తిని వినియోగింపలేదు. రాముని పొందుటకు హనుమ భుజమునెక్కి పోవుట కంగీకరింపలేదు. హనుమ మాటను విని రాముడే వచ్చి రక్షించునని ధైర్యముతో నుండెను.

ఆమె పాతివ్రత్య మహిమగలది. పాతివ్రత్య మహిమచే రావణుని దహింపగలదు. కాని ఊరకుండెను.

ఇపుడు హనుమను రక్షించుటకు ఆ పాతివ్రత్యమహిమ నుపయోగించెను.

శిష్యుడు గురువుయొక్క శరీరమును పదిలముగా నుండునట్లు చూచుకొనుచుండవలెను. ఆ శరీరములో నున్నంతకాలము ఆచార్యుడు తనను రక్షించుచుండును. అందుచే ఆ శరీరము రక్షణకు తన శక్తిని వినియోగించి యత్నింపవలెను. అందుచే సీతమ్మ హనుమద్రక్షణమునకు అగ్నిహోత్రుని ఉపాసించెను.

భగవదనుగ్రహముపొంది భగవదాజ్ఞచే జీవనమును సాగించుచున్న ఆచార్యుడు శరీరమునే ప్రధానముగా భావింపరాదు. భగవానుని ప్రీతికై క్లేశములను సహించుటకైనను తాను సిద్ధపడియుండవలెను. వానికి అవసరమైనచో వాడే రక్షించుకొనును, తనకాబాధ్యత లేదని యుండవలెను.

అట్లే హనుమ తన శరీర రక్షణబాధ్యతను తాను పెట్టుకొనక అగ్ని ప్రజ్వలించుచున్నను హాయిగా నుండెను.

ఇట్లు గురువు, శిష్యుడు తమ తమ రక్షణ విషయములలో ఎట్లు ప్రవర్తింపవలెనో సీతమ్మ, హనుమ తమ ప్రవర్తనలచే నిరూపించిరి.

హనుమకు తాపమును తగ్గించిన ఈ శ్లోకములు ప్రధానమైనవి.

హనుమ లాంగూలము దహింపబడుచున్నను బాధకలుగక పోవుటను చూచి ఆశ్చర్యముతో ఇట్లాలోచింపసాగెను.

"అగ్నిహోత్రము బాగుగ ప్రజ్వలించుచున్నది. కాని నన్ను కాల్చుటలేదు. పెద్దపెద్ద మంటలు వచ్చుచున్నవి. కాని నాకు బాధకల్గుటలేదు. తోకచివర చల్లని చందనము పెట్టినట్లున్నది. దీనికి కారణము తెలిసినది.

ఆనాడు సముద్రములో రాముని ప్రభావమువలన నన్ను సత్కరించుటకు కొండపైకి తేలినది. సముద్రుడు, మైనాకుడు రాముని విషయమున అంత తొట్రుపాటుతో సాయపడుటకు సిద్ధపడివారు. అగ్నిహోత్రుడు మాత్రము రాముని విషయమున సాయపడడా? సీతమ్మకు నాపై గల జాలి, రాముని తేజస్సు, మాతండ్రికి అగ్నితో గల స్నేహము-- ఈ కారణములచే అగ్ని నన్ను దహింపలేదు."

ఇట్లు క్షణకాల మాలోచించి ఒక్కసారి గర్జించి పై కెగిరెను.

పర్వత శిఖరమువలె ఉన్నతమైన పురద్వారమును చేరెను.

పర్వతమువలెనున్న హనుమ క్షణములో మరల చిన్నవాడై తనకట్లను జార్చుకొనెను.

కట్లు విడిపోవగనే మరల పర్వతమువలె పెరిగి ఆ తోరణముపైనున్న పరిఘను లాగి రక్షకులను దానితో కొట్టి చంపెను. తీవ్రపరాక్రముడై వారిని చంపి తోకచివర వెలుగుచున్న అగ్నిహోత్రముగలవాడై తేజఃపుంజముతో కూడిన సూర్యునివలె ప్రకాశించుచుండెను.

**54** అపుడు హనుమ లంకసంతను చూచుచు ఉత్సాహము వృద్ధి నందుచుండగా మిగిలిన పనిని గూర్చి ఇట్లాలోచించెను.

"ఈ రాక్షసులకు ఇంకను సంతాపము గల్గుటకు ఏమిచేయవలసి యున్నది? వనమును పాడుచేసితిని. బలముగల రాక్షసులను కొందఱను చంపితిని. సైన్యములో కొంతభాగమును నాశనము చేసితిని.

ఇక మిగిలిన పని దుర్గములను పాడుచేయుట. దుర్గములను పాడుచేసి నచో నా పరిశ్రమ కొంతవరకు సఫలమగును. ఇపుడు నేను స్వల్పప్రయత్నము చేసినచో ఈ మిగిలిన కార్యము సుఖముగ ఫలించును. నా తోక కంటించిన అగ్నిహోత్రునకు ఈ భవనములతో సంతర్పణముచేయుట న్యాయము."

అని యనుకొని మండుచున్న తోకతో మెరపుతో గూడిన మేఘమువలె లంక యందలి భవనాగ్రముల యందు సంచరించుచుండెను.

ఇంటిపై నుండి ఇంటిపైకి దాటుచు ఉద్యానములను, ప్రాసాదములను చూచుచు తిరుగుచుండెను.

మహా వేగముగలవాడై ప్రహస్తుని భవనముపై దూకి అచ్చట అగ్నిని నిక్షేపించెను. అచ్చటనుండి మహాపార్శ్వుని భవనమునకు దూకెను. అచట నుండి వజ్రదంష్ట్రుని యొక్క భవనమును, శుకుని, సారణుని భవనములను, ఇంద్రజిత్తు భవనమును కాల్చెను.

తరువాత చాలమంది భవనములను కాల్చుచు విభీషణుని భవనమును మాత్రము విడచి క్రమముగ దాటుచు, కాల్చుచు పోవుచుండెను.

అందరి భవనములు దాటిన తరువాత రావణుని భవనమును చేరెను. నానారత్న విభూషితము, మేరు మందర సంకాశమునగు ఆ రావణ భవనము నందగ్నిని ఉంచెను. ఉంచి, ప్రళయకాల మేఘమువలె గర్జించెను. గాలివలన ఆ అగ్ని తీవ్రముగ ప్రజ్వలించు చుండెను.

కాంచనమయములు, మణిమయములునగు భవనములు కూలుచుండెను.

పుణ్యముతీరిన తరువాత ఆకాశమునుండి సిద్ధులు క్రిందపడినట్లు విమానములు విరిగి నేలపడుచుండెను. పరుగెత్తుచున్న రాక్షసుల ఆలజడి అంతట వ్యాపించెను.

ఎవరి ఇండ్లను వారు కాపాడుకొనుటకు ఉత్సాహములు పోయి వీథులలో పరుగులెత్తుచుండిరి.

అగ్నిహోత్రుడే వానరరూపమున వచ్చినాడని వారనుకొనుచుండిరి.

పాలు త్రాగుచున్న చంటిబిడ్డల నెత్తుకొని ఏడ్చుచు, జుట్టు వీడి స్త్రీలు మేడలనుండి క్రింద పడుచుండిరి.

వజ్రములు, వైడూర్యములు, పగడములు, ముత్యములు, వెండి మున్నగునవన్నియు కరిగి కాలువలై పారుచుండెను.

అగ్నిహోత్రుడు కాష్ఠములు, తృణములు ఇంధనముగా ఎన్ని లభించినను దహించుచునే యుండెను. హనుమ ఎన్ని ఇండ్లకు నిప్పుపెట్టినను తృప్తిలేక ఇంకను పెట్టుచునే యుండెను.

చనిపోయి నేలపడిన రాక్షసులతో భూమికి తృప్తిలేకుండెను.

పట్టణము దహింపబడుచుండగా పై కెగసిన అగ్నిజ్వాలలు ఒకచోట మోదుగు పూవులవలె, ఒకచోట బూరుగు పూవులవలె, ఒకచోట కుంకుమవలె ప్రకాశించుచుండెను.

వేగము గల హనుమ లంకాపురమునంతను ఆనాడు రుద్రుడు త్రిపురములను భస్మముచేసినట్లు భస్మము చేసెను.

ప్రళయకాలాగ్నిహోత్రతుల్యమై ఆ అగ్ని ఆకాశము నంటుచు రాక్షసుల శరీరములోని క్రొవ్వుపదార్థముచే జ్వాలలు కలదై వృద్ధినందుచుండెను.

కోటి సూర్యులతో సమానమైన కాంతులు గలదై ఆ అగ్ని పిడుగుల వంటి చప్పుళ్ళతో లంక నంతను వ్యాపించి, బ్రహ్మాండమునంతను బ్రద్దలు చేయుచున్నదా అనునట్లు ప్రకాశించెను.

"ఇంద్రుడో, మహేంద్రుడో, యముడో, అనిలుడో, రుద్రుడో, అర్కుడో, ధనదుడో అయియుండును గాని ఈతడు వానరుడుకాడు. మృత్యువే ఈ రూపమున వచ్చియుండును. సర్వపితామహుడగు బ్రహ్మ సర్వజగత్స్రష్టికర్త రాక్షసులను నశింపచేయుటకై చూపిన కోపమే వానరరూపమును దాల్చి ఇటకు వచ్చియుండును.

వైష్ణవమగు తేజస్సే రాక్షస వినాశమునకై కపిరూపమును దాల్చి వచ్చియుండును." ఈ విధముగ ప్రాణిసమూహములతో, గృహములతో, వృక్షములతో కాలిపోవుచున్న లంకాపురిని చూచి అచట చేరిన రాక్షసు లనేకులు అనుకొనుచుండిరి.

కాలిపోవుచున్న ఆ లంకలోనుండి సంకులమగు శబ్దములు వినవచ్చుచుండెను. "హా తాత! హా పుత్ర! కాంత! మిత్ర!" అని ఈ విధముగ వారు పల్కుచున్న భయంకరమగు శబ్దములు వినవచ్చుచుండెను.

హనుమంతుని క్రోధముచే లంక శాపముచే భస్మమయినట్లు భస్మమాయెను.

శ్రేష్ఠమగు వృక్షములతో నిండిన వనమును విరిచి, యుద్ధములో గొప్ప రాక్షసులను చంపి, శ్రేష్ఠమగు భవనములు గల లంకాపురిని కాల్చి, వాయుపుత్రుడగు హనుమ లాంగూలాగ్రమున వెలుగుచున్న అగ్నిహోత్రముతో కిరణములతో ప్రకాశించుచున్న సూర్యునివలె, త్రికూటపర్వత శిఖరమున నిలచెను.

ఈ విధముగ అనేకులగు రాక్షసులను చంపి, వనమును పాడుచేసి,

రాక్షసభవనములను అగ్నికి ఆహుతి చేసి, మనసులో రాముని స్మరించుచు నిలచెను.

మహా బలుడు, మహా మతిమంతుడు, మారుతతుల్యవేగుడునగు వాయు పుత్రుని జూచి దేవతలందరు స్తుతించిరి.

హనుమ విజయముతో ప్రకాశించుచుండెను. దేవతలు, గంధర్వులు, సిద్ధులు, ఋషులు కాలిపోయిన లంకను జూచి పరమాశ్చర్యము నందిరి.

సర్వభూతములు హనుమంతుని జూచి ప్రళయకాలాగ్ని అని భయపడిరి. దేవతలు, మునులు మున్నగువారందరు అచటికి వచ్చి చూచి సాటిలేని ప్రీతిని పొందిరి.

**55** లంకనంతను కాల్చి ఆ తోకయందలి నిప్పును హనుమ సముద్రములో చల్లార్చెను. కొండమీదనుండి మండి ధ్వంసమగుచున్న లంకాపట్టణమును చూచి హనుమ ఇట్లనుకొనసాగెను.

అతనికి చాల భయము కల్గెను. తనను తాను నిందించుకొనెను. లంకను కాల్చుచు నేను ఏమిపని చేసితిని! కోపము ఒడలు తెలియకుండ చేసినది.

"ధన్యాస్తే పురుషశ్రేష్ఠాః యే బుద్ధ్యా కోప ముత్థితమ్
నిరుంధంతి మహాత్మానో దీప్త మగ్ని మివాంభసా.
క్రుద్ధః పాపం న కుర్యాత్కః క్రుద్ధో హన్యా ద్గురూనపి,
క్రుద్ధః పరుషయా వాచా నరః సాధూ నధిక్షిపేత్.
వాచ్యావాచ్యం ప్రకుపితో న విజానాతి కర్హిచిత్,
నాకార్య మస్తి క్రుద్ధస్య నావాచ్యం విద్యతే క్వచిత్.
య స్సముత్పతితం క్రోధం క్షమ యైవ నిరస్యతి,
యథోరగ స్త్వచం జీర్ణాం స వై పురుష ఉచ్యతే."
(సుంద.55-4, 5, 6, 7)

వచ్చిన కోపమును బుద్ధితో, నీటితో నిప్పును చల్లార్చినట్లు ఎవరు నిరోధించుకొందురో వారు పురుషశ్రేష్ఠులు. వారే ధన్యులు. కోపము గలవాడు ఎవడు పాపమును చేయకుండును? కోపము వచ్చిన వాడు గురువులనైనను చంపును. కోపముగలవాడు పరుషమైన వాక్కులతో పెద్దలనుకూడ ఆక్షే

పించును. కోపము కల్గినవానికి అనదగినమాట, అనరాని మాట తెలియవు. కోపముగలవానికి చేయకూడని పని ఉండదు. అనరాని మాట యుండదు. వచ్చిన కోపమును ఓరిమిచే-పాము, కుబుసమువలె ఎవడు దిగజార్చుకొనునో వాడే-పురుషుడు.

దుర్బుద్ధిని, సిగ్గులేనివాడను. పాపాత్ముడను. ఛీ! ఆలోచింపకుండ సీతమ్మకుకూడ నిప్పు పెట్టితిని. స్వామిపత్నీ ఘాతకుడనైతిని. లంకయంతయు కాలిపోయినది. సీతమ్మ కూడ తప్పక కాలియే యుండును. అట్లే అయినచో అజ్ఞుడనగు నేను స్వామి కార్యమును పాడుచేసినట్లే! దేనికొఱకు ఇంత ప్రయత్నము చేసితినో ఆ కార్యము నాశనము చేయబడినది. లంకను దహించుచు సీతమ్మను కాపాడలేక పోతిని. కార్యము అంతయు పూర్తియై కొద్దిగ మిగిలియున్నది.

రామునితో నివేదించిన పని పూర్తి అయినట్లే! అట్టి కార్యమును కోపముచే మూలనాశము చేసితిని.

సీతమ్మ నశించుట నిశ్చయము. లంకలో ఏ ఒక్క భాగము కూడ కాలనిది కన్పడుటలేదు. లంక యంతయు భస్మము చేయబడినది. నా తెలివితక్కువతనము వలన నేను తలపెట్టిన కార్యము పాడైనచో నేను కూడ ఇచ్చటనే ప్రాణత్యాగము చేయుట తగియుండును.

అగ్నిలో పడి మరణింతునా? సముద్రములో పడి మరణింతునా? లేక సముద్రములోని జంతువులకు ఆహారముగా ఈ నా శరీరమును ఒసంగుదునా? కార్యమంతయు పాడుచేసి బ్రతికియుండి వెళ్ళి ఆ వానర రాజగు సుగ్రీవుని గాని, రామలక్ష్మణులను గాని ఎట్లు చూడగలను?

రోషమువలన చాల తొందరపాటు పని చేసితిని. లోకములో ప్రసిద్ధమైన కోతుల చాపల్యమును చూపించితిని.

ఛీ! ఏమి రాజస భావము? ఏమి స్వతంత్రత? ఏమి చాపల్యము? సీతమ్మను రక్షింపగల్గియుండి కూడ రజోగుణముచే కల్గిన ఆగ్రహము వలన రక్షింపకపోతిని.

సీత నశించినచో రామ లక్ష్మణు లిరువురు నశింతురు. వారిద్దరు నశించిన సుగ్రీవుడు బంధువులతో కూడ నశించును. ఆవార్తను విని భ్రాతృవత్సలుడగు భరతుడు శత్రుఘ్నునితో కూడ మరణించును. ధర్మిష్ఠమగు ఇక్ష్వాకు వంశము నాశము నొందగా ప్రజలందరు కూడ శోకసంతాపపీడితు లగుదురు

దురదృష్టవంతుడను. ధర్మార్థములు రెండును చెడినవాడను. రోషదోషము క్రమ్మిన వాడను. లోకమునకే వినాశకుడను."

అని హనుమ బాధపడుచుండగ వెనుక కన్పించిన శకునములు మరల కాన్పించెను. అట్టి శకునములు పూర్వము కూడ కన్పట్టుటచే సీతమ్మ జీవించియే యుండును అనుకొని, "సుందరాంగియగు సీత తన తేజస్సు చేతనే తాను రక్షింపబడును. ఆమె నశింపదు-

"నాగ్ని రగ్నౌ ప్రవర్తతే." (సుంద. 55-23)

అగ్ని అగ్నిని దహింపదు. అమిత తేజశ్శాలి, ధర్మాత్ముడు నగు రాముని భార్యను, తన నడువడిచే రక్షింపబడుచున్న యామెను అగ్నిహోత్రము స్పృశింపలేదు. రాముని ప్రభావము చేతను, సీతమ్మ పుణ్యము చేతను దహించు స్వభావముగల అగ్ని నన్నే దహింపలేదు. భరత లక్ష్మణ శత్రుఘ్నులు ముగ్గురకు దేవతయై, రామునికి మనఃకాంతయైన సీతమ్మ ఎట్లు నశించును? అన్నిటిని దహింపగల శక్తిగల అగ్నిహోత్రుడు నా తోకనే కాల్చలేకపోయెను గదా! సీతమ్మనెట్లు దహించును? సముద్రములో పర్వతము లేచుట ఆశ్చర్యము కదా! తపస్సుచేత, సత్య వాక్యముచేత భర్తయందు అనన్యమగు భక్తి వలన సీతమ్మ అగ్నిని కూడ దహింపగలదు. అగ్ని యామెను దహింపలేదు."

"అపి సా నిర్దహే దగ్నిం న తా మగ్నిః ప్రధక్ష్యతి."
(సుంద.55-29)

ఈ విధముగ హనుమ భావించుచుండగా మహాత్ములగు చారణులు ఆకాశమున పోవుచు పల్కుచున్న మాటలు హనుమ చెవిని పడెను.

"ఆహా! రాక్షసుని నివాసమగు లంకయందు హనుమ అగ్నిని ఉంచి ఎవ్వరు చేయలేని పనిని చేసెను.

రాక్షస్త్రీలు, బాలురు, వృద్ధులు పరుగెత్తు చుండగా జనకోలాహలముతో పట్టణ మంతయు నిండియున్నది. మిద్దెలతో, ప్రాకారములతో, తోరణములతో పట్టణ మంతయు దహింపబడినది కాని, సీతమ్మ మాత్రము దహింపబడలేదు అద్భుతమగు ఆశ్చర్యము."

వెనుక కన్పించిన శకునములు, సీతా పాతివ్రత్యము, రామ ప్రభావము మున్నగు కారణములే కాక ఋషుల వాక్యములు హనుమకు ప్రీతిని కల్గించెను. తాను కోరిన విధముగ కార్యమంతయు నెరవేరిన పిమ్మట సీతమ్మ సుఖముగా

నున్నదని విని, మరల ఒక్కసారి సీతమ్మను చూచి వెనుకకు వెళ్ళవలెనని హనుమ తలంచెను.

**56** సుఖముగా నున్న సీతమ్మను చూచుటకు హనుమ మరల అశోకవనమున కేగెను. అందు శింశుపావృక్షమూలమున కూర్చుండియున్న సీతమ్మను చేరి,

"అమ్మా! అదృష్టవశమున సుఖముగా నున్న నిన్ను చూడగల్గితిని" అని బయలుదేరబోవుచున్న హనుమను జూచి సీతమ్మ భర్తయందు ప్రేమతో మరల మరల హనుమంతునితో ఇట్లుపల్కెను.

"ఈ కార్యమును సాధించుటలో నీ వొక్కడవే సమర్థుడవు. నీ బలము ప్రశంసనీయము. బాణములతో లంకను చీకాకుపరచి శ్రీరాముడు నన్ను తీసి కొని వెళ్ళుట ఆతనికి తగినపని. ఆతని పరాక్రమమునకు అనురూప మగు విధముగా కార్యమును నెరవేర్చునట్లు నీవు చేయవలెను." సీతమ్మ చెప్పిన మాటలను హనుమ విని, "అమ్మా! రాముడు వానరసైన్యముతో కూడి త్వరలో వచ్చును. యుద్ధములో శత్రువులను జయించి నీ శోకమును తొలగించును" అని సీతమ్మ నోదార్చి బయలుదేరుటకు సిద్ధపడి సీతమ్మకు నమస్కారము చేసెను.

**తత్త్వదీపిక :-**

లంక దహింపబడినను సీత దహింపబడకపోవుట గమనింపదగిన విష యము.

తల్లిదండ్రులవలన జన్మలేక, భూమిలో నుండి బయల్వెడలినది సీత. అందుచే ఆమె పుట్టుక లేనిదని తెలిపినది.

*"న జాయతే మ్రియతేవా కదాచిత్"*

అని ఆత్మస్వరూపమును వివరించుచు జన్మలేక పోవుటను మొట్ట మొద టగా పేర్కొనెను.

జన్మము లేదు అనుటచే ఆ జన్మకు సంబంధించిన ఆరు వికారములు లేనిది అని గమనింపవలెను.

లోకములో పుట్టిన ప్రతివస్తువునకు :

పుట్టుట, ఉండుట, పెరుగుట, మారుట, తరుగుట, నశించుట అనునవి ఆరును ఉండును.

ఆత్మకు జన్మ లేదు గనుక ఆ ఆరువిధములగు మార్పులును ఉండవని తెలియవలెను.

"న దహ్యాతే దహ్యామానే శరీరే"

శరీరము దహింపబడినను ఆత్మ దహింపబడదు అని భగవద్గీత చెప్పెను.

లంక దహింపబడినను సీతమ్మ దహింపబడ లేదు -- అనుటలో ఆత్మకు గల ఆ స్వరూపము వివరింపబడెను. ఇట్లు సీతమ్మను ఆత్మ స్వరూపముగా భావించుటచే ఆత్మకు గల లక్షణములను ఆమెయందు చూపించెను.

ఆమె సాక్షాత్తు లక్ష్మియైనను ఆత్మగా నటించి జీవుని స్వరూపమును, ఆ జీవుడు బంధమును పొందు విధమును, మోక్షమునకై ప్రయత్నింపవలసిన తీరును నిరూపించెను.

హనుమ ఆచార్యుడుగా మోక్షమం దిచ్చుగల జీవుని అన్వేషించి భగవంతునికి నివేదించుటకు వెనుకకు బయల్దేరెను. సాధకుడు కర్మయోగముచే పరిశుద్ధమైన అంతఃకరణము గలవాడై ఆత్మావలోకనము నొనర్చి విషయములను, ఇంద్రియములను, మనస్సును, బుద్ధిని, కామమును జయించి భగవదనుగ్రహముచే భగవత్ ప్రాప్తికి అభిముఖుడై ఏగుట ఇందు స్ఫురించును.

తరువాత హనుమ రామచంద్రప్రభువును చూడ నుత్సాహముతో అరిష్టమనెడి పర్వతశ్రేష్ఠమును అధిరోహించెను. ఎత్తైన పద్మకము లనెడి చెట్లతో గూడిన నల్లని వనపంక్తులు ఆ పర్వతము కట్టుకొనిన బట్టవలెను, శిఖరములపై వ్రేలాడుచున్న మేఘములు ఉత్తరీయమువలెనె ఒప్పుచుండెను.

పర్వతముపై ప్రసరించుచున్న సూర్యకిరణములు ప్రేమతో చేతితో తట్టి పర్వతమును మేల్కొల్పుచున్నట్లుండెను. ఆ పర్వతముపై గైరికాది ధాతువులు బయల్పడుచుండ పర్వతము కనువిచ్చి చూచుచున్నట్లుండెను. సెలయేళ్ళు పారుచున్న ధ్వనులతో ఆ పర్వతము అధ్యయనము చేయుచున్నట్లుండెను. పర్వతమునుండి బైటికి పారుచున్న ప్రవాహముల ధ్వనులచే పర్వతము సంగీతము పాడుచున్నట్లుండెను. పర్వతశిఖరములపై నున్న ఎత్తైన దేవదారు వృక్షములచే చేతులు పైకి ఎత్తుకొని పర్వతము తపస్సు చేయుచున్నదా అనునట్లుండెను. కొండచరియలనుండి క్రిందకు పడుచున్న జలపాతముల ధ్వనులచే పర్వతము ఆక్రోశించు చున్నట్లుండెను. ఇటు నటు కదలుచున్న, నల్లని, శరత్కాలములో పూచెడి ఏడాకుల అరటి మున్నగు చెట్లచే కొండ వణకుచున్నట్లుండెను. గాలిచే ధ్వనిచేయుచున్న కీటకములను వెదురుబొంగులచే

పర్వతము కూయుచున్నట్లుండెను. ఘోరములగు సర్పములచే, ఆ పర్వతము అమర్షముచే నిట్టూర్పు వదలుచున్నట్లుండెను. మంచు నిండి, గంభీరములుగా నున్న గుహలచే ధ్యానము చేయుచున్నట్లుండెను. సమీప పర్వతములచే నడచుటకు ముందునకు అడుగువేయుచున్నట్లుండెను. మేఘపంక్తులు ఆవరించిన శిఖరములచే ఒడలు విరుచుచున్నట్లుండెను.

హనుమ అడుగుల తాకిడికి శిథిలములైన శిఖరములతో, గుహలతో సాల తాళాదివృక్షములతో ఆ పర్వతము నిండి యుండెను.

ఆ పర్వతమున మహర్షి యక్ష గంధర్వ కిన్నరోరగులు వసించి యుండిరి.

లతలతోను, వృక్షములతోను నిండినది, సింహములు వసించుచున్న గుహలు కలది, వ్యాఘ్రసంఘములు ఆవరించియున్నది, తీయని మూలముల ఫలములు కలది యగు ఆ అరిష్ట మనెడి పర్వతమును హనుమ ఆరోహించెను. సంతోషముతో రాముని చూడవలె నను తొందరతో నుండెను.

మనోహరములగు ఆ కొండచరియలపై హనుమ పాదముల క్రింద పడి శిలలు చూర్ణము లాయెను.

దక్షిణమువైపునుండి ఉత్తరమువైపునకు సముద్రమును దాటవలెనని హనుమ ఆ పర్వతము నధిరోహించి శరీరమును పెంచెను. తరువాత వీరుడగు మారుతి భయంకరమగు ఆసముద్రమును చూచెను.

మారుతాత్మజు డగు ఆ హనుమ దక్షిణమునుండి ఉత్తరపు దిక్కునకు పోవుటకు వాయు వాకాశమున సాగునట్లు ఆకాశములోనికి దూకెను.

హనుమచే పీడింపబడిన ఆ పర్వతము అందలి భూతములతో గూడ ధ్వని చేసెను. శిఖరములు ఊగుచుండెను. చెట్లు విరిగి పడుచుండెను. హనుమ ఊరు వేగముచే పెకలింపబడిన చెట్లు ఇంద్రుని వజ్రాయుధముచే దెబ్బతినిన పర్వతములవలె నేల కూలెను.

పర్వతమును నొక్కుటచే నొక్కుకొనిపోయిన గుహలలో నున్న సింహముల ధ్వని ఆకాశమును బ్రద్దలు చేయుచు భయంకరముగ విన్పడుచుండెను.

జారిపోవుచున్న వస్త్రములతో, చిక్కుపడుచున్న ఆభరణములతో విద్యాధరస్త్రీలు పర్వతముపై నుండి పైకి ఎగిరిపోయిరి.

మహావిషముగల సర్పములు నొక్కబడిన శిరస్సులు, మెడలు గలవై చుట్టుకొనుచుండెను.

ఆ పర్వతమునందున్న కిన్నరోరగ గంధర్వ యక్ష విద్యాధరులందరు ఆ పర్వతమును వీడి ఆకాశమున కెగిరిరి. బలవంతుడగు హనుమచే పీడింపబడిన ఆ పర్వతము చెట్లతో, శిఖరములతో భూమిలోనికి క్రుంగిపోయెను.

పది యోజనముల వెడల్పు, ముప్పది యోజనముల ఎత్తుగల ఆ పర్వతము క్రిందకు దిగిపోవుటచే భూమిపై ఆ భాగము సమతల మాయెను.

ఈ విధముగ భయంకరమగు సముద్రమును దాటదలంచిన వాడై హనుమ ఆకాశములోనికి ఎగిరెను.

**57** హనుమ సముద్రలంఘనమున కుద్యమించి ఆకాశ మనెడి సముద్రములో ఈదుచున్నట్లు ముందునకు సాగుచుండెను. ఆకాశ మనెడి సముద్రములో చంద్రుడు కలువ వలెను, సూర్యుడు కారండవము అను జలపక్షి వలెను, పుష్యశ్రవణనక్షత్రములు హంసల వలెను ఒప్పుచుండెను. మేఘములు నాచువలె నుండెను. పునర్వసునక్షత్రము చేపలవలెనుండెను. కుజగ్రహము పెద్ద మొసలివలె నుండెను. ఐరావతము అందొక పెద్ద ద్వీపము వలె నుండెను. స్వాతి హంస వలె ఒప్పుచుండెను. చంద్రకిరణములు గాలికి కదలిన కెరటముల వలె నుండెను. భుజంగయక్షగంధర్వులు వికసించిన తామరలవలె, కలువలవలె నుండిరి.

అట్టి ఆకాశ మనెడి సముద్రములో పడవ పోవుచున్నట్లుగా హనుమ పోవుచుండెను.

ఆకాశమును మ్రింగు చున్నాడా అనునట్లు, చంద్రుని రాయుచున్నాడా అనునట్లు, నక్షత్రములతో సూర్యమండలముతో కూడిన ఆకాశమును హరించు చున్నాడా యనునట్లు, హనుమ ఆకాశముపై వేగుచుండెను.

మారుతాత్మజుడగు హనుమ మేఘములను ముందుకు లాగుకొని పోవు చున్నట్లుండెను.

ఆ మేఘముల మధ్యనుండి హనుమ పోవుచుండగా ఆతని కాంతులు వ్యాపించి మేఘములు తెల్లగను, ఎఱ్ఱగను, నల్లగను, పచ్చగను ప్రకాశించుచుండెను.

మేఘములలో ప్రవేశించుచు, వెలికి వచ్చుచు, ముందుకు సాగుచున్న హనుమ మబ్బుల చాటున మరుగు పడుచు వెలికి వచ్చుచు ఆకాశమున ఏగుచున్న చంద్రుని వలె కన్పట్టెను.

తెల్లని వస్త్రమును దాల్చి మేఘ సమూహముల మధ్యను కనపడీ కనపడ కుండ సాగుచున్న హనుమ చంద్రునివలె నుండెను.

మేఘ బృందములను చీల్చుకొనుచు ముందున కేగుచున్న హనుమ గరుత్మంతునివలె నేగుచు మేఘ గర్జనమువలె గంభీరముగ గర్జించుచుండెను.

లంకలో రాక్షసులను చంపి, తన పేరంతట చాటి, పట్టణమును రావణుని ఆకులపరచి, సైన్యమును మర్దించి, సీతమ్మకు నమస్కరించి, సముద్రమధ్యమున ఏగుచుండెను.

వింటినారి నుండి లాగి వదలిన బాణమువలె మహావేగముతో వెళ్ళుచు, త్రోవలో మైనాకమును స్పృశించి, కొంచెము ముందునకు వచ్చి మహేంద్రప ర్వతమును చూచెను.

చూచి, పది దిక్కులు నిండునట్లు గట్టిగా గర్జించెను. మిత్రులను చూడవ లెనను కోరికతో వారున్న చోటునకు సమీపించుచుండగనే హనుమ గర్జించెను. తోకను ఝుడిపించెను.

గంభీరమగు ఆతని గర్జనమునకు సూర్యమండలముతో గూడిన ఆకా శము బ్రద్దలగునేమో యనిపించెను.

హనుమను చూడవలెనను కోరికతో ఉత్తర తీరమున కాచుకొని కూర్చుం డిన వానరులు గంభీరమగు మేఘ గర్జనమువంటి ఆ ధ్వనిని, తొడల కదలికచే వచ్చిన ధ్వనిని వినిరి.

దీనులైయున్న ఆ వానరులు హనుమ గర్జనమును విని ఉత్సాహ పరిపూ ర్ణులై మిత్రుని చూడవలెనను కోరికతో ఒక్కసారి లేచిరి. వానర శ్రేష్ఠుడగు జాంబవంతుడు ప్రీతితో నిండిన మనసుగల వాడై వానరు లందరను పిలిచి ఇట్లు చెప్పెను.

"సర్వథాకృత కార్యోऽసౌ హను మాన్నాత్ర సంశయః
న హ్యా స్యాకృత కార్యస్య నాద ఏవం విధో భవేత్."

(సుంద.57.23)

"హనుమంతుడు కార్యమును నెరవేర్చుకొనియే వచ్చుచున్నాడు. సందే హము లేదు. కార్యమును పూర్తిచేయని హనుమ ఇట్టి గర్జనము నొనర్పడు."

ఈ విధముగ జాంబవంతుడు చెప్పగా హనుమ చేయుచున్న ధ్వనిని విని సంతోషముతో వానరులు ఎగిరి పర్వత శిఖరముల నుండి శిఖరములకు, చెట్ల

కొనలనుండి కొనలకు హనుమను చూడవలెనని దూకుచుండిరి.

చెట్ల శిఖరములయందు కూర్చుండి దూర దేశము నుండి వచ్చుచున్న తమ బంధువులకు స్వాగత మిచ్చుచున్న మనుష్యులు వస్త్రముల నూపినట్లు కొమ్మల నూపుచుండిరి.

కొండ గుహలో గాలి ధ్వనించినట్లు హనుమ గట్టిగా గర్జించెను.

మేఘ సమూహమువలె వచ్చుచున్న ఆ హనుమను వానరులందరు దూరము నుండియే నమస్కరించి నిలుచుండిరి.

అపుడు హనుమ పర్వతసదృశుడై వృక్షములతో నిండిన మహేంద్ర పర్వత శిఖరమునందు దిగెను.

రెక్కలు తెగిన కొండ ఆకాశమునుండి పడినట్లు హనుమ పర్వతముపై వ్రాలెను.

వానరులందరు సంతుష్ట మనస్కులై హనుమంతుని చుట్టును చేరి అధికమగు ప్రీతిని పొందియుండిరి. సుఖముగా దిగివచ్చిన హనుమను చూచి వానరులందరు మూలములను, ఫలములను కానుకలుగా తెచ్చి హనుమ కర్పించి సేవించిరి.

హనుమ, జాంబవంతుడు, మున్నగు పెద్దలను, యువరాజగు అంగదుని నమస్కరించెను. వారిచే పూజింపబడినవాడై --

"దృష్టా సీతా" "సీత చూడబడెను"

అని సంగ్రహముగ నివేదించెను.

అంగదుని చేతిని చేతితో పట్టుకొని ఆ మహేంద్ర పర్వతము యొక్క రమణీయమగు ఒకానొక ప్రదేశమున హనుమ కూర్చుండెను. అపుడా వానరులందరతో హనుమ ఇట్లు చెప్పసాగెను.

"భయంకరులగు రాక్షస స్త్రీలచే రక్షింపబడుచున్న పతివ్రతయగు సీత అశోకవనములో కన్పడినది.

ఒంటి జడనుదాల్చి, ఉపవాసముచే బడలి, జడలు కట్టిన జుత్తుతో మలినయై సీతమ్మ కన్పడినది."

హనుమ చెప్పిన అమృతమును బోలిన "చూచితిని" అను మాటను విని వానరులందరు పొంగి పోయిరి. కొందరు సింహనాదమును చేసిరి. కొందరవ్యక్తముగా అరచిరి. కొందరు వృషభము వలె గర్జించిరి. కొందరు కిలకిలమని

ధ్వని చేసిరి. కొందరు పొడవైన తోకలను పైకెత్తి నేలపై కొట్టుచుండిరి. కొందరు పర్వతశిఖరములకెగిరి మరల క్రిందకు దూకి హనుమను స్పృశించు చుండిరి.

అప్పు డంగదుడు హనుమంతునితో నిట్లనెను.

వానరోత్తమ! బలములో గాని, వీర్యములోగాని నీకు సమానుడు వేరొ కడులేడు. విస్తీర్ణమగు సముద్రమును దాటి వెళ్ళి మరల హాయిగా వెనుకకు రాగల్గితివి.

"అహో స్వామిని తే భక్తిః అహో వీర్య మహోధృతిః
దిష్ట్యా దృష్టా త్వయా దేవీ రామ పత్నీ యశస్వినీ."
(సుంద. 57-46)

ఆహా! నీ స్వామిభక్తి, నీ పరాక్రమము, నీ ధైర్యము అద్భుతమైనవి. అదృష్టవశమున కీర్తిమంతురాలగు రాముని భార్యను చూడగల్గితివి. సీత ఎడబాటుచే కల్గిన శోకము రామున కింకతగ్గును."

అపుడు వానరులందరు అంగదుని, హనుమంతుని, జాంబవంతుని చుట్టుకొని శిలలపై కూర్చుండిరి.

హనుమ సముద్ర లంఘన వృత్తాంతమును, లంకా దర్శనమును, సీతా దర్శనమును, రావణ దర్శనమును చెప్పగా వినవలెనని చేతులు జోడించు కొని అందరు నిలచియుండిరి. కీర్తిమంతు డగు హనుమంతుడు అంగదుడు అధిష్ఠించియున్న ఆ పర్వతాగ్రము కాంతిమంతమై విరాజిల్లు చుండెను.

**58** మహేంద్రపర్వత శిఖరమున మహాబలు లగు హనుమదాదు లందరు సంతోషముతో కూర్చుండి యుండిరి. అపుడు జాంబవంతుడు ప్రీతితో వాయుపుత్రుడగు హనుమను, హనుమ చేసివచ్చిన కార్యమునుగూర్చి ప్రశ్నించెను.

"సీతమ్మను నీ వెట్లు చూచితివి? సీతమ్మ అచట ఎటుల నున్నది? ఆమె యెడ క్రూరకర్ముడగు దశాననుడు ఎట్లు ప్రవర్తించుచున్నాడు? దీనిని పూర్తిగా మాకు వివరింపుము. వినిన తరువాత ఏమిచేయవలెనో ఆలోచింతము. రామునివద్ద కేగి ఏమి చెప్పవలెనో, ఏమి దాచవలెనో మాకు తెలియజేయుము."

అని ఈ విధముగ జాంబవంతుడు ప్రశ్నింపగ ఆనందముచే గగుర్పాటు గనవాడై సీతాదేవికి నమస్కరించి హనుమ ఇట్లు బదులు పల్కెను.

"మీరు చూచుచుండగనే సముద్రముయొక్క దక్షిణపు ఒడ్డునకు పోవలెనని మహేంద్రపర్వతశిఖరమునుండి ఎగిరితినిగదా! నేను వెళ్ళుచుండగా త్రోవలో ఘోరమగు విఘ్నముగ ఒక బంగారు శిఖరముగల పర్వతము నా దారిని అడ్డగించి నిలచెను. అది విఘ్నమని నే ననుకొంటిని. ఆ పర్వతమును భేదింపవలెనని మనసులో నెంచితిని, సూర్యునివలె ప్రకాశించుచున్న ఆ పర్వత శిఖరమును తోకతో కొట్టితిని. ఆ శిఖరము నూఱు వ్రక్కలాయెను.

నా పట్టుదలను గుర్తించి ఆ పర్వతము "పుత్రా" అని మధురముగ నన్ను సంబోధించెను. 'నేను నీకు పినతండ్రిని. మీ తండ్రి వాయువు నాకు మిత్రుడు. నేను మైనాకుడను. సముద్రములో పూర్వము పర్వతములకు రెక్కలుండి ఇష్టమువచ్చినట్లు భూమియంతట తిరుగుచు బాధించుచుండెడివి. ఆ పర్వతముల చరిత్రము వివిన మహేంద్రుడు వజ్రముతో వాని రెక్కలను ఛేదించెను. అపుడు మీ తండ్రియగు వాయుదేవుడు నన్ను తెచ్చి ఈ సముద్రములో పడవేసి ఆ వజ్రపు దెబ్బలనుండి తప్పించెను. నేను రామునికి సాయపడవలెను. రాముడు ధర్మవంతులలో శ్రేష్ఠుడు' అని చెప్పెను.

ఆ మైనాకుని మాటలను విని నాపనిని మైనాకునకు విన్నవించి ఆతని యనుజ్ఞను పొంది ముందునకు సాగితిని.

ఆ పర్వతము మనుష్యరూపమును మరుగుపరచి పర్వత శరీరముతో సముద్రములో నిలచియుండెను.

నేను మరల తీవ్రమగు వేగముతో మిగిలిన మార్గమును దాటుచుంటిని. అంతలో సముద్రమధ్యములో సురస అను నాగమాత కన్పడెను.

ఆమె "ఓ వానరోత్తమ! దేవతలు నిన్ను నాకు ఆహారముగా నేర్పరచిరి. అందుచే నిన్ను భక్షించెదను" అనెను.

అపుడు దోసిలియొగ్గి నమస్కరించుచు వివర్ణవదనుడనై నేనిట్లు పల్కితిని. "దశరథపుత్రుడు, శ్రీమంతుడునగు రాముడు, సోదరుడగు లక్ష్మణునితో, సీతతో దండకారణ్యమున ప్రవేశించెను. ఆతని భార్యను సీతను దురాత్ముడగు రావణు డపహరించెను. రాముని యాజ్ఞచే ఆమెవద్దకు దూతగా వెళ్ళుచున్నాను. రామునిదేశములో ఉంటివి గనుక రాముని చూచి వచ్చి నీనోట పడెదను. నిజము. ఒట్టు పెట్టుకొనుచున్నాను."

అని నేను పలుకగా కామరూపిణి యగు సురస "నన్ను మీఱి వెళ్లుటకు వీలులేదు. ఇది నాకు వరము" అని పది యోజనముల నోరు తెరచెను. అపుడు

నేనుకూడ అంతకంటె ఎక్కువగా పెరిగితిని. నన్ను మ్రింగుటకు తగిన ట్లామె కూడ నోరు తెరచెను. ఆమె నోరు తెరచుట చూచి నేను అంగుష్ఠ మాత్రుడనై ఆమె ముఖములోనుండి దూరి అవతల కేగితిని. అపుడు సురస స్వస్వరూపముతో "వానరోత్తమ! సుఖముగా వెళ్ళుము. కార్య సిద్ధి నందుము. రామునితో సీతమ్మను కూర్చుము. సంతుష్టనైతిని" అని యాశీర్వదించెను. అపుడు సర్వభూతములు బాగు బా గని నన్ను ప్రశంసించినవి.

మరల గరుత్మంతునివలె విశాలమగు అంతరిక్షములో ఏగుచుంటిని. నా నీడను బట్టి ఏదో నన్ను లాగి నన్ను అడ్డెను. ఏదియు కానరాలేదు. నా వేగమును నిరోధించుదానిని దేనిని అచ్చట కాంచలేకపోతిని. ఇట్టి విఘ్నము ఎట్లు వచ్చినదా యని ఆలోచించుచు క్రిందివైపు దృష్టిని సారించితిని.

సముద్రజలములో భయంకరమగు ఒక రాక్షసి కన్పించెను. ఆమె మహా నాదము నొనర్చుచు గట్టిగ నవ్వి ఏమియు చలింపక నిల్చిన నన్ను గూర్చి ఇట్లు పల్కెను.

"ఓయి ఎచట కేగుచుంటివి? ఆకలి వేయుచున్న నాకు తగిన ఆహార ముగా దొరికితివి. చిరకాలమునుండి ఆహారము లేనినాకు తృప్తి కల్గును. నన్ను తృప్తిపరచుము" అనెను.

ఆమె మాటలను విని అట్లేయని అంగీకరించి ఆమె నోటి కంటె పెద్దగా పెరిగితిని. నేను పెరుగగనే ఆమె కూడ నోరు పెంచెను. కాని నేను చేయబోయెడి అపకారమును ఎఱుంగలేకుండెను. అప్పుడు నేను ఒక నిమిషములో శరీరమును సంకోచింపచేసి ఆమెలో నుండి దూరి ఆమె హృదయమును త్రుంచి మరల ఆకాశమున నిల్చితిని. పర్వత సదృశయై ఆమె సముద్రములో పడెను.

ఆకాశమునందలి సిద్ధులు, చారణులు 'హనుమానుడు భయంకరమగు సింహికను చంపినా' డని గట్టిగా చెప్పుకొనుచుండిరి.

ఈ విధముగా ఆమెను చంపి ముందునకు సాగి సముద్రపు దక్షిణతీర మును చేరితిని.

అక్కడ లంకాపురియుండెను. సూర్యుడస్తమించగనే రాక్షసులకు తెలి యకుండ ఆ లంకలో ప్రవేశించితిని. లంకలో ప్రవేశించుచుండగ ప్రళయకాల మేఘమువంటి ఒక స్త్రీ అట్టహాసమును చేయుచు నా ఎదుట నిలచెను. ఆమె నన్ను చంపవలెనని తలంచెను. కాని నేను నా ఎడమ పిడికిలి పోటుతో ఆమె

నోడించి ప్రదోషసమయమున పట్టణమున ప్రవేశించితిని.

ఆమె భయపడి "ఓ వీర! నేను లంకాపురిని, నీ పరాక్రమముచే ఓడింప బడితిని. నన్ను జయించితివి గనుక రాక్షసుల నందరను నీవు జయించగగలవు" అని పల్కెను.

అపుడు నేను పట్టణములో ప్రవేశించి రాత్రియంతయు పట్టణమునం తను వెదకి రావణాంతఃపురమున చేరి వెతికితిని. కాని సీతమ్మ కానరాలేదు.

రావణభవనమున సీతమ్మను కాంచలేక దుఃఖసాగరమున మునిగితిని. అట్లు శోకించుచు బంగారు ప్రాకారముతో కూడిన గృహోద్యానమును చూచి తిని. ఆ ప్రాకారమును దాటి అనేక వృక్షములుగల అశోకవనములో ప్రవేశించి ఒక పెద్ద శింశుపావృక్షమును జూచితిని. దాని నధిరోహించి దగ్గరగా నున్న బంగారు అరటితోటను చూచితిని. ఆ శింశుపావృక్షమునకు సమీపముననే యౌవనమధ్యస్థ, కమలపత్రాక్షి, ఉపవాసకృశావన, ఏకవస్త్రధారిణి, ధూళిధూసరి తకేశపాశ, శోకసంతాపదీన అగు సీతను కాంచితిని.

రక్తమాంసములను తినుచున్న క్రూరులగు రాక్షసస్త్రీలు ఆమెచుట్టును ఉండిరి. వా రామెను మాటిమాటికి బెదిరించుచుండిరి.

ఆమె దీనురాలై రామునే ధ్యానించుచు రావణునిపై మనసు నిలుపక చనిపోవుటకే నిశ్చయము చేసికొనియుండెను.

అట్లున్న రామపత్నిని చూచుచు ఆ శింశుపావృక్షమునందే కూర్చుండి యుంటిని.

ఇట్లుండ కాంచీనూపురధ్వనులతో గలగలమను శబ్దము రావణుని భవన మునుండి విన్పించెను. నేను గూడ ఉద్వేగమునొందినవాడనై నా రూపమును తగ్గించుకొని ఆ శింశుపా వృక్షమునందే పక్షివలె కూర్చుంటిని.

అపుడు రావణుడు భార్యలతో సీతమ్మ ఉన్న స్థలమునకు వచ్చెను. సీత ఆ రావణుని జూచి ఒడలు ముడుచుకొని భయపడి పోవుచు రక్షకు లెవరును లేనిదై దీనురాలై యుండెను.

అపుడు రావణుడు అత్యంత దుఃఖితయై యున్న సీతను తన నాదరిం చుమని వంగి నమస్కరించి బ్రతిమాలెను.

"నీ వంగీకరింపక పోయినచో సీతా! రెండు మాసములు నీకు గడువు. తరువాత నీ రక్తము త్రాగెదను" అనెను.

దుర్మార్గుడగు రావణుని మాటలను విని కోపముగలదై సీత ఇట్లు పల్కెను.

"రాక్షసాధమ! అమిత పరాక్రమశాలి యగు రాముని భార్యను. దశరథుని కోడలిని. అనరాని మాట లాడుచున్నావు. నీ నాలుక నేల పడకుండునా? నా ప్రభువగు రామునివద్ద నీ పరాక్రమము కొరగానిది. ఆతనికి కన్పడకుండ నన్ను దొంగిలించి తెచ్చితివి. రామునకు నీవు దాస్యము చేయుటకు కూడ తగవు."

అని ఈ విధముగ జానకి పరుషముగ పలుకగా చితిలోని అగ్నివలె రావణుడు మండిపడెను.

వెంటనే క్రూరములగు నేత్రములను త్రిప్పుచు కుడిచేతి నెత్తి సీతమ్మను చంపుటకు సిద్ధపడెను. స్త్రీలందరు హాహాకారము చేసిరి.

ఆ స్త్రీల మధ్యనుండి మండోదరి అడ్డువచ్చి రావణుని వారించి "స్వామీ! సీతమ్మతో ఏమి పని? సీతమ్మ ఎందుకు? ఇంతమంది దేవకన్యలు, యక్షకన్యలు కలరు గదా! వీరితో రమింపుము" అని పలికి తమ భవనమునకు తీసికొని ఏగిరి.

రావణుడు వెళ్ళిన తరువాత వికృతానన లగు రాక్షస స్త్రీలు క్రూరము లగు మాటలతో సీతమ్మను బెదరించిరి.

ఆమె వారి మాటలను తృణప్రాయముగ త్రోసిపుచ్చెను. వారి గర్జనములు ఆమె వద్ద పని చేయలేదు.

ఆ రాక్షసస్త్రీలు వ్యర్థ ప్రయత్నులై ఆమె పట్టుదలను రావణుని కెఱింగించిరి. తరువాత లాభములేదని ఆశ లుడిగి ఆమె చుట్టును వారు పరుండి నిద్రపోవుచుండిరి.

వారు నిద్రపోవుచుండగా సీత కరుణముగ విలపించి శోకించుచుండెను.

వారి మధ్యనుండి త్రిజట లేచి వారితో ఇట్లు పల్కెను. "నన్ను తిని వేయుడు. సీతమ్మ నశింపరాదు. జనకుని కూతురు, దశరథుని కోడలు, పతివ్రతయు నగు సీతకు నాశము లేదు. ఆశ్చర్యకరమగు స్వప్నమును గాంచితిని, ఆ స్వప్నము రాక్షసులకు వినాశమును ఈమె భర్తకు విజయమును సూచించుచున్నది. రాముని నుండి రాక్షసస్త్రీల నీమె రక్షింపగలదు. ఈమెను యాచింతము. అదియే నాకు నచ్చినపని. దుఃఖపడుచున్న యామెను గూర్చి ఇట్టి స్వప్నము వచ్చినది గాన ఆమె తప్పక సుఖము పొందును జనకాత్మజ

యగు మైథిలి నమస్కార మాత్రముచే ప్రసన్నురాలగును" అని త్రిజట చెప్పగనే హ్రీమతి యగు ఆ బాల రామచంద్రుని విజయవార్తను విని సంతోషించినదై "త్రిజట చెప్పిన స్వప్నమే నిజమైనచో నేను మీకందరకు శరణ మగుదును" — అనెను.

సీతమ్మ యొక్క దారుణమగు ఆ అవస్థను జూచి నా మనసు చాల దుఃఖపడెను. సీతమ్మతో మాటాడుటకు ఉపాయము నాలోచించి ఇక్ష్వాకు వంశమును కీర్తించితిని.

ఆ కథను విని సీతాదేవి కన్నీరు నిండిన కనులతో నన్ను చూచి "నీ వెవరవు? ఇచ్చట కెట్లు వచ్చితివి? రామునిపై నీకు ఇట్టి ప్రేమ ఎట్లేర్పడెను? చెప్పుము" ని యడిగెను.

ఆమె మాటలను విని "అమ్మా! నీ భర్తకు సాయపడు మిత్రుడు సుగ్రీవు డను వానరేంద్రుడు కలడు. ఆతని సేవకుడను. హనుమంతు డను. నీ భర్తయగు రామునిచే పంపబడి ఇచ్చటకు వచ్చితిని. శ్రీమంతుడగు రామచంద్రుడు స్వయముగా నీ కిమ్మని ఈ ఉంగరము గుర్తుగా ఇచ్చెను. నీవె ట్లాజ్ఞాపించిన అట్లు చేసెదను. నిన్నిప్పుడే రామ లక్ష్మణుల వద్దకు చేర్చెదను. ఏమందువు?" అంటిని.

దానిని విని సీత "రావణుని చంపి రాముడు నన్ను తీసికొని వెళ్ళవ లెను" అనెను.

అపుడు పతివ్రత యగు ఆమెకు నమస్కరించి రామున కేదైన గుర్తు నొసంగుమని కోరితిని. ఆమె వెంటనే చూడామణి నిచ్చి "దీనిని రామున కొసంగుము. రాముడు నిన్ను గౌరవించును" అని పల్కి మాటలతో కూడ సందేశమును చెప్పెను.

అపుడా రాజపుత్రి యగు సీతకు నమస్కరించి, ప్రదక్షిణముచేసి, బయు ల్దేర సిద్ధపడితిని. అపుడామె "హనుమా! నావృత్తాంతమును రాముని వద్ద నివేదింపుము. విని రామలక్ష్మణులిరువురు నను చేరునట్లు చేయుము. రెండు మాసములు మాత్రమే గడువున్నది. ఈ రెండు మాసములలో రానిచో రాముడు నన్ను చూడడు. నేను అనాథ వలె మరణింతును."

దీనమగు ఆ మాటను విని నా మనసులో కోపము ప్రజ్వరిల్లినది. తరువాత ఏమి చేయవలెనని ఆలోచించితిని. శరీరమును పర్వతసదృశముగ పెంచితిని. రాక్షసులతో యుద్ధము రావలెనని అశోకవనమును ధ్వంసము

చేయ నారంభించితిని.

అశోక వనమును భంజింపగా అందలి మృగములు, పక్షులు బెదరి పరుగులెత్తినవి. ఆ యలజడిచే రాక్షసస్త్రీలకు తెలివివచ్చెను. నన్ను చూచి వెంటనే వెళ్ళి, రావణునకు నివేదించిరి.

"రాజా! దురాత్ముడగు వానరుడొకడు మీ బలపరాక్రమముల నెఱుంగక మీ వనదుర్గమును పాడుచేసినాడు. మీ క్కప్రియమొనర్చిన ఆ దుర్బుద్ధిని చంపుట కాజ్ఞాపింపుడు" అని.

దానిని విని వెంటనే రావణుడు ఎనుబది వేలమంది కింకరులను నాపై యుద్ధమునకు పంపెను. పరిఘతో వారిని అంతమొందించితిని. చనిపోవగా మిగిలినవారు రావణుని వద్దకేగి సైన్యము చనిపోయినదని చెప్పిరి.

ఇంతలో నేను అచటనున్న ప్రాసాదమును కూల్చి స్తంభముతో అచ్చట కాపలా ఉన్న నూఱుగురు రాక్షసులను చంపితిని.

తరువాత రావణుడు ప్రహస్తుని కుమారుడగు జంబుమాలిని భయంకరులగు రాక్షసులతో నాపై పంపెను. వారిని కూడ నేను పరిఘతో చంపితిని.

అపుడు రావణుడు మహా బలులగు మంత్రి పుత్రులను పంపెను. వారిని కూడ ఆ పరిఘతోనే యమలోకమునకు పంపితిని.

మంత్రిపుత్రులు చనిపోయినారని తెలిసి ఐదుగురు సేనానాయకులను పంపెను. సైన్యముతో కూడ ఆ సేనానాయకులను చంపితిని.

అపుడనేక రాక్షసులతో అక్షకుమారుని పంపెను. మండోదరి పుత్రుడగు ఆతడు రణపండితుడు. ఆత డాకాశముపైకి ఎగురగా పాదములు పట్టుకొని లాగి పిండి చేసితిని.

ఇట్లు అక్షకుమారుడు కూడ చనిపోగా ఇంద్రజిత్తు అను పేరు గల రెండవకుమారుని పంపెను. వారి సైన్యమునంతను జయించితిని.

అపుడు ఇంద్రజిత్తు నాతో యుద్ధముచేసి నన్నోర్వలేక బ్రహ్మాస్త్రముచే నన్ను బంధించెను. ఆతని వెంట నున్న రాక్షసులు త్రాళ్ళతో గూడ కట్టిరి. రావణుని సమీపమునకు తీసికొని వెళ్ళిరి. రావణుడు నన్ను జూచి ప్రశ్నించెను. అపుడు నేను లంకకు వచ్చుట, రాక్షసులను చంపుట అంతయు సీతమ్మ కొఱ కని చెప్పితిని. "ఆమెను చూచుటకొఱకే నీ భవనమునకు వచ్చితిని. నేను వాయుపుత్రుడను, వానరుడను, హనుమను. రామదూతను. సుగ్రీవసచివుడను.

రాముని దూతగా నీ వద్దకు వచ్చితిని. మహాతేజశ్శాలియగు సుగ్రీవుడు నిన్ను కుశల మడిగెను. ధర్మార్థసహితమగు హితమును నీకు చెప్పమనెను.

ఋశ్యమూకపర్వతమం దున్న సుగ్రీవునితో రాముడు మైత్రిని చేసికొనెను. రాముని భార్య ఒక రాక్షసునిచే అపహరింపబడినదని తెలిసి మా సుగ్రీవుడు ఆతనికి సాయము చేయుటకు ప్రతిజ్ఞ చేసెను. వాలిని చంపుటకు రాముడు సుగ్రీవునకు ప్రతిజ్ఞ చేసెను. సుగ్రీవునితో రాముడగ్ని సాక్షికముగ స్నేహము చేసికొనెను.

ఒక్క బాణముతో వాలిని చంపి ఆ సుగ్రీవుని వానరులకు రాజుగా చేసెను. తన కుపకారము నొనర్చిన రామచంద్రునకు సాయము చేయవలెనని ఆ సుగ్రీవుడు నన్ను నీ వద్దకు పంపెను.

సీతను వేగముగా తెచ్చి రామున కొసంగుము. వానరవీరులు నీ సైన్యమును నాశనము చేయక మునుపే సీత నొసంగుము.

వానరుల ప్రభావము ప్రసిద్ధము. వారు అవసరమైనచో దేవతలవద్దకు కూడ వెళ్ళగలరు" అని సుగ్రీవుని సందేశమును రావణునితో నేను చెప్పితిని.

ఆతడు కోపముతో దహించుచున్నట్లు నన్ను చూచెను. చూచి నన్ను చంపుటకు ఆజ్ఞ నొసంగెను.

అపుడాతని సోదరుడు మహామతి యగు విభీషణుడు నన్ను చంపవలదని రావణుని యాచించెను.

"రాక్షసశ్రేష్ఠ! దూతను చంపుటకు నిశ్చయించుట తగదు. అది రాజశాస్త్రవిరుద్ధము. రాజశాస్త్రములలో దూత వధ ఎచ్చటను పేర్కొనబడలేదు. దూత యథార్థమును తెలిపికొనుటకు వచ్చును గదా! అట్టి దూత ఎంత తప్పుచేసినను విరూపునిగా చేయుటయే గాని చంపుట శాస్త్రములలో విధింపబడి యుండలేదు."

విభీషణు డట్లు చెప్పగా రావణుడు "ఈతని తోక కాల్చి వేయుడు" అని రాక్షసులతో పల్కెను.

అపుడు వారు నా తోకకు నార, పాత నూలు బట్టలు కట్టిరి. చండపరాక్రములగు రాక్షసులు నాతోకను కాల్చివేయుచు కఱ్ఱలతోను, పిడికిళ్ళతోను నన్ను కొట్టిరి. త్రాళ్ళతో కట్టి చుట్టును రాక్షసులు నన్ను పట్టుకొని వీథులలో త్రిప్పుచు, రాజమార్గములో చాటుచు నగర ద్వారమువద్దకు తెచ్చిరి.

అప్పుడు నేను నా రూపమును సంకోచింపచేసి ఆ కట్లను జార్చుకొని మరల పెరిగి ఇనుప పరిఘను ఒక దానిని పట్టుకొని ఆ రాక్షసులను చంపితిని.

తరువాత వేగముతో నగర ద్వారము పైకి ఎగిరితిని.

మండుచున్న నా తోకతో, మిద్దెలతో గోపురములతో కూడిన లంక నంతను కాల్చితిని. లంక యంతయు కాల్చివేయబడినది.

ఇక సీతమ్మ కూడ దహింపబడి యుండుననియు, రాముని మహాకార్యమును వ్యర్థము చేసితిననియు శోకముతో చింతించుచుంటిని.

అంతలో "జానకి దహింపబడలేదు" అని చారణులు పల్కిన మాటలు విన్పడెను.

ఆశ్చర్యములగు ఆ మాటలను విని శుభశకునములచే కూడ జాన. దహింపబడి యుండదని నిశ్చయము చేసికొంటిని. తోకను నిప్పు మండుచున్నను అగ్ని నన్ను దహింపలేదు. నా హృదయమానందముతో నిండియున్నది. చల్లని గాలులు వీచెను.

చారణు లిట్లు పల్కిరి కావున సీతమ్మ సుఖముగ ఉండియుండునని సంతోషించినవాడనై మరల సీతమ్మను చూచి ఆమెవద్ద సెలవు తీసికొని బయల్దేరితిని.

తరువాత అరిష్టమను పర్వతము నెక్కి మిమ్ములను చూడవలెనను కోరికతో సముద్రమును దాటుటకు ఆరంభించితిని.

తరువాత చంద్ర సూర్యసిద్ధ గంధర్వ సేవితమగు వాయు మార్గమున ఎగిరి వచ్చి ఇచట మిమ్ములను చూడగల్గితిని.

రాముని ప్రభావము చేతను, మీ తేజస్సు చేతను సుగ్రీవు డాజ్ఞాపించిన పనిని నెరవేర్చితిని.

ఈవిధముగ నేను చేసిన దంతయు మీకు నివేదించితిని.

ఇంకను చేయనిపని ఏమున్నదో దానిని మీరు పూర్తిచేయుడు" అని హనుమ చెప్పి విరమించెను.

**59** హనుమ మరల ఇట్లు చెప్పుటకు ఉపక్రమించెను.

"రాఘవుని ప్రయత్నము సఫలమైనది. సుగ్రీవుని ఆందోళన తగ్గినది. సీతమ్మ పాతివ్రత్యమును చూచి నా మనసు ఆమెకు విధేయమైనది.

రావణుడు తపసుచే గొప్పవాడు. ఆతడు తపసుచే లోకములను ధరింపగలడు. లోకములను దహింపగలడు. అట్టి తపస్సుండుటచేతనే సీతమ్మ శరీరమును స్పృశించినను వాని శరీరము నశింప లేదు.

"న తదగ్నిశిఖా కుర్యాత్ సంస్పృష్టా పాణినా సతీ
జనక స్యాత్మజా కుర్యాత్ యత్క్రోధకలుషీకృతా."

(సుంద. 59-4)

పతివ్రత యగు సీతమ్మను చేతితో స్పృశించిన రావణుడు బ్రతికి యుండుట ఆశ్చర్యమే! చేతితో అగ్నిహోత్రజ్వాలను స్పృశించినను కాలక యుండవచ్చునుగాని సీతమ్మను స్పృశించి దహింపబడకుండుట అసాధ్యము.

సీతమ్మ కోపముతో కాలుష్యము నందినపుడు అగ్నిహోత్రముకంటె తీవ్రముగ దహించును. కాని ఆమె క్రోధమును తెచ్చుకొనక పోవుటచే రావణుడు బ్రతికియున్నాడు."

జాంబవంతుడు మొదలగు వానరు లందఱతో ఈ విధముగ జరిగిన పని నంతను నివేదించి "సీతమ్మతో కలసి వెళ్ళి మనము రామలక్ష్మణుల కంటపడుట న్యాయము.

నేనొక్కనినైనను రాక్షసులతో లంకాపట్టణమును, రావణుని కూడ చంపగలను. ఇంక బలవంతులగు, శూరులగు మీ యందరతో కలిసినచో చెప్పెడిదేమి?

నేను సైన్యముతో, పుత్రులతో, సహోదరులతో రావణుని చంపగలను. ఇంద్రజిత్తువద్ద బ్రహ్మాస్త్రము, ఐంద్రాస్త్రము, రౌద్రాస్త్రము, వాయవ్యాస్త్రము, వారుణాస్త్రము మున్నగునవి ఉన్నను వానిని నేను పాడుచేయగలను. రాక్షసులను చంపగలను. మీ రనుమతించినచో నా పరాక్రమమే రావణుని చంపుటకు చాలును. నేను విసరిన రాళ్ళవాన దేవతలను గూడ యుద్ధములో చంపును. ఇంక రాక్షసుల విషయము చెప్పవలదేమి?

సముద్రము చెలియలికట్టను అతిక్రమించిన అతిక్రమింపవచ్చును. మందరము చలింపవచ్చును. కాని శత్రుసైన్యము యుద్ధములో జాంబవంతుని కదల్పలేదు.

సర్వరాక్షససంఘములను చంపుటకు వాలిపుత్రుడగు అంగదుడు ఒక్కడే చాలును. పనసుడు, నీలుడు అనువారలు తమ వేగముచే మందరపర్వతమును కూడ శిథిలము చేయగలరు. యుద్ధములో రాక్షసులను శిథిలము

చేయగలవారని చెప్పవలెనా?

దేవాసురులలో గాని, యక్షగంధర్వులలో గాని, ఉరగపక్షులలో గాని మైందునకు, ద్వివిదునకు ఎదురు నిలిచి యుద్ధము చేయువారు లేరు కదా! మైందద్వివిదులు అశ్వినీ దేవతల పుత్రులు. బ్రహ్మనుండి వరమును పొందిన వారలు. అమృతప్రాశనమును ఒనర్చినవారలు. అశ్వినీ దేవతలయందుండు గౌరవముచే సర్వలోకపితామహుడు వీరికి ఎవ్వరిచేతను మరణము లేకుండ వరమిచ్చెను. అట్టి వరముచే గర్వించినవారలై గొప్ప సైన్యమును మధించి దేవతల యమృతమును వీరు పానమొనర్చిరి. వీరికి కోపము వచ్చినచో గుఱ్ఱములతో, రథములతో, ఏనుగులతో లంక నంతను నాశనము చేయగలరు.

అందరు వానరు లక్కరలేదు. నే నొక్కడనే లంకను పాడుచేసి దహించి భస్మము చేసితిని. రాజ మార్గములందంతట నా పేరును వినిపించి వచ్చితిని.

"జయ త్యతిబలో రామో లక్ష్మణ శ్చ మహాబలః"

(సుంద.59-23)

నేను కోసలరాజగు రాముని దాసుడను. హనుమంతుడ నని చెప్పితిని.

అశోకవనములో పతివ్రత యగు సీత శింశుపావృక్షము క్రిందదీనముగ కూర్చుండి యున్నది.

రాక్షసస్త్రీలచే చుట్టుముట్టబడి శోకసంతాపములచే కృశించినదియై సీతమ్మ మేఘ పంక్తిచే చుట్టుముట్టబడిన చంద్రరేఖవలె కాంతిహీనయై యున్నది.

బలదర్పితు డగు రావణుని ఆమె తలంచుటలేదు. పతివ్రతయై, అనురక్తయై, సీతమ్మ రామునే సంతతము స్మరించుచున్నది.

ఒకే వస్త్రము ధరించి శోకసంతాప దీనాంగియై రాక్షసస్త్రీలమధ్య వారిచే బెదరింపబడుచున్న సీతమ్మను చూచితిని. ఏకవేణిని ధరించి, భర్తనే సంతతము చింతించుచు, నేలను పరుండి, రావణుని పొందవలె నను కోరిక లేనిదై చనిపోవలెనని నిశ్చయముతో నున్న సీతమ్మను చూచి, ఎట్లో నమ్మకము కల్గించి, మాటాడి విషయమంతయు చెప్పితిని.

రామ సుగ్రీవుల మైత్రిని గూర్చి విని ఆమె ప్రీతినందినది. సీతమ్మ చారిత్రము మార్పులేనిది. ఆమెకు భర్తయందు గల భక్తి ఉత్తమమైనది. ఆమె పాతివ్రత్యమే మహాపరాధము చేసిన రావణుని చంపగలదు.

వాడు మహాత్ముడై వరములను పొందిన వాడగుటచే చనిపోలేదు. ఆమె

పాతివ్రత్యమే రావణుని చంపును. రాముడు ఆ రావణవధకు నిమిత్తమాత్రుడే అగును.

ఆమె సహజముగ కృశాంగి. వియోగముచే మరింత కృశించి పాడ్యమి నాడు చదివిన విద్యవలె నున్నది.

ఈ విధముగ సీత శోక పరాయణయై యున్నది. ఈ విషయమున చేయదగిన దంతయు చేయబడుగాక!"

**60** ఇట్లు హనుమ చెప్పిన మాటలు విని, అంగదుడు ఇట్లు పలికెను. "సీతమ్మను చూచి ఆమెను తీసికొని వెళ్ళకుండ మహాత్ముడగు రామచంద్రుని సన్నిధికి వెళ్ళుట యుక్తముగ తోచుట లేదు.

ప్రసిద్ధమగు పరాక్రమము గల మీరు "సీతమ్మను చూచితిమి. కాని తీసికొనిరాలేదు." అని చెప్పుట అయుక్తముగ తోచుచున్నది. లంఘనమున కాని, పరాక్రమమున కాని మనతో సమానులు దేవదానవులలో ఎవ్వరును లేరు.

మన హనుమంతుడు రాక్షసవీరులలో కొందఱను చంపినాడు గదా! మనము జానకిని తీసికొనివెళ్ళుటయే చేయదగిన పని" అని అంగదుడు పలుకగా విని,

జాంబవంతుడు ఆతని సంకల్పమునకు చాల సంతసించినవాడై అర్థవంతమగు మాటలను ఇట్లు చెప్పెను.

"రాజపుత్రా! మీరు తలంచినటుల సీతమ్మను తీసికొని వెళ్లుట అయుక్తము కాదు. మీరు చెప్పినది చాల బాగున్నది, మనకు అట్టి సామర్థ్యమును ఉన్నది. కాని రాముని ఆలోచన ననుసరించి మనము కార్యమును చేయవలెనే కాని తొందరపడరాదు. అందుచే వెళ్ళి వారి అభిప్రాయము నెఱింగి చేయుదము" అనెను.

**61** జాంబవంతుడు పల్కిన మాటలను అంగదుడు మున్నగు వానరులు హనుమంతుడు విని తగునని అంగీకరించిరి.

తరువాత, అంగదుడు మున్నగు వీరులు హనుమంతుడు ముందుకు సాగగా మహేంద్ర పర్వతమును విడిచి కిష్కింధవైపు ఎగిరిరి.

మేరు, మందర సమానులగు మహాకాయులు మహాబలులు నగు ఆ వానరులు మదించిన ఏనుగలువలె ఆకాశమును ఆవరించి ఎగిరిరి. అందరు వానరులును, సర్వభూతములచే గౌరవింపబడు మహాబలుడగు హనుమను రెప్పవేయకుండ చూచుచు ముందునకు సాగిరి.

రాఘవుని కార్యము నెరవేరుట నిశ్చయమని మనసులలో కార్యసిద్ధికి పొంగిపోవుచు ముందునకు ఏగుచుండిరి.

అందరును రామునకు ప్రియమైన వార్తను చెప్పవలెనని ఉబలాట పడు చుండిరి. యుద్ధమునకు సమాయత్తమగు చుండిరి. రామునకు అపకారము చేసిన రావణునికి ప్రతీకారము చేయుటలో అందరు పట్టుదలతో నుండిరి. ఆ వానరులందరును, ఆకాశముపై ఎగురుచు, నందనవనమువలె నున్న చెట్లతో, లతలతో నిండియున్న వనమును చేరిరి.

అది సుగ్రీవుని మధువనము. జాగరూకతతో కాపాడబడుచున్నది. సర్వభూతములకు కూడ దానిని పాడుచేయుట శక్యముకాదు. అది అతి మనోహరము. సుగ్రీవుని మేనమామ యగు దధిముఖుడను వానరుడు మహా పరాక్రమశాలి, ఆ వనమును కాపాడుచుండెను. ఆ వానరులు ఆ వనమును చేరి పరమోత్సాహము నొందిరి. ఆ వానరులందరు ఆ మధువనమున తేనెలు త్రాగుటకు అంగదుని అనుజ్ఞనడిగిరి.

అంగదుడు జాంబవంతుడు మున్నగు వానరు లందరకు ఇచ్ఛవచ్చినట్లు తేనెలు త్రాగుటకు అనుమతి నిచ్చెను. అంత వానరులందరును సంతోషముతో నృత్యము చేయసాగిరి.

"గాయంతి కేచిత్ ప్రణమంతి కేచిత్
నృత్యంతి కేచిత్ ప్రహసంతి కేచిత్,
పతంతి కేచిత్ విచరంతి కేచిత్
ప్లవంతి కేచిత్ ప్రలపంతి కేచిత్" (సుంద.61.14)

ఆనందముతో కొందరు పాటలు పాడుచున్నారు. కొందరు నృత్యము చేయుచున్నారు. కొంతమంది పక పక నవ్వుచున్నారు. కొంతమంది నేలను పడుచున్నారు. కొంతమంది తిరుగుచున్నారు. కొంతమంది గెంతుచున్నారు. కొంతమంది ఏవో మాటాడుచున్నారు. ఒకరితో ఒకరు ఆడుచున్నారు. కొందరు ఒక చెట్టుపై నుండి వేరొక చెట్టుపైకి దూకుచున్నారు. కొందరు

చెట్టు చివర నుండి క్రిందకు పడుచున్నారు. కొందరు నేలపై నుండి చెట్ల చివరకు ఎగురుచున్నారు.

ఒకడు పాడుచుండగా వేరొకడు నవ్వుచు వానిపైకి వచ్చును. వేరొకడు ఏడ్చుచు ఆ నవ్వుచున్న వానిపైకి వచ్చును.

ఏడ్చుచున్నవానిని వేరొకడు త్రోసికొని పోవుచుండెను. త్రోయుచున్న వానిని వేరొకడు గర్జించుచు వెంబడించును.

ఈ విధముగ మధుపానముచే మత్తెక్కిన మనసులు కలిగిన ఆ వానర సైన్య మంతయు చిందరవందరయై యుండెను.

వారిలో ఒక్కడు కూడ మత్తెక్కనివాడు కాని మద్యపానముచే తృప్తి నొందినవాడు కాని లేడు.

వానరులు పూవులతో ఆకులతో నిండిన చెట్లనన్నిటిని పాడుచేసి తేనె త్రాగుచుండుట చూచి దధివక్త్రుడను వానరుడు కోపముతో ఆ వానరులను వారించెను. వనపాలకుడనగు దధివక్త్రుని వానరులు ఎదిరించి భయపెట్టిరి.

దానితో కోపమువచ్చి ఆ వనపాలుడు వారిని తీవ్రముగ దండింపవలెనని తలంచెను. కొందఱను పరుషములగు వాక్యములతో నిందించెను. కొందఱను చేతితో చఱచెను. కొందఱతో కలహించెను. కొందఱను మంచిమాటలతో బ్రతిమాలెను. ఆ వానరులు మధుపానముచే మత్తెక్కి భయములేనివారై తమ తప్పును ఎఱుంగక అందరును కలసి ఆతనిని లాగుచుండిరి. గోళ్ళతో గీరుచు పండ్లతో కొఱుకుచు చేతులతో పాదములతో కుమ్ముచు మదమువలన ఆ వన పాలకుని వానరులు హింసించిరి. వనమునంతను భోగ్యమయిన వస్తువులు లేకుండ పాడుచేసిరి.

**62** వానరోత్తముడగు హనుమ మిగిలిన వానరులతో "మీరు హాయిగా మధువును సేవింపుడు. మీకు అడ్డువచ్చినవారిని నేను వారింతును" అని చెప్పగా ఆ మాటను విని యువరాజగు అంగదుడు ప్రసన్నుడై "మీరంద-రును మధువును సేవింపుడు. కార్యమును సాధించి వచ్చిన హనుమ మాట చేయరానిదైనను అంగీకరింపవలసినదే! ఇటువంటి దానికి ఆటంకమేమి? తప్పక త్రాగుడు" అనెను.

అప్పుడు వానరులందరును బాగు బాగు అని సంతోషముతో అంగదుని అభినందించి ప్రవాహమువలె మధువనమున మరల ప్రవేశించిరి.

అంగదుడు ఆజ్ఞ ఇచ్చెను. సీతమ్మను చూచి ఆ వృత్తాంతమును విని వచ్చితిమి. ఇంక అడ్డేమి? అని ఆ వనపాలకులను త్రోసిపుచ్చి మధువును త్రాగుచుండిరి. తీయని పండ్లను తినుచుండిరి.

వారించుటకు వచ్చిన వనపాలకులను వందలకొలది మీద పడి కొట్టు చుండిరి. పెద్ద తేనెపట్లను చేతులతో పట్టి త్రాగుచుండిరి. మరికొన్నిటిని చిదిమి వేయుచుండిరి. కొందరు తేనెలు త్రాగి ఆ పట్టులను క్రింద పారవే యుచుండిరి. మరికొందరు మైనముతో ఒకరి నొకరు కొట్టుకొనుచుండిరి.

మరికొందరు చెట్ల మొదళ్ళయందు కొమ్మకు చేరబడియుండిరి. మరి కొందరు మత్తెక్కి బడలి ఆకులు పరచుకొని పరుండిరి. ఒకరి నొకరి కొందరు ఎత్తి పడవేసికొనుచుండిరి. కొందరు తూలుచుండిరి. కొందరు గర్జించుచుండిరి. కొందరు పక్షులవలె కూయుచుండిరి. కొందరు మత్తెక్కి నేలపై పరుండి నిద్రించుచుండిరి. కొందరు నవ్వుచుండిరి. కొందరు ఏమేమొ మాటాడుచుండిరి.

దధిముఖుని సేవకులు వారిని వారించుటకు వచ్చి పారిచే దెబ్బలు తిని దూరముగ పారిపోయిరి. మోకాళ్ళపై నీడ్చి ఆ వనపాలకులకు వానరులు పృష్ఠభాగమును చూపుచుండిరి.

అంత ఆ పాలకులు, దధిముఖుని వద్దకు వచ్చి "హనుమంతుడు ధైర్యమొసంగగా వానరులు మధువనమును పాడుచేసిరి. మమ్ము నేలనీడ్చి దేవమార్గమును చూపిరి" అని చెప్పిరి.

అంత దధిముఖునకు కోపము వచ్చి రండు. మన మందరము వెళ్ళి వారిని వారింతము అనెను.

దధిముఖుడు పెద్ద చెట్టును పట్టుకొని వెంట వనపాలకులురాగా ఆ వానరులపైకి వచ్చెను. వనపాలురు ప్రభువు నాజ్ఞచే చెట్లను శిలలను పట్టుకొని ఆ వానరులపైకి వెళ్ళిరి.

చెట్లపై నేలపై నున్న వానరులనందరను ఆ పాలకులు ఆక్రమించిరి. చెట్టుపట్టుకొని కోపముతో వచ్చుచున్న దధిముఖుని చూచి హనుమంతుడు మొదలగు వానరులందరు వేగముతో పరుగెత్తిరి.

చెట్టుపట్టుకొని పైబడవచ్చుచున్న మహాబలుడగు దధిముఖుని అంగదుడు రెండు చేతులతో కొట్టెను. మదాంధుడై తన తండ్రి మేనమామ పూజ్యుడు

అని అంగదుడు ఎఱుంగక పోయెను. నేలను పడవేసి గట్టిగా కుమ్మెను. దానితో చేతులు, తొడలు విరిగి రక్తము కక్కి క్షణకాలము తెలివితప్పి పడెను. కొద్దిసేపటికి తేరుకొని వానరులను మరల వారించెను.

చివరకు ఏమియు చేయలేక ఆ వానరులనుండి తప్పించుకొని ఏకాంతముగ తన సేవకులను పిలచి ఇట్లు చెప్పెను.

వీరి నిటులనే ఉండనిండు. మన ప్రభువగు సుగ్రీవునివద్దకు వెళ్లి అంగదుడు చేసిన తప్పునంతను వినిపింతును. సుగ్రీవుడు కోపముతో తప్పక వానరులను చూచి చంపించును. ఈ మధువనమును సుగ్రీవుని తండ్రి తాతలనుండి వచ్చుచున్నది. వారికి చాల ఇష్టమైనది. ఆ వానరులందరను చంపించును. రాజుగారి ఆజ్ఞను ధిక్కరించిన వీరందరును చంపదగినవారే! మన రోషము ఫలించును.

తన సేవకులతో ఇట్లు చెప్పి కొందరు వనపాలకులతో కూడి దధిముఖుడు ఆకాశమున కెగసెను.

ఒక నిముషములో ఆతడు సుగ్రీవుడున్నచోటునకు చేరెను.

రామ, లక్ష్మణ, సుగ్రీవులున్న ప్రదేశమున ఆకాశమునుండి నేలపై సముగ పడెను. దధిముఖుడు దీనవదనుడై శిరస్సుపై దోసిలి ఒగ్గి సుగ్రీవుని పాదములకు తన శిరసును మోపి పడియుండెను.

**63** సుగ్రీవుడు అట్లు నేలపడిన దధిముఖుని చూచి ఏమి జరిగెనోయని భయపడుచు, "లెమ్ము, లెమ్ము అట్లేల పాదములపై బడితివి. భయపడకుము. జరిగినదంతయు చెప్పుము" అనెను.

అపుడు సుగ్రీవునిచే ధైర్యమువొంది దధిముఖుడు లేచి ఇట్లు చెప్పెను.

రాజా! మీ తండ్రి ఋక్షరజస్సు కాని, మీ అన్నగారు వాలికాని, మీరు కాని ఎవ్వరిని మధువనమున ప్రవేశించుటకు ఇంతవరకు అనుమతింపలేదు. అట్టి వనమును నేడు వానరులు భక్షించి పాడుచేసినారు. మా వనపాలురు అడ్డగించినను వారిని లెక్కచేయక మధువులను త్రాగిరి. త్రాగగా మిగిలిన తేనెపట్టులను నేలను పడవైచి పాడుచేసిరి. వనపాలకులు వారించుచుండ వారికి కనుబొమలు చూపుచున్నారు. వారించుచున్న వనపాలురను చేతులతో కొట్టి మోకాళ్ళతో పొడిచి నేలపై ఈడ్చి బాధించిరి. ప్రభువగు మీరుండగా భయపడక మధువనము నంతయు పాడుచేసిరి."

ఇట్లు విన్నవించుచుండగా లక్ష్మణుడు చూచి సుగ్రీవుని ఇట్లు అడిగెను

వనపాలకుడగు వానరుడు దుఃఖపడుచు ఏదోవిషయమును చెప్పుచు న్నాడు. ఆ విషయమేమి? అని అడిగెను.

లక్ష్మణునకు వానరభాష రాదు. దధిముఖుడు ఏడ్చుచు మాటలాడుచుం డుటచే సీతమ్మ కేమైన అనర్థము కలిగెనేమోయని లక్ష్మణుడు భయపడెను.

ఆ విషయము సుగ్రీవుడు ఎఱింగి లక్ష్మణునితో ఇట్లు చెప్పెను.

దక్షిణదిక్కున వెదకుటకు వెళ్ళి తిరిగి వచ్చిన వానరులు మధువనమును పాడుచేసిరట. దానియందలి మధువును త్రాగిరట. వానరులు మధువనమున ప్రవేశించిరి యనిన సీతమ్మను చూచిరని మనమనుకొనవచ్చును.

"దృష్టా దేవీ న సందేహో న చాన్యేన హనూమతా
న హ్యన్య స్సాధనే హేతుః కర్మణోఽస్య హనూమతః
కార్యసిద్ధి ర్మతి శ్చైవ తస్మిన్ వానరపుంగవే
వ్యవసాయ శ్చ వీర్యం చ శ్రుతం చాపి ప్రతిష్ఠితం.
(సుంద. 63.17,18)

"లక్ష్మణా! సీతమ్మను చూచినారు. ఎవరో కాదు హనుమంతుడే చూచినాడు. హనుమంతుడు తప్ప వేరొకడు ఈ కార్యమును సాధింపలేడు. కార్యసిద్ధి, బుద్ధి, పట్టుదల, పరాక్రమము, పాండిత్యము కూడ హనుమంతుని యందే కలవు. జాంబవంతుడు, మహాబలుడగు అంగదుడు నాయకులుగా ఉండి హనుమంతుడు ప్రధానుడై యున్నప్పుడు కార్యము వేరొకరీతి జరుగదు.

అంగదుడు మొదలగు వీరులు మధువనమును పాడుచేసి వారించినవా రిని కొట్టిరట.

ఈ విషయము చెప్పుటకు దధిముఖుడను వానరుడు వచ్చినాడు. సీత మ్మను వానరులు చూచినారు. అందుచేతనే మధువును త్రాగుచున్నారు. సీతమ్మను చూడకుండ మా మధువనమును వారు పాడుచేయలేరు."

అని సుగ్రీవుడు చెప్పగా రామలక్ష్మణులు విని చెవికి హాయినిగొల్పు ఆ మాటలతో ఆనందము నొందిరి.

అప్పుడు సుగ్రీవుడు దధిముఖునితో "కార్యము నెరవేర్చుకొని వచ్చిన వానరులు వనమును పాడుచేసిరి. కావున క్షమింపదగును. కావున సంతోషిం చితిని. వెంటనే హనుమంతుడు మొదలగు వానరులను రామలక్ష్మణులతో

కలసి చూడగోరుచున్నాను. సీతను చూచుటకు వారుచేసిన ప్రయత్నమును వినవలెనని గోరుచున్నాను."

అని దధిముఖునితో సుగ్రీవుడు చెప్పిన మాటలు విని రామ లక్ష్మణులు సంతోషముతో విప్పారిన కన్నులు గలవారై యుండిరి.

సిద్ధార్థులైన వారిని జూచివానరరాజగు సుగ్రీవుడు ఆనందించి కార్యసిద్ధి చేతికి అందినదన్నట్లు సంతసించెను.

**64** సుగ్రీవుడు చెప్పిన మాటలు విని దధిముఖుడు సంతోషించి రామలక్ష్మణ సుగ్రీవులకు నమస్కరించి వానరులతో కూడ వచ్చినట్లే వెను కకేగెను. మధువనమును ప్రవేశించెను. నీరు త్రాగి మత్తు తగ్గియున్న వానరులను చూచెను. అంగదునివద్దకు చేతులు జోడించుకొని వెళ్ళి సుకు మారముగ ఇట్లు విన్నవించెను.

సౌమ్య! మా వనపాలకులు తెలియక మధువును త్రాగుచున్న మిమ్ము లను వారించిరి. మీరు యువరాజు. ఈ వనమునకు మీరే ప్రభువులు. మూర్ఖతచే తప్పుచేసితిని. క్షమింపుడు.

మీరందరును ఈ వనమునకు వచ్చినారని, మీపినతండ్రి సుగ్రీవునితో చెప్పితిని. ఆతడు రోషమును చెందక సంతోషించినాడు. సంతోషించి శీఘ్ర ముగ వారి నందరను పంపుము అనెను.

దధిముఖుని మాటలనువిని అంగదుడు ఆ వానరులతో ఇట్లనెను.

"ఈవృత్తాంతము రామునికి తెలిసియుండును. అందుచే మనము ఆల స్యము చేయుట యుక్తముకాదు. అందరును మధుపానము చేసి విశ్రాంతిని తీసుకొన్నారు. కావున, ఇకను సుగ్రీవుని దగ్గఱకు వెళ్లుటయే మిగిలియున్నది. మీరందరు ఎట్లు చేయుదమనిన అట్లే చేయుదును. మీ రెట్లు చెప్పిన అట్లు నడచుకొనగల వాడను యువరాజు నైనను మిమ్ములను ఆజ్ఞాపించుటకు నేను సమర్థుడనుకాను. కార్యమును నెరవేర్చిన మిమ్ములను నేను నియమించుట తగదు, మీ చిత్తము."

ఇట్లు అంగదుడు పలుకగ వానరులందరు సంతోషించి ఇట్లు పలికిరి. "రాజా! ప్రభువువై యుండియు ఇట్లు పలుకుట బాలకత్వము. ఐశ్వర్యమద ముచే మదించి ప్రతి వ్యక్తియు, తానే సర్వము అని తలంచుచుండును ఇట్టి వాక్యమును పలుకుట నీకే తగును కాని వేరొకడు ఎవడు ఇట్లు పలుకగలడు?

ఇట్టి నీ వినయము భవిష్యత్తులో నీకు శుభము కలుగునని సూచించుచున్నది. మేము గూడ అచటకు వెళ్లుటకై వేచియున్నాము. నీవు చెప్పనిదే వానరులు అడుగు తీసి అడుగు పెట్టజాలరు. ఇది సత్యము. "

ఇట్లు వానరులు పలుకగా అంగదుడు సరే వెళ్లుదము అనెను. బలవంతులగు వానరులు ఆకాశమున కెగురగ వారి వెంట మిగిలిన వానరులందరు యంత్రముతో పైకి చిమ్మిన పర్వతముల వలె ఆకాశమున అవకాశము లేకుండ వ్యాపించిరి.

వాయువుచే కదల్పబడిన మేఘముల వలె గర్జించుచు వారు వెళ్ళు చుండిరి. అంగదుడు ఇంకను వచ్చుట ఆలస్యమగు చుండగా శోకముచే బాధపడుచున్న రామచంద్రునితో సుగ్రీవుడిట్లుపల్కెను.

రామా! ఓర్పుకొనుము. మంగళ మగుగాక. మన వానరులు సీతమ్మను చూచినారు. సంశయములేదు. గడువుమించిన తరువాత కార్యము నెరవేర్పనిదే ఇచటకు రాలేరు. కార్యము జరుగకున్నచో, యువరాజగు అంగదుడు నావద్దకు రాడు. కార్యమును నెరవేర్పకుండ మధువనమును వానరులుపాడు చేసినచో అంగదుడు దీనుడై కలతచెందిన మనసుకలవాడై యుండును. సీతమ్మను చూచిన ఆనందము కలవారై మా పితృ పితామహులచే రక్షింపబడిన, మధువనమును పాడుచేసిరి. కాని ఆ ఆనందము లేనిచో అట్లు చేయరు.

రామా! కౌసల్య అదృష్టవంతు డగు కుమారుని కనినది. సందియము లేదు. వానరులు సీతమ్మను చూచిరి. ఎవరో కాదు. హనుమయే సీతమ్మను చూచెను. సందేహము లేదు. వేరొకడు ఎవడు ఈ కార్యమును సాధింపలేడు.

సిద్ధి, బుద్ధి,పట్టుదల, పరాక్రమము, సూర్యుని యందు తేజస్సువలె హనుమ యందే కలవు. జాంబవంతుడు మంత్రియై అంగదుడు సేనానాయకుడై, హనుమంతుడు రక్షకుడై దక్షిణదిక్కునకు నడచిన మన సైన్యము కార్యము సాధింపకుండ వెనుకకు రాదు. చింతింపకుము."

ఇట్లు సుగ్రీవుడు మాటాడు చుండగనే హనుమంతుడు సాధించిన కార్యముచే గర్వించి గర్జించుచు వచ్చుచున్న వానరుల కిల కిల శబ్దము సిద్ధి నెరింగించుచున్నట్లు వినబడెను.

వానరులు ఆధ్వనిని విని సుగ్రీవుడు తోక పొడవుగ చేసికొని సంతోషముతో నుండెను. వానరులందరు రామ దర్శనమున ఉత్సాహముకల వారలై అంగదుని హనుమంతుని ముందుంచుకొని వచ్చి సుగ్రీవునకు రామునకు సమీ

సమున భూమికి దిగిరి.

మహాబాహుడగు హనుమ శిరసు వంచి రామునకు నమస్కరించి "నియమశీలయై సీతమ్మ సుఖముగా నున్నది" అని రామునకు నివేదించెను.

తత్త్వదీపిక :-

ఇచట హనుమ చెప్పుటలో పాతివ్రత్యము చెడకుండ మరణింపకుండ సీతమ్మ యున్నది అని చెప్పెను.

"నియతాం అక్షతాం" (సుంద. 64-37)

అను రెండు విశేషములను ప్రయోగించెను. పాతివ్రత్యమున్నను చనిపోయినచో ప్రయోజనములేదు. బ్రతికియున్నను పాతివ్రత్యము చెడినచో వ్యర్థము. అందుకై హనుమ సంగ్రహముగ పాతివ్రత్యముతో బ్రతికియున్నది అని చెప్పెను.

సుగ్రీవుడు హనుమయే కార్యమును సాధించెనని ప్రీతికలవాడాయెను.

అట్లు ప్రీతినందిన సుగ్రీవుని లక్ష్మణుడు గౌరవముతో చూచెను.

రాముడు ప్రీతితో ఆనందించుచు హనుమంతుని అధికమగు గౌరవముతో చూచెను.

**65** ఆ వానరులు ప్రస్రవణ పర్వతమును చేరి, రామలక్ష్మణులకు నమస్కరించి అంగదుని ముందుంచుకొని, సుగ్రీవునకు నమస్కారమొనర్చిరి.

సీతమ్మ వృత్తాంతమును చెప్పుటకు ఉపక్రమించి రావణాంతః పురములో నిర్బంధింపబడి యుండుట, రాక్షసస్త్రీలచే భయపెట్టబడుచుండుట, సీతమ్మకు రామునియందు గల అనురాగము, రావణుడు ఆమెకు ఒక నెల గడువునిచ్చుట మున్నగు విషయములను వానరులందరు రామున కెరింగించిరి. సీతమ్మ కుశలముగా నున్నదని విని రాముడు ఇట్లు అడిగెను.

"సీతమ్మ ఎచట నున్నది? ఎట్లున్నది! నా విషయమున ఎట్లున్నది చెప్పుడు."

రాముడు అడిగిన ప్రశ్నను విని వానరు లందరు సీతావృత్తాంతమును చెప్పుమని హనుమను ప్రేరేపించిరి. అప్పుడు హనుమ సీతమ్మకు నమస్కరించి ఆమె ఉన్న దిక్కునకు నమస్కరించి ఇట్లు చెప్పుటకు ప్రారంభించెను.

"నేను నూరు యోజనముల సముద్రమును దాటి సీతమ్మను చూచుటకు బయలుదేరితిని. అచట సముద్రమునకు దక్షిణతీరమున దురాత్ముడగు

రావణుని పట్టణము కలదు. అచట రావణాంతఃపురమున, ఓ రామా! నీయందే సర్వమును ఉంచుకొని జీవించుచున్న సీతమ్మను నేను చూచితిని. రాక్షస స్త్రీల మధ్య విరూపలగు రాక్షస స్త్రీలచే బెదరింపబడు చున్న సీతమ్మను చూచితిని. దుఃఖమునుపొందుటకు తగని సీతమ్మ దుఃఖమును పొందియున్నది. రావణాంతఃపురమున నిరోధింపబడినదై రాక్షసస్త్రీలచే రక్షింపబడుచున్నది. ఒంటి జడ దాల్చి దీనురాలై యున్నది. నిన్నే ధ్యానిచుచున్నది. నేలను పరుండుచున్నది. మంచుపడిన తామరవలె రూపము చెడి యున్నది.

రావణుని పొందవలెనను కోరిక లేనిదై మరణించుటకే నిశ్చయించుకొన్నది.

నిన్నే నమ్మియున్న సీతమ్మను నేను చూచితిని. ఇక్ష్వాకువంశమును కీర్తించి ఆమెకు నాపై నమ్మకమును కల్గించుకొంటిని. తరువాత మాటాడి జరిగిన విషయము నంతయు తెలిపితిని.

రామ సుగ్రీవులకు మైత్రి ఏర్పడెనని సీతమ్మ ప్రీతి నొందినది. సీతమ్మ నడువడి, మీయందు ఆమెకుగల భక్తి నిశ్చలముగ నున్నది. తీవ్రమగు తపస్సుతో రామభక్తితో కూడిన సీతమ్మనాచే చూడబడినది.

చిత్రకూటపర్వతమున కాకి విషయమున జరిగిన వృత్తాంతమును మీకు గుర్తుగా చెప్పినది. ఇచట నీవు చూచినదంతయూ రామునితో విన్నవింపు మని నన్ను కోరినది."

సుగ్రీవుడు వినుచుండగా హనుమ ఇంకను ఇట్లు చెప్పెను.

"సీతమ్మ ఈ మణిని పదిలముగ దాచి రామా! మీకు ఇమ్మని ఇచ్చినది. ఆనాడు బొట్టు చెరిగినపుడు మనశ్శిలతో బొట్టుపెట్టిన సంగతి జ్ఞాపకము చేయుమన్నది.

రామా! ఒక నెల మాత్రము జీవింతును, నెల దాటిన జీవింపను అని సీతమ్మ నాతో చెప్పెను. కృశాంగియై ధర్మనిరతయై, ఆడు లేడివలె బెదరుచున్న కన్నులు గలదై రావణాంతఃపురమున బంధింపబడి యున్నది.

రామా! చూచినదానిని చూచినట్లుగా నివేదించితిని. ఇక సముద్రమును దాటుటకు ప్రయత్నమును చేయుము."

రామలక్ష్మణులు ధైర్యముతో ఆనందించునట్లు చూచిన దంతయు చెప్పి రామునకు సీతమ్మ ఇచ్చిన మణిని ఒసంగి సీతమ్మ చెప్పిన మాట లన్నింటిని

వరస తప్పక ఆంజనేయుడు రామచంద్రునకు నివేదించెను.

తత్త్వదీపిక :-

హనుమ తాను వెళ్ళి వచ్చిన వృత్తాంతమును వానరులకు రామచంద్రునకుకూడ తెలియజేసెను. అందుగల భేదమునుగర్తింపవలెను.

వానరులతో చెప్పునపుడు కాకాసురుని వృత్తాంతమును, మనశ్శిలా తిలక వృత్తాంతమును చెప్పలేదు. తన విజయములనన్నింటిని మాత్రము వర్ణించి చెప్పెను.

రామునివద్ద తన విజయములను వర్ణింపక సీతమ్మకు సంబంధించిన వృత్తాంతమును మాత్రమే వివరించెను.

రామునివద్ద తన అహంకారము వ్యక్తము కాకుండ వినయముతో రామునికావశ్యమగు విషయమును మాత్రము చెప్పెను. ఇది హనుమయొక్క వినయమును, ఉచితజ్ఞతను సూచించుచున్నది.

హనుమ ఇందు రెడువనములను ధ్వంసము చేసెను. ఒకటి లంకలో అశోకవనము. రెండవది మధువనము.

సముద్రమునకు దక్షిణతీరమున ఒకటి, ఉత్తరతీరమున ఒకటియున్నవి. ఈ రెండును భోగస్థానములు. ఈ లోకములో అనుభవించెడి భోగములు లంకలో కన్పించును. శరీరమును పొంది వానిని అనుభవించుట పాపఫలము. పైలోకములో స్వర్గాది భోగములననుభవించుట పుణ్యఫలము. ఈ రెంటిని ధ్వంసము చేసిన కాని భగవత్సామీప్యము నొందదు. పాపములు, పుణ్యములు కూడ భగవత్ప్రాప్తికి ప్రతిబంధకములే! వానిని రెడింటిని ధ్వంసము చేసినవాడే భగవత్ప్రాప్తి నొందును.

అశోకవనము, మధువనము ధ్వంసముచేసి హనుమ రాముని చేరుట పుణ్యపాపములను ధ్వంసముచేసికొని భగవంతుని పొందుటను సూచించును.

**66** ఈ విధముగ హనుమంతుడు చెప్పి గుర్తుగా సీతమ్మ యొసంగిన మణిని రామున కీయగా రాముడా మణిని గుండెలపై నుంచుకొని లక్ష్మణునితో కూడ ఏడ్చెను.

ఆ మణిని చూచి నీరు నిండిన కన్నులతో రాముడు సుగ్రీవునితో ఇట్లనెను:

వాత్సల్యము గల ధేనువు దూడపైగల ప్రేమచే ఎట్లు ద్రవించునో అట్లే ఈ మణిని చూచి నా మనసు ద్రవించుచున్నది.

తత్త్వదీపిక :-

ఇది భగవంతునకు జీవునిపై గల వాత్సల్యమును సూచించును.

దూడపై ఎంత మురికి ఉన్నను ప్రేమచే ఆవు ఎట్లు దానికై ద్రవించునో అట్లే భగవంతుడు జీవులలో ఎన్ని దోషములున్నను వానిని పట్టించుకొనక ప్రేమతో బాధపడును.

రాముడు సుగ్రీవునితో ఇంకను ఇట్లు చెప్పచున్నాడు.

"ఈ మణి సముద్రమునుండి లభించినది. యజ్ఞములో సంతుష్టుడైన ఇంద్రుడు ఈ మణిని మా మామగారికి ఇచ్చెను. సీతమ్మ వివాహసమయమున మా మామగారు ఈ మణిని సీతమ్మకు ఇచ్చెను. ఈ మణిని చూడగనే మా తండ్రిగారు, జనకమహారాజు కూడ నా కొక్కసారి గుర్తునకు వచ్చిరి. ఈ మణి నా ప్రియురాలితలపై అందముగ ప్రకాశించెడిది, ఈ మణిని చూడగనే సీతమ్మను పొందినటుల నా కనుపించినది."

అని సుగ్రీవునితో పలికి, హనుమా! సీతమ్మ ఏమనినది? దాహము వేయుచున్నవానికి నీరు ఇచ్చినట్లు ఆమె మాట లనెడినీరుతో నన్ను సేదదీర్చుము.

*"చిరంజీవతి వై దేహీ యది మాసం ధరిష్యతి*
*క్షణం సౌమ్య న జీవేయం వినా తా మసితేక్షణాం"*

(సుంద. 66-10)

సీతమ్మ నెలరోజులు బ్రతుకునా? అయినచో ఆమె చాల కాలము బ్రతుకునన్నమాట. అసితేక్షణ యగు ఆ సీతను చూడక క్షణకాలము నేను జీవింపలేను.

తత్త్వదీపిక :-

సీతమ్మ రామునిపైగల ప్రేమకంటె రామునకు సీతమ్మపై ప్రేమ అధికమని దీనివల్ల తెలియుచున్నది. ఇదియే భగవంతుని స్వభావము.

ఆచార్యునిచే మంత్రమును పొంది, స్వస్వరూపమును భగవత్ స్వరూపమును ఎరింగి భగవంతుడే ఉపాయమని నమ్మియున్నజీవుడు శరీరావసానము వరకు భగవత్ప్రాప్తికై వేచియుండును. కాని తానే ఉపాయమని నమ్మియున్న జీవుని చేరకుండ భగవంతుడు ఒక్కక్షణముకూడ ఓర్వలేదు.

హనుమా! సీతమ్మను ఎచట చూచితివో అచటకు నన్నుకూడ తీసికొని పొమ్ము. ఆమె వృత్తాంతమును తెలిసియు నేను దూరముగా ఉండలేను. అత్యంతము భయపడుచు, భయంకరులగు రాక్షసస్త్రీలమధ్య ఆమె ఎటులున్నదో? నల్లని మబ్బుల మధ్య చంద్రుడువలె ఆమెముఖము రాక్షసస్త్రీల మధ్య కాంతిహీనమై యుుడును. హనుమా! సీతమ్మ ఏమనినది? యథార్థముగ చెప్పుము. రోగికి మందువలె ఆమె మాటలే నాకు జీవనము.

"మధురా మధురాలాపా కి మాహ మమ భామినీ,
మద్విహీనా వరారోహా హనుమన్! కథయస్వమే."

(సుంద. 66-15)

"సీతమ్మ మధురము. ఆమెమాటలు మధురములు. ఆమె మాటలను చెప్పుచున్న నీ మాటలు కూడ నాకు మధురములే! నాకు దూరముగాఉండి నాయందే ప్రేమగల సీతమ్మ ఏమనినదో చెప్పుము."

**67** ఇట్లు మహాత్ముడగు రాముడు పలుకగా హనుమ సీతమ్మచెప్పిన మాటలు ఇట్లు నివేదింపసాగెను.

"జానకి పూర్వము చిత్రకూటమున జరిగిన వృత్తాంతమును యథాతథముగ ఇట్లు చెప్పెను.

సీతమ్మ చిత్రకూటమున మీ ఒడిలో పరుండి ముందు మేల్కొనెనట. కాకము ఎగిరివచ్చి ఆమె స్తనమధ్యమున గీరెనట. తరువాత మీరు ఆమెఒడిలో పరుండి యుుండగా ఆ పక్షి మరల మరల ఆమె గుండెలపై పొడిచెనట. ఆమె రక్తముచే తడసి మీకు తెలివి వచ్చెనట. సుఖముగ నిద్రించుచున్న మీరు ఇట్లు మేల్కొలుపబడి గుండెలపై కాకిచే పొడువబడిన సీతమ్మను చూచి కోపము తెచ్చుకొని నిట్టూర్పువిడచి ఇట్లు పలికిరట. నీ వక్షఃస్థలమున గోళ్ళతో ఎవడుగీరినాడు? ఐదుతలలుగల పాముతో ఎవడు ఆటలాడుచున్నాడు? ఇట్లనుచు ఇటునటు చూచుచుండ రక్తముతో తడిసిన గోళ్ళతో కాకి మీకు ఎదురుగా కన్పడినదట. ఇంద్రుని కుమారుడగు ఆ కాకము దేవకార్యముపై భూమండలమున సంచరించుచున్నది. కాని గమనములో వాయువుతో సమానమైనది. ఆ కాకముపై మీరు కోపముతో కూర్చుండిన ఆసనమునుండి దర్భను తీసి బ్రహ్మాస్త్రము నభిమంత్రించి ప్రయోగించిరట. ఆ దర్భ కాలాగ్నివలె మండుచు పక్షిపైకేగెను. ఆ పక్షిని వెంటాడెను. ఆ కాకము మూడులోకములు తిరిగి

తండ్రికాని, దేవతలుకాని, ఋషులుకాని రక్షించెడివారు లేకపోగా మరల మీ యెదుటకే వచ్చి పడెనట. ఎదురుగా నేలపైపడిన కాకిని చంపక కృపతో వదలిరట. బాణము వ్యర్థముకాకుండ దాని కుడి కంటిని మాత్రము పొడిచి వదలిరట. రామా! అపుడా కాకి మీకు నమస్కరించి మీతండ్రి దశరథునకు నమస్కరించి అనుజ్ఞతీసికొని దేవలోకమున కేగెనట.

ఇట్లు నా కొఱకు కాకిపై బ్రహ్మాస్త్రముప్రయోగించిన స్వామి రాఘవుడు బలము, శీలము కలవాడయ్యు, ఏల రాక్షసులపై అస్త్రమును ప్రయోగించుట లేదు? నాగులు కాని గంధర్వులుకాని అసురులు కాని దేవతలు కాని యుద్ధములో రాముని కెదురుగా నిలచుటకు సమర్థులుకారు. పరాక్రమవంతుడగు రామునకు నా విషయమున ఆందోళనయే యున్నచో వేగముగా వాడి గల బాణములతో రావణుని చంపుగాక! సోదరుని యాజ్ఞను పాటించి లక్ష్మణుడైనను ఏల నన్ను రక్షింపరాడు? అగ్ని వాయు దేవులతో సమానమగు తేజస్సుగల ఆ రామలక్ష్మణు లిద్దరు ఏల నన్నుపేక్షించిరి? సమర్థులై యుండియు వారు నన్ను రక్షింపకుండుటకు నేనే ఏదో కొంచెమో గొప్పదో పాపముచేసి యుందును" అని సీతమ్మ చెప్పికంటనీరు పెట్టి దీనముగ విలపించెను.

నేను, ఆమెతో "అమ్మా! రాముడు శోకముచే దేనిని అనుభవించుటలేదు. నిజము. ఒట్టు. దుఃఖపడుచున్న రాముని చూచి లక్ష్మణుడు బాధపడుచుండును. ఎట్లో నేను నిన్ను చూడగలిగితిని. ఈ క్షణమునుండి నీ దుఃఖములు అంతమొందినవి. పురుష శ్రేష్ఠులగు రామచంద్రులు, ఉత్సాహముతో నిన్ను చూడవచ్చి లంకను భస్మముచేయుదురు. రాముడు యుద్ధములో బంధువులతో కూడ రావణుని చంపి నిన్ను తమ పట్టణమునకు తీసికొని వెళ్ళును. రామునకు నిన్ను తెలుపునది - ప్రీతిని కలిగించునదియగు ఒక గురుతునిమ్ము, అని అడిగితిని. అపుడామె అన్ని దిక్కులకు చూచి తన జడలో దాల్చెడి చూడామణిని కొంగునుండి విప్పి ఇచ్చెను. నేనా దివ్యమగు మణిని స్వీకరించి అమ్మకు నమస్కరించి మరల మీవద్దకు వచ్చుటకు సిద్ధపడితిని.

అట్లు సిద్ధపడి పెరుగుచున్న నన్ను చూచి కన్నీటితో దీనమయిన ముఖముతో అస్పష్టమగు మాటలతో సీతమ్మ ఇట్లు పలికెను.

'హనుమా! సింహ సదృశులగు ఆ రామలక్ష్మణులను, సుగ్రీవుని, మంత్రులను కుశలమడిగితిని అనుము. మహా బాహువగు రాముడు నన్ను ఈ దుఃఖ సముద్రమునుండి తరింపచేయునట్లు నీవు ప్రోత్సహించుము. నా

తీవ్రమగు శోకమును ఈ రాక్షసస్త్రీలు నన్ను బెదరించు బెదరింపులను రాముని సమీపమున చెప్పుము. నీ ప్రయాణము సుఖముగ సాగుగాక!'

రాజోత్తమా! సీతమ్మ విషాదముతో పలికిన మాటలను నేను నీముందు నివేదించితిని. సీతమ్మ కుశలముగ నున్నది."

**68** ఇట్లు సీతమ్మ చెప్పి నీయందు ప్రేమచే నేను బయలుదేరిపోదునేమో అను తొందరచే మరల మరల ఏమేమో చెప్పినది.

"హనుమా! రాముడు రావణుని చంపి శీఘ్రముగ నన్ను పొందునట్లు రామునితో నా విషయమును బహువిధములుగ చెప్పవలెను. నీకు యుక్తమని తోచినచో ఒక్కరోజు ఇచట రహస్యమయిన స్థలమున ఉండి విశ్రాంతిని తీసికొనుము. రేపు వెళ్ళగలవు. నీవు ఉన్నచో దురదృష్టవంతురాలనగు నాకు శోకము కొద్దిసేపయినను తగ్గును. నీవేగినచో మీరు తిరిగి వచ్చువరకు నా ప్రాణములు ఉండునో లేదో! నీవు కాన్పింపక పోయినచో దుఃఖ పరంపర మరల నన్నావరించి బాధించును.

ఓ వీర హనుమ! నాకొక్క సందేహము కలుగుచున్నది. మీ వానరులలోకెల్ల నీవు గొప్పవాడవు. నీవు సముద్రమును దాటితివి. కాని, దాటుటకు శక్యముగాని సముద్రమును ఆ వానర సైన్యములు కాని రామలక్ష్మణులు కాని ఎట్లు దాటెదరు? ఈ సముద్రమును దాటుటకు గరుత్మంతుడు, వాయుదేవుడు, నీవు మీ ముగ్గురే సమర్థులు కదా! ఇట్లుండగా కార్యమెట్లు నెరవేరునని నీవు తలంచుచున్నావు? ఈ కార్యము సాధించుటకు నీ వొక్కడవే సమర్థుడవు. నీ బలము కార్యసిద్ధిచే కీర్తి నొందగలదు. సైన్యమంతటితో రాముడు వచ్చి రావణుని యుద్ధములో చంపి నన్ను తన పట్టణమునకు తీసికొని వెళ్ళినచో అది ఆ రామునకు తగును. వనమునుండి రావణుడు మాయచే అపహరించినట్లు రాముడుకూడ చేయుట రామునకు తగదు. సైన్యముతో వచ్చి లంకను చీకాకుపరచి రాముడు నన్ను వెంటబెట్టుకొని వెళ్ళుట ఆతనికి తగును. రాముని పరాక్రమమునకు శౌర్యమునకు తగునట్లు నీవు ఏర్పాటుచేయుము.

ఇట్లు సీతమ్మ పలికిన మాటలను విని, నేను ఇట్లు బదులు పల్కితిని. వానర సైన్యమునకు అధిపతియగు సుగ్రీవుడు బలవంతుడు. నిన్ను రామునితో చేర్చుటకు కృతనిశ్చయుడు. పరాక్రమ సంపన్నులు, మహాబలులు అగు వానరులెందరో మా సుగ్రీవుని ఆజ్ఞకు విధేయులై యుందురు. వారికి

పైకి కాని క్రిందకుకాని అడ్డముగాకాని వెళ్ళుటకు శక్తికలదు. ఏ పనినైనను వారు చేయగలరు. ఇంతకు ముందు అనేక పర్యాయములు వారు వాయుమార్గానుసారముగ భూమికి ప్రదక్షిణ మొనర్చినారు. సుగ్రీవునివద్దనున్న వానరులు అందరును నాకంటెగొప్పవారు; నాతో సమానులు; కాని నాకంటె తక్కువవారు ఒక్కడునులేడు. ఇట్టి పనులకెపుడును చిన్నవారిని పంపుదురు కాని పెద్దవారిని పంపరు. నేనే సముద్రమును దాటినచో వారి విషయము ఆలోచింపవలెనా? అమ్మా! శోకింపకుము. నీ దైన్యము తొలగుగాక. వానర నాయకులు ఒక్కగంతున లంకకు రాగలరు. ఉదయించిన చంద్రసూర్యుల వలె రామలక్ష్మణులిరువురు నా భుజములపై కూర్చుండి నీవద్దకు రాగలరు. ధనుర్ధరులగు రామలక్ష్మణులిరువురు లంకాద్వారమున త్వరలో చూడగలవు. నఖములు, దంష్ట్రములు, ఆయుధములుగా గల వానరశ్రేష్ఠులను త్వరలో చూడగలవు. పర్వతములను మేఘములను పోలిన వానరులు లంక సమీపమందలి పర్వత సానువులలో గర్జించుచుండుటను త్వరలో వినగలవు."

"నివృత్త వనవాసం చ త్వయా సార్థ మరిందమమ్
అభిషిక్త మయోధ్యాయాం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్
తతో మయా వాగ్భి రదీనభాషిణా
శివాభి రిష్టాభి రభిప్రసాదితా
జగామ శాంతిం మమ మైథిలాత్మజా
తవాపి శోకేన తదాఽభిపీడితా." (సుంద. 68.28, 29)

"అమ్మా! శత్రువులను జయించి వనవాసమును పూర్తిచేసి రాముడయోధ్యలో నీతో పట్టాభిషిక్తుడగుటను త్వరలో కాంచగలవు. అని నేను మంగళకరములు ఇష్టములునగు వాక్కులతో ధైర్యముగ మాటాడి ఓదార్చగా సీతమ్మ ప్రసన్నురాలై శాంతిని పొందెను. ఆమె కొఱకు నీవు శోకించుచున్నావని మాత్రము శోకించుచున్నది. ఆమె కంతకుమించిన దుఃఖములేదు" అని హనుమ రామునితో చెప్పెను.

సుందరకాండః సమాప్తః - సుందరకాండము సమాప్తము.

హరిః ఓం తత్ సత్

సర్వం శ్రీరామచంద్రార్పణమస్తు.

హనుమ పలికిన మంగళకరములగు వాక్కులచే సీతమ్మకు మనఃప్రసాదము, శాంతి లభించినట్లే ఈ కాండము చదివిన వారికి మనశ్శాంతి, హనుమదనుగ్రహము లభించును. త్వరలో అయోధ్యలో రామునితో పట్టాభిషేకమునొందెదవని సీతమ్మతో హనుమ చెప్పుటచేతను, సీతమ్మ పాతివ్రత్యము చేతను రావణుడు చనిపోయినాడు. రాముడు రావణుని చంపుటకు నిమిత్తమాత్రుడే అని హనుమ వానరులతో చెప్పుటచేతను రావణవధ అయినట్లు, సీతమ్మకు దుఃఖము తొలగి శాంతి లభించినట్లు భావించి సుందరకాండ పూర్తికాగానే పట్టాభిషేకము కూడ చేయవలెను. అందుచే ఇక ముందు పట్టాభిషేకము వివరింపబడును.

శ్రీరామాయ నమః

# శ్రీరామపట్టాభిషేకము

శ్రీరామచంద్రుడు రావణ వధానంతరము పుష్పక విమానముపై విభీషణునితో, సుగ్రీవాది వానరులతో, వానరపత్నులతో కలిసి భరద్వాజాశ్రమమునకు చేరెను.

అచట వారి ఆతిథ్యమును స్వీకరించి హనుమను నంది గ్రామమున నున్న భరతునకు తన రాకను తెలుపుటకై శ్రీరామచంద్రుడు ముందుగ పంపెను.

శ్రీరామునకు భరతునిపై ఎంత ప్రేమయో గుహునిపై అంత మక్కువ.

పదునాల్గు సంవత్సరములు నిండగనే తాను కన్పడకపోయినచో భరతుడు ప్రాణత్యాగము చేయునని ముందుగ వార్త నంపుచు గంగాతీరమున మార్గమధ్యమున నున్న గుహునకు కూడ తన క్షేమవార్త తెలుపుమనెను. గుహుడు "ఆత్మ సమస్సఖా" తనకు దీటైన మిత్రుడని హనుమతో చెప్పెను.

రామునియొక్క సౌశీల్యమును దీనిచే ఎఱుంగ వచ్చును. శ్రీరాముడు సోదరుల యందు అధికమైన ప్రేమగలవాడు వారి మనసునకు ఏ మాత్రము అనిష్టమైనను తాను సహింపలేడు.

అందుచే హనుమను భరతుని వద్దకు పంపుచు "హనుమా! భరతుని ముఖ వర్ణమును, దృష్టిని, సంభాషణపద్ధతిని జాగ్రత్తతో పరికించి చూడుము రాజ్యము ఎంతటి వాని మనసు నైనను ఆకర్షింపవచ్చును. ఒకవేళ భరతుడు రాజ్యమునందు కాంక్ష కల్గియున్నట్లు నీకు తోచినచో నీవు వెంటనే వెనుకకు రమ్ము. ఆతడే రాజ్యమును పరిపాలించుగాక! మేము నంది గ్రామము వరకు రాకమునుపే నీవు మాకు ఎదురు రమ్ము" అని చెప్పి పంపెను.

రాముని త్యాగము, ఔదార్యము లోకాతీతము.

హనుమ భరతుని దగ్గరకు వెళ్ళి జటిలుడై ఒడలంతయు మలినముపట్టి, సోదరుని ఆపదచే కృశించి, ఫల మూలములనే ఆహారముగ తీసికొనుచు తాపసుడై ధర్మచారియై యున్న వానిని చూచి నమస్కరించెను.

"సీతాసహితుడై రాముడు తిరిగి వచ్చుచున్నాడు. నీవు త్వరలో రాముని కలియగలవు" అని చెప్పెను.

భరతుడు, ఆనందపరవశుడై మూర్ఛనొందెను.

మరల లేచి హనుమ నాలింగనము చేసికొని "స్వామీ! నీవు దేవుడవా? మనుష్యుడవా? నాయందు దయతో ఇచ్చట కేగుదెంచి ఈ ప్రియమైన వార్తను ఎఱింగించిన నీకు నే నేమీయగలను?" అని ప్రశంసించెను.

అప్పుడు హనుమ సీతారామవృత్తాంతము నంతను భరతునకు నివేదించెను.

"రేపు పుష్యమీ నక్షత్రమున రాముని నీవు చూడగలవ"ని హనుమ చెప్పెను.

భరతు డానందముతో శత్రుఘ్నుని శ్రీరామగమనమునకు ముందు చేయవలసిన సన్నాహముల నన్నింటిని చేయ నియమించెను.

రామ దర్శనమునకై అందరు సిద్ధమై ఎదురు చూచుచుండిరి.

తెల్లవారినది. భరతుడు రామాగమనమునకై ప్రతిక్షణము ఉత్సుకుడై యుండెను. విలంబమును సహింపలేక హనుమతో

"కచ్చి న్న ఖలు కాపేయీ సేవ్యతే చలచిత్తతా
న హి పశ్యామి కాకుత్థ్సం రామ మార్యం పరంతపమ్ ॥"

(యుద్ధ. 130-22)

"మీ వానర జాతికి సహజమగు చపల చిత్తముతో పల్కితివా ఏమి? రాముడింకను రాడేమి? వానరులు కానరారేమి?" అని పల్కెను.

అపుడు హనుమ, "స్వామీ! ఈ చెట్లు పూలతో పండ్లతో నిండియుండుటయే మీకు నిదర్శనము. భరద్వాజుని వరముచే వానరుల కొఱకు ఈ వృక్షములిట్లు ఫలభరితము లగు చున్నవి. అదిగో! ధ్వని విన్పడుచున్నది. మా వానర సేన గోమతీ నదిని దాటుచున్నది. అదిగో! పరాగవర్షము. అదిగో! స్వామి పుష్పకవిమానము. చంద్రునివలె విమలమై దూరమునుండి కన్పట్టుచున్నది. ఆ విమానములో సీతారామలక్ష్మణులు, సుగ్రీవ విభీషణులు నేంచేసియున్నారు. చూడుడు."

ఇట్లు హనుమ చెప్పుచుండగనే విమానము దగ్గరగా వచ్చెను.

ప్రజలందరు రాముని జూచి స్త్రీలు, బాలురు, యువకులు, వృద్ధులు అందరు ఒక్కసారి "రామోఽయం" రాముడడుగో! అని కేక లిడిరి.

భరతుడు విమానములోనున్న రామునకు నమస్కరించి యథార్థమగు స్వాగతముతో రాముని నమస్కరించెను.

రాముని యాజ్ఞచే విమానము నేలకు దిగెను. భరతుడు విమానము

నెక్కి, రామునివద్దకు చేరి నమస్కరించెను.

రాముడు భరతుని లేవదీసి తన ఒడిలో కూర్చుండబెట్టుకొని కౌగిలించు కొనెను. భరతుడు లక్ష్మణునిచేరి వైదేహికి నమస్కరించి, సుగ్రీవ జాంబవదాదు లందరకు ఆలింగనపూర్వకముగ స్వాగతము పల్కెను. శత్రుఘ్నుడు కూడ అందరకు నమస్కరించెను.

అపుడు శ్రీరామచంద్రుడు విమానమునుండి దిగి వచ్చి తన తల్లికి, సుమిత్రకు, కైకేయికి నమస్కరించెను.

పురజనులందరు--

"స్వాగతం తే మహాబాహో కౌసల్యానందవర్ధనః"

(యుద్ధ. 130-50)

"రామ! స్వాగత"మని స్వాగతము పల్కిరి.

భరతుడు స్వయముగ రాముని పాదుకలను తెచ్చి పాదములకు చేర్చెను.

శ్రీరామభరతుల సోదర ప్రేమను చూచి వానరులు, విభీషణుడు మున్న గువారందరు కనుల నీరు నింపుకొనిరి. ఆశ్చర్యపడిరి.

విమానమునుండి అందరు దిగిన తరువాత పుష్పకవిమానమును కుబే రునివద్దకు ఏగవలసినదిగా ఆజ్ఞాపించెను.

"పురోహిత స్యాత్మసమస్య రాఘవో
బృహస్పతే శ్శక్ర ఇవామరాధిపః,
నిపీడ్య పాదౌ పృథగాసనే శుభే
సహైవ తేనోపవివేశ రాఘవః." (యుద్ధ. 130-61)

శ్రీరామచంద్రుడు తమ వంశమునకు తగిన పురోహితుడగు వసిష్ఠుల పాదములను పట్టి నమస్కరించి, ఇంద్రుడు బృహస్పతిని చేరినట్లు వసిష్ఠుల సన్నిధిని చేరి వారితోపాటు తానుకూడ వేరొక ఆసనముపై కూర్చుండెను.

# శ్రీరామపట్టాభిషేకసర్గ

"శిరస్యంజలి మాధాయ కైకే య్యానందవర్ధనః
బభాషే భరతో జ్యేష్ఠం రామం సత్యపరాక్రమమ్"

(యుద్ధ. 131-1)

"కైకేయి ఆనందమును వృద్ధిపొందించిన భరతుడు శిరసున రెండు చేతులు జోడించి సత్యపరాక్రముడు, అన్నగారునగు రామునితో ఇట్లు పల్కెను.

ఇచ్చట భరతుని "కైకే య్యానందవర్ధనుడు" అనెను. పదునాలుగు సంవత్సరము లరణ్యములోనుండి తిరిగి వచ్చి రాముడు రాజగుటయే కైకేయికి ఆనందము.

దేవతాప్రేరణముచే దేవకార్యమును నిర్వర్తించుటకై ఆమె అట్లు కోరినది గాని భరతుడు రాజగుట ఆమెకు అభిమతము కాదు. భరతుడు రాజు కాలేదని ఆమె దిగులుపొందలేదు. రాముడే రాజైనాడని ఆనందించినది- అని కైకేయి స్వభావమును ఇచట మనకు వాల్మీకి ప్రదర్శించెను.

రాముడు సత్యపరాక్రముడు. సత్యముచేతనే శత్రువులను జయించినవాడు. పరలోకములను తనవశము చేసికొనినవాడు. రాజ్యమును మరల పొందినవాడు.

"పూజితా మామికా మాతా దత్తం రాజ్య మిదం మమ
తద్దదామి పున స్తుభ్యం యథా త్వ మదదా మమ."

(యుద్ధ. 131-2)

భరతుడిట్లు చెప్పుచున్నాడు.

"స్వామీ! రామ! మా అమ్మను గౌరవించితివి. ఆమె మాటను పాలించితివి. ఈ రాజ్యమును నా కొసంగితివి. నీవు నాకెటుల నొసంగితివో అట్లే మరల ఈ రాజ్యమును నీకయి ఒసంగుచున్నాను."

ఈ శ్లోకము చాల ముఖ్యమైనది.

మానవుడు శరీరమును ధరించి సత్త్వరజస్తమోగుణములలో రజోగుణముయొక్క విజృంభణముచే సర్వేశ్వరునకే చెందిన ఈ సమస్తమును తనదిగాను, పాలించువాడు వాడే అయియుండగా తానే పాలకుడనియు భావించును. కాని అది జీవిత ప్రయోజనముకాదు. స్వామికే చెందిన సర్వజగత్తును, తనను కూడ, వానికి చెందినవానినిగా ఎఱింగి వానికి అర్పించుట కర్తవ్యము అని

భరతుడు మన కుపదేశించుచున్నాడు.

సర్వేశ్వరుడు మన మనుభవించు సర్వపదార్థములను మనవిగా భావించు టకు తగినట్లే ఒసంగును. దానిచే మనకు వానియందు మమకార మేర్పడును. నేను కాపాడుచున్నాను, నే ననుభవించుచున్నాను- అని అహంకార మేర్పడును. విశ్వమంతయు వానిచే వ్యాపింపబడినదని ఎఱింగి వానిదిగా సర్వపదార్థము లను భావించి వాడే కాపాడువాడు, వాడే అనుభవించువాడు- అను బుద్ధితో దానిని అనుభవించి చివరకు వానిని వాని కర్పించి, తాను వానికి పరతంత్రుడై నిలచుటయే ఆత్మస్వరూపము నెఱింగినవాడు చేయదగిన పని.

ఇచ్చట భరతుడు ఆ ధర్మమునే పాలించి రామునకు రాజ్యము నర్పించుచున్నాడు.

"ఇదం రాజ్యం మమ దత్తం"

"ఈ రాజ్యము నా కొసంగబడినది"

"తత్ పునః తుభ్యం దదామి"

"దానిని మరల నీకై ఒసంగుచున్నాను"

అని భరతుడు నివేదించెను.

ఇందలి రహస్యమును తెలిసికొనవలెను. ఈ సామ్రాజ్యమంతయు భగవానుడు మనకిచ్చినది. కాని దానిని "మనది" అనుకొందుము. కాని ఆతడట్లు ఒసంగలేదు. తన ప్రతినిధిగా పాదుకలనుంచి భరతుని రాజ్యపాలన చేయుమని నట్లే వాని యాజ్ఞను పాలించి, వానిదిగానే చూచుచు పాలించి అనుభవించమని యొసంగెను.

దీనిని గుర్తించుటయే జ్ఞానము. ఇంతకాలము అజ్ఞానముచే తనదనుకొనినదానిని వానిదిగా అర్పించుటయే కర్తవ్యము.

సంస్కృతమున చతుర్థీ విభక్తివేసి "నీకొఱకు ఇచ్చుచున్నాను" అనినచో తన హక్కును పూర్తిగా వదలి దానిపై వానికి స్వామిత్వమును సంక్రమింపచేసినట్లగును.

అందుకై భరతుడు "తుభ్యం దదామి" అని స్వామిత్వము భగవానునిదే యని అర్పించెను.

మనకు భగవానుడొసంగునపుడు కేవలము అనుభవమునకే ఒసంగును. కాని స్వామిత్వముండదు అని సూచించుటకు "మమదత్తం" నాకు ఒసంగబడినది. అని షష్ఠీవిభక్తిని ప్రయోగించును. ఇట్లు మనము పాలించుచు

అనుభవించుచు, పదార్థములన్నియు సర్వేశ్వరుడు తాత్కాలికముగ పాలించుచు అనుభవించుటకు ఒసంగినవే కాని వానిపై మనకు స్వామిత్వము లేదని గుర్తిం పవలెను. సర్వేశ్వరునిదేస్వామిత్వమని సర్వేశ్వరున కర్పించుటయే మానవుడు చేయదగినదని భరతుడు తన ఆచరణముచే మన కుపదేశించుచున్నాడు.

భరతుడింకను ఇట్లు నివేదించుచున్నాడు. "బలసిన ఒంటరి వృషభము మోయదగిన భారమును లేగదూడ ఎట్లు మోయలేదో ఈ రాజ్యమును నేను గూడ అట్లే మోయలేను.

ప్రవాహవేగముచే గండిపడిన ఆనకట్టను కట్టుటకు ఎంతకష్టమో రాజ్య ములోని ఛిద్రములను ఆవరించుట అంతకష్టము.

హే రామ! గుఱ్ఱపునడకను, రూపములో సామ్యమున్నదని, జాతిచే ఒకేజాతికి చెందినదానినని గాడిద నడుచుటకు యత్నించినట్లు హంసనడకలను కాకి అనుకరించుటకు యత్నించినట్లు నేనుకూడ రాజపుత్రుడనే యని నీవలె రాజ్యపాలనము చేయుటకు యత్నించుట హాస్యాస్పదమగును.

అంతేకాదు. రామ! ఇంటి లోపలభాగమున నాటుకొనిన ఒక మొక్క బాగుగ పెరిగి, బలమైన మొదలితో కొమ్మలతో విస్తరించి, పూచి, పండ్లు పండకుండ ఎండిపోయినచో ఆ యాజమాని ఎంత బాధపడునో ఈనాడు నీవు రాజు కాకపోయినచో లోకమంత బాధపడును.

దశరథ చక్రవర్తి తపఃఫలముగా చక్రవర్తి కుమారుడవై జన్మించి గుణము లచే సర్వలోక పూజ్యుడవై జ్యేష్ఠుడవై పట్టాభిషేకార్హత కలిగియుండి పట్టాభిషే కమునకు అంతయు సిద్ధము కాగా విఘ్నమై అడవుల కేగిన నీవు ఈనాడు రాజువు కాకపోయినచో లోకమంతయు బాధపడును.

నీవు నీ భక్తులను, భృత్యులను పాలింపుము.

ఈ జగమంతయు పట్టాభిషిక్తుడైన నిన్ను మధ్యాహ్నమున ప్రకాశిం చుచున్న తేజస్సుగల సూర్యుని అన్నివైపులనుండి అందరు చూడగల్గినట్లు కాంతురు గాక! రామ! మంగళవాద్యములతో, కాంచీ నూపురధ్వనులతో, మధురములగు గీతములతో నీ వికమేల్కొందువుగాక!

"యావ దావర్తతే చక్రం యావతీ చ వసుంధరా
తావత్త్వ మిహ సర్వస్య స్వామిత్వ మనువర్తయ."

(యుద్ధ. 131-11)

"ఈ కాలచక్రము ఎంతకాలము సాగుచుండునో, ఈ భూమి ఎంతకాలము నిలచియుండునో అంతకాలము నీవీ సర్వవిశ్వమునకు స్వామివై యుందువుగాక!"

ఈ శ్లోకము నిత్యము మనము భగవత్సన్నిధిని విన్నవింపదగిన శ్లోకము.

స్వామి- సర్వేశ్వరుడు. వాని సొత్తు - సర్వజగత్తు. దానిని తన సొత్తుగా భావించి, తనను స్వతంత్రుడుగా భావించుట మానవుని అజ్ఞానము. ఈ జగము, తాను కూడ సర్వేశ్వరునకే చెందినవారమని ఎపుడు తెలియునో అపుడు విన్నవింపవలసిన మాట ఇదియే!

స్వామీ! కాలచక్ర మున్నంతవరకు, ఆత్మతత్త్వమున్నంతవరకు నీవే స్వామివి" అని భరతుడు తన ఆచరణచే లోకమున కంతకు కర్తవ్యము నుపదేశించెను.

ఇట్లు భరతుడు నివేదింపగనే శ్రీరామచంద్రుడు 'సరే' అని అంగీకరించెను. శుభమగు ఆసనముపై కూర్చుండెను.

శత్రుఘ్నుడు, నిపుణులు- సుఖహస్తులు- సుశీఘ్రులు నగు శ్మశ్రువర్ధకులను (మంగళ్ళను) స్వామికి క్షురకర్మ చేయుటకు నియమించెను.

శ్రీరామచంద్రుడు సోదరులపైగల ప్రేమాతిశయముచే వారు స్నానము చేయనిదే తాను స్నానముచేయుట కంగీకరింపలేదు. అందుచే ముందుగ భరతునకు మంగళస్నానము చేయించిరి.

తరువాత లక్ష్మణుడు, వానరేంద్రుడగు సుగ్రీవుడు, రాక్షసేంద్రుడగు విభీషణుడు కూడ మంగళస్నానము లొనరించిరి.

అపుడు శ్రీరాముడు జటలు విప్పించుకొని అభ్యంజనము స్వీకరించి, చిత్రములగు మాల్యములను ధరించెను. శరీరమునకు చందనాద్యనులేపనములను గావించుకొనెను. మంచి విలువగల వస్త్రములను దాల్చెను. కాంతితో వెలుగొందుచుండెను.

అపుడు యోగ్యమగు పరిజనము రామచంద్ర ప్రభువునకు అలంకారములను సమర్పించిరి.

లక్ష్మణునిగూడ అలంకరించిరి.

దశరథుని భార్యలు ముగ్గురును స్వయముగ సీతమ్మను మనోహరముగ అలంకరించిరి.

కౌసల్య తన కుమారునకు విజయము చేకూర్చిన వానరుల భార్యలకందరకు సంతోషముతో స్నానములు చేయించి తానే స్వయముగ అలంకరించెను.

శత్రుఘ్నుడు సారథియగు సుమంత్రుని సర్వాంగసుందరమగు రథమును పూన్చి తెచ్చుటకు ఆజ్ఞాపించెను. సూర్యమండలమును పోలిన శ్రేష్ఠమగు రథము నొకదానిని సుమంత్రుడు తెచ్చి ఉంచెను. సత్యపరాక్రముడగు రాముడా

రథము నధిరోహించెను.

మహేంద్రసమానులగు సుగ్రీవుడు, హనుమంతుడు కూడ స్నానమాచరించి, దివ్యములగు వస్త్రములను దాల్చి కుండలములను దాల్చి బయలుదేరిరి.

సుగ్రీవుని భార్యలు శ్రేష్ఠములగు ఆభరణములను దాల్చి, కుండలములు దాల్చి అయోధ్యాపురమును చూడవలెనను వేడుక కలవారై సీతమ్మతో సిద్ధపడిరి.

అశోకుడు, విజయుడు, సుమంత్రుడు మొదలగు అయోధ్యాపురమునందున్న దశరథమంత్రివర్గమంతయు పురోహితుడగు వసిష్ఠునితో శ్రీరాముడు పట్టణమున కేగుదెంచుచున్న సమయమున రామాభ్యుదయమునకు, నగరాభ్యుదయమునకు తగిన విధముగ చేయవలసిన ఏర్పాట్లనాలోచించి నిర్ణయించిరి.

మహాత్ముడగు రామచంద్రునకు పట్టాభిషేకమునకు చేయదగిన మంగళ సన్నాహమంతయు తాము చేయుడని పురోహితుడగు వసిష్ఠునితో మంత్రులు నివేదించిరి.

రాముని దర్శింపవలెనని అందరును పట్టణమునుండి బయల్వెడలి నంది గ్రామమువైపుబయలుదేరిరి.

సహస్రాక్షుడగు ఇంద్రుడు శ్రేష్ఠములగు అశ్వములను పూన్చిన రథము నధిరోహించినట్లు రాముడు రథము నధిరోహించి అయోధ్యాపురమునకు బయలుదేరెను.

భరతుడు పగ్గములను పట్టుకొనెను.

శత్రుఘ్నుడు ఛత్రమును దాల్చెను.

లక్ష్మణుడు చామరమును దాల్చి శ్రీరామునకు వీచుచుండెను.

తెల్లని వాలవ్యజనమును వేరొకదానిని దాల్చి రాక్షసేంద్రుడగు విభీషణుడు ముందు నిలిచి సేవ చేయుచుండెను.

ఆకాశమున దేవతలు, మరుత్తులు, ఋషులు సంఘములుగా నిలిచి మధురమగు ధ్వనితో రామునిస్తోత్రము చేయుచుండిరి. మహాతేజశ్శాలియగు సుగ్రీవుడు పర్వతమును పోలియున్న శత్రుంజయమను పేరుగల ఏనుగును, మనుష్యరూపమునుదాల్చిన వానరులందరు సర్వాభరణభూషితులై తొమ్మిది వేల ఏనుగులను అధిరోహించిరి.

రామచంద్రుడు అయోధ్యవైపు సాగుచుండగా శంఖములు, దుందుభులు మున్ముందు మ్రోగుచుండెను.

రథముతో వచ్చుచున్న అతిరథుడగు రాముని చూచి ప్రజలందరు రామాభ్యుదయకాంక్షులై జయధ్వానమును చేసిరి.

రాముడు వారిని పల్కరించుచుండెను.

ఈవిధముగ వచ్చిన మంత్రులతోను, బ్రాహ్మణులతోను, ప్రజలతోను, సోదరులతోను కూడియున్న రామచంద్రుడు నక్షత్రములతో కూడియున్న చంద్రునివలె కాంతిచే ప్రకాశించుచుండెను.

తాళములను స్వస్తికములను, మంగళవాద్యములను మ్రోగించుచు ముందు కొందరు సాగుచుండిరి.

అక్షతలు, బంగారము, గోవులు, కన్యలు, బ్రాహ్మణులు, పిండివంటలను పట్టుకొనిన మనుష్యులు రామునకు ముందు సాగుచుండిరి. రాముడు సమీప మున నున్నవారితో సుగ్రీవునితో ఏర్పడిన మైత్రీబంధమును, వాయుపుత్రుడగు హనుమ ప్రభావమును, వానరులొనరించిన అద్భుతకృత్యములను, రాక్షసుల బలమును, విభీషణునితో కలయికను వివరించుచుండెను.

అయోధ్యాపురవాసులందరు ఈ వృత్తాంతములను విని ఆశ్చర్యపడు చుండిరి.

కాంతిమంతుడైన రామచంద్రుడు వానరులతో కూడినవాడై సంతోష ముతో నిండినజనులతో నిండిన అయోధ్యను ప్రవేశించెను.

ప్రజలు సంతోషముతో ఇంటింట జెండాల నెత్తిరి.

రామచంద్రుడు ఇక్ష్వాకువంశపు చక్రవర్తులు నివసించిన తమ తండ్రి భవనమునకు ముందుగ చేరెను.

తండ్రిగారి భవనమున ప్రవేశించి కౌసల్యకు, కైకేయికి, సుమిత్రకు నమ స్కరించెను.

అపుడు రామచంద్రుడు ధార్మిక శ్రేష్ఠుడగు భరతునితో "అశోకవనముతో నిండిన నా భవనమును ముక్తావైడూర్యసంకీర్ణమైయున్న దానిని సుగ్రీవునకు విడిదిగా నొసంగు" మని చెప్పెను.

వెంటనే భరతుడు రాముని యాజ్ఞ ననుసరించి సుగ్రీవునిచేయి పట్టు కొని తీసికొని వెళ్ళి రామభవనమున ప్రవేశపెట్టెను.

అంతకుముందే శత్రుఘ్నుడు సేవకులను పంపి ఆ భవనమున తైలప్ర దీపములను, పర్యంకములను, పాన్పులను ఏర్పరుప జేసెను.

అపుడు భరతుడు మహాతేజశ్శాలియగు సుగ్రీవునితో "ప్రభో! రాముని పట్టాభిషేకమునకు జలములను తెచ్చుటకు దూతలను పంపవలసినదని ప్రార్థిం చెను.

అపుడు సుగ్రీవుడు సర్వరత్న విభూషితములగు నాలుగు సువర్ణకలశములను తెప్పించి నల్గురు వానరుల కొసంగెను. తెల్లవారు సరికి నాలుగు సముద్రములనుండి కలశముల నిండ జలమును తేవలెనని ఆజ్ఞాపించెను.

జాంబవంతుడు, హనుమంతుడు, వేగదర్శి, ఋషభుడు అను నల్గురును గరుడునితో సమానమగు వేగము కలవారలై ఆకాశమున కెగిరి, 500 నదులలోని జలమును కలశములతో తెచ్చిరి.

సత్త్వసంపన్నుడగు సుషేణుడు తూర్పు సముద్రపు జలములతో నిండిన సర్వరత్నవిభూషితమగు కలశమును తెచ్చియుండెను.

రక్తచందనపు శాఖలతో నిండిన (కప్పబడిన) బంగారు కలశము నిండ దక్షిణసముద్రజలమును ఋషభుడు తెచ్చెను.

పశ్చిమమున నున్న మహాసముద్రమునుండి చల్లని జలమును వాయువిక్రముడగు గవయుడు రత్నమయమగు కలశముతో తెచ్చెను.

గరుడానిల విక్రముడగు నలుడు ఉత్తర సముద్రమునుండి జలమును తెచ్చెను.

తరువాత వానర శ్రేష్ఠులచే 500 నదుల నుండి, నాలుగు సముద్రముల నుండి జలము తీసికొని రాబడినది. కావున పట్టాభిషేకము చేయదగునని శత్రుఘ్నుడు మంత్రులతో కలిపి పురోహితుడగు వసిష్ఠునకు, మిత్రులకును నివేదించెను.

"తత స్స ప్రయతో వృద్ధో వసిష్ఠో బ్రాహ్మణై స్సహ
రామం రత్నమయే పీఠే సహసీతం న్యవేశయత్.
వసిష్ఠో వామదేవ శ్చ జాబాలి రథ కాశ్యపః
కాత్యాయన స్సుయజ్ఞ శ్చ గౌతమో విజయ స్తథా.
అభ్యషించ న్నరవ్యాఘ్రం ప్రసన్నేన సుగంధినా
సలిలేన సహస్రాక్షం వసవో వాసవం యథా."

(యుద్ధ. 131-59,60,61)

తరువాత నియమశీలుడు వృద్ధుడు నగు వసిష్ఠుడు బ్రాహ్మణులతో కలసి సీతమ్మతో గూడ శ్రీరామచంద్రుని రత్నమయము మగు పీఠమున

కూర్చుండబెట్టెను.

వసిష్ఠుడు, వాయుదేవుడు, జాబాలి, కాశ్యపుడు, కాత్యాయనుడు, సుయజ్ఞుడు, గౌతముడు, విజయుడు అను వారెనమండుగురును నరశ్రేష్ఠుడగు రామచంద్రుని ప్రసన్నము, పరిమళవంతమునగు జలముతో అష్టవసువులు ఇంద్రుని అభిషేకించినట్లు అభిషేకించిరి.

ఋత్విక్కులు, బ్రాహ్మణులు నగు వారలు ముందుగ అభిషేకము నొనర్చిరి.

తరువాత కన్యలు, మంత్రులు, యోధులు అబిషేకించిరి. తరువాత నైగమును అభిషేకించిరి.

ఆకాశమున నుండి నలుగురు లోకపాలురును, సర్వ దేవతలును, దేవులను, దివ్యులను, సర్వ ఔషధి రసములతో అభిషేకించిరి.

శత్రుఘ్నుడు శ్రీరామచంద్ర ప్రభువునకు శుభమగు తెల్లని ఛత్రమును పట్టెను.

వానర రాజగు సుగ్రీవుడు తెల్లని చామరమును బట్టి వీచెను.

రాక్షసేంద్రుడగు విభీషణుడు చంద్రునిపోలిన వేరొక తెల్లని చామరమును పట్టి వీచెను.

ఆ సమయమున ఇంద్రుడు నూరుపూసలుగల ప్రకాశించుచున్న బంగారు మాల నొకదానిని వాయువుచే రామునకు పంపెను. దేవ గంధర్వులు గానమొనర్చిరి. అప్సరోగణములు నృత్యము చేసిరి.

పట్టాభిషేకమునకు తగినవాడగు రామచంద్రుడడు పట్టాభిషిక్తుడు కాగా భూమి సస్యవంతమై యుండెను. వృక్షములు ఫలవంతములాయెను. పుష్పములు సువాసనలను గుబాళించు చుండెను. పట్టాభిషేక ముహూర్తమున శ్రీరామచంద్రుడు బ్రాహ్మణులకు లక్ష గుఱ్ఱములను, ధేనువులను, గోవులను, వృషభములను దానముగ నొసంగెను. ముప్పదికోట్ల బంగారు నాణెములను బ్రాహ్మణులకు దాన మిచ్చెను. అనేక విధములగు ఆభరణములను, మహార్ఘములగు వస్త్రములను బ్రాహ్మణుల కొసంగెను.

సూర్యకాంతివంటి కాంతిగల మణులు కూర్చిన బంగారుహారమును రామచంద్రుడు సుగ్రీవున కొసంగెను.

వైడూర్యములు, వజ్రములు, రత్నములు పొదిగిన అంగదములను రెండిం

టిని అంగదున కొసంగెను.

రాముడు చంద్రకాంతి వంటి ప్రభగల శ్రేష్ఠమగు మణులతో గూడిన దివ్యమగు ఒక ముత్యాలహారమును సీతమ్మ కొసగెను.

సీతమ్మ స్వచ్ఛమగు తెల్లని వస్త్రములను రెండిటిని, శుభములగు ఆభరణములను వాయుపుత్రుడగు హనుమ కొసంగెను.

అపుడు జనకాత్మజ యగు సీత తన మెడలో నున్న హారమును తీసి చేతపట్టుకొని వానరుల నందరను, భర్తను కూడ మరల మరల చూచుచుండెను. ఆమె చూపులచే ఆమె మనసులోని భావము నెఱింగిన రామచంద్రుడు జనకాత్మజతో ఇట్లనెను.

"ప్రదేహి సుభగే హారం యస్య తుష్టాసి భామిని,
పౌరుషం విక్రమో బుద్ధిః యస్మి న్నేతాని సర్వశః.
దదౌ సా వాయుపుత్రాయ తం హార మసితేక్షణా!"

(యుద్ధ. 131.81-82)

"ఓ సౌభాగ్యవతి! ఎవని విషయమున నీ మనసు సంతుష్టినొందినదో వానికి హారము నొసంగుము. పౌరుషము, పరాక్రమము, బుద్ధి ఎవనియందు పరిపూర్ణముగ నున్నవో వానికి హారము నొసంగు" మని రాముడు చెప్పిన వెంటనే అసితేక్షణ (నల్లని కన్నులు గలది) యగు సీత ఆ హారమును వాయుపుత్రుడగు హనుమ కొసంగెను.

హనుమ ఆ హారముతో చంద్ర కిరణములు ప్రసరించుటచే తెల్లనైన తెల్లని మబ్బు ఆవరించిన పర్వతమువలె ప్రకాశించెను.

ఇచట రాముడు సీతమ్మతో "ప్రదేహి సుభగే" అనుటలో "ఓ సౌభాగ్యవతి! నీ సౌభాగ్యమునకు కారణమెవ్వడో వాని కొసంగుము" అని ధ్వనించుచున్నది. అట్టివాడు హనుమయే కదా! అంతియే గాక పౌరుషము, పరాక్రమము, బుద్ధిగలవాడు సీతమ్మకు సంతుష్టిని కల్గించినవాడు హనుమ తప్ప వేరొకడు లేడని సీతారాముల మాటల చేతను, సీతమ్మ హారమిచ్చుట చేతను వెల్లడియగు చున్నది.

తరువాత రామచంద్రుడు ద్వివిదమైందులకు నీలునకు కోరదగిన గుణములుగల ఆభరణ విశేషముల నొసంగెను. మిగిలిన వానర వృద్ధులను అందరును వస్త్రములతోను, భూషణములతోను సత్కరించెను.

రామునిచే యథార్థముగ సత్కరింపబడిన వానరులందరు సంతుష్టమన స్కులై రామునివద్ద సెలవు తీసికొని కిష్కింధకు వెడలిరి. సుగ్రీవుడు కూడ రామపట్టాభిషేక దర్శనముచే తృప్తి నొందినవాడై కిష్కింధ కేగెను.

"లబ్ధ్వా కులధనం రాజా లంకాం ప్రాయా ద్విభీషణః"

(యుద్ధ. 131-89)

విభీషణుడు రామచంద్రునినుండి కులధనమును పొంది లంకకేగెను.

ఇచట "కులధన" మను పదము గమనింపదగినది, గృహ, క్షేత్ర, ధనాదులు కులధనము కావు. పెద్దలనుండి వచ్చుచున్న దేవతార్చన సంపుటయే కులధనము. ఇక్ష్వాకువంశమున బ్రహ్మగారినుండి లభించిన పూర్వులచే ఆరాధింపబడిన దేవతార్చన సంపుటమగు శ్రీరంగవిమానమే శ్రీరామచంద్రుని కులధనము. అట్టి కులధనమును విభీషణున కొసంగి, అనునయించి లంకకు పంపెను. ఆ శ్రీరంగవిమానమే కావేరీ మధ్యదేశమున సప్తప్రాకార మధ్యమున నేటికిని దర్శన మొసంగుచున్నది.

శ్రీరామచంద్రుడు పట్టాభిషిక్తుడై, శత్రువిజయముచే మహాయశము నందినవాడై రాజ్యమునంతను పరమౌదార్యముతో సంతోషముతో శాసించుచుం డెను. యౌవరాజ్యపట్టాభిషేకము చేయదలంచి ధర్మజ్ఞుడు, ధర్మవత్సలుడు అగు లక్ష్మణునితో శ్రీరామచంద్రుడిట్లనెను.

"ఆతిష్ఠ ధర్మజ్ఞ మయా సహేమాం
గాం పూర్వరాజాధ్యుషితాం బలేన
తుల్యం మయా త్వం పితృభిః ధృతాయా
తాం యౌవరాజ్యే ధుర ముద్వహస్వ.
సర్వాత్మనా పర్యనునీయమానో
యదా న సౌమిత్రి రుపైతి యోగం
నియుజ్యమానోపి చ యౌవరాజ్యే
తతోభ్యషించ ద్భరతం మహాత్మా." (యుద్ధ. 131-91,92)

"ధర్మజ్ఞ! పూర్వరాజులగు మన్వాదులచే అధిష్ఠింపబడిన ఈ భూమిని నాతోపాటు నీవుకూడ పాలింపుము. మన తండ్రులచే పాలింపబడిన ఈ రాజ్య మును పాలించుటలో నాతోపాటు నీవుకూడ భారమును వహించి యువరాజ

పదవిని స్వీకరింపుము." ఇట్లు రామచంద్రుడు సౌమిత్రిని ఎంత బతిమాలినను ఆతడు యువరాజుగా నుండుటకు అంగీకరింపలేదు. అపుడు శ్రీరాముడు యౌవరాజ్యమున భరతుని పట్టాభిషిక్తుని ఒనర్చెను.

ఈ శ్లోకములు భరత లక్ష్మణుల శీల తారతమ్యమును మనకు స్ఫురింపచేయును.

లక్ష్మణుడు ప్రతిఫలాపేక్ష లేక సర్వదేశ సర్వకాల సర్వావస్థలయందు రామునకే చెందినవాడననియు, తన సర్వవ్యాపారములు వానికొఱకే విని యోగపడవలెననియు భావించువాడు. అందుచే దానికి ప్రతిబంధకముగా యౌవరాజ్యమును కూడ లక్ష్మణుడంగీకరింపడు. శ్రీరాముడు సుకుమారముగ స్వరూపశిక్షణ చేయు మహామనీషి. తన వెంట నిష్కారణముగ అనుసరించి వచ్చిన లక్ష్మణునకు ఫలాపేక్ష ఏమైన ఉండునేమో యని రాముడు పరీక్షింపజూచెను. కాని లక్ష్మణుడు ధర్మజ్ఞుడు. అందుచే స్వీకరింపడని రామునికి తెలియును. ఆ విషయమును స్పష్టముచేయుటకై యౌవరాజ్యమును స్వీకరింపుమని చెప్పుచు 'ధర్మజ్ఞ' అని లక్ష్మణుని సంబోధించెను. సామాన్యధర్మము నెఱింగినను, విశేషధర్మము నెఱింగినను రాజ్యమును స్వీకరింపరాదు. తనకంటె పెద్దవాడు భరతుడుండగ తాను యౌవరాజ్యమును స్వీకరింపరాదను సామాన్యధర్మము నెఱింగినవాడు స్వీకరింపరాదు. తాను విశేషధర్మమగు ఆత్మస్వరూపము నెఱింగిన వాడు కూడ పరమాత్మకే వినియోగపడదగిన ఆత్మను ఇతర ప్రయోజనములకు వినియోగింపకూడదు. అందుచే తాను యౌవరాజ్యమును స్వీకరింపకూడదు. లక్ష్మణుడిట్లు ధర్మస్వరూపమును ఇందు నిరూపించెను.

భరతుడు కేవల పరతంత్రుడు తన ఇష్టానిష్టములతో ప్రమేయములేదు. అచేతనమగు వస్తువువలె చైతన్యము కల్గియుండియు పరమాత్మకే పరతంత్రుడై యుండుట ఆత్మస్వరూపమని నిరూపించినవాడు భరతుడు. అందుచే శ్రీరామచంద్రుడు భరతుని అనుమతిని పొందకుండగనే భరతునకు యౌవరాజ్య పట్టాభిషేకముచేసెను. భరతుడు దానికి తలయొగ్గి నిలచెను. ఇట్లు భగవత్ శేషత్వము ఆత్మస్వరూపమని లక్ష్మణుడు, భగవత్ పారతంత్ర్యము ఆత్మస్వరూపమని భరతుడును నిరూపించిరి.

శ్రీరామచంద్రుడు పౌండరీకము, అశ్వమేధము, వాజపేయము మున్నగు అనేకవిధములగు యజ్ఞములను ఒనర్చి దేవతలకు తృప్తిని కల్గించుచుండెను. పదివేల సంవత్సరములు రాజ్యపాలన మొనర్చుచు మంచి గుణములతో, భూరి

దక్షిణలతో నూఱశ్వమేధములను శ్రీరాముడొనర్చెను. ఆజానులంబబాహువు, మహాస్కంధుడు, ప్రతాపశాలియగు రామచంద్రుడు లక్ష్మణుడు తోడుకాగా భూమిని పాలించుచుండెను. మిత్రులతో, జ్ఞాతులతో, బంధువులతో బహువిధములగు యజ్ఞముల నాచరించుచు సుఖముగా నుండెను.

శ్రీరామచంద్రుడు రాజ్యమును పాలించునపుడు స్త్రీలు భర్తృహీనలై శోకించుటలేదు. క్రూరజంతువులవలన భయములేదు. వ్యాధులవలన భయము లేదు. లోకమున చోరులు లేరు. అనర్థమును పొందినవారు లేరు. బాలురు ముందు చనిపోయి పెద్దలు వారికి ప్రేతకార్యములు చేయుటలేదు.

సర్వవిశ్వము సంతుష్టమై యుండెను. సర్వలోకము ధర్మపరమై యుండెను. రామునే సర్వత్ర దర్శించుచు ప్రజలు ఒకరి నొకరు హింసించుకొనుట మాని యుండిరి.

రామరాజ్యమున వేయేండ్లు రోగరహితులై శోకరహితులై పుత్రసహస్రములతో ప్రజలు సుఖించుచుండిరి.

శ్రీరాముడు రాజ్యమేలుచుండ "రాముడు రాముడు రాము"డని ప్రజల ప్రసంగములన్నియు రామపరములే అయి యుండెను.

జగమంతయు రామ మయమై యుండెను.

వృక్షములు విస్తరించిన స్కంధములుగలవై నిత్యము పుష్పములతో, ఫలములతో శోభిల్లుచుండెను.

పర్జన్యుడు కాలమున వర్షించుచుండెను.

వాయువు సుఖస్పర్శయై వీచుచుండెను.

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు ఒకరి ద్రవ్యములందు కోరిక లేనివారలై తమకు విహితములైన కర్మలను సంతుష్టితో ఆచరించుచుండెడివారు.

రామపాలనమున ప్రజలు ధర్మశ్రద్ధగలవారలై అనృతమును నెఱుంగక జీవించుచుండిరి.

అందరును లక్షణసంపన్నులును, ధర్మపరాయణులును అయియుండిరి.

సోదరులతో కూడి శ్రీమంతుడగు రామచంద్రుడు పదకొండువేల సంవత్సరములు రాజ్యమును పాలించెను.

## ఫలశ్రుతి

ధన్యము, యశస్యము, ఆయుష్యము, రాజులకు విజయప్రదమునగు ఈ శ్రీరామాయణమను ఆదికావ్యమును వాల్మీకిమహర్షి రచించెను. ఇది ఆర్షము. దీనిని వినిన మానవుడు పాపవిముక్తుడగును.

పుత్రులు కావలెనను కోరికగలవాడు పుత్రులను, ధనము కావలెనని కోరినవాడు ధనమును, శ్రీరామపట్టాభిషేకము వినుటచే పొందును.

రాజులు శత్రువుల నాక్రమించి భూమండలమున విజయము నందుదురు.

శ్రీరామాయణము వినుటచే కౌసల్య రామునితో, సుమిత్ర లక్ష్మణునితో, కైకేయి భరతునితోవలె స్త్రీలు జీవత్పుత్రక లగుదురు. రామాయణమును వినినవారు దీర్ఘాయుర్దాయము నందుదురు.

వాల్మీకి రచితమగు, ఆర్షమగు శ్రీరామాయణ కావ్యమును శ్రద్ధతో వినినవాడు క్రోధమును జయించి దుర్గముల నధిగమింపగలడు.

దూరదేశమున నున్న బంధువులు వేగముగ తిరిగి వచ్చి కలియుదురు.

శ్రీరామచంద్రునివలన కోరుకొనిన సర్వవరములు లభించును.

రామాయణమును వినుటచే దేవతలు సంతుష్టులగుదురు.

ఇండ్లలో నున్న గ్రహోద్యుపద్రవములు తొలగును. కార్యవిఘ్నములు శమించును. రాజు విజయము నందును.

దేశాంతరమున నున్నవాడు సుఖముగా మరలివచ్చును.

రజస్వలలై సంతానయోగ్యతగల స్త్రీలు శ్రీరామాయణము వినిన యోగ్యులగు కుమారులను బడయుదురు. పురాతనమగు ఈ యితిహాసమును పూజించుచు, పఠించుచున్న మానవుడు సర్వపాప విముక్తుడై దీర్ఘాయుర్భాగ్యము నందును.

రాజ్యపరిపాలనాదులయందు వ్యాపృతులగు క్షత్రియులు బ్రాహ్మణులచే చదివించుకొని తలవంచి నమస్కరించి శ్రద్ధతో వినవలెను.

శ్రీరామాయణమును చదివినను, విన్నను ఐశ్వర్యము పుత్రలాభము కల్గును. శ్రీరామాయణమును చదువుటచే రాముడు సంతుష్టుడగును.

రాముడే సనాతనుడగు విష్ణువు. ఆతడే ఆదిదేవుడగు హరి. ఆతడే సర్వజగత్ప్రభువగు నారాయణుడు.

"కుటుంబవృద్ధిం ధనధాన్యవృద్ధిం
స్త్రియశ్చ ముఖ్యాః సుఖ ముత్తమం చ
శ్రుత్వా శుభం కావ్య మిదం మహార్థం
ప్రాప్నోతి సర్వాం భువి చార్థసిద్ధిమ్,
ఆయుష్య మారోగ్యకరం యశస్యం
సౌభ్రాతృకం బుద్ధికరం సుఖం చ
శ్రోతవ్య మేత న్నియమేన సద్భిః
ఆఖ్యాన మోజస్కర మృద్ధికామైః." (యుద్ధ. 131.118,119)

మహార్థపరిపూర్ణము, శుభమునగు ఈ శ్రీరామాయణ మహాకావ్యమును వినినవారు కుటుంబవృద్ధిని, ధనవృద్ధిని, ధాన్యవృద్ధిని, శ్రేష్ఠలగు స్త్రీలను, ఉత్తమమగు సుఖమును, సర్వార్థసిద్ధిని పొందుదురు.

ఈ శ్రీరామాయణ మనెడి ఆఖ్యానము ఓజస్సును కల్గించునది. ఆయుష్యమును, ఆరోగ్యమును, కీర్తిని, భ్రాతృప్రేమను, బుద్ధిని, సుఖమును కల్గించును.

ఈ శ్రీరామాయణమును ఐశ్వర్యకాములగువార లందరు నియమముతో వినదగును.

"ఏవ మేతత్పురావృత్త మాఖ్యానం భద్ర మస్తు వః
ప్రవ్యాహరత విస్రబ్ధం బలం విష్ణోః ప్రవర్ధతామ్."

(యుద్ధ. 131.120)

ఈవిధముగ ఈ కథ పూర్వము జరిగినది. మీకు మంగళము అగుగాక! విశ్వాసముతో పల్కుడు

"బలం విష్ణోః ప్రవర్ధతాం"
"విష్ణువుయొక్క బలము వృద్ధి నందునుగాక!"
అని పలుకుడు.

రామాయణపారాయణ చేయువారు పారాయణము పూర్తికాగానే ఈ శ్లోకమును చదివి తరువాత స్వస్తి చెప్పవలెను. రామాయణము కల్పితకథ కాదు. ఇది జరిగినది- అని వాల్మీకిగారు ఇందు చెప్పి అట్లు ఎలుంగుటచే మనకు మంగళము కలుగునని చెప్పినారు.

ఆ రాముడే విష్ణువు. విష్ణువు సర్వపదార్థములయందు వ్యాపించి యుండువాడు. మనకు బలము, అభ్యుదయము కలుగువలెనన్న మనకందరకు లోనఉన్న విష్ణుతత్త్వముయొక్క బలము వృద్ధిపొందవలెను. అభివృద్ధి పొందిన నాడు బాహ్యమగు సర్వజగము బలముకలదై యుండును. అందుచే మనము చేయు ప్రతికర్మయు స్వార్థము కాదు. పరార్థము. ఆ పరుడే విష్ణువు. ఆ విష్ణువు బలము పెంపొందుటయే దేహబలము, దేశబలము పెంపొందుట అని ఎఱుంగవలెను.

శ్రీరామాయణమును పఠించుటయే సర్వజగత్తులకు క్షేమముకల్గును. బలము కల్గును. దీనిని వినుటవలన, ఎఱుంగుటవలన దేవతలు సంతుష్టులగుదురు. పితృదేవతలు సంతుష్టులగుదురు. వాల్మీకి మహర్షినుండి ఆవిర్భవించిన సంహితారూపమగు ఈ శ్రీరామాయణమును ఎవరు భక్తితో వ్రాయింతురో వారు కూడ పరమపదమున నిత్యవాసము నందుదురు.

ఇది యుద్ధకాండమున శ్రీరామపట్టాభిషేకోత్సవము.

ఓం తత్సత్

శ్రీరామార్పణమస్తు - శ్రీకృష్ణార్పణమస్తు